# ప్రపంచ కథా సాహిత్యం

## 2015 సంక్రాంతి కానుక




© Bapu 2014: All Rights Reserved

సంకలనం:

సాకం నాగరాజ, వాకా ప్రసాద్

# ప్రపంచ కథా సాహిత్యం

## 2015 సంక్రాంతి కానుక

---

ముద్రణ: సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై　　　　వెల: [illegible]

సంకలనం:

**సాకం నాగరాజ**

**వాకా ప్రసాద్**

**కృతజ్ఞతలు**

అడిగిన వెంటనే సంతోషంగా తమ అనువాద కథలను అచ్చువేసుకోమని సమ్మతించిన శ్రీ ముక్తవరం పార్థసారథి, శ్రీ కాకాని చక్రపాణి గార్లకు....

బాపు ముఖచిత్రాన్ని అందించిన బాపు గారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు.

---

**అభినవ ప్రచురణలు**

6-1-70, వరదరాజ నగర్

తిరుపతి - 517 507.

# నోబెల్ బహుమతి వచ్చిన రచయితల కథలు


బాయ్స్ అండ్ గాల్స్ - **ఆలిస్ మన్రో** - 3

తుమ్ము - **జార్జి బెర్నార్డ్ షా** - 10

జల కవచం - **పెర్ల్ ఎస్.బక్** - 13

జ్వరం వచ్చిన రోజు - **ఎర్నెస్ట్ హెమింగ్వే** - 17

అతిథి - **ఆల్బర్ట్ కామూ** - 19

గోడ - **జాఁ పాల్ సార్త్రే** - 23

పులిపిరి - **యసునారి కవబట** - 28

వెర్రివెంగళప్ప - **ఐజాక్ బాషెవిస్ సింగర్** - 32

రెక్కల తాత - **గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్** - 38

నీలికళ్ళు - **ఆక్టేవియో పాజ్** - 41

ఆత్మ హత్య - **డోరిస్ లెస్సింగ్** - 43

చివరిసారి - **ఇవాన్ బునిన్** - 47


# మన ముంగిట సంక్రాంతి ముగ్గు వేసిన ప్రపంచ రచయితలు

మనం తెలుగువాళ్ళం - శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'వడ్లగింజల'ను తెచ్చుకుని మన నట్టింట్లో రాశి పోసుకున్నాము. మల్లాది రామకృష్ణశాస్త్రి 'కృష్ణాతీరం'లో సేదదీరాం. చలం 'మైదానం'లో పరుగులెత్తి ఆయాస పడ్డాం. మధురాంతకం 'కమ్మ తెమ్మెర' సోకి సొమ్మసిల్లాం. రావిశాస్త్రి చెప్పిన 'నిజం' ఏమిటో తెలుసుకున్నాం. కాళీపట్నం 'యజ్ఞాని'కి సమిధ నొకటి అందించాం. బుచ్చిబాబు ద్వారా 'చివరకు మిగిలేది' ఏమిటో తెలుసుకుని దిగులు పడ్డాము. మునిమాణిక్యం వారి 'కాంతానికి' దండం పెట్టుకున్నాము. ముళ్లపూడి 'బుడుగు'తో ఆడుకున్నాం. త్రిపురనేని గోపీచంద్ 'అసమర్థుని జీవ యాత్ర'ను కళ్ల కద్దుకుని చదువుకున్నాం.

ఐన్‌స్టీన్ అంతటి శాస్త్రవేత్త దాస్తొవిస్కీ రచన 'నేరము-శిక్ష' చదివి నేనెంతో నేర్చుకున్నాని చెప్పాడు. చూడండి - సాహిత్యం అంటే శాస్త్రమే! అచ్చంగా సాహిత్యం అంటే సామాజిక శాస్త్రం. ఒక దేశ ప్రజల సాంఘిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర తెలుసుకోవాలంటే ఆ దేశ రచయితల సాహిత్యం తప్పక చదవాలి. అక్షరం అంటే జన జీవితం.

ప్రపంచంలో అందరూ గౌరవించే నోబెల్ పురస్కారాన్ని ఇందుకనే శాస్త్రవేత్తలతో పాటు రచయితలకీ, కవులకీ కూడా ఇస్తారు. గత సంవత్సరం ఆలిస్ మన్రో అనే రచయిత్రికి కథా సాహిత్యంలో నోబెల్ బహుమతి వచ్చింది.

మొదట నాకో మనవడు కలిగాడు. వాడిపేరు అభినవ్. నేను డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా సర్వీసులో వున్నప్పుడు 'అభినవ ప్రచురణలు' అంటూ మావాడి పేరిట ఓ ప్రచురణ 'సంస్థని స్థాపించి' తెలుగుకథకి ముందుగా నేను జేజేలు పలికి 'తెలుగుకథకి జేజే' సంకలనాన్ని మూడు వేల కాపీలతో ప్రచురించాను. నా జీవితానికిదో ముచ్చట. తర్వాత 'దువ్వూరి వేంకటరమణశాస్త్రి స్వీయ చరిత్ర'ను వేశాను. ఇంతలో మా అన్న డా॥ వెంకటసుబ్బయ్య మరణిస్తే మొదటి వర్థంతికి ప్రముఖుల వ్యాసాల సంకలనాన్ని ప్రచురించి పంచిపెట్టాను. చదవాల్సింది పిల్లలు అనే వుద్దేశం నాది. ఏసోపు కథలని బాపు బొమ్మలతో పదివేల కాపీలు వేసి పందారం చేశాను. 'పుస్తకాల మధ్యే నా జీవితం నడిచింది. పుస్తకాల మధ్యే నా జీవితం అంతమవుతుంది' అన్న సార్త్రే మేధావి. ఆయన చదివాడు, రాశాడు. జీవితాన్నే చదవడానికీ, రాయడానికీ ధారపోశాడు. నేను చదివింది కొంతే, రాసింది శూన్యం. అయితే పదేళ్లుగా నాదొక్కటే పని - పుస్తకాలు అచ్చువేయడం, విద్యార్థులను కలవడం - పంపిణీ చేయడం. నేను తలమునకలుగా అవుతున్న పనేదైనా వుందంటే ఇదే. ఇంట్లో పుస్తకాల కట్టల మధ్య ఇరుకిరుగ్గా బతకడమంటే నాకిష్టం. ఔను, ఇప్పుడీ పని పెట్టుకున్నాను. ఎందుకని? నా సహచరి శశికళని మరింత క్లోభ పెట్టడానికి కాదు. అంతర్జాతీయ సాహిత్యాన్ని నేటి విద్యార్థి లోకానికి కాసింతయినా రుచి చూపి, వాళ్ల దారి పొడుగునా విజ్ఞాన పుష్పాలు పూయించాలని....?

ముఖ్యంగా డిగ్రీ, పి.జి. చేసే యువతకు యీ సంకలనం వొక కరదీపిక అవుతుంది. వారిలో ఉత్తమాభిరుచి పెరుగుతుంది. విజ్ఞానం విస్తృత మవుతుంది. లిటరేచర్ ఆప్షన్‌గా ఎంచుకొనే సివిల్స్, గ్రూప్ పోటీ పరీక్షల విద్యార్థులు సాహిత్యం మీద పట్టు సాధించడానికి ఈ పుస్తకం ఓ దిక్సూచి.

ఈ విశ్వకథా సంకలనం - తెలుగు హృదయాలకు సంక్రాంతి శోభ!

**-సాకం నాగరాజ**

**అభినవ ప్రచురణలు, తిరుపతి**

# బాయ్స్ అండ్ గాళ్స్

## -ఆలిస్ మన్రో (1931 - )

అనువాదం:జి.లక్ష్మి



1931లో కెనడాలో జన్మించిన ఆలిస్ మన్రో కథారచనలో సిద్ధహస్తురాలు. సాధారణ కెనడా పౌరుడి దైనందిన జీవితా నికి ఆమె కథలు అద్దం పడతాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవి తాలు, జీవన స్థితిగతులే ఆమె కథా నేప థ్యాలు. మానవ సంబంధాలు, సంతోషం, నిరాశ, మానసిక కుంగుబాటు తదితర భావో ద్వేగాలకు మన్రో కథలు చక్కటి సజీవ చిత్రాలు. అవే ఆమెకు నోబెల్ పురస్కారాన్ని సంపా దించి పెట్టాయి.

మా నాన్న ఒక రైతు. ఆయన నక్కల్ని పెంచుతుంటాడు. వెండి రంగులో ఉండే నక్కల్ని పెంచి శీతాకాలం వచ్చిన తర్వాత ఉన్ని ధర పెరగ్గానే వాటిని చంపి చర్మాన్ని వలిచి హడ్సన్ బే కంపెనీకి గానీ మాంట్రియల్ ఫర్ ట్రేడర్స్‌కు కానీ చర్మాన్ని అమ్ముతుంటాడు. ఆ కంపెనీలు ఏటా మంచిమంచి కాలెండర్లు ముద్రిస్తుంటాయి. మా వంటగది గుమ్మానికి అటూ ఇటూ ఆ కాలెండర్లే వేలాడుతుంటాయి. నీలి సముద్రం, నల్లని పైన్ చెట్లు లేదా ఉత్తరాది నదుల నేపథ్యంలో ఇంగ్లాండ్‌వో, ఫ్రాన్స్‌వో జండాలు ముద్రించి ఉంటాయి.

క్రిస్టమస్‌కు ముందు కొన్ని వారాలపాటు మా నాన్న ఇంటికింద ఉన్న సెల్లార్‌లో కష్టపడి పనిచేస్తాడు. వెల్లవేసి వున్న సెల్లార్‌లో వందవాట్ల బల్బు వెలుతురులో సాయంత్రపు భోజనానంతరం మా నాన్న పని మొదలవుతుంది. ఆ సెల్లార్‌లో ఒక పెద్ద బల్ల వుంది. నేనూ, మా తమ్ముడు లెయిర్డ్ సెల్లార్ పై మెట్టు మీద కూర్చుని అదంతా గమనిస్తుండేవాళ్ళం. మా నాన్న నక్కల్ని చంపి దాని పొట్టలో ఉన్న పదార్థాల్ని తొలగించేవాడు. ఉన్ని కప్పబడి ఎంతో పెద్దగా అనిపించేవాటి శరీరాలు ఉన్ని తొలగించగానే ఆశ్చర్యంగా పెద్ద సైజు ఎలుకల్లాగా అయిపోయేవి. మా నాన్న వాటి నన్నిటినీ పోగుచేసి ఒక గోనె సంచిలో వేసి నేలలో పాతిపెట్టేవాడు. మా ఇంట్లో పనిచేసే హెన్రీ బెయిలీ ఒకసారి ఆ సంచిని తీసుకుని వచ్చి నా ముందు పెట్టి "క్రిస్టమస్ కానుక" అంటూ ఆట పట్టించబోయాడు. మా అమ్మ దానిని సరదాగా తీసుకోలేదు. నిజానికి ఆమెకు ఈ చర్మాలు వలిచే పని అంటే ఏ మాత్రం గిట్టదు. అంటే నక్కల్ని చంపడం, చర్మాన్ని వలవడం, ఉన్ని తయారు చేయడం – ఈ పనులన్నీ ఇళ్ళల్లో చేయడం మంచిది కాదని ఆమె అంటుండేది. అంతే కాకుండా వాటి నుంచీ వచ్చే వాసన భరించలేనట్టు ఉండేది. నక్కల్ని బల్లపై పడుకోబెట్టి చర్మాన్ని వలిచేటప్పుడు మా నాన్న ఎంత సున్నితంగా చేసినా రక్తం, కొవ్వూ, చెల్లా చెదురుగా అక్కడంతా పడుతుండేవి. నక్కల నుంచీ సహజసిద్ధంగా వచ్చే ఒకలాంటి వాసన, రక్తమూ, కొవ్వూ కలగలిపితే వచ్చే వాసన ఇంటిలోని అన్ని భాగాలకూ వ్యాపించి ఉండేది. నారింజ కాయలు, పైన్ చెట్ల కలప మాదిరిగానే ఆ వాసన కూడా నాకు ఒక్కలాగానే అనిపించేది.

> ముందు బతకడం నేర్చుకో ఆ తర్వాత నీతిగా బతకొచ్చు.
>
> -గ్రీకు సామెత

హెన్రీకి ఆస్థమా వ్యాధి ఉండేది. ఎప్పుడూ దగ్గుతూ ఉండేవాడు. దగ్గి దగ్గి సన్నగా ఉండే అతని మొహం ఎరుపురంగుకి తిరిగి పోయేది. అతని నీలి కళ్ళు నీళ్ళతో నిండిపోయేవి.తర్వాత అతను స్టవ్ మూత తీసి ఉమ్మిని కాండ్రించి నిప్పుల్లో పడేటట్టుగా ఊసేవాడు. సరిగ్గా నిప్పుల్లో పడేలాగా అతను చేసే విన్యాసాన్ని నేను మా తమ్ముడూ ఎంతో ఆసక్తిగా చూస్తుండేవాళ్ళం. అతని నవ్వు కూడా విచిత్రంగా ఉండేది. నవ్వులో గురగురలు, పిల్లికూతలు కలగలిసి పోయి అతని ఊపిరితిత్తుల పరిస్థితిని చెప్పకనే చెబుతుండేవి. అతడు దేనిని చూసి నవ్వుతున్నాడో చెప్పడం చాలాసార్లు కష్టంగా అనిపించేది. అయితే ఎక్కువసార్లు మమ్మల్ని చూసే నవ్వుతుండేవాడు.

అక్కడి నుంచీ పై అంతస్తుకి వచ్చిన తర్వాత కూడా నక్కల వాసనా, హెన్రీ నవ్వూ వెంటాడుతున్నట్టే ఉండేది. శీతాకాలం రాత్రివేళల్లో నేనూ మా తమ్ముడూ భయపడుతుండేవాళ్లం. మంచుతుఫాను విజృంభించి చల్లటి శీతల గాలులు విసిరి విసిరి కొడుతూ మా ఇంటిని కుదిపేస్తున్నప్పుడు కూడా బైటి వాతావరణానికి భయపడని మేము గదిలో ఉండడానికి మాత్రం భయపడేవాళ్ళం. మేం నిద్రపోయే గది గురించే భయపడేవాళ్ళం. ఆ సమయంలో మా ఇంటి పై అంతస్థు నిర్మాణం ఇంకా పూర్తి అవలేదు. గోడమీద నుంచీ ఇటుక పొగగొట్టం పైకి లేచి ఉండేది. నేలమీద నలుచదరంగా ఒక గుంటలాంటిది ఉండేది. తర్వాత అక్కడి నుంచీ మెట్లు కట్టారు. మెట్లకి మరోవైపున పనికిరాని వస్తువులన్నీ పడేసి ఉండేవి. పనికిరాని తట్టలు, చైనా జగ్గులు, పాత్రలు, పగుళ్ళిచ్చిన గాజు సామగ్రి, బాలక్లావా యుద్ధానికి సంబంధించిన బొమ్మ ఒకటి – ఇలా రకరకాల వస్తువులు ఉండేవి. లెయిర్డ్ కొంచెం పెద్దవాడై అర్థం చేసుకునే వయసు రాగానే అక్కడ గబ్బిలాలు, అస్థిపంజరాలు ఉంటాయని వాడికి నేను చెప్పేదాన్ని. మా ఇంటికి ఇరవై మైళ్ళ దూరంలో ఒక జైలు ఉంది. జైలు నుంచీ ఎవరన్నా తప్పించుకున్నారనగానే ఆ వ్యక్తి కిటికీలో గుండా ఆ గదిలోకి దూరి అక్కడ దాక్కుని ఉండొచ్చనే ఊహ నన్ను తినేస్తుండేది. అయితే భద్రంగా ఉండడానికి మాకు కొన్ని సూత్రాలు ఉన్నాయి. లైటు వెలుగుతున్నంత వరకూ, మా పడక గదిలో ఉన్న తివాచీని దాటి కాలు బైటపెట్టనంత వరకూ మాకు వచ్చిన ప్రమాదం ఏమీ లేదని మేం నమ్ముతుండేవాళ్ళం. లైట్లు తీసి వేసిన తర్వాత పడుకునే మంచంతో మొదలు పెట్టి ఏదీ సురక్షితం కాదని నాకు అనిపించేది. నా మంచం పక్కనే ఉన్న లైటును ఆర్పడం నాకు కష్టసాధ్యంగా ఉండేది.

చీకట్లో మేం మా మంచాలపై కదలకుండా పడుకుని మెట్ల వైపు నుంచీ వచ్చే బలహీనమైన కాంతిపైనే దృష్టి పెట్టి ఉండేవాళ్ళం. భయం పోవడానికి పాటలు పాడేవాళ్ళం. లెయిర్డ్ 'జింగిల్ బెల్స్' పాట పాడేవాడు. క్రిస్టమస్ అయినా కాకపోయినా వాడెప్పుడూ అదేపాట పాడేవాడు. నేను 'డానీబోయ్' పాట పాడేదాన్ని. సన్నగా, చీకట్లోంచి మంద్రంగా వినిపించే నా గొంతు వినడం నాకు ఎంతో ఇష్టంగా ఉండేది.

లెయిర్డ్ పాటల నుంచీ సరాసరి నిద్రలోకి జారిపోయే వాడు. వాడి దీర్ఘ ఉఛ్వాస నిశ్వాసాలు నాకు చక్కగా వినపడుతుండేవి. ఇంక మిగిలిన సమయం అంతా నాదే. నేను గట్టిగా ముసుగుపెట్టుకుని నా గురించి రకరకాల కథలు ఊహించుకునే దాన్ని. నేను పెరిగి పెద్దయిన తర్వాత చేయాల్సిన సాహస కృత్యాల గురించి, త్యాగాల గురించి రకరకాలుగా కలలు కనేదాన్ని. బాంబులు ఉన్న భవనం నుంచీ ప్రజల్ని నేను రక్షించడం, మా బడిలో బీభత్సం చేస్తున్న రెండు తోడేళ్ళను కాల్చి చంపడం, వీథుల్లో గుర్రంపై స్వారీ చేయడం, ప్రజలకు మేలుచేసి వాళ్ళ నుంచీ అభివాదాలు అందుకోవడం – ఇలాంటివన్నీ ఊహల్లో జరిగిపోతుండేవి. ఇంతవరకు నేను రెండు సార్లు మాత్రమే గుర్రం ఎక్కాను. ఒకసారి గుర్రంపై నుంచీ జారి దాని కాళ్ళ కింద పడగా అది తొక్కినంత పనిచేసింది. నేను తుపాకీతో గురిచూసి కాల్చడం మాత్రం నేర్చుకుంటున్నాను. అయితే నేను ఇంతవరకూ దేన్నీ గురిచూసి కొట్టలేక పోయాను. టిన్ డబ్బాలను కంచెగా వేసిన స్థంభాలను కూడా కొట్టలేక పోయాను.

నక్కల కోసం మా నాన్న ఒక ప్రపంచమే సృష్టించాడు. చుట్టూరా పెద్ద ఎత్తున కంచెవేసి, దానికి గేటు పెట్టించి అందులో నక్కల్ని ఉంచేవాడు. మనుషులు లోపలికి వెళ్ళడానికి వీలుగా కంచెకు ఒక ద్వారం ఉండేది. లోపల ఒక పెద్ద చెక్కబల్ల ఉండేది. నక్కలు ఆ బల్లమీదకు ఎక్కి దిగుతుండేవి. ఒక చిన్న సొరంగం లాంటిది ఉండేది. నక్కలు అందులో దూరి పడుకునేవి. శీతాకాలం ఎక్కువగా అందులోనే ఉండి పిల్లల్ని కనేవి. కంచెగా వేసిన ఇనుప తీగలకు గిన్నెలు అమర్చి ఉండేవి. నక్కలకు ఆహారం పెట్టడానికి, తాగడానికి నీళ్ళు పోయడానికి ఆ గిన్నెలు ఉపయోగించే వాళ్ళం. వాటిని బైటి నుంచీ శుభ్రపరచడానికి వీలుగా అమర్చేవాళ్ళు. పాత టిన్ డబ్బాల నుంచీ ఆ గిన్నెలు తయారుచేసేవాళ్ళు. ప్రతి ఒక్కటీ పరిశుభ్రంగా, చక్కగా ఉండేది. మా నాన్న నిరంతరం ఇలాంటి కొత్త కొత్త పద్ధతులు కనిపెడుతూనే ఉండేవాడు. ఆయన ఇష్టంగా చదివే పుస్తకం రాబిన్‌సన్ క్రూసో. నక్కలకు తాగడానికి నీళ్ళ

కోసం ఆయన ఒక టిన్ డ్రమ్ముని ఏర్పాటు చేశాడు. వేసవికాలంలో ఆ డ్రమ్ముని నీళ్ళతో నింపడం నా పని. వేసవికాలంలో నక్కలకు రెండు సార్లు నీళ్ళు పెట్టేవాళ్ళం. ఉదయం తొమ్మిదీ పది మధ్య ఒకసారి, సాయంత్రం ఒకసారి పెట్టేవాళ్ళం. నేను డ్రమ్ముని నీళ్ళతో నింపి తర్వాత ఆ నీటిని చిన్న మగ్గులతో కంచెకు అమర్చి ఉన్న గిన్నెలలో నింపేదాన్ని. లెయిర్డ్ కూడా మొక్కలకు నీళ్ళు పోసే తన డబ్బా తెచ్చుకుని గిన్నెల్లో నీళ్ళు పోసేవాడు. అయతే నీళ్ళని కాళ్ళమీదా, కాన్వాసు బూట్లమీదా పోసుకుని గందరగోళం చేసేవాడు. నేను నీళ్ళు పోసే మగ్గులో మూడు వంతులకు మాత్రమే నింపి జాగ్రత్తగా పోసేదాన్ని.

నక్కలకు అన్నిటికీ పేర్లు ఉండేవి. ఆ పేర్లను టిన్ రేకులమీద రాసి గుమ్మం దగ్గర వేలాడదీసేవాళ్ళం. వాటికి పుట్టిన వెంటనే కాక ఒక ఏడాది బతికి బట్టకట్టిన తర్వాత పేర్లు పెట్టేవాళ్ళం. మా నాన్న యువరాజు, బాబ్, వాలీ, బెట్టీ లాంటి పేర్లు పెట్టేవాడు. నేను చుక్క, టర్క్, డయానా లాంటి పేర్లు పెట్టేదాన్ని. లెయిర్డ్ ఒక నక్కకు మా ఇంట్లో పనిచేసి మానేసిన అమ్మాయి మాడ్ పేరుని, ఇంకో నక్కకు తన స్నేహితుడు హెరాల్డ్ పేరుని పెట్టాడు. ఇంకో నక్కకి మెక్సికో అని పేరు పెట్టాడు. అయితే ఆ పేరు ఎందుకు పెట్టాడో చెప్పలేకపోయాడు.

వాటికి పేర్లు పెట్టటం అంటే వాటిమీద అభిమానంతోనో, పెంచుకోవడం కోసమో కాదు. మా నాన్న తప్ప కంచెదాటి లోపలికి ఎవరం వెళ్ళేవాళ్ళం కాదు. నక్కలు కరవడం వల్ల ఆయన రక్తం రెండుసార్లు విషపూరితం అయింది కూడా. నేను వాటికి నీళ్ళు పోయడానికి వెళ్ళినపుడు అవి కంచెలోపలి నుంచీ అరుస్తూ పరిగెత్తుకు వచ్చేవి. అయితే ఊళ వేయడాన్ని మాత్రం అవి రాత్రివేళకి దాచుకునేవి. రాత్రిపూట అవి అన్నీ కలిసి ఒకేసారి ఊళ పెడుతూ ఉండేవి. నేను నీళ్ళు పోయడానికి వెళ్ళినపుడు అవి నన్ను గమనిస్తూ ఉండేవి. వాటి కళ్ళు బంగారు రంగులో మెరుస్తూ కనిపించేవి. వాటి మొహంలో ఒకలాంటి క్రూరత్వం ఉండేది. అయితే వాటి కాళ్ళు సున్నితంగా అందంగా ఉండేవి. రాజసం ఉట్టిపడే తోక, మెరిసిపోయే ఉన్ని వాటికి ప్రత్యేకమైన అందాన్నిచ్చేవి. వాటి మొహాల్లో ఏ మాత్రం స్నేహభావం కనిపించేది కాదు.

> ప్లేటో ప్రేమ పాత్రుడే;
> కాని సత్యం ఇంకా
> ప్రేమ పాత్రమైనది
> -అరిస్టాటిల్

నీళ్ళు మోయడంతో బాటు పచ్చిక కోయడంలో కూడా నేను మా నాన్నకి సహాయం చేస్తూ ఉండేదాన్ని. కంచె చుట్టూరా పెరిగిపోయే గడ్డిని కూడా శుభ్రం చేసేదాన్ని. మా నాన్న గడ్డిని కోస్తుంటే నేను కట్టలు కట్టేదాన్ని. తర్వాత మా నాన్న ఆ గడ్డిని కంచెపైన సర్దేవాడు. దానితో నక్కలకు చల్లగా ఉండడంతో పాటు నీడకూడా వచ్చేది. మేం చేస్తున్న పని గురించి తప్ప మా నాన్న నాతో ఇంకేమీ మాట్లాడేవాడు కాదు. ఈ విషయంలో ఆయన మా అమ్మకు పూర్తి వ్యతిరేకం. మా అమ్మ వుల్లాసంగా ఉన్నప్పుడు నాతో ఎన్నో కబుర్లు చెప్పేది. తను చిన్నప్పుడు పెంచుకున్న కుక్క పేరు, పెద్దయిన తర్వాత తనను ఇష్టపడిన అబ్బాయిల పేర్లు, చిన్నప్పుడు తన బట్టలు ఎలా ఉండేవి – అన్నీ చెప్పుకొస్తుండేది. ఇప్పుడు ఆ బట్టలన్నీ ఏమైపోయాయో అనేది. మా నాన్నకు కలిగే ఆలోచనలన్నీ ఆయన వ్యక్తిగతం. నేను ఆయన దగ్గర చనువుగా ఉండేదాన్ని కాదు. ఎలాంటి ప్రశ్నలు అడిగేదాన్ని కాదు. అయితే ఆయనతో పాటు పనిచేస్తున్నప్పుడు మాత్రం ఎంతో ఇష్టపూర్వకంగా ఒకలాంటి గర్వంతో పనిచేసేదాన్ని. నక్కల ఆహారపదార్థాలు అమ్మే ఉద్యోగి ఒకరు మా ఇంటికి వచ్చినపుడు మా నాన్న నన్ను పరిచయం చేస్తూ మా ఇంట్లో కొత్తగా పనికి కుదిరిన పనిపిల్ల అని చెప్పాడు. నా మొహం కోపంతో ఎర్రబడినా ఆ మాటలకు నాకు సంతోషమే కలిగింది. "నన్ను ఆటపట్టిస్తున్నారా. ఆ అమ్మాయి మీ అమ్మాయేగా" అని ఆ ఉద్యోగి అన్నాడు.

ఓ రోజు సాయంత్రం ఎర్రబడుతున్న ఆకాశాన్ని చూస్తూ కాసేపు పచ్చికపై అటూ ఇటూ పచార్లుచేసి ఇంటికి వచ్చేటప్పటికి కనుచీకటి పడింది. మా అమ్మా నాన్న ధాన్యపు కొట్టు ముందు నిల్చుని మాట్లాడుకొంటున్నారు. మా నాన్న అప్పుడే నక్కల చర్మాలు వలిచి వచ్చినట్టున్నాడు. ఆయన వేసుకున్న ఏప్రాన్ అంతా రక్తంతో తడిసి ఉంది. మా అమ్మను ఆ సమయంలో ధాన్యపు కొట్టు ముందు చూసి నాకు ఆశ్చర్యం వేసింది. ఆమె సాధారణంగా ఏదైనా పని ఉంటే తప్ప ఆ సమయంలో ఇంట్లో నుంచి బైటకు రాదు. అది ఆమె బట్టలు ఉతికి ఆరవేసే సమయం. లేకపోతే తోటలో బంగాళాదుంపలు తవ్వడానికి వెళుతుంది. సూర్యరశ్మి తగలని ఆమె పాదాలు పగుళ్ళిచ్చి ఉన్నాయి. వంట పాత్రలు కడగడం వల్ల ఆమె వేసుకున్న ఏప్రాన్ నడుం దగ్గర్నుంచీ తడిసిపోయి ఉంది. ఆమె జుట్టుని కర్చీఫ్‌తో కట్టుకుని ఉంది. ఆమెకు జుట్టుని సరిగా దువ్వుకునేందుకు కూడా తీరిక చిక్కదు. తర్వాత దువ్వుకుంటానని చెప్పి పొద్దున్నే జుట్టు రేగకుండా కర్చీఫ్‌తో కట్టేస్తుంది. అది రోజంతా అలాగే ఉండిపోతుంది. నిజంగానే ఆమెకు క్షణం తీరిక ఉండదు. ఈ రోజుల్లో మా వెనుక వరండా అంతా బుట్టల కొద్దీ పీచ్, రేగు, ద్రాక్షపళ్లతో నిండిపోతుంది. వాటిని మా నాన్న పట్నం నుంచీ కొనుక్కు వస్తాడు. ఉల్లిపాయలు, టమాటోలు, దోసకాయలు మా ఇంట్లోనే పండుతాయి. మా అమ్మ వాటి నన్నిటినీ కలిపి జామ్‌లు, జెల్లీలు తయారు చేస్తుంది. పచ్చళ్ళు పడుతుంది. చిల్లీ సాస్ తయారు చేస్తుంది. వంటగదిలోని పొయ్యి రోజంతా మండుతూనే ఉంటుంది. సీసాలను మరిగేనీళ్ళలో ముంచి ఉంచుతుంది.

మా అమ్మ నాకు కూడా కొన్ని పనులు చెబుతుంటుంది. వంటగదిలో బల్ల దగ్గర కూర్చుని పీచ్ పళ్ళ చెక్క తీసి వాటిని వేడినీళ్ళలో నానవేయడమో, ఉల్లిపాయలు తరగడమో చేయాల్సి ఉంటుంది. ఉల్లి ఘాటుకి కళ్ళలోంచి నీళ్ళు వచ్చి ఎర్రగా అవుతాయి. మా అమ్మ చెప్పిన పని వరకూ చేసేసి వెంటనే ఇంట్లోంచి బైటకు జారుకునే దాన్ని. మా అమ్మ నాకు ఏం పని చెబుదామా అని ఆలోచించేంతలోపలే అక్కడి నుంచీ నేర్పుగా తప్పుకునేదాన్ని.

వేసవి కాలంలో పొగలు కక్కుతుండే వంట గదిలో కూర్చుని పనిచేయాలంటే నాకు విసుగ్గా ఉండేది. ఆకుపచ్చని అద్దాలు ఉన్న అవే కిటికీలు, నూనె మరకలు నిండి అసహ్యంగా కనిపించే టేబుల్‌క్లాత్, రకరకాల వాసనలతో ఉక్కిరి బిక్కిరిగా ఉండే వంటగది అంటే నాకు ఎప్పుడూ ఇష్టం ఉండేది కాదు. మా అమ్మ అలసిపోయి మాట్లాడడానికి కూడా ఓపిక లేనట్టు ఉండేది. వాళ్ళ బడిలోని నృత్యాల గురించి చెప్పేందుకు కూడా ఆమెకు మనస్కరించేది కాదు. ఆమె మొహం నుంచీ చెమట ధారలు కట్టి కారుతుండేది. ఆమె ఎప్పుడూ రొప్పుతూ వంటగదిలోని జామ్ సీసాలను, పచ్చడి సీసాలను లెక్కపెడుతూ ఉండేది. ఇంట్లోని పనికి ఒక అంతూ దరీ ఉన్నట్టు నాకు కనిపించేది కాదు. ఆ పని భయంకరమైనదే కాకుండా విసుగు, వత్తిడి కలిగించే పని కూడా. అట్లా అంత పని చేసినా మా నాన్న బైట చేసే పనికి ఉన్న విలువ ఈ పనికి ఉండేది కాదు.

నేను ధాన్యపు కొట్టు దగ్గరికి వెళ్ళేటప్పటికి మా అమ్మ "లెయిర్డ్ పెద్దవాడయ్యే వరకూ ఓపిక పట్టు. అప్పుడే నీకు చేతి సాయం అందుతుంది" అని నాన్నతో అంటోంది.

మా నాన్న ఏమన్నదీ నాకు వినపడలేదు. మా నాన్న మర్యాదగా నిలబడి మా అమ్మ చెప్పేది వింటున్న తీరు చూసి నాకు సంతోషం వేసింది. కొత్తవాళ్ళతోనో, ఏదన్నా అమ్మడానికి వచ్చిన వాళ్ళతోనో ప్రవర్తించినట్టు అనిపించింది. అయితే ఆయనలో తిరిగి పనికి వెళ్ళాలన్న తొందర మాత్రం

కనిపించింది. మా అమ్మకు అక్కడ ఏం పని అని నేను అనుకున్నట్టుగానే ఆయన కూడా అనుకుంటున్నట్టున్నాడు. లెయిర్డ్ గురించి ఆమె చెప్పింది ఏంటి? వాడు ఎవరికీ ఏ సహాయం చేసే స్థితిలో లేడు. వాడు ఇప్పుడు ఎక్కడ ఉన్నదీ తెలుసా? ఉయ్యాల బల్ల ఎక్కి ఉయ్యాల ఊగటమో, సీతాకోక చిలకల్ని పట్టుకోవడమో చేస్తుంటాడు. నేను చేస్తున్న పని ముగిసేవరకూ వాడు అక్కడే కుదురుగా కూర్చోవడం నేను ఎప్పుడూ చూడలేదు.

"అప్పుడు నేను దాన్ని ఎక్కువగా ఇంటిపనికి ఉపయోగించుకోగలను" మా అమ్మ అనడం నాకు వినపడింది. ఆమె నా గురించి ఎప్పుడూ తిరస్కారంగా మాట్లాడడం నన్ను బాధపెడుతుండేది.

"నేను అట్లా గట్టిగా వెనక్కు తిరుగుతానో లేదో అది పరిగెత్తిపోతుంది. ఇంట్లో ఒక ఆడపిల్ల ఉన్నట్టు నాకు ఎప్పుడూ అనిపించదు" ఎప్పుడు చూసినా ఆమె అదే మాట అంటుంది.

నేను వెళ్ళి ధాన్యపు కొట్టులో ఒక ధాన్యపు సంచి మీద కూర్చున్నాను. ఈ సంభాషణ జరుగుతున్నంత సేపూ అక్కడికి వెళ్ళాలని అనిపించలేదు. మా అమ్మను పూర్తిగా నమ్మడానికి లేదని నాకు అనిపిస్తుంటుంది. ఆమె మా నాన్న కన్నా దయగా, కరుణాంతరంగంతో ఉంటుంది. ఆమెను తేలిగ్గా బోల్తా కొట్టించవచ్చు కూడా. అయితే ఆమె మీద ఆధారపడడానికి లేదు. ఆమె నన్ను ఇష్టపడుతుండేది. బాగా పొద్దుపోయే వరకూ మేల్కొని నేను కోరినట్టుగా ఫ్యాషన్‌గా ఉండే బట్టలు కుట్టి పెట్టేది. అయితే ఆమె నా శత్రువు కూడా. ఆమె ఎప్పుడూ నా విషయంలో కుట్రలు పన్నుతూ ఉండేది. నన్ను ఇంట్లో ఎక్కువ సేపు ఉంచేలా కుట్రలు పన్నేది. నాకు ఆ పనులంటే ఇష్టముండదని తెలిసి కూడా నన్ను బైటకు పంపేదికాదు. మా నాన్నకు సహాయం చేయనిచ్చేది కాదు. ఆమె తన అధికారాన్ని చూపించుకోవడానికే ఇలా చేస్తుండేదని నాకు అనిపిస్తుంది. ఆమె అసూయతోనో, వంటరిగా ఉండలేకో నన్ను బలవంత పెడుతుందని అయితే నేను అనుకోను. పెద్దవాళ్ళకి ఎవరికీ ఒంటరిగా ఉండడం సమస్య కాదు. వాళ్ళు అదృష్టవంతులు. నేను అక్కడే కూర్చుని ధాన్యపు సంచిని కాళ్లతో తన్నుతూ ఆమె వెళ్ళిపోయేవరకూ ఉండిపోయాను.

> సానబట్టి చిత్రహింసలు
> పెట్టకపోతే వజ్రం
> ఎలాగ మెరుస్తుంది?
> -సిరికిపాలెం సామెత

ఆమె చెప్పింది మా నాన్న విని శ్రద్ధగా ఆచరిస్తాడని అయితే నేను అనుకోను. లెయిర్డ్ నేను చేసే పని చేయడాన్ని ఎవరు మాత్రం ఊహించుకోగలరు? ఇంటికి తాళం వేయడాన్ని గుర్తుంచుకొని, నీళ్ళు ఉంచే పాత్రల్ని శుభ్రం చేసి, డ్రమ్ముని నీళ్ళతో నింపి – ఈ పనులన్నీ చేస్తాడా? దీన్ని బట్టి అసలు జరుగుతున్నదంతా మా అమ్మకు ఎంత వరకూ తెలుసో అర్థం చేసుకోవచ్చు.

నక్కలకు ఆహారంగా ఏం పెడతారో చెప్పడం మర్చిపోయాను. రక్తంతో తడిసిన మా నాన్న ఏప్రాన్ చూసి నాకు ఆ విషయం గుర్తుకి వచ్చింది. నక్కలకు గుర్రాల మాంసాన్ని ఆహారంగా పెడతారు. ఇప్పటికీ చాలామంది రైతుల దగ్గర గుర్రాలు ఉంటున్నాయి. గుర్రం పనిచేయలేనంతగా ముసలిదైపోయినా, కాలు విరిగి కుంటిదైపోయి పైకి లేవలేకపోయినా ఆ గుర్రాల యజమాని మా నాన్నకు కబురు చేస్తాడు. మా నాన్న, హెన్రీ అక్కడకు ట్రక్కులో వెళతారు. వాళ్ళు అక్కడే గుర్రాన్ని చంపి మాంసాన్ని ముక్కలు చేసుకొస్తారు. రైతుకి ఐదు నుంచీ పన్నెండు డాలర్ల వరకూ ఇస్తారు. అప్పటికే మాంసం ఎక్కువగా ఉంటే మా నాన్న ఆ గుర్రాలను ప్రాణంతోనే ఇంటికి తోలుకుని వస్తాడు. మాగుర్రపు శాలలో కొన్ని రోజులపాటో, వారాలపాటో ఉంచుతాడు. మాంసం కావాల్సి వచ్చినపుడు గుర్రాలని తుపాకితో కాల్చి చంపి ముక్కలు చేస్తారు. యుద్ధం ముగిసిన తర్వాత రైతులు ట్రాక్టర్లు కొంటూ క్రమంగా గుర్రాల్ని వదిలించుకుంటున్నారు. ఇంక వాటివల్ల ఏం ఉపయోగం ఉండడం లేదు. ఇది శీతాకాలంలో జరిగిన పక్షంలో మా గుర్రాల శాలలోని గుర్రాలు వసంత కాలం వచ్చేవరకూ ప్రాణాలతో ఉండిపోయేవి. ఎందుకంటే మా దగ్గర ఎండుగడ్డి బోల్డంత ఉండేది. పైపెచ్చు దట్టంగా కురిసే మంచు కారణంగా శీతాకాలంలో ప్రయాణం చేయడానికి గుర్రాలు అనువుగా ఉండేవి.

ఆ శీతాకాలానికి నాకు పదకొండేళ్ళొచ్చాయి. మా గుర్రపుశాలలోకి రెండు గుర్రాలు చేరాయి. వాటికి అంతకు ముందు ఏం పేర్లు ఉండేవో మాకుతెలియక పోయినా మేం వాటికి మాక్, ఫ్లోరా అని పేర్లు పెట్టాం. మాక్ ముసలి గుర్రం. నల్లగా బక్కచిక్కి ఉండేది. అది కాస్త బద్ధకంగా నిర్లక్ష్యంగా ఉండేది. ఫ్లోరా మంచి స్వారీ గుర్రం. శీతాకాలంలో మంచు పలకలు కత్తిరించడానికి మేం వాటిని తీసుకెళ్ళేవాళ్ళం. మాక్ నిదానంగా ఉండి చెప్పినమాట వినేది. ఫ్లోరా మొదట్నుంచీ దూకుడుగా ఉండేది. అది దారిలోని కార్లను, ఇతర గుర్రాలను దాటుకుని పరుగులు పెడుతుండేది. అయితే అది అలా వేగంగా వెళ్ళడం మాకు ఇష్టంగా ఉండేది. అది సహజంగా సాహస ప్రవృత్తి ఉన్న గుర్రం. శనివారాల్లో మేం గుర్రాలశాలకు వెళుతుండేవాళ్లం. మేం గుర్రాలశాల తలుపులు తెరవగానే అది తల విసిరేసేది. కళ్ళు తిప్పుతూ కట్లు తెంచుకోవడానికి ప్రయత్నించేది. దాని దగ్గరకు వెళ్ళడం క్షేమం కూడా కాదు. అదిఎగిరి తన్నగలదు కూడా.

ఈ శీతాకాలం కూడా మా అమ్మ ధాన్యపు కొట్టు ముందు అన్నట్టు అదే ఉద్దేశంతో కనబడింది. అది నాకు ఏ మాత్రం క్షేమంగా అనిపించలేదు. నా చుట్టూ ఉన్న మనుషులు కూడా నా గురించి ఇంచుమించు ఇదే ఉద్దేశంతో ఉన్నట్టు నాకు కనబడింది. "బాలిక" అన్న పదం నాకు మొదట్లో అమాయకంగా 'పసిపాప' అనే పదంలాగా తేలిగ్గా కనిపించేది. ఇప్పుడు నాకు అలా అనిపించడం లేదు. బాలిక అంటే నా లాగా ఉండకూడదని నాకు అనిపిస్తోంది. అది నేను తర్వాత మారవలసిన రూపం. ఆ పదానికి ఒక అర్థం ఉంది. ఒక నిర్వచనం ఉంది. అది నిందార్హమైనది. నిరుత్సాహం కలిగించేది. నా విషయంలో అది ఒక తమాషా లాంటిది.

ఒకసారి నేనూ లెయిర్డ్ పోట్లాడుకుంటున్నాం. నేను మొదటిసారిగా నా బలాన్నంతా ఉపయోగించి వాడిని తోసేయబోయాను. అయితే వాడు నా చేయి గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. నాకు చేయి బాగా నెప్పి పుట్టింది. హెన్రీ ఇది చూసి గట్టిగా నవ్వాడు.

"లెయిర్డ్ అంటే ఏంటో ఇప్పుడు నీకు తెలిసిందా? ఇంకా తెలుస్తుందిలే" అని నవ్వాడు. లెయిర్డ్ పెద్ద వాడవుతున్నాడు. అయితే నేను కూడా పెద్దదాన్నవుతున్నాను కదా.

మా అమ్మమ్మ కొన్ని రోజుల పాటు ఉండడానికి మా ఇంటికి వచ్చింది. ఆమె ఎప్పుడూ నాకు ఏదో ఒకటి చెబుతుండేది. "ఆడపిల్లలు అలా తలుపులు చప్పుడయేలా వేయకూడదు", "ఆడపిల్లలు కూర్చునేటప్పుడు కాళ్ళు ఒద్దికగా పెట్టుకోవాలి" – ఇలా చెబుతూనే ఉండేది. ఇంకా అంతకన్నా భయంకరం ఏంటంటే ఏవైనా ప్రశ్నలు అడిగితే "అది ఆడపిల్లలు చేయాల్సిన పని కాదు" అనేది. నేను తలుపులు చప్పుడయేలా వేస్తూనే ఉండేదాన్ని. కాళ్ళు ఎంత వీలైతే అంత ఎడంగా పెట్టుకుని కూర్చునేదాన్ని. అలాంటి పనుల ద్వారా నేను స్వేచ్ఛ సంపాదించుకోడానికి ప్రయత్నించేదాన్ని.

వసంతకాలం రాగానే గుర్రాల్ని ధాన్యపుకొట్టు ఉన్న ప్రాంతంలో తిరగడానికి వదిలిపెట్టారు. మాక్ ధాన్యపు కొట్టుగోడకి మెదని రుద్దుకుంటూ నిలబడి

ఉండగా ఫ్లోరా కంచెని ఎగిరి దూకుతూ హడావుడి చేస్తోంది. మంచు బిందువులు రాలిపడుతూ నేల రంగుని మారుస్తున్నాయి. మేం కాళ్ళకి సాక్స్ వేసుకుని వట్టిగా చెప్పులు మాత్రం తొడుక్కున్నాం. పాదాలు తేలిగ్గా గాలిలో తేలిపోతున్నట్టున్నాయి. ఒక శనివారం నాడు మేం గుర్రాల శాలకు వెళ్ళి తలుపులు అన్నీ బార్లా తీసి ఉండడం చూశాం. ఎప్పుడూ లేనట్టుగా గుర్రాలశాల అంతా సూర్యకాంతితో తాజా గాలితో నిండిపోయి ఉంది. హెన్రీ అక్కడే ఉన్నాడు. ఉన్ని కంపెనీల వాళ్ళు ఇచ్చిన కాలెండర్లని ఒకదాని తర్వాత ఒకటి చూస్తూ కూర్చున్నాడు.

"రండి. రండి. మీ స్నేహితుడు మాక్‌కు వీడ్కోలు చెబుదురుగాని. ఇవిగో కొన్ని ఓట్లు మీరు కూడా దానికి తినిపించండి" హెన్రీ కొన్ని ఓట్లు లెయిర్డ్ దోసిలినిండా పోస్తూ చెప్పాడు. లెయిర్డ్ మాక్‌కు ఓట్లు తినిపించడానికి వెళ్ళాడు. మాక్ పళ్ళు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. అది చాలా నిదానంగా ఓపికగా ఆహారాన్ని నోటిలో అటూ ఇటూ మార్చుకొంటూ నములుతోంది.

"పాపం మాక్. గుర్రానికి పళ్ళు పాడైపోతే ఇంక దాని పని అయిపోయినట్టే. ఇంక చెయ్యడానికేం ఉండదు" హెన్రీ సానుభూతిగా అన్నాడు.

"మీరు మాక్‌ను ఇవాళ కాల్చి చంపబోతున్నారా?" నేను అడిగాను. మాక్, ఫ్లోరా ఎప్పటినుంచో గుర్రాల శాలలో ఉంటున్నాయి. వాటిని కాల్చి చంపుతారనే విషయాన్ని నేను దాదాపు మర్చిపోయాను.

హెన్రీ సమాధానం చెప్పలేదు. గట్టిగా గొంతెత్తి వెక్కిరింతగా విషాదగీతం పాడడం మొదలెట్టాడు. లెయిర్డ్ అక్కడే కూర్చోగా పాట పూర్తికాకుండానే నేను బైటకు వెళ్ళి అక్కడ కూర్చుండిపోయాను.

> యుద్ధం అన్నింటికీ తండ్రి, అన్నింటికీ రాజు.
>
> —హెరాక్లిటస్

వాళ్ళు గుర్రాన్ని చంపుతుండగా నేను ఎప్పుడూ చూడలేదు. అయితే వాళ్ళు గుర్రాల్ని ఎక్క డ చంపుతారో నాకు బాగా తెలుసు. పోయిన వేసవిలో లెయిర్డ్, నేనూ పాతిపెట్టిన గుర్రపు పేగుల్ని చూశాం. అది నల్లటి పెద్దపాము అయి ఉండొచ్చని మేం అనుకున్నాం. మా పొలంలోని ధాన్యపు కొట్టు పక్కన ఇదంతా జరుగుతుందని నాకు తెలుసు. ధాన్యపు కొట్టులోకి కనుక వెళ్ళగలిగినట్టయితే దానికి ఉన్న కంతల ద్వారా గుర్రాన్ని చంపడం చూడొచ్చని నేను అనుకున్నాను. దాన్ని చూడాలని నాకు అంత గట్టి కోరికయితే లేదు. కాకపోతే అలాంటిది ఒకటి జరుగుతున్నప్పుడు ఎలా జరుగుతోందో చూసి తెలుసుకోవడం మంచిది కదా అనిపించింది.

మా నాన్న ఇంట్లోంచి తుపాకీ చేత్తో పట్టుకుని బైటకు వచ్చాడు.

"ఇక్కడ మీరేం చేస్తున్నారు?" ఆయన అడిగాడు.

"ఏం లేదు."

"వెళ్ళండి. వెళ్ళి ఇంట్లో ఆడుకోండి."

ఆయన లెయిర్డ్‌ను గుర్రాల శాల నుంచీ పంపివేశాడు. "వాళ్లు మాక్‌ను తుపాకితో కాల్చడం చూడాలని అనుకుంటున్నావా" అని నేను లెయిర్డ్‌ను అడిగాను. తర్వాత వాడి సమాధానం కోసం చూడకుండానే నేను వాడిని ధాన్యపు కొట్టు ముందు గుమ్మం దగ్గరికి తీసుకెళ్ళాను. దాన్ని జాగ్రత్తగా తెరిచి లోపలికి వెళ్ళాం. "నిశ్శబ్దంగా ఉండు. లేకపోతే వాళ్ళకి మన మాటలు వినపడతాయి" నేను లెయిర్డ్‌ను హెచ్చరించాను. గుర్రపు శాలలో మా నాన్న, హెన్రీ మాట్లాడుకునే మాటలు నాకు వినపడుతున్నాయి. తర్వాత గుర్రపుశాలలోంచి బైటకు వస్తున్న మాక్ గిట్టల చప్పుడు వినిపించింది.

ధాన్యపు కొట్టు లోపల చల్లగా, చీకటిగా ఉంది. దానికి ఉన్న కంతల నుంచీ సూర్యకిరణాలు ఏటవాలుగా పడుతున్నాయి. ధాన్యపు కొట్టులో గడ్డి అంత ఎక్కువ ఎత్తులో లేదు. నేల నుంచీ నాలుగు అడుగుల ఎత్తులో గోడకు ఒక చిన్న కంత ఉంది. నేను గడ్డినంతటినీ అక్కడకు చేర్చి ముందు లెయిర్డ్‌ను దానిపైకి ఎక్కించి కంతలోంచి చూడమన్నాను. ఆ కంత మరీ అంత పెద్దది కాదు. మేం ఆ గోడ పొడవుగా చూసుకుంటూ వెళ్ళాం. అక్కడ ఇంకా చాలా కంతలు కనిపించినాయి. ఒక కంతలోంచి చూస్తే నేను అనుకున్నట్టుగా అంతా కనిపిస్తుందని నాకు అనిపించింది. అది కొట్టుకి ఒక మూలగా పొలం కనిపించే వైపుకి ఉంది. లెయిర్డ్ తనకు ఏమీ కనిపించడంలేదని గొడవ మొదలు పెట్టాడు.

నేను వాడికి ఇంకో కంత వెతికి చూపించాను. "నిశ్శబ్దంగా ఉండి ఏం జరుగుతుందో చూడు. నువ్వు మాట్లాడేది కనుక వాళ్ళు విన్నారంటే మనం చిక్కుల్లో పడతాం" నేను లెయిర్డ్‌ను బెదిరించాను.

తుపాకీ తీసుకు వస్తున్న మా నాన్న మొదట కనిపించాడు. హెన్రీ మాక్‌ను నడిపించుకుని వస్తున్నాడు. చేతిలో ఉన్న గుర్రపు తాడును వదిలేసి హెన్రీ సిగరెట్ కాగితం, పొగాకు తీసుకుని తనకో సిగరెట్ తయారు చేసుకున్నాడు. మా నాన్నకు కూడా ఒక సిగరెట్ తయారు చేసి ఇచ్చాడు. ఇదంతా జరిగేటప్పుడు మాక్ కంచె దగ్గర పచ్చిక మేస్తూ కనిపించింది. అప్పుడు మా నాన్న గేటు తెరిచాడు. తర్వాత వాళ్ళు మాక్‌ను బైటకు తీసుకువెళ్ళారు. హెన్రీ మాక్‌ను దారి నుంచీ తప్పించి ఒక స్థలం దగ్గరికి తీసుకెళ్ళాడు. తర్వాత మా నాన్న, హెన్రీ నిదానంగా ఏదో మాట్లాడుకున్నారు. అదేంటో నాకు వినపడలేదు.

మాక్ మళ్ళీ మరోసారి పచ్చిక కోసం వెతుకుతూ తల కిందకు వంచింది. మా నాన్న కొంచెం దూరం నడిచి మాక్‌కు సమీపంలో ఆగాడు. హెన్రీ మాక్‌కు దూరంగా వెళ్ళాడు. మా నాన్న తుపాకీ పైకి ఎత్తాడు. మాక్ ఏదో గమనించడానికన్నట్టు అప్పుడే తలెత్తింది. మానాన్న గురిచూసి కాల్చాడు.

మాక్ ఒక్కసారే కిందపడిపోలేదు. అది గుండు దెబ్బ తగలగానే గిరగిరా తిరిగింది. తర్వాత ఒకవైపుకి పడి పోయింది. తర్వాత వీపుపై వెనక్కు తిరిగి కొన్ని సెకన్లపాటు కాళ్ళు గాలిలో ఆడించింది. అప్పుడు హెన్రీ నవ్వాడు. మాక్ ఏదో ఎత్తువేస్తున్నట్టు అతనికి అనిపించినట్టుంది. మా నాన్న తుపాకీతో కాల్చగానే లెయిర్డ్ ఒక్కసారి చిన్నగా అరిచాడు.

"మాక్ చనిపోలేదు" అని గట్టిగా అన్నాడు. ఒక్కక్షణం నాకు కూడా అది నిజమే అనిపించింది. అయితే దాని కాళ్ళు కొట్టుకోవడం ఆగిపోయాయి. అది మళ్ళీ పక్కకు పడిపోయింది. దాని శరీరం ఒక్కసారి వణికి కదలకుండా ఉండిపోయింది. ఆ ఇద్దరూ దాని దగ్గరికి నడిచివెళ్ళి మాక్ వంక ఒకసారి యధాలాపంగా ఏ భావమూ లేనట్టు చూశారు. తుపాకీ గుండు నుదుటి నుంచి దూసుకుపోయిందా లేదా అని గమనించేందుకు వాళ్లు గుర్రం ముందు వంగుని నిలబడ్డారు. మాక్ రక్తం పచ్చని పచ్చిక పైకి ప్రవహిస్తూ నాకు కనిపించింది.

"ఇప్పుడు వాళ్ళు దాని చర్మం వలిచి ముక్కలుగా నరుకుతారు. ఇంక మనం వెళ్దాంరా" లెయిర్డ్‌తో అన్నాన్నేను. నా కాళ్ళు కొంచెం వణుకుతున్నాయి. నేను కింద ఉన్న గడ్డి మీదకు దూకాను.

"గుర్రాన్ని వాళ్ళు ఎలా కాలుస్తారో ఇప్పుడు నువ్వు చూశావు" నేను లెయిర్డ్‌ను అభినందిస్తున్నట్టు అన్నాను. నేను దానిని అప్పటికే ఎన్నోసార్లు చూసినట్టు మొహం పెట్టాను. "గడ్డిలో పిల్లులు ఏమన్నా పిల్లల్ని పెట్టాయేమో చూద్దామా" అని లెయిర్డ్ అన్నాడు. వాడు కూడా పై నుంచి కిందకు దూకాడు. వాడు చాలా వినయంగా మారిపోయాడు. లెయిర్డ్ చిన్నప్పుడు నేను వాడిని ధాన్యపు కొట్టులోకి తీసుకొచ్చి నిచ్చెన ఎక్కి పైన ఉన్న దూలం దగ్గరికి వెళ్ళమని చెప్పడం అప్పుడు నాకు గుర్తొచ్చింది.

అది వసంతకాలం. నేను అది కేవలం సరదా కోసం చేశాను. లెయిర్డ్ నిచ్చెన ఎక్కి ఒక దూలం మీదకు చేరుకుని కూర్చున్నాడు. కొట్టులో గడ్డి చాలా తక్కువగా ఉంది. వాడు అప్పుడు తెల్ల గళ్ళకోటు వేసుకుని ఉన్నాడు. నా కోటును అమ్మ సరిచేసి వాడి కోసం తయారు చేసింది. ధాన్యపు కొట్టులో ఒక పక్క పిండి బస్తాలు, పాత యంత్ర పరికరాలు ఉన్నాయి. అప్పుడు నేను మా నాన్న కోసం పరిగెత్తాను. "లెయిర్డ్ దూలం మీద కూర్చున్నాడు" అని చెప్పాను. మా నాన్న, అమ్మ అక్కడికి పరిగెత్తుకుని వచ్చారు. మా నాన్న నిదానంగా నిచ్చెన ఎక్కి పైకి వెళ్ళి లెయిర్డ్‌ను చంకలో ఇరికించుకుని కిందకు దిగి వచ్చాడు. మా అమ్మ నిచ్చెనకు ఆనుకుని ఏడవడం మొదలు పెట్టింది. "నువ్వు వాడిని ఎందుకు గమనించలేదు?" అని వాళ్ళు నన్ను తిట్టారు. కానీ అసలు నిజం ఎవరికీ తెలియలేదు. లెయిర్డ్‌కు ఏం జరిగిందో చెప్పే పాటి వయసు లేదు. అయితే ఆ పాత తెల్లగళ్ళ చొక్కా బీరువాలో ఎప్పుడు కనిపించినా నా మనసు తప్పుచేసిన భావనతో కుంగిపోతుంది.

నేను లెయిర్డ్ వంక చూశాను. వాడికి ఇదంతా ఏమీ గుర్తులేదు. వాడి మొహం తెల్లగా పాలిపోయి ఉంది. వాడు భయపడుతున్నట్టో, కలత చెందినట్టో కాకుండా ఒకలాంటి అస్థిమితంగా ఉన్నాడు.

"ఇదుగో, ఇదంతా నువ్వు ఎవరికీ చెప్పవు కదూ" లెయిర్డ్‌ను స్నేహం నిండిన గొంతుతో అడిగాను.

"చెప్పను" లెయిర్డ్ అయోమయంగా జవాబిచ్చాడు.

"ఒట్టు."

"ఒట్టు" వాడు అన్నాడు. వాడు వేళ్ళను మడిచిపెట్టాడా లేక మామూలుగా పెట్టాడో గమనించేందుకు నేను వాడి చేయి ముందుకి లాగి చూశాను. అట్లా మోసం చేస్తే తప్పకుండా వాడికి పీడకలలు వస్తాయి. అందులో తేడా లేదు. వాడు చూసినదంతా మర్చిపోవడానికి, జరిగిన దానిని వాడి జ్ఞాపకాల నుంచీ తప్పించేందుకు ఏం చేయాలా అని ఆలోచించి సినిమాకు వెళ్ళడం మంచిదని నేను ఓ నిర్ణయానికి వచ్చాను. నేను దాచుకున్న డబ్బులోంచి కొంత మొత్తాన్ని తీసి ఆ రోజు మధ్యాహ్నం వాడూ, నేనూ జూడీకానోవా హాస్య చిత్రానికి వెళ్ళాం. ఆ సినిమా చూసి ఇద్దరం మనసారా నవ్వుకొన్నాం. తర్వాత అదంతా సరి అయిపోయిందని నాకు అనిపించింది.

> క్రిటో! నేను అప్పుడెప్పుడో నా ప్రాణాలు కాపాడిన ఎస్‌కిపియస్ దేవతకు ఒక కోడిపుంజు బాకీ వున్నాను. అది తీర్చేస్తావా?
>
> -మరణ శయ్యపై సోక్రటీస్

రెండు వారాల తర్వాత వాళ్ళు ఫ్లోరాను చంపబోతున్నారని నాకు తెలిసింది. అంతకు ముందు రోజు రాత్రి మా అమ్మ నాన్న మాట్లాడుకొంటుండగా నేను విన్నాను. నిల్వ ఉన్న ఎండుగడ్డి సరిపోతుందా అని మా అమ్మ నాన్నను అడుగుతోంది.

"మరేం ఫరవాలేదు. రేపటి తర్వాత నుంచీ ఆవు ఒక్కటే ఉంటుంది. ఒక వారం పాటు గడ్డికి ఇబ్బంది లేదు. తర్వాత అంతగా అయితే ఆవును మేసేందుకు బైటకు తీసుకువెళ్ళొచ్చులే" అని మా నాన్న అనడం వినిపించింది. ఆ రకంగా మర్నాటి ఉదయం ఫ్లోరాను చంపబోతున్నారని నాకు అర్థమయింది.

ఈసారి నేను అదంతా చూడాలని అనుకోవడం లేదు. దానిని ఒకసారి చూడడమే ఎక్కువ. దానిని గురించి నేను ఎక్కువగా ఆలోచించింది కూడా లేదు. అయితే నేను తీరిక లేకుండా పనివత్తిడిలో ఉన్నప్పుడో, బడిలో ఉన్నప్పుడో, అద్దం ముందు నిలబడి తల దువ్వుకొంటూ పెద్దయిన తర్వాత నేను ఎంత అందంగా ఉంటానో ఊహించుకుంటున్నప్పుడల్లా నాకు అదంతా ఒక్కసారిగా తటాలున గుర్తుకు వచ్చేది. మా నాన్న అలవాటైన రీతిలో చాలా మామూలుగా తుపాకి ఎత్తి మాక్‌ను కాల్చడం, మాక్ గాల్లో కాళ్ళు ఆడించినప్పుడు హెన్రీ నవ్వడం - అంతా గుర్తుకు వచ్చేది. అయితే నేను భయపడలేదు. దాని గురించి నాకేమీ వ్యతిరేక భావం కూడా లేదు. పట్నంలోని బాలికకు ఉండే ఉదాసీనత అప్పటికే నాకు అలవడింది.

మేం జీవించే పద్ధతిలోనే జంతువుల్ని చంపడం అనేది ఒక భాగం. అందుకే జంతువుల్ని చంపడాన్ని చూడడానికి నేను అలవాటు పడిపోయాను. మేం జీవించడానికి అది ఒక అవసరం కూడా. అయినప్పటికీ నాకు ఎందుకో సిగ్గుగా, చిన్నతనంగా అనిపించింది. మా నాన్న గురించీ, ఆయన చేస్తున్న పని గురించీ అప్పుడు నాలో కొత్తరకమైన ఆలోచన మొదలయింది.

ఆ రోజు ఉదయం చాలా ఆహ్లాదంగా ఉంది. మంచుతుఫానుల కారణంగా విరిగి పడిన చెట్లకొమ్మలు ఏరుతూ మేం ఆవరణ అంతా తిరుగుతున్నాం. ఆ పని చేయమని మా అమ్మా వాళ్ళు చెప్పినా అది మేము కొంత ఇష్టంతో కూడా చేసేపని. ఫ్లోరా సకిలించడం మాకు వినిపించింది. దాని వెంటే మా నాన్న గొంతూ, హెన్రీ అరుపులు వినిపించాయి. ఏం జరుగుతోందో చూడడానికి మేం ధాన్యపు కొట్టు దగ్గరికి పరిగెత్తాం.

గుర్రపుశాల తలుపు తెరిచి ఉంది. హెన్రీ అప్పుడే ఫ్లోరాను బైటకు తెచ్చినట్టున్నాడు. అది అతన్నుంచీ తప్పించుకుని పారిపోతోంది. ధాన్యపు కొట్టు ఉన్న ఆవరణలో ఈ చివరి నుంచీ ఆ చివరి వరకూ అది పరిగెత్తుతోంది. మేం కంచె పైకి ఎక్కాం. ఫ్లోరా వెనుక కాళ్ళపై పరిగెడుతూ గట్టిగా సకిలిస్తుండడం, పాశ్చాత్య సినిమాల్లోని మాదిరి భయపెడుతుండడం - అదంతా చూడడానికి చాలా ఉద్వేగ భరితంగా ఉంది. మా నాన్న, హెన్రీ దాని వెనుక పరిగెత్తి దాని మెడనుంచీ వేలాడుతున్న తాడును పట్టుకోవడానికి ప్రయత్నించారు. దానిని ఒక మూలకు తరమడానికి వాళ్ళు చేసిన ప్రయత్నం ఫలించింది. అయితే అది వాళ్ళ మధ్య నుంచి దూకి ధాన్యపు కొట్టు మలుపులో అదృశ్యమైపోయింది. ఫ్లోరా కంచె దూకుతున్న చప్పుడు వినిపించింది.

"అది పొలంలోకి పారిపోయింది" అని హెన్రీ అరిచాడు.

అంటే అది ఇంటి నుంచీ 'ఎల్' అక్షరం ఆకారంలో ఉన్న పొలంలోకి పారిపోయింది. అది మధ్యలోనే ఆగి వెనక్కు తిరిగి వస్తే తెరిచి వున్న గేటులోంచి పారిపోవడం సులభం. పొద్దున్నే ట్రక్కు పొలంలోకి వెళ్లడం కోసమని గేటు బార్లా తెరిచి ఉంచారు. నేను కంచెకు మరోవైపున గేటుకు దగ్గరగా ఉండడంతో మా నాన్న "పరిగెత్తు గేటు మూసెయ్యి" అంటూ గట్టిగా అరిచాడు.

నేను చాలా వేగంగా పరిగెత్తగలను. నేను తోటగుండా పరిగెత్తి, చెట్లుదాటి, ఓ గుంటపై నుంచి ఎగిరి దూకి గేటు దగ్గరికి చేరాను. ఫ్లోరా గేటులోంచి బైటకు వెళ్ళలేదు. రోడ్డుమీద ఎక్కడా దాని జాడలేదు. అది పొలానికి ఇంకో వైపుకి పరిగెత్తి ఉంటుంది. గేటు బరువుగా ఉంది. నేను గేటుని ఎత్తి సగం మూస్తుండగా ఫ్లోరా నావైపే దూకుతూ వస్తుండడం కనిపించింది. గేటుని మూసి గొలుసు బిగించడానికి సమయం సరిపోతుంది. లెయిర్డ్ గోతిని దాటి నాకు సహాయం చేసేందుకు వచ్చాడు.

గేటుని మూసే బదులు నేను దానిని ఎంత వీలైతే అంత బార్లాగా తెరిచాను. దాని కోసం నేను పెద్దగా ఆలోచించలేదు. అనుకోకుండా అలా చేసేశాను. ఫ్లోరా వేగం ఏ మాత్రం తగ్గలేదు. అది వేగంగా నా వైపుకే ఎగిరి దూకుకుంటూ వస్తోంది. లెయిర్డ్ పక్కకు దూకి "గేటు వెయ్, గేటు వెయ్" అంటూ అరవడం మొదలెట్టాడు. అయితే అప్పటికే సమయం మించిపోయింది. ఒక క్షణం

తర్వాత మా నాన్న, హెన్రీ మా వైపు పరిగెత్తుకుని వస్తూ కనిపించారు. ఫ్లోరా పట్నంవైపు పరిగెడుతుండడం వాళ్ళ కంటపడింది. నేను సరైన సమయానికి గేటు దగ్గరికి చేరుకోలేక పోయినట్టు వాళ్ళు భావించారు. దాని గురించి అడుగుతూ వాళ్ళు సమయం వృథా చేయలేదు. వాళ్ళు వెనక్కు తిరిగి ధాన్యం కొట్టు దగ్గరికి వెళ్ళి తుపాకి, కత్తులు తీసుకుని వాటిని ట్రక్కులో పెట్టుకుని బయలుదేరారు. వాళ్ళు ట్రక్కుని వెనక్కు తిప్పి మా వైపు వచ్చారు. లెయిర్డ్ నేను కూడా వస్తానంటూ అరిచి ట్రక్కు వెంట పరిగెత్తాడు. అప్పుడు హెన్రీ ట్రక్కుని ఆపి లెయిర్డ్‌ను ఎక్కించుకున్నాడు. వాళ్ళందరూ వెళ్ళిపోగానే గేటు మూసివేశాను.

జరిగింది లెయిర్డ్ ఏమన్నా బైట పెడతాడేమో అనుకున్నాను. నాకు ఏమయిందో నాకు అర్థం కాలేదు. అంతకు ముందు మా నాన్న చెప్పిన మాట నేను వినకపోవడం ఎప్పుడూ జరగలేదు. ఇప్పుడు ఆ పని ఎందుకు చేశానో నాకే అర్థం కాలేదు. అయినా నేను చేశాను. ఫ్లోరా ఎటు తిరిగీ తప్పించుకోలేదు. వాళ్ళు దాన్ని పట్టుకుని ట్రక్కులో వేసుకుని రావడం కచ్చితం. ఈ ఉదయం కనుక వాళ్ళు దాన్ని పట్టుకురాకపోతే దాన్ని చూసిన వాళ్ళు ఎవరో మధ్యాహ్నానికో, సాయంత్రానికో దాని గురించి ఫోను చేస్తారు. ఇక్కడ దానికోసం అడవి ఏమీలేదు. తప్పించుకుని పారిపోవడానికి. నక్కలకు ఆహారం పెట్ట డానికి వాటి మాంసం కావాలి. మేం బతకడానికి నక్కల్ని పెంచక తప్పదు. రోజంతా కష్టపడి పనిచేసిన మా నాన్నకు ఇప్పుడు నేను మరింత పనిపెట్టాను. మా నాన్నకు కనుక ఇదంతా తెలిస్తే ఆయన ఇంక నన్ను నమ్మడు. నేను ఆయన పక్షాన లేనని ఫ్లోరా పక్షాన ఉన్నానని ఆయన అనుకుంటాడు. దానివల్ల నేను ఎవరికీ ఉపయోగపడకుండా పోతాను. ఫ్లోరాకి ఎటూ ఉపయోగ పడలేను. అయితే అదే సమయంలో నేను చేసిన పనికి పశ్చాత్తాప పడలేదు. అది నా వంక పరిగెత్తుకుని వచ్చినపుడు నేను గేటు తెరిచాను. నేను చేయగలిగింది అదొక్కటే.

> చదరంగం ఆట అయిపోయిన తరువాత రాజునీ, బంటునీ ఒకే పెట్టెలో పడేస్తారు
> -బుడతనపల్లి రాజేరు సామెత

నేను వెనక్కు తిరిగి ఇంట్లోకి వెళ్ళాను. "ఏంటి ఆ గోలంతా? ఏం జరిగింది?" మా అమ్మ అడిగింది. ఫ్లోరా కంచెదూకి పారిపోయిందని చెప్పాను.

"పాపం మీ నాన్న. ఇప్పుడు దాని వెంట పడి పొలాలన్నీ తిరిగి రావాలి. ఇప్పుడింక వాళ్ళు లేకుండా భోజనానికి ఏర్పాట్లు మాత్రం దేనికి" అంటూ పొయ్యి ఆర్పివేసింది.

నేను మా అమ్మకు జరిగింది చెబుదామను కున్నాను. అయితే ఏం చెప్పకుండా మౌనంగా మెట్లెక్కి పైకి వెళ్ళి నా మంచం మీద కూర్చున్నాను. ఈ మధ్య నేను నా గదిని అందంగా అలంకరించే పని పెట్టుకున్నాను. నా మంచంపై పాత కర్టెన్ని దుప్పటిలా పరిచి, నాకోసం ఒక డ్రెస్సింగ్ టేబుల్‌ను ఏర్పాటు చేసుకున్నాను. లెయిర్డ్ మంచానికి నా మంచానికి మధ్య ఏదన్నా అడ్డ తెర కట్టి రెండు భాగాలుగా చేయడానికి చూస్తున్నాను. సూర్యుడి కాంతిలో కర్టెన్లు మురికి పట్టినట్టు కనిపించాయి. రాత్రుళ్ళు మేం పాటలు పాడడం ఆపేశాం. ఒకరోజు రాత్రి నేను పాడుతుంటే లెయిర్డ్ "నువ్వు పాడుతున్నది ఏం బాగాలేదు" అన్నాడు.

నేను ఆమాట పట్టించుకోకుండా పాట కొనసాగించాను. అయితే మర్నాడు రాత్రి నేను పాడలేదు. ఒక రకంగా దాని అవసరం కూడా ఏమీలేదు. మేం ఇంక భయపడడం లేదు కూడా. అక్కడ ఉన్నది కేవలం పాత సామగ్రేనని, దయ్యాలు కావని మాకు అర్థమైపోయింది. అయితే నేను నియమాన్ని అతిక్రమించలేదు. లెయిర్డ్ నిద్ర పోయిన తర్వాత నాకు నేనే కథలు చెప్పుకున్నాను. ఈ కథల్లో కూడా కొంత కొత్తదనం లేకపోలేదు. కొన్ని మార్పులు చేర్పులు ఉన్నాయి. కథ పాత పద్ధతిలోనే మొదలై ఒక పెద్ద ప్రమాదంతోనో, అగ్ని ప్రమాదంతోనో, అడవి జంతువుల్లో మలుపు తిరుగుతుంది. అప్పుడు నేను ప్రజల్ని కాపాడతాను. అయితే కొత్త కథలో ప్రమాదంలో చిక్కుకున్న నన్ను ఎవరో ఒకరు కాపాడతారు. మా బడిలోని అబ్బాయి కానీ, మా టీచర్ కాంప్‌బెల్ కానీ కాపాడినట్టు ఊహించుకుంటాను. కాంప్‌బెల్‌కు ఒక అలవాటు ఉంది. ఆయన ఆడపిల్లలకు చక్కిలిగిలి పెడుతుంటాడు. కథ ఇంతదూరం వచ్చాక నా దృష్టి హఠాత్తుగా నా జుట్టు పొడవు మీదకో, నేను వేసుకున్న బట్టల మీదకో పోతుంది. దానితో కథ కంచికి వెళుతుంది.

ట్రక్కు వెనక్కు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఒంటిగంట అయింది. టార్పాలిన్ వెనక పరిచి ఉంది. అంటే దాని అర్థం అందులో మాంసం ఉన్నట్టు. మా అమ్మ వంట పదార్థాలను వేడి చేయడం మొదలెట్టింది.

మా నాన్న, హెన్రీ రక్తపు మరకలు అంటిన బట్టల్ని మార్చుకుని వేరే బట్టలు వేసుకున్నారు. పంపు దగ్గర కాళ్ళు చేతులు, మొహం కడుక్కుని, జుట్టుమీద నీళ్ళు చల్లుకుని తల దువ్వుకుంటూ భోజనాల బల్ల దగ్గరకు వచ్చారు. లెయిర్డ్ రక్తపు చార అంటిన చేతిని పైకెత్తి చూపిస్తూ "మేం ఫ్లోరాను కాల్చి చంపాం. తర్వాత యాభై ముక్కలుగా నరికాం" అని చెప్పాడు.

"అదంతా నేను వినాలనుకోవడం లేదు. నువ్వు భోజనాల బల్ల దగ్గరకు అలా ఆ అవతారంతో రావద్దు" అమ్మ కచ్చితంగా చెప్పేసింది.

మా నాన్న లెయిర్డ్‌ను రక్తపు మరకలు కడుక్కుని రమ్మని పంపాడు. మేం అన్నం తినడానికి కూర్చున్నాం. మా నాన్న ప్రార్థన చేశాడు. హెన్రీ చూయింగ్ గమ్‌ను ఎప్పటిలా ఫోర్క్ చివర గుచ్చి ఉంచాడు. ఎక్కువగా మిగల ఉడికిన కూరగాయలను మేం ఒకళ్ళకు ఒకళ్ళు అందించుకుంటూ భోజనాలు చేయడం ప్రారంభించాం.

లెయిర్డ్ భోజనాల బల్ల దగ్గర నా వంక చూస్తూ బడాయిగా మొహం పెట్టి "ఫ్లోరా పారిపోవడానికి అక్కే కారణం" అని ప్రకటించాడు.

"ఏంటి?" మా నాన్న అడిగాడు.

"అక్క గేట్లు వేయగలిగి ఉండి కూడా వేయలేదు. పైగా గేట్లు తెరిచింది. అందుకే ఫ్లోరా పారిపోగలిగింది."

"అది నిజమా?" మా నాన్న అడిగాడు.

భోజనాల బల్ల దగ్గర ఉన్న వాళ్లందరూ నా వంకే చూస్తున్నారు. నేను నోటిలో ఉన్నదాన్ని బలవంతంగా మింగుతూ అవునన్నట్టు తలూపాను. ఎంత వద్దనుకున్నా కళ్ళు నీటితో నిండిపోయాయి. మా నాన్న అసంతృప్తిగా నిట్టూర్చాడు.

"నువ్వాపని ఎందుకు చేశావు" అని అడిగాడు.

నేను సమాధానం చెప్పలేదు. నేను ఫోర్కు కిందపెట్టేసి భోజనాల బల్ల దగ్గర నుంచీ వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాను. మా నాన్న అక్కడినుంచీ వెళ్ళి పొమ్మంటాడని ఎదురు చూస్తూ కళ్ళు దించుకుని కూర్చున్నాను.

అయితే అలా జరగలేదు. కొంత సేపు ఎవరూ ఏం మాట్లాడలేదు. తర్వాత లెయిర్డ్ ఎవరినీ ఉద్దేశించినట్టు కాకుండా "అక్క ఏడుస్తోంది" అన్నాడు.

"అయితే అయిందిలే. ఏడవకు" మా నాన్న కొంత ఓదార్పుగా అన్నట్టు అన్నాడు. తర్వాత నేను చేసిన దానిని తేలిగ్గా ఎగరకొట్టడానికన్నట్టు హాస్యంగా "ఆడపిల్ల కదా. అందుకే అలా చేసింది" అన్నాడు.

నేను దాన్ని ఖండించలేదు. మనసులో కూడా దాన్ని వ్యతిరేకించలేదు. ఒకవేళ అది నిజమేనేమో!

# తుమ్ము

## -జార్జి బెర్నార్డ్ షా (1856- 1950)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



ఛాందసతకు, ఘరానా మనుషుల భేషజాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ సాయుధ పోరాటం చేసినవాడు బెర్నార్డ్ షా. హాస్యం, వ్యంగ్యం అతడు వాడిన రెండు ఆయుధాలు. నవ్వు కూడా గాయపర్చగలదు. బూర్జువా విలువల గాలి బుడగల్ని సూదుల్లాంటి మాటల్తో పేల్చివేశాడు. డబ్బు సంపాదించి మరీ ధనికుల్ని ఎద్దేవా చేశాడు. ఒకడికి లాభం చేకూర్చటమంటే వందల వేల అమాయకుల పొట్ట కొట్టడమేనని నిరూపించాడు. "డబ్బు సంపాదన, మనిషి ప్రగతికి కాదు, పతనానికి ప్రతీక" అన్నాడు. సంపన్నుల దేవుడంటే పేదల పాలిటి పిశాచం. విలాసాలలో మునిగి తేలినప్పుడందరూ అందంగానే కనిపిస్తారు. ఆ ముసుగు తొలగిస్తే వాళ్ల అనాకారితనం మనకు జుగుప్స కలిగిస్తుంది.

షా తన ఒంటరి పోరుతో విప్లవాలు తేలేకపోవచ్చు. కానీ ప్రపంచ వ్యాప్తంగా రెండు మూడు తరాల మేధావులను సమసమాజ భావనల పట్ల ఆకర్షితులయ్యేలా ప్రభావితం చేశాడు.

అతడు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. హెన్రీజార్జ్, కార్ల్‌మార్క్స్‌ల ప్రభావంతో ఫేబియన్ సోషలిస్టుగా మారి వందల, వేల ఉపన్యాసాలతో శ్రోతలను ఉత్తేజపరిచాడు.

"హాస్యం అనబడే లేపనం లేకపోతే ఆ విమర్శ, అభిశంసన మరెంత బాధ పెట్టేవో" అంటారు సాహిత్యకారులు. డబ్లిన్ (ఇర్లాండ్)లో జన్మించినప్పటికీ, ఇంగ్లాండులోనే తన సాహితీ జీవితం ప్రారంభించాడు షా. అనేక నాటకాలు, కథలు వ్యాసాలు, విమర్శ, రాజకీయ రచనలు (ముఖ్యంగా ఇంటెలిజెంట్ ఉమన్స్ గైడ్...), మరెన్నో. షా నాటకాలలో తన ఉద్యమ ప్రచారానికిచ్చిన ప్రాధాన్యం, కథ, పాత్రలకివ్వలేదంటారు. అయితేనేం నవ్వించని, ఆలోచింపచెయ్యని వాక్యమొక్కటి కూడా ఉండదు. ఈయన నాటకాలొకెత్తయితే, వాటికి రాసిన ఉపోద్ఘాతాలు(ప్రిఫేసెస్) అంతకన్నా బావుంటాయి.

షా అభిప్రాయాలు ఇప్పుడు మనకు సుపరిచితంగా అనిపిస్తున్నాయంటే అర్థం సమాజంలో అంత మార్పు వచ్చిందన్న మాట. ఆ మార్పుకోసం షా రచనల్లో వందేళ్ల క్రితమే ప్రయత్నించారు. ("క్వింటెసెన్స్ ఆఫ్ ఇబ్సెనిజం"లో దీని గురించిన ప్రస్తావన ఉంటుంది.)

1925లో నోబెల్ కమిటీ షాకు బహుమతి ప్రదానం చేసి తనను తాను సత్కరించుకుంది.

సుదీర్ఘ జీవితం గడిపిన వాళ్లు అనేకులుండవచ్చు కానీ, అంతకాలం లక్ష్యసాధన కోసమే శ్రమించిన వాళ్లు అరుదు. అలాంటి అరుదైన మహనీయుడు బెర్నార్డ్ షా.

నాటకం వెయ్యటమంటే ఆషామాషీ కాదు. ప్రదర్శన తేదీ దగ్గర పడుతున్నది. నటీనటులందరూ తమతమ ఆహార్యాలు వేసుకుని చూసుకుంటున్నారు. డ్రెస్ డిజైనర్ దుస్తుల్ని నిశితంగా పరిశీలిస్తున్నాడు. ఇక్కడో మార్పు. అక్కడో చేర్పు. చొక్కా కాస్త పొడుగుండాలి. బ్లౌజు కాస్త బిగుతుగా వుండాలి, పట్టకపోతే ఎలా? కాస్త వదులు చేయండి. పైగా అలాంటిలాంటి షో కాదు. నటీనటుల ప్రతిభను పరీక్షించే షేక్స్ పియర్ నాటకం.

"నా డ్రెస్ బాగోలేదు" అంటూ పెదవి విరిచాడు అయాగో (ఒథెల్లో నాటకంలోని దుష్టపాత్ర).

"లేదు సార్. మీకు పర్ఫెక్ట్‌గా సరిపోయింది. ఫస్ట్‌క్లాస్"–అభయమిచ్చాడు డిజైనర్.

"డ్రెస్ పర్‌ఫెక్ట్, ఫస్ట్‌క్లాస్ కావచ్చు. కాని పాత్ర ఇలాగుండదు."

"ఏ పాత్ర?"

"అయాగో. నా పాత్ర"

"సార్ ఇలారండి మీకో రహస్యం చెబుతాను. మరెవరికీ చెప్పకండి. బైటికి పొక్కిందంటే నా ఉద్యోగం పోతుంది"

"నవ్వు డ్రెస్ గురించే మాట్లాడుతున్నావా?"

"అవునండి బాబూ"

"నానుస్తావేం. చెప్పు మరీ"

"అయాగోకు సరిపోయే డ్రెస్ కుట్టడం అసాధ్యం. ఎందుకంటారా? అతడు పాత్ర కాదు"

"నీకు పిచ్చెక్కిందా ఏమిటి? అయాగో పాత్ర కాదా? ఒథెల్లో కథ తెలుసా అసలు? నాటకం గొప్పదనం నీ ఊహకు అందలేదనుకుంటాను. మందెక్కువైతే చెప్పు. తరువాత మాట్లాడుదాం"

"మీరెన్ని తిట్టినా నేనేమీ బాధ పడను సార్. వందల సంవత్సరాలుగా, వందల మంది విమర్శకులు అయాగో పాత్రను విశ్లేషిస్తూ వందల వేల పుస్తకాలు రాశారని చదివాను. మానసిక సంక్లిష్టతలో అయాగోను అర్థం చేసుకోవటం ఎవరితరం! షేక్స్‌పియర్‌ను గ్రేటెస్ట్ డ్రమటిస్ట్ అని ఊరికే అన్నారా. మీరేమనుకోకపోతే ఒక చిన్న విషయమడుగుతాను, నాలాంటి పాత్రల గురించి ఎవరూ ఎందుకు రాయరు సార్?

నేను అనుభూతి పొందుతున్నాను, కనుక నేను వున్నాను
-రూసో

"నీ గురించా? ఎందుకు రాయాలి?"

"ఎందుకు రాయకూడదు. నాలో సంక్లిష్టత లేదా? నేనేమాలోచిస్తున్నానో అందరిరకీ అర్థమవుతుందా? విశ్లేషిస్తూ, వాదోపవాదాలు చేస్తూ బండ పుస్తకాలు రాస్తేనే గదా పండితులు చర్చించుకునేది"

"ఛీ, నాటకం గొప్పదనం గురించి కనీస జ్ఞానం కూడా లేని నీతో మాట్లాడడమేమిటి! అక్కడ షేక్స్‌పియర్ ప్రతిమ ఉన్నది చూశావూ, నీ ప్రేలాపన వింటే అది తననిక్కణ్ణించి తక్షణం తొలగించమని ప్రాధేయపడేది."

"నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు, నాయనా. నిజానికి నేను మాట్లాడగలను. మామూలు పరిస్థితుల్లో బొమ్మలు మాట్లాడగూడదు.కాని వాస్తవం మాట్లాడినందుకు ఒక అమాయకుణ్ణి దూషిస్తున్నారే, ఇలాంటి అన్యాయానికి శిలలు కూడా నోరు విప్పక తప్పదు. మరి, నేనో కేవలం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో మూసబోసిన రూపాన్ని" అంది షేక్స్‌పియర్ ప్రతిమ.

"ఇదేదో కొత్త ట్రిక్కులాగుంది. బొమ్మలో ఫోనోగ్రాఫ్ పెట్టినట్టుంది. కనీసం పాటల రికార్డు వేసినా బాగుండేది" అంటూ చికాకుపడ్డాడు అయాగో పాత్రధారి.

"ఎక్స్‌క్యూజ్‌మీ సార్. నేనూ, ఆ బొమ్మా కలిసి ఏదో గూడుపుఠాణీ చేశామనుకుంటున్నారా ఏమిటి? ఇంతవరకూ మేం మాట్లాడుకోలేదు సార్. షేక్స్పియర్ లాంటి జీనియస్ ముందు నేను నోరు మెదపగలనా?" అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు డిజైనర్.

"నువ్వు డ్రెస్ ఎందుకు కుట్టలేకపోయావో నాకర్థమైందిలే" అంటూ ప్రారంభించింది ప్రతిమ. "విలన్లను సజీవ పాత్రలుగా చిత్రించటం కాస్త కష్టమే. ప్రేక్షకులు వాళ్లనిష్టపడరు. అలాంటి మనుషులు చేసేవన్నీ చెడ్డపనులేనాయె. కాసేపొచ్చిపోతే ఫరవాలేదు. ఫుల్ లెంత్ కారెక్టరంటే మాటలా! డాన్ జువాన్ (ఒక హాస్య నాటకంలో పాత్ర) ఉన్నాడు చూడు. కనీసం అలాగ నవ్వించగలగాలి. కుట్రలు చేస్తూ, మనుషుల్ని నాశనం చెయ్యటానికి ప్లాన్లు వేస్తూ, అబద్ధాలాడుతూ ఉండే మనుషులెవరిష్టపడతారు?

"ఇది మంచి పాత్ర కాదని తెలుసు" అన్నాడు అయాగో.

"కానీ, బాగా ప్రేక్షకాదరణ పొందింది" అంది ప్రతిమ.

"అంటే నేను" అయాగో కళ్లలో గర్వం. షేక్స్‌పియర్ తలూపాడు. ప్రతిమ కదిల్తే ఏమవుతుంది? బాలెన్స్ తప్పి కిందపడేదే.

ఒక్క ఉదుటున డిజైనర్ వెళ్లి పట్టుకున్నాడు. ఈ ప్రమాదానికి్కారణం తనేనని తిట్టుకున్నాడు. దుమ్ము దులిపి ప్రతిమను మళ్లీ నిలబెట్టాడు.

"పాత్రలు ఎలాంటివైనా నా కవిత్వానికి ప్రేక్షకులు ముగ్ధులు కారూ! అయాగో తన లైన్లు చదివినప్పుడు కరతాళ ధ్వనులతో హాలు మార్మోగిపోతుంది."

"ఒథెల్లోలో ఉన్నది ఒక్క విలన్ కాదు. ఇద్దరు. ఒక మగ, ఒక ఆడ" అంటూ డైలాగులు అభినయించాడు షేక్స్‌పియర్.

"ఆడ విలన్ ఎవరు?" అన్నాడు అయాగో ఆశ్చర్యంగా.

"ఆ లెక్కన విల్లనంటూ ఎవరూ లేరనుకో. కానీ ఆడ విలన్‌తోనే నాటకం ప్రారంభమవుతుంది"

"ఎవరబ్బా?" అంటూ ఆలోచనలో పడ్డాడు డిజైనర్.

"డిస్డెమోనా" అన్నాడు మహాకవి, (డిస్డెమోనా హీరోయిన్. చివరి సీనులో భర్త ఒథెల్లో ఆమెను చంపేస్తాడు)

"భర్త తనను అనుమానించే పద్ధతిలో ఆమె ఎందుకు ప్రవర్తించాలి? అనవసరంగా అపోహలు పెంచేవాళ్లు విలన్లే. అయితే ఆమెను అమాయకురాలిగా చెయ్యటంవల్లే డ్రామా బాగా పండింది. మానవ స్వభావాన్ని వక్రీకరించానేమో! ఏమైతే ఏం.నాటకం పెద్ద హిట్టు. ఫార్సులా తయారైందిగదూ?" (ఒథెల్లో విషాదాంత నాటకం, ఫార్సు కాదు)

"ఒథెల్లో ఫార్సా?" అంటూ నోరెళ్ల బెట్టాడు అయాగో.

"నువ్వు తెపించే నాటకాలు మాత్రమే ఫార్సులనుకుంటావా ఏమిటి? అది నీ అజ్ఞానం. అపార్థాలు సహజంగా రావాలి. డ్రామా కోసం అపార్థాలను సృష్టించినప్పుడవి ఫార్సులుగా మారుతాయి. పాలకూ, నీళ్లకూ తేడా తెలియనంతటి అమాయకురాలు డెస్డెమోనా. యుద్ధనీతి చతురుడు ఒథెల్లో. భార్యాభర్తల అతడికి అనుమానం ఎందుకు కలిగిందో సహజంగా చూపించలేదు. భర్తకు తెలియకుండా ఆమె నిజంగా అలాంటి పనులేమైనా చేస్తే, అప్పుడు భర్త అనుమానించటంలో అర్థముండేది. కనీసం ఒథెల్లో స్వభావరీత్యా నిత్యశంకి తుదని కూడా చెప్పలేదు. కాని అలా చేస్తే ఒథెల్లో పాత్ర దెబ్బతినేది. అందువల్ల మరొకరి (అయాగో) కుట్రకు బలైన మనిషిగా చిత్రించాను. జేబురుమాలు వల్ల కథ మలుపు తిరుగుతుంది. (ఒథెల్లో ప్రేమ కానుకగా ఇచ్చిన జేబురుమాలును డెస్డెమోనా ఎక్కడో పారేసుకుంటే, అయాగో కుట్ర చేసి దాన్ని ఆమెను ఇష్టపడిన మరొక యువకుడి గదిలో జారవిడుస్తాడు. భార్య పాతివ్రత్యాన్ని

ఒథెల్లో అనుమానించటానికి కారణం ఇదే). నిజజీవితంలో ఇలా జరిగిందని రాస్తే ఎవరైనా నమ్ముతారా? అందువల్ల విజ్ఞులైన ప్రేక్షకులను ఈ నాటకం పెద్దగా ఇంప్రెస్ చెయ్యదు. పాత్రల ప్రవర్తనలో ఎంతో కృత్రిమత్వం వుంది. అయాం సారీ.వందల ఏళ్లు గడిచాయి. నాటక కళ ఎంతో అభివృద్ధి చెందిందంటారు. మరి ఇప్పటి నాటకాలు నా రచనల దరిదాపులకు కూడా రాలేకపోతున్నాయెందుకు?

"నాటకంలోని ముఖ్యపాత్ర ఎమిలియా" అన్నాడు డిజైనర్. (ఎమిలియా, అయాగో భార్య, చాలా చిన్న పాత్ర)

"ఇంతకూ, నా గురించి మాట్లాడటం లేదు" అంటూ అభ్యర్థించాడు అయాగో దిగులుగా.

"నిన్ను దుష్టపాత్రగానే ప్రారంభించాను. పెద్ద తెలివితేటలేమీ ఉండవు. అధికారుల ముందు వంగి సలాములు చేసే రకం. సంస్కారం లేదు. నిలవెల్లా స్వార్థం. తన దుశ్చర్యలవల్ల ఎదుటి మనుషులకెంత హాని జరుగుతుందో గ్రహించలేదు. పైగా ఇలాంటి పనులవల్ల తనకు లాభంకన్నా, ఎదుటి వాళ్లకు జరిగే నష్టం ఎక్కువ. ఇలాంటి వ్యక్తుల డైలాగులు కూడా చప్పగా ఉంటాయి. స్టేజీమీద కవిత్వ పంక్తులు గానం చెయ్యాలంటే వాడి పాత్ర కొంత మారక తప్పదు మరి. అందువల్ల వాడిలోనూ కొంత హాస్యస్ఫూర్తి ప్రవేశపెట్టాను. మనుషుల బలహీనతలను చూసి నవ్వుకో గలిగినతనం కావాలని అనుకున్నాను. ఉత్తి పుణ్యానికి అమాయకురాల్ని గొంతు నులిమి చంపుతాడు భర్త (ఒథెల్లో).స్త్రీ ద్వేషులకు కారణాలక్కర్లేదనుకో. అది వేరే విషయం.(షా చాలా చోట్ల స్త్రీల గురించి వ్యంగ్యంగా రాశాడు.) నాటకాలేసి పొట్టపోసుకునేవాణ్ణి. స్త్రీ ద్వేషులే కాదు, అందరి ఆదరణా కావాలి నాకు"

ప్రతిమ వాగ్ధాటికి అవాక్కయ్యాడు డిజైనర్. మహాకవి సూక్తులే కావచ్చుకాక. కానీ కబుర్లకిది సమయంకాదు. తలుపు తీసుకుని వెళ్లబోతుంటే లేడీ మాక్‌బెత్ ప్రవేశించింది. (మాక్‌బెత్ నాటకంలో హీరోయిన్. క్రూరురాలు. అనేక హత్యలు చేయటానికి భర్తను ప్రేరేపించింది) ఆమె అయాగో (పాత్రధారి) భార్య. సంపన్నురాలు.

"లేడి మాక్ బెత్ డ్రెస్సు బాగోలేదు. ఇందులో నేను లేడీ మాక్‌బెత్‌లాగ లేను" అంది.

"పాపం శమించుగాక. మీరు లేడీ మాక్‌బాత్ లాగుండకూడదు. డ్రెస్సు మారినా స్వభావం మాత్రం మారదు" అన్నాడు డిజైనర్.

"నాన్సెన్స్. ఆహార్యాన్ని బట్టి స్వభావం కూడా మారుతుంది" అందావిడ. ప్రతిమ తనలో తను నవ్వుకోవడం చూసి అటు తిరిగింది.

"ఆ బొమ్మ పెద్ద వాగుడుకాయ. గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతుంది" అన్నాడు అయాగో.

"అబద్ధం. బొమ్మ మాట్లాడలేదు"

"గలదు.నేను మాట్లాడుతున్నాగా. బొమ్మనే" అన్నాడు షేక్స్‌పియర్.

"అది ప్రకృతి విరుద్ధం"

"మాట్లాడకుండా నన్నాపగలవా? ఛాలెంజ్" అన్నాడు షేక్స్‌పియర్.

"నమ్మను గాక నమ్మను. ఇవన్నీ మధ్య యుగాల మూఢవిశ్వాసాలు. అది సరేగాని, ఈ డ్రెస్సులో నేను హత్యలు చెయ్యగలిగిన దానిలా కనిపిస్తున్నానా?"

"డోన్ట్‌వర్రీ. నిన్ను సృష్టించటంలో కూడా నేను ఫెయిలయ్యాను. నిన్ను మహాక్రూరురాలిగా చేద్దామనుకున్నాను. కాని నా భార్య జ్ఞాపకం వచ్చింది" అన్నాడు షేక్స్‌పియర్ సాలోచనగా.

"మీ భార్యా? అంటే ఆన్ హతావే? ఆమె లేడీ మాక్‌బెత్ లాగుండేదా?"

"అచ్చు గుద్దినట్టు. లేడీ మాక్‌బెత్ స్వభావమేమిటి? భర్త చేసేదంతా తప్పు. అతడసమర్థుడు. ఏ పనైనా తను అతడికన్నా బాగా చెయ్యగలనని. అవునా? నేను ఎవర్నైనా చంపానని చెబితే, అలాకాదు యిలా చంపాలని ఎత్తిపొడిచేది. (ఇది 'మాక్‌బెత్' నాటకంలో ఒక సీను). ఒకనాడు అతిథులకు విందిస్తాం. అందరి ముందరా నా ప్రవర్తన బాగులేదని చులకన చేసింది. పైగా అమె చేసిన పనుల్లో (హత్యల్లో) ఏమైనా అర్థముందా? అందువల్లనే అది ఆమె స్వభావమంటూ తప్పించుకున్నాను- అంటే ఆన్ స్వభావం."

> ఏ వ్యక్తీ ఒకే నదిలో రెండుసార్లు స్నానం చేయలేదు. నది నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది. మొదట స్నానం చేసినప్పటి నీరు కొట్టుకుపోయి, దాని స్థానంలోకి కొత్తనీరు వచ్చి చేరుతుంది. ఎప్పటికప్పుడు నీరు మారిపోతుంది. అంటే నది మారిపోతుంది. అంటే ఇంతకు ముందు స్నానం చేసిన నది ఇప్పుడు లేదు. ఒకవేళ ఆ నీరు కదలనట్టు కనిపించినా, మొదటిసారి స్నానం చేసినప్పటికి, రెండవసారి చేసినప్పటికి, కొంత కాలం గడిచింది కదా? అందుచేత మొదటిసారి స్నానం చేసిన నది కొంతకాలం క్రిందటిది. రెండవసారి స్నానం చేసినది కొంతకాలం తర్వాతది. ఆ రెండూ ఒకటి కావు. –బెర్గ్‌సన్

"ఛ. కనీసం ఈ ప్రదర్శన ముగిసిందాకా నన్నా నాకివన్నీ చెప్పకుండా ఉండాల్సింది" అంది లేడీ మాక్‌బాత్.

"ముందరే చెప్పినందుకు సంతోషించు. స్వతహాగా నేను చాలా మంచివాణ్ణి. అందరి భ్రమలూ, భేషజాలు తెలుసు నాకు. తోటి వాళ్లకన్నా ఎక్కువ తెలివే ఇచ్చాడు నాకు దేవుడు"

"భేషజమంటే ఇదే" అంది లేడీమాక్‌బెత్.

"ఏం చెయ్యను మరి! నేనూ అందరి లాంటి సగటు మనిషినని చెప్పనా?"

"నీకసలు 'ఆంతరాత్మ' అంటూ ఉందా?"

"దాని గురించో కథ చెబుతాను విను. హెన్రీ జ నాటకం రాస్తున్నప్పటి సంగతి. ఓ రకంగా అదీ హేమ్లెట్ (మరో నాటకం) లాంటి పాత్రే. కథలో నీతి ఉండటం బాగుంటుంది గదా. ఆ మాట ఎవరన్నారు? బహుశా డాక్టర్ జాన్సన్. (సామ్యూల్ జాన్సన్ ప్రసిద్ధ వ్యంగ్య రచయిత. ఇంగ్లిష్ డిక్షనరీ కూర్చిన మహనీయుడు) చలిగా వుంది. కాస్త తలుపేస్తారా?" అంటూ కణతలు నొక్కుకున్నాడు షేక్స్‌పియర్.

"సారీ" అంటూ లేచింది లేడీ మాక్‌బెత్. అప్పటికే జరగవలసింది జరిగిపోయింది.

మహాకవికి పడిశం పట్టుకుంది.

"తుమ్మొస్తున్నది ఆపుకోలేను" అంది ప్రతిమ. ముక్కుపుటాల్లో దురద. కళ్లు చిట్లించింది.

"హాచ్" మంటూ పెద్ద చప్పుడు. బొమ్మ ముక్కలై నేల కూలింది.

# జల కవచం

## పెర్ల్ ఎస్. బక్ (1892-1973)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



పెర్ల్ కంఫర్డ్ సిడెన్‌స్ట్రికర్ బక్ తల్లిదండ్రులు చైనాలో మత ప్రచారకులు. వాళ్లు సెలవులకు స్వదేశానికి వచ్చినప్పుడు అమెరికాలో వెస్ట్ వర్జీనియాలోని హిల్స్‌బరోలో పుట్టింది గానీ బాల్యమంతా చైనాలోనే గడిపింది. ఇంగ్లీషు కన్నా ముందే చైనీస్ నేర్చుకుంది. 1920 ప్రాంతాలలో తొలి రచనలు ప్రచురితమైనాయి. 1931లో వెలుగు చూసిన 'ది గుడ్ ఎర్త్'తో ఆమె అమెరికన్ సాహిత్యంలో అగ్రశ్రేణి రచయిత్రిగా స్థానం సంపాదించుకుంది. 1935లో విలియం డీన్ హావెల్ మెడల్, 1938లో 'నోబెల్' బహుమానం కూడా వరించాయి. ఈ గౌరవం పొందిన తొలి అమెరికన్ మహిళ పెర్ల్. 1937లో ఈ నవలను ఎంజిఎం స్టూడియో వాళ్లు సినిమాగా కూడా తీశారు. పెర్ల్‌కు చైనీస్ జీవితంతో ప్రగాఢమైన సంబంధముంది. ఆమె రాసిన కథలు, నవలలన్నీ ఎక్కువగా చైనీస్ జీవితాన్ని గురించే. 1910లో అమెరికా వచ్చి, నాలుగేళ్లు రాండాల్ఫ్ మాకాన్ కాలేజీలో అధ్యయనం చేసి 1914లో తిరిగి చైనాకెళ్లింది. అక్కడే వ్యవసాయ ఆర్థిక నిపుణుడు జాన్ లాసింగ్ బక్‌ను వివాహం చేసుకుంది. ఇద్దరు పిల్లలు. నాంకింగ్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు బోధించింది.

1934లో చైనాలో వచ్చిన రాజకీయ మార్పుల దృష్ట్యా, పారిపోయి స్వదేశం వచ్చింది. భర్తకు విడాకులిచ్చి, 'గుడ్ ఎర్త్' ప్రచురించిన జాన్ డే ప్రచురణ సంస్థ యజమాని రిచర్డ్ జె.వాల్ష్‌ను పెళ్లాడింది.

పెర్ల్ తన తల్లిదండ్రుల గురించి రాసిన పుస్తకాలు 'ది ఎక్సైల్', 'ది ఫైటింగ్ ఏంజిల్' చైనా గ్రామీణ జీవితాన్ని కూడా దర్శింపచేస్తాయి. ఆత్మకథ 'మై సెవరల్ వరల్డ్స్'లో కూడా ఈ ప్రస్తావన ఉంటుంది. ఇవి గాక 'ఇంపిరియల్ వుమన్', 'డ్రాగన్ సీడ్' లాంటి అనేక పుస్తకాలు చైనీస్ వ్యవసాయిక సమాజాన్ని చిత్రించాయి. జీవిత కాలంలో పెర్ల్ వందకు పైగా పుస్తకాలు అనేక నవలలు, కథలు, వ్యాసాలు, విమర్శలు వగైరా ప్రచురించింది. ఆర్కే నారాయణ్ నవల 'గైడ్'ను బాలీవుడ్ దర్శక నిర్మాత, నటుడు దేవానంద్ సినిమాగా తీసినప్పుడు, దాని ఇంగ్లిష్ వెర్షన్ నిర్మాణానికి ఆర్థిక సహాయం కూడా చేసింది. ఆమె కృషి రచనలకు మాత్రమే పరిమితం కాలేదు.

అమెరికన్ పౌరహక్కుల ఉద్యమంలో, స్త్రీల హక్కుల ఉద్యమాలలో కూడా చురుకుగా పాల్గొంది. ఏషియన్ అనాథ బాలలను అమెరికన్లు దత్తత తీసుకునే ఒక ప్రాజెక్టును కూడా ప్రారంభించింది.

పెర్ల్ ఎస్.బక్ ఎనభై ఒక్కటో ఏట, మార్చి ఆరో తేదిన మరణించింది.

ముసలావిడ పేరు వాంగ్. రాజకీయాలామెకర్థం కావు గానీ అక్కడెక్కడో యుద్ధం జరుగుతున్నదని మాత్రం తెలిసింది. జపాను వాళ్ళొచ్చి తమ దేశం వాళ్లని చంపుతున్నారట. ఎంతమంది చైనీస్‌లనిలా చంపుతారు వాళ్ళు? తనదాకా రాలేదు. తన కళ్ల ముందర ఎవరూ ఎవర్నీ చంపలేదు. బహుశా ఇవన్నీ ఒట్టి వదంతులేమో!

ఎల్లో రివర్ ఒడ్డున వున్నదా వూరు. వాంగ్ పూర్వీకులంతా అక్కడే పుట్టి పెరిగారు. జపాను వాళ్లెలా ఉంటారో అక్కడి వాళ్లకు తెలియదు.

వేసవికాలం. పొద్దు గుంకుతున్నది. నది పొంగి ఊరిని ముంచెయ్యకుండా ఉండటానికి నిర్మించిన కట్ట ఎక్కి నీటి పొంగు ఎలా ఉందో పరిశీలించింది వాంగ్. జపాను వాళ్ల సంగతేమో గాని నది పొంగితే మాత్రం అపాయం తప్పదు. వందల వేల పాములు మెలికలు తిరుగుతున్నట్టుగా నీళ్లలో మెరుస్తున్న అలలు.

"నీటిమట్టం బాగా పెరిగిందిరో" అంటూ హెచ్చరించింది.

"పాడు నది. ఈ ఊరికి పట్టిన దయ్యం ఇది" అన్నాడు ఆమె మనవడు . వాడిపేరు లిటిల్‌పిగ్.

"జాగ్రత్త. జలదేవత వింటుంది"

కట్టమీద కూర్చున్నవాళ్లంతా జపాన్ గురించే మాట్లాడుకున్నారు.

"వాళ్లెలా ఉంటారసలూ? చూస్తే ఎలా గుర్తు పట్టటం?"

"పరదేశం వాళ్లను పోల్చుకోవటం కష్టం కాదులే. బాగా పొడుగ్గా వుంటారు. ఒంటి రంగు కూడా తేడా ఉంటుంది. పైగా వాళ్లవి చేపకళ్లు. మన మాదిరిగా లేని వాళ్లంతా జపానువాళ్లే"

ఆ ఊళ్లో అందరికన్నా ముసల్ది ఆవిడే. అందువల్ల ఆమె మాటకు తిరుగులేదు.

"వాళ్లు విమానాల్లో దాక్కుంటారు తాతమ్మా. మనకగుపించరు" అన్నాడు మనవడు.

ఒకప్పుడైతే విమానాలనేవి లేనేలేవని కరాకండిగా చెప్పేది. కాని ఇటీవల, అసంభవమనుకున్న విషయాలనేకం జరుగుతున్నాయి. చైనీస్ చక్రవర్తులకు మరణం ఉండదు. కాని రారాణి మరణించిందని చెప్పారు. పైగా రాజ్యానికి "రిపబ్లిక్" అని పేరు పెట్టారట.

"జపనీస్ అనేవాళ్లు అసలు వుండరురా" అంటూ తీర్మానించింది వాంగ్. అందరూ గొల్లున నవ్వారు.

అది చిన్న ఊరు. ముప్పై యిళ్లకు మించి ఉండవు. ఇంతదూరం ఎందుకు వస్తారు జపాన్‌వాళ్లు? ఎంతచెడ్డా, వాళ్లూ మనుషులే.

ఆమె జీవితంలోని ఎన్నో ముఖ్య సంఘటనలకు సాక్ష్యంగా నిలిచిందీ డైక్. పదిహేళ్లప్పుడు నవవధువుగా ఉన్నప్పుడు భర్త పిలిస్తే ఇక్కడికి వచ్చింది. కొన్నాళ్లకే అతడు ప్రమాదవశాత్తూ ఈ నీళ్లలో పడి మరణించాడు. బుద్ధిస్ట్ నరకం నుండి భర్తను రక్షించటానికి ఎన్ని సంవత్సరాలపాటు పూజలు చేయించిందో! ఉన్నదంతా ఊడ్చిపెట్టింది. ఇంకా పిల్లాణ్ణి పెంచాలి. భూమి సాగు చెయ్యాలి. ఖర్చులు పెరిగిపోయాయి. "మరో పది వెండి బిళ్లలు కావాలి!" అంటూ డిమాండ్ చేశాడు పూజారి.

"ఇంకెన్నాళ్లీ పూజలు"

"నీ భర్త కుడిచెయ్యి యింకా నరకంలో చిక్కుకుని ఉన్నద"న్నాడు.

"చెయ్యేగదా! లాక్కోగలడులే. నాకాయన సంగతి బాగా తెలుసు" అంది వాంగ్.

ఇన్నేళ్లు గడిచినా ఇంకా అనుమానం తీరలేదు. నిజంగా లాక్కున్నాడో లేదో. మనవడి పెళ్లాం నీళ్లాడటానికి సిద్ధంగా ఉంది. ఆ తర్వాతైనా డబ్బులు జమచేసి ఆయన్ను విడిపించాలి.

నదిని చూస్తే చాలు. వాంగ్‌కు ఆలోచనలు పొంగిపొర్లుతాయి. నీళ్లంటే భయం. నీళ్ల లేక బతకలేరు. గట్టు తెగితే తామంతా జలసమాధి కావలసిందే. భయంకరమైన డ్రాగన్ ఏదో తమకు నది రూపంలో దర్శనమిస్తోంది.

తన భర్తను కబళించిన రాక్షసి! ఆ రోజు కట్టకు గండి పడ్డది. అతడు మరమ్మతు చెయ్యటానికెళ్లాడు. తను వారిస్తూనే ఉంది. అంతలోనే నీటి మట్టం పెరిగింది. కాలు జారింది. కళ్లముందరే కొట్టుకుపోయాడు. తమకు జీవన్మరణాల మధ్య సరిహద్దు రేఖ ఈ కట్ట. ఆ ఊరివాళ్లు తరతరాలుగా నదిని తిట్టుకుంటూ, అడ్డుగోడకు మరమ్మత్తులు చేస్తూ గడుపుతారే తప్ప, తమ నివాసాల్ని ప్రమాద స్థలానికి మరికాస్త దూరంలో కట్టుకోవాలని మాత్రం తట్టలేదు. అది వాళ్ల అమాయకత్వానికి పరాకాష్ఠ.

నీటి అలల మీద వెన్నెల పరుచుకుంది.

"తాతమ్మా, విమానాలొస్తాయిలాంటప్పుడు" అన్నాడు మనవడు.

"అశుభం పలక్కు. ఎక్కడ నేర్చుకున్నావురా ఇలాంటి మాటలు!" అంటూ కట్ట దిగింది వాంగ్. ఆమె వెంట ఊరి జనమూ బయలేర్దారు.

రాత్రి పక్కలో వాలిందన్న మాటేగాని ఆలోచనలన్నీ జపాన్ వాళ్ల గురించే. వాళ్లెలా ఉంటారు? ఎందుకొచ్చారట? ఏం చేస్తారు? తమ గ్రామం గురించి వాళ్లకు తెలుసా? రాక్షసుల్లాటి వికృతాకారాలను కొన్ని వూహించు కుని బహుశా ఇలాగే ఉంటారు కాబోలు అనుకుంది.

అర్ధరాత్రి దాటింది.

"వచ్చారు. వచ్చారు" అంటూ కేకేసింది మనవడి పెళ్లాం.

"ఎక్కడ"

"అదిగో, ఆకాశంలో!"

నిజమే. ఆకాశంలో ఎగురుతున్న పక్షులు కాని పక్షులు.

"ఏమిటవి?"

జవాబుగా, అల్లంత దూరాన, పొలంలో వెండి గుడ్డులాంటిది జారిపడింది. మట్టి ఆకాశమంతెత్తు ఎగిసింది. అందరూ ఈ వింత చూడటానికి పరిగెత్తారు. ముప్పై అడుగుల మేర గొయ్యి ఏర్పడింది. అంతలోనే మరొకటీ, మరొకటీ. జనమంతా చెల్లాచెదురుగా పరిగెత్తారు, "అంతా" అంటే వాంగ్ తప్ప మిగతా

---

సినిక్ తాత్వికుడైన డైయోజెనిస్ "మనుషులు కుక్కలవలె బ్రతకాలి" అనేవాడట. ఈ మాటను పట్టుకుని అనాటి వారు "సినిక్" అనే మాటను హేళనార్థంతో మొదటగా ఉపయోగించి వుంటారు. చివరికి ఏంటిస్తెనీస్, డైయోజెనిస్, తాత్విక చింతనకు సినిసిజం అని, వారి అనుయయులకు సినిక్‌లని పేర్లు స్థిరపడిపోయాయి.

---

మరీ తియ్యగా వుండకు నోట్లో వేసుకుని నమిలి మింగేస్తారు, మరీ చేదుగా వుండకు నోట్లో పెట్టుకోగానే ఊసేస్తారు -యూదు సామెత

---

నీ జ్ఞానానికి మించిన గౌరవం కోరుకుని ఆశాభంగం పొందకు.

-తుమ్మలపాలెం సామెత

---

వాళ్లందరూ అని అర్థం. మనవడూ, మనవరాలూ చెయ్యి పట్టుకుని లాగారు. కానీ విడిపించుకుని కట్ట పక్కనే కూలబడిపోయింది ఆవిడ.

"నేను పరిగెత్తలేనురా. డెబ్బై ఏళ్లుగా పరిగెత్తలేదు. మా పాదాలను కట్టేశారు గదా. ఈ కాళ్లతో పరిగెత్తలేను. మీరిద్దరూ వెళ్లండి. చిన్నపిల్ల జాగ్రత్త. ఒట్టి మనిషి కూడా కాదు" అంటూ వెనక్కు వాలింది వాంగ్.

"తాతమ్మా, నువ్వు రాకపోతే నేనూ వెళ్లను" అంటూ మొండికేసింది పిల్ల.

"పోవే మూర్ఖురాలా. నీ మొగుడు చస్తే, వంశాంకురం ఉండాటానికన్నా, నీ ప్రసవం క్షేమంగా జరగాలి. వెళ్లు" అంటూ చేతికర్రతో తోసింది వాంగ్.

పైన విమానాల రొద పెరిగింది. అందరూ ఏదో అరుస్తున్నారు గానీ ఒకరి మాటలొకరికి వినిపించటం లేదు. తన కళ్ల ముందే విమానాలు ఎగురుతున్నా, వాంగ్ ఇదంతా నమ్మలేక పోతోంది. సుదీర్ఘ జీవితంలో చూడని వింతలు ఇప్పుడు చూస్తోంది.

మరికొన్ని విమానాలు వచ్చి మొదట వచ్చిన వాటిని ఎదిరించాయి. ఆకాశంలో యుద్ధం! భలే. ఈలోగా, కోతకొచ్చిన గోధుమ చేలమీద "వెండి గుడ్లు" పడుతూనే ఉన్నాయి.

పెంకుటిళ్లు, పూరి పాకలు ఒక్కొక్కటే నేల మట్టమవుతున్నాయి, ఎటు చూసినా మొండి గోడలు తప్ప మేరేమీ కనిపించటం లేదు.తన ఇల్లేమైంది?

పొగ వ్యాపించింది. మంటలు. యుద్ధ మంటే ఏమిటో, ఎలా ఉంటుందో ఆమెకు తెలియదు. కష్టపడి కట్టుకున్న ఇళ్లను, చెమ టోడ్చి పండించిన పంటలను ఎవరైనా ఎందుకు నాశనం చెయ్యాలి?

మరికాసేపట్లో, నిన్నగాక మొన్న మనవడు దుక్కి దున్నిన సోయాబీన్ పొలంలో రెక్క తెగిన పక్షిలా ఏదో కూలింది.

మొదట భయమేసింది. కానీ, ఈ వయ సులో తను దేనికి భయపడాలి? ఏం జరిగినా ఫరవాలేదు. కర్ర సాయంతో నెమ్మదిగా నడిచింది.

విమానం చుట్టూ చేరి మొరుగుతున్నాయి కుక్కలు. ఇదిగాక, ఇంజిన్ రొద కొంత. "ఉస్" అంటూ అదిలించింది కర్రతో. తెల్లగా మెరుస్తున్న రెక్కలు. "ఇదంతా వెండి కాబోలు" అనుకుంది వాంగ్.

విమానం లోపల కుర్రాడెవరో కూర్చున్నారు. అంతెత్తునించి పడటంతో సీటులో ముందుకు వాలి పడిపోయాడు.

"లే...లే" అంటూ పలకరించింది. బతికాడో, చచ్చాడో!

'దెబ్బలు తగిలే ఉంటాయిలే' అనుకుంది. చైనా వాడిలా లేదు. చర్మం అదో రంగులో ఉంది.

"దక్షిణ దేశం వాడై ఉంటాడు"

"బైటికిరా కట్టు కడతాను" అంది.

వాడేదో గొణిగాడు గాని అర్థం కాలేదు. తనే, అతి ప్రయత్నం మీద బయటికి లాగింది.

నేలమీద పడబోయి, నిలదొక్కుకున్నాడా యువకుడు.

> ఈ ప్రపంచాన్ని మెరుగు పరచడానికి, మానవజాతి శ్రేయస్సును వృద్ధిపరచడానికి, లోపాలను తొలగించడానికి అవకాశం తప్పకుండా వున్నది. ప్రతి వ్యక్తి ఇందులో ఒక చెయ్యి వెయ్యాలి. ప్రపంచాభ్యుదయ కృషిలో ప్రతి ఒక్కడూ పాత్రధారి కావాలి. ఎవరి దృక్పథం వారిది. ఎవరి సత్యం వారిది. ఆ దృక్పథం నుంచి, ఆ సత్యదర్శనం నుంచి కృషి చేయడంలో పరస్పర సంఘర్షణ సంభవించవచ్చు. కానీ ఆ సంఘర్షణలో నుంచే అభ్యుదయం సిద్ధిస్తుంది. – విలియం జేమ్స్
>
> చెడ్డను భరించలేని వెధవ మంచి రోజులు వచ్చేవరకూ బతకలేదు.
> –యూదు సామెత

"మా ఇంటిదాకా నడిస్తే, అక్కడేమైనా చికిత్స చేస్తాను"

కుక్కలు మొరుగుతూ మీదికి లంఘించాయి. వాడు భయపడి ఆమెను వాటేసుకున్నాడు.

కర్రతో కుక్కల్ని విదిలించింది వాంగ్.

"ష్! పొండే. కుర్రాణ్ణి చంపుతారా ఏమిటి?"

నడవలేని మనిషిని, వీపున వేసుకుని ఈడ్చుకుంటూ, కూలిన, ఇళ్ల శిథిలాల గుండా నడిచింది.

ఇంటికి చేరుకోవాలనే ఆమె ప్రయత్నం. కానీ ఇల్లు మిగల్లేదు. కట్ట గేటుకి ఎదురుగా ఉంటుంది తన ఇల్లు. మళ్లీ కట్టుకోవాల్సిందే. గోడకు వాలి కుర్చున్నాడు కుర్రాడు. నీళ్లు కావాలని సైగ చేశాడు. ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. కాని ఒక్క మాటా అర్థం కాలేదు.

పగిలిన కుండ పెంకులో నది నీళ్లు పట్టిచ్చింది వాంగ్. గాయాలు కడిగి తన గౌను చింపి కట్టు కట్టింది.

చదువుకున్న వాడిలాగే ఉన్నాడు.

"మీకు మా భాష రాదా?" అంటూ అడిగింది.

కుర్రాడికి బాధతో కళ్ళు మూసుకు పోతున్నట్టున్నాయి.

"ఆకలిగా ఉందా! ఏదన్నా ఉందేమో చూస్తాను"

నాలుగిళ్ళావల, రొట్టెలు చేసే బేకరీ ఒకటి ఉంది. ఇప్పుడక్కడ బేకరీ లేదు గాని దుమ్ము కొట్టుకుపోయిన రొట్టె ముక్కయినా దొరక్క పోతుందా! చాలాసేపు వెదికింది. చివరికి, కూలిన గోడల మధ్య ఇంకా గోర్వె చ్చగా వున్న బ్రెడ్ రోల్ చేతికి తగిలింది. ఆహారం కనిపించగానే ఆకలి జ్ఞాపకం వచ్చింది. ముందర, తను కాసింత తిని, కుర్రాడికి కూడా పెట్టొచ్చనుకుంది.

అంతలో, అరుపులు వినిపించాయి. "జపనీస్!" అంటూ పరిగెత్తుకొచ్చారు సైని కులు.

"జపనీస్ ఎవరు?"

"వీడే"

"వీడు జపనీసా? మన పోలికలూ ఉన్నాయే"

"వీడు జపనీస్" అన్నాడొక సైనికుడు కోపంగా.

"సర్లే. ఆకాశం నుండి ఊడిపడ్డాడు. నన్నేం చెయ్యమంటావు" అంది వాంగ్.

"ఆ బ్రెడ్డిటివ్వు"

"మీరు తినండి. వాడికి ఓ ముక్క ఇవ్వండి"

"జపనీస్‌కు మన రొట్టె ఇవ్వాలా?"

"ఏం? వాడికి మాత్రం ఆకలి ఉండదా?"

తనవాళ్లే అయినా, చైనీస్ సైనికులిలా ఉంటారని అనుకోలేదు వాంగ్. కానీ, ఎవర్నెందుకు తప్పుపట్టటం! సైనికులంతా ఒకటే.

"మాది ప్రశాంత జీవితం. నా ఎరుకలో, ఈ ఊరికి సైనికులు రాలేదు.

మీరూ రావద్దు. వెళ్లిపోండి"

"నిజమే చాలా ప్రశాంతంగా ఉందిప్పుడు. సమాధిలాగ. ఈ వూరినిలా చేసిందెవరో తెలుసా మామ్మా? ఈ జపనీస్‌గాళ్లే!"

"కానీ, ఎందుకు వాళ్లిలా చేస్తున్నారు?"

"మన దేశం, మన భూమి వాళ్లక్కావాలట!"

"మన భూమి వాళ్లకెందుకిస్తాం?"

"ఎప్పటికి ఇవ్వం!" అంటూ అరిచాడొక సైనికుడు.

ఏదో గొడవ జరుగుతూనే ఉందిగానీ, అందరూ తూర్పువైపు పరిశీలనగా చూస్తున్నారు.

"అటుకేసి ఎందుకు చూస్తున్నారు?"

"జపాన్‌గాళ్లు అటునుండే వస్తున్నారు"

"మరేం చెయ్యాలి? మీరు పారిపోతారా?"

"మేం కొద్దిమందిమే ఉన్నాం. సావోఆన్ గ్రామం రక్షణ బాధ్యత మాకప్పగించారు"

"ఆ ఊరు నాకు బాగా తెలుసు. టీ కొట్టు యజమాని పావో ఎలా ఉన్నాడు? వాడు నా తమ్ముడు"

"ఎవరూ మిగల్లేదా వూళ్లో. అందర్నీ చంపేశారు జపనీస్. విదేశీ టాంకులు, విదేశీ తుపాకులతో జనాభా మొత్తం తుడిచి పెట్టుకు పోయింది"

హతాశురాలైంది వాంగ్. తన వంశంలో ఇంకెవరూ మిగల్లేదన్నమాట.

జపనీస్ మరోసారి దాడికి పాల్ప డవచ్చని సైనికులు అప్రమత్తంగా ఉన్నారు.

"ఇంతకూ, వీడు బతికున్నాడా, చచ్చాడా?" అంటూ ఒక సైనికుడు కత్తితీసి గాయపడిన పైలట్‌ను రెండు మూడుసార్లు పొడిచాడు. వ్యూహంలో భాగంగా, చైనీస్ సైనికులంతా వెళ్లి దూరంగా ఎక్కడో నక్కారు.

"వీడు జపానువాడా? ఎంత ఆశ్చర్యం!" అనుకొని విస్తుపోయింది వాంగ్. పైలట్ శవం నేలకొరిగింది.

వంశం కొనసాగాలంటే మనవడూ, వాడి పెళ్లాం క్షేమంగా వుండాలి. ఇద్దరూ ఎటువైపు పారిపోయారో! కనిపిస్తారేమోనని కట్ట ఎక్కి చూసింది.

గంట సేపట్లో నీటి మట్టం బాగా పెరిగినట్టుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఊరు మునిగిపోతుంది. "పాపిష్టి దయ్యం" అంటూ తిట్టుకుంది. నది వినదీ. ఇంకేం జరిగినా బాధ లేదు. జపాన్ వాళ్లు నాశనం చేసిన ఊరును నది తన కడుపున దాచుకుంటుందా!

మొహం, కాళ్లూ, చేతులూ కడుక్కుంది. చుట్టూ చూసింది. సైనికులు పడుతూ, లేస్తూ పరిగెత్తుతున్నారు. నిర్మానుష్యంగా ఊరు. తన మనవడూ, మనవరాలూ ఎక్కడో తన కోసం నిరీక్షిస్తూనే ఉండి ఉంటారు.

కట్ట దిగుదామనుకుంటున్నప్పుడు, తూర్పున, దూరంగా, ఏదో కదలిక కనిపించింది. మొదట ధూళి మేఘంలాగ. పరికించి చూస్తే ఏవో చుక్కలు. మెరుస్తున్న చుక్కలు. అర్థమైంది. పోల్చుకోగలిగింది. మనుషులు. ఒకరూ యిద్దరూ కాదు. పదాతిదళం కదలి వస్తున్నది.

"జపనీస్" అనుకున్నది వాంగ్.

వాళ్లకు రక్షణగా, పైన ఫీల్డ్ చేస్తూ యుద్ధ విమానాలు టార్గెట్ చూసుకుని బాంబులు విడుస్తాయి.

"ఎవరు కావాలి మీకు? ఇంకా ఏం మిగిలిందని ఈ ఊళ్లో? నేను, నా మనవడూ, మనవరాలు తప్ప. మా తమ్ముణ్ణి చంపేశారు! మంచి టీ చేసే పావో మరణించాడు. అతడి భార్యా, ఏడుగురు పిల్లలూ జపాను సైనికుల తూటాలకు బలైపోయారు." కట్ట ఎక్కి నిల్చున్నది. తను వాళ్లకు కనిపిస్తూనే ఉండి ఉంటుంది!

దిగుతున్నప్పుడు కట్ట గేటు జ్ఞాపకం వచ్చింది. ఈ నది తమకు శాపం. తమను ఎన్ని ఇక్కట్ల పాలు చేసిందో!

గేట్ తెరవటం వచ్చు తనకు, అంటే పంట కాల్వల కోసం కాదు. ఒకేసారి, మొత్తం గేట్ ఎత్తేస్తే ఏమవుతుందో కూడా బాగానే తెలుసు. తెరచి తను కొట్టుకుపోకుండా తప్పించుకోవటం సాధ్యమా?

"కాటికి కాలు జాచుకున్న ముసల్దాన్ని, ఎందుకింత భయం!" అనుకుంది.

మనవడికి పుట్టబొయ్యే పిల్ల ఎలాగుంటుందో చూడలేదన్న బెంగ ఒక్కటే మిగిలింది. కానీ, జీవితంలో అనుకున్నవన్నీ ఎప్పుడూ జరగవు. ఇంతవరకూ చూసింది చాలు.

మరొక్కసారి తూర్పుకు దృష్టి సారించింది. జపాను సైనికులు ముందుకు కదులుతున్నారు. వందలో, వేలో... గేట్ తెరిస్తే... వరద ఉప్పెనలాగ పొలాలను, శిథిలాలుగా మిగిలిన ఇళ్లను ముంచెత్తి ఆకలిగొన్న డ్రాగన్ లాగ ముందుకురుకుతుంది. మనవడూ, మనవరాలూ ఊరు దాటి మరెక్కడో క్షేమంగా తలదాచుకునే ఉంటారు!

శత్రు సైన్యంతో యుద్ధం చెయ్యటానికి అనేక పద్ధతులున్నాయి. కొందరు విమానాలు వాడతారు. కొందరు తుపాకులు. నది నా ఆయుధం. లాకులు తెరవటం కాస్త కష్టమే. అయితేనేం. ఈ ఒక్క పని చెయ్యగలిగితే చాలు. ఈ జీవితానికి పరిసమాప్తి.

గేట్ లీవర్ పట్టి లాగింది. "చేసేది పాపమా? అయితేనేం. నరకానికే పోతాను. చెయ్యి చిక్కుకున్న నా మొగుడింకా అక్కడే ఉన్నాడు. అక్కడైనా కలిసి బతుకుతాం"

మరుక్షణం...

కనుచూపు మేర కప్పేసింది జలప్రళయం. కిందా, మీదా, నలువేపులా నీరు. వాంగ్ ఏదో అనబోయింది. ఊపిరి తీసుకోబోయింది. కాని ఎంతసేపు. అంతా లిప్తపాటులో ముగిసింది. శత్రు సేనలకది జలసమాధి. ●

> ప్రేమ, జ్ఞానం నాకు లభ్యమైనంత వరకు నన్ను ఆకాశ వీధులలోకి తీసుకుపోయాయి. కాని, మానవ కారుణ్య భావన నన్ను ఎప్పటికప్పుడు దివినుంచి భువికి లాక్కువస్తూనే వుంది. బాధా సర్పదష్టుల గాధాక్రందనలు నా హృదయ కుహరంలో ప్రతిధ్వనిస్తాయి. కరవు రక్కసి కోరలలో చిక్కిన చిన్నారి పాపలతో, నియంతల చేతులలో చిత్రహింస లనుభవించే అభాగ్యులతో, కొడుకులకు కూడా బరువై పోయి దిక్కూ మొక్కూ లేని దీనవృద్ధులతో నిండిన ఈ శోకపు లోకంలో భరించరాని ఒంటరితనం, నిరుపేదరికం, రంపంలా కోసే బాధ – ఇవన్నీ మానవ జీవితాన్ని వికటాట్టహాసంతో వెక్కిరిస్తాయి. నేను ఈ దుఃఖ తిమిరాలను ఏ కొంచమైనా పారద్రోలాలని ఆరాట పడతాను. ఆకలి, ఈ కన్నీటి సముద్రాలను తుడవడం ఎవరితరం? చివరికి నిస్సహాయంగా నా బాధావిల హృదయం విలవిలలాడి ఓడిపోతుంది. ఇది నా జీవిత గాథా, బాధా! అయినా, జీవితం జీవించ దగిందిగానే నాకు సాక్షాత్కరించింది. నాకే అవకాశం వస్తే సంతోషంగా మళ్లీ ఇదే జీవితం జీవిస్తాను" –రస్సెల్

# జ్వరం వచ్చిన రోజు

## ఎర్నెస్ట్ హెమింగ్వే (1898-1961)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



అమెరికన్ సాహిత్య చరిత్రలో నూతన శకాన్ని ప్రారంభించిన ఎర్నెస్ట్ హెమింగ్వే చికాగో సమీపంలో జన్మించాడు. తండ్రి ప్రముఖ డాక్టరు, క్రీడాకారుడు. 1917లో 'కాన్సాస్ సిటీస్టార్' పత్రికలో రిపోర్టర్‌గా చేరి రచనాజీవితం ప్రారంభించాడు హెమింగ్వే. మరుసటి సంవత్సరం మొదటి ప్రపంచయుద్ధంలో పాలు పంచుకుని ఇటలీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేశాడు. క్షతగాత్రుడై, అమెరికా తిరిగి వచ్చి టోరంటో స్టార్ అనే వార పత్రికకోసం ఫీచర్లు రాశాడు. మరి కొన్నాళ్లకు ఫారిన్ కరస్పాండెంట్‌గా యూరోపు వచ్చి పారిస్‌లో స్థిరపడ్డాడు. 1922లో గ్రీసు-టర్కీ యుద్ధాన్ని గురించి రిపోర్టు చేశాడు. మరుసటి సంవత్సరం తొలి పుస్తకం 'త్రీ స్టోరీస్ అండ్ టెన్ పోయెమ్స్' వెలువడింది. ఆ తరువాతి జీవితమంతా బుల్ ఫైటింగ్, ఆఫ్రికా అడవుల్లో వేట, సముద్రం మీద ఫిషింగ్‌లో గడిచింది. స్పానిష్ అంతర్యుద్ధంగురించి కూడా రాశాడు. క్యూబాలో చాలా కాలం గడిపాడు. 1961లో ఆత్మహత్య చేసుకున్నాడు. కథా రచన గురించి, ముఖ్యంగా శైలి, వాక్య నిర్మాణం గురించి హెమింగ్వే చాలా కృషి చేశాడు. తొలి కథలు 'ఇన్ అవర్ టైం' (1925), 'ఎ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్' (1929)తో ఒక గొప్ప స్టయిలిస్టుగా సాహితీలోకం ఆతణ్ణి గుర్తించింది. ఇరవైయవ శతాబ్ది పూర్వార్థంలో ఇంగ్లీషు సాహిత్యశైలిని ఇంతగా ప్రభావితం చేసిన రచయిత మరొకడు లేడు. (చైతన్య ప్రవంతితో జేమ్స్ జాయస్ కూడా ధ్రువ తారగా అవతరించాడు గాని అది వేరు). 1940 నాటి 'ఫర్ హూమ్ ది బెల్ టోల్స్' (1940) యుద్ధ వాతారణం నేపథ్యంలో జరిగిన ప్రేమ కథ. 1932లో బుల్ ఫైటింగ్ గురించి 'డెత్ ఇన్ ది ఆఫ్టర్‌నూన్,' 1935లో వేట గురించి 'గ్రీన్ హిల్స్ ఆఫ్ ఆఫ్రికా' రాశాడు. సముద్రంలో చేపల వేట గురించిన అద్భుత తాత్విక నవలిక 'ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ' (1952) తర్వాత 1954లో హెమింగ్వేను నోబెల్ బహుమతి వరించింది.

"పాఠకుడు, 'మరెంత ఉందో కథ' అనుకోవటమే రచయిత ప్రతిభకు గీటురాయి" అంటాడు హెమింగ్వే తన శైలి గురించి. కథా వస్తువు కోసం ఉద్వేగ భరితమైన సన్నివేశాల కోసం అనితర సాధ్యమైన అతని కథలు మళ్లీ చదువుతారు. గత డెబ్బై ఏళ్ళుగా హెమింగ్వేశైలిని అనుకరించటానికి ప్రయత్నించిన వాళ్ళకు కొదవ లేదు. అయినా అతడి లాంటి మరో రచయిత ఇంత వరకూ పుట్టలేదు.

జ్వరం వచ్చిన రోజు గదిలోకి వచ్చి కిటికీలు వేసేశాడు. చలి వచ్చినట్టు వణుకుతున్నాడు. జబ్బు పడ్డట్టు కనిపించాడు. మొహం కందిపోయింది. ఒళ్లంతా నొప్పిగా ఉందేమో, నెమ్మదిగా నడిచాడు. పడుకున్నాడు గాని యింకా నిద్ర పోలేదు.

"ఏమైందిరా బుజ్జీ?".

"తల నొప్పిగా ఉంది".

"నిద్ర పోదువు గాని దా".

"ఫరవా లేదులే. బాగానే ఉంది".

తొమ్మిదేళ్ళ కుర్రాడు. ఫైర్ ప్లేస్ ఎదురుగా కూర్చుని మంట కాచుకుంటు న్నాడు, ఒంట్లో నలతగా ఉందని తెలుస్తూనే ఉన్నది. నుదురు తాకి చూశాను వేడిగా ఉంది.

"జ్వరంగా ఉంది. వెళ్లి పడుకో"

"బాగానే ఉంది".

డాక్టరు వచ్చి, చెక్ చేసి టెంపరేచర్ చూశాడు.

"ఎంతుంది?"

"నూట రెండు". డాక్టరు మూడు రకాల క్యాప్సూల్స్ రాసిచ్చి ఎలా వేసు కోవాలో చెప్పాడు. ఒకటి జ్వరం తగ్గటానికి. మూడవది ఎసిడిటీ తగ్గించటానికి. కడుపులో యసిడిటీ ఉన్నప్పుడే ఇన్‌ఫ్లుయెంజా క్రిములు పెరుగుతాయట. ఆయన ఉపన్యాసం వింటే 'ఫ్లూ' గురించి బాగా అధ్యయనం చేసినట్టు అనిపించింది. టెంపరేచర్ నూటనాలుగు దాటనంత వరకూ భయపడవల సిందేమీ లేదన్నాడు. ఇది ఫ్లూ సీజన్‌ట. "ఊళ్ళో చాలా మందికుంది. న్యుమోనియా రాకుండా జాగ్రత్త పడండి"

ఓ నోట్ బుక్‌లో టెంపరేచర్, మందిచ్చినటైమూ రాసి పెట్టుకున్నాను.

"కథలు చదివి చెప్పనా?" అనడిగాను.

"ఓకే. నీ ఇష్టం" అన్నాడు వాడు. ఆ కాసేపట్లోనే మొహం పాలిపోయింది. కళ్ళ కిందిభాగాలు నల్లబడ్డాయి. ప్రపంచంతో తనకు సంబంధం ముగిసినట్టుగా చూరు వైపుచూస్తూ పడుకున్నాడు.

> నా జీవితం పుస్తకాల మధ్య ప్రారంభమైంది. పుస్తకాల మధ్యనే అంతమవుతుంది.
>
> –జీన్‌పాల్ సార్త్రే

దొంగల కథ ప్రారంభించాను. కాని వాడు వినటం లేదు.

"ఎలాగుంది నాన్నా"

"అలాగే ఉంది, ఫరవాలేదు".

వాడి బెడ్ అంచు మీద కూర్చుని కాసేపుచదివాను. మరో క్యాప్సూల్‌కు టైమైంది. పడుకున్న తర్వాత ఇంతసేపు నిద్ర పోకుండా ఉండడు వాడు. కాని ఇప్పుడు రెప్ప వేయకుండా దిగులుగా దిక్కులు చూస్తున్నాడు.

"కళ్ళు మూసుకుని పడుకో నాన్నా. మందువేయాల్సినప్పుడు లేపుతానులే".

"నిద్ర పోను".

మరి కాసేపటికి, "నువ్విక్కడ కూర్చోనక్కర్లేదు నాన్నా. విసుగ్గా ఉంటే వెళ్ళు" అన్నాడు నా వైపు చూస్తూ.

"నాకు విసుగేమిటమ్మా. నీతోనే ఉంటాను"

"ఊరికే కూర్చుంటే విసుగొస్తుందిలే వెళ్ళు"

పిల్లలతో వాదించటం కష్టం. ఈ పరిస్థితిలో అస్సలు మంచిది కాదు. పదకొండింటికి మందేసి బయటికి వచ్చాను. చల్లగా ఉంది. నేలంతా మంచు కప్పేసింది. చెట్లు, పొదలు నరికి కింద పేర్చిన కలప. ఎటు చూసినా తెల్లటి గుట్టలు. గడ్డికనిపించటం లేదు. వెంట కుక్కను తీసుకెళ్లాను. ఆ నున్నటి పేవ్‌మెంట్ మీద అదికూడా జారింది. రెండుసార్లు నేను తూలాను. భుజానికి తగిలించుకున్న గన్ ఒకసారి కింద పడింది. కాలవకు అటు పక్కన చెట్టు మీద కొంగలు కనిపించాయి. రెంటిని గురిచూసి కొట్టగలిగాను. మిగతా పక్షులు కొన్ని ఆకుల్లో కనిపించకుండా దాక్కున్నాయి గాని చాలా మట్టుకు ఎగిరి మరింత దూరాన నేలమీద వాలాయి. గన్ గురి పెట్టాలంటే స్థిరంగా నిల్చోగలగాలి. అదే కుదరలేదు. మళ్లీ కింద పడతానని భయం. ఐదు షాట్లు మిస్ అయ్యాయి. ఎక్కడికి పోతాయి. మరో రోజు దాకా వాటిని బతకనిస్తాను.

ఇంటికి చేరాను. "బాబు గదిలోకెవ్వర్నీ రానివ్వటం లేదు." అంటూ కంప్లెయింట్ చేశారు పొరుగు వాళ్ళు.

"లోపలికి వస్తే ఈ జబ్బు మీకూ వస్తుంది. ఎవరూ రావద్దు" అన్నాడట.

వెళ్ళి చూశాను. నేను ఎలా పడుకోబెట్టానో అదే పొజిషన్‌లో ఉన్నాడు. కనీసం పక్కకుకూడా తిరగలేదు. జ్వరంతో బుగ్గలు ఎరుపెక్కాయి.

టెంపరేచర్ మళ్లీ చూశాను.

"ఎంత?".

"వందున్నట్లుంది".

నిజానికి నూట రెండు పాయింట్ నాలుగుంది.

"నూట రెండు" అన్నాడు వాడు.

"ఎవరు చెప్పారు?".

"డాక్టరు".

"టెంపరేచర్ ఫరవాలేదులే! వర్రీ కావలసిందేమీ లేదు".

"వర్రీ లేదు గాని ఆలోచనలు ఆగటం లేదు".

"ఎందుకన్ని ఆలోచనలు? టేకిటీజీ!".

"ఈజీగానే తీసుకుంటున్నాను" ఆ మాటల్లో కొత్తర్థం ధ్వనించింది. ఏదో దాస్తున్నాడు.

"ఈ మందేసుకో".

"ఉపయోగముంటుందంటావా?".

"భలే వాడివే. తప్పకుండా ఉంటుంది".

దొంగల కథ మళ్లీ చదివాను. కాని వాడు వినందే! పుస్తకం మూసి వాడికేసి చూశాను.

"ఎప్పుడు చచ్చిపోతానంటావు?".

"ఏమిటీ?".

"ఎంతసేపట్లో చస్తాను?".

"అవేం మాటలురా నాయనా. నీకేమైందని?".

"డాక్టరు చెప్పాడుగా నూటరెండని".

"ఆ మాత్రం టెంపరేచర్ కెవరూ చావరు. పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు".

"నాకు తెలుసు. ఇంత ఎక్కువగా ఉంటే మనుషులు తప్పక చస్తారు. ఫ్రాన్స్‌లో ఉన్నప్పుడు క్లాస్‌మేట్స్ చెప్పారు. టెంపరేచర్ నలభై నాలుగు దాటితే మనుషులు బతకలేరని. నాకేమో నూట రెండుంది".

అదన్నమాట. రోజంతా వాడు చావుకోసం నిరీక్షిస్తూ పడుకున్నాడు. ఉదయం తొమ్మిదింటి నుండీ ఇలా బుర్ర పాడు చేసుకున్నాడు. పిచ్చి నాన్న.

"నా బుజ్జీ. నా బంగారు కొండా, మైళ్ళకూ, కిలోమీటర్లకూ తేడా తెలుసా లేదా? అలాగే ఇది. నీకేమీ కాదు. వాళ్ళు వాడే థెర్మా మీటర్ వేరు. అక్కడ ముప్పై ఏడుంటే నార్మల్. మన థెర్మా మీటర్లో తొంభై ఎనిమిదన్నట్టు".

"నిజంగా? ఆర్ యూ షూర్?"

"అవున్రా నాయనా. మైళ్ళకూ, కిలోమీటర్లకూ తేడా ఉన్నట్టే ఇదీ. డెబ్బై మైళ్లంటే ఎన్ని కిలోమీటర్లో చెప్పు?".

"ఓహ్! అలాగా".

అప్పుడుగాని కాస్త స్థిమిత పడలేదు. మళ్లీ అల్లరి చేస్తూ ఇల్లు పీకి పందిరెయ్యటానికి మరో రెండు రోజులు పట్టింది. ●

# అతిథి

## ఆల్బర్ట్ కామూ (1913-1960)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



ఆబ్బర్ట్ కామూ దృక్పథం కూడా అస్తిత్వ వాదమే అయినప్పటికీ, అది సార్త్రే తాత్వికత కన్నా భిన్నమైంది. భవిష్యత్తు అగోచరం, అనూహ్యం, హేతుబద్ధంగా ఉండకపోవచ్చని కూడా కామూ విశ్వసిస్తాడు. ఒక రకంగా అతడి ఆస్తిత్వ దృక్పథానికి కేంద్ర బిందువు లాంటిది 'ది మిత్ ఆఫ్ సిసిఫస్' (1942). ఒక పెద్ద శిలను కష్టపడి కొండ పైకి తీసుకుపోతాడో యువకుడు. శిఖరం చేరిన ప్రతిసారీ అది కిందికి జారుతుంది. మనిషి ప్రారబ్ధం కూడా ఇంతే.

'అబ్సర్డిస్ట్' నాటకాల సాహిత్యంతో ముడిపడిన కామూ జీవితం కూడా అర్థాంతరంగా, అబ్సర్డ్‌గా 1960లో ఒక రోడ్డు ప్రమాదంతో ముగిసింది.

ఫ్రెంచి ఆక్రమిత అల్జీర్స్ (అల్జీరియా-ఉత్తరాఫ్రికా)లో జన్మించిన కామూ 1940లో యుద్ధం ప్రారంభమైన తర్వాత మాత్రమే ఫ్రాన్సుకు వచ్చాడు. అప్పటిదాకా ఆఫ్రికాలో అనేక ఉద్యోగాలు చేసి, అల్జీర్స్ ఫుట్‌బాల్ టీంకు గోల్‌కీపర్‌గా ఆడిన కామూ ఫ్రాన్సుచేరి పత్రికారంగంలో ప్రవేశించాడు. జర్మన్ ఆక్రమణ కాలంలో 'కాంబాట్' అనబడే రహస్య వార్తాపత్రికకు సంపాదకత్వం వహించాడు. యుద్ధానికి ముందే వెలువడిన ఇతని ముఖ్య నాటకం కలిగులా (1939). కామూ 1942లోతన 'ఔట్ సైడర్'తో ప్రపంచ సాహిత్యంలో భూకంపం సృష్టించాడు. ఇందులోని హీరో మెర్సా యువకుడు- అల్జీర్స్‌లో గుమాస్తాగా పనిచేస్తుంటాడు. అవివాహితుడు. అతడిమీద హత్యానేరం మోపబడుతుంది. దీనికి ఒక బలమైన కారణం- తల్లి మరణించినప్పుడు అతడు బాధపడలేదు. అందరిలాగ ఎమోషన్లు, సెంటిమెంట్లు లేవు. ఇతడే హత్య చేసి ఉంటాడనటానికి ఇంతకంటే మంచి కారణమేముండగలదు!

ప్రపంచ సాహిత్యం మీద, ముఖ్యంగా ఫ్రెంచి సాహిత్యం మీద కామూ ప్రభావం, అతడి రచనలను మనం చదివి గ్రహించగలిగినదానికంటే ఎంతో ఎక్కువ. తన నలభై నాలుగో ఏటనే 1957లో నోబెల్ కమిటీ కామూకు బహుమతి ప్రకటించటానికిదే ముఖ్య కారణం. 'మనందరికీ ప్రశ్నించటం నేర్పించాడు కామూ. సుదీర్ఘమైన జీవిత ప్రయాణాన్ని హఠాత్తుగా ముగించుకుని వెళ్లిపోయాడు. జవాబులుండకపోవనే ఆశతో నిరంతరం ప్రశ్నించటమే మన విధి' అంటూ తన మిత్రుణ్ణి సంస్మరించుకున్నాడు సార్త్ర్.

ఇద్దరు వ్యక్తులు కొండెక్కి రావటం గమనించాడు టీచర్ దారూ. ఒకడు గుర్రం మీదా, మరొకడు నడచి వస్తున్నారు. కొండకు కొంత దిగువనే ఉన్నారు గనక స్కూలు వాళ్లకింకా కనిపించే అవకాశం లేదు. మంచులో ప్రయాణం కష్టమే భయంతోపాటు రాళ్లు జారిపడే ప్రమాదమూ ఉంటుంది.

అతికష్టం మీద ఒక్కొక్క అడుగేస్తూ, రొప్పుతూ నెమ్మదిగా కదులుతున్నారు. ఆ ఎడారిలో ఎక్కడా మరో మనిషి జాడ లేదు. కాలికింద రాయి తగిలినప్పుడు గుర్రం బెదురుతోంది. శబ్దం వినిపించకపోయినా, అది ఒగరుస్తోందని ముక్కుపుటాల కదలికను చూసి తెలుసుకున్నాడు. ఆ ఇద్దర్లో ఒకడికి ఈ ప్రాంతం సుపరిచితమై ఉంటుంది. మంచుతో దారి కనిపించని పరిస్థితిలో కూడా నేరుగా వస్తున్నాడు. వాళ్లిక్కడికి చేరటానికి కనీసం మరో అరగంటైనా పడుతుంది. ఎముకలు కొరికేస్తున్న చలి. స్వెట్టర్ కోసం వెనక గదిలోకెళ్లాడు.

క్లాస్ రూం బోసిగా ఉంది. ఫ్రాన్సులోని నాలుగు నదులనూ నాలుగు రంగుల్లో చూపించిన బోర్డు. గత మూడు రోజులుగా అవి ఇలాగే ప్రవహిస్తున్నాయి.

ఎనిమిది నెలల తర్వాత వర్షానికి కూడా తెరిపివ్వకుండా అక్టోబర్‌లో మంచు కురిసింది. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే సుమారు ఇరవైమంది పిల్లలు రావటం లేదు. ఆ బిల్డింగ్‌లోని ఒక్క గదిని మాత్రమే హీట్ చేశాడు దారూ. కొండవైపు కిటికీ ఉన్న క్లాస్‌రూం బాగా చల్లగానే ఉంది.

తిరిగివచ్చి చూస్తే వాళ్లు కనిపించలేదు. అంటే కొండ శిఖరానికి దిగువన ఉన్నారన్నమాట. నిన్న రాత్రి మంచు కురవటం కాస్త తగ్గింది. మసక చీకటిగా ఉంది. మిట్ట మధ్యాహ్నమైనా నల్లటి మేఘాలింకా తొలగిపోలేదు. ఇప్పుడే తెలతెలవారుతున్నట్టుగా ఉంది. అయినా మూడు రోజులుగా ఉన్న చీకటితో పోల్చితే మెరుగే. మంచు, చలిగాలితో శరీరం గడ్డకట్టుకుపోయింది. పెరట్లో కోళ్లకు మేత వెయ్యటానికి, బొగ్గు తెచ్చి హీటర్‌లో వెయ్యటానికి తప్ప గదిలోంచి కదలలేదు. అదృష్టవశాత్తూ తాడ్జిడ్ నుంచి వచ్చిన డెలివరీ ట్రక్కు తనకు రెండురోజుల రేషన్ దినుసులు సరఫరా చేసిపోయింది. మరో రెండు రోజుల దాకా అది రాదు. ఇలాంటి అనివార్య పరిస్థితులను తట్టుకోవడానికి తయారుగానే ఉన్నాడు దారూ. స్కూలు కొచ్చిన పేద పిల్లల కుటుంబాలకు పంచటానికి గోధుమ బస్తాలు ఒక గదిలో పేర్చి ఉన్నాయి. క్షామం వచ్చినప్పుడు ప్రభుత్వం చేసే సాయమది. ఏ ఉపద్రవం సంభవించినా నష్టపోయేది పేదలే. వచ్చిన వాళ్లందరికీ రోజూ ధాన్యం పంచాడు. గత మూడు రోజుల స్టాకు నిల్వ ఉంది. మంచు కాస్త తెరిపిచ్చింది గనక, తమ కోటా ఇవ్వమని ఈ రోజు ఎవరో వస్తారు, మళ్లీ కోతల దాకా ఇదే ధాన్యంతో సరిపెట్టుకోవాలి. ఫ్రాన్సు నుండి ఓడలు వస్తూనే ఉన్నాయి. ఆకలి చావులుండకపోవచ్చు. కానీ పేదల మొహాల్లోని దైన్యాన్ని మరచి పోవటం కష్టం. నెలరోజులపాటు మండు టెండలతో నేల బీటలు వారింది. వందలాది పశువులు, ముఖ్యంగా గొర్రెలు మరణించాయి. అధికారికంగా ప్రకటించలేదుగాని, కొందరు మనుషులు కూడా ప్రాణాలు విడిచారు.

> నాకు నేను అద్వితీయుడిని. అంటే నా వంటివాడు ప్రపంచంలో మరొకడు లేడు. నా ప్రత్యేకత నాదే. ఇది ఎంత అల్పజీవికైనా వర్తిస్తుంది. కనుక వ్యక్తిత్వపు అద్వితీయత ప్రపంచానికి మూల సూత్రం.
>
> –కీర్క్‌గార్డ్

ఇంతటి దుర్భర దారిద్ర్యం మధ్య తను స్కూల్లో ఇంచుమించు సుఖంగా బతికినట్టే. కొన్ని సౌకర్యాలు లేకపోవచ్చు. సన్యాసిలాగ ఒంటరి జీవితం అయితేనేం... శుభ్రమైన ఇల్లు. వెల్లవేసిన గోడలు. మంచం, సోఫా, బీరువా, వారం వారం కొరత లేకుండా ఆహారం, నీళ్లు. అనుకోకుండా ఈ మంచు పడి తనక్కాస్త ఇబ్బంది కలిగించింది. ఈ ప్రాంతమంతా అంతే. ఇక్కడి పరిస్థితులు మానవ నివాసానికి యోగ్యమైనవి కావు. కాని, దారూ ఇక్కడ పుట్టి పెరిగిన మనిషి.

స్కూలు దాబా పైకెక్కి చూశాడు. ఆ ఇద్దరూ సమీపిస్తున్నారు. గుర్రం మీదున్న వాడు పోలీస్ కానిస్టేబుల్ బాల్డచ్చి. తాడుతో బంధించి ఒక అరబ్బువాణ్ణి లాక్కొస్తున్నాడు. రంగు వెలిసిన నీలి జుబ్బా, ముతకఉన్ని మేజోళ్లు, సాండల్స్ ధరించి తలొంచుకుని నడుస్తున్నాడు అరబ్బు.

దగ్గిరగా వచ్చేశారు.

“ఎల్ అమీర్ నుండి ఇక్కడికున్న ఈ మూడు కిలో మీటర్లు రావటానికి గంటపట్టింది” అంటూ అరిచాడు బాల్డచ్చి.

“లోపలకి వచ్చి ఒళ్లు కాచుకోండి” అంటూ ఆహ్వానించాడు దారూ. తాడు విడిచిపెట్టకుండా కాస్త కష్టంగా గుర్రం దిగాడు బాల్డచ్చి. “పరిస్థితి అర్థమయిందా?” అన్నట్లుగా మీసాల వెనకనుండి నవ్వాడు.

కళ్లెం తీసుకుని గుర్రాన్ని వెనక కట్టేసి వచ్చి, “క్లాస్‌రూం కూడా హీట్ చేస్తాను. ఇక్కడే కూర్చుందాం” అన్నాడు దారూ.

బాల్డచ్చి చేతికి కట్టుకున్న తాడు విప్పి అరబ్బును తాత్కాలికంగా బంధ విముక్తుణ్ణి చేశాడు.

“పక్కగదిలో కెళ్లు. నీ కోసం పుదీనా టీ చేస్తాను” అన్నాడు దారూ.

థాంక్స్ చెప్పి, బాల్డచ్చి విసుక్కుంటూ, “ఇటు...రా” అంటూ తన బందీని అరబిక్‌లో ఆజ్ఞాపించాడు.

దారూ టీ తెచ్చేసరికే, బాల్డచ్చి పిల్లల డెస్కు మీదా, అరబ్బు అతడి కాళ్ల దగ్గర కూర్చుని ఉన్నారు. అతడి చేతికున్న కట్లుచూస్తూ “కాసేపు విప్పొచ్చేమో!” అన్నాడు దారూ సందేహంగా.

“ఆఁ ఇప్పుడేమీ భయం లేదు. ప్రయాణంలో మాత్రమే చేతులు కట్టెయ్యాలి” అన్నాడు బాల్డచ్చి.

టీ గ్లాసు పక్కన పెట్టి దారూ కట్లు విప్పగానే మొదట రెండు చేతులూ రుద్దుకుని, టీ గ్లాసు పెదాలకు ఆనించుకున్నాడు అరబ్బు.

“ఇంతకూ ఎక్కడికి ప్రయాణం?” దారు అడిగాడు.

మీసాలు సవరించుకుంటూ. “ఇక్కడికే” అన్నాడు బాల్డచ్చి

“స్కూలుకొచ్చే పిల్లలు మీలాగా కూడా ఉంటారన్న మాట. ఇంతకూ రాత్రి ఇక్కడే గడుపుతారా ఏమిటి?” అంటూ నవ్వాడు దారూ.

“లేదు. నేను కాసేపట్లో ఎల్ అమీర్ వెళ్లి పోతాను. ఈ అరబ్బును మీరు టింగిట్ వద్ద అప్పచెప్పాలి. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుండి అధికారులు అక్కడికి వస్తారు”

దారూకు ఈ కేసేమిటో అర్థం కాలేదు.

“నాకేం సంబంధం?”

“నన్నేం చెయ్యమంటారు? అది పైనుండి వచ్చిన ఆర్డర్”

“నేను టీచర్ని”

“అయితే ఏమిటి? యుద్ధకాలంలో అందరూ అన్ని పనులూ చెయ్యాలి”

“కానీ... యుద్ధం ప్రారంభమైందని ఎవరూ ప్రకటించలేదే?”

“ఈ చర్చ అనవసరం. నాకు వచ్చిన ఆర్డర్స్ గురించి చెప్పాను. శాంతిభద్రతల పరిస్థితులు మారుతున్నాయి. తిరుగుబాటు జరిగే అవకాశముందని సంకేతాలు వచ్చాయి. మొబలైజేషన్ కూడా ప్రారంభమైంది”

ఇదంతా నమ్మలేనట్టుగా చూశాడు దారూ. పాత మిత్రుడికి నచ్చచెప్పటానికి

న్నట్టు బాల్డచ్చి,

"తొందర పడకు అన్నీ నెమ్మదిగా అర్థం చేసుకో. గస్తీ తిరగటానికి ఎల్ అమీర్ వద్దకు దజను మందిమి మాత్రమే ఉన్నాం. మేం కంట్రోల్ చెయ్యాల్సిన ఏరియా ఎంత పెద్దదో ఇప్పటికైనా తెలిసిందా? నేను త్వరగా వెళ్లాలి. వీణ్ణి నీకప్పచెప్పి వెంటనే తిరిగి రావాలని ఆర్డర్స్. అసలు ఇక్కడికెందుకు తెచ్చానను కుంటున్నారు? ఊళ్లో కాస్త ఉద్రిక్తంగా ఉంది. బందీని విడిచిపెట్టాలని గోల చేస్తున్నారు. ఇక్కణ్ణించి టింగిట్ ఇరవై కిలోమీటర్లే గదా. మీవంటి వస్తాదు ఆ మాత్రం నడవలేడూ! ఆ తర్వాత తిరిగివచ్చి తీరిగ్గా పిల్లలకు పాఠాలు చెప్పు కోవచ్చు"

పెరట్లో గుర్రం సకిలించింది. కిటికీలోంచి చూశాడు దారూ. కాస్త వెలుగొచ్చింది. త్వరలో మంచు కరుగుతుంది. ఎక్కడా పచ్చదనం కనిపించని ఈ ఎడారిలో మనుషులు మళ్లీ జీవనపోరాటం కొనసాగిస్తారు.

"ఏం చేశాడతడు? ఫ్రెంచివాడా?"

"ఒక్క ముక్క కూడా రాదు. నెల రోజులుగా వీడికోసం గాలించాం. మిత్రులూ, బంధువులూ దాచిపెట్టారు. తన కజిన్‌ను చంపాడు"

"ఇతడు మనకు శత్రువా?"

"కాకపోవచ్చు, కానీ, ఏమో! ఎలా చెప్పగలం?"

"ఎందుకు చంపాడు?"

నేను
ఆలోచిస్తున్నాను
కనుక నేను వున్నాను
-దెకార్త్

"కుటుంబ కలహం. ఒకడు మరొకడికి ధాన్యం బాకీ ఉన్నాడట. అసలు విషయమేమిటో స్పష్టంగా తెలియదు. గొర్రెల్ని కొక్కానికి వేళ్లాడదీస్తామే. దాంతో చంపాడు"

బాల్డచ్చి వైపు భయంగా చూశాడు అరబ్బు. దారూ అసహ్యంగా తలాడించాడు. ఈ మనుషులింతే. ద్వేషాలు, తక్షణ కోపాలు. ప్రతి చిన్న సమస్యకూ హత్యలే పరిష్కారమనుకుంటారు. జాతి నెత్తుట్లోనే ఉందేమో ఈ స్వభావం.

స్టౌ మీద కెటిల్ పాట పాడుతున్నది. ఇద్దరికీ మరింత టీ యిచ్చాడు దారూ. దాంతోనే ఆకలి తీర్చుకుంటున్నట్టు గబగబా తాగాడు అరబ్బు.

"వెళ్లొస్తాను మరి" అంటూ బాల్డచ్చి లేచి, తాడు తీసుకుని అరబ్బువైపు నడిచాడు.

"ఎందుకది?"

"మీ యిష్టం. దగ్గిర రివాల్వరుందా?"

"ఏదో ఒకటుందిలే"

"ఎక్కడ?"

"ట్రంకులో"

"తీసి దగ్గిర పెట్టుకోవాలి"

"భయపడాల్సిందేముంది?"

"తిరుగుబాటే గనక జరిగితే ఎవరూ ఎవర్నీ రక్షించలేరు. ఆత్మరక్షణ ఒక్కటే మార్గం"

"ఈ ఇల్లు కొండ మీదుందిగదా. వాళ్లు రావటం నాకు కనిపిస్తుందిలే"

"అది ఆత్మవిశ్వాసం కాదు. అతి నమ్మకం. నా కొడుకూ ఇలాగే అశ్రద్ధ చేశాడు. నా దగ్గర రెండు రివాల్వర్లున్నాయి. ఒకటి తీసుకోండి" అన్నాడు బాల్డచ్చి

నల్లటి పెయింట్‌తో టేబుల్ మీద నిగనిగా మెరిసింది రివాల్వర్. యూనిఫారం సవరించుకుంటున్న కానిస్టేబుల్ వైపు విసుగ్గా చూశాడు దారూ. తోలు వాసన, గుర్రం వాసనలతో ముక్కు పుటాలదిరాయి.

"బాల్డచ్చీ, నా మాట విను. ఇతణ్ణి చూస్తే నాకు అసహ్యమే. కానీ నా చేతుల్తో మళ్లీ పోలీసులకు మాత్రం అప్పగించను. యుద్ధం వస్తుందంటావా? అవసరమైతే నేనూ పోరాడుతాను. కానీ మనుషుల్ని పోలీసులకు పట్టిచ్చేడం పిరికిపంద లక్షణం"

"నువ్వో మూర్ఖుడివి. మనుషుల్ని అదుపులో ఉంచటమే నేరమనుకుంటావు. ఇన్నేళ్లొచ్చాయి. ఇంకెప్పుడు గ్రహిస్తావు. కొందర్ని బంధించక తప్పదు. అందుకు మనం సిగ్గు పడాల్సిందేమీ లేదు"

"నేను ఇతణ్ని ఎవరికీ అప్పగించే ప్రసక్తి లేదు"

"దిసీజ్ ఏన్ ఆర్డర్. రిపీట్ చెయ్యమంటావా?"

"నేను నీకు చెప్పిందాన్ని వాళ్లకు రిపీట్ చెయ్యి. మళ్లీ చెబుతున్నాను. ఇతణ్ణెవరికీ అప్పగించను"

"ఓకే. నేనెవరికీ ఏమీ చెప్పను. ఇతణ్ణి నీకు హేండోవర్ చేశాను. ఈ కాగితం మీద సంతకం పెట్టు. ఆ తరువాత నీ ఇష్టం"

"అక్కర్లేదు. నువ్వు నాకప్పగించావని అవసరమైనప్పుడు వాంగ్మూలమిస్తాను. సరేనా".

"నీ నిజాయితీ గురించి సందేహం లేదు. కానీ సంతకం చెయ్యక తప్పదు. దటీజ్ ది రూల్"

"ఇలా ఇవ్వు"

దారూ సంతకం పెట్టిన రసీదు మడిచి జేబులో పెట్టుకున్నాడు బాల్డచ్చి.

"పద. కాస్త దూరం నీ వెంట వస్తాను"

"అక్కర్లేదు. వెళ్లగలను. నువ్వు నన్ను అవమానించావు" అంటూ మరోసారి అరబ్బు వైపు చూసి గుమ్మం దాటాడు బాల్డచ్చి ముందుకు వెళ్లినవాడు కాస్తా, సడెన్‌గా వెనక్కు వచ్చి, కిటికీలోంచి చూసి వెళ్లాడు. మంచులో అడుగుల చప్పుడు కూడా వినిపించలేదు. గుర్రమెక్కి, కళ్లెం పట్టుకుని మరోసారి లోపలికి తొంగిచూశాడు. ఆ తర్వాత నెమ్మదిగా  కొండ దిగి అదృశ్యమయ్యాడు.

దారూ ఒకసారి బందీ వైపు చూసి అరబిక్‌లో "కాసేపిక్కడే కూర్చో" అని చెప్పి, మరేదో ఆలోచించి, రివాల్వర్ జేబులో పెట్టుకుని పక్కగదిలో కెళ్లాడు.

మంచంమీద పడుకుని. నిశ్శబ్దాన్ని వింటూ ఆలోచించాడు. యుద్ధం తర్వాత తానిక్కడికొచ్చిన కొత్తలో ఈ నిశ్శబ్దాన్ని భరించలేక గిలగిలా కొట్టుకున్న రోజులెన్నో! కొండ దిగువన , చిన్న గ్రామంలో ఏదైనా ఉద్యోగం కావాలని దరఖాస్తు పెట్టుకున్నాడు. మైదానానికీ, కొండ ప్రాంతానికీ ఉన్న సరిహద్దు యిది. ఎటు చూసినా రాళ్లూ రప్పలు తప్ప మనుషుల జాడే లేదు. అక్కడక్కడా నాగటిచాళ్లు కనిపించాయి. కానీ, ఆ దున్నినవాళ్లు పంటలకోసం కాక, ఇల్లు కట్టడానికి అవసరమైన రాళ్ల కోసమే ఇంత కష్టపడినట్టుంది. ఇక్కడ చిన్నపొదలు తప్పమరే మొక్కా ఎక్కడా కనిపించదు. ఇలాంటిచోట కూడా జనపదాలు వెలిశాయి. ఎక్కడినుండో మనుషులు గుంపులు గుంపులుగా వచ్చారు. సంసారాలు చేశారు. పిల్లల్ని కన్నారు. ఒకర్నొకరు చంపుకున్నారు. వేలాది మైళ్లు వ్యాపించిన ఈ ఎడారిలో అందరూ ఇసుక రేణువుల్లాంటివారే. తనైనా, తన అదుపులో ఉన్న ఈ అతిథైనా! కానీ... ఇక్కడి పరిస్థితులకు అలవాటుపడిన మనుషులు మరో చోట బతకగలరా?

లేచి కూర్చున్నాడు దారూ. పక్కగదిలో ఏ కదలికా లేదు. ఇదే అదనుగా అతడు పారిపోతే తన సమస్య తీరుతుంది. తొంగి చూశాడు. అక్కడే పడుకున్నాడు అరబ్బు. లోలోపలే మాట్లాడుకుంటున్నాడేమో. దళసరి పెదవులు కదులుతున్నాయి.

✡

"ఇటురా, ఆకలిగా ఉందా?" అంటూ పిలిచాడు దారూ.

ఆ ఆహ్వానం కోసమే నిరీక్షిస్తున్నట్లుగా గబుక్కున లేచాడు అరబ్బు.

టేబుల్ మీద ఇద్దరికోసం పళ్లాలు అమర్చి పిండిలో నూనె కలిపి, రొట్టె చేసి, గ్యాస్ స్టవ్ వెలిగించాడు దారూ. ఆ తర్వాత అల్మరాలో నుంచి జున్ను, గుడ్లు, ఖర్జూరాలు, పాలూ తీశాడు. అరబ్బు ఇదంతా ఆసక్తిగా గమనించాడు. ఆమ్లెట్ వేసి, తన అతిథిని 'రా' అంటూ ఆహ్వానించాడు. మర్యాదగా ఉంటుందనుకున్నా డేమో, రివాల్వర్ తీసి డ్రాయర్‌లో పెట్టాడు.

"తిను"

"మీరూ తినండి" అన్నాడు అరబ్బు.

"తర్వాత"

భయంగా, అనుమానంగా చూస్తూ.

"కేసు విచారించే జడ్జి మీరేనా?"అని అడిగాడు అరబ్బు.

"లేదు. రేపటిదాకా నిన్నిక్కడ ఉంచుకోవాలి. అంతే"

ఒక ఫోల్డింగ్ కాట్ వేసి, దానిమీద రెండు బ్లాంకెట్లు పరిచాడు దారూ. పడుకుంటే, అతడికి కాపలా కాయటం తప్పయింక చెయ్యాల్సిందేమీ లేదు.

"ఎందుకు చంపావు?"

అరబ్బు ఉలిక్కిపడ్డాడు.

"అతడు పారిపోవటానికి ప్రయత్నించాడు. వెంటాడి చంపక తప్పలేదు. నన్నేంచేస్తారు?"

"భయపడుతున్నావా?"

అరబ్బు మాట్లాడలేదు

"చేసిన పనికి విచారిస్తున్నావా?"

అరబిక్‌లోనే అడిగినా ఆ మాట అర్థం కానట్టుగా చూశాడు.

"ఇక్కడ పడుకో"

కాసేపాగి, "రేపు నా కోసం పోలీసులొస్తారా?" అని అడిగాడు అరబ్బు.

"తెలియదు"

"నా వెంట మీరు కూడా వస్తారా?"

"ఎందుకు?"

"రండి"

> ఏ నీతి సూత్రాన్ని నీవు విశ్వజనీన నీతి సూత్రంగా అంగీకరించబడాలని కోరుకుంటావో ఆ నీతి సూత్రం ప్రకారం నీవు ప్రవర్తించాలి.
> – కాంట్

అర్ధరాత్రి దాటింది. దారూకు నిద్రపట్టలేదు. బట్టలన్నీ విప్పేసి పడుకోవటం అతడి అలవాటు. అరబ్బు బిక్కపల్చగా ఉన్నాడు. తల్చుకుంటే అతణ్ణి పుటుక్కున విరిచెయ్యగలడు. తన అతిథి, మంచం మీద వాలాడు గాని కళ్లు మూసుకోలేదు.

రాత్రంతా ఈదురుగాలి వీచింది. చలికి తట్టుకోలేని కోళ్లు రెక్కలు కొట్టుకుంటూ గోలచేశాయి. అరబ్బు పక్కకు ఒదిగి పడుకున్నాడు. నిలకడగా ఉన్న ఊపిరిని బట్టి అతడు నిద్రపోతున్నాడని తెలిసింది.

దారూకు కొత్తగా ఉంది. ఏడాదిగా ఈ గదిలో తను ఒంటరిగా పడుకున్నాడు. ఈనాడు ఒక అనుకోని అతిథి తోడుగా ఉన్నాడు. తనూ ఇక్కడివాడే. అంటే తమిద్దరూ సోదరుల్లాంటి వాళ్లు. కానీ... సౌభ్రాతృత్వ భావనకది సమయం కాదు. సమూహంలో, గదులలో కలిసి వున్న వ్యక్తులు– ఆచ్ఛాదనలు తొలగించుకుని పక్కపక్కనే పడుకునే మనుషులు– ముఖ్యంగా సైనికులు, ఖైదీలు అన్నదమ్ముల్లా కలిసిఉంటారు. సమాజ నిర్మాణంలోని ప్రాథమిక సూత్రమిది. అభిప్రాయభేదాలెన్ని ఉన్నా సహజీవనం వల్లనే వ్యక్తుల్లో "అందరం ఒకటే" అనే అభిప్రాయం కలుగుతుంది.

ఈ సమయంలో ఇలా ఆలోచించినందుకు, దారూకూ తన మీద తనకే కోపం వచ్చింది. కాసేపైనా నిద్రపోక తప్పదు.

అరబ్బు కదిలాడు. ఊపిరి బిగపట్టాడు దారూ. నిశ్శబ్దంగా లేచాడు. అరబ్బు తలుపుతీసి, అడుగులోఅడుగు వేసుకుంటూ నిద్రలో నడుస్తున్నట్టు బయటికెళ్లాడు.

"పారిపోతున్నట్టుంది. పీడా వదిలింది" అనుకున్నాడు దారూ.

పెరట్లో నీళ్ల చప్పుడు వినిపించింది. మరి కాసేపటికి ఖైదీ లోపలికి వచ్చి మంచం మీద వాలాడు.

కలకూ, వాస్తవానికీ తేడా తెలియని స్థితిలో ఉన్నాడు దారూ.

మెలకువ వచ్చేసరికి తెల్లవారింది. అరబ్బుగాఢ నిద్రలో ఉన్నాడు. నోరు తెరుచుకుని ఉంది. కాఫీ తాగే టైమైంది. నెమ్మదిగా అతిథిని తట్టి లేపాడు. ఉలిక్కిపడినట్టుగా లేచాడు అరబ్బు.

"భయపడకు. లే"

కేకు తిని, కాఫీ తాగారిద్దరూ. కుళాయిదగ్గర కాళ్లూ, చేతులూ కడుక్కున్నాడు అరబ్బు. ఆ తర్వాత బ్లాంకెట్లు తీసి, మంచం మడిచి గోడకు పెట్టాడు. ఎండలో మంచు మెరుస్తోంది. డాబాపైకెక్కి ఎడారిని పరిశీలించి చూశాడు దారూ. బాల్డచ్చికి కోపం వచ్చినట్టే ఉంది అనుకున్నాడు.

అరబ్బు దగ్గుతున్నాడు.

ఎంత ఆలోచించినా, తన ఖైదీ అంత మూర్ఖమైన నేరం ఎందుకు చేశాడో అంతుబట్టలేదు దారూకు. పైగా, అవకాశమిచ్చినా పారిపోడేం?

కింద షెడ్డులో వంగి, వేళ్లతో పళ్లు తోముకుంటు న్నాడు అరబ్బు. కిందికి దిగివచ్చి అతడు డ్రెస్సు వేసుకునే దాకా నిరీక్షించాడు దారూ. కాసిని రస్కులు, ఖర్జూరాలు, చక్కెర ఓ పాకెట్లో వేసుకుని తన అతిథిని తీసుకుని 'పద' అంటూ ముందుకు కదిలాడు.

గంటసేపు నడిచి ఓ సున్నపురాయి పక్కన కూర్చున్నారిద్దరూ.

ఎండ చిటపటలాడుతోంది. కరిగిన మంచు ఇట్టే ఆవిరైపోతోంది. కింద నేల రాయిలాగ గట్టిపడింది. కనుచూపుమేరలో మరో మనిషి జాడలేదు. ఒంటరిపక్షి ఆకాశంలో అరుస్తూ వలయాలు తిరిగింది. స్వచ్ఛమైన గాలిని గుండెలనిండా పీల్చుకున్నాడు దారూ. ఎంత అలవాటైనా, ఎడారిలో నడవటం ప్రతిసారీ ఒక వింత అనుభవమే. దక్షిణంగా మరో గంట నడిచారు.

దూరంగా రాళ్లగుట్టలు కనిపించాయి. వెంట తెచ్చిన ఖర్జూరాలూ, బ్రెడ్డు, చక్కెర ప్యాకెట్టు ఇచ్చి "ఇంద, ఈ వెయ్యి ఫ్రాంకులు కూడా తీసుకో, ఇలా నేరుగా రెండు గంటలు నడిస్తే టింగిట్ వస్తుంది. అక్కడ పోలీసులు నీ కోసం నిరీక్షిస్తున్నారు. వెళ్లు" అంటూ తన అతిథికి వీడ్కోలు చెప్పాడు దారూ. సంచార తెగలు కూడా అక్కడే ఉంటాయి. వాళ్ళకు ఒక చట్టం, సామాజికన్యాయం ఉంటాయి. వాటికి తన అతిథి అతీతుడు కాదు.

తిరిగి స్కూలు వైపు నడిచాడు దారూ. అరబ్బు కదలకుండా అక్కడే నిల్చున్నాడు. దిగులుగా తనవైపే చూస్తున్నాడు. గొంతులో ఏదో అడ్డు పడినట్లున్నది. మరోసారి వెనుతిరిగి చూశాడు. అరబ్బు కనిపించలేదు.

నెమ్మదిగా కొండ ఎక్కి మరోసారి ఎడారినంతా గాలించి చూశాడు. దూరంగా కనిపించాడు అరబ్బు.

దారూకు గుండె బరువెక్కింది. క్లాసురూంలో బోర్డు ముందర తలొంచుకుని నిల్చున్నాడు.

ఫ్రెంచి నదులు మెలికలు తిరుగుతూ పరిగెత్తుతున్నాయి.

అయితే అతను తిరిగి వచ్చేలోగా–

"మా సోదరుణ్ణి శత్రువులకు అప్పచెప్పావు. నిన్ను వదిలిపెట్టం" అంటూ బోర్డు మీద రాశారెవరో.

ఇది తన మాతృభూమి. ఇక్కడే పుట్టిపెరిగిన తను ఇప్పుడు ఏకాకి.

# గోడ

## జాఁ పాల్ సార్త్ర్ (1905-1980)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



జననం: జూన్21న ప్యారిస్‌లో. బాల్యంలోనే తండ్రి మరణించాడు. తల్లీ, మాతామహుల పెంపకంలో చదువు ప్రారంభమైంది. (సార్త్ర్ తన శైశవాన్ని గురించి రాసిన ఆత్మకథ 'వర్డ్స్') 1925లో తత్వశాస్త్రంలో పట్టభద్రుడైనాడు. ఆ తర్వాత కొంతకాలం లేన్, లీహార్వే, న్యూలీలలో విద్యాబోధన. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రతిఘటనోద్యమంలో చేరాడు. సార్త్ర్ 1940లో జర్మన్ సేనలకు చిక్కి తొమ్మిది నెలలు యుద్ధఖైదీగా గడిపాడు. విడుదల తర్వాత ఒక రహస్య పత్రిక 'కాంబట్'కు రచనలు చేశాడు. ఆ పత్రిక సంపాదకుడు, మరో నోబెల్ గ్రహీత అయిన ఆల్బర్ట్ కామూ. సార్త్ర్ అధ్యాపక వృత్తిలో ఉన్నప్పుడు ఈజిప్టు, జర్మనీ, గ్రీస్ దేశాలు పర్యటించాడు. ఆ దశలోనే ఎడ్మండ్ హుస్లెర్, మార్టిన్ హైడెగర్, సోరెన్ కీర్క్‌గార్డ్‌ల తాత్విక ధోరణులు అతణ్ణి ప్రభావితం చేశాయి. 1964లో నోబెల్ బహుమతిని తిరస్కరించి మేధావి లోకాన్ని షాక్ చేశాడు. 'సెకండ్ సెక్స్' రచయిత్రి సిమోన్ దుబోదాతో గడిపిన సహజీవనం (వివాహం కాలేదు) జగద్విదితం.

'ఎగ్జిస్టెన్షియలిజం' (అస్తిత్వవాదం) తాత్విక ధోరణిని సార్త్ర్ కొత్తగా ప్రతిపాదించనప్పటికీ, దానికి అతడి రచనలు– ముఖ్యంగా బీయింగ్ అండ్ నథింగ్‌నెస్ (1943) వల్ల ప్రాచుర్యం వచ్చింది. సమకాలికులకూ, తర్వాతి తరం మేధావులకూ, రచయితలు, కళాకారులకూ ఒక సరికొత్త లౌకిక దృష్టిని పరిచయం చేసింది. సార్త్ర్ సిద్ధాంతం ప్రకారం అస్తిత్వవాదమంటే– 1. నాస్తికత లేదా నిరీశ్వర వాదం. దేవుడు ఒక వైయక్తిక విశ్వాసం మాత్రమే. వ్యక్తి తన అవసరం కోసం సృష్టించుకున్న ఒక భ్రమ. 2. అంతర్లీనమైన నైరాశ్యం, మానవ పరిధిని మించిన 'విధి' లేదు. 3. మానవ ప్రయత్నం పట్ల అచంచల విశ్వాసం. అభ్యుదయం లేక మనుగడ లేదు.

రచయితగా సార్త్ర్ మీద అమెరికన్ రచయితలు డాస్ పాసాస్, విలియం ఫాక్నర్‌ల ప్రభావం ఉంది. మానసిక విశ్లేషణ ప్రధానంగా సాగిన తొలి నవల 'నాసియా' (1938)కు సార్త్ర్ తాత్విక ధోరణిని ప్రతిఫలింపజేసిన నవలగా గుర్తింపు ఉంది. స్పానిష్ సివిల్ వార్ నేపథ్యంలో సాగిన నవలాత్రయం 'ఏజ్ ఆఫ్ రీజన్', 'రిప్రీవ్', 'ఐరన్ ఇన్ ది సోల్' అతడి సాహితీ ప్రతిభకు పరాకాష్ఠ.

1930వ దశకంలో జనరల్ ఫ్రాంకో నియంతృత్వం నుండి స్పెయిన్‌ను విముక్తం చేయటానికి అక్కడ ప్రజాసైన్యానికి అండగా ప్రపంచవ్యాప్తంగా అభ్యుదయ కాముకులైన యువతీ యువకులు, రచయితలు, కళాకారులు, మేధావులు ఆయుధాలు పట్టుకున్నారు. ఇంగ్లండుకు చెందిన క్రిస్టఫర్ కాడ్వెల్, జార్జి ఆర్వెల్, ఆర్థర్ కోస్లర్, ఫ్రెంచి రచయితలు ముఖ్యంగా ఆంద్రె మాల్రా వగైరా. 'గోడ' కథ నేపథ్యం ఇదే. ఇందులో అస్తిత్వవాదాన్ని గురించిన చర్చ ప్రస్ఫుటంగా కనిపించనప్పటికీ ప్రధాన పాత్ర మనస్తత్వం దాన్నే ప్రతిబింబిస్తుంది.

మమ్మల్ని లోపలికి నెట్టేశారు. విశాలమైన గది. తెల్లటి గోడలు. లైట్ల వెలుగుతో కళ్లు మూసుకుపోయాయి. ఎదురుగా ఒక టేబుల్ వెనక నలుగురు కూర్చున్నారు. సివిలియన్ దుస్తుల్లోనే ఉన్నారు. మేం నడిచి వస్తున్నప్పుడు పక్కగదిలో ఖైదీలు కనిపించారు. అందులో కొందరు నాకు తెలుసు. మరికొందరు విదేశీయులు. నా ముందు వరుసలో ఇద్దరు ఫ్రెంచి వాళ్లూ ఉన్నారు.

విచారణ మూడు గంటలు జరిగింది. తల దిమ్మెక్కినట్టుగా ఉంది. గదిని హీట్ చేశారు కాబోలు, సుఖంగానే ఉంది. బయట ఉన్న ఇరవై నాలుగ్గంటలూ చలికి గట్టకట్టుకు పోయాం. గార్డ్సు మాలో ఒక్కొక్కర్నే టేబుల్ ముందుకు నెట్టారు. నలుగురు ఆఫీసర్లు మా పేర్లూ, వృత్తి కనుక్కున్నారు. అంతకన్నా ఎక్కువ ఏమడగాలో వాళ్లకు తెలిసినట్టులేదు. అప్పుడప్పుడూ "ఆయుధాల గురించి నీకేమన్నా తెలుసా?" లేక "తొమ్మిదో తారీకు ఉదయం ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు?" అంటూ వాకబు చేశారు. మా జవాబులు వినే ఓపికకూడా వాళ్లకున్నట్టు లేదు.

"ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌లో ఉన్నారా?" అంటూ టామ్‌ను ప్రశ్నించారు. అతడి జేబులో దానికి సంబంధించిన పత్రాలు వాళ్లకు దొరికాయి. టామ్ చెప్పటానికి మాత్రమేముందని! జువాన్‌నేమీ అడగలేదు. ఏదో రాసుకుంటూ కూర్చున్నారు.

"నా తమ్ముడు జోస్ అనార్కిస్టు. అతడిక్కడలేడు. నాకే పార్టీతోనూ, ఏ రాజకీయాలతోనూ సంబంధం లేదు" అన్నాడు జువాన్.

వాళ్లు మాట్లాడలేదు.

"నేనే నేరం చెయ్యలేదు. ఎవరో చేసిన దానికి నాకెందుకు శిక్ష?"

గార్డు అతణ్ణి పక్కకు లాక్కెళ్లాడు.

ఇక నా వంతు.

> రెండో పక్కకి కూడా
> రెండో పక్క వుంటుందని
> గుర్తుపెట్టుకో.
> –తాళ్ళ వలస సామెత

"నీ పేరు పాబ్లో ఇబీటా?"

"ఔను"

కాగితాలు చూస్తూ, "రేమన్ గ్రిస్ ఎక్కడ?" అంటూ అడిగాడు.

"తెలియదు"

"ఆరు నుంచి పందొమ్మిదో తారీకు దాకా అతణ్ణి నువ్వు మీ ఇంట్లో దాచావు"

"నో"

నన్ను బయటకు నెట్టారు. టామ్, జువాన్‌లకు ఇరువైపులా గార్డులు. ముగ్గురం కలిసి ముందుకు నడిచాం.

"సో?" అన్నాడు టామ్ గార్డ్ వైపు చూస్తూ.

"సో వాట్?"

"ఇందాక జరిగింది క్రాస్ ఎగ్జామినేషనా లేక విచారణా? శిక్ష వేశారా?"

"వేశారు"

"మమ్మల్నేం చేస్తారు?"

"సెల్‌కు వెళ్లాక చెబుతాం"

హాస్పిటల్ సెల్లార్‌నే మా సెల్‌గా మార్చారు. బాగా చల్లగా ఉంది. రాత్రంతా గజగజా వణుకుతూ గడిపాం. తెల్లవారినా పరిస్థితి మారలేదు. ఇక్కడికి వచ్చేముందు అయిదు రోజులు ఒక మొనాస్టరీ –అది మధ్య యుగాలనాటి కట్టడం– సెల్‌లో గడిపాను. ఖైదీ లెక్కువ. జైళ్లలో చోటు లేదు. ఎక్కడ కాస్త చోటు దొరికితే అక్కడ కుక్కేస్తున్నారు. చలి కన్నా ఒంటరితనాన్ని భరించటం కష్టం. జువాన్ ఎక్కువ మాట్లాడడు. భయపడ్డాడనుకుంటాను. పైగా కుర్రవాడు. టామ్ బాగానే మాట్లాడతాడు. స్పానిష్ భాష కూడా తెలుసు."

సెల్లార్‌లో ఒక బెంచీ, నాలుగు చాపలు ఉన్నాయి.

కాసేపటికి "ఇక మన పని ముగిసింది" అన్నాడు టామ్.

"ఆc అలాగే కనిపిస్తున్నది. కనీసం కుర్రాణ్ణి స్పేర్ చేస్తారనుకుంటా" అన్నాను.

"వాడి మీద నేరమేమీ లేదు. వాడి బ్రదర్ కారణంగా అరెస్టు చేశారంతే"

జువాన్ మా మాటల్ని వినలేదు కాబోలు. "సారగోసాలో ఏం చేస్తారో తెలుసా? రోడ్డు మీద ఆ మనుషుల్ని అడ్డంగా పడుకోబెట్టి ట్రక్కులు నడిపిస్తారు. అలా బులెట్లు పొదుపు చేస్తారు"

"పెట్రోలు పొదుపు సంగతేమిటి" అన్నాను చికాకుగా.

టామ్ తన కబుర్లాపలేదు.

"సైనికులు ఇదంతా సూపర్వైజ్ చేస్తారు. మనుషుల్ని వెంటనే చంపుతారను కున్నావేమిటి? కొన ప్రాణంతో జనం హాహాకారాలు చేస్తూనే వుంటారు. కనీసం గంటసేపు"

"మనకా గతి పట్టకపోవచ్చు. వీళ్లకు బుల్లెట్ల కొరత లేదు"

గోడకున్న రంధ్రాల గుండా వెలుగు సెల్లార్‌లోకి ప్రసరించింది. కొద్దిగా ఆకాశం కూడా కనిపించింది. ఇక్కడ బొగ్గు నిలువ చేస్తారు కాబోలు – ఆస్పత్రిని హీట్ చెయ్యటానికి. పేషెంట్లు లేరుగాని బొగ్గు మిగిలింది.

"చలి భరించలేను" అంటూ లేచి వ్యాయామం ప్రారంభించాడు టామ్. లావుగా ఉంటాడు. పెరిగిన పొట్టా, పిరుదులూ. మరి కాసేపట్లో బాయ్‌నెట్స్ ఈ కొవ్వులోకి దూసుకుపోతాయి. అతడు సన్నగా ఉంటే నాకిలాంటి ఆలోచనలు రాకపోయేవి కాబోలు.

నాకూ చలిగానే ఉంది. మా దుస్తులన్నీ సైనికులు తీసుకున్నారు. ఆస్పత్రి వాళ్లిచ్చిన షర్టూ, పాంటూ తప్ప మరేం లేవు మా ఒంటి మీద.

ఎనిమిదింటికి మేజర్ వచ్చి పేర్లడిగాడు. "స్టీన్ బాక్, ఇబీటా, మిర్బాల్" అన్నాడు గార్డు.

"మీకు మరణ శిక్ష విధించారు. రేపుదయం ఫైరింగ్ స్క్వాడ్ వస్తుంది." అన్నాడు మేజర్ కళ్లద్దాలు సవరించు కుంటూ.

"అన్యాయం. నన్నెందుకు చంపుతారు?" అన్నాడు జువాన్.

"నీ పేరేమిటన్నావ్?"

"జువాన్ మిర్బాల్".

"ఈ లిస్టులో నీ పేరుంది గదా"

"నేనే నేరం చెయ్యలేదు".

"నువ్వు బాస్కువా?"( స్పెయిన్ నుండి విడిపోవాలనుకుంటున్న ఒక ప్రాంతంలోని వాళ్లను 'బాస్క్'లంటారు.)

"మా ముగ్గుర్లో ఎవరూ బాస్క్ కాదు"

మేజర్ విసుక్కున్నాడు.

"మీరు ముగ్గురూ బాస్కులని చెప్పారే? నాకెందుకీ గొడవ. మొత్తం మీద మీకు ప్రీస్ట్ అక్కర్లేదు గదా!"

(మరణానికి ముందర ప్రీస్టు వచ్చి ఆశీర్వదించటం ఆచారం.)

"కాసేపట్లో ఒక బెల్జియన్ డాక్టర్ వచ్చి మీతో చివరి క్షణాలు గడుపుతాడు." అని చెప్పి వెళ్లిపోయాడా మేజర్.

"పాపం. కుర్రాడికన్యాయం జరిగింది". అన్నాను మర్యాద కోసం. నిజానికి వాడంటే నాకిష్టం లేదు. ప్రాణ భయంతో మూడు రోజుల్లోనే వాడి రూపం మారిపోయింది. కళ్ళు తేలేశాడు. వదిలిపెట్టినా మళ్లీ మామూలుగా బతకగలడనుకోను. జాలి చూపవచ్చు. కాని జాలంటే నా కసహ్యం. భయం కూడా. టామ్ వాణ్ణి ముట్టుకోబోతే విదిలించుకున్నాడు.

ఎదుటి వ్యక్తిని ఓదార్చటంలో తన భయం కూడా కొంత తగ్గుతుంది. మృత్యువు గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. కాని ఇప్పుడది నన్ను తన వెంట రమ్మంటోంది.

తలుపు తెరుచుకుంది. ఇద్దరు గార్డులు ప్రవేశించారు.

"నేను డాక్టర్ని. మీకు తోడుగా ఉండటానికొచ్చాను" అంటూ మూడో మనిషి పరిచయం చేసుకున్నాడు.

"ఏం చేస్తావు నువ్విక్కడ?"

"మీరు చివరి క్షణాలు వీలైనంత ప్రశాంతంగా గడపటానికి సాయం చేస్తాను."

"ఆస్పత్రిలో చాలామంది డాక్టర్లున్నారు. ప్రత్యేకంగా మిమ్మల్నెందుకు పిలిపించారు?"

"తెలియదు. సిగరెట్లు కావాలా? సిగార్స్ కూడా ఉన్నాయి"

అక్కర్లేదన్నాం. "ఎవరి దయా మాకక్కర్లేదు. మేం అరెస్టయిన రోజున బారక్స్‌లో నిన్ను చూశాం. ఫాసిస్టులతో ఉన్నావుగదా!"

ఇంకా మాట్లాడలనుకున్నాను. కాని ఎందుకో సడెన్‌గా కోరిక చచ్చిపోయింది.

డాక్టరు నా వైపు పరిశీలనగా చూశాడు. గార్డులు చాపల మీద కూర్చున్నారు. అందులో కాస్త పొడుగ్గా ఉన్నవాడి పేరు పెడ్రో.

"లైట్ కావాలా?" అనడిగాడు వాడు.

"కావాల"న్నాడు డాక్టర్.

పెడ్రో దీపం తీసుకొచ్చాడు.

తల తిరిగినట్లైంది. మృత్యు భయం కాదు. పేరు లేని మరేదో భయం ఆవహించింది.

టామ్ చేతుల్లో మొహం దాచుకున్నాడు. మెడ తెల్లగా కన్పిస్తోంది.

డాక్టరు జువాన్ పల్స్ చూశాడు. ఒక చేతిలో గడియారం, మరో చేతిలో ముంజేతిని పట్టుకున్నాడు.

'బాస్టర్డ్. నా దగ్గరికొస్తే ఒక్కటిచ్చుకుంటాను' అనుకున్నాను.

నా వైపు చూసి, "ఇక్కడ చలెయ్యటం లేదూ?" అనడిగాడు డాక్టర్.

> విరిగిన చేతిని
> బైటకు తీసి అందరికీ
> చూపించకు.
> – చీనా సామెత

చలికి అతడి చర్మం నీలం రంగుకు మారింది.

"లేదు"

చెమట పట్టింది. గడ్డ కట్టించే ఈ చలిలో చమట! షర్టు ఒంటికతుక్కుపోయింది. మొహమంతా తడి. తనకేం కాదని తెలుసు గనక వాడికి చలేసింది. మా పరిస్థితి వేరు.

చెమట ధారగా కారింది. జేబు రుమాలు, షర్టు, ప్యాంటు తడిసి ముద్దయ్యాయి. స్నానం చేస్తున్నట్లుగా ఉంది.

"మీరు డాక్టరా!" అడిగాడు జువాన్ అకస్మాత్తుగా.

"అవును"

"నొప్పిగా.... ఉంటుందా?"

"అప్పుడా? లేదు. ఏం జరుగుతుందో కూడా తెలియదసలు. కనురెప్ప వేసేలోగా అంతా జరిగిపోతుంది.

"కొన్నిసార్లు... రెండు సార్లు ఫైర్ చేస్తారట గదా?"

"అరుదుగా. మొదటి బులెట్ గుండెకు తాకకపోతే మరోసారి కాల్చక తప్పదు మరి"

అంటే, వాళ్లు మళ్లీ రైఫిల్స్ లోడ్ చేసుకుంటారు... కొంత టైం పడుతుంది.

కుర్రవాడు. మరణం కన్నా బాధంటే భయం.

నేను లేచి అటూ యిటూ నడిచాను. బూట్లు కిర్రు కిర్రుమని చప్పుడు చేశాయి. టామ్ నా వైపు విసుగ్గా చూశాడు.

అతడికీ చెమట పట్టింది. టామ్, నేను– ఒకరి ప్రతిబింబం ఒకరిలో కనిపిస్తోంది.

మేం మృతులం లేదా చావబోతున్న వాళ్లం. బతికున్న వాడు బెల్జియన్ ఒక్కడే.

"రేపుదయం మనల్ని ఓపెన్ యార్డ్‌లో నిలబెట్టి... ఎంత మంది వస్తారు?"

"ఐదు లేదా ఎనిమిది"

"మనం గోడకు నిలబడతాం. అంతేగదా. రక్షణ కోసం. గోడలో దాగిపోవాలని ప్రయత్నిస్తాం. చివరకు మిగిలేది గోడ మాత్రమే."

"మన శరీరాలు గుర్తుపట్టలేకుండా ఉండాలని వాళ్లు కళ్లకూ, నోటికీ గురిపెట్టి కాలుస్తారు. రేపటి బాధ ఇప్పుడే అనుభవించవచ్చు"

"తరువాత మనం పూల మొక్కలకు ఎరువుగా మారతాం"

టామ్ తనలో తాను మాట్లాడుకున్నాడు.

"జరిగిపోతుందని తెలుసు. జరగక తప్పదనీ తెలుసు. తరువాత ఏమీ మిగలదనీ తెలుసు. కానీ ఏమిటిదంతా? ఎందుకు?"

'తుపాకుల మోత'. బుల్లెట్లు. నేను మెటీరియలిస్టుని. నా శవాన్ని నేను చూడగలుగుతున్నాను. నేనుండను. లోకం సజావుగా సాగిపోతుంది. పాబ్లో, మనం అలాంటి విషయాలాలోచించగూడదు"

"షటప్. ఏమిటా పిచ్చి ఆలోచనలు. ప్రీస్టు కావాలా ఏమిటి?" అంటూ మందలించాను.

బుల్లెట్లకెదురు నిల్చిన వాళ్లందరూ ప్రవక్తలవుతారనుకుంటున్నట్టుంది. ఐరిష్ వాళ్లది కాస్త ఉద్వేగ స్వభావం. టామ్ ఐరిష్ జాతీయుడు! అతడి దగ్గర మూత్రం వాసన వచ్చింది. ఇలాంటి సమయాల్లో సానుభూతి చాలా ప్రమాదకరం. ఇది సహజ మరణం కాదు. కాని ఈ లోకంలో ఏది సహజం? ఈ బొగ్గు, దుమ్ము, బెంచి, పెడ్రో పిడకల మొహం– ఏదీ సహజంగా లేదు. టామ్ అప్పుడే మొహం మీద చావు ముసుగు కప్పుకున్నాడు. నాకూ, టామ్‌కూ పోలిక లేదు. కాని కలిసి చస్తున్నాం గనక కవలల్లాగున్నాం.

"ప్లాబో, అంతా ముగిసినట్టేనా?" అన్నాడు టామ్.

"చావు సంగతి సరే, కాస్త కనీస మర్యాదలు పాటించవా!"

వాణ్ణి చూస్తే అసహ్యమేసింది. కంట్రోల్ లేకుండా మూత్రం కారిపోతుంది.

"ఏమైంది?" అన్నాడు టామ్ భయంగా.

"ఉచ్చ పోసుకుంటున్నావు"

"లేదే. నాకు తెలియదు"

దొంగ సానుభూతితో బెల్జియన్ "ఏమైనా ప్రాబ్లమా?" అనడిగాడు.

"ఎలా జరిగిందో తెలియదు. నేను భయపడటం లేదు" అన్నాడు టామ్ రోషంగా.

బెల్జియన్ మమ్మల్ని పరిశీలిస్తూ నోట్స్ తీసుకున్నాడు. బతికున్న వాళ్లకూ మాకూ ఎంత తేడా! అతడికి శరీరం చెప్పినట్లు వింటుంది. దానికి చలేస్తుంది. చక్కటి కండరాలు. మాకో.... శరీరాల గురించిన స్పృహ కూడా లేదు.

బెల్జియన్ జువాన్ మెడ తాకి చూశాడు. అది ప్రేమా? సానుభూతా? లేక వృత్తిపరమైన పరిశీలనా? జువాన్ హఠాత్తుగా అతడి చెయ్యి కొరకటానికి ప్రయత్నించాడు. బెల్జియన్ విడిపించుకుని దూరం జరిగాడు. మాకూ, అతడికీ ఉన్న తేడా ఇప్పటికైనా తెలిసి వచ్చిందనుకుంటాను.

తెల్లవారక తప్పదు. కాని దాన్ని గురించి ఆలోచించటమెందుకు? మరణం ధ్రువం. దాని గురించి ఏం మాట్లాడతాం? అంతా అర్థరహితమే. శుష్కపదాలు. మావైపు గురిచూస్తున్న రైఫిల్ బారెల్స్. చంపేదీ, చచ్చేదీ ఒక్కసారే కాని నిరంతరంగా దాని గురించే ధ్యానం... డజన్లసార్లు, వందల సార్లు. ఒక నిమిషం కునుకు పట్టిందేమో. గార్డులు నన్ను లాక్కెళుతున్నారు. నేను పెనుగులాడుతున్నాను. రక్షించమని ప్రాధేయపడుతున్నాను.

మెలకువ వచ్చింది. బెల్జియన్ వైపు చూశాను. నిద్రలో బహుశా ఏడ్చి

ఉంటాను. ఏమీ పట్టించుకోనట్టుగా అతడు మీసాలు నిమురుకుంటున్నాడు.

గత రెండు రోజులుగా – నలభై ఎనిమిది గంటల్నించీ నిద్రలేదు. ఇక మెలకువగా ఉండటం సాధ్యం కావటం లేదు. అప్రయత్నంగానే కళ్లు మూతలు పడుతున్నాయి. మృత్యు ముఖంలో మాత్రం నిద్రా సుఖమెందుకొదులుకోవాలి! తెల్లవారుజామున వాళ్లెట్లాగూ వస్తారు. జంతువులాగ చావటమెందుకు?

నిద్రలో పీడకలలు వస్తాయని లేచి పచారు చేశాను. ఆలోచనలు తిరగ బెట్టాయి. తెలిసిన మొహాలు... సంఘటనలు... నా కళ్ల ముందు దారుణంగా చిత్ర హింసలకు, హత్యలకు గురైన వ్యక్తులు... నా బంధువులు... రేమన్ గ్రిస్... గతమంతా కళ్ల ముందర కనిపించింది. 1926లో మూడు నెలలు ఉద్యోగం లేక తిరిగాను. ఆకలితో మరణించినంత పనైంది. గ్రనాడాలో బెంచి మీద గడిపిన రోజులు... మూడు రోజులు తిండి లేదు. తెలియని కోపం... ఎందుకు కుక్కలా చావటం, బతకాలి. జీవితంలో కావలసింది ఆనందం, స్త్రీలు, స్వేచ్ఛ. స్పెయిన్‌ను విముక్తి చెయ్యాలని ఆశయం. అనార్కిస్టు ఉద్యమంలో చేరాను. పబ్లిక్ మీటింగులలో ఉపన్యసించాను. "నాకు చావు లేదు" అన్నంత స్వేచ్ఛగా తిరిగాను.

ఇలా చావబోతున్నానని తెలిస్తే అవన్నీ చేసేవాణ్ణా? ఇంకా ఎన్ని గంటలుంది? అందమైన జీవితం అని అనుకో వాలనిపిస్తోంది. ఏమీ తెలియదు. తెలుసుకోవలసిందీ లేదు. చెయ్యాలనుకుని చెయ్యలేని పనులనేకం మిగిలి పోయాయి. కాడిజ్ ప్రాంతంలో సముద్రస్నానం చెయ్యాలని కోరిక. కాని మృత్యు ముఖంలో ఏ ఆలోచనకూ విలువ ఉండదు.

> కొందరికి మతి మరుపు ఎక్కువుంటుంది. వాళ్ళు ఇంగిత జ్ఞానాన్ని ఇంట్లో ఒదిలేసి వస్తారు.
> –విజయనగరం సామెత

"ఫ్రెండ్స్, పై అధికార్లు అనుమతిస్తే మీకో సహాయం చేస్తాను. మీ వాళ్లకు మీ జ్ఞాపకార్థం ఏదైనా ఇవ్వండి" అన్నాడు బెల్జియన్ సడెన్‌గా నవ్వుతూ.

"నాకెవరూ లేరు" టామ్ సమాధానం.

నేను మాట్లాడలేదు.

"నీకు ప్రియురాలు ఉందిగా?" అన్నాడు టామ్ మళ్లీ నాతో.

"నో"

ఎందుకీ దొంగ ప్రేమ. దొంగ దాతృత్వం! నా ప్రియురాలి గురించి నిన్న మాట్లాడటం నాదే పొరబాటు–ఇప్పుడామెను చూడాలనే కోరిక లేదు. ఆమెతో మాట్లాడవలసిన మాటలూ లేవు. ఆమె సన్నిధి, సాంగత్యం ఇప్పుడు బహుదూరం. చెమట. భయం ఆమె గురించి. నేను లేనని తెలిసి ప్రియురాలు ఏడుస్తుంది. కొన్నాళ్లు తిండి ముట్టదు. ఇవన్నీ సాధారణ విషయాలు. కాని మరణించేది మాత్రం నేను. స్వచ్ఛమైన నీటి చెలమల్లాంటి ఆమె కళ్లు... ఆమెను చూస్తే చాలు ఏదో విద్యుత్ ప్రవహిస్తుంది నాలో. ఇప్పుడదంతా ముగిసింది. ఆ చూపు నాదాకా ప్రయాణించదు. ఆమె వద్దే ఆగిపోతుంది.

టామ్ కూడా ఒంటరిగానే ఉన్నాడు. కాని ఎవరి ఒంటరితనం వారిది. కింద కూర్చుని బెంచీకేసి చూస్తున్నాడు. దాన్ని ముట్టుకుంటే విరిగిపోతుందేమోన న్నట్టు. వస్తువుల ఉనికికి కొత్త అర్థం కనిపిస్తోంది. వాటి సాంద్రత తగ్గి కరిగి, అదృశ్యమవుతున్నట్టుగా ఈ బెంచి, దీపం, బొగ్గు గుట్ట నా మరణాన్ని గుర్తు చేస్తున్నాయి. మరణం ఏమిటో స్పష్టంగా తెలియదు గాని అంతా కలగాపులగంగా కనిపిస్తోంది. అంతటా–వాతావరణంలో, గదిలో, మనుషుల మొహాల్లో, ప్రవర్తనలో–నాకూ లోకానికీ మధ్య దూరం పెరుగుతోంది. డెత్ బెడ్ మీద ఉన్న వాడితో ఎంత ప్రేమగా మాట్లాడినా ఇద్దరి మధ్యన తరగని దూరం ఉంటుందే – అలాగ. టామ్ బెంచిని తాకితే మృత్యువును తాకినట్టే.

సడెన్‌గా ఎవరైనా వచ్చి "విడుదల చేస్తున్నాం. వెళ్లిపో" అని చెప్పినా నా పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం లేదు. మృత్యువు అనివార్యమని తెలిసినప్పుడు – నిరీక్షణ కొన్ని గంటలైనా, రోజులైనా, వారాలైనా ఒకటే. జీవితం శాశ్వతం కాదన్న సత్యం అవగతమైంది. భ్రమ తొలగింది. నా కళ్లు చూస్తున్నాయి. చెవులు వింటున్నాయి. కాని అవి నేను కాదు. శరీరం వణుకుతున్నది. కాని దాన్ని గుర్తించటం మానేశాను. ముట్టుకుని చూస్తే తప్ప ఇది నా శరీరమని తెలియటం లేదు. విమానం నోస్‌డైవ్ చేస్తున్నట్టుగా ఉంది. బరువు తగ్గినట్టుగా నేల కూలిపోతున్నట్టుగా శరీరాన్ని చూస్తే అసహ్యమేస్తోంది. – ఏదో ఒక తుచ్ఛకీటకం నన్ను పెనవేసుకున్నట్టుగా ప్యాంటు తడిగా ఉంది.

ఎందుకైనా మంచిదని బొగ్గు గుట్ట వద్ద మూత్రం పోసుకుని వచ్చాను.

"మూడున్నర" అన్నాడు బెల్జియన్.

బాస్టర్డ్. కావాలని పనిగట్టుకుని చెప్పాడు. టామ్ ఉలిక్కిపడ్డాడు. అవును, టైం దగ్గర పడుతోంది. నిరాకారమైన శిలలాగ రాత్రి మమ్మల్ని కమ్ముకుంది.

కుర్రాడు జువాన్ ఏడుపు ప్రారంభించాడు.

"నేను చావను. రక్షించండి. నాకు చావాలని లేదు" నిస్సహాయంగా చేతులూపుతూ అటూ ఇటూ పరిగెత్తాడు. ఓదార్చే ప్రయత్నం చెయ్యకుండా టామ్ అతడి వైపు జాలిగా చూశాడు. కుర్రాడి గోల మరింత పెరిగింది. పెద్ద రోగంతో బాధపడుతున్నవాడు కాస్త జ్వరంగా ఉందని నచ్చచెప్పుకున్నట్టుగా ఉంది. ప్రాణాంతకమైన జబ్బు వచ్చినప్పుడు జ్వరముండదు.

ఏడవటమంటే మన మీద మనం జాలిపడటం– అంటే కుర్రాడు మృత్యువు గురించి ఆలోచించటం లేదు. నాకూ లోపల దుఃఖంగానే ఉంది. క్షణమైనా ఏడ్వాలని... కాని సరిగ్గా దానికి వ్యతిరేకంగా జరిగింది. మనిషి లక్షణం తగ్గినట్టనిపించింది. ఎవరి మీదా జాలి కలగలేదు. నా మీద నాకు అస్సలు జాలిలేదు. ఏడుపులూ పెడబొబ్బ లెందుకు. 'శుభ్రంగా డీసెంట్‌గా చావాలి' అనుకున్నాను.

టామ్ లేచాడు. గోడ కన్నం లోంచి వెలుగు కనిపించింది. తెల్లవారుతోంది. 'క్లీన్'గా చావాలి. కాలం ఎగిరిపోతుంది. చుక్కలు చుక్కలుగా కారిపోతోంది.

'విన్పించిందా?' అన్నాడు టామ్. ఇంకా పూర్తిగా వెలుగు రాలేదు.

బైట కోర్ట్‌యార్డులో జనం కవాతు చేస్తున్నారు.

"ఆс. విన్నాను"

"ఎందుకు తిరుగుతున్నారు? చీకట్లోనే షూట్ చెయ్యరు గదా!"

మరి కాసేపటికి బూట్ల చప్పుడు తగ్గింది.

"తెల్లారింది" అన్నాను.

పెడ్రో ఆవలిస్తూ లేచి దీపం ఆర్పేశాడు.

"చలికి రాత్రంతా వణుకు పుట్టిందనుకో"

తుపాకీ మోత వినిపించింది.

"ప్రారంభమైంది" అన్నాడు టామ్, "బిల్డింగ్ వెనక యార్డులో"

డాక్టర్ని ఒక సిగరెట్టిమ్మన్నాడు టామ్. సిగరెట్టూ, మద్యం ఏవీ వద్దను కున్నాను.

క్షణం విరామం లేకుండా ఫైరింగ్ కొనసాగింది.

"ఏం జరుగుతోందో తెలుసా?" అడిగాడు టామ్.

ఏదో చెప్పాలనుకుని డాక్టర్ను చూసి ఆగిపోయాడు. తలుపు తెరుచుకుంది. లెఫ్టినెంటూ, నలుగురు సైనికులూ వచ్చారు. టామ్ సిగరెట్ పారేశాడు.

"స్టీన్ బాక్?"

టామ్ మాట్లాడలేదు. పెడ్రో అతడివైపు చూపిస్తున్నట్లు సైగ చేశాడు.

"జువాన్ మిర్బాల్"

"మ్యాట్ మీద"

"గెటప్. లే". లెఫ్టినెంట్ ఆదేశించాడు.

జువాన్ కదలల్లేదు. ఇద్దరు సైనికులు అతణ్ణి పైకి లేపి నిలబెట్టారు. కాని

కాళ్లలో బలం లేనట్టు మళ్లీ కిందపడ్డాడు.

సైనికులు కాస్త తటపటాయించారు.

"ఇది మామూలే. లాక్కురండి" అన్నాడు లెఫ్టినెంట్

"పద" అంటూ టామ్ కూడా కదిలాడు.

సైనికులు జువానును ఈడ్చుకుని వెళ్ళారు. నేనూ బయల్దేరబోతుంటే లెఫ్టినెంట్ ఆపి,

"ఇబీటా నువ్వేనా?"

"అవును"

"నీకాస్త టైముంది. వెయిట్" అన్నాడు.

డాక్టరు కూడ వాళ్ల వెంట వెళ్ళాడు.

సెల్లార్‌లో ఒంటరిగా నేను. ఏం జరుగుతోందో తెలియదు గాని ఇదేదో త్వరగా ముగిస్తే బాగుండుననిపించింది. షాట్స్ వినిపిస్తూనే ఉన్నాయి.

జుట్టు పీక్కోవాలని, బిగ్గరగా అరవాలని కోరికగా ఉంది.

ఇలా చెయ్యకూడదు. డీసెంట్‌గా, క్లీన్‌గా చావాలి!

గంట తర్వాత వచ్చి నన్ను మొదటి అంతస్తుకు తీసికెళ్లారు. చిన్న గది. సిగరెట్ల వాసన. ఇద్దరు ఆఫీసర్లు.

"ఇబీటా?"

"యస్"

"రేమన్ గ్రిస్ ఎక్కడ?"

"తెలియదు"

పొట్టిగా, లావుగా ఉన్నవాడు నన్ను దగ్గిరకు పిలిచి,

"ప్రాణం దక్కాలంటే, గ్రిస్ ఎక్కడున్నాడో చెప్పు" అంటూ నా కళ్లలోకి చూశాడు.

చావుకు సిద్ధపడిన వాణ్ణి భయపెట్టటం ఎవరికి సాధ్యం? వీళ్ళు నాకు ప్రాణభిక్ష పెడతారా? వీళ్ళు మాత్రం చావరా? ఇప్పుడు కాదు. మరి కొన్నాళ్ళకైనా అందరికీ మరణం తప్పదు గదా.

కాగితాలు స్టడీ చేస్తూ ఏవో పేర్లు చదువుకున్నారు. ఇతర్లను బంధించటం వీళ్ళ వృత్తి. తమ అభిప్రాయాలతో అంగీకరించని వాళ్లందర్నీ అణచి వేస్తారు.

> కంచె వెనుక దాక్కున్న వాడికంటే స్నేహితుల వెనుక దాక్కున్న వాడే సురక్షితం.
> –చిన్న వాల్తేరు సామెత

స్పెయిన్ గురించి వీళ్ళూ ఆలోచిస్తున్నారు. చేతుల్లో కొరడాలు. క్రూర మృగాల్లా కూర్చున్నారు. ఇదంతా నన్ను భయపెట్టి లొంగదీసుకోవటానికి.

"అర్థమైందా?"

"గ్రిస్ జాడ నాకు తెలియదు. మాడ్రిడ్‌లో ఎక్కడో ఉంటాడు"

మరో ఆఫీసర్ బద్ధకంగా చెయ్యి విదిలించాడు. ఇదంతా నన్ను ఇంప్రెస్ చెయ్యటానికే. ఎదుటి మనుషుల్ని భయపెట్టి ఆనందించే మనుషులూ ఉంటారు.

ప్లాను ప్రకారమే అంతా జరుగుతోంది. ఒక రాత్రి నిరీక్షణ. సెల్లార్లో మరో గంట. టామ్, జువాన్లను షూట్ చేశారు. నన్ను లాండ్రీలో బంధించారు. ఇది వార్ ఆఫ్ నెర్వ్స్. ఎప్పుడో అప్పుడు నేను బ్రేక్ అవుతానని వాళ్ల అంచనా.

మూర్ఖులు. వాళ్ళ ట్రాప్‌లో నేను చిక్కను. గ్రిస్ ఎక్కడున్నాడో నాకు తెలుసు. తన కజిన్స్ ఇంట్లో దాక్కున్నాడు– నగరం నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో. నన్ను టార్చర్ చేస్తే తప్ప ఈ విషయం చెప్పను. ఇదీ నా ప్లాన్. చస్తాను గాని గ్రిస్ గురించి మాత్రం చెప్పను. నాకతడంటే ఇష్టమని కాదు. ప్రియురాలు నాది కాదనుకున్నప్పుడే అతడి గురించీ ఆలోచించటం మానేశాను. ఉద్యమానికి అతని అవసరముంది. కాని నేను చావటానికి సిద్ధపడ్డానంటే అది కారణం కాదు. అన్ని ప్రాణాలకూ ఒకే విలువ. ఏ ప్రాణానికీ విలువ లేదు. గోడకు నిలబెట్టి మనుషుల్ని కాల్చేస్తున్నప్పుడు ఎవరైతేనేం? బహుశా స్పెయిన్‌కు నాకన్నా అతడి అవసరం ఎక్కువుంది. ఇదో ప్రహసనం. అతడి బదులు నేను చస్తాను. బాధ లేదు. లొంగననుకున్నారు కాబోలు. నన్ను తీసుకుపోవటానికి ఇద్దరాఫీసర్లు వచ్చారు. ఎలుక ఒకటి కాళ్ళకడ్డం పడింది. నవ్వొచ్చింది.

ఒక ఫలాంజిస్టు (ప్రభుత్వ సైనికుడు, ఉద్యోగి) వైపు తిరిగి ఎలుకను చూడమన్నాను, అతడు మాట్లాడలేదు. గంభీరంగా మొహం పెట్టాడు. తనను తాను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నాడు. వాడి మీసాలు నాకు నచ్చలేదు. 'షేవ్ చేసుకోరా, ఇడియట్' అన్నాను నవ్వుతూ. జవాబుగా బలంకొద్దీ తన్నాడు.

'ఇంతకూ ఆలోచించావా? చెప్పు గ్రిస్ ఎక్కడ?"

ఈ జాతి వాళ్లంతా వింత కీటకాలు. ఏం చెప్పినా అర్థం కాదు.

"గ్రిస్ ఎక్కడున్నాడో నాకు తెలుసు. అతడు స్మశానంలో, సమాధిలో ఉన్నాడు. సమాధులు తవ్వితే ఎక్కడో కనిపిస్తాడు. గ్రేవ్‌డిగ్గర్ నడుగు"

తాయిలం దొరికినట్టుగా వాళ్ళు సంతోషంతో గెంతులేశారు. "పదిహేను మందిని తీసుకుని స్మశానానికి పదండి, నువ్వు నిజం చెబితే బతికిపోతావు. లేదా అబద్ధం చెప్పినందుకు చాలా బాధ పడాల్సి ఉంటుంది" అని నన్ను హెచ్చరించి కదిలారు.ఫలాంజిస్టు గార్డుల మధ్య ప్రశాంతంగా కూర్చున్నాను. వాళ్లను తలచుకుంటే నవ్వొచ్చింది. ఒక్కొక్క సమాధి మీది రాయీ ఎత్తి లోపల వెతుకుతున్నారేమో! ఫూల్స్, నేను బందీని. కాని నిజానికి హీరోని. స్మశానాల్లో, సమాధుల మధ్య ఫలాంజిస్టులు. వెరీ ఫన్నీ. అరగంట తర్వాత ఒకడు తిరిగి వచ్చాడు. బహుశా నన్ను షూట్ చేస్తారిక.

"వీణ్ణి కోర్ట్ యార్డ్‌లోకి తీసికెళ్ళండి. ఏం చెయ్యాలో న్యాయస్థానం తరువాత నిర్ణయిస్తుంది".

"నన్ను... నన్ను చంపరా?"

"ఇప్పుడైతే కాదు... తరువాతేమవుతుందో మాకనవసరం"

"ఎందుకు చంపటంలేదు?"

ఎవరూ మాట్లాడరు. యార్డులో సుమారు వందమంది దాకా ఉన్నారు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు. మధ్యాహ్నం మెస్‌లో భోజనం కూడా పెట్టారు. ఇద్దరు ముగ్గురు ప్రశ్నించారు. ఎందుకో తెలియదు.

సాయంత్రానికి పదిమంది కొత్త ఖైదీల మధ్యకు నెట్టారు నన్ను. అందులో గార్షియా ఒకడు. బాగానే గుర్తు పట్టగలిగాను.

"భలే. అదృష్టమంటే నీదే. నువ్వు బతుకుతావనుకోలేదు" అన్నాడు.

"నాకూ మరణశిక్ష విధించారు. ఎందుకో మరి, తరువాత అమలు జరపలేదు"

"నన్ను మధ్యాహ్నం రెండింటికి అరెస్టు చేశారు" అన్నాడు గార్షియా.

"ఎందుకు?"

"తెలియదు. మాట వినని వాళ్లందర్నీ అరెస్టు చేస్తున్నారు. గ్రిస్ కూడా దొరికాడు"

"ఎప్పుడు?" అంటూ అడిగాను ఆశ్చర్యంగా.

"ఉదయం. చేజేతులా చేసుకున్నాడులే"

కజిన్‌తో పోట్లాడి ఇల్లు వదిలాడు. దాక్కోవాలంటే అనేక ఇళ్లున్నాయి. కాని ఎవరి సహాయమూ అర్థించదలచుకోలేదు. "ఇబీటా ఇంటికి పోదామనుకున్నాను. కాని అతణ్ణి పట్టుకున్నారు. ఇక స్మశానంలో దాక్కుంటాను" అన్నాడట.

"సిమెటరీలో?"

"ఆఁ బిగ్‌ఫూల్. ఫలాంజిస్టులు వెదుకుతూ వచ్చారు. గ్రేవ్ డిగ్గర్ టెంట్‌లో దొరికాడు"

"సిమెటరీలో?"

కళ్లముందు లోకం గిర్రున తిరిగింది. ఏడ్చాను. నవ్వాను. మొత్తుకున్నాను. నేల మీదపడి దొర్లాను...

# పులిపిరి

## యసునారి కవబట (1899-1972)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



జపాన్‌లోని ఒసాకాలో జననం. తండ్రి డాక్టరు. చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించారు. తాతగారింట పెరిగాడు. టోక్యోలోని ఇంపీరియల్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం, అక్కడే 1924లో ఒక సాహిత్య పత్రికను కూడా ప్రారంభించాడు. 1927లో "ఇజూ డ్యాన్సర్" కథతో సాహిత్య ప్రవేశం. 1937లో ప్రచురితమైన నవల "స్నో కంట్రీ"తో జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. 1949లో వెలువడిన రెండు సీరియల్స్ "థౌజెండ్ క్రేన్స్", "ది సౌండ్ ఆఫ్ ది మౌంటెన్"తో మరింత కీర్తి నార్జించాడు. ఆర్ట్ అకాడెమీ ఆఫ్ జపాన్‌లో సభ్యత్వం లభించింది. జపాను ఆజూశ్రీ క్లబ్ అధ్యక్షుడిగా కొంత కాలం కొనసాగాడు. కవబట ఇతర రచనలు "ది లేక్" (1955) "ది స్లీపింగ్ బ్యూటీ" (1960) "ది ఓల్డ్ కాపిటల్" (1962).

1959లో కవబటను ఫ్రాంక్ ఫర్ట్ (జర్మనీ)లో గ్యోతె మెడల్‌తో సత్కరించారు.

"అద్భుతమైన కథా కథన సంవిధానంతో జపాను ఆత్మను ప్రపంచానికి దర్శింప చేసినందుకు" గుర్తింపుగా 1968లో నోబెల్ బహుమతి లభించింది.

1972 ఏప్రిల్ 16న ఆత్మహత్య చేసుకున్నాడు.

నిన్న రాత్రి పులిపిరి కలలో వచ్చింది. "పులిపిరి" అన్న ఒక పదం చదివితే చాలు. నా ఉద్దేశం నీకు తెలిసిపోతుంది. దాని గురించి ఎన్నిసార్లు నన్ను చీవాట్లేశావు. ఎంత కోపగించుకున్నావు! అది నా కుడి భుజంమీద ఉంది.

లేదా "వీపు పైన" అనాలా?

చిక్కుడు గింజంతైంది. "నువ్విలాగే దానితో ఆడుకుంటూ కూర్చున్నావంటే మొలకలు, పిలకలు గూడా వస్తాయి" అనేవాడివి.

నన్నలా ఏడిపించటం నీకిష్టం. పులిపిర్లు ఇంత పెద్దగా ఉండటం అరుదే. లావెక్కి గుండ్రంగా మెత్తగా తగుల్తోంది.

చిన్నప్పుడు పక్కలో పడుకుని దాంతో ఆడుకునేదాన్ని. నువ్వు మొదటిసారి చూసినప్పుడు సిగ్గుతో చచ్చిపోయాను.

ఏడ్చాను కూడా.

"దాన్నలా నలపొద్దు పెరుగుతుంది" అంటూ కోప్పడ్డావు. మా అమ్మ కూడా మందలించింది. చిన్నదాన్ని. పదమూడేళ్లు కూడా లేవు. నా అలవాటు ఎవరి కంటపడకుండా జాగ్రత్తపడ్డాను. మానాలని ప్రయత్నించాను కూడా. కాని అనాలోచితంగానే వేళ్లు అటే పోయేవి.

నువ్వు చూసినప్పుడు నేనింకా పసిపిల్లనే. భార్యగా ఉండటమంటే ఏమిటో తెలియదు. నువ్వు పురుషుడివి, ఆడపిల్లలు ఎందుకు సిగ్గుపడతారో అర్థం చేసుకోగలవా. ఆ రోజెంత భయమేసిందో. పెళ్లనే మాట తలచుకుంటేనే కంపరం వేస్తుంది.

నా గురించి నాకే తెలియని రహస్యాన్నీ నువ్వు చూశావు. తాకావు. ఏం చెయ్యను? ఎలా అడ్డు చెప్పగలను? ఎలా నిన్ను నిరోధించగలను? నిస్స హాయంగా కళ్లు మూసుకున్నాను. తృప్తిగా, ఆనందంగా నువ్వు నిద్రపోయావు. నాకో గండం గడిచినట్టనిపించింది. కాసింత ఒంటరిగా తోడు కావాలి. నా వేళ్లు పులిపిరిని తాకాయి.

"ఇప్పుడు నేను నా పులిపిరితో కూడా ఆడుకోలేను" అని అమ్మకు రాద్దామనుకున్నాను, కాని సిగ్గుతో మొహం ఎరుపెక్కింది.

"పులిపిరి గురించి యింత వర్రీ కావటమేమిటి?" అన్నావొకసారి. నిజమే అనిపించింది. కాని అస్తమానం అలా దెప్పటమెందుకు. నా అలవాటును క్షమించి వదిలెయ్యకూడదా?

నిజానికి, నాకు దాని గురించి బెంగలేదు. స్త్రీల మెడల మీద పులిపిర్ల కోసం వెదకరెవ్వరూ.

వికలాంగులను చూసి కొందరు "పాపం, అనాఘ్రాత పుష్పంలా ఉండి పోతుందేమో" అని జాలిపడతారు. కాని పులిపిరి అంగలోపం కాదు.

ఎందుకు నాకీ అలవాటయ్యిందనుకున్నావు?

ఎందుకు నీకు కోపం వచ్చింది?

నా వేళ్లు అటుపోగానే 'స్టాపిట్' అంటూ అరుస్తావు. ఎన్ని వందల సార్లలా జరిగిందో!

"ఎడమ చెయ్యెందుకు ఈ పనికి?" అని కసురుకుంటావు.

నీకంటే పైవాడు
అచిపెట్టి తన్నాడనుకో,
కింద
పడినప్పుడు
నీతో సమానమైన వాళ్ళ మధ్య
పడేలాగ జాగ్రత్తపడు.

—యూదు సామెత

ఈ రోజు ఉదయానికీ,
ఈ రోజు రాత్రికీ
మధ్య వున్నదే రేపు.
అందువల్ల రేపటి పని
ఇప్పుడే చెయ్యాలి.

—విశాఖపట్నం సామెత

"ఎడమచెయ్యా?" నాకే ఆశ్చర్యం వేసింది. నేనెప్పుడూ ఈ విషయం గమనించలేదు.

"కుడి వైపుంది. కుడి చెయ్యి వాడొచ్చుగదా కనీసం"

"నిజమే. కాని నా ఎడమచెయ్యి సహజంగా అటువైపు పోతుంది"

"కుడి చెయ్యికి దగ్గర కదా!"

"చెయ్యిని మడిచి వెనక్కు తీసికెళ్లాలి"

నీ మాటకు ఎదురు చెప్పటం అప్పుడప్పుడే అలవాటవుతోంది. ఎడం చెయ్యి కుడివైపు వచ్చినప్పుడు నన్ను నేను ఆలింగనం చేసుకున్నట్టుగా ఉంటుంది. బహుశా, అందువల్ల నీకు కోపం వచ్చి ఉంటుంది.

"ఎడమ చెయ్యి వాడితే తప్పేమిటి?"

"కుడో, ఎడమో. ఇదిమాత్రం మహ చెడ్డ అలవాటు"

"తెలుసు"

"డాక్టరు దగ్గరకెళ్లి తీసేయించుకోవచ్చు గదా.

"సిగ్గేస్తుంది"

"చాలా సింపుల్ విషయం. కట్ చేసినట్టుగా కూడా నీకు తెలియదు"

"పులిపిరి కోసం డాక్టరు దగ్గరకు పోతారా ఎవరైనా?"

"అవసరముంటే పోతారు"

"మొహం మీదుంటే పోతారు. మెడ మీది పులిపురి కోసం వెళ్లటమెందుకు? డాక్టర్ నవ్వుతాడు. భర్త పంపిస్తే వచ్చానని ఆయనకు తెలిసిపోతుంది"

"దాన్ని నలిపే అలవాటు మానుకోలేకపోతున్నానని చెప్పు"

"ఎవరికీ కనిపించని ఒక రహస్య ప్రదేశంలో ఉన్న పులిపిరి గురించి ఇంత గొడవా? నీకేం అడ్డొస్తున్నది?"

"నువ్వు నలపటం మానేస్తే అదున్నా నేను అభ్యంతరం చెప్పను"

"హామీ ఇవ్వలేను"

"నీకు మొండితనం బాగా పెరిగింది. ఎంత చెప్పినా మారటానికి ప్రయత్నించవేం"

"చాలా ప్రయత్నించాను. మెడ కప్పేసే హైనెక్ నైట్‌గౌన్ కూడా వేసుకున్నాను.

"ఇప్పుడు వేసుకోవటం లేదుగా"

"ఇంతకూ, నా పులిపురి నేను ముట్టుకుంటే తప్పేమిటి?"

నేను పోట్లాడాననే అనుకుంటాను.

"మూమ్మాటికి తప్పే. నేను భర్తను. వద్దన్న పని చేస్తున్నావు!"

"ఇంత చిన్న విషయాన్ని గురించి నీకెందుకంత కోపం?"

"కారణాలనవసరం. నువ్వు దాంతో ఆడుకోగూడదు. దాన్ని నలపగూడదు. అది చెడ్డ అలవాటు.తక్షణం మానెయ్యాల్సిందే"

"మాననని నేను చెప్పానా?"

"దాన్ని తాకినప్పుడు కలలు కంటున్నట్టుగా ఉంటుంది నీ మొహం. నీ కళ్లలో మత్తు కనిపిస్తుంది. సగం మూసుకుపోతాయి. అదీ నాకు అసహ్యం."

"ఒకడు పొద్దున వేటాడ వచ్చు, మధ్యాహ్నం చేపలు పట్టవచ్చు. సాయంత్రం పశు పోషణ చేయవచ్చు. రాత్రి డిన్నర్ తర్వాత కళా, సాహిత్య విమర్శ చేయవచ్చు. అతని ఇష్ట ప్రకారం ఏది కావాలంటే అది చేయవచ్చు. అంతమాత్రాన అతడిని వేటగాడని, బెస్తవాడని, పశుపోషకుడని, విమర్శకుడని వేరు చేసి పేరు పెట్టి పిలవనక్కరలేదు..."

-కార్ల్ మార్క్స్

---

"నీవు చెప్పేదానిలో ఒక్క మాటను కూడా నేను అంగీకరించను.

కాని,

ఆ మాట చెప్పడానికి నీకు గల హక్కును నా ప్రాణమిచ్చి అయినా సమర్థిస్తాను"

-వోల్టేర్

"నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. నీ ఉద్దేశం నాకర్థమైంది"

"ఈసారి చూస్తే, చేతిమీద చురక పెట్టు లేదా లెంపకాయ కొట్టు."

"రెండు మూడేళ్లుగా నీకీ అలవాటుంది. దీన్ని మార్చుకొనే ప్రయత్నం ఇంతవరకు చెయ్యలేదు. ఒక్క చిన్న దురలవాటును కూడా మానలేవా? ఎంత ఆశ్చర్యం!"

జవాబు చెప్పలేను. నీకెందుకసహ్యమని చెప్పావో, దాని గురించే ఆలోచించాను.

ఆ భంగిమ - ఎడమచెయ్యి నా ఎత్తైన ఛాతీని నొక్కుతూ కుడివైపుకు సాగినపుడు -అది ఒంటరితనమా? ఆత్మరక్షణకు కూడా అది సంకేతమా? నిజమే. ఆ క్షణాన స్వప్న లోకంలో తెరుచుకున్న కళ్లు.

అది చూసినప్పుడు- నన్ను నేను ఆత్మ సమర్పణ చేసుకోలేదు అనిపించి ఉంటుంది నీకు. అంటే నీ దృష్టిలో మన మధ్య ఒక అఖాతం ఉంది. పులిపిరి తాకిన క్షణాన దాచుకోలేని ఫిలింగ్స్ అన్నీ నా మొహంలో కనిపించాయా? కలలో అబద్ధాలుండవు మరి. యవ్వన ప్రాభవం నుండీ నాలో పెరిగిన కోరికలకు ప్రతి రూపం-పులిపురి.

నేన్నీకు నచ్చలేదనుకుంటాను. ఏదో అసంతృప్తి చూడగలిగావు. అందువల్లే ఇంత చిన్న విషయం సాకుగా అంత రాద్ధాంతం చేశావు. నా మీద నిజంగా ఇష్టముంటే ఇలా గొడవ పడేవాడివి కావు.

అంటే, నన్నిష్టపడే వాళ్లకు, నా అలవాట్లు కూడా నచ్చుతాయన్నమాట.

భార్యాభర్తలందరికీ ప్రేమ ఉంటుంది. ప్రేమతోనే పులిపురి గురించి తెలుసుకున్నావు. ఈ విషయంలో నాకెప్పుడూ సందేహం లేదు. కాని కాల క్రమంలో ప్రేమ వికటిస్తుంది. ఆ ప్రేమ రాహిత్యం, ప్రదర్శించలేని కోపం, జుగుప్స వేళ్ళూని పెళ్లి బీటలు వారుతుంది. అన్యోన్యంగా కాపురం చేసే దంపతులు ఒకరి చిన్ని దురలవాట్లను మరొకరు పట్టించుకోరు. కాని ఇలా ప్రతిదానికీ గిల్లికజ్జాలు పెట్టుకుని పరస్పరం హింసించుకునే భార్యా భర్తలే ఎక్కువ మంది ఉన్నారనుకుంటాను. అన్యోన్య దాంపత్యంలో తప్పనిసరిగా ప్రేమ ఉంటుందనీ, పోట్లాడుకునే వాళ్ల మధ్య ఉండదనీ కాదు. అసహ్యించుకుంటూ, తిట్టుకుంటూ, కొట్టుకుంటూ ప్రేమించుకునేవాళ్లూ ఉంటారు. నా కోరిక ఒక్కటే. నువ్వు నా అలవాటును పట్టించుకోవద్దు. దాని గురించి ఆలోచించకు.

ఒకసారి నువ్వు కోపంతో నన్ను కొట్టటానికొచ్చావు. ఏడ్చి మొత్తుకున్నాను. పులిపిరిని తాకినందుకు తన్నులా? నీ అయిష్టం ప్రదర్శించటానికి ఇదొక సాకు మాత్రమే. "ఎలా మానతావు"?

"ఇంకేం చెయ్యాలి?" ఉద్రేకంతో రొప్పుతూ నీలో నువ్వే గొణుక్కున్నావు. నా మీదేగాని, నువ్వు చేసిన పనులమీద నీకెప్పుడూ అసహ్యం వెయ్యదు. నేనీ విషయం అందరికీ చెప్పుకుంటే నీ నిజస్వరూపం లోకానికి తెలిసేది కాదూ! కాని... నీ స్వభావం నాకు బాగా అర్థమైంది.

సణుక్కుంటావు, సాధిస్తావు, తిడతావు, తంతావు. అక్కడితో ఓ ఘట్టం ముగుస్తుంది. దాంతో నీకు, నాకూ ఓ పెద్ద రిలీఫ్.

"మానను గాక మానను. మానలేను. ఇవిగో, నా చేతులు కట్టెయ్యి. అలాగైనా నీ కోరిక తీరుతుంది" అంటూ చేతులు చాపాను. కనీసం, అదైనా నా ఆత్మ సమర్పణ అని అంగీకరిస్తావా?

ఆ క్షణాన, నా తెగింపు చూసి నీ కోపం తగ్గినట్టనిపించింది. నేనిచ్చిన తాడుతో నా చేతులు కట్టేశావు.

కట్లతోనే నేను జుత్తు వెనక్కు తోసుకున్నప్పుడు నీ పెదాలమీద చిరునవ్వు కనిపించింది. "కనీసం ఇలాగైనా నా అలవాటు మానుకోగలను" అనుకున్నాను.

కాని నా నిగ్రహం ఎన్నోనాళ్ళు నిలవలేదు. నీ విరక్తి కూడా పెరిగింది. నేనేం చేసినా, దానితో ఎంత ఆడుకున్నా పట్టించుకోనట్టుగానే ప్రవర్తించావు.

ఒకనాడు-విచిత్రం జరిగింది.

మానలేని అలవాటు. నీ కోపతాపాలకు కారణమైన అలవాటు. ఎన్ని మందులు వాడినా మానలేని అలవాటు. ఒకనాడు-సడెన్‌గా ముట్టుకోవాల నిపించలేదు.

"మానేశాను" అని చెప్పాను ఆ చోటు చూపిస్తూ.

నువ్వు గమనించలేదు. ఈ విషయం అంత అముఖ్యం అనుకున్నవాడివి ఇన్నాళ్లూ ఎందుకు సాధించావు?

"ప్రమాదం లేదు" అనుకున్న అలవాటును మానటమెందుకసలు. నీకు కోపం తెప్పించ టానికైనా ఒకసారి దాన్ని మళ్లీ తాకుదామను కున్నాను. కాని చెయ్యి కదలట్లేదు.

ఒంటరితనం పెరిగినట్టనిపించింది. నామీద నాకు అసహ్యం వేసింది. ఎందుకు మానేశానని అడుగుతావనుకున్నాను.

కాని-ఆ రోజు తర్వాత మన మాటల్లో "పులిపిరి" అనే మాట వినిపించలేదు.

ఎన్నో మార్పులు వచ్చాయి.

ఒకనాడు మేమిద్దరం కలిసి స్నానం చేస్తున్నప్పుడు అమ్మ అడిగింది.

"సాయోకో, నీ అందం తగ్గిందే. వయసు నెవరాపగలరు?"

నాకన్నా పెద్దది. అమ్మలో మార్పు రాలేదు. నాలో వచ్చిందా?

"పులిపిరి. అందరి కళ్ళూ దానిమీదే ఉంటాయి"

"డాక్టర్ చాలా సులభంగా తీసేస్తాడట"

"నువ్వు అత్తారింట్లో ఉన్నప్పుడు మేం చెప్పుకునే వాళ్లం. చిన్నప్పట్నించి ఉన్న అలవాటు -మానలేవని"

"నిజమే. మానలేకపోయాను. నాకెప్పుడా అలవాటు ప్రారంభమైంది?"

"పిల్లలకు పులిపిర్లెపుడొస్తాయి?.... అప్పట్నించీ. ఎదుగుతున్నప్పుడు వచ్చి ఉంటుంది"

చిన్నప్పుడందరూ-అమ్మా, అక్కలు-దాన్ని ముట్టుకుని చూసేవాళ్లు. అలా అలవాటైందను కుంటాను. పక్కమీద పడుకుని రోజూ అదే పని.

ఇప్పుడు పుట్టింట్లో ఉన్నాను. నా యిష్టమొచ్చినంతసేపు దాంతో ఆడుకోవచ్చు. వద్దనే వాళ్లెవరూ లేరు. కాని దాన్ని ముట్టుకోవాలంటే మొదట నువ్వు జ్ఞాపకం వస్తావు. మన మధ్య ఇప్పుడు ప్రేమ లేదా?

నీ దృష్టిలో నేను 'మంచిదాన్ని' కాదు. బహుశా విడాకులిస్తావేమో. కానీ ఇరవై నాలుగ్గంటలూ నీ ఆలోచనలే.

కన్నీటితో దిండు తడిసింది. పులిపిరి కలలోకి వచ్చింది.

అంతా గజిబిజిగా ఉంది. మనతోపాటు మరొక స్త్రీ కనిపిస్తోంది.

తాగుతున్నాను. మత్తెక్కింది. దేనికోసమో నిన్ను వేడుకుంటున్నాను.

పాత అలవాటు మళ్లీ జ్ఞాపకం వచ్చింది. ఎడమ చెయ్యి నా రొమ్మును నొక్కుతూ కుడివైపు సాగింది. బొటనవేలు, చూపుడువేలు మధ్య వేయించిన చిక్కుడు గింజ లాంటి పులిపిరి మెత్తగా, కాస్త లాగగానే-ఎంత సులభంగా ఊడి వచ్చింది. నొప్పి లేదు. పులిపిరి ఉన్నచోట గుంత ఏర్పడింది. దాన్ని మళ్లీ గుంతలో పెట్టమని ప్రాధేయపడ్డాను.

మెలకువ వచ్చింది. దిండు తడిసింది. ఇంకా ఏడుస్తూనే ఉన్నాను.

నిజంగానే పులిపిరి రాలిపోయిందేమోననుకున్నాను. అతి ప్రయత్నం మీద మరొకసారి తాకాను.

ఇదీ నా పులిపిరి కథ.

వేళ్ల మధ్య నల్లని చిక్కుడు గింజ.

నీ ముక్కు పుటాల పక్కన కూడా ఒక పులిపిరి ఉంది, నేనెప్పుడైనా దాని గురించి మాట్లాడానా?

నా పులిపిరి కూడా నువ్వే తీసుకుని అక్కడ పెట్టుకోగలిగితే కథ భలేగా ఉంటుంది.

ఒక విషయం చెప్పటం మరిచాను.

"ఐ హేటిట్" అన్నావొకసారి. ఆ మాటలో నీ ప్రేమను చూశాను. పులిపిరిని ముట్టుకున్నప్పుడు నిద్రాణమైన నా రహస్య వాంఛలన్నీ నా అరవాలిన కన్నులలో కనిపిస్తాయా?

"నేను దాన్ని ముట్టుకున్నప్పుడు కోప్పడే దానివి కదూ!" అంటూ అడిగాను అమ్మను. "ఎందుకోప్పడ్డావు?"

"అది చెడ్డ అలవాటు గనక"

"కానీ, ఆ పని చేస్తున్నప్పుడు నువ్వెందుకు చూశావసలు?"

"బాగుండదే"

"నీ దృష్టిలో అది దురలవాటు, నేను చెడ్డ దాన్ని. మంచి భార్యలు, పతివ్రతలు ఇలాంటి పనులు చెయ్యరు. అంటే ఇలాంటి అల వాట్లున్నవాళ్లు సంసారానికి పనికి రారు" "కేవలం పులిపిరితో ఆడుకోవటం ఒక్కటే కాదే. అలా చేస్తున్నప్పుడు నీ కళ్లలో కనిపించే భావాలు" అన్నావు.

కానీ, తొలి రోజుల్లో మా అమ్మ,అక్కలు కూడా నన్ను ప్రోత్సాహించారుగా. వాళ్ల ప్రేమను జ్ఞాపకం చేసుకుంటూ ఆడు కోవచ్చుగా.

అంతే. ఈ అలవాటు నా ప్రేమ జ్ఞాపకాలకు సంకేతం. నీతో ఉన్నప్పుడు కూడా ఆ పని చేశానంటే, నా ఊహల్లో మరెవరో మెదులుతున్నారన్నమాట.

నీ కోపానికి కారణం అదీ. పులిపిరిని తాకటం చెడ్డ అలవాటు. అంగీకరిస్తాను. కాని నీ దృష్టిలో నేను 'మంచి భార్యను' కాకపోవటానికి మరెన్ని కారణాలున్నాయి! అన్నీ ఇలా అమాయకంగా ప్రారంభమైనవే. ప్రేమతో ప్రారంభమై ప్రేమ రాహిత్యం దిశగా పరిణామం చెందే అలవాట్లు.

ఇవన్నీ నీకు చెప్పుకోవాలనిపించింది. అందుకని ఇదంతా రాశాను. ●

---

అవతలివాడు తొందరపడి మాటతూలాలంటే నీవు నిదానంగా, నింపాదిగా మాటాడాలి.

-ఇటాలియన్ సామెత

---

వెళ్ళవలసిన వాళ్ళ ఇళ్ళకు
తరచు వెళ్ళు,
నడవని దారిలో
పల్లేర్లు మొలిచేస్తాయి.

- స్కాండినేవియన్ సామెత

---

గుర్తింపు కోసం అడుక్కునేవాడు అధమ స్థాయి బిచ్చగాడు.

-వర్ధమాన మహావీరుడు

# వెర్రివెంగళప్ప

## ఐజాక్ బాషెవిస్ సింగర్ (1904 - 1991)

**అనువాదం:ముక్తవరం పార్థసారథి**



మధ్య, ప్రాచ్య యూరోపియన్ దేశాలలో యూదులు మాట్లాడే ప్రాచీన జర్మన్ భాషారూపాన్ని "ఇడ్డిష్" అంటారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఆధునిక ఇడ్డిస్ రచయితలలో షోలెం ఆలెకీం (సలాం ఆలేకుం ఒకరు.) మరొకరు ఐజాక్ బాషెవిస్ సింగర్. 1987 నాటి నోబెల్ బహుమతి గ్రహీత.

ఇతని పుట్టుక గురించి వివాదమేమీ లేదు గాని, 1894, 1902, 1904 కూడా యితడు పుట్టిన సంవత్సరాలుగా వివిధ పుస్తకాలలో సూచించారు. మొత్తం మీద సింగర్ జన్మ స్థలం పోలండ్ రాజధాని వార్సా సమీపంలోని రాడ్ జైమిన్. తండ్రి రేబై (మతగురువు, మతాధికారి), తల్లి బాత్‌షీబా కూడా మరొక రేబై కూతురే. సింగర్ చిన్నప్పటి పేరు ఐచెక్ హెర్స్‌జింగర్. తండ్రి తన విధి నిర్వహణలో భాగంగా మతపరమైన న్యాయ స్థానంలో జడ్జిగా, ఆధ్యాత్మిక గురువుగా వ్యవహరించటం సింగర్ మనసు మీద గాఢమైన ముద్ర వేసింది. బాల్యంలో సింగర్ హీబ్రూ భాష నేర్చుకున్నాడు. యూదు మత గ్రంథాలను ఔపోసన పట్టాడు. అరామిక్ సాహిత్యంలో కూడా ప్రావీణ్యం సంపాదించాడు. ఇంట్లో అందరికీ కథలల్లే అలవాటుంది. సింగర్‌కు కూడా చిన్నతనం నుండే అది పట్టుబడింది.

సింగర్ తొలి నవల 1932 నాటి "సాటాన్ ఇన్ గోరే" మధ్యయుగాలనాటి ఇడ్జిష్ గాథలాగుంటుంది. అదే భాష, అదే శైలి. 17వ శతాబ్దికి చెందిన ఒక దొంగప్రవక్త గురించిన కథ.

తొలి నవలలు "ది ఫామిలీ మస్కాట్" (1950), ది మేనర్ (1967), ది ఎస్టేట్ (1960)లలో సింగర్ ఎక్కువగా తను పుట్టి పెరిగిన పోలండ్‌నే కథా నేపథ్యంగా తీసుకున్నాడు. ఆయన కథలన్నీ వాస్తవికంగా సహజంగా జరిగినట్టుగానే ఉంటాయి. కానీ పాత్రలకు ఆధ్యాత్మిక మీమాంసలెక్కువ. కథా సంకలానాలు "ఎ ఫ్రెండ్ ఆఫ్ కాఫ్కా", "ది స్పైనోజా ఆఫ్ ది మార్కెట్ స్ట్రీట్", "ది డెత్ ఆఫ్ మెతుసెలా"లలో మత విశ్వాసాలను గురించే రాసినా, వాటిని ప్రశ్నించే ప్రయత్నం కూడా చేశాడు. "బహుశా అక్షరాలు నేర్చుకోకముందే నేను కథలు చెప్పటం అలవాటు చేసుకున్నాను. సిరా బుడ్డిలో కలం ముంచి పిచ్చి గీతలు గీసేవాణ్ణి. లేదా జంతువుల బొమ్మలు... రచయితయిన వాడు పండితుడూ, సంస్కర్తా కానక్కర్లేదు. కథలు బాగా చెప్పగలిగితే చాలు" అంటాడు ఐజాక్ బాషెవిస్ సింగర్. ఆయన 1991 జూలై 24న మరణించాడు.

వెర్రి వెంగళప్ప అని నన్ను గేలి చేస్తారందరూ. నేనంత మూర్ఖుణ్ణేమీ కాను. కాని తుంటరివాళ్లు నా మాటను లెక్క చేస్తారా! స్కూల్లో ఉన్నప్పటినుంచీ అదే నా పేరు. నా అసలు పేరు గింపెల్. ఇదిగాక నాకు మరో ఆరు పేర్లు పెట్టారు. గాడిద, మట్టి బుర్ర, మన్నుతిన్న పాము, వెధవ, చవట, పేడమొహం. 'వెర్రివెంగళప్ప' మాత్రం ఇంకా మిగిలింది. ఎందుకు నన్నందరూ అలా పిలుస్తారు? ఎవరేం చెప్పినా తలూపుతాను. నిజమనే అనుకుంటాను.

"గింపెల్, మన రేబై(యూదు మతాచార్యుడు) పెళ్లాం నీళ్లాడింది తెలుసా?". తరువాత అది అబద్ధమని తేలింది. నాకెలా తెలుస్తుందా సంగతి? ఆమె కడుపు ఎత్తుగా కూడా కనిపించలేదు. నిజమే. కాని నాకు అసలు అటువైపు పరికించి చూడటమే ఇష్టముండదు. అయినా అందులో అంత హేళన చెయ్యాల్సిందేముంది? ఇక వాళ్లా! ఒకటే పగలబడి నవ్వటం. హాహాలు హీహీలు. ఆడవాళ్లు పురిటి గదిలో ఉన్నప్పుడు అందరూ కిస్‌మిస్‌లు పంచుతారు. వాళ్లు నా చేతిలో మేక గొఱిసెలు పెట్టారు. నేనంత అర్భకుణ్ణేమీకాదు. చాచి ఒకటిచ్చుకున్నానంటే నాలుగు మెలికలు తిరిగి పడతారు. కాని ఒకరి మీద చెయ్యి చేసుకోవటం నా స్వభావం కాదు. నవ్వుకుంటారా, నవ్వుకోనీ.

ఒకనాడు స్కూలునించి వస్తుంటే కుక్క మొరిగింది. నాకు కుక్కలంటే భయముందని కాదు. కాని వాటితో ఎందుకు తగాదా. పిచ్చి కుక్క కూడా కావచ్చు గదా. అలాంటిదే గనక కరిస్తే ఇక మనల్నెవరూ రక్షించలేరు. కీడెంచి మేలెంచమని కాలికి బుద్ధి చెప్పాను. మరికాసేపటికి వెనక్కు తిరిగి చూద్దును గదా, అందరూ కడుపులు పట్టుకుని మరీ నవ్వుతున్నారు. మొరిగింది. కుక్కగాదు. దొంగ. నాకెలా తెలుస్తుందా విషయం?

> ధాన్యం నుంచి
> పేలాలు ఒస్తాయి గానీ
> పేలాల్నించి
> ధాన్యం రాదు.
> - జామి నానుడి

నన్ను ఆట పట్టించటం సులభమని వాళ్లకు తెలిసిపోయింది. ఇంక రోజూ ఇదేపని.

"గింపెల్, జారు చక్రవర్తి ఇవాళ మన వూరి కొస్తున్నాడు"

"గింపెల్, చంద్రుడు భూమ్మీద పడ్డాడు"

"గింపెల్, పక్కవీధిలో లంకెబిందెలు దొరికాయట"

ఆ లోకంలో అసాధ్యమైనదేమీ లేదని ఆది గ్రంథంలో రాసివుంది గదా. అంతేగాక ఊరివాళ్లంతా ఏక కంఠంతో ఏదైనా జరిగిందని చెప్పినప్పుడు నమ్మకుండా ఎలా ఉండగలం?

"మీరు నన్ను ఫూల్ చేస్తున్నారు" అని ఎప్పుడైనా అన్నాననుకోండి అందరూ నా మీద ఎగిరిపడేవాళ్లు.

"ఏం, మేం అబద్ధాలకోర్లలా కనిపిస్తున్నామా?" అంటూ.

ఏం చేసేది? తోటివాళ్లను నమ్మక తప్పదు. పోనీ, అలాగన్నా వాళ్లు తృప్తిపడతారు.

నేను అనాథను. మా తాత నన్ను పెంచాడు. ఇప్పుడాయనకు వయసు మీదపడింది. ఎప్పుడు హరీమంటాడో తెలియదు. అందువల్ల ఒక బేకర్ నా పోషణ బాధ్యతలు తీసుకున్నాడు. అబ్బబ్బ అక్కడ నా పరిస్థితి మరీ అధ్వాన్నం. వచ్చిన కస్టమర్లందరికీ ఏదో రకంగా నన్నాటపట్టించకపోతే తోచేది కాదు.

"గింపెల్, స్వర్గంలో తిరునాళ్లట. వెళ్లు"

"గింపెల్, రేబైకి ఏడో నెలలో ఆవు దూడ పుట్టింది"

"గింపెల్, ఆవు ఇళ్లమీద ఎగురుతూ ఇత్తడి గుడ్లు పెట్టింది"

(యూదు మత విశ్వాసాలకు సంబంధించిన ప్రస్తావన అది)

"గింపెల్, ప్రవక్త ఏతెంచాడు. మృతులందరూ సమాధుల్లోంచి లేచి నిల్చున్నారు"

"అలాగా, మేకపోతు చేసిన శంఖారావం వినిపించలేదేం మరి?"

"నీకు చెముడా ఏమిటి? అంటూ అరిచారందరూ.

"మాకు వినిపించింది"

ఇంతలో మరొకరు వచ్చి "గింపెల్, మీ అమ్మా, నాన్నా సమాధిలోంచి లేచి వచ్చారోయ్. నీ కోసం అడుగుతున్నారు" అన్నారు.

వాళ్ల మాటల్లో ఇసుమంతైనా నిజం లేదని నాకు తెలుసు. కాని వెళ్లి చూస్తే నష్టం లేదుగా. అంతే మళ్లీ పిల్లికూతలు ప్రారంభం. ఇక అప్పట్నించీ ఎవరేం చెప్పినా నమ్మకూడదని నిశ్చయించుకున్నాను. కాని అదీ వీలుపడలేదు. వాళ్లు నన్ను ఎంత తికమక పెట్టేవాళ్లంటే, ఏది నిజమో, ఏది అబద్ధమో తెలిసేది కాదు. సలహా కోసం రేబైని సంప్రదించాను.

"దుష్టుడిగా ఒక గంట బతకటం కన్నా, మూర్ఖుడిలా చిరకాలం బతకడం మేలని రాసి వుంది గ్రంథంలో. పైగా వెర్రి వెంగళప్పవి నువ్వు కాదు వాళ్లు. పొరుగు మనిషిని చులకన చేసిన వాళ్లు పరలోక జీవితానికి దూరమవుతారు" అన్నాడాయన. నేను తృప్తిగా, వాకిలి దాటి వస్తుంటే, ఆయన కూతురు ఎదురొచ్చి, "గోడను ముద్దు పెట్టుకున్నావా?" అని అడిగింది.

"ఎందుకూ? ఇలాంటి పద్ధతి వుందని నాకు తెలియదే?" అన్నాను.

"అది నియమం. ఇక్కడికి వచ్చినప్పుడల్లా అందరూ గోడను ముద్దు పెట్టుకోవాల్సిందే" అందా పిల్ల.

సరే. ఆమె చెప్పినట్టే చేస్తే మాత్రం వచ్చిన నష్ట మేమిటి?

కాని అప్పటిదాకా, అంత సీరియస్‌గా ఉన్న అమ్మాయి నన్ను చూసి ఒకటే విరగబడి నవ్వటం... నా మీద మరొక జోకు పేలిందన్న మాట.

ఊరు వదిలి పోదామనుకున్నాను. కానీ అందరూ పెళ్లి సంబంధాలు చూడటం ప్రారంభించారు. ఒప్పుకునే దాకా వదల్లేదు. ఆ అమ్మాయి. అమాయకురాలేమీ కాదు. కాని కన్య అంటూ ఒప్పించాలని చూశారు. ఆమెకు కాలు కాస్త కుంటి. అది ముద్దుముద్దు నడక అన్నారు. ఆమెకో చంటి పిల్లాడున్నాడు. వాడు తమ్ముడన్నారు. కోపం పట్టలేక "నేనా కులటనెప్పుడూ చేసుకోను" అంటూ అరిచాను.

"సిగ్గులేదూ. ఓ ఆడపిల్ల గురించి మాట్లాడే పద్ధతి ఇదేనా? ఇలాంటి కూతలు కూశావని తెలిస్తే రేబై నీకు జరిమానా విధిస్తాడు. ఒక అమాయకురాలి మీద అభాండాలు వెయ్యటం నేరం" అంటూ నీతులు బోధించారు.

వలలో చిక్కుకున్నానని అప్పుడు తెలిసింది. సరే, పెళ్లి తర్వాత నేనే ఆమెకు యజమానిని కదా. ఆమెకు అభ్యంతరం లేకపోతే నాకూ లేదు. జీవితమెప్పుడూ సాఫీగా సాగదు. అలా ఆశించకూడదు కూడా.

అది చిన్న పెంకుటిల్లు. ఇసుకతో కట్టారు. అరుస్తూ, ఈలలు వేస్తూ చిలిపి వెధవలంతా వెనకే వచ్చారు. అయితే ఎల్కా (ఆమె పేరు)ను చూస్తే వాళ్లకూ భయమే ననుకుంటాను. ఇంటి బయటే ఆగిపోయారు. ఆమె నోరు మంచిది కాదు. బట్టలుతుకుతోంది. దండెం మీద మరికొన్ని బట్టలు అరవేసి ఉన్నాయి.

గౌను పైకి దోపుకుని నీళ్ల గోలెం పక్కన నిల్చుంది. పిన్నులతో జుత్తు కట్టివేసింది. మనిషి వాలకం చూస్తే కాస్త బెదురన్పించింది.

"అలా కూర్చో" అంది.

నా గురించి చెప్పి, దాచకుండా తన గురించి కూడా చెప్పమని అడిగాను.

"నువ్వు నిజంగా కన్యవేనా? ఆ కుర్రాడు నా తమ్ముడా? మోసం చెయ్యకు. నేను అనాథను"

"నేనూ అనాథనే" అంటూ ప్రారంభించింది ఎల్కా "నా గురించి ఎవరో అబద్ధాలు కల్పించి చెప్పారు నీకు. కట్నం ఇవ్వకుండా పెళ్లి చేసుకోవాలను

కుంటున్నట్టుంది. అదేం కుదరదు. యాభై గిల్డర్లు (కరెన్సీ) ఇవాల్సిందే. నీ తరపున వాళ్లను డబ్బులు జమ చెయ్యమను. లేదా నాకు...”

ఆమె నోటికి హద్దు లేదని చెప్పానా!

“అదేమిటి. పెళ్లికూతురు పెళ్లికొడుక్కిస్తుంది కట్నం” అన్నాను.

“ఈ బేరసారాలు నా దగ్గిర కుదరవు. ఇస్తావా, ఇవ్వవా? ఒకే మాట. చాతకాక పోతే వచ్చిన చోటికి వెళ్లిపో” అంది పౌరుషంగా.

ఈవిడ దగ్గిర నా మాట అసంభవమని తెలిసింది. మొత్తం మీద ఎలాగో పెళ్లికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అప్పుడు మా వూరికి వ్యాధి సోకింది. అందువల్ల పెళ్లి తంతు సమాధి ద్వారం వద్ద, శవస్నానాలు చేయించే గది పక్కన జరిగింది. అతిథులందరూ తప్పతాగారు. పెళ్లి జరిగినట్టుగా పత్రం రాసుకోబోతున్నప్పుడు(అది ఆచారం) రేబై అడిగాడు...

“వధువు విధవా? విడాకులు తీసుకున్నదా?”

“రెండూనూ” అంటూ జవాబిచ్చారు బంధువులు.

నాకు తల కొట్టేసినట్లయింది. కాని పెళ్లి పందిట్లోంచి పారిపోలేను గదా!

ఆ తర్వాత వేడుకలు మాత్రం ఉత్సాహంగా జరిగాయి. పాటలు, డాన్సులు. అందరూ ఏవేవో కానుకలు తీసుకొచ్చారు. వంట సామాన్లు, బకెట్లు, తప్పేలాలు, చీపుర్లు, గంటెలు, ఒక ఉయ్యాల కూడా వచ్చింది.

“ఇదెందుకిప్పుడు”అన్నాను.

“నీకు తెలియదు లేరా. తరువాత అవసరం పడుతుంది” అన్నారు. ఇందులో ఏదో తిరకాసుందను కున్నాను. కాని తీసుకుంటే నష్టమేమిటీ? ఏది ఎప్పుడు అవసరమవుతుందో ఎవరికెరుక. ఊరి జనాభానంతా అనుమానించలేం గదా!

నిజం చెప్పు...
కానీ చెప్పిన తరువాత
మరి అక్కడ వుండకు.
-స్లావియన్ సామెత

✡

రాత్రికి, నా భార్య గదిలోకెళ్లాను. ఆమె నన్ను దగ్గరకు రానివ్వలేదు.

“మరి పెళ్లెందుకు?” అన్నాను.

మూడు నాలుగు రోజులు దూరంగా ఉండాలంది.

“కాని నిన్ననే నీకు వాళ్లు రుతుస్నానం చేయించారు. దాని తర్వాతే స్నానం చేస్తారు గదా”

“చూడు నిన్న నిన్నే. నేడు నేడే. నమ్మకపోతే నీ ఖర్మ” అంటూ పడుకుంది.

మంచిరోజు కోసం నిరీక్షించటం తప్ప చేసేదేముంది! మరో నాలుగు నెలలకామె ప్రసవించింది. ఊరి జనమంతా నోళ్లకు చేతులడ్డం పెట్టుకుని మరీ నవ్వారు. కాని నాకు గత్యంతరమేముందని! నొప్పులను భరించలేక ఆమె గోడలు గీకుతూ–

“గింపెల్, నన్ను క్షమించు. ఇక చచ్చిపోతాను” అంటూ కేకలేసింది. ఆడవాళ్లు ఇంటి నిండా మూగారు. పెద్దపెద్ద గిన్నెల్లో నీళ్లు మసలబెట్టారు. ఆమె అరుపులకు ఇల్లు మార్మోగింది.

అంతా సవ్యంగా జరగాలని దేవుణ్ణి ప్రార్థించటం తప్ప చెయ్యగలిగిందేమీ లేదు. అదే చేశాను. చుట్టూ మూగిన మనుషులు నన్ను చూసి నవ్వుతూ, “చేతులెత్తి ప్రార్థించినంత మాత్రాన ఆడవాళ్లకు కడుపు రాదురా” అంటూ హేళన చేశారు. ఒకడు ఇంత గడ్డి నా నోట్లో కుక్కాడు.

“పసరానికి ఇదే తిండి” అంటూ మళ్లీ నవ్వులు.

మగపిల్లాడు పుట్టాడు.

“కొడుకు పుట్టిన సందర్భంగా, గింపెల్ అందర్నీ విందుకాహ్వానిస్తున్నాడు” అంటూ శుక్రవారంనాడు సినెగాగ్ (యూదుల దేవాలయం)లో ప్రకటించాడు ప్రీస్ట్.

హాలంతా నవ్వులు. అవమానం భరించలేను. కాని చేయగలిగిందేమిటి? కొత్త శిశువు పుట్టినప్పుడు జరపవలసిన ఆచారాలన్నింటికీ బాధ్యత నాదే గదా.

విందుకు ఊళ్లోని సగం జనాభా తరలివచ్చారు. ఆడవాళ్లు మసాలా శనగలు తెచ్చారు. మరెవరో బీరు పంపించారు. అందరితోపాటు నేనూ తిన్నాను. తాగాను. అందరూ అభినందనలు తెలిపారు. పిల్లాడికి నా తండ్రి పేరు పెట్టారు.

అతిథులందరూ నిష్క్రమించాక భార్య వద్దకెళ్లాను.

“అలా దల్‌గా, ముభావంగా వున్నావేం గింపెల్” అందామె.

“చేసిందంతా చేసి ఇప్పుడడుగుతావేం? మా అమ్మకు గనక తెలిస్తే ఇప్పుడు మళ్లీ గుండె పగిలి చచ్చేది” అన్నాను.

“ఏమైందని? ఎందుకలా మాట్లాడుతున్నావు?”

“నీ భర్తను, యజమానిని ఇలా మోసం చెయ్యటం తగునా?”

“ఏదో నీ మనసులో తొలుస్తోంది. ఏమిటి నీ బాధ?”

ఇంక, నా నోటితోనే చెప్పక తప్పదు.

“నేను అనాథను. నా కళ్లు గప్పి మరెవరి తోనో వాణ్ణి కన్నావు”

“నీవన్నీ పిచ్చి వూహలు. వీడు నీ కొడుకే” అందామె కరాకండిగా.

“అసాధ్యం. పెళ్లైన పదిహేడు వారాలకే ఎలా పుడతాడు?”

“నెల తక్కువా? నాలుగైదు నెలలు తక్కువా?”

వాళ్ల అమ్మమ్మ ఒకతె ఇలాగే కనేదట. వంశపారంపర్యంగా పిల్లలు ఇలాగే పుడుతున్నారు మరి. నన్ను నమ్మించటానికి ఎన్ని ఒట్లు పెట్టుకుందో! ఎన్ని ప్రమాణాలు చేసిందో. సరే అసలు విషయం చెబుతాను. ఆమె మాటలు నేను నమ్మలేదు గాక నమ్మలేదు. తెల్లారి స్కూలు మాస్టారి దగ్గర ఇదే ప్రశ్న అడిగాను.

“ఆదామూ, అవ్వలకూ ఇలాగే జరిగిందిలే. ఇద్దరూ కలిసి పడుకున్నారు. లేచి చూసేసరికి ఇద్దరు పిల్లలు పక్కలో ఉన్నారట” అన్నాడతను. ఆడవాళ్లందరూ అవ్వ(ఈవ్)కు ముని మనవరాళ్లే గద!

ఇలాంటి వాదనలు చేస్తే ఏం చెయ్యగలను? అసలు రహస్యం దేవుడికి ఎరుక.

జరిగింది మరిచి పిల్లాణ్ణి నా కొడుకులాగే చూసుకున్నాను. వాడికి నేనంటే ప్రేమ. చూడగానే ఎత్తుకొమ్మని మారాం చేసేవాడు. నన్ను చూస్తే చాలు ఏడుపంతా మామయయ్యేది. వాడికి పళ్లొస్తున్నపుడు ఓ వుంగరమూ, ఒక అల్లిన టోపీ కొన్నాను. ఎక్కడ దిష్టి తాకుతుందోనని మంత్రాలు వేయించాను. వాడికి ఏ లోటూ రాకూడదని అహర్నిశలూ కష్టపడి సంపాదించాను.

ఇంట్లో చంటి పిల్లలుంటే ఖర్చులెలా పెరిగిపోతాయనుకున్నారు! నా మనసులోని మాట చెబుతున్నాను – ఎల్కా మీద కూడా నాకు కోపం లేదు. ఆమెకు నోటి దురుసెక్కువని చెప్పానుగా. ఎప్పుడూ నన్ను తిడుతూ, సాధిస్తూనే ఉండేది. అరవటానికి దానికంత ఓపిక ఎలా వచ్చిందో! అది కోపంతో చూసిందంటే ఎదుటి మనిషికి మాట పడిపోవాల్సిందే. ఇక దాని మాటలు చంద్ర నిప్పులా, వడిసెల విసిరిన రాళ్లా! ఆ వాక్ప్రవాహంలో కూడా సొగసు కనిపించింది నాకు. దాని కోపానికి నా ఒళ్లంతా నెత్తురు పుండైన మాట నిజం. అయినా నా భార్యంటే నాకిష్టం.

ఆ సాయంత్రం నేను స్వయంగా బేక్ చేసిన గసగసాల బ్రెడ్డు తీసుకొచ్చాను. ఆడవాళ్లంతా వేడిగా వుంటాయని నా బట్టీ దగ్గర వండిన పాత్రలు పెట్టుకుంటారు. అందులోంచి దొంగిలించి కేకులు, బాదం, కిస్‌మిస్‌లు, ఇతర తినుబండారాలు నా భార్య కోసం పట్టుకొచ్చాను. మాంసం ముక్కలు,

మిఠాయిలు, చికన్, చేపలు ఏది దొరికితే అది. అన్నీ తిని బొద్దుగా తయారైంది ఎల్కా.

వారంలో ఆరు రోజులు నేను బేకరీలోనే పడుకునేవాణ్ణి. ఒక్క శుక్రవారం ఇంటికి వస్తే ఆమె ఏవో సాకులు చెప్పి నన్ను దగ్గరకు రానిచ్చేది కాదు. ఛాతిలో మంటగా వుంది. ఎక్కిళ్లు వస్తున్నాయి, తల నొప్పి, కడుపు నొప్పి, ఆడవాళ్ళు ఎన్ని కారణాలు సృష్టించగలరో అందరికీ తెలుసు. నాకు విసుగొచ్చిన మాట నిజం. అదీగాక ఆమె "చిట్టి తమ్ముడు" పెరుగుతున్నాడు. వాడెప్పుడూ ఏదో ఒకటి కూస్తూనే ఉంటాడు. ఏమన్నా అనబోతే ఈవిడ నా మీదికి లేస్తుంది. ఆ తిట్లను భరించలేక తల తిరిగేది. పైగా నాకు విడాకులిస్తానని బెదిరించేది. మరొకడెవడైనా అయితే ఇదే అదునుగా తీసుకుని చెక్కేసేవాడే. కాని బాధ్యతల్ని విస్మరించడం నా స్వభావంలోనే లేదు. ఈ భుజాలెందుకిచ్చాడు దేవుడు? బరువు మోయాలనే కదా!

ఒక రాత్రి బేకరీలో ప్రమాదం జరిగింది. బట్టీ పేలింది. మంటలంటు కున్నాయి. చెయ్య గలిగిందేమీ లేదు- ఇంటికి పోవటం తప్ప. కనీసం ఇలాగైనా వారం మధ్య ఒకరోజు పెళ్లాం పక్కన పడుకోవచ్చు. పిల్లల్ని లేపటం ఇష్టం లేక మునివేళ్ల మీద నడిచి లోపలికెళ్లాను. గుర్రు వినిపిస్తోంది. ఒకరిది కాదు. ఇద్దరు మనుషుల ఊపిరి, ఒకటి సన్నగా, మరొకటి దున్నపోతు రంకె వేసినట్టుగా. ఇదెక్కడి పీడ. ఎల్కా పక్కన మరెవడో పడుకున్నాడు. ఇంకెవరైనా అయితే ఇది చూసి, గోలచేసి, యిల్లు పీకి పందిరేసే వాడే. కాని చంటి పిల్లాడు లేస్తాడని నోరు మెదపలేదు. నేను అరిచి వాణ్ణెందుకు భయ పెట్టడం? మళ్ళీ బేకరికి వెళ్లి, పిండి బస్తాల మీద పడుకున్నాను. కన్ను మూతపడలేదు. మలేరియా వచ్చినట్టుగా వణుకు పుట్టు కొచ్చింది. నేను అడ్డగాడిదనూ, పనికి రాని వెధవనే కావచ్చుగాక. కాని మూర్ఖత్వానికీ ఓ హద్దుంటుంది. నా వంటి వెర్రి వెంగళాయికి కూడా సంహించలేని స్థితి వస్తుంది.

మర్నాడు సలహా కోసం రేబైని ఆశ్ర యించాను. ఈ వార్త వూళ్లో కలకలం సృష్టించి నట్టుంది. ఎల్కాను వెంటపెట్టుకు రమ్మని మనిషిని పంపారు. పిల్లాణ్ని చంకనేసుకుని వచ్చింది. ఆమె ఏం చెప్పిందనుకున్నారు? "అంతా అబద్ధం" అంది. దారుణం.

"నా భర్తకు మతిస్థిమితం లేనట్టుంది" ఎన్నిసార్లు ఎన్ని విధాల ప్రశ్నించినా అదే జవాబు. నా ఆరోపణలో ఇసుమంత కూడా నిజం లేదట!

కసాయివాళ్లు, గుర్రాల వ్యాపారస్తులూ ఆమెను సమర్థించారు. కసాయి శాలలో పని చేసే కుర్రాడొకడొచ్చి నన్ను బెదిరించాడు. "నీ సంగతి తేల్చు కుంటాను" ఈలోగా పసికందు ఏడ్చి గుడ్డలు పాడు చేసుకున్నాడు. పవిత్రమైన రేబై సమక్షంలో అలా జరగకూడదు. ఎల్కాను పంపించి వేశాను.

"ఏం చెయ్యను?" అంటూ రేబైని అర్థించాను.

"విడాకులివ్వు"

"అవిడ అందుకు నిరాకరిస్తే?"

ఏదైనా కొనడానికి వెళ్ళావనుకో..
కళ్ళనే నమ్ము,
చెవుల్ని చచ్చినా నమ్మకు
-చెక్ దేశపు సామెత

---

మూర్ఖత్వం అనేది
పుట్టుకతో రావల్సిందే,
మధ్యలో దాన్ని సంపాదించడం
అసాధ్యం.
-శూద్రకుడు

---

ఎవడ్నయినా శత్రువుగా మార్చుకోవా
లంటే వాడికి చిన్న ఉపకారం చేస్తే సరి.
-జోన్స్‌మోటా

"నోటిసు ఇచ్చి చూడు. అంతకన్నా చెయ్యగలిగిందేముంది?"

"సరే ఆలోచిస్తాను" అన్నాను.

"ఇందులో ఆలోచించటానికేమీ లేదు. ఈ విషయం నలుగురికీ తెలిశాక మీరు కలిసి కాపురం చెయ్యటానికి వీల్లేదు"

"కుర్రాణ్ణి చూడాలనిపిస్తే?"

"ఛా.. కులటనూ, దాని జార సంతానాన్నీ మరచిపో"

ఇంక నేను బతికున్నవాళ్లూ ఆ ఇంటి గడప కూడా తొక్కకూడదట.

పగలంతా బాగానే గడిచేది. రాత్రివేళ పిండి బస్తాల మీద పడుకున్నప్పుడు ఎల్కా, పిల్లాడు జ్ఞాపకం వచ్చేవాళ్లు. కోపం తెచ్చుకోవాలనుకునే వాణ్ణి. కాని ఖర్మ, నాకు కోపం రాదు. పరిపరి విధాల ఆలోచించాను. మనుషులన్న తర్వాత పొర బాట్లు చెయ్యకుండా ఉంటారా. పక్కలో కనిపించిన కుర్రాడు, అనేక బహుమతులిచ్చి ఆమెను మచ్చిక చేసుకున్నాడేమో! ఆడవాళ్లకు ఉద్రేకం ఎక్కువ. బుర్ర తక్కువ. పైగా అలా జరిగిందని ఆమె నిరాకరిస్తోంది. బహుశా నా భ్రమ కావచ్చు కూడాను. మనసు అనేకసార్లు ఇలా దృశ్యాలను ఊహించుకుంటుంది. నేనా మెకు అన్యాయం చేస్తున్నానేమో! పశ్చాత్తాపంతో దుఃఖం వచ్చింది. నా కన్నీరు పిండిలో ఇంకి పోయింది. రేబై వద్దకు వెళ్లి నా నిర్ణయం మార్చుకున్నానని చెప్పాను. ఆయన కాసేపు ఆలోచించి మొత్తం పునర్విచారించాలన్నాడు. నిర్ణయం జరిగే దాకా నేనామెను చూడ కూడ దట. భోజనం, డబ్బు మాత్రం ఎవరి ద్వారా నయినా పంపవచ్చునట.

ఈ వ్యవహారం ఓ కొలిక్కి రావటానికి తొమ్మిది నెలలు పట్టింది. రేబైలందరూ చర్చించి విశ్లేషించారు. ధార్మిక గ్రంథాలనుండి వుటం కిస్తూ వుత్తరాలు రాసుకున్నారు. ఇంత చిన్న విషయం సెటిల్ చెయ్యటానికింత పాండిత్యం అవసరమవుతుందని నాకేం తెలుసు!

ఈలోగా ఎల్కా మరోసారి ప్రసవించింది. ఈసారి ఆడపిల్ల. కొత్త శిశువును దీవించటానికి సినెగాగ్‌కు వెళ్లాను. పిల్లకు మా అత్తగారి పేరు పెట్టాను. జనం ఎప్పటిలాగే నవ్వుకున్నారు. నా బాధా, కష్టం ఎంత మందికి వినోదంగా మారిందో. సంశయం వదిలి, చెప్పింది విశ్వసిం చటమే ఉత్తమమని నిర్ణయించు కున్నాను. విశ్వాసం లేకపోతే ఎలా? ఇవాళ్ల భార్యను నమ్మనంటావు. రేపు దేవుణ్ణే నమ్మనంటావు!

నా వద్ద పనిచేసే ఓ కుర్రాడి ద్వారా ఆమెక్కావలసిన ఆహార పదార్థాలు, బ్రెడ్డూ, పేస్ట్రీలూ, మిఠాయిలూ, కేకులూ, దొరికిన మరికొన్ని కలిపి మరీ ఆమెకు అందించేవాణ్ణి. మొదట వాణ్ని చూస్తే నాకు మా చిరాకుగా వుండేది. కాని మా ఇంటికి రాకపోకలు ప్రారంభించాక మనిషి మారాడు.

"నీ భార్య ఉత్తమ యిల్లాలు బాస్! పిల్లలు ఆణిముత్యాలనుకో. అంతా నీ పూర్వజన్మ సుకృతం" అంటూ పొగిడేవాడు.

"కాని, జనం ఆమె గురించి ఏమనుకుంటున్నారో తెలుసుగా"

"లోకులు కాకులు... అవన్నీ పట్టించుకోవద్దు గింపెల్! ఇట్లా విని అట్లా మరిచిపోవాలి"

ఒకనాడు రేబై నన్ను పిలిపించాడు.

"నీ భార్య గురించి నువ్వు తప్పు చేశానని అంగీకరిస్తున్నావా?"

"అవును"

"కాని, నువ్వు స్వయంగా చూశానని చెప్పావు!"

"బహుశా అది నీడ అయివుంటుంది"

"దేని నీడ?"

"దూలం నీడ కావచ్చు"

"సరే. ఇక నువ్వు ఇంటికి వెళ్లొచ్చు. ఒక ధర్మ గ్రంథంలో నీకు అనుకూలంగా తీర్పు రాసి ఉంది"

ఆనందంతో రేబై చెయ్యి కళ్లకద్దుకుని ముద్దుపెట్టుకున్నాను.

వెంటనే ఇంటికి పరిగెత్తాలనిపించింది. భార్యా, పిల్లల్నించి ఇంతకాలం దూరంగా ఉంటే ఎలా ఉంటుందో ఊహించుకోండి. కాని మళ్లీ ఆలోచించి, ఇప్పుడు వెళ్లడం మంచిది కాదనుకున్నాను. యథావిధిగా పని చేసుకుని, సాయంత్రం వెళ్లాలి. ఎవరికీ ఏమీ చెప్పలేదు. మనసు ఆనందంతో పొంగి పోతోంది. ఆడవాళ్లు ఎప్పటిలాగే ఏడ్పించటానికి ప్రయత్నిం చారు. నా మనసు తేలికగా ఉంది. ఎన్ని వదంతులన్నా వ్యాపించనీయండి. పాలు, నీరు లాగ విషయం స్పష్టమైంది. ధర్మగ్రంథ నిర్ణయం నాకనుకూలంగా ఉంది. అది చాలు.

> ఒకవేళ భగవంతుడు గానీ ఈ లోకంలో కాపురం వుంటే ఆయన ఇంట్లో ఖచ్చితంగా దొంగలు పడి పోయేవారు.
>
> -యూదుసామెత

రాత్రికి పిండి తడిపి, పొంగటానికి ఓ మూలన పెట్టి, బ్రెడ్డూ, తిండి పదార్థాలూ తీసుకుని ఇంటికి బయల్దేరాను. చంద్రుడు ప్రకాశిస్తున్నాడు, తారలు తళుక్కుమంటున్నాయి. ఎందుకో గుబులుగా ఉంది. నా ముందర ఒక నీడ ప్రయాణిస్తున్నట్టనిపించింది. చలికాలం. మంచు కురిసింది. గొంతెత్తి పాడాలనిపించింది. పడుకున్న వాళ్లందరూ లేస్తారని ఆ ప్రయత్నం మానేశాను. ఈల వెయ్యాలనిపించింది. కాని రాత్రి పూట ఈల వేస్తే దయ్యాలు వస్తాయని తెలుసు. నిశ్శబ్దంగా వడివడిగా నడిచాను.

నన్ను చూసి క్రిస్టియన్ల వాకిళ్లలో కుక్కలు మొరిగాయి. ఎంత మొరిగినా కుక్కలు కుక్కలే. నేను మనిషిని. ముద్దొచ్చే భార్యకు మొగుణ్ణి. రత్నమాణిక్యాల్లాంటి పిల్లలకు తండ్రిని.

ఇల్లు సమీపిస్తుంటే గుండె మరింత వేగంగా కొట్టుకుంది. భయం లేదు. కాని ఆత్రుత. గడియ తీసి నెమ్మదిగా లోపలికి ప్రవేశించాను. ఎల్కా నిద్రపోతోంది. ఉయ్యాలలో పాపాయి వేపు చూశాను. తలుపులు వేసి ఉన్నాయి గాని పగుళ్లలోంచి వెన్నెల పడుతోంది. చంటిపిల్ల ముద్దొస్తోంది.

పడకవైపు అడుగు వేశాను. అక్కడ, ఎల్కా పక్కన నిద్రపోతున్న నా అసిస్టెంట్!

వెన్నెల చీకటైంది. ఒంట్లో వణుకొచ్చింది. పళ్లు కొట్టుకున్నాయి. బ్రెడ్డు జారి కింద పడ్డది. నా భార్య లేచి,

"ఎవరూ?" అంటూ ఉలిక్కిపడింది.

"నేనే"

"గింపెల్... ఎందుకొచ్చావు? రావటం నిషిద్ధమని తెలియదా?"

రేబై అనుమతించాడు

శరీరం వేడెక్కింది. జ్వరంగా ఉంది.

"నా మాట విను గింపెల్. పెరట్లో మేక ఎలా ఉందో కాస్త చూడు. దానికి నలతగా ఉన్నట్టుంది" అంటూ పురమాయించిందామె. అన్నట్టు, మాకో మేక ఉన్నదని చెప్పటం మరిచాను. ఆ ఆడ మేకంటే నాకు ప్రాణం. జంతువులకూ మనుషుల్లాగే ప్రేమాభిమానాలుంటాయి.

పెరట్లోకెళ్లి పాక తలుపు తోసి చూశాను. మేక బాగానే ఉంది. అంతటా తడిమి చూశాను. కొమ్ములూ, పొదుగులూ పరీక్షించాను. జబ్బు లక్షణాలేవీ కనిపించలేదు. బహుశా తిండెక్కువై ఉంటుంది.

మేకకు గుడ్‌నైట్ చెప్పాను.

అది 'మే' అంటూ నన్ను పలకరించింది ఆప్యాయంగా.

మళ్లీ వెళ్లేసరికి, అసిస్టెంట్ లేడు.

"వాడెక్కడ?"

"ఎవడు?" అంటూ తిరిగి ప్రశ్నించింది నా భార్య.

"అసిస్టెంట్‌గాడు. ఇప్పటిదాకా నీ పక్కనే చూశాను"

ఆమె తిట్ల పురాణం తెరిచింది.

"నిన్నొక పీడకలగా మరచిపోతాను. నీకేదో దయ్యం పట్టింది. ఎవరికీ కనిపించనివన్నీ నీకు కనిపిస్తున్నాయి. ఛీ. పాపిష్టి వెధవా. కుళ్లుబోతు బుద్ధి. నీచుడా. గెటౌట్. ఈక్షణం ఇక్కణ్ణించి వెళ్లిపో. లేకపోతే అరుస్తాను. ఊరంతా లేచి వస్తుంది"

నేను వెనుదిరిగేలోపే ఆమె "తమ్ముడు" లేచి నా తలమీద గట్టిగా కొట్టాడు. మెద విరిగిందనుకున్నాను. 'నాలో ఏదో లోపమున్నట్టుంది' అనిపించింది.

"అలా బిగ్గరగా అరవకు. అందరూ నిజంగా నాకు దయ్యం పట్టిందనుకుంటే నేను కాల్చిన బ్రెడ్డు ఎవరూ కొనరు"

బహుశా, ఆమె ఉద్దేశం కూడా అదే కాబోలు.

"సరే. పడుకో"

తెల్లారి, అసిస్టెంటును పిలిచి, "చూడు, తమ్ముడూ" అంటూ ప్రారంభించాను. నా మాటల్ని నమ్మలేనట్టుగా వాడు "ఇవేం నీలాపనిందలు!" అంటూ ఏడుపు మొహం పెట్టాడు.

"ఏ ఒట్టు పెట్టుకొమ్మంటే ఆ వొట్టు పెట్టుకుంటాను. నువ్వు భూతవైద్యమో, మూలికా వైద్యమో చేయించుకో. నీకేదో కాస్త మతిస్థిమితం తప్పినట్టుంది. నేనెవరికీ చెప్పనులే" అంటూ నాకు ధైర్యం చెప్పాడు.

మొత్తం మీద, ఇరవై ఏళ్లు నేనామెతో గడిపాను. ఆరుగురు పిల్లలు- నలుగురు కూతుళ్లు. ఇద్దరు కొడుకులు పుట్టారు. ఎవరెవరో ఏవేవో చెప్పుకొన్నారు! నేనేదీ కనలేదు. వినలేదు. ఎవరేం చెప్పినా విశ్వసించాను.

"మనిషి జన్మకు విశ్వాసమే ప్రధానం. అదే వాణ్ణి లోకం దాటిస్తుంది" అన్నాడు రేబై.

నా భార్య జబ్బుపడింది. ఏదో చిన్నపాటి నలతనుకున్నాం. రొమ్ము మీద కురుపులాగ ప్రారంభమై వ్రణంగా మారింది. ఆమెకు ఆయుష్షు అంతే రాసి వుందేమో! చికిత్స కోసం బాగానే ఖర్చుపెట్టాను. చెప్పటం మరిచాను. బేకరీ వ్యాపారం బాగా పెరిగింది. ఊళ్లోని సంపన్నుల్లో ఒకణ్ణిప్పుడు. మంత్రగాళ్లూ, భూతవైద్యులూ, మిగతా అన్ని రకాల వైద్యులూ వచ్చారు. జలగల్ని కూడా పెట్టి చూశారు. పట్టణం నుంచి పెద్ద డాక్టర్ని పిలపించాం. అయినా ఏమీ లాభం లేకపోయింది.

వెళ్లిపొయ్యేముందు "నన్ను క్షమించు, గింపెల్" అంటూ నా చేయి పట్టుకుంది. "నేను మోసం చేశాను. కనీసం ఇప్పుడైనా నిజం అంగీకరించకపోతే పరలోకంలో నాకు ప్రవేశముండదు. పిల్లలు నీ సంతానం కాదు"

పిడుగు పడినా అంత ఆశ్చర్యపడే వాణ్ణి కాదు.

"మరెవరి పిల్లలు?"

"తెలియదు. చాలామందే ఉన్నారు. కాని నీ పిల్లలు మాత్రం కాదు"

ఆమె కళ్లు మూతలు పడినాయి. పెదవుల మీద చిలిపిగా చిరునవ్వు మిగిలింది. గింపెల్‌ను మోసం చెయ్యటమే జీవితానికి పరమార్థం అనుకున్న ట్టుందామె.

ఉత్తరక్రియల తర్వాత, ఒకనాడు పిండి బస్తాల మీద పడుకున్నప్పుడు, సైతాను పంపగా వచ్చిన దూత ప్రత్యక్షమై,

"ఎందుకు పడుకున్నావు, గింపెల్?" అంటూ ప్రశ్నించాడు.

"ప్రపంచం నిన్ను మోసం చేసింది. నువ్వు కూడా ప్రపంచాన్ని మోసం చెయ్యి"

"నేనెలా మోసం చెయ్యగలను? అయినా మోసం చేస్తే పరలోకంలో ఇచ్చే తీర్పు మాటేమిటి?"

"పరలోకం అంటూ ఏమీ లేదు. అంతా అబద్ధం"

"ఇంతకూ, దేవుడున్నాడా లేడా?"

"లేడు"

"మరేముంది?"

"అంతా ఒక పెద్ద ఊబి"

మేక గడ్డం, కొమ్ములు, పొడుగు దంతాలు, తోక. వాడి తోకను పట్టుకోబోయి జారి కింద పడ్డాను. పక్కటె ముక విరిగింది.

లేచి, బాత్‌రూంకి వెళుతుంటే ఎత్తుగా పెరిగిన పిండి ముద్ద నన్నాహ్వానిం చింది. "దా... అంత దూరమెందుకు వెళ్లటం? ఇక్కడే పని కానివ్వు"

మొత్తం మీద నాకూ అందులో తప్పు లేదనిపించింది.

తెల్లవారి అసిస్టెంట్ వచ్చాడు. పిండి కలిపి, బ్రెడ్ కాల్చాం. అసిస్టెంట్ వెళ్లిపోయాడు. ఓ మూలన కూర్చుని ఆలోచించాను. 'గింపెల్, వాళ్ళు చేసిన అవమానాలకు బాగానే ప్రతీకారం తీర్చుకున్నావు' అనుకున్నాను. బయట మంచు మెరుస్తోంది. బట్టీ పక్కన వెచ్చగా ఉంది. మంటలు మొహానికి తగులుతున్నాయి. నిద్రలోకి జారుకున్నాను.

కలలో–

మృత్యు ఆచ్ఛాదనతో వచ్చింది ఎల్కా,

"ఎందుకిలా చేశావు, గింపెల్"

"దీనికంతకూ నువ్వే కారణం"

"గింపెల్, నువ్వు నిజంగా ఫూల్ వి. నాది అబద్ధం బతుకు. అంత మాత్రాన లోకమంతా అలాగే వుంటుందని ఎందుకనుకుంటావు? ఇక్కడేమీ దాచలేం. పాపాలకు శిక్ష అనుభవిస్తున్నాను గింపెల్!"

ఆమెను చూశాను. మొహం నల్లగా వుంది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. పనులన్నింటినీ బేరీజు వేస్తారన్న మాట. ఇలాంటి పనులు చేస్తే ఆ లోకంలో స్థానం ముండదు. పెరట్లోకెళ్లి,పెద్ద గొయ్యి తీసి, బ్రెడ్డు అందులో వేశాను.

అసిస్టెంట్ వచ్చి, 'ఇదేం పని బాస్!' అంటూ ఆశ్చర్యపోయాడు. వాడి మొహంలో నెత్తురు చుక్క లేదు.

"నేనేం చేస్తున్నానో నాకు తెలుసు" అంటూ బ్రెడ్డు మీద మట్టి కప్పేశాను.

ఇంటికి వెళ్లి, దాచిపెట్టిన డబ్బు తీసి పిల్లలకు పంచాను. "మీ అమ్మ మొహం అప్పుడే నల్ల బడుతోంది" అన్నాను. వాళ్లకు నోట మాట రాలేదు.

"సుఖంగా వుండండి. గింపెల్ అనే వాడు ఉండే వాడని కూడా మరచి పొండిక" అంటూ బట్టలు వేసుకుని, ప్రార్థనా గ్రంథం సంచిలో పెట్టుకుని బయల్దేరాను.

చూసిన వాళ్లంతా "ఎక్కడికి పోతున్నావు" అని అడిగారు.

"లోకంలోకి" అంటూ ఊరు దాటాను.

దేశమంతా కలియదిరిగాను. సజ్జనులు నాకు సహకరించారు. వృద్ధాప్యం వచ్చింది. జుత్తు తెల్లబడింది. ఎన్నెన్ని సంగతులు విన్నానో, ఎన్ని అబద్ధాలో, ఎన్ని పుకార్లో! వయసు మీద పడుతుంటే తెలిసింది – ఈ లోకంలో అసలు అబద్ధాలనేవి లేవు. జరిగింది జరిగినట్లుగా కలలొస్తాయి. ఏదైనా ఒకరికి కాకపోతే మరొకరికి జరుగుతుంది. ఈ రోజు కాకపోతే రేపు, లేదా మరుసటి సంవత్సరం, మరో శతాబ్దం తర్వాత జరుగుతుంది. వాస్తవానికీ, ఊహకూ తేడా ఏముంది? 'ఇది అసంభం. ఇలా జరగదు' అనే మాటలు చాలా సార్లు విన్నాను. కాని ఏడాదైనా తిరక్కముందే అది ఎక్కడో జరిగిందని తెలుస్తుంది.

స్థిరనివాసం లేదు. దేశదిమ్మరిని. నలుగురు గుమిగూడిన చోటల్లా కథలల్లి చెబుతుంటాను. మంత్రాలు, మాయలు, దేవతలు, రాక్షసులు. "కథ చెప్పు తాతా" అంటూ పిల్లలు వెంట పరిగెత్తుకొస్తారు. కొంతమంది ఫలాన రకం కథలే కావాలంటారు. అందర్నీ తృప్తి పరచటానికి ప్రయత్నిస్తాను."ఇది పాత కథే" అంటూ నన్ను పట్టేశాడో కుర్రాడు ఒకసారి. ఘటికుడే. బాగానే గ్రహించాడు.

కథలాగే కలలు. ఊరు వదిలి చాలాకాలం గడిచింది. అయినా కళ్లు మూసుకుంటే మళ్లీ అక్కడికి చేరుకోగలను. అక్కడ నాకెవరు కనిపిస్తారను కున్నారు? తొలి పరిచయంలో నీళ్లకొలను పక్కన నిల్చున్న ఎల్కా, కాని ఇప్పుడు తపోశక్తి చేత విరాజితమైన ఆ వదనం. మణిదీపాల వంటి ఆ కళ్లు. ఆమె ఏదో మాట్లాడుతుంది గాని ఆ మాటలు నాకర్థం కావు.

> జ్ఞానం ఎవరైనా ఇస్తారు, భోజనం మాత్రం మనమే సంపాదించుకోవాలి.
> –జమ్మాదేవిపేట సామెత

మెలకువ రాగానే అంతా మరిచిపోతాను. కలలో మాత్రం గొప్ప సాంత్వన సుఖం. నా ప్రశ్నలన్నింటికీ ఆమె సమాధానం చెబుతుంది. చెడు లేదు. అంతా శుభమే అంటుంది. నేను ఏడుస్తాను. ప్రార్థిస్తాను.

"నన్ను నీ చెంతకు చేర్చుకో"

ఓపిక పట్టమంటోంది. అవును గమ్యం దూరంగా లేదు. ఒక్కోసారి ఆమె నన్ను దరి చేర్చుకుని మొహం ముద్దాడుతుంది. తన కన్నీళ్లతో నన్ను ప్రక్షాళనం చేస్తుంది.

మెలుకువ వస్తుంది. ఆమె పెదాల మెత్తదనం, ఆ కన్నీటి ఉప్పదనం ఇంకా జ్ఞాపకమే.

ఇది ఊహాలోకం. వాస్తవానికి భిన్నమైనది. నా పక్కనే కర్రపలకలు పడుతున్నాయి. మనుషులు మరణించాక వాటి మీదే వాళ్లను మోసుకుపోతారు. సమాధి తవ్వటానికి సిద్ధంగా నిల్చున్నారు కాపరులు. నేలలోని పురుగులూ, క్రిమికీటకాలు ఆహారం కోసం ఆకలిగా ఉన్నాయి. అన్నీ మూటగట్టుకుని నడుస్తున్నాను.

నేనిన్నాళ్లు పడుకున్న గడ్డివామును మరొకడాక్రమిస్తాడు. సమయం వచ్చినప్పుడు ఆనందంగా నిష్క్రమిస్తాను. ఆ తర్వాత ఏమున్నా సరే, అది నిజం. అక్కడ ఇన్ని గొడవలు, అవమానాలు, ద్రోహాలు ఉండవు. అక్కడ గింపెల్‌ను కూడా ఎవరూ మోసగించలేరు. ●

# రెక్కల తాత

## గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్ (1928 -2014)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



కొలంబియాలో పర్వతాలకూ, కరీబియన్ సముద్రానికీ మధ్యనున్న అరకాటకాలో జన్మించాడు మార్క్వెజ్. తండ్రి టెలిగ్రాఫ్ ఆపరేటర్. పేద సంసారం. పన్నెండు మంది పిలల్లో మార్క్వెజ్ పెద్దవాడు. మాతామహుల పెంపకంలో పెరిగాడు. గార్షియా మార్క్వెజ్ 1955లో తన తొలి కథా సంకలనం 'లీఫ్ స్టార్మ్ అండ్ అదర్ స్టోరీస్' ప్రచురించాడు. ఆ తర్వాత పారిస్‌లో అయిదేళ్లున్నాడు. క్యూబన్ విప్లవం తర్వాత లాటిన్ అమెరికాకు తిరిగి వచ్చి జర్నలిస్టుగా, సినిమా రచయితగా పని చేశాడు. మెక్సికో నగరంలో ఉన్న కాలంలో మార్క్వెజ్ రచించిన మాస్టర్ పీస్, ఇరవయ్యవ శతాబ్ది ఉత్తరార్థంలో ప్రచురితమైన అతి ముఖ్యమైన నవలల్లో ఒకటి. "వన్ హండ్రెడ్ యియర్స్ ఆఫ్ సాలిట్యూడ్ (1967) ప్రపంచ సాహిత్యంలో ప్రకంపనలు సృష్టించింది. లాటిన్ అమెరికన్ డిక్టేటర్ల గురించి రాసిన నవల "లవ్ ఇన్ ది టైం ఆఫ్ కలరా'(1988), ఇటీవల ప్రచురితమైన ఆత్మ కథ 'మెమొరీస్ ఆఫ్ మై మెలంకలీ వోర్స్' వగైరాలు సాహిత్య ప్రియులకు మార్క్వెజ్ ఇచ్చిన కానుకలు.

"అయిడియాలు, ఇతివృత్తం ఆధారంగా నేను కథలు రాయలేను. రచనకు స్పందన మనసులో ఏర్పడిన 'దృశ్యం' నుండి వస్తుంది. అది క్రమంగా పెరిగి ఒక కాన్వాసులా, ఒక సినిమా రీలులా నా కళ్ళ ముందర కదులుతుంది. అదే కథ. ఉదాహరణకు తొలి కథ 'లీఫ్ స్టార్మ్' మా వూరు (అరకాటకా) వెళ్లినప్పుడు తట్టింది. బాల్యమంతా జ్ఞాపకం వచ్చింది. ఆ పేదరికం. అరటి తోటల్లో పని చేసే కూలీలు. వేడి నాకు సుపరిచితమే. అనుభవాన్ని కాగితం మీద పెట్టడానికిన్నాళ్ళెందుకు నిరీక్షించానా అనిపించింది" అని పేర్కొన్న మార్క్వెజ్ ఇతర కథా సంకలనాలు : 'నో వన్ రైట్స్ టు ది కల్నల్' (1968): 'ఇన్నోసెంట్ ఎరెండిలా (1978) 'కలెక్టెడ్ స్టోరీస్' (1984).

ఆయన రాసిన 'వన్ హండ్రెడ్ యియర్స్ ఆఫ్ సాలిట్యూడ్' సాహిత్యంలో ఒక ప్రభంజనం,రచయితలు జీవితాన్ని చూడగలిగే దృష్టినే ఈ నవల మార్చేసింది. హాస్యం, హారర్, పాత్రల అనూహ్యమైన ప్రతిస్పందనలతో పాఠకుల ఊహాశక్తిని ఛాలెంజి చేసింది.

మాకాండో (మార్క్వెజ్ జన్మ స్థలానికి కథా రూపం) గ్రామంలోని బుయెండియా కుటుంబ గాథ "సాలిట్యూడ్". ప్రేమలు, మరణాలు, యుద్ధాలు, శాంతి ప్రతిపాదనలు, కొత్త కోరికల యువతీ యువకులు, జీవిత చరమాంకంలో వృద్ధులు-మన కళ్ల ముందర ఒక మహా స్వప్నాన్ని ఆవిష్కరిస్తాడు మార్క్వెజ్.

ఇలాంటి కావ్యాన్ని చదవటమే ఒక అనుభవమని చదివిన వాళ్లెవరైనా అంగీకరిస్తారు.

1982లో మార్క్వెజ్‌కు నోబెల్ బహుమతి లభించింది.

మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం. ఇల్లంతా జలమయమైంది. కుప్పలు తెప్పలుగా పీతలు కొట్టుకు వచ్చాయి. చంపగలిగినవన్నీ చంపారు. ఆ వాసనతో చంటి పిల్లకు జ్వరం వచ్చింది. ఇంటి యజమాని పెలాయో కొన్ని పీతల్ని సముద్రంలో విడిచి వచ్చాడు. కుండపోతగా వాన కురుస్తూనే ఉంది. మంగళవారం నించీ ఇంతే. ఏం చెయ్యటానికీ లేదు. దిగులుగా, విచారంగా ఉంది. మార్చి నెలలో వెన్నెల కాంతులలో వెలిగిపోవలసిన సముద్రతీరం బురద, మురికితో, చచ్చిన చేపలతో కంపు కొడుతున్నది. పట్టపగలు అయినా కన్ను పొడుచుకున్నా కనిపించని అంధకారం. పీతలను విడిచి వచ్చిన పెలాయోకు పెరట్లో మూలుగు వినిపించింది గాని ఆకారం కనిపించలేదు. దగ్గరగా వెళ్లి చూస్తే ఎవరో బోర్లా పడి ఉన్నాడు. పెద్ద రెక్కలు. లేవాలని ప్రయత్నిస్తున్నాడు గాని అవి అడ్డుపడుతున్నాయి.

పెలాయోకు భయమేసింది. భార్య ఎలిసెండా వద్దకు పరిగెత్తి విషయం చెప్పాడు. ఆవిడ చంటి పిల్లకు కాపడం పెడుతున్నది. ఇద్దరూ వెళ్లి పెరట్లో మనిషిని చూశారు. ముష్టివాడి లాగున్నాడు. బట్టతల అయినా ఒకటి రెండు వెంట్రుకలున్నాయి. బోసినోరు అయినా ఒకటీ రెండు పళ్లు ఉన్నాయి. ఇలాంటి ముసలి తాత ఠీవిగా కనిపించాల్సిందే. కాని తడిసి ముద్దయి బురదలో పొర్లుతున్న మనిషిని చూస్తే ఎవరికైనా జాలేస్తుందే తప్ప గౌరవం కలగదు. ఈకలు సగం రాలిన పెద్ద రెక్కలు మట్టీ మురికీ పేరుకుపోయి మరింత బరువెక్కి ఉంటాయి. భార్యాభర్తలు నిశ్చేష్టులై చూశారా ఆకారాన్ని. ఆశ్చర్యం కల్గింది. దగ్గిరకెళ్లి నిలుచోవటం వల్ల పరిచయం పెరిగినట్టని పించింది. మాట్లాడించటానికి ప్రయత్నించారు. అతడేదో చెప్పాడు గానీ భాష అర్థం కాలేదు. అతడి స్వరం నావికుడి గొంతులా బలంగా వినిపించింది. ఒక క్షణం రెక్కల సంగతి మరిచి, అతడు తుఫానుకు కొట్టుకు వచ్చిన పడవలోని మనిషై ఉంటాడనుకున్నారు.

నీవు వయసులో
వున్నప్పుడు నీ యౌవ్వనం
నిన్ను రక్షిస్తుంది.
ముసలితనంలో
డబ్బు మాత్రమే
నిన్ను కాపాడుతుంది.

–బుష్

---

కవచాలు అవీ
అంత పనికి వచ్చేరకం కాదు గానీ,
తుపాకీ దెబ్బలకు
అందనంత దూరంలో
కాలక్షేపం చేయడం క్షేమం.

–ఇటాలియన్ సామెత

ఏ దేశం వాడో ఏమో! ఇలాంటి వాతావరణంలో చిన్న పడవలు తల్లకిందుల వటం చాలా సహజం. తలపండిన పక్కింటి ముసలావిడ్ని పిలిచి ఈ వింత చూపించారు.

"మీరు వట్టి మూర్ఖులు" అంటూ తీర్పు చెప్పిందావిడ! "ఇతడు దేవదూత. చంటిపిల్ల కోసం వచ్చుంటాడు. వృద్ధుడు వర్షంలో తడుస్తూ, అంతదూరం నుండి వచ్చాడు."

రక్తమాంసాలతో సజీవంగా ఉన్న ఒక దేవదూత పెలాయో ఇంట్లో తల దాచుకున్నాడన్న వార్త ఊరంతా పాకింది. స్వర్గం నుండి వెలివేయబడ్డ దేవదూతలు ఇలా మనుషుల్ని ఆశ్రయిస్తారని చెప్పింది పక్కింటి వృద్ధజ్ఞాని. అయినా పాపం, నిస్సహాయంగా పడి ఉన్న మనిషిని కొట్టి చంపాలంటే పెలాయో దంపతులకు మనసొప్పలేదు. పారిపోతాడేమోనని భయమేసి, అతణ్ణి కోళ్లఫారం దొడ్లోకి ఈడ్చి గేటుకు తాళం వేశారు.

అర్ధరాత్రి వాన వెలిసింది. పీతల్నింకా చంపుతూనే ఉన్నారు భార్యాభర్తలు. మరికాసేపట్లో చంటి పిల్లకు జ్వరం తగ్గింది. ఆకలేస్తున్నది. ఏదైనా తింటానన్నది.

దేవదూతకు మూడు రోజులకు సరిపడా ఆహారమూ, తాగటానికి నీళ్లూ ఇచ్చాడు పెలాయో. ఆ తర్వాత ముసలాడు తన దారిన తను పోనీ.

తెల్లారి లేచి చూస్తే –ముసలాడి కోసం ఊరు ఊరంతా కట్ట కట్టుకుని వచ్చారు. ఒక్కరికీ పిసరంత గౌరవం లేదు. దివి నుండి భువికి దిగివచ్చిన దేవదూతను సర్కస్ జంతువులాగ ఆట పట్టించారు. కంచెలో నుండి తినటానికి ఆహారపదార్థాలూ, వేరుశనగలూ విసిరేశారు.

ఏడింటికి ఊరి ప్రీస్టు–ఫాదర్ గోంజాగా వచ్చాడు. అప్పటికే జనం ఈ "అనుకోని అతిథి" గురించి అనేక ఊహాగానాలు చేశారు. "ఈ ముసలాణ్ణి మేయర్ ఆఫ్ ది వరల్డ్‌గా ప్రకటిస్తే ప్రపంచ సమస్యలన్నీ తీరుతాయి" సైనిక పరిష్కారం ముఖ్యమనుకున్నవాళ్లు ఇతణ్ణి 'జనరల్' చేయాలన్నారు. అన్ని యుద్ధాలలోనూ ఒకడే విజేత. ఇవన్నీ ఎందుకు. సంతానోత్పత్తి శ్రేయస్కరం. అప్పుడు రెక్కల జ్ఞానుల జాతి ఒకటి కొత్తగా ఆవిర్భవిస్తుంది.

అయితే ఫాదర్ గోంజాగా అంత తొందరగా దేన్నీ అంగీకరించడు.

మొదట కోళ్లలో ముసలి కోడిలా పడుకున్న మనిషిని పరిశీలించి చూశాడు. ఎండకు రెక్కలారబెట్టుకుంటున్నాడు వృద్ధుడు. చుట్టూ నారింజ తొక్కలూ, రొట్టెముక్కలూ, ఫాదర్ మతభాష లాటిన్‌లో పలకరించాడు. పూజాదికాల కుపయోగించే భాష కూడా ఆ ఆగంతకుడి కర్థం కాలేదంటే ఇందులో ఏదో తిరకాసుందని అనుమానం వచ్చింది. పైగా మనిషితనం ఎక్కువగా, దైవత్వం తక్కువగా కనిపిస్తున్నది. ఓ రకమైన వాసన వస్తోంది. రెక్కలకు పురుగులు పట్టినట్లున్నాయి. గాలికి ఈకలు చెదిరాయి. అసలైన దేవదూతలింత మురికిగా ఉంటారా! భక్తులను, విశ్వాసులను రక్షించటం తన బాధ్యత. కొన్నిసార్లు సైతాను కూడా ఇలా మారువేషంలో వచ్చి మనల్ని పాపమార్గాన నడిపిస్తాడు. రెక్కలున్నంత మాత్రాన డేగ విమానమవుతుందా? రెక్కలున్న జీవులన్నీ దేవదూతలా? ఏది ఏమైనప్పటికీ తాను పై మతాధికారికీ విషయం నివేదిస్తాడు. ఆయన పోప్‌గారికి రాస్తాడు. ఫైనల్‌గా వాళ్లదే నిర్ణయం. అది అందరికీ శిరోధార్యం.

ఫాదర్ మాటలెవ్వరూ పట్టించుకోలేదు. జనం తండోప తండాలుగా తరలివచ్చారు. తుపాకులతో వచ్చిన సైనికులు పరిస్థితినదుపు చేయలేకపోయారు. ఇల్లు కూలిపోతుందేమోనని భయమేసింది. ప్రాంగణం నిండా మురికి ఊడ్చి ఊడ్చి ఎలిసెండాకు శోష వచ్చింది. నాలుగు రాళ్లు సంపాదించాలిప్పుడే. ఇంటి చుట్టూ కంచె కట్టి ప్రవేశరుసుము అయిదు సెంట్లు అని ప్రకటించింది.

దూరప్రాంతాల నుండి జనం రైళ్లలో, బస్సుల్లో వచ్చారు. ఎలిసెండా ఇంటిచుట్టూ తిరునాళ్లు. వినోదం కోసం సర్కస్ కంపెనీలు కూడా వచ్చాయి.

దేవదూత దర్శనం చేసుకుంటే రోగాలు నయమవుతాయని ప్రచారం జరిగింది. ఒక స్త్రీ ఊహ తెలిసినప్పటినుండి గుండె ఎన్నిసార్లు కొట్టుకొంటుందో లెక్క పెడుతూనే ఉందట. ఇంక లెక్కించటానికి అంకెలు మిగల్లేదు. నక్షత్రాలు చేసే శబ్దంతో నిద్రపట్టటం లేదని వచ్చాడో పోర్చుగీస్ మనిషి. వేకువగా ఉన్నప్పుడు చేసిన వస్తువుల్ని పగలగొడుతుంటాడొక స్లీప్‌వాకర్. ఇవిగాక, ఇంకా చిన్న చిన్న జబ్బులున్న వాళ్లు మరెందరో!

అలసిపోవడంలో కూడా సుఖమున్నదని తెలివచ్చింది పెలాయో దంపతులకు. వారం తిరక్కుండా డబ్బు మూటలు కట్టుకున్నారు. కంచె ముందర ఎడతెగని క్యూ.

రెక్కల వృద్ధుడు మాత్రం ఇవేమీ పట్టనట్టుగా ఉన్నాడు. పైగా దీపాలు, లైట్ల వేడితో కాస్త చికాకుగా కూడా ఉంది అతడికి. కొందరతనికి కలరా గోళీలు ప్రసాదంగా సమర్పించారు. కొందరి నమ్మకం ప్రకారం దేవదూతల ఆహారం అదే. వాటిని అతడు మర్యాదగా తిరస్కరించాడు. అనేక ఇతర భోజన పదార్థాలు కూడా తెచ్చారు భక్తులు. ఏదీ ముట్టుకోలేదు – కాసింత జావ తప్ప. అతడికున్న ఒకేఒక దైవిక గుణం సహనమనిపించింది. రెక్కల్లోని పురుగుల కోసం కోళ్లు వచ్చి పొడిచినా ఓర్చుకున్నాడు. ఈకలు పీకి వాటితో తమ శరీరాల మీద రుద్దుకున్నారు రోగులు. లేస్తే చూడవచ్చని తుంటరులు రాళ్లు విసిరారు. చివరికి విసుగెత్తి ఇనపకడ్డీ కాల్చి పెట్టారు. బాధతో కేకేసి కదిలాడు. కన్నీళ్లతో దీనంగా చూసి ఎవరికీ అర్థం కాని భాషలో ఏదో గొణుక్కున్నాడు. రెక్కలు విదిలించినపుడు మురికీ, చంద్రుని రజనూ నేల రాలింది. అతడికి కోపం రాలేదని తెలిసింది. కాని మానవ సహజమైన ప్రశాంతత కాదు. ప్రళయాన్ని కడుపులో దాచుకున్న సహనమది.

> ఏడుసార్లు ఓడిపో...
> ఎనిమిదోసారి
> ప్రయత్నించు
> – జపాన్ సామెత

విశ్వాసులంతా ఒక కొత్త మనిషికి బ్రహ్మ రథం పట్టడం ఫాదర్ గోంజాగా కిష్టంలేదు. తన సందేహాలకు పై అధికారుల నుండి వివరణ వస్తుందేమోనని నిరీక్షించాడు. కాని రోమ్‌లోని పండితులు మరికొన్ని ప్రశ్నలు సంధించారు. ఈ మనిషికి బొడ్డు ఉందా? అతడి భాషకూ, ప్రాచీన భాష ఆరామిక్‌కూ సంబంధముందా? ఏమైనా మహిమలు చెయ్యగలడా? వగైరా.

అదృష్టవశాత్తూ ఒక అనుకోని సంఘటన జరిగి ఈ నిరీక్షణకు తెరపడింది.

తల్లిదండ్రుల మాట జవదాటినందుకు ఒకావిడ సాలెపురుగుగా మారింది. సర్కస్ కంపెనీ వాళ్లు ఆ సాలెపురుగును ప్రదర్శనకు పెట్టారు. ఆమెను చూడటానికి ప్రవేశ రుసుము, దేవదూత ప్రదర్శన రుసుము కన్నా తక్కువ. అంతేకాదు. సందర్శకులామెతో మాట్లాడవచ్చు. సందేహాలు తీర్చుకోవచ్చు. తాకి, చూసి తృప్తి పడవచ్చు. పైగా అది రాక్షసి సాలీడు. చిన్నపాటి మేకపిల్ల సైజుంది. ఆకారం మాత్రమేకాదు వచ్చిన వాళ్లందరికీ తన దీనగాథ చెప్పుకుని విలపిస్తుంది. చిన్నప్పుడు, తల్లిదండ్రుల పర్మిషన్ లేకుండా మిత్రులతో నాట్యం చెయ్యటానికి వెళ్లింది. తెల్లవారుజామున తిరిగివస్తున్నప్పుడు అడవిలో మెరుపు మెరిసింది. పిడుగు పడింది. దేవతలాగ్రహించారు. తను సాలీడుగా మారిపోయింది. ధర్మాత్ములెవరైనా మాంసం ముక్కలేస్తే ఒక్కొక్క పిసరే తిని బతుకుతున్నది.

సాటి మనిషి కష్టాల ముందు, దేవదూత భేషజం దిగదుడుపు. పైగా పలకిరించినా పలకడే! ఎంత అహంకారం. మహిమలు లేని దేవదూతల వల్ల ఎవరికేం లాభం! ఒక అంధుడు వచ్చి మొక్కితే కళ్లు రాలేదు గాని మూడు కొత్త పళ్లు మొలిచాయి. ఓ పక్షవాతం మనిషి నడవలేకపోయాడు గానీ లాటరీ గెల్చుకున్నాడు. కుష్టురోగికి వ్రణాలు మానలేదుగాని ఒంటిమీద సూర్యముఖి పుష్పాలు మొలిచాయి. ఆశించిందొకటి అయిందొకటి. ఇలాంటి పొరబాట్ల వల్ల దేవదూత పరువు మంట గలిసింది. సాలీడు రాకతో అందరూ అతణ్ణి బవూన్‌ని చూసినట్టు చూశారు. మొత్తం మీద ఫాదర్ గోంజాగా బెంగ తీరింది. పెలాయో ఇంట్లో జనం సందడి తగ్గింది.

మహిమల సంగతెందుకు గాని, వచ్చిన డబ్బెక్కడికీ పోదు. పెలాయో బ్రహ్మాండమైన రెండంతస్తుల బంగళా కట్టించాడు. చక్కటి బాల్కనీలు, గార్డెన్లు పీతలు రాకుండా ప్రహరీ గోడకు వల కూడా వేయించాడు. దేవ దూతలు ఎగిరిరాకుండా కిటికీలకు వైర్‌మెష్ కొట్టించాడు. ఉద్యోగం మానేసి కుందేళ్ల ఫాం పెట్టుకున్నాడు. ఎలిసెండా కొత్త సిల్కు దుస్తులు, జోళ్లు, మేజోళ్లు కొనుక్కుంది. కోళ్ల గూడు సంగతి అందరూ మరచిపోయారు. దాన్నప్పుడప్పుడూ డెట్టాల్‌లాంటి క్రియోలిన్‌తో శుభ్రం చేయడమో, ఎయిర్ ఫ్రెషెనర్‌తో స్ప్రే చేయడమో జరిగింది. అదీ రెక్కల మనిషి కోసం మాత్రం కాదు. అక్కడంతా భరించలేని దుర్గంధం. ఇంత చక్కటి ఇల్లు కట్టుకున్నా, పాత వాసన ఇంకా పోలేదు మరి. చంటి పిల్ల ఎదిగింది నడుస్తున్నది. ఆ చిన్నారి పొరపాటున కూడా కోళ్లగూడు వైపు రాకుండా జాగ్రత్తపడ్డారు తల్లిదండ్రులు, కాని పసికందులు వింటారా? ఒకనాడు అటువైపు వచ్చింది. రెక్కల మనిషి అభ్యంతరం చెప్పలేదు. ఆడుకున్నాడు కూడాను. ఇద్దరికీ చికెన్‌పాక్స్ వచ్చింది. డాక్టరు పిల్లకు చికిత్స చేశాడు. వృద్ధుడి గుండె పరీక్షిస్తే వింత శబ్దాలెన్నో వినిపించాయి. ఇలాంటి మనిషి బతికుండటం అసాధ్యమనుకున్నాడు. పైగా రెక్కలొకటి. మనుసులకు రెక్కలుండటం సహజమా? మరి అందరికీ లేవెందుకు?

పిల్ల స్కూలుకెళ్లటం ప్రారంభించింది.

ఒకనాడు వర్షం వచ్చి కోళ్ల గూడు కూలి పోయింది. దేవదూత భరించలేని బాధతో అటూ ఇటూ కదిలాడు. ఇంట్లోంచి వెళ్లగొట్టటానికెంత ప్రయత్నించినా పోడు. చీపురుతో బెడ్‌రూంలోంచి తరిమేస్తే వంటింట్లో దాక్కున్నాడు. క్షణం మాయమవుతాడు. ఆ వెంటనే మరోచోట కనిపిస్తాడు. ఎక్కడ చూస్తే అక్కడ. ఒకడా పలువురా అని సందేహం. ఒకడే పలువురని చికాకు. ఇంటి నిండా దేవదూతలతో ఎలిసెండాకు ఊపిరాడలేదు. ముసలాడికి కళ్లు కనిపించవు. తినలేదు. ఈకలు లేని రెక్కలు బోసిగా పుల్లల్లాగున్నాయి. పెలాయో జాలిపడి ఓ బ్లాంకెట్ ఇచ్చి షెడ్డులో పడుకొమ్మన్నాడు. ఆ రాత్రి ముసలాడికి జ్వరం వచ్చింది. పలవరించాడు. చచ్చిన దేవదూతలనేం జేసుకోవాలో పక్కింటి ముసలావిడకి కూడా తెలియదు.

చలికాలం గడిచింది. ఎండ తగిలి అతడి ఆరోగ్యం మెరుగు పడింది. రెక్కల మీద మళ్లీ ఈకలు మొలిచాయి. తన శరీరంలో మార్పులెందుకొస్తున్నాయో అతడికి తెలుసు. అదో రహస్యం.

ఒకనాడు ఎలిసెండా వంటకోసం ఉల్లిపాయలు కోస్తున్నప్పుడు గాలిదుమారం వీచింది. తర్వాత వంటింట్లోంచి చూస్తే ముసలాడు ఎగరటానికి ప్రయత్నం చేస్తున్నట్టు గమనించింది. రెక్కలు సరిగా విచ్చుకోలేదు. విఫల ప్రయత్నమే. కొద్దిగా ఎగిరి కిందపడ్డాడు. ఎలిసెండా తృప్తిగా ఊపిరి పీల్చుకుంది. మరి రెండుసార్లు ప్రయత్నించి అతడు ఎగిరాడు–రెక్కలార్చుతూ ఇళ్ల కప్పులపై నుండి డేగలాగ ఉల్లిపాయలు తరుగుతూ అతణ్ణే చూసింది. ఎలిసెండా పైకి, పైపైకి అదృశ్యమయ్యేంతదాకా. దేవదూత పీడ విరగడైంది. చివరికి సముద్రం మీద క్షితిజరేఖ వద్ద బిందువుగా మారిందా రూపం. ●

# నీలికళ్ళు

## ఆక్టేవియో పాజ్ (1914-1998)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



ప్రముఖ మెక్సికన్ కవి, రచయిత, దౌత్యవేత్త ఆక్టేవియో పాజ్. లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని ప్రభావితం చేసిన పాబ్లో నెరుడా, సీజర్ వాలెహోలకు సన్నిహితుడు.

పాజ్ తాతగారు నవలా రచయిత. తండ్రి ఎమిలియానో, జపాటా వద్ద సెక్రటరీగా పనిచేశాడు. జపాటా పరాజయం, హత్య తర్వాత కుటుంబం అమెరికాకు తరలి వచ్చింది. కొన్నాళ్ల తర్వాత మెక్సికో తిరిగి వెళ్లిన పాజ్ అక్కడి నేషనల్ యూనివర్శిటిలో న్యాయశాస్త్రం, సాహిత్యం చదివాడు గాని డిగ్రీ తీసుకోలేదు. నెరుడా ప్రోత్సాహంతో కవితా ప్రస్థానం ప్రారంభమైంది. తొలి దశలో జర్నలిస్టుగా, సాహిత్య పత్రికల సంపాదకుడిగా కూడా పనిచేశాడు.

సర్రియలిస్ట్ కవి ఆంద్రె బ్రెటన్‌తో సాన్నిహిత్యం ఏర్పడిన 1940లలో అధివాస్తవిక ప్రయోగాలు చేశాడు. ఆంద్రెమాల్రా, ఆంద్రె గైడ్, ఇల్యా ఎహ్రెన్‌బర్గ్‌లతో కలిసి స్పానిష్ విముక్తి పోరాటంలో పాల్గొన్నాడు.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత రష్యాలో జరిగిన సంఘటలతో స్టాలినిజం పట్ల విముఖత ఏర్పడింది. మెక్సికో ప్రభుత్వ దౌత్యశాఖలో చేరాడు. "మేధావులు, సాహిత్యకారులు అయిడియాలజీని నమ్మాలి. ప్రత్యక్ష రాజకీయాలు వీళ్ళకి సరిపడవు" అన్నది పాజ్ విశ్వాసం. చివరిదాకా కమ్యూనిస్టుగా జీవించిన నెరుడా, క్యూబన్ విప్లవాన్ని సమర్థించిన గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్‌లతో విభేదించాడు.

దౌత్యవేత్తగా ఆరేళ్లు పారిస్‌లో వున్నకాలంలో, అక్కడి కవులు, మేధావుల సాంగత్యం తోడై అనేక కవితా సంకలనాలు, మెక్సికన్ కళ గురించిన అధ్యయన గ్రంథాలు ప్రచురించాడు.

పాజ్ ప్రధాన రచనలు: 'ఈగల్ ఆర్ సన్' 1951 (కథా సంకలనం) ఎ టేల్ ఆఫ్ టూ గార్డెన్స్ (1952) లేబిరియంత్ ఆఫ్ సాలిట్యూడ్ (1950. 1957) సన్‌స్టోన్ - సూర్యశిల (1957). ప్రేమదేవత - గాడెస్ ఆఫ్ లవ్ గురించిన కవిత యిది.

"నదిలా నీలో ప్రవహిస్తా.
అరణ్యంలా నీలో వ్యాప్తిస్తా".

జపాన్, అమెరికా, యునెస్కోలలో కూడా పని చేశాడు పాజ్. 1962 నుంచి మనదేశంలో మెక్సికో రాయబారిగా వున్నాడు. 1968లో మెక్సికో జరిగిన ఒక మారణకాండకు నిరసనగా ఉద్యోగానికి రాజీనామా చేసి హిందూ, బౌద్ధ మత సాంస్కృతిక జీవితాన్ని అధ్యయనం చేస్తూ గడిపాడు. 'వైరుధ్యాల కలయికే కవితారూపం'. కవి 'యస్' అన్నా దానర్థం 'నో' అంటాడు పాజ్. జీవిత కాలంలో నలభై గ్రంథాలు ప్రచురించిన పాజ్‌కు 1990లో నోబెల్ బహుమతి లభించింది.

చెమటపట్టి దిగ్గున లేచి కూర్చున్నాను. స్నానం చేసినట్టుగా ఒళ్లంతా ధారలు కారిపోతున్నాయి. ఎర్రటి యిటుకలు పరచిన పేవ్‌మెంట్ ఆవిర్లు చిమ్ముతున్నది. బూడిదరంగు సీతాకోక చిలుక మిరు మిట్లు గొల్పుతున్న పచ్చటి లైటు చుట్టూ పరిభ్రమిస్తున్నది. చెట్టుకు కట్టిన వూయల వలలా తోచింది. కిందికి దూకి నగ్నపాదాలతో గదివైపు పరిగెత్తాను. అక్కడ విహరిస్తున్న తేళ్లను నలిపేస్తానని భయం. కిటికీ దగ్గర నిల్చున్నాను. చెట్లమీదుగా వచ్చిన స్వచ్ఛమైన గాలి పలకరించింది. రాత్రి కన్య గుండెల నిండా వూపిరి తీసుకుంటున్న సవ్వడి వినగలుగుతున్నాను. జగ్గులోంచి నీళ్లు వంపి తువ్వాలుతో ఒళ్లంతా తుడుచుకున్నాను. గుడ్డల మడతల్లో చిన్నచిన్న కీటకాలు విశ్రాంతి తీసుకునే ప్రమాదమూ లేకపోలేదు. డ్రెస్ చేసుకుని దిగాను. ఇంటి యజమాని ఎదురుపడ్డాడు. అతడి పలుకే బంగారం. మనం రెండు కళ్లతో చూసే లోకాన్ని అతడు ఒంటికంటితో చూస్తాడు. అల్లిన కేను స్టూలు మీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు – కళ్లు అర మూసుకుని.

"ఎక్కడికి?" బొంగురు గొంతు వాకబు చేసింది.

"ఉక్కగా వుంది. కాస్త అలా నడిచి వస్తాను".

"దుకాణాలు మూసేశారు. వీధి లైట్లు కూడా లేవు. ఇంట్లో వున్నంత క్షేమం లేదు."

"త్వరగా వస్తాను" అంటూ బయటకు పరిగెత్తాను – చీకటి దారులలో స్వేచ్ఛను వెదుక్కుంటూ.

కళ్లు పొడుచుకున్నా ఏమీ కనిపించదు. ఎగుడుదిగుడుదారిలో రాళ్లూ, రప్పలూ. సిగరెట్టు వెలిగించాను.

నల్లని మబ్బు వెనక చంద్రుడు కనిపించి ఆశ్చర్యపరిచాడు. పెచ్చులూడిన తెల్లటి గోడమీద వెన్నెల మెరిసింది. ఆ వెలుగుకు కళ్లు మూతలుపడ్డాయి. గాలి ఈల వేసింది. చింతచెట్ల వాసన ముక్కు పుటాలను ఉత్తేజపరిచింది. ఆకుల కదలిక, కీటకాల కిచకిచలతో రాత్రి గానం ప్రారంభమైంది. మిడతలూ, గొల్లభామలూ గడ్డిపోచల మీద నాట్యం చేశాయి. తలెత్తి చూశాను. ఆకాశంలో చుక్కలు కూడా సభ చేస్తున్నాయి. సైగల భాషలో మాత్రమే అర్థం చేసుకోగల ఈ అనంత విశ్వాన్ని. బృహద్రూపాల జీవులు సంకేతాలలో మాత్రమే సంభాషించుకుంటాయి. నా నడక, గొల్లభామల వయ్యారి కులుకు, నక్షత్రాల అరమోడ్పు కాంతులు – ఇదంతా ఒక వింత భాష. అర్థంకాని పదాల వెనక దాగిన రహస్యాలు. నిశ్శబ్దం కూడా ఒక పలకరింపే. ఈ ప్రకృతి పలుకులలో ఒంటరి అక్షరాన్ని నేను. కాని దీన్ని వుచ్చరిస్తున్నదెవరు? సిగరెట్ విసిరేశాను. నిప్పుకణిక వంకరగా ప్రయాణించి, తోక చుక్కలా మిణుగుర్లు చిమ్ముతూ ఆరిపోయింది.

నెమ్మదిగా, చాలా సేపు నడిచాను. మాట్లాడుతున్న పెదవులు నాకు స్వేచ్ఛ ప్రసాదిస్తున్నాయి. ఇదే ఆనందం. కళ్లు విచ్చిన పూదోట ఈ రాత్రి. రోడ్డు దాటుతుంటే ఎవరో తలుపుతీసిన చప్పుడు. వెనక్కు తిరిగి చూశాను. ఎవరూ లేరు. వడివడిగా ముందుకు కదిలాను. వెనకనుండి, నెమ్మదిగా, అతినెమ్మదిగా, రాతిబండల మీద బూట్ల చప్పుడు వినిపించింది. తలతిప్పి చూడటమెందుకు! అడుగడుక్కీ నీడ నన్ను సమీపించింది. పరిగెత్తాలనుకున్నాను. కళ్లు ముందుకు కదలలేదు. ఆత్మరక్షణకు అవకాశం కూడా లేదు. వీపులో బాకు మొన గుచ్చుకున్నది. మంద్ర స్వరంతో, ఎవరో–

> కొందరు తెలివైన వాళ్ళు భూమిపై ఎంత ఎత్తు వుంటారో, భూమిలోపల కూడా అంతే లోతుంటారు.
>
> –తామపల్లి సామెత
>
> గురిపెట్టి ఊరుకుంటే చాలదు గురూ.... తుపాకీ గుండు పేల్చాలి...
>
> –ఇటాలియన్ సామెత

"కదలొద్దు, మిస్టర్, బాకు దిగుతుంది" అన్నారు అనునయంగా.

"ఏం కావాలి?"

"నీ కళ్లు" – అతిమెత్తని గొంతు. బాధ నిండిన గొంతు.

"నా కళ్లా? కళ్లే చేసుకుంటావు? జేబులో డబ్బుంది తీసుకో. ఎక్కువ లేదనుకో. అయినా వున్నదంతా యిచ్చేస్తాను. నన్ను చంపొద్దు."

"భయపడకు. చంపను. నీ కళ్లు మాత్రమే కావాలి."

"కళ్లెందుకయ్యా బాబూ?"

"నా ప్రియురాలి కోరిక. నీలికళ్లు ఆమెకు కానుకగా యివ్వాలట. ఎంత వెదికినా నీలికళ్లు దొరకలేదింతవరకూ –"

"నావి గోధుమరంగు కళ్లు. నీకుపయోగించవు"

"నన్ను మోసం చెయ్యలేవు మిస్టర్. నీవి నీలికళ్లని బాగా తెలుసు."

"సాటి మనిషి కళ్లెలా పెరుకుతావయ్యా బాబూ. అవి తప్ప మరేమైనా తీసుకో."

"మాటలు కట్టిపెట్టి వెనక్కు తిరుగు."

తిరిగాను. అతడు సన్నగా, బలహీనంగా వున్నాడు.

సగం మొహంమీద ముసుగు కప్పుకున్నాడు. కుడిచేతిలోని కసాయి కత్తి వెన్నెల్లో మెరిసింది.

"ఏదీ, ఒకసారి నీ మొహం చూడనీ."

అగ్గిపుల్ల గీసి మొహం చూసాను. వెలుగుతో కళ్లు మూసుకుపోయాయి. నా కనురెప్పలు తెరిచి చూశాడు. సరిగా కనిపించలేదమో, మునివేళ్ల మీద నిల్చుని, కళ్లలో కళ్లుపెట్టి పరిశీలించాడు. జ్వాలతో కనుబొమలు కాలిపోతాయనిపించింది. మంటకు వేళ్లు చురుక్కుమన్నాయి. అగ్గిపుల్ల పారేశాను. నిశ్శబ్దం.

"ఇప్పటికైనా నమ్ముతావా? నావి నీలికళ్లు కావు."

"మరోసారి చూడనీ. అగ్గిపుల్ల వెలిగించు."

కాలర్ పట్టి లాగి, కళ్లు పరీక్షించాడు.

"కాస్త వంగు."

నా జుత్తు పట్టుకుని, తలకాయ వెనక్కు వంచి మరీ చూశాడు. కసాయి కత్తి నేలకు జారింది. భయంతో కళ్లు మూసుకున్నాను.

"మూసుకోవద్దు. కళ్లు తెరు."

మంటకు ఈసారి కనురెప్పలంటుకున్నాయి. నొప్పి –బాధ.

"ఛీ!' అంటూ నన్నొదిలేశాడు.

"నీలికళ్లు కావులే. వెళ్లిపో." అంటూ అదృశ్యమయ్యాడు. తల పట్టుకుని, గోడకు వాలి నిల్చున్నాడు. తూలి పడబోయాను.

నిర్మానుష్యమైన వీధుల్లో ఆగకుండా గంట సేపు పరిగెత్తాను. తిరిగితిరిగి చివరికియిల్లు చేరుకున్నాను. యజమాని యింకా తలుపు దగ్గరే కూర్చున్నాడు. మౌనంగా లోపలికెళ్లాను. ఆ మరునాడు వూరు వదిలి వచ్చాను.

# ఆత్మ హత్య

## డోరిస్ లెస్సింగ్ (1919 - )

అనువాదం:ముక్తవరం పార్థసారథి



2007వ సంవత్సరానికి నోబెల్ బహుమతిని అందుకున్న డోరిస్ లెస్సింగ్ పెర్షియా (ఇరాన్)లోని కెర్మాన్‌షాలో జన్మించారు. తల్లిదండ్రులిద్దరూ బ్రిటిష్ సంతతివాళ్లే. తండ్రి ఆల్ఫ్రెడ్ టేలర్ యుద్ధంలో వికలాంగుడై, ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ పెర్షియాలో గుమాస్తాగా పని చేశాడు. 1925లో కుటుంబంతో సహా రొడేషియా (ఇప్పటి జింబాబ్వే) వెళ్లి, వెయ్యి ఎకరాల భూమి కొని వ్యవసాయం ప్రారంభించాడు. ఆశించినట్టుగా పంటలు పండలేదు. నష్టం వచ్చింది, దీనికితోడు భార్య దుబారా ఖర్చులతో మరిన్ని చిక్కులు వచ్చిపడ్డాయి.

పదమూడవ ఏట స్కూలూ, పదిహేనవ ఏట ఇల్లూ వదిలి కొంతకాలం నర్స్‌మెయిడ్‌గా, టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేసింది లెస్సింగ్. అప్పుడే పాలిటిక్స్, సోషియాలజీలలో తొలిపాఠాలు నేర్చుకుంది. 1937లో తొలిసారి వివాహం చేసుకుని, ఇద్దరు పిల్లల తర్వాత 1943లో భర్తకు విడాకులిచ్చింది. లెఫ్ట్, కమ్యూనిస్ట్ పుస్తకాలు చదవటం కూడా ప్రారంభించింది.(ఆమె రెండవ భర్త గాడ్‌ఫ్రీడ్ లెస్సింగ్ కమ్యూనిస్ట్). ఈ వివాహం 1949లో ముగిసింది.

అణ్వస్త్రవ్యాప్తికి, జాతి వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించినందుకు దక్షిణాఫ్రికా, రొడేషియా ప్రభుత్వాలీమె మీద నిషేధం విధించాయి. చివరికి లండన్ చేరుకుని రచనా వ్యాసంగం కొనసాగించింది లెస్సింగ్. ఈమె తొలి నవల 'ది గ్రాస్ ఈస్ సింగింగ్' (1949). కథాసంకలనం "దిస్ వాస్ ది ఓల్డ్ చీఫ్స్ కంట్రీ (1951). ఈ రెండూ రొడేషియా అనుభవాల ఆధారంగా చేసిన రచనలే. 1962 నాటి నవల 'ది గోల్డెన్ నోట్ బుక్'ను ఒక ఫెమినిస్ట్ క్లాసిక్‌గా ప్రశంసించారు విమర్శకులు.

తొలి రోజుల్లో కమ్యూనిస్టుగా వున్న లెస్సింగ్, తన "చిల్డ్రన్ ఆఫ్ వయలెన్స్" గొలుసు నవలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నది. రాజకీయ సామాజిక స్పృహతో మాత్రమేగాక, సైన్స్ ఫిక్షన్ కూడా రాసింది. "కానోపస్ ఇన్ ఆర్గోస్" నవలలు ఈ ప్రక్రియలో ఆమె విలక్షణతకు నిదర్శనం.

బహుగ్రంథ రచయిత్రి అయిన లెస్సింగ్‌కు 1954 నుండీ ఏదో ఒక అవార్డు వస్తూనే వుంది. నోబెల్ బహుమతి ప్రకటించిననాడు ఆమె చెప్పినట్టుగా, "యూరోప్‌లో వున్న బహుమతులన్నీ" గెల్చుకుంది. 106 సంవత్సరాల నోబెల్ చరిత్రలో ఈ పురస్కారం అందుకున్న పదకొండవ సాహిత్యకారిణి లెస్సింగ్. అత్యంత వృద్ధ(ఓల్డెస్ట్) విజేత.

'విజ్ఞత, విచక్షణ మనల్ని రక్షించలేవు' అన్నది ఈ కథలోని నీతి కాబోలు.

పాతికేళ్ల దాటాకే అంటే ముప్పైలోపు వాళ్లు పెళ్లి చేసుకున్నారు. పైగా ప్రేమించి మరీ చేసుకున్నారు. ఇద్దరికీ 'ప్రేమ' గురించి తెలుసు. కొద్దో గోప్పో అనుభవం కూడా వుంది. బాగా ఆలోచించుకుని, ఒకర్నొకరు అర్థం చేసుకున్నామనుకున్నాకే 'వివాహ మధురిమ'ను చవిచూశారు.

మిత్రబృందం కూడా వాళ్లను 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అన్నారు. ఇద్దరికీ మంచి వుద్యోగాలున్నాయి. మాత్యూ ఒక వార్తాపత్రికలో సబ్ఎడిటర్. సూజన్, అడ్వర్టయిజింగ్ కంపెనీలో పనిచేస్తుంది.

పెళ్లికి ముందర యిద్దరూ, వేర్వేరుగా మంచి ఫ్లాట్లే కొనుక్కున్నారు. (సొంతిల్లంటూ లేకపోతే, కేవలం అందుకోసమే పెళ్లికి అంగీకరించారేమో అనుకునే ప్రమాదముంది). కొత్త దంపతులుగా మరో పెద్ద ఫ్లాట్‌లోకి మారి, సూజన్ తల్లి కాబోతున్నదని తెలియగానే రిచమండ్‌లో ఒక పెద్ద యిల్లుకొనుక్కున్నారు. త్వరలోనే ఆమె ఉద్యోగం కూడా మానేసింది. ఆ తర్వాత ముందరే ప్లాన్ చేసుకున్నట్టు వరుసగా పిల్లల్ని కన్నారు. ఒక కొడుకు, కూతురు. తర్వాత కవలలు. ఇంకేం కావాలి! సుఖసంతోషాలకు నిలయం ఆ సంసారం.

కాని... జీవితం రోటీన్‌గా సాగిపోతున్నది. చాపకింద నీరులా అసంతృప్తి ప్రవేశిస్తుంది. ఎలా చెప్పటం? పాము తన తోకను తానే మింగటానికి ప్రయత్నించినట్టుగా పెద్ద సంసారాన్ని పోషించాలంటే మాత్యూ ఎక్కువ సంపాదన కోసం కష్టపడి పనిచెయ్యక తప్పదు. విశాలమైన యిల్లూ ఎదుగుతున్న పిల్లలూ, అలసిసొలసి యింటికొచ్చే మొగుడూ–సూజన్ బాధ్యతలు కూడా తక్కువేమీ కాదు.

> అసలు మారినప్పుడల్లా
> నకిలీలు కూడా
> మారుతుంటాయి.
> –ఒంగోలు సామెత

ఎవరి కోసం, ఎవరు యిదంతా చెయ్యాలి? 'పిల్లల కోసం' అనుకోవటం మూర్ఖం. ఈ లోకంలోకి రావటంలో వాళ్ల బాధ్యత ఏముంది? పైగా ఈ జీవితంలో యింకా ఏమాత్రమైనా ఆనందం మిగిలుందనుకుంటే వాళ్లవల్లే.

మాత్యూ, సూజన్ లిద్దరివీ హేతుబద్ధమైన ఆలోచనలే. బంధుమిత్రుల సంసారాలను చూస్తే తెలుస్తుంది. ఎన్ని కలహాలు. ఎన్ని బాధలు. పరస్పరం నిందించుకుంటూ శత్రువుల్లా బతుకుతున్న వాళ్లెందరో! ఇలాంటి దుఃఖభాజనమైన లోకంలో తమకే సమస్యలూ లేనట్టే.

విఫలమైన దాంపత్యాలను చూసి వీళ్లెన్నో పాఠాలు నేర్చుకున్నారు.

పిల్లలకోసం, ప్రశాంతత కోసం అంటూ లండన్‌కు దూరంగా యిల్లు కొనుక్కుంటూరందరూ. దానివల్ల ఎన్నో సమస్యలు. రోజూ అంతదూరం ప్రయాణించలేక మాత్యూ వీకెండ్ మాత్రమే యింటికొస్తే... మిగతా రోజులన్నీ ఆ మహానగరంలో ఒంటరిగా వుంటే...

తిరిగి వుద్యోగంలో చేరాలనుకోలేదు సూజన్.

ఆలోచించి, సమస్యల్ని విశ్లేషించి నిర్ణయాలు తీసుకునేవారే యిద్దరూ. శాస్త్రపరిజ్ఞానానికి కొదవలేదు. సైకాలజీ, ఆంత్రపాలజీ, సోషియాలజీ వగైరాలలో అత్యాధునిక పరిశోధనా గ్రంథాలు కూడా చదివారు. కాని రోజువారీ జీవితమెందుకో పిడచగట్టుకు పోతున్నట్టుగా వుంటున్నది.

విద్యా, విచక్షణ మనకెంతవరకు సాయం చేస్తాయి?

ఒకనాడు ఆలస్యంగా యింటికి చేరిన మాత్యూ మరో అమ్మాయి (మైరా జెంకిన్స్)తో పార్టీ కెళ్లానన్నాడు. సూజన్ బాధపడలేదు. పెళ్లయి పదేళ్లు దాటింది. జీవితం ఆసక్తికంగా వుండాలంటే యిలాంటి చిన్న చిన్న 'డైవర్షన్స్' తప్పవేమో. వివాహం ఎడారిగా మారుతున్నప్పుడు, బ్రహ్మజెముడు మొక్కలు పెరుగుతున్నాయని అందోళన చెందటం ఎందుకు?

ఇద్దరికీ నలభై సమీపిస్తున్నాయి. పెద్దపిల్లలకు పది, ఎనిమిది. స్కూల్లో వున్నారు. కవలలకు ఆరు. పిల్లలకోసం నర్సులనూ, ఆయాలనూ పెట్టుకోలేదు సూజన్. చూస్తుండగానే బాల్యం గడిచిపోయింది. తను స్వయంగా వాళ్ల ఆలనా, పాలనా చూడటంలో వచ్చే ఆనందాన్ని వదులుకోవటం యిష్టం లేదామెకు. పనులు చేసి తరచూ అలసిపోతుంది. కాని ఆ అలుపులోనే సంతోషం వుంది.

త్వరలోనే కవలలు కూడా స్కూలు కెళతారు. అంటే ఉదయం తొమ్మిదింటి నుంచి సాయంత్రం నాల్గింటిదాకా తాను ఒంటరిగా వుండాల్సిందే. ఈ ఒంటరితనం లోనే స్వేచ్ఛను సృష్టించుకోవాలి. ఇల్లాలిగా, తల్లిగా మాత్రమే కాక, ఒక 'వ్యక్తి'గా తనేమిటో నిరూపించుకోవాలి.

ఈ విషయంలో మాత్యూ కూడా ఆమెను సమర్థించాడు.

కాని–సూజన్ వయసిప్పుడు ఇరవై ఎనిమిది కాదు. కవలల్ని స్కూల్లో వదిలి రాగానే, ఆ విశాలమైన ఇల్లు తననే ఆహ్వానిస్తున్నట్టనిపించింది. హెల్పర్‌గా వున్న మిసెస్ పార్బ్స్ వంటగిన్నెలు సర్దుతున్నది. ఆ ఒంటరితనంలో టెన్షన్ తగ్గించుకోవటానికి ప్రయత్నించింది సూజన్. దూరంగా నది కనిపిస్తున్నది. గాలికి, చెట్ల ఆకులు నెమ్మదిగా కదులుతున్నాయి. జీవితాన్ని సమీక్షించుకుంటే–అడల్ట్‌గా, మొదట పన్నెండేళ్లు తన ఇష్టానుసారం బతికింది. ఆ తర్వాత పెళ్లి. మొదటి గర్భం నుండే తన సమయం, వ్యక్తిత్వం మరొకరికి అంకితం. ఒంటరిగా బతకటమంటే ఏమిటో ఇప్పుడు మళ్లీ నేర్చుకోవాలి.

తీరిగ్గా వుండాలని తీర్మానించుకొని పిల్లల దుస్తులకు చిరుగులు కుట్టటం ప్రారంభించింది. ఇంకేం. అలాంటి పనులతోనే రోజంతా ఆమెలో కొన్ని పరస్పర వైరుధ్యభావాలు సంఘర్షించాయి. పిల్లలు ఇంట్లో వుంటే ఏకాంతం లేదనీ, ఒంటరిగా వున్నప్పుడు ఏం చెయ్యాలో తోచక ఇబ్బంది పడింది. తన ఆలోచనల్లో హేతుబద్ధత లేదని తెలుసు. ఈ ఆలోచనల్ని మాత్యూతో కూడా పంచుకోలేదు.

సెలవులకు పిల్లలింట్లో వున్నారు. లోపల్నించి లావా తన్నుకొస్తున్నది. ఒకనాడు ఆ కోపమంతా వాళ్లమీద చూపింది. తల్లి అలా కేకలెయ్యటమెందుకో పిల్లలకు అర్థం కాలేదు. 'అమ్మకు తలనొప్పిగా ఉన్నట్టుంది' అని సర్దిచెప్పాడు పెద్ద కుర్రాడు.

రాత్రి భర్తకీ విషయం చెప్పింది.

"మనం కొత్త పరిస్థితులకు అడ్జస్టు కావటంలో ఎదురయ్యే సమస్యలివి" అని వ్యాఖ్యానించాడు మాత్యూ. పిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించినందుకు వెక్కి వెక్కి ఏడ్చింది సూజన్.

అయిదు వారాలు గడిచాయి. పెద్ద పిల్లలు తోడు అవసరం లేకుండానే స్కూలుకెళ్లగలరు. కవలలకు ఇంకా తన అవసరం వుంది.

తనలో పెరుగుతున్న అశాంతికి కారణం వెదకాలనుకున్నది సూజన్. ఈ అంతఃశత్రువును తుదముట్టించక తప్పదు. వంటింట్లోకెళ్లబోతుంటే, "మీకెందుకండీ ఈ చాకిరీ? నేను చేస్తానుగా" అంటూ అడ్డుపడింది మిసెస్ పార్బ్స్.

కాని ఏదో ఒక పని ముందరేసుకుంటే గాని ఈ లోపలి అలజడి తగ్గదు. పడగ్గదిలో బట్టలు సర్దింది. మిసెస్ పార్బ్స్ సణుగుడు ఆపలేదు. తోటలో సేదదీరాలనుకుంది. కాని అక్కడ చెట్ల చాటున ఒక భూతం తనను కబళించటానికి పొంచి వుంటుంది.

పిల్లలు ఇంట్లో లేని ఏడు గంటలూ తనకు దొరికింది స్వేచ్ఛ కాదు.

ఏకాంత గృహంలో ఖైదు మాత్రమే.

ఏకకాలంలో పరస్పర విరుద్ధమైన భావనలెన్ని సుడిగుండాలు సృష్టిస్తున్నాయో. నిజానికి పిల్లలు ఇంట్లో లేనప్పుడే తాను మహాబిజీగా గడుపుతున్నది గాని వాళ్లున్నప్పుడు వాళ్ల వల్లే తీరిక వుండటం లేదని నమ్మించుకుంటున్నది. అక్కర్లేని పనులన్నీ ముందరేసుకుని కూర్చోవటమెందుకు?

మాథ్యూకివన్నీ చెప్పలేదు. అర్థంలేని ఆలోచల్ని పంచుకోవటం అసాధ్యం. ఏకాంతంలో కూడా క్షణం తీరిక లేదనుకుంటారు కొందరు. స్వేచ్ఛ అంటే ఏమిటి? ఎవరి నుండి స్వేచ్ఛ? హేతుబద్ధంగా విశ్లేషించలేనప్పుడు ఆలోచనలు చిక్కుముళ్లుగా మారతాయి.

భర్తతో చర్చించాక తనకో ప్రత్యేకమైన గది అవసరమని నిర్ణయించుకున్నారు. తలుపుమీద 'ప్రైవేట్! డూ నాట్ డిస్టర్బ్' అని ఒక బోర్డు కూడా వేళ్లాడ దీశారు. (పిల్లలు అక్షరాలను రంగుల్తో అలంకరించారు. ఇది 'మదర్స్ రూం')

కానీ, గదంటూ దొరికాక, అక్కడ ఒంటరితనం మరింత ఎక్కువైంది. పిల్లలు అటువైపుకే రాలేదు. "గోల చెయ్యొద్దు. బిగ్గరగా మాట్లాడొద్దు" అంటూ ఆంక్షలు పెట్టుకున్నారు. లోపల, ఏం చెయ్యాలో తోచక పిల్లల దుస్తులు రిపేరు చెయ్యటమూ, స్వెటర్లు అల్లటమూ ప్రారంభించింది సూజన్. పిల్లలూ, మిసెస్ పార్క్స్ తరచూ వచ్చారు. 'మదర్స్ రూం' కాస్తా 'ఫ్యామిలీ రూం'గా మారింది.

ఒకనాడు గార్డెన్‌లో ఎవరో యువకుడు లేదా మధ్యవయస్కుడు తిరుగుతున్నట్టనిపించింది. సన్నగా, పొడ్డుగా వున్నాడు. తనవైపే చూస్తున్నాడు. చేతిలో కర్ర పట్టుకుని గడ్డిపామును చంపుతున్నాడు. (పామో లేదా అలాంటి మరో జీవి) చుట్టలు చుట్టుకుని పోతున్నదది.

ఎవరతడు? ఈ అపరిచితుడికి తన గార్డెన్‌లో ఏం పని? మాట్లాడాలని దగ్గరగా వెడితే అదృశ్యమయ్యాడు. తన చుట్టూ పరచుకున్నవి చెట్లనీడలు మాత్రమే.

ఇంట్లో ఏకాంతం వీలుపడదు. ఎవరికీ తెలియనిచోట, రహస్యంగా ఒక గది తీసుకోవాలి.

ఒకనాడు విక్టోరియా వద్ద 'రూంస్ టు లెట్' ప్రకటన కనిపించింది. ఇంటి నుండి కాస్త దూరమే కాని లోకల్ ట్రెయిన్‌లో వచ్చి ఒకటి రెండు గంటలు గడిపి వెళ్లిపోవచ్చు. కాని, స్వంత సంపాదన లేదే! అద్దె చెల్లించటమెలా? మాథ్యూని డబ్బులడిగితే రహస్యం అతడికి తెలిసిపోతుంది. షాపింగ్ ముగించుకుని, ఒక చిన్న మోటల్‌లో గదుల గురించి వాకబు చేసింది. కౌంటర్ దగ్గర కూర్చున్నావిడ సూజన్ వైపు సందేహంగా చూస్తూ, కేవలం "ఒకటి రెండు గంటల కోసం గదులివ్వ"మని చెప్పింది. అది 'అలాంటి' హోటల్ కాదట. ఇరవై నాలుగ్గంటల అద్దె ముందే చెల్లిస్తే అభ్యంతరం లేదు.

గది చాలా సింపుల్‌గా వుంది. సూజన్‌కు కావాలసింది కూడా అదే.

> మళ్ళో, మేకులో
> ఏ కారణం వల్లనైనా
> నాలుగు పక్కలా
> చిమ్మి పారేశావనుకో
> చెప్పుల్లేకుండా ఆ ప్రాంతంలో
> నువ్వు నడవకూడదు.
> -ఇటాలియన్ సామెత
>
> మాయామర్మాలు
> కనిపెట్టగలిగితే
> ఏ బహుమతినైనా
> స్వీకరించవచ్చు.
> -పెర్షియన్ సామెత

గ్యాస్ సదుపాయం వుంది. చిల్లర డబ్బులు బాక్స్‌లో వేసి మీటర్ తిప్పితే నెమ్మదిగా గది వేడెక్కింది. కిటికీలు తీసి ఒక మూలన కుర్చీలో కూర్చుంది. ఈ ఏకాంతం బాగుంది. తెలియకుండానే కునుకు పట్టింది.

సాయంత్రందాకా యజమానురాలు యింటికి చేరకపోవడంతో మిసెస్ పార్క్స్‌కు భయం మొదలైంది. స్కూలు నుండి టీచర్ ఫోన్ చేసి పిల్లకు పంటి నొప్పి వచ్చిందని చెప్పింది. ఏ మందు వెయ్యాలో తనెలా చెప్పగలదు!

✡

హోటల్ మేనేజర్ తలుపు తట్టటంతో మెలకువ వచ్చి హడావిడిగా యింటికి బయల్దేరింది సూజన్. ఈ 'స్వేచ్ఛా జీవితం' బాగానే వుంది. ట్రెయిన్‌లో "మళ్లీ వుద్యోగంలో చేరితే?" అనే వూహ కూడా వచ్చింది. కనీసం పార్ట్-టైం జాబ్ అయినా చెయ్యవచ్చు.

ఆ రాత్రి, మాథ్యూతో తనకు 'హాలీడే' కావాలని చెప్పింది. ఒక లాంగ్ హాలీడే. ఆ మరునాడే, పిల్లల్ని మిసెస్ పార్క్స్ సంరక్షణలో వదిలి వేల్స్‌లో ట్రెక్కింగ్‌కు బయల్దేరింది. ఎవరికీ తెలియనిచోట్ల తాను ఒంటరిగా తిరగాలి. కాని, కుక్క మెళ్లో గొలుసులాగా వైర్లున్నంత వరకూ మనుషులకు దూరంగా వుండటం అసంభవం.

కొండలు, కోనలు, విశాలమైన పచ్చిక మైదానాలలో విహరించి వచ్చిన సూజన్ బాదరబందీ మరింత తగ్గించుకునే వుద్దేశంతో ఓ బేబీ సిస్టర్‌ను కుదుర్చుకుంది. సోఫీ స్ట్రాబ్ జర్మన్ పిల్ల. హాంబర్గ్ నుండి వచ్చింది. ఇంగ్లీషు నేర్చుకోవటానికి సీరియస్‌గా ప్రయత్నిస్తున్నది.

ఇప్పుడిక తనకు 'తీరికే' అనుకుంది సూజన్. ఇంటిపనులు, వంట పనులు, పిల్లల పనులు చూసుకోవటానికిద్దరు మనుషులున్నారు. మాథ్యూ ఆఫీసుకెళ్లగానే తనూ బయల్దేరి, రెండు రైళ్లు మారి, పాడింగ్టన్ చేరుకుని చవకబారు లాడ్జింగుల పేర్లు చదువుతూ 'ఫ్రెడ్స్ హోటల్' దగ్గిర ఆగింది. గేట్ వద్ద నిల్చున్న మనిషి లోపలికి ఆహ్వానించాడు. పాత బిల్డింగ్, గోడలకున్న పెయింట్ రాలిపోతున్నది. పెద్ద హోటళ్లలాగా జిగేల్మనే డెకరేషన్లేమీ లేవు. అయితేనేం, తన అవసరాలు చాలా తక్కువ. ఎవరూ పలకరించనిచోట కొన్ని గంటలు గడపగలిగితే చాలు. అడ్వాన్స్ తీసుకుని ఫ్రెడ్ వెళ్లిపోయాడు. "సాయంత్రం అయిదింటికి కాల్ చెయ్యండి, వెళ్లిపోవాలి" అని చెప్పింది సూజన్.

మధ్యాహ్నం పన్నెండైంది. ఈజీ ఛెయిర్‌లో వెనక్కి వాలింది. నిమిషాలు, గంటలు యిట్టే గడిచిపోయాయి. ఫ్రెడ్ తలుపు తట్టాడు.

ఈ అరేంజిమెంట్ బాగానే వుంది. వారానికి మూడుసార్లు, ఉదయం పదింటికి వస్తుంది. ఇరవై షిల్లింగుల అద్దె చెల్లించి సాయంత్రందాకా గడుపుతుంది. హోటల్ రిజిస్టరులో తన పేరు సూజన్ రాలింగ్స్‌కు బదులు 'మిసెస్ జోన్స్' అని నమోదు చేసుకుంది.

ఇంట్లో యిబ్బంది లేదు. వారానికైదు రోజులూ యిక్కడే గడపొచ్చు. మాథ్యూనడిగి అయిదు పౌండ్లు తీసుకుంది. ఆ మాత్రం చాలు. సోఫీ, మిసెస్

పార్ట్న కలిసి పనులన్నీ చూసుకుంటున్నారు.

✡

మనలో వచ్చే మార్పును ఎదటివాళ్లే త్వరగా గ్రహిస్తారు.

"సూజన్, నీకిబ్బందిగా ఏం లేదుగదా? ఏమైనా ఒత్తిడి ఫీలవుతున్నావా? ఇంక యింతేనా?" అని మాత్యూ.

"విడాకులు కావాలా?"

పెద్దగా నవ్వొచ్చింది గాని ఆపుకుని కాసేపాగి,

"నా వుద్దేశం అది కాదు"

"ప్రశ్న అడిగింది నువ్వు. అందువల్ల నువ్వే జవాబు చెప్పాలి"

మరుసటిరోజు హోటల్‌కెళ్లి.

"నా గురించి ఎవరైనా ఎంక్వైరీ చేశారా?" అని మేనేజర్నిడిగింది. కాస్త సందేహించి.

"అవును మిసెస్ జోన్స్. ఒక వ్యక్తి మీ గురించి ఆరా తీశాడు" అన్నాడు ఫ్రెడ్.

"డిటెక్టివ్ ఏజెన్సీ మనిషా?"

"కావచ్చు"

"మీరేం చెప్పారు?"

"మీరు రోజూ యిక్కడికి వచ్చి ఉదయం పదింటినుండి సాయంత్రం అయిదింటి దాకా రూం నంబరు పందొమ్మిదిలో గడుపుతారని చెప్పాను"

"ఇంకా"

"నన్నేం చెయ్యమంటారండీ? చెప్పక తప్పదు గదా"

గదిలోకెళ్లి కూర్చుంది సూజన్. భర్త తన గురించి రహస్యంగా ఎంక్వైరీలు చేస్తున్నాడన్నమాట. అంటే యిక ప్రైవసీ లేనట్టే. అతడు ఎప్పుడైనా యిక్కడికి రావచ్చు.

ఆ తర్వాత చాలాసార్లు ఆమె హోటల్‌కు వచ్చింది. కాని యిప్పుడక్కడ ఏకాంతం దొరకదు. కిటికీ తలుపులకు దీపం పురుగులు కొట్టుకున్నట్టుగా అటూ ఇటూ తిరిగింది. రెక్కలూడిన శలభాలు నేల రాలక తప్పదు.

వారం గడిచింది.

"ఇదిగో నీ అయిదు పౌండ్లు" అంటూ యివ్వబోయాడు మాత్యూ.

అడ్డంగా తలూపుతూ, "నా గురించి తెలుసుకున్న తర్వాత, వెళ్లి మాత్రం ప్రయోజనమేమిటి?" అంది సూజన్.

"ఎక్కడికెళుతున్నావో తెలియకపోతే భయమేస్తుందిగదా?"

"ఆ సందేహం కూడా వచ్చింది."

"అది నా ఏకాంత ద్వీపం. కొద్ది గంటలైనా, అన్ని చికాకులు మరచి, సుఖంగా వుండగలిగిన గది నా రూం నెం. 19."

"నీ విషయం సరేగాని నా గురించి ఓ రహస్యం చెప్పాలి. ఇటీవలే ఓ అఫెయిర్ ప్రారంభించాను."

"నిజంగా? ఎవరావిడ?"

"ఫిల్. ఫిల్‌హంట్."

ఇందులో షాక్ కావలసిందేమీ లేదు.

ఏదైనా తప్పు
జరిగిపోయినప్పుడు
ఎవరైనా చిరునవ్వు
నవ్వాడనుకో,
ఆ తప్పు
ఎవరి మీదకు నెట్టాయాలో
అతనికి అప్పుడు
స్ఫురించిందని గ్రహించు.
-ఉయ్యూరు సామెత

"చెప్పదలచుకోలేదుగాని నేనూ ఓ సంబంధం పెట్టుకున్నాను". అతడి పేరు మైకెల్ ప్లాంట్.(ఛ.ఎంత చెత్త పేరు!) అతనో పబ్లిషర్"

"పెళ్లి చేసుకుంటావా?"

"గుడ్ గాడ్. నో..."

తన వైపు నుండి లైన్ క్లియర్ అయితే మాత్యూ పెళ్లి చేసుకుంటాడేమో!

లోపల నిప్పు రగుల్కుంటున్నది. అతడో సంబంధముందని చెప్పినందుకు, తనూ అబద్ధమాడింది. మాత్యూ ఆఫీసుకు బయల్దేరిందాకా పడకమీద నుండి కూడా లేవలేదు. పిల్లలు స్కూళ్లకు తయారయ్యారు. ఎందుకు లేవటం! రోజులు, వారాలు యిలాగే గడవనీ. భర్త కాని భర్త పక్కన పడుకుంటే ఎలాగో జీవితం గడిచిపోతుంది.

కాస్త ఆలస్యంగా లేచి, డ్రెస్ చేసుకుని, పాడింగ్టన్ చేరుకుని ఫ్రెడ్స్ హోటల్ దాకా నడిచింది. తన గది (19) ఖాళీగా లేదంటే రెస్టారెంట్ కెళ్లికూర్చుంది. టీ తాగుతూ జనాన్ని పరిశీలించింది. ఓ గంట తర్వాత ఫ్రెడ్ వచ్చి రూం కీ యిచ్చాడు. బిల్లు పేచేసి నెమ్మదిగా మెట్లెక్కింది.

ఆదే గది. పాత ఫర్నిచర్. మాసిన కర్టెన్లు. అప్పటిదాకా బెడ్ మీద ఒక జంట పడుకున్నట్టున్నది. శరీరాల ఆకారంలో గుంటలుపడిన పరుపు. డ్రెస్సింగ్ టేబుల్ మీద పౌడర్ వాసన. పడక్కుర్చీలో కూర్చుంది. అయిందింటికి తలుపుతట్టే ఫ్రెడ్ కోసం ఈ రోజు నిరీక్షించవలసిన అవసరం లేదు.

ఊహల దయ్యాలు యిప్పుడు తనను భయపెట్టలేవు. ఆలోచనలనుండి, వేకువ నుండి స్వేచ్ఛవైపు ప్రయాణిస్తున్నది. ఒక స్వప్నాంధకారం ఆవరిస్తున్నది. అదే ఆఖరి ఆలింగనం. ముందు జాగ్రత్తగా కొరొనర్ కుత్తరం రాయాలా? కాని ఏ కారణంతో ఈ పనిచేస్తున్నానని చెబుతుంది? తను సృష్టించిన మైకెల్ ప్లాంట్‌ను పొందలేనందుకా? రిడిక్యులస్. ఈ లోకం నుండే సెలవు తీసుకుంటున్నప్పుడు జీవితం గురించి ఆలోచించటమెందుకు! తనకో ప్రేమికుడున్నాడని భర్తా నమ్మదలచుకుంటే నమ్మనీ. మైకెల్ ప్లాంట్ అనబడే పబ్లిషర్ లండన్‌లో లేడని త్వరలోనే తెలిసిపోదా. అప్పుడనుకుంటారు, అసలు పేరు దాచిపెట్టిందని.

ఇక, మాత్యూ ఎవరితో పోతే ఏమిటి? ఫిల్ హంట్? సోఫీ?

ఇంకా నాలుగ్గంటల సమయముంది. నది ఒడ్డున నడుస్తూ చివరి క్షణాలనానందించింది. నెమ్మదిగా, సుఖంగా స్పృహ తప్పాలి. తలుపుకింద నుండి గాలి రాకుండా రగ్గు మడిచి అడ్డం పెట్టింది. కిటికీలు మూసింది. రెండు షిల్లింగులు గ్యాస్ మీటర్‌లో వేసి నాబ్ ఓపెన్ చేసింది. గాలి చొరక గది కాస్త వుక్కగా వున్నట్టనిపించింది. చిరుచెమట పట్టింది. కాళ్లమీద బ్లాంకెట్ కప్పుకుంది. పాము బుసకొట్టినట్టుగా శబ్దంచేస్తూ గ్యాస్ గది నిండా వ్యాపించింది- సాటిన్ కవర్ కప్పుకుని పడుకున్న సూజన్ వూపిరి తిత్తుల్లో, మెదడులో వెచ్చగా ప్రవేశించింది గ్యాస్... పొంగిపొరలిన చీకటి నదిలో మునిగింది సూజన్.

●

# చివరిసారి

## ఇవాన్ బునిన్ (1870 - 1953)

అనువాదం:ముక్తవరం పార్థసారథి



ధనిక భూస్వామ్య కుటుంబంలో జన్మించాడు. అర్ధబానిస విధానం (సెర్ఫ్ సిస్టం) రద్దయిన పరిణామంగా ఆర్థిక పరిస్థితి తారుమారైంది. మొదట ప్రభుత్వ గుమాస్తాగాను, తర్వాత ఓ పత్రికలోనూ ఉద్యోగం చేశాడు. మాస్కో యూనివర్సిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే రచనలు ప్రారంభిం చాడు. తొలి దశలో మంచి కవిగా కూడా పేరు వచ్చింది. 1903లో పుష్కిన్ ప్రైజ్ అందుకున్నాడు. 1909లో రష్యన్ అకడెమీ ఆఫ్ సైన్స్‌కు ఎన్నిక య్యాడు. 1910లో ప్రచురించిన "ది విలేజ్" నవలతో ఇవాన్ బునిన్‌కు ప్రపంచ ఖ్యాతి వచ్చింది. దీన్ని మరొక ప్రసిద్ధ నవల, గోంచారెవ్ రాసిన ఓబ్లామోవ్‌తో పోల్చారు.

టాల్‌స్టాయ్, చెహోవ్‌ల ప్రభావం బునిన్ మీద ఎక్కువగా కనిపిస్తుంది. వైయక్తికమైన, ఆత్మానుభూతి రచనలు బునిన్ ప్రత్యేకత. కుటుంబ నేపథ్యం వల్ల కాబోలు బునిన్ తొలి నుండీ విప్లవాన్నీ వ్యతిరేకించాడు. విప్లవానంతరం 1917లో రష్యా వదిలి పారిస్‌లో స్థిరపడ్డాడు. పాశ్చాత్య సాహిత్యాన్ని ముఖ్యంగా ఫ్రెంచి, ఇంగ్లిష్- అధ్యయనం చేసిన బునిన్ తరువాతి రచనలు శైలీ, కథనంలో పశ్చిమ దేశాల కథలకు దగ్గిరగా ఉంటాయి.

టాల్‌స్టాయ్, దోస్తోవ్‌స్కీ లాంటి వాళ్ళు 'రష్యన్ ఆత్మ'ను దర్శింప చేశారంటే, 'అసలు రష్యన్ ఆత్మ అనేది ప్రత్యేకంగా లేద'ని, బునిన్ వ్యాఖ్యానించాడట. 1915 నాటి కథ "ది జెంటిల్‌మెన్ ఫ్రం శాన్‌ఫ్రాన్సిస్కో" బునిన్ రచనల్లో ఆణిముత్యం అంటారు. 1933లో నోబెల్ బహుమతి పొందిన తొలి రష్యన్ రచయిత బునిన్. మరణించిన 55 సంవత్సరాలకు అతడి అముద్రిత రచన "కర్స్‌డ్ డేస్, ఎ డైరీ ఆఫ్ రివల్యూషన్" 1998లో వెలుగు చూసింది.

శిశిరరాత్రి. అంతటా వెన్నెల పరచుకుంది. చలి వణికిస్తోంది. నేల తడిగా ఉంది. గుర్రం సిద్ధం చెయ్యమన్నాడు స్టెఫ్నెవ్. గుర్రాల చావిడి కిటికీ గుండా పొగ మంచులాంటి వెలుగు ప్రవేశించింది. గుర్రం కన్ను ఒకటి వజ్రంలా మెరిసింది. బరువైన కోసాక్ జీను దాని మీద వేశాడు సేవకుడు. కళ్లెం సవరించి, నేలకు జారిన తోక ముడి వేశాడు. యజమాని ఆజ్ఞలకు తలూపిందా సాధు జీవి. బరువుకు ఉపిరితిత్తుల నిండా గాలి పీల్చుకుంది.

ప్రయాణానికి సిద్ధమైన గుర్రం ఇప్పుడు హుందాగా ఉంది. దాన్ని నెమ్మదిగా నడిపించుకుని వచ్చి వాకిట్లో గుంజకు కట్టేశాడు సేవకుడు. పచ్చటి పళ్లతో ఇకిలిస్తూ నేలమీది లేత గడ్డిని చప్పరించింది గుర్రం. గాలి పీల్చినప్పుడల్లా తేలిన పక్క టెముకల్తో చర్మం సాగినట్టనిపించింది. పక్కన నీళ్ళ మడుగులో చంద్రబింబం కదులుతోంది. గాలికి ప్రాణం లేచి వచ్చినట్టుగా చెట్లు తలలూపుతున్నాయి.

కొరడా పట్టుకుని స్టెఫ్నెవ్ ముందుకు కదిలాడు. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. వెండి పోగులల్లిన లెదర్ కోటు మెరుస్తోంది. తల మీద ఫర్ కాప్. యవ్వనం గడిచింది. మొహం మొద్దు బారినట్టుగా ఉంది. షేవ్ చేసుకోలేదేమో, చెక్కిళ్ళ మీద తెల్లటి గడ్డం పెరిగింది. అరిగిన పాత బూట్లు పాలిష్ లేక కర్ర జోళ్లలా ఉన్నాయి. దుస్తుల మీద ఎండిన గుర్రపు నెత్తుటి మరకలు నల్లటి మచ్చల్లా కనిపిస్తున్నాయి.

> ఒక నీటి బొట్టును చూసి
> తర్కం తెలిసినవాడు
> అది చెరువు నీరా,
> సముద్రం నీరా,
> బావి నీరా, కాలువ నీరా
> పోల్చుకోగలడు.
> –శృంగవరపుకోట
> సామెత

పక్క కిటికీ తెరుచుకుంది.

"ఆంద్రే, నా బుజ్జినాన్నా, ఎక్కడికి బయల్దే రావురా?" అంటూ వినిపించిందో స్వరం బలహీనంగా.

"పాలు తాగే పిల్లాణ్ణా? ఎందుకడుగు తావలా?" అంటూ మొహం చిట్లించుకుని కదిలాడు స్టెఫ్నెన్.

ఈసారి గది తలుపు సగం తీసి, తండ్రి కాలిజోళ్లు కూడా తొడుక్కోకుండా వచ్చాడు. మొహం ఉబ్బింది. కళ్లు ఎరుపెక్కాయి. ఏడుపే తరువాయి. జుత్తు నెరిసింది. దుస్తులు కూడా సరిగా వేసుకోలేదు. తాగి ఉండడంతో కాస్త తూలుతున్నాడు.

"ఎక్కడికి రా?"

గొంతు బొంగురుగా ఉంది. "వీరాను అడిగానని చెప్పు. ఆ పిల్లంటే నాకు అభిమానం, గౌరవం".

"నీకు మనుషుల్ని గౌరవించటం కూడా తెలుసా? జీవితంలో ఎప్పుడైనా, ఎవర్నైనా గౌరవించావా? మరొకరి స్వంత విషయాల్లో జోక్యం చేసుకోవటం మానెయ్యి మొదట" అన్నాడు స్టెఫ్నెవ్ కోపంగా.

"సారీ, సారీ. భగ్న ప్రేమికుని ఏకాంత యాత్రకు అడ్డు తగిలాను." అంటూ ఓ విరహగీతం ఆలపించాడు తండ్రి.

ఎంత చెడ్డా తండ్రి! ఇంకెలా తిట్టగలడు? పళ్లు పటపట లాడించుకుంటూ గుర్రమెక్కాడు స్టెఫ్నెవ్. యజమాని స్పర్శను గుర్తించిన గుర్రం సకిలించి ప్రయాణానికి సిద్ధమైంది. దాని అడుగులతో నీళ్లమడుగులో చంద్రబింబం చెదిరింది.

## 2

విశాలమైన స్టెప్పీ మైదానంలో వెన్నెల పరచుకుంది. గుడ్లగూబలు నిశ్శబ్దంగా రెక్కలార్చి చెట్లమీద విహరిస్తున్నాయి. గుర్రం తలూపుతూ పరిగెత్తుతోంది. ఒక చిన్న అడవి గుండా సాగుతుంది దారి. అక్కడ చలిగా ఉంది. మంచుతో మరింత ఎక్కువవుతోంది. చంద్రుడి కోసం చేతులు చాచినట్లుగా పైకెగసిన చెట్ల కొమ్మలు. వాటి మీద తుషార కాంతి మెరుస్తోంది. ఆస్పెన్ వృక్షాలు వెదజల్లే చేదువాసనకు తోడు కుళ్లిన ఆకుల దుర్గంధంతో ఊపిరి పీల్చుకోవటమే ఇబ్బంది అవుతోంది. అది దాటితే కనుచూపుమేర వ్యాపించిన పచ్చటి పొలాలు– లోయలోకి ప్రవేశిస్తున్నట్లుగా ఉంటుంది. పైన కప్పిన మంచు తెరకు కళ్లు జిగేల్మంటున్నాయి. గుర్రం నోటిని తెల్లటి నురుగు కప్పేసింది. అక్కడక్కడా పొదలు, గుబుర్లు. గుర్రం గిట్టల కింద ఎండిన కొమ్మలు పటపటమంటూ విరిగాయి. కిందికి వచ్చిన తర్వాత మాత్రమే తెలుస్తుంది. ఓ పర్వతం ఎక్కి దిగినట్టు. ఏదో ఆపదను పసిగట్టినట్టు గుర్రం ఎగిరింది. కుడి పక్కన రెండు తోడేళ్లు కనిపించాయి. మసక వెలుతుర్లో నిప్పు కణికల్లా మెరుస్తున్న కళ్లతో, స్టెఫ్నెవ్ ముందుకు కదలగానే బెదిరి అడివిలోకి పరిగెత్తాయి. వాటి కదలికతో ఏపుగా ఎదిగిన పచ్చటి గడ్డి మెరిసింది.

"ఆమె మరొక్క రోజు ఉండగలిగితే నా అదృష్టమే." అనుకున్నాడు స్టెఫ్నెవ్. ఆశగా చంద్రుణ్ణి చూశాడు. శిశిర విషాద సౌందర్యాన్ని ముసుగుగా కప్పుకుంది ప్రకృతి.

స్టెఫ్నెవ్ బరువుతో జీను కిర్రుమంది. నీటి ప్రవాహంతో కొట్టుకుపోయిన దారిలో రాళ్లు తేలాయి. కొండల పక్కగా ప్రయాణం. గుర్రం అలసి రొప్పుతోంది. మరోపక్క దూరంగా, దట్టమైన అడవి. నునుపు రాళ్ల మీద గుర్రం జారింది. కిందికి పడిపోవలసింది కాస్తా నిలదొక్కుకుని ముందుకడుగేసింది. ప్రమాదం తప్పిందిగాని స్టెఫ్నెవ్‌కు గుర్రం మీద కోపం వచ్చింది. ఛెళ్లుమని కొరడాతో రెండు దెబ్బలు వేశాడు.

"ముసలి పీనుగా, ఛావు!" అంటూ తిట్టాడు బిగ్గరగా. నిస్పృహ, నిస్తేజమైన కోపంతో నిండిన ఆ అరుపుతో అడివి ప్రతిధ్వనించింది.

చెట్ల వెనకాల మళ్లీ పొలాలు. పాలు పోసుకున్న బక్‌వీట్ కండెలు గాలికి ఊగుతున్నాయి. పొలం నడుమ పాడుబడిన బిల్డింగ్‌లు. అందులో ఒక పూరిపాక. వెన్నెలలో అదొక శోక దృశ్యం. స్టెఫ్నెవ్ గుర్రం ఆగింది. అంతులేని ఈ దీర్ఘ రాత్రిలో కూడా అధిక బాగం గడిచి పోయింది. అంతటా ఆవరించిన నిశ్శబ్దం. దిగి, పాకవైపు నడిచాడు. చీకటిగా ఉంది. బరువు తగ్గటంతో గుర్రం సంతోషంగా తలాడించింది. ముందర వసారాలో ముసలికుక్క ముడుచుకుని పడుకుంది. స్టెఫ్నెవ్‌ను చూసిందిగాని లేవలేదు. ఆహ్వానిస్తున్నట్టుగా తోక కదిలించింది.

గది నిండా పాత ఫర్నిచర్. కిటికీలకు చాలా కాలంగా మార్చని పరదాలు. లోపలంతా ముక్క వాసన వేస్తోంది. చిన్న కొవ్వొత్తి వెలుగు సరిపోవటం లేదు. కిటికీ అద్దాలమీద మంచు కరిగి కారుతూ మెరుస్తోంది. హఠాత్తుగా నైట్‌గౌన్‌లో ఉన్న స్త్రీ పరిగెత్తుకుని వచ్చి స్టెఫ్నెవ్‌ను వాటేసుకుంది.

"కాన్సర్టులు, కచేరీలివ్వాల్సిన నేను సంగీతం టీచరుగా మిగిలాను. యవ్వనంలో మరో మనిషిని చేసుకుంటే ఇప్పటికి పిల్లాపాపల్తో ఆస్తిపాస్తులతో సెటిలయ్యేదాన్ని కాదా. కాని ప్రేమ: అయినా ఈ ప్రేమకు జీవితంలో ఏం విలువున్నదని!"

సిగరెట్ వెలిగించి, స్టెఫ్నెవ్ తన పరిస్థితి ఆమెకు మరోసారి అర్థం చెయ్యటానికి ప్రయత్నించాడు.

"వీరా, మేం జమీందార్లం. మాది కులీన వంశం. ప్రేమ కాదు పరువు ప్రతిష్టలే మాకు ముఖ్యం. ఇంతకూ ఎవరి జీవితం నాశనమైందని? నాది. నీది కాదు. పదిహేను పదహారేళ్ల క్రితం నీ దగ్గరకు రోజూ వచ్చాను. నీ గుమ్మం ముందర కుక్కలా పడివున్నాను. కాని అది నా యవ్వన చాపల్యం.

అప్పుడు నేనో సెంటిమెంటల్ ఫూల్‌ని"

సిగరెట్ ఆరిపోయింది. దాన్ని విసిరేసి, "మా పూర్వీకులూ ప్రేమ వ్యవహారాలు నడిపించలేదని కాదు. బంగారుపూత ఫ్రేములలో వెలిగిపోతున్న ఆ మహానుభావులంతా చివరకు రాచమర్యాదలకే అధిక ప్రాధాన్యమిచ్చారు. మా తాతముత్తాతలు గురీ, సైమన్, అలీవ్‌ల గురించి వినలేదా నువ్వు. వాళ్ల వారసత్వమే మనకు దక్కింది. ప్రేమ పరిణామం విషాదమేనని నేను గేయాలు కూడా రాశాను"

ఆ రోజుల్లో ఆమె ప్రవర్తన కూడా అలాగే వుండేది.

"ఎందుకు వెళ్లిపోయావు వీరా? నువ్వు మరో మనిషిని ప్రేమించావా? ఎవరతడు? నీకు తప్ప మరొకరికి నా జీవితంలో స్థానం లేదని నీకు తెలుసు. కాని నిర్ణయం నీకు చెప్పటంలో కాస్త ఆలస్యమైంది. నిన్ను నా భార్యగా ఊహించుకుని కలలు కంటున్నప్పుడే అదృశ్యమైపోయావు. ఇంత ఆనందం మరొకరితో పంచుకోగలిగావా? రోజూ ఇన్ని మైళ్లు ప్రయాణించి ఇంత దూరం నీకోసం వచ్చానే! చివరికి విధి మనల్ని విడదీసింది. నీ కళ్లలో కోరిక నా కోసం కాదు. నీ నడక, చూపు, క్రికెట్ గేమ్‌లో బంతిని కొట్టటానికి ఎత్తిన నీ చెయ్యిని చూసి చిలిపి కోరికలతో నిండిపోయేది నా మనసు. మీ అమ్మ ఎంత ఈసడించుకున్నా నీ చుట్టూ తిరిగాను. కలవలేని రోజుల్లో కూడా మేడమీది నుండి ఒక్కసారి నువ్వు చిరునవ్వుతో చూస్తే చాలనిపించేది."

"మన సమస్యలన్నింటికీ కారణం ఆవిడ. నేను కాదు" అంది వీరా.

"అది అబద్ధం. నువ్వు నన్నొంటరిగా వదిలి వెళ్లాక జరిగిన విషయమది. మొదటిసారి నువ్వు మాస్కో వెళ్లిన రోజు జ్ఞాపకముందా? అక్కడ నువ్వు సంతోషంగా ఉంటావనుకున్నావు. కూనిరాగం తీస్తూ బట్టలన్నీ సర్దుకుంటుంటే నేను దుఃఖాన్ని బిగపట్టుకుని కన్నార్పకుండా చూశాను. ఎంత ఉత్సాహంగా నువ్వు బండి ఎక్కి కూర్చున్నావు! ఆ రోజు నీ చేతికి రాసుకున్న సెంటువాసన నేనింకా మరచిపోలేదు. తరువాత నా ప్రయాణంలో గుర్రం చెమట, గడ్డి పరిమళంతో కలగలిసిన కొత్త వాసన కూడా జ్ఞాపకముంది. మన పరిచయం వల్ల ఉన్నదంతా పోగొట్టుకున్నది నేను. నువ్వు కాదు"

స్టెప్నెవ్‌కు తన కన్నీళ్లు ఉప్పగా తగిలాయి.

చంద్రుడు కిందికి దిగిపోయాడు. కొండల మీదా, మైదానం మీదా మంచు కంబళీ పరుచుకుంది. ఆకాశం ఎరుపెక్కుతోంది. దూరంగా ఎక్కడో కాకి కావుకావుమంది.

మెట్లమీద చలికి గజగజవణుకుతూ కూర్చున్నాడు స్టెప్నెవ్.

"మొత్తం మీద నువ్వు వదిలి వెళ్లాక నా జీవితంలో కొంత మార్పు వచ్చింది. కాని ఆ మార్పుకు కూడా కారణం నువ్వని అంగీకరించవు. ఎందుకీ ఆర్గ్యుమెంట్లు. అంతా ముగిసింది" అన్నాడు స్టెప్నెవ్ విరక్తిగా.

హాల్లో చలి వణికిస్తున్నా, అక్కడే కూర్చుని టీ తాగారిద్దరూ. వాళ్ల చివరి సమాగమానికి సాక్ష్యంగా ఇద్దరి మధ్యా సమోవర్. లేయెండలో మైదానాలలోని గడ్డి మెరుస్తోంది. "బండివాడు వచ్చాడు" అని పనిమనిషి వచ్చి చెప్పింది. "తొందర్లేదు, కాస్తాగమను" అంటూ గొణుక్కున్నాడు స్టెప్నెవ్. వీడ్కోలు అనివార్యం. కాని వీలైనంత ఆలస్యం చెయ్యాలి.

నల్లటి బిగుతు డ్రెస్సులో వీరా పడుచు పిల్లలాగా ఉంది. మొహానికి గులాబీరంగు పౌడరు అద్దుకుంది. జీవితంలో అంతా పోగొట్టుకున్నవాడిలా దిగాలుగా ఉన్నాడు స్టెప్నెవ్. గడ్డం నెరిసింది. గొంతులో ఏదో అడ్డం పడుతున్నట్లుగా ఉందతడికి.

ఎండకు మంచు కరుగుతోంది. ఇంటిముందుర క్యాబేజీ మడిలో ఆకులు ఆకుపచ్చ పాత్రల్లా విచ్చుకున్నాయి. బండివాడు గుర్రాన్ని విప్పి దాణా పెట్టాడు. నోటిలో చుట్ట. పొగ భుజం పైనుండి వంకరగా లేచి గాలిలో కలిసిపోతోంది. వీరా ఫర్‌కోటు తొడుక్కుని వచ్చింది. ఒకప్పుడది చాలా ఖరీదైన కోటు. ఇప్పుడు పాతఫాషన్. తలకు పువ్వులలంకరించిన స్ట్రా హాట్ పెట్టుకుంది.

ఆమె బండిలో, అతడు వెనకాలే గుర్రం మీదా ప్రయాణం కొనసాగించారు. ఊరిబాట దాటి హైవే చేరుకున్నారు. స్టెప్నెవ్‌కు బండిని వెంబడించాలని తొందర. గుర్రానికి పచ్చగడ్డిని చూస్తే ఆశ. కొట్టినా వినిపించుకోదు. ఎవరూ రమ్మనకపోయినా ముసలికుక్క కూడా అనుసరించింది.

"వచ్చే ఏడాది మళ్లీ వస్తారు గదా అమ్మ గారూ! అప్పటిదాకా మీ పొలాలను జాగ్రత్తగా చూస్తాంలెండి" అన్నాడు బండివాడు.

వీరా చిరునవ్వుతోనే సమాధానమిచ్చింది. స్టెప్నెవ్ గుర్రం దిగి వీరా చెయ్యిపట్టుకుని గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు.

"ఆరోగ్యం జాగ్రత్త" అంటూ అశ్రు నయనాలతో వీడ్కోలు పలికాడు.

బండి ముందుకు కదిలింది.

స్టెప్నెవ్ వెనుదిరిగాడు.

"ఇంతకూ నేనెక్కడికెళ్లాలి?" అంటూ తనను తాను ప్రశ్నించుకున్నాడు.

మరికాసేపట్లో, రైల్వేస్టేషన్ నుంచి వీరా తనకు మరింత దూరంగా, సుదూరంగా వెళ్లిపోతుంది. ఆ పొగమేఘాలే అందుకు సంకేతం.

విశాలమైన రష్యన్ స్టెప్పీ మైదానాలు అతణ్ణి నిశ్శబ్దంగా ఆహ్వానించాయి. ●

---

నా రిలెటివిటీ సిద్ధాంతం సరైనదైతే
ఫ్రాన్స్ నన్ను ప్రపంచ పౌరుడు అంటుంది.
జర్మనీ మావాడు అంటుంది.
అది తప్పు అని తేలిపోయిందనుకోండి
అప్పుడు ఫ్రాన్స్
నన్ను జర్మనీ వాడంటుంది,
జర్మనీ నన్ను ఒక యూదుడు అంటుంది.

–ఐన్‌స్టీన్

ఎందుకూ పనికిరానివాడే
అదృష్టాన్నీ, జాతకాల్నీ,
రేసుగుర్రాల్నీ,
లాటరీ టిక్కెట్లనూ
నమ్ముకుంటాడు.

–ఇంగ్లీషు సామెత

## నోబెల్ బహుమతి రాని మహా రచయితల కథలు

ఇందులో....


మిలియన్ పౌండ్ బాంక్ నోటు - మార్క్ ట్వైన్ - 51

అమాన్ టిల్లడో -ఎడ్గార్ అలెన్ పో - 62

దొంగే, కానీ నిజాయితీ మనిషి - ఫయొదోర్ దోస్తవిస్కీ - 67

ఇవాన్ ఇల్యిచ్ మరణం - టాల్‌స్టాయ్ - 74

గుమ్మటం - హెన్రీ ఆర్బర్ట్ గై ది మపాసా - 95

స్వార్థ రక్కసుడు - ఆస్కార్ వైల్డ్ - 103

లాటరీ టిక్కెట్టు - ఆన్‌టన్ పావ్‌లోవిచ్ చెఖోవ్ - 106

గుండెల్లో శిలువ - ఓ హెన్రీ - 109

ఆ శరద్రాత్రి - మాక్జిం గోర్కీ - 116

శానటోరియం - విలియం సోమర్‌సెట్ మామ్ - 120

ఒక మాంసం ముక్క - జాక్ లండన్ - 129

క్యూ ఉద్యానవనం - వర్జీనియా వుల్ఫ్ - 137

అరబీ - జేమ్స్ జాయిస్ - 142

ది జడ్జిమెంట్ - కాఫ్కా - 148


## ప్రపంచ రచయితలకు పొర్లు దండాలు

నోబెల్ బహుమతి వచ్చిన రచయితల కథల్ని శ్రద్ధగా చదివి, రాని వారి కథల్ని ఏమరుపాటుగా చదివేస్తే పాఠకుడు పప్పులో కాలేసినట్టే. ఈ కథల్ని వాళ్ళు దగ్గర పెట్టుకొని చదువుకోవాలి. అందుకే నోబెల్ దక్కని రచయితల్ని 'మహా రచయితలు' అని అన్నాం సగౌరవంగా!

మార్క్‌ట్వేన్ 'మిలియన్ పౌండ్ బాంక్ నోటు' కథను ఒకటికి పదిమార్లు చదువుకోవచ్చు. ఎందుకంటే కథ - సుఖాంతం కనుక! టాల్‌స్టాయ్ కథ 'ఇవాన్ ఇల్యిచ్ మరణం' ఒక్కసారే చదవాలి. ఎందుకంటే పదిమార్లు చదివి నూరుమార్లు హృదయాన్ని క్షోభ పెట్టుకుని భరించలేం గనుక.

'ఎడ్గార్ ఎలన్ పో' కథను కంఠస్తం చేయాలి. ఇందులో సామాజిక స్పృహ ఏం వుండదు. కానీ ప్రమాణాల రీత్యా గొప్ప కథ. మన మహాకవి శ్రీశ్రీ 'పో'ని గురువుగా భావించాడు. Perfect Story Telling ను 'పో' నుంచే నేర్చుకోవాలి ఏ రచయితైనా. ప్రపంచంలోనే ఆయన తొట్టతొలి కథకుడిగా పేరెన్నికగన్నాడు.

కాఫ్కా తండ్రికి భయపడి, తండ్రిని ఒక రకంగా ప్రేమించి, వెయ్యి రకాలుగా ద్వేషించి రాసిన 'ది జడ్జిమెంట్' హృదయాంత రాళాలను గొడ్డలితో పెకలించిన కథ. నదిలోకి వురికిన ఆ కథను పుక్కిట పట్టి చూడండి. దోస్తవిస్కీ దొంగకు ఎందుకు అభిమాని అయ్యాడో గమనించండి. వర్జీనియా వుల్ఫ్ పుష్పాన్ని ఆఘ్రాణించండి. ఆస్కార్‌వైల్డ్ 'స్వార్థ రక్కసుడా!', 'పిల్లల ప్రేమికుడా!' మీరే తూకం వేసుకోండి. మపాసా గారి 'గుమ్మటం' పచ్చి వ్యభిచారా, మహా పతివ్రతా! ప్రశ్నించుకొని సమాధానం రాబట్టుకోండి. కథకులకు కథకుడు చెహోవ్ కథలను ఒకటికి రెండు ఎందుకు వేశామో ఆలోచిం చండి.

ఈ కథలను పరిచయం చేయబోవడం పిచ్చి సాహసం. వివరణలు, విశ్లేషణలు మాని మౌనం వహించడం ఎప్పుడూ మంచిదే!

-సాకం నాగరాజ

-వాకా ప్రసాద్

# మిలియన్ పౌండ్ బ్యాంక్ నోటు

## మార్క్ ట్వైన్ (1835-1910)

అనువాదం: కాకాని చక్రపాణి



'మార్క్ ట్వైన్' అన్న కలం పేరు కలిగిన రచయిత అసలు పేరు శామ్యూల్ లాంగ్‌హారన్స్ క్లెమెన్స్. 'ట్వైన్' అన్న పదానికి పాత ఇంగ్లీషులో అర్థం 'రెండు'; 'మార్క్' అంటే 'లోతు'. నావికులకు ఒక లోతు అంటే ఆరడగులు; రెండు లోతులయితే పడవ క్షేమంగా తిరిగి వెళ్లగలిగే లోతు. తనకున్న నదీప్రయాణాల అనుభవంనుండి క్లెమెన్స్ ఈ కలంపేరును స్వీకరించాడు. అమెరికాలో గొప్ప హాస్య రచయితగా పేరు తెచ్చుకున్నాడు. అతడి రెండు ప్రముఖ నవలలు: *The Adventures of Tom Sawyer* (1876), *The Adventures of Huckleberry Finn* (1885). ఈ హకల్‌బెరీ ఫిన్ నవలను గొప్ప అమెరికా నవలగా పేర్కొన్నారు. అతడు మిస్సోరీలోని హాన్నిబాల్‌లో పెరిగాడు. ఈ నవలల్లో ఆ ప్రాంతాల దృశ్యాలనే అతడు చిత్రీకరించాడు. అతడు రాసిన మరొక నవల The Prince and the Pauper కూడ సుప్రసిద్ధమే. తెలుగులో దీన్ని రాజూ-పేదా అన్న పేరుతో సినిమాగా కూడ తీశారు. పైన పేర్కొన్న మూడు నవలలను నండూరి రామమోహన రావు తెలుగులోకి అనువదించాడు. వర్జీనియా సిటీ న్యూస్‌పేపరు ది టెరిటోరియల్ ఎంటర్ ప్రైజ్‌లో పనిచేస్తూ మొదటగా తన కలంపేరును ఉపయోగించుకున్నాడతను.

మిస్సోరీ బానిస విధానం పాటించే రాష్ట్రం, అలా ట్వైన్‌కు చాల చిన్నప్పుడే బానిస విధానంతో పరిచయం ఏర్పడింది. తండ్రి చనిపోయాక 12 యేండ్ల వయసులోనే ముద్రాపకుడి వద్ద అప్రెంటిస్‌గా చేరాడు. అప్పుడే అతడు రాయటం మొదలెట్టాడు. స్టీమ్‌బోటుకు పైలట్‌గా కూడ పనిచేశాడు. ఆ తర్వాత మైనర్‌గా కూడ పని చేశాడు. ఎన్నో దేశాలకు వెళ్లాడు. జర్నలిస్టుగా స్థిరపడ్డాడు. తనకు వయసు వస్తున్న కొద్దీ ట్వైన్ రాడికల్‌గా మారాడు. సామ్రాజ్యవాదవ్యతిరేకీ అయాడు. అతడు స్వేచ్ఛ, బానిస విముక్తి కోసం కృషిచేశాడు. స్త్రీల హక్కులకోసం కూడ అతడు పాటుపడ్డాడు. అతని ప్రయత్నాలవల్ల లాభపడిన వారిలో ఒకరు హెలెన్ కెల్లర్; తాను అంధురాలైనా, కాలేజీ చదువు కొనసాగించగలిగింది, ఎదగ గలిగింది.

1907లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అతడికి ఆనరరీ డాక్టరేటు (డిలిట్) ను ప్రదానం చేసింది.

నాకు ఇరవై ఏడేళ్ల వయసప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక మైనింగ్ బ్రోకరు దగ్గర గుమాస్తాగా పనిచేసేవాడిని. స్టాకుల వ్యవహారంలో నిపుణుడిని. ప్రపంచంలో ఒంటరివాడిని, తెలివిగలవాడు మంచివాడన్న పేరు తప్ప నేను ఆధారపడదగిందేమీ లేదు; అయితే, ఇవి నన్ను అంతిమంగా సంపదకు తీసుకువెళ్లే రోడ్డుమీదకు ప్రవేశపెట్టాయి; భవిష్యత్తుమీది దృష్టితో నేనుకూడ తృప్తి పడిపోయాను.

మధ్యాహ్నం భోజనమయ్యాక నా కంతా తీరికే; శనివారాల్లో, ఒక చిన్న పడవలో అలా తిరిగొచ్చేవాడిని. ఒకరోజు సముద్రంలో చాల దూరం పోయాను. తిరిగి వచ్చే ఆశ కోల్పోయిన సమయంలో, లండనుకు వెళ్లే ఒక చిన్న నౌక నన్ను రక్షించింది. ఆ దూరప్రయాణంలో వాళ్లు జీతమివ్వకుండా నా చేత పనిచేయించుకున్నారు. నేను లండనులో దిగేసరికల్లా, నా బట్టలు మట్టికొట్టుకుపోయి, భయంకరంగా ఉన్నాయి. నా జేబులో ఒక్క డాలరు మాత్రమే ఉంది. ఈ డబ్బు నాకు ఇరవైనాలుగు గంటలపాటు తిండి, వసతి కల్పించింది. తరువాతి ఇరవైనాలుగు గంటలూ ఆ సౌకర్యం లేకుండా గడిపాను.

మర్నాడుదయం పదిగంటలప్రాంతంలో, మురికిగా, ఆకలితో పోర్ట్‌లాండ్ ప్లేస్‌లో శరీరాన్ని ఈడ్చుకు వెళ్తూండగా, దాది చెయ్యిపట్టుకు నడిపిస్తున్న ఒక పిల్లవాడు ఒక కొరికిన తియ్యటి పెద్ద పియర్ పండును మురిక్కాలవలోకి విసరేశాడు. నేను ఆగాను. ఆ మట్టిగొట్టుకుపోయిన సంపదను వదలనంటోంది నా మనసు; నోట్లో నీళ్లూరాయి, ఆకలి దానికోసం ఆక్రోశించింది, నా ప్రాణమంతా దానికోసం తహతహలాడింది. దాన్ని చేజిక్కించుకోవాలని వంగినప్పుడల్లా, ఎవడో గమనించటం, నేను వెంటనే నిలబడిపోవటం జరిగేది. ఇంక సిగ్గూ, గిగ్గూ వదిలేసి, దాన్ని కైవసం చేసుకోవాలన్న తెగింపు కలిగింది. అప్పుడో కిటికీ తెరుచుకుంది, ఒక పెద్ద మనిషి నన్ను పిల్చి అన్నాడు: "ఇలా రా!"

దర్జాగావున్న సేవకుడు విలాసంగావున్న పెద్దగదిలోకి నన్ను ప్రవేశపెట్టాడు. అక్కడో ఇద్దరు పెద్ద మనుషులు కూర్చుని ఉన్నారు. సేవకుణ్ణి పంపేసి నన్ను కూర్చోమన్నారు. వాళ్లంతకు ముందే అల్పాహారాన్ని పూర్తిచేశారు; మిగిలిపోయిన ఆహారపదార్థాల దృశ్యం నన్ను పరాధీనుడిని చేసింది. అది చూస్తూ తట్టుకోటం నాకు కష్టమనిపించింది. వాళ్లు నన్ను తినమనలేదు. నాకు ఉగ్గబట్టుకోక తప్పలేదు.

> నిర్ణయాలు
> మార్చుకోలేని వాడికి
> మెదడు
> అవసరం లేదు.
> -ఆంటోని ఆంజితో

## 2

అంతకు ముందేదో జరిగింది; ఆ సంగతి నాకు ఎప్పటికో తెలిసింది. అసలు విషయం– ఈ ఇద్దరు ముసలి సోదరులు, రెండు రోజుల బట్టీ చాల తీవ్రంగా వాదించుకున్నారు; అంతిమంగా దాన్ని ఓ పందెంకాసి నిర్ణయించుకోవాలనుకున్నారు; అది ఇంగ్లీషు వాళ్లు విషయాలను పరిష్కరించుకునే తీరు.

మీకు గుర్తుండే ఉంటుంది, ఇంగ్లాండు బాంకు రెండు మిలియన్ పౌండ్ల నోట్లను జారీ చేసిందని; విదేశీలావాదేవీల్లో ప్రత్యేక ప్రయోజనం కోసం వాటిని జారీ చేసింది. వీటిల్లో ఒకదాన్ని మాత్రమే ఉపయోగించారు; రెండో నోటు ఇంకా బాంకు వాల్టుల్లో ఉండిపోయింది. సరే, వీరికి పిచ్చాపాటీ మాట్లాడుకునేప్పుడు ఒక ఆలోచన వచ్చింది: ఒక నిజాయితీపరుడు, బుర్రున్న కొత్తమనిషి, లండనులో అడుగుపెట్టి ఒక్క స్నేహితుడు కూడ లేకుండా తిరుగుతూంటే, అతడికి ఈ మిలియన్ పౌండు నోటు లభించినా, ఆ నోటు తనకెలా వచ్చిందో చెప్పే అవకాశం లేని సందర్భంలో ఏం జరుగుతుంది? 'అ' సోదరుడు 'ఆ మనిషి తిండికిలేక మాడి ఛస్తాడు' అన్నాడు. 'ఇ' సోదరుడన్నాడు, 'అలాంటిదేం జరగ'దని. ఆ మనిషి ఏ బాంకులోనూ, మరో చోటా దాన్ని మార్చలేడు; అది కళ్లబడగానే ఆ క్షణం అతడిని అరెస్టు చేస్తారు. వాళ్ల వాదం తెగలేదు; చివరకు 'ఇ' సోదరుడన్నాడు, 'ఆ మనిషి ఎలాగయినా, ఆ మిలియన్‌తో ముప్ఫయి రోజులు బతుకుతాడు, జైలుకు కూడ వెళ్లడు' అని. తన మాట జరగకపోతే ఇరవైవేల పౌండ్లిస్తానని పందెం కట్టాడు. 'అ' సోదరుడు అంగీకరించాడు. 'ఇ' సోదరుడు బాంకుకు వెళ్లి నోటును పట్టుకు వచ్చాడు. ఆ తర్వాత సోదరులిద్దరూ అదివ్వటానికి సరైన మనిషి ఎవడా అని చూస్తూ రోజల్లా కిటికీ దగ్గర కూర్చున్నారు.

చాలమంది నిజాయితీ మనుషులనిపించేవారు వెళ్లటం చూశారు కానీ, అంత తెలివిగలవాళ్లని వాళ్లకన్పించలేదు; చాలమంది తెలివిగలవాళ్లని చూశారు కానీ, వాళ్లంత నిజాయితీపరులన్పించలేదు; రెండులక్షణాలున్నవారినీ చాలమందిని చూశారు కానీ, వాళ్లంత బీదవాళ్లు కాదు; లేదా తగినంత బీదగా కన్పించినా, వాళ్లు కొత్త వాళ్లు కాదు. నేనలా ఆ వీధిలోకి వచ్చాక, వాళ్లు కోరుకున్న అర్హతలన్నీ నాకున్నట్లనిపించింది, వాళ్లకు; నన్ను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. వాళ్లెందుకు పిలిపించారో తెలుసుకునేందుకు నాకు తహతహ! నా గురించి వాళ్లు ప్రశ్నలు వేశారు, నా కథ విన్నారు. అంతిమంగా, నేను వాళ్ల ప్రయోజనానికి సరిపోతానని చెప్పారు. అదేమిటో చెప్పమని నేను వాళ్ల నడిగాను. అప్పుడు వాళ్లల్లో ఒకాయన నాకు ఒక కవరు అందించాడు, అందులో వివరణ ఉంటుందని కూడ చెప్పాడు. నేను దాన్ని తెరవబోయాను. అతడు వద్దన్నాడు; నా వసతికి తీసుకువెళ్లి, దాన్ని జాగ్రత్తగా చూడమన్నాడు. తొందరపడకూడదనీ చెప్పాడు. నాకు అయోమయం! వారితో ఆ విషయం గూర్చి మరింత చర్చిద్దామనుకున్నాను. వాళ్లందుకు అంగీకరించలేదు; కనుక, నేను వెళ్లిపోక తప్పలేదు. ఏదో ప్రాక్టికల్ జోక్‌కు నన్ను గురిచేసినట్లనిపించి నాకు బాధ కలిగింది, నా మనసు గాయపడింది; అయితే సహించక తప్పలేదు నాకు; ధనవంతులు, బలవంతులు అయిన వ్యక్తుల అవమానాలను నిరసించే పరిస్థితులలో లేను నేను!

## 3

ఇప్పుడు మొత్తం ప్రపంచం చూస్తున్నా సరే, పండును తీసుకుందామని అనుకున్నాను కానీ, అది మాయమైపోయింది. ఈ దురదృష్టపు వ్యవహారంవల్ల నేను దాన్ని పోగొట్టు కోవాల్సి వచ్చింది; అందువల్ల, ఈ మనుషులపట్ల నా కోపం పెరిగింది. ఆ ఇల్లు నా దృష్టిపథం నుండి తొలగిపోగానే, నేను కవరు తెరిచాను, అందులో డబ్బుందని గమనించాను! వాళ్ల గురించి నా ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. నేను కాలహరణం చెయ్యలేదు. ఆ నోటును, డబ్బును నా వెస్ట్ పాకెట్‌లోకి తోసేసి, సమీపంలోని ఈటింగ్ హవుసుకు వెళ్లాను. సరే, ఎలా తిందాం! చివరకు ఆపుకోలేక, నేను డబ్బును తీసి, తెరచి చూశాను, దానిమీద కళ్లు పడగానే నాకు స్పృహ తప్పినట్లయింది. ఐదు మిలియన్ల డాలర్లు! నా బుర్ర తిరిగిపోయింది.

నేనక్కడ స్తంభీభూతుడనై కూర్చుండిపోయాను, నిమిషంపాటు ఆ నోటువంక చూశాను, అప్పుడుగానీ, నాకు స్పష్టత చేకూరలేదు. అక్కడున్న ఒక ఆసామిని చూశాను. అతడి కళ్లు నోటుమీద పడ్డాయి, అతడు భయకంపితుడై పోయాడు. అతడు దానివంక శరీరం, ఆత్మా కేంద్రీకరించి, ఆరాధనపూర్వకంగా చూశాడు కానీ, కాలుగానీ, చెయ్యిగానీ కదపలేకపోయాడు. ఆ క్షణంలోనే ఏం చెయ్యాలో నాకు తెల్సింది; ఆ సమయంలో చెయ్యదగిన హేతుబద్ధమైన ఏ పని చెయ్యాలో నాకు బోధపడింది. నేను నోటును అతడి వద్దకు మహా నిర్లక్ష్యంగా జరిపి, అడిగాను:

"ప్లీజ్, చిల్లర ఇస్తారా?"

అతడప్పుడు తన వాస్తవ పరిస్థితికి వచ్చాడు, చిల్లర ఇవ్వలేక పోయినందుకు వెయ్యి క్షమాపణలు చెప్పాడు. నేను అతన్ని నోటును తాకనివ్వలేదు. అతడు దానివంక చూడాలని వాంఛించాడు. తన కంటి దాహాన్ని తీర్చుకునేంతగా దాన్ని చూసు కున్నట్లనిపించలేదు అతనికి; తన దౌర్భాగ్యపు సాధారణ మృత్తికాహస్తంతో పవిత్రమైన దాన్ని స్పృశించ సంకోచించాడు.

నేను చెప్పాను: "మీకిది అసౌకర్యం కలిగించటం నాకు చాల విచారంగా ఉంది, కానీ, దయచేసి దీనికి చిల్లర ఇవ్వండి. నా దగ్గర మరేమీ లేదు."

అదేం పెద్ద విషయం కాదన్నాడతను; మరో అవకాశం లభించేవరకు తను నా భారం వహిస్తానన్నాడు. నేనీప్రాంతంలో కొంతకాలంపాటు వుండకపోవచ్చునని కూడ నేనతనికి చెప్పాను. అదేం పట్టించుకోవాల్సిన పనిలేదు, తను నిరీక్షించగలనన్నాడతను; ఆపైన, నా కెప్పుడు కావాలంటే అప్పుడు, నాక్కావాల్సింది పొందవచ్చుననీ చెప్పాడు. ఆ తర్వాత, డ్రెస్సు విషయం పెద్దగా పట్టించుకోకుండా తిరిగే నాలాంటి ధనవంతుడిని నమ్మటానికి భయపడేమనిషి తను కాదని అతడు చెప్పాడు. ఇంతలో మరో కస్టమరు లోపలకు రాబోతుంటే, ఆ రాక్షసనోటును దాచెయ్యమనీ చెప్పాడు; ఆ తర్వాత, నేను వెళ్తుంటే, అతడు వంగి నాకు గౌరవాన్ని ప్రదర్శించాడు. పోలీసులు నన్ను వేటాడకముందే, జరిగిన తప్పును సరిచేసే ఉద్దేశంతో, నేను సీదా ఆ సోదరులఇంటికి బయల్దేరాను. నేనేం తప్పు చేయకపోయినా నాకు వణుకు, భయం కలిగాయి. తమ హ్రస్వదృష్టికి తమలో తాము పోట్లాడు కోటానికి బదులు, తాము ఒక పౌండు నోటని చెప్పి ఒక తిరుగుబోతుకు తామిచ్చినది, మిలియన్ పౌండు నోటని తెలుసుకున్నాక, వాళ్లేం చేస్తారో నాకు బాగా తెల్సు. ఆ ఇంటిని సమీపిస్తుండగానే నా ఆవేశమంతా చల్లారి పోయింది; అక్కడంతా ప్రశాంతంగా ఉన్నది. జరిగిన పొరపాటును ఇంకా గుర్తించలేదని నాకు నిశ్చయ మయింది. అదే బంటు వచ్చాడు. నేను ఆ పెద్ద మనుషులకోసం అడిగాను.

> పెద్ద దొంగలు
> చిన్న దొంగని
> ఉరితీసి చంపేస్తారు.
> - కొయ్యూరు సామెత

## 4

"వాళ్లు వెళ్లిపోయారు" అన్నాడు, ముభావంగా బదులు చెప్పే జాతిమనిషి.

"వెళ్లారా? ఎక్కడికెళ్లారు?"

"ప్రయాణం మీద."

"సరే, ఎటువైపుకు?"

"బహుశః ఐరోపా ఖండ పర్యటన కనుకుంటాను."

"ఐరోపా ఖండ పర్యటనా?ఎటువైపుగా, ఏ మార్గంలో?"

"నేను చెప్పలేనయ్యా!"

"ఎప్పుడు తిరిగి వస్తారు?"

"ఒక నెలరోజులన్నారు."

"ఒక నెలా? భయంకరం! వాళ్లకో మాట చేరవేసే మార్గమేదన్నా ఉంటే చెప్పు. అది చాల ముఖ్యం! ఆ కుటుంబసభ్యులకయినా సరే."

"నాకు తెలీదు, వాళ్లెక్కడికి వెళ్లారోకూడ తెలియదు. రెండు నెలల క్రితమే వాళ్లు బహుశః ఇండియాకో, ఈజిప్టుకో వెళ్లారు."

"చూడవయ్యా, చాల పెద్ద పొరపాటు జరిగిపోయింది. రాత్రయ్యేలోపల వాళ్లు తిరిగి వస్తారు. నేను ఇక్కడకు వచ్చానని వాళ్లకు చెప్పు. అంతా సరయిందాకా నేను వస్తూనే ఉంటాను. వాళ్లు భయపడాల్సిన పనిలేదని చెప్పు."

"వాళ్లు తిరిగొస్తే చెప్తాను. కానీ, వాళ్లు తిరిగి వస్తారనుకోను. మరో గంటలో మీరు ఏదో అడగాలని వస్తారని వాళ్లు చెప్పారు. కానీ, అంతా సక్రమంగానే ఉందని నన్ను మీకు చెప్పమన్నారు. వాళ్లు సరైన సమయంకల్లా వస్తామనీ, మీ కోసం చూస్తామనీ చెప్పమన్నారు."

కనుక, ఆ ప్రయత్నం విరమించి నేను వెళ్లాల్సి వచ్చింది. ఏమిటీ ప్రహేళిక? నాకు బుర్ర పోయేట్టుంది. వాళ్లు 'సరైన సమయం' కల్లా ఇక్కడకు వస్తామన్నారు. అంటే అర్థమేమిటి? అయ్యో, ఉత్తరం! బహుశః ఉత్తరం వివరణ ఇస్తుంది. నేను దానిసంగతే మర్చా. దాన్ని బయటకు తీసి, చదివాను. అందులో ఇలా ఉంది:

"నువ్వు తెలివిగలవాడివి, నిజాయితీపరుడివి. నీ ముఖం చూస్తే ఆ విషయం ఎవరికైనా తెలుస్తుంది. నువ్వు ఇక్కడ కొత్తవాడివి, పేదవాడివని మేం ఊహించాం. ఇందుతో కొంత డబ్బును జతచేశాం. దాన్ని నీకు ముప్ఫయి రోజులపాటు అరువు ఇవ్వటం జరిగింది. అందుకు వడ్డీ లేదు. ఆ కాలావధి అంతానికల్లా ఈ ఇంటికి రావాల్సింది. నీమీద నేను ఒక పందెం కట్టాను. నువ్వు విజయుడవైతే, నీవడిగిన ఉద్యోగం నీకు బహుమతిగా లభిస్తుంది. ఆ పని చేసే సామర్థ్యమూ నీకున్నది."

## 5

కింద సంతకంలేదు, చిరునామా లేదు, తారీఖు లేదు.

నా రాకకు ముందు ఏం జరిగిందో వాళ్లు నాకు చెప్పలేదు. ఇది నాకు పెద్దచిక్కు ప్రశ్న! అసలా ఆట నాకు కీడు కల్గించేదా లేక నాపై దయచూపేదా? నేను పార్కులోకి వెళ్లాను. నేను చెయ్యాల్సిందేమిటా అని ఆలోచించాను.

ఓ గంట తర్వాత నా హేతువులు ఈ తీర్పును నా కందించాయి:

ఆ మనుషులు నాకు మంచిచేయాలనుకున్నారో, చెడుచేయాలనుకున్నారో నిర్ణయించే మార్గంలేదు. దాన్నలా వదిలెయ్యి. వాళ్లో ఆట లేక పథకం లేక ప్రయోగం చేపట్టారు; దాన్ని తెల్సుకునే మార్గంలేదు, కనుక, దాన్నీ అలా వదిలెయ్యి. పందెం ఒకటి కాయటం జరిగింది, కానీ దాన్ని గురించి తెల్సుకునే మార్గంలేదు కనుక దాన్నీ వదిలెయ్యి. అలా అసాధ్యవిషయాలను వదిలించుకోటం జరిగింది; వ్యవహారంలో శేషం స్పర్శనీయం, విశ్వసనీయం- నిశ్చయాత్మకమని వర్గీకరించ తగింది ఉంది. దీని యజమాని ఖాతాలోకి దీన్ని జమ చెయ్యమని ఇంగ్లాండు బాంకు వాళ్ల నడిగితే, వాళ్లకా మనిషి ఎవరో తెల్సు కనుక, వాళ్లాపని చెయ్య వచ్చు; అయితే, అది నా చేతి కెలా వచ్చిందని వాళ్లు అడుగుతారు; నేను నిజం చెప్తే నన్ను మానసిక చికిత్సాశాలలో చేర్చవచ్చు, అది అబద్ధమయితే, జైలుకు వెళ్లాల్సి రావచ్చు. మరెక్కడైనా దీన్ని జమ చెయ్యాలని ప్రయత్నించినా, లేక దీనిపై అప్పు చెయ్యాలని చూసినా అదే ఫలితం సంభవిస్తుంది. నాకిష్టమున్నా లేక పోయినా ఈ రాక్షసభారాన్ని వాళ్లొచ్చేంతవరకు నేను మోయక తప్పదు. ఇది నాకు నిరుపయోగం, బూడిదలా వ్యర్థం. అయినా, నా బతుకు ఈడుస్తూ, నేను దీనికి- గడ్డివామికి కుక్కలా- కాపలా కాయాలి, జాగ్రత్త చెయ్యాలి. పోనీ ఎవడికైనా ఇద్దామన్నా, నిజాయితీపరుడైనా, దారిదోపిడీ వాడైనా స్వీకరించడు, ఏమిచ్చినా దానితో జోక్యం పెట్టుకోరు. ఆ అన్నదమ్ములు ఎప్పుడైనా చెల్లింపును నిలిపివేయవచ్చు, బాంకు వాళ్లకు మొత్తాన్నీ చెల్లిస్తుంది కనుక, నేను ఈ నోటును పోగొట్టుకున్నా, కాల్చేసినా, వాళ్లు సుభద్రమే; అయితే ఈ నెలలోపల వేతనం లేక లాభం లేకుండా నా బాధ నేను పడాలి- ఆ పందెం నెగ్గేట్టు నేను సాయం చేస్తేగానీ, ఆ ఉద్యోగమేదో నాకు రాదు. కానీ, నాకది రావాలి; వారి పరిస్థితిలో, హోదాలో ఉన్న మనుషులు ఇచ్చే వరాలు, పుచ్చుకోదగ్గవే అయుంటాయి.

**నవలా పరిచయం**

# గార్గాంటువా అండ్ పాంటాగ్రుయెల్

## -ఫ్రాంస్వా రాబెలా (1490-1553)

ఒక విజ్ఞాన సర్వస్వంలాంటి నవల ఇది. కానీ ప్రపంచ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోవటానికి కారణం మాత్రం ఇందులో 'అశ్లీలం', 'బూతు' ఉందని ముద్ర పడటమే. ఔత్సాహికులు దీన్ని చదవాలనుకోవటానికి ఈ 'అపఖ్యాతి' కొంతమేరకు, సాయం చేస్తుంది. అయితే కొద్ది పేజీలు తిరగేస్తే సంక్లిష్టమైన రచనా సంవిధానం, పాండిత్య ప్రదర్శన, సుదీర్ఘ వర్ణనలు, వివరాలు, చర్చలు, వాదోపవాదాలతో తల బొప్పిగట్టి 'అందని ద్రాక్షలు పుల్లన' అని ఆధునిక పాఠకులు అనుకోవటం ఖాయం.

కొందరు దీన్ని జేమ్స్‌జాయ్స్ రాసిన చైతన్య స్రవంతి నవలాశిఖరం 'యులిసిస్'తో పోలుస్తారు. గార్గాంటువాలో కూడా కథనం డొంకతిరుగుడుగా ఉంటుంది. దాదాపు పన్నెండు భాషా, సాహిత్యాల ప్రస్తావనలూ, ఉదాహరణలూ సామాన్య పాఠకుణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. విలా, వర్జిల్, సిసిరో, ప్లూటార్క్, టాసిమెన్‌లు మాత్రమే గాక, హిప్పోక్రేట్స్, గాలెన్, ప్లినీల వైజ్ఞానిక సమాచారం కూడా మనకు తెలిసుంటే పుస్తకం బాగా అర్థమవుతుంది.

ఇవిగాక కింగ్ ఆర్థర్ కాలంనాటి ప్రేమగాథలు, జానపద సాహిత్యం, మిస్టరీ నాటకాలు, వీరగాథలు వగైరా దీనిలోని అదనపు సొగసులు.

కథనమంతా హాస్య, వ్యంగ్య ధోరణిలో సాగుతుంది. సమకాలీన ఛాందసత్వాన్ని, అధికార మదాంధులను ఎద్దేవా చేస్తూ మత మౌఢ్యాన్ని, పునర్వికాస కాలంనాటి అంధకారాన్ని ఛేదించటం రాబెలా లక్ష్యం.

నిజానికి 1532లో ఒక అనామకుడు రాసిన 'గార్గాంటువా' పుస్తకం అచ్చయ్యింది. అది చూసి రాబెలాకు ఆ కథ మళ్లీ రాయాలనే ఊహ వచ్చివుంటుందని కొంతమంది విమర్శకుల అభిప్రాయం.

ఫ్రెంచి జానపదగాథలలో, ఒక మహాకాయుని పేరు గార్గాంటువా. రాబెలా నవలలో కూడా కథానాయకుడు సౌమ్యుడే కానీ మహాకాయుడు. అతని తల్లిదండ్రుల ఆకారాలు కూడా తక్కువేమీ కాదు. వాళ్ల పేర్లు గ్రాంగూజియె, గార్గామెల్. తల్లి ఎడమ చెవిలోంచి పుట్టాడు గార్గాంటువా. పుట్టగానే, అందరు శిశువుల్లా బేరుబేరుమని కాక, 'దాహం, దాహం' అని అరిచాడు. వాడి ఆకలి తీర్చటానికి 17,913 ఆవుల పాలు, కొన్ని వందల గజాల గుడ్డ కొన్నారు.

మూడేళ్లనుండి అయిదేళ్లదాకా ఇంటిదగ్గరే గార్గాంటువా విద్యాబుద్ధులు నేర్చుకున్నాడు. అందరూ పిల్లల్లాగే తింటూ, తాగుతూ, నిద్ర పోతూ గడిపాడు. బురదలో ఆడుకున్నాడు. చొక్కాతో ముక్కు తుడుచుకున్నాడు. ఇక్కడ రాయటానికి వీల్లేని మరికొన్ని పనులు కూడా చేశాడు. అలాంటివన్నీ ఈ గ్రంథంలో ఉన్నందునే, 'రాబెలాసియన్' అనే మాట భాషలో స్థిరపడింది.

ఈ మహాకాయుని విద్యాభ్యాసం గురించి రాయడానికి అనేక అధ్యాయాలు కేటాయిస్తాడు రచయిత. మధ్యయుగాలనాటి మూర్ఖత్వం మీద, విద్యాభ్యాసం మీద నిశిత వ్యంగ్యాస్త్రాలు కూడా సంధిస్తాడు. ఎంత చదివినా సహజంగా ఉన్న బుద్ధీ, జ్ఞానం కూడా పోగొట్టుకుని మరబొమ్మలా తయారయ్యాడు కుర్రాడు. బెత్తం విరిగితే తప్ప విద్యార్థుల కేమీ ఒంటబట్టదని ఆనాటి ఉపాధ్యాయుల నమ్మకం మరి.

దూరప్రయాణమైనా, కొడుకును పారిస్‌కు పంపించాడు తండ్రి. అక్కడి విద్యాభ్యాసం పూర్తిగా భిన్నమైంది. పుస్తకాలనుండే గాక, ప్రాక్టికల్స్ ద్వారా కూడా జ్ఞానార్జన జరుగుతుంది. పాఠాలు వింటారు. దర్జీలు, నేతగాళ్లు గడియారాల తయారీదార్లు, ప్రింటర్లు, స్వర్ణకారులు మొదలైన వృత్తి నిపుణుల పనిని స్వయంగా చూసి నేర్చుకుంటారు. మూలికావైద్యం, ఇతర మందుల గురించీ అధ్యయనం చేస్తారు. ఆనాటి వైజ్ఞానిక, అభ్యుదయ దృక్పథాన్ని సమర్థించటం, రచయిత మనవతా వాదానికి నిదర్శనం. ఇలాంటి రచనలు చెయ్యటమంటే, ఆనాటి అధికారవర్గాలతో నేరుగా తలపడటమే.

---

## 6

బాగా ఆలోచించాక, నా ఆశలు చిగురించాయి. నిశ్చయంగా నెలరోజుల్లో మొదలయ్యే జీతం పెద్దమొత్తంలోనే ఉంటుంది; త్వరలోనే నా కెంతో ఉత్సాహం కలిగింది. నేను వీథుల్లో తిరగసాగాను. ఎదురుగా టైలర్ షాపు కన్పించింది; ఈ చిరుగుపాతలను వదిలేసి మళ్లీ చక్కగా డ్రెస్ చేసుకోవాలన్న కోరిక మరోసారి బలీయమయింది. నావల్ల అవుతుందా? లాభం లేదు. ఈ భూప్రపంచంలో మిలియన్ పౌండ్లు తప్ప నా దగ్గరేం లేదు. కనుక, బలవంతంగా కాళ్లను ముందుకు నడిపించాను. కానీ, అవి నన్ను మళ్లా వెనక్కే తోశాయి. అలా ఆ షాపు ముందునుండి ఆరుసార్లు రాకపోకలు జరిగాయి. చివరకు, వాళ్ల దగ్గరేమన్నా అనుపయుక్త (కొలతలు కుదరక సరిపోని) సూటేమన్నా ఉందా అని వాళ్ల నడిగాను. నేను మాట్లాడిన మనిషి, మరో మనిషి వంక తలూపాడు, జవాబివ్వలేదు. నేను అతడు చూపిన వ్యక్తి దగ్గరకు వెళ్లాను; అతడు మరో మనిషి వంక కళ్లాడించి చూపాడు కానీ, నోట మాటలేదు. నేను అతని దగ్గరకు వెళ్లాను.

అతడు చేస్తున్న పని అయిందాకా నిరీక్షించాను. అతడు నన్ను వెనక గదిలోకి తీసుకు వెళ్లాడు. నా ముందు తిరస్కృత సూట్ల గుట్ట పడేశాడు, చిరుగులబారిన పడబోతున్న దాన్ని నాకు చూపాడు. నేను వేసుకుని చూశాను, అది నాకు సరిపోలేదు; ఆ పైన ఆకర్షించేట్టూ లేదు; ఏమయినా కొత్తది. దాన్ని పుచ్చుకోవాలన్న ఆత్రుత నాకు కలిగింది; అందువల్ల నా కందులో లోపమేమీ కన్పించలేదు; అయితే, కొంత బిడియపడ్తూ చెప్పాను: "మీరు కొన్ని రోజులు డబ్బు చెల్లింపుకు వసతి కల్పిస్తే బాగుంటుంది. నా దగ్గర ఇప్పుడు చిన్న చిల్లర నోట్లు లేవు."

ఆ మనిషి మహా వ్యంగ్యముఖాభివ్యక్తిని ప్రదర్శించి, అన్నాడు: "ఒహో, లేవా? అవును, నేనూ ఆశించలేదు. మీలాంటి పెద్దమనిషి దగ్గర పెద్దనోట్లు

గార్గాంటువా తండ్రికి పొరుగు దేశం రాజు పైక్రోబోల్‌తో చిన్న తగువు వస్తుంది. దానికి కారణం పైక్రోబోల్‌కు చెందిన రొట్టెల్ని దొంగిలిస్తారు కొందరు. ఇలాంటి చిన్న చిన్న పంతాలు, పట్టింపులు, అల్ప విషయాల కారణంగానే నాటి భూస్వామ్య-రాచరిక పాలనలో యుద్ధాలు జరుగుతుండేవి. ఇక్కడ కూడా ఆ తగవు కాస్తా యుద్ధంగా పరిణమిస్తుంది. తనకు సాయంగా కొడుకును పారిస్ నుండి పిలిపించుకుంటాడు తండ్రి. అరివీర భయంకరుడైన గార్గాంటువా, యుద్ధంలో శత్రువును అవలీలగా మట్టి కరిపిస్తాడు.

నవల రెండో భాగంలో గార్గాంటువా, బాడెబెల్‌ను పెళ్లాడుతాడు. ఆమె తండ్రి యుటోపియా దేశపురాజు అమారాట్. వాళ్ళ సంతానమే పాంటాగ్రుయెల్. ఇది అప్పటికే అందరికీ సుపరిచితమైన మరో జానపద పాత్ర.

గార్గాంటువాకు 484 ఏళ్లప్పుడు పాంటాగ్రుయెల్ పుట్టాడని చాలా కచ్చితంగా చెబుతాడు రచయిత. పుట్టినప్పుడు శిశువు ఎంత బరువున్నాడంటే, ప్రసవంలోనే మరణించింది తల్లి. తండ్రిలాగే, విద్యాభ్యాసం కోసం పారిస్‌కు వెళతాడు పాంటాగ్రుయెల్. అక్కడ పానర్జ్‌తో పరిచయమేర్పడుతుంది. పానర్జ్ వయసు 45. ఒక జబ్బు అతణ్ణి కుంగదీస్తుంది. అది అందరికీ తెలిసిన 'పేదరికం' అనే జబ్బే. ఆనాటి సమాజంలోని దుర్భర దారిద్ర్యాన్ని రచయిత ఎత్తి చూపుతాడు. సాధారణంగా మర్యాదస్తులందర్లాగే, అతడూ తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలుగకుండా దొంగతనాలు చేస్తుంటాడు. అలా తాత్కాలికంగా ఉపశమనం పొందుతాడు. అంటే పొట్ట పోసుకోవడం గురించి కాదు మనం మాట్లాడుతున్నది. మద్యం మగువ లేకుండా ఉండలేడతడు. 'కనీసావసరాలు' తీర్చుకోవటానికైనా, ఎంతో కొంత సంపాదించక తప్పదు. ఇలాంటి చిన్న చిన్న విషయాలు మినహాయిస్తే అతడు సచ్ఛీలుడే.

ఇక మూడోభాగంలో పాంటాగ్రుయెల్ సాహసకార్యాలూ, 'సూక్తులూ' ఉంటాయి. పానర్జ్‌ను పెళ్ళి చేసుకోవాలని కోరిక కలుగుతుంది. దానికోసం అతడు మిత్ర బృందంతో ఒరాకిల్ (భవిష్యవాణి) ఆఫ్ హోలీ బాటిల్ (పవిత్ర కలశం) సలహాకోసం సుదీర్ఘ ప్రస్థానం ప్రారంభిస్తాడు. దారిలో అనూహ్య పరిస్థితులు ఎదురవుతాయి. వింత చేష్టలు చేసే విచిత్ర వ్యక్తులు తారసపడతారు. ఉత్కంఠభరితమైన అనేక సంఘటనల తర్వాత వాళ్లు దీపదేశం, లాండ్ ఆఫ్ లాంటర్న్స్ చేరుకుంటారు. అక్కడ వేడినీటి సరస్సులో దర్శనమిస్తుంది 'కలశం'. ఆ దేశంలోని ప్రధాన దేవాలయంలో పుజారిణిగా వున్న బాక్‌బక్ సాయంతో కలశం బోధించిన జీవనరహస్యం గ్రహిస్తారు. అయితే ఇంతకూ ఆ కలశం పలికింది ఒకే ఒక్క మాట, 'ట్రింక్'. అంటే 'డ్రింక్' అని అర్థం అంటుంది పూజారిణి. అలా ముగుస్తుందీ కథ.

గొప్ప నవలల్లో కథ ముఖ్యం కాదు. తమ ప్రాపంచిక దృక్పథం పాఠకులతో పంచుకోవటానికీ, సమకాలీన సమాజ చిత్రణకు కథను వేదికగా ఉపయోగిస్తారు రచయితలు.

ఆనాటి నిరంకుశత్వానికీ, మత ఛాందసానికి నిరసనగా తిరుగుబాటు బావుటా ఎగరేసిన రాబెలా, 'నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి' అంటూ ఉద్బోధించాడు. పాంటాగ్రుయెల్ పాత్ర 'దాహానికి' ప్రతీక. శారీరక సంబంధాల మాధుర్యం, ప్రకృతి అందాలు,విజ్ఞానం ,కళలు, సారసత్వం తనివితీరా గ్రోలి దాహం తీర్చుకోవాలి. 'మనిషిగా పుట్టిన నా ఊహల హర్మ్యానికి సజీవ వ్యక్తులే పునాది రాళ్లు' అన్నాడు రాబెలా. మొదటి రెండు భాగాలలో శారీరక ధర్మాల గురించి స్త్రీల గురించి మొరటుగా వర్ణించిన మాట నిజమే.

రాబెలా కథాకథన సంవిధానం అద్భుతం. పదునైన హాస్యం, వ్యంగ్యం తొణికిసలాడుతుంది. సమకాలీన ఫ్రెంచి యూరోపియన్ సమాజంలోని రుగ్మతలపై ఎక్కుపెట్టిన ఘాటైన విమర్శ అతనికి ఎంతోమంది శత్రువులను సంపాదించి పెట్టింది. అయితే దాని వల్లనే నేడు మనం రాబెలా అభ్యుదయ, మానవతా దృక్పథానికి జోహారులర్పిస్తున్నాం. ఈనాటికీ అతని రచనకున్న ప్రాముఖ్యం అంతరించలేదు. ఇక, ఇది కల్పితే కథే అయినా, వందలాది పుస్తకాల, క్రీడల, రచయితల, సంగీత కళాకారుల, పాకశాస్త్ర ప్రవీణుల, సామెతల, పిట్టకథల, మొక్కల, జంతువుల, సరీసృపాల ప్రస్తావనలతో ఒక గొప్ప విజ్ఞాన సర్వస్వమనిపిస్తుంది. మాటల గారడీలో కూడా రాబెలా సిద్ధహస్తుడు. ఆమన ఫ్రెంచి భాషలో 600 కొత్త పదాలు ప్రవేశపెట్టాడు. అలా ఆయన ఆ భాషాభివృద్ధికి దోహదం చేశాడు. ఈ ప్రత్యేకతలన్నీ అనువాదాల్లో ఆస్వాదించలేం.

◆

---

తప్ప చిల్లరనోట్లు ఉంటాయని నేనూ ఆశించలేదు."

నాకు కాస్త కోపం వచ్చి అన్నాను: "చూడు బాబూ! కొత్త మనిషి గురించి అతను వేసుకున్న బట్టలను బట్టి నిర్ధారణకు రాకూడదు. నీ సూటుకు ఇప్పుడే డబ్బు చెల్లిస్తాను; పెద్ద నోటును మార్చే కష్టం నీకు కలిగించకూడదనే నా ఆలోచన."

## 7

అతడు తన తీరును కొద్దిగా మార్చుకున్నాడు కానీ, ఇంకా ఆ స్వరంలో గీర లేక పోలేదు: "తమరివ్వబోయే ఆ నోటును మేం మార్చలేమన్న నిర్ధారణకు తమరు కూడా రావటం సరైన పని కాదు. మేం ఏ నోటైనా మార్చగలం."

నేను అతనికి ఆ నోటిచ్చి, చెప్పాను: "సరే మంచిది. నన్ను మన్నించండి."

అతడు దాన్ని చిరునవ్వు చిందిస్తూ తీసుకున్నాడు; ఆ నోటుపై దృష్టి సారించటంతో ఆ నవ్వు గడ్డకట్టిపోయింది. అతడలా నోటు పట్టుకుని నిశ్చేష్టుడై నిలబడ్డ మనిషి దగ్గరకు, విషయమేమిటా అని విచారించటానికి యజమాని వచ్చాడు, చురుగ్గా. ఆ తర్వాత అడిగాడు: "ఏం జరిగింది? ఏమిటీ కష్టం? ఏం కావాలి?"

నేను చెప్పాను: "కష్టమేం లేదు. చిల్లర కోసం చూస్తున్నాను."

"పద, పద అతని చిల్లర అతనికిచ్చెయ్యి, టాడ్! చిల్లరివ్వు."

టాడ్ అతనికి నోటిచ్చాడు. యజమాని ఆ నోటువంక చూశాడు, మెల్లగా, చక్కటి ఈల వేశాడు, ఆ తర్వాత తిరస్కృత సూట్ల గుట్టవైపు దూకాడు, దాన్ని అటూ, ఇటూ విసుర్తూ, తనలో తనే చెప్పుకున్నట్లు ఉద్వేగంగా మాట్లాడసాగాడు:

"విపరీత మనస్తత్వం కలిగిన మిలియనీరుకు అలాంటి చెత్త స్యూటు నమ్ముతావా? టాడ్ మూర్ఖుడు, పుట్టటమే మూర్ఖుడుగా పుట్టాడు. వాడి తీరు ఎప్పుడూ అంతే! దేశదిమ్మరి ఎవడో, లక్షాధికారి ఎవడో తెల్సుకునే విచక్షణ వాడికి లేదు, అందుకే వచ్చిన లక్షాధికారినల్లా తోలేస్తుంటాడు. ఇదుగో, నేను వెతుకుతున్నది దొరికింది. వాటిని తీసెయ్యండి సారూ, నిప్పుల్లో పడెయ్యండి. ఈ చొక్కా, ఈ స్యూటూ వేసుకుని నన్ను అనుగ్రహించండి. ఇది సరైనది,

మీకు తగింది. సీదాగా, గొప్పగా, మరీ ఎబ్బెట్టుగా లేకుండా, జమీందారులు ధరించే మంచి ఫాషన్‌లో ఉంది. ఒక విదేశీ రాకుమారుడు ఆర్డరు వేస్తే తయారు చేశాం. బహుశః వారు తమకు తెలుసనుకుంటాను. ఘనత వహించిన హాలీఫాక్స్ హాప్సోడర్ దొరవారు. వారి తల్లి చనిపోయింది కనుక, దీన్ని వదిలేసి, మోర్నింగ్ (శోకసూచక) సూటును తీసుకున్నారు. ఆమె పోలేదనుకోండి. మంచే జరిగింది. ఏమైనా, అన్నీ మనకు కావలసినట్టు జరగవు. సరే, దాని సంగతదీ. ట్రౌజర్లు అద్భుతం, సార్! మీకు చక్కగా సరిపోతాయి! ఆం, ఇంక నడుం చూద్దాం. అబ్బో, సరిగ్గా సరిపోయింది. ఇంక కోటు! అయ్యో దేవుడా! ఎంత పూర్తిగా సరిపోయింది! మొత్తం బాగా ఉంది. నా అనుభవంలో ఇలాంటి విజయం నేనెప్పుడూ చూడలేదు."

## 8

నాక్కూడా తృప్తి కలిగింది.

"చాలా బావుంది. కొద్దిగా మార్పులు చేస్తాను. మీకు చెప్పకుండా చెయ్యకూడదు నేను. మీ కొలతల్లో, మీకు సరిపోయేలా ఎలా చేస్తామో మీరు చూడండి. ఇలా రా, టాడ్! పుస్తకం, పెన్ను పట్టుకో; రాయి, కాలి పొడవు 32 అంగుళాలు..." అలా నడిచింది వ్యవహారం. నన్ను ఒక్క మాట మాట్లాడ నివ్వలేదు. కొలతలు తీసుకున్నాడు; డ్రెస్-సూట్లు, మార్నింగ్ సూట్లు, చొక్కాలు, మరలాంటి వాటి కెన్నింటికో ఆర్డరు వేయసాగాడు. అవకాశం లభించినప్పుడు నేను అన్నాను:

"అయ్యా, మీరు అనిశ్చితకాలం నిరీక్షించగలిగితేనో, లేక, నోటును మార్చగలిగితేనో తప్ప నేను ఈ ఆర్డర్లు ఇవ్వలేను."

"ఎంత తేలికైన మాటన్నారు సార్! శాశ్వతంగా అనండి! టాడ్, ఈ ఆర్డరు త్వరగా పూర్తి చెయ్యాలి. మిగతావారిని ఆపు. వీరి చిరునామా తీసుకో..."

"నేను నా నివాసం మారుస్తున్నాను. తిరిగొచ్చి, నా కొత్త చిరునామా ఇస్తాను."

"అలాగే సార్! ఒక్కక్షణం, నేను మిమ్మల్ని బయటకు తీసుకు వెళ్తాను. ఆం అదీ సార్! మంచిదండీ, ఉంటానండీ!"

> పాలిచ్చే గోవులు,
> పాలు తాగే
> మనుషులు కూడా
> గడ్డే తింటారు.
> -బెజవాడ సామెత

ఇంక జరగబోయేది మీరు ఊహించే ఉండాలి. నా కెక్కడ ఏది కావాలంటే అది సహజంగానే కొనటం, చిల్లర అడగటం సాగించాను. వారం రోజుల్లోపల నాకు కావల్సిన వస్తువులు, సుఖాలు, విలాసాలు పుష్కలంగా లభించాయి. హనోవర్ స్క్వేర్‌లోని ఖరీదయిన హోటల్లో వసతి లభించింది. నా భోజనం అక్కడ చేసేవాడిని, బ్రేక్‌ఫాస్టుమాత్రం నా మిలియన్ పౌండు నోటుమీద మొదటి భోజనం లభించిన నిరాడంబరమైన హారిస్ తినుబండారాల గృహంలో చెయ్య సాగాను. నన్ను సృజించింది హారిస్సే. మిలియన్ పౌండు నోట్లను జేబులో పెట్టుకు తిరిగే విదేశీ పిచ్చివాడు, దానికి పోషక-దేవుడయినట్లు ప్రచారం జరిగింది; అది చాలు, దశ ఎత్తుకోటానికి. దానికి పేరొచ్చింది, ఖాతాదార్లతో నిండిపోసాగింది. హారిస్ నాకు ఎంత కృతజ్ఞతతో బలవంతంగా నాకు అప్పులు ఇవ్వసాగాడు, నేను కాదంటానికి వీలులేదు. అలా బుక్కా ఫకీరును ధనికుడిని, మహానుభావుడిని అయిపోయాను. భవిష్యత్తులో దెబ్బ తగలకమానదు అని నాకు తెల్సు; కానీ, నేను దానిలోకి దిగాను కనుక ఈదక తప్పదు, లేకపోతే మునిగి చావాలి.

## 9

అది సహజం; ప్రపంచంలోని ఒక మహానగరంలో నేనో అపప్రఖ్యాత పురుషుడనై పోయాను; అది నా బుర్ర తిప్పేసింది; "వెస్ట్ పాకెట్‌లో మిలియన్ పౌండు నోటు మనిషి" అన్న ప్రస్తావన లేని పత్రిక ఏదీ లేదు; అందులో అతడు చేసిన ఇటీవలి చర్యలు, చెప్పిన మాటలు నమోదు అయ్యేవి. ఈ ప్రస్తావనల మొదట్లో, వైయక్తికపు ఊసులాటల కాలంలో చివర నా పేరుండేది; ఆ తర్వాత నైట్లపైకి నా పేరు పోయింది; ఆ తర్వాత బారనెట్ల పైకి, ఆ తర్వాత బారన్ల పైకి, అలా నిరంతరం పైకి పాకుతూ కొనసాగింది. నా అపప్రఖ్యాతి పెరుగుతున్న కొద్దీ సాధ్యమైన ఉన్నతమైన ఎత్తులకు, రాచరికంవారు కాక, మిగతా డ్యూకులనధిగమించీ, ఇంగ్లాండు మతముఖ్యులు తప్ప మిగతా మతాధికారుల నధిగమించీ కొనసాగింది. ఇది కీర్తి కాదు; ఇప్పటికి నేను సాధించింది అపప్రఖ్యాతి మాత్రమే. ఇంక చివరకు సంభవించింది పరాకాష్ఠ! ప్రశంసల వెల్లువ అనుకోండి. పంచ్ పత్రిక నా కార్టూను వేసింది; నా స్థానం సుప్రతిష్ఠితమయింది. ఎవడో ఒకడు నా గురించి మాట్లాడకుండా బయటికి వెళ్లటం కష్టమైపోయింది. "అదుగో, ఆ వెళ్తున్నది ఆయనే! అవును, ఆయనే!" అన్న మాటలు! జనం చూడకుండా అల్పాహారం తీసుకోటం సాధ్యం కాదు, ఒపేరాబాక్సుకు వెళ్లటం కుదరటం లేదు.

నా పాత చింకిపాతల సూటును నేను వదల్లేదు. చిన్నచిన్న వస్తువులు కొనుక్కోటానికీ, అవమానాలు పొందటానికీ, చివరగా అపహాస్యం చేసినవాడిని మిలియన్ పౌండు బిల్లుతో చావబాదటానికీ ఉపయోగిస్తూ, పాత ఆనందాలను పొందేందుకు వాటిని ధరించేవాడిని. అలా ఎంతో కాలం సాగలేదు. పత్రికలు నా డ్రెస్సును ఎంతగా జనాలకు పరిచయం చేశాయంటే, నేనా డ్రెస్సులో వెళ్లినా, జనం గుర్తించసాగారు, ఇంక గుంపులు అనుసరించటం! ఇప్పుడే మన్నా నేను కొందామన్నా, ఆ షాపతను, నేను నోటు బయటకు తియ్యక ముందే మొత్తం దుకాణాన్ని అప్పుగా ఇవ్వటానికి సిద్ధ పడిపోయేవాడు.

## 10

నా కీర్తి పదోరోజు చేరాక, ఒక అమెరికా మతాధికారికి నా గౌరవాలు తెల్పే బాధ్యతను నేను నిర్వర్తించాను. నా అంతస్తు మనిషిని ఎలా ఆహ్వానించాలో అలా ఆహ్వానించా డాయన, రాత్రి తన డిన్నర్ పార్టీలో, ఆరోగ్యం బాగాలేక ఎవరయినా రాకపోవటం జరిగితే, ఆ సీటును నేను గ్రహించాలన్నాడు. మాటల్లో ఆయనా, మా నాయనా చిన్నతనంలో పాఠశాల సహాధ్యాయులనీ, ఆ తర్వాత యేల్‌లో కలసి చదువుకున్నారనీ, చక్కటి స్నేహితులనీ తెలిసింది. కనుక, నాకు తీరికైనప్పుడల్లా నేను తన ఇంటికి రావాలని ఆయన నన్ను అడిగాడు.

నిజానికి నాకు సంతోషం కలిగింది. పతనం సంభవించినప్పుడు, పూర్తి వినాశనం కాకుండా ఆయన నన్ను కొంతమేరకు రక్షించవచ్చు. అందుకు ఆయనేదో ఒక ఉపాయం ఆలోచించకపోడు. ఇంత జరిగాక ఇప్పుడు జరిగిందంతా చెప్పే ధైర్యం నేను చెయ్యలేదు; లండనులో దౌర్భాగ్యంగా జీవితం ప్రారంభించినప్పుడయితే ఆ పని చేసి ఉండేవాడిని. లేదు, ఇప్పుడా ధైర్యం చెయ్యలేను. నేను ఎంత అప్పు చేసినా, నా జీతం పరిధిలోనే ఉండే జాగ్రత్త తీసుకున్నాను. నాకు వచ్చే జీతమెంతో తెలియదు కానీ, అంచనావేయగల ప్రాతిపదిక నాకుంది; ఆ విషయంలో నాకు సందేహం లేదు. నేనెప్పుడూ అదృష్టవంతుడినే. నా అంచనా ప్రకారం వేతనం సాలుకు ఆరొందలనుండి వెయ్యి ఉండవచ్చు; మొదటేడు ఆరొందలనుకుందాం, అలా ఏడాదికేడాదికి పెరుగుతూ, నా యోగ్యతవల్ల నేను పెద్దమొత్తం సంపాదించే వరకు సాగుతుంది. ప్రస్తుతం నేను మొదటి యేడాది జీతమంత అప్పుమాత్రమే చేశాను. ప్రతివాడూ నాకు అప్పివ్వటానికి ముందుకు వచ్చినా, నేను జాగ్రత్త పడ్డాను. కనుక, ఈ

300 పౌన్లు నగదు అప్పు చేస్తే, 300 పౌన్లు నా వసతి, నిర్వహణ, కొనుగోళ్లకు పరిమితమయింది. నేను జాగ్రత్తగా, పొదుపుగా ఉండేటట్లయితే, నా రెండోయేటి వేతనం ఈ నెలలో మిగిలిన రోజులకు సరిపోతుంది; ఆ విషయంలో చాల జాగ్రత్తపడాలని కూడ నేను నిశ్చయించుకున్నాను.

## 11

పధ్నాలుగుమంది వచ్చిన చక్కటి డిన్నర్ పార్టీ అది. షోరొడిచ్ డ్యూకూ, డచెస్, వారి అమ్మాయి, లేడీ ఏన్-గ్రేస్- ఎలీనార్- సెలెస్తే- వగైరా వగైరా, డి-బోహున్, న్యూగేట్ ఎర్ల్, కౌంటెసేలు, విస్కౌంట్ ఛీప్‌సైడ్, బ్లాథర్‌స్కైట్ లార్డ్, వారి సతీమణి, కొంతమంది బిరుదుల్లేని స్త్రీపురుషులు, అమెరికా మతాధికారి, వారి భార్య, కూతురు, ఆమె పర్యాటక మిత్రురాలు- చూసిన రెండునిమిషాల్లోపల నేను ప్రేమలో పడిన పోర్షియా లాం పేరున్న ఒక ఇరవైరెండేళ్ల ఆంగ్ల వనిత- ఆమె కూడ నన్ను ప్రేమించినట్లు గమనించాను- హాజరయ్యారు. ఇంకో అమెరికా అతిథి కూడ ఉన్నాడు. ఈ జనమంతా ఇంకా డ్రాయింగ్ రూమ్‌లోనే కూర్చుని, డిన్నర్ కోసం ఆకలికి పదునుపెడ్తూ, లేట్ లతీఫ్‌ల వంక ముభావంగా చూస్తూ ఉన్నప్పుడు, సేవకుడు ప్రకటించాడు: "మిస్టర్ లాయడ్ హేస్టింగ్స్!"

ఇచ్చి పుచ్చుకునే మర్యాదలయ్యాక, హేస్టింగ్స్ నన్ను చూసి, స్నేహపూర్వకంగా చెయ్యిచాపుతూ సీదా నా వంకకు వచ్చాడు; చెయ్యి కలుపబోతూ, ఒక క్షణమాగి, ఇబ్బంది పడినట్లు చూస్తూ, అన్నాడు:

"క్షమించాలి. నాకూ, మీకూ పరిచయమున్నట్లుంది!"

"పరిచయం లేకపోవటమేంటి, బాగా తెల్సు."

"అంటే, నువ్వు..."

"వెస్ట్ పాకెట్ రాక్షసుణ్ణి! నిజానికి నేనదే! ఆ నిక్‌నేమ్‌తో నన్ను పిలవటానికేమీ జంకొద్దు. నాకది అలవాటయి పోయింది."

"బావుంది. గొప్ప సంగతి. కానీ, ఆ హెన్రీ ఆడమ్స్ నువ్వేనని అనుకోలేక పోయాను. ఆర్నెల్ల క్రితం ఫ్రిస్కోలో బ్లేక్ హాప్‌కిన్స్ వారికి గుమాస్తా పనిచేస్తూ వేతనం తీసుకోటం, అదనపు భత్యంకోసం రాత్రులు కూడ పనిచెయ్యటం, గోల్డ్ అండ్ కర్రీ ఎక్స్‌టెన్షన్ పత్రాల తనిఖీ, గణాంకాల విషయంలో నాకు సాయం చెయ్యటం-అంతా గమ్మత్తుగా ఉంది. నువ్వు లండన్‌లో పెద్ద కోటీశ్వరుడివవటం, ఇంత గొప్పగా ప్రఖ్యాతుడవటం- అంతా పూర్తిగా అరేబియన్ నైట్స్ తిరిగొచ్చినట్లుంది. నేను ఇదంతా ఏమిటో గ్రహించలేకుండా ఉన్నాను.నా కోసం కొంత కాలం వినియోగించి, నా బుర్రలో ఉత్పాతాన్ని సెటిల్ చెయ్యి, బాబూ!"

"వాస్తవమేమంటే లాయడ్! నాకంటే, నువ్వే మెరుగు! నాకే ఇదేమిటో తెలిసి చావటం లేదు. "

## 12

"ఎంత ఆశ్చర్యంగా ఉంది! కాదా? ఎందుకూ, మనం గని కార్మికుల రెస్టారెంటులోకి కలిసి వెళ్లి మూడు నెల్లయిందనుకుంటాను..."

"కాదు, వాట్ ఛీర్‌లో కలుసుకున్నాం."

"పోనీ, వాట్ ఛీరే అనుకో; ఉదయం రెండు గంటలకు వెళ్లాం, ఆ ఎక్స్‌టెన్షన్ పత్రాలను చూస్తూ ఆరు గంటలు గడిపాక, అక్కడ ఛాప్, కాఫీ పుచ్చుకున్నాం. నాతో లండను రమ్మని నీకు నచ్చచెప్ప ప్రయత్నించాను. నీకు శలవు ఇప్పిస్తాననీ, నీ ఖర్చులన్నీ భరిస్తాననీ, అమ్మకాలలో లాభం వస్తే ఏదో కొంత ఇస్తాననీ చెప్పాను. కానీ, నువ్వు నా మాట వినలేదు. నాకు అందులో లాభం రాదనీ, వ్యాపారాన్ని నడిపి, పోగొట్టుకునే స్తోమత నీకు లేదనీ, మళ్లా తిరిగొచ్చి పాతవాటినే పట్టుకుని వేలాడే సమయం నీకు లేదనీ అన్నావు. అయినా, నువ్విక్కడికి వచ్చావు. ఎంత గమ్మత్తుగా ఉంది ఇదంతా! నువ్విలా ఇక్కడికి రావటమెలా సంభవించింది, ఇంత ఉజ్జ్వలంగా బతుకు ప్రారంభించటానికేం చేశావు?"

"ఓ, అదంతా ఓ యాదృచ్ఛిక సంఘటన. పెద్ద కథ- కల్పిత కథ అని నువ్వనవచ్చు. నీ కంతా చెప్తాను కానీ, ఇప్పుడు కాదు, ఈ నెలాఖర్లో. "

"అంటే ఇంకో పక్షం రోజులపైనే ఉంది. మనిషి కుతూహలానికి మరీ శ్రమకలిగించే పని! వారం రోజుల్లో చెప్పెయ్యి."

"కుదరదు. నీకే తెలుస్తుంది పోగాపోగా! సరే, వ్యాపారం ఎలా నడుస్తుందేం?"

అతడి ఉత్సాహమంతా గాలిలో అంతర్థితమయింది, నిట్టూరుస్తూ చెప్పాడు:

"నువ్వు నిజానికి పెద్ద జ్యోతిషవేత్తవి! నేను దాన్ని గురించి మాట్లాడను."

"కానీ, తప్పదు. ఇక్కడనుండి బయల్దేరాక, రాత్రికి నా దగ్గరుండు. అదేదో నాకు చెబ్దువుగాని!"

## 13

"నిజమా? నిజంగానే అంటున్నావా?" అతడి కళ్లల్లో నీళ్లు నిల్చాయి. "నీకు చాల కృతజ్ఞతలు. మళ్లా నాలో, నా వ్యవహారాల్లో ఒక మనిషి ఆసక్తి చూపటం, ఆ గొంతులో, చూపులో కరుణ వ్యక్తమవటం నాకానందంగా ఉంది. అందుకు నా మోకాళ్ల మీద పడి ఆ ప్రభువును ప్రార్థించాలి!"

స్నేహితులు
వస్తూ, పోతూ వుంటారు.
శత్రువుల సంఖ్య మాత్రం
పెరిగిపోతూ ఉంటుంది.
- భువనగిరి సామెత

ఆ తర్వాత అంతా బాగా, ఉత్సాహంగా జరిగింది, ఒక్క డిన్నర్ వ్యవహారం తప్ప. అదేం బాగా లేదు: ఆ పాడు బ్రిటీషు వ్యవస్థలో మామూలుగా జరిగేదే జరిగింది. ఎవరు అగ్రస్థానం వహించాలన్న విషయం తేలలేదు. ఇంగ్లీషువాళ్లు డిన్నరుకు వెళ్లక ముందే డిన్నరు చేసేసి, ఆ పిమ్మట డిన్నరుకు వస్తారు. మేమంతా భోజనం చేశాకే వచ్చాం కనుక ఎవరికీ ఇబ్బంది కలుగ లేదు, ఒక్క హేస్టింగ్స్‌కు తప్ప; మాలో అతనొక్కడే తెలియనివాడు. ఒక్కొక్కళ్లు ఒక సభ్యమహిళతో ఊరేగింపుగా డైనింగ్ రూమ్‌కు వెళ్లారు; అక్కడ క్రమాలు, ఆచారాలు పాటించటం జరుగుతుంది. అక్కడే వివాదం మొదలయింది. షోరొడిచ్ డ్యూక్ అగ్రస్థానం వహించి, టేబుల్ ముందు సీటునాక్రమించ చూశాడు; మతం పెద్ద ఒక దేశానికి ప్రాతినిధ్యం వహించ వచ్చు గానీ, రాజుకు కాదు; కనుక తనదే అగ్రశ్రేణి అన్నాడు; కానీ, నేను నా హక్కులను వదులుకోలేను, నా స్థానం అతడికిచ్చేది లేదు. నేను రాచరక్తం లేని డ్యూకులందరికంటే గొప్పవాడినని గాసిప్ కాలమ్ ఎప్పుడో పత్రికల్లో రాసేసింది. మేం ఎంత చర్చించుకున్నా ఈ వ్యవహారం తేలలేదు. నేను, నా పేరే సూచిస్తున్నట్లు, ఆడమ్‌కు ప్రత్యక్షవారసుడనైతే, అతడు దాయాది సంబంధికుడు; అతడి పేరే తెలుపుతున్నది, అతడు ఇటీవలి నార్మన్ మూలాల మనిషని! కనుక మేం తిరిగి డ్రాయింగురూమ్‌కు వచ్చాం, నిలబడే లంచ్ చేశాం. ఒక ప్లేటు సార్డయినులు, స్ట్రాబెర్రీ, ఒక బృందంతో చేరి తినటం. ఉన్నత శ్రేణి మనుషులు ఇద్దరు షిల్లింగ్ నాణెం ఎగరేసి, గెల్చిన మనిషి మొదట స్ట్రాబెర్రీ పుచ్చుకుంటే, ఓడినవాడికి ఆ షిల్లింగు వస్తుంది. ఆ తర్వాత శ్రేణి వారిద్దరు ఆ తర్వాత, అలా ఇద్దరుగా సాగుతుంది. రిఫ్రెష్‌మెంట్లయ్యాక, మేమంతా క్రిబ్బేజీ ఆడాం, ఆటకు ఆరుపెన్నీలచొప్పున వొడ్డుతూ. వేడుకకోసం ఏ ఆటా ఇంగ్లీషువాళ్లు ఆడరు; వారికి ఏదో కొంత లాభమో, నష్టమో ఉండాలి.

## 14

మాకు చాల చక్కగా కాలక్షేపమయింది; ఇంక కుమారి లామ్, నేనూ

నవలా పరిచయం

# ది టేల్ ఆఫ్ గెంజి

## మురసాకి షికిబు (978-1030)

కథా స్థలం ఆనాటి రాజధాని, నేటి క్యోటో నగరం. రాజ్యంలోని కులీనులందరూ చక్రవర్తికి లేదా సింహాసనం అధిష్ఠించబోయే వారసునికి తమ కూతుళ్లను సమర్పించుకోవటం ఆనవాయితీ. ఇలా రోజూ అంతఃపురంలో చేరే కన్యల బాగోగులు చూడటానికి ప్రత్యేక అధికారులుంటారు. చక్రవర్తి కనబర్చే ఆసక్తిని బట్టి ఈ కన్యల హోదా నిర్ణయిస్తారు. అధికారికంగా పట్టమహిషి ఒక్కతే. కాని కింది వరుసల్లో అనేకమంది స్త్రీలు చక్రవర్తి కటాక్ష వీక్షణం కోసం నిరీక్షిస్తుంటారు. అంతఃపుర కాంతల పై అధికారిణి కూడా చక్రవర్తి భార్య ఒకతె. ఆమె హోదాను నైశీ నోల్లోకామి అంటారు. వందలాదిగా ఉన్న ఈ సుందరాంగనలందరూ పట్టమహిషి కావాలని కలలుగన్నా అత్యధికులకు ఆ అదృష్టం వరించటం దుర్లభమే. పలుకుబడి లేనివాళ్లనూ, పేదలనూ చక్రవర్తి కన్నెత్తి కూడా చూడకపోవచ్చు. మన కథానాయకుడు గెంజి, చక్రవర్తికి ఒక అంతఃపుర కాంత ద్వారా పుట్టిన సంతానం. అధికారుల అండ కరువైన ఆ స్త్రీ కేవలం చక్రవర్తి కరుణాకటాక్షం మీద ఆధారపడి మంచి రోజుల కోసం నిరీక్షిస్తుంది. అనుకున్నట్టే చక్రవర్తి కూడా స్పందించాడు. తన ప్రథమ సంతానానికి బదులు, గెంజిని వారసుడిగా ప్రకటించాలనుకుంటాడు చక్రవర్తి. కాని ఈ నిర్ణయం సభామోదం పొందే అవకాశం లేదు. అందువల్ల గెంజిని దూరంగా మరోచోట పెంచి, తిరిగి తన కొలువులో ఒక అపరిచిత వ్యక్తిగా నియమిస్తే సమస్య పరిష్కారమవుతుంది. యుక్తవయసులో గెంజి ఒక ముఖ్య రాజోద్యోగి కూతురు 'అవోయి'ని వివాహం చేసుకుంటాడు. అయితే ఆమె ఇంకా రజస్వల కాలేదు గనక తండ్రివద్దే ఉంటుంది. గెంజికి ఆస్థానంలో సముచిత హోదా లభిస్తుంది. అతడి తల్లి బాల్యంలోనే మరణించింది. ఆమె స్థానంలో చక్రవర్తి, మరో రాకుమారి ఫ్యుజిట్సుబోను పెళ్లాడాలనుకుంటాడు. ఆమెకూ, మొదటి భార్య అయిన గెంజి తల్లికీ పోలికలున్నాయి. ఈలోగా గెంజి ఆమెతో రహస్యంగా సంబంధం పెట్టుకుని, సింహాసనానికి వారసుడిగా ఓ కొడుకును కూడా కంటాడు. ఫుజిట్సుబోతో గెంజి పరిచయం కొనసాగటానికి నిబంధనలు ఒప్పుకోవు. అది రహస్యంగా ఉండిపోవాల్సిందే. ఆమెను పోలిన మరోకన్య, ఫుజిట్సుబో మేనకోడలు 'మురసాకి' అతణ్ణి తన ప్రేమతో పరవశింపచేస్తుంది. కథా ప్రారంభంలో పదేళ్లున్న మురసాకి పెరిగి గెంజికి భార్యగా బాధ్యతలు స్వీకరిస్తుంది. జీవితంలో అతడికి స్వర్గసుఖం ఇచ్చిన స్త్రీ మురసాకి నవల నలభయ్యో అధ్యాయంలో ఆమె మరణంతో అతనిలో జీవితేచ్ఛ నశిస్తుంది. కాని ఈలోగా అనేకమంది స్త్రీలతో సాంగత్యం ఏర్పడుతుంది. మురసాకితో సహా స్త్రీలందరిలోనూ తల్లి పోలికలున్నందువల్లే అతడు సంబంధాలు పెట్టుకున్నాడని పలుమార్లు వివరణ ఇస్తుంది రచయిత్రి. బాల్యంలో ఒకసారి యువకులందరూ స్త్రీలతో తమ అనుభవాలను నెమరేసుకున్నప్పుడు వింటాడు గెంజి. ఏ లక్షణాలున్న స్త్రీలు పురుషుల్ని బాగా తృప్తిపరచగలరో తెలుస్తుంది. ఆ తర్వాత తను స్వయంగా, ఆ జ్ఞానాన్ని పలువురు స్త్రీలలో పరీక్షిస్తాడు. స్త్రీ సంభోగమే పరమావధిగా బతికే పురుషుణ్ణి కాముకుడని అనటం సమజమే. గెంజి స్వభావం ఎలాంటిదైనా, ఈ దక్షిణ నాయకుణ్ణి వర్ణించే అనేక అధ్యాయాలు మాత్రం మహా ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా పాఠకులను ఉరకలెత్తిస్తాయి. అయితే రాజుల ప్రవర్తనను తప్పుపట్టడం ఆ రోజుల్లో ఊహించలేని విషయం. అందువల్ల గెంజి తను పరిచయం పెట్టుకున్న స్త్రీలందర్నీ సమంగా ప్రేమించాడనీ, అందరిపట్లా తన బాధ్యత సక్రమంగా నిర్వర్తించాడనీ నొక్కి చెబుతుంది రచయిత్రి. గెంజి స్ఫురద్రూపి. గొప్ప అందగాడు. అతణ్ణి మోహించకుండా ఉండటం పడతులకు అసాధ్యం. పైగా సంపదలో, అధికారంలో అతణ్ని మించినవాళ్లు లేరు. అటువంటి పురుషుడి కౌగిట్లో ఒదిగిపోవటం కన్న ఏ స్త్రీ అయినా మరేమి కోరుకుంటుంది? ఇంకా బాధ్యతలు స్వీకరించని బాల్య దశలో సుందరాంగనలే అతని లోకం. వయసు పెరిగి, కర్తవ్యం గుర్తెరిగిన పిదప రాజకీయంగా ప్రత్యర్థులను హడలెత్తించాడు గెంజి. అయితే స్త్రీలపట్ల ఉన్న వ్యామోహమే ఒకసారి అతడికి చిక్కులు తెచ్చిపెట్టింది. తన ప్రధాన రాజకీయ శత్రువు కూతురు 'ఒబోరోకియో' తో క్రీడిస్తూ ఒక దండనాయకుని కంటబడతాడు. ఒబోరోకియో అక్క క్యోటో సింహాసనానికి వారసుడి తల్లి. ఆమె దుర్బుద్ధితో గెంజిని నాశనం చెయ్యటానికి ప్రణాళిక రచిస్తుంది. చేసిన తప్పుకు తలెత్తుకోలేక, దేశాంతరవాసమే శ్రేయస్కరమనుకుంటాడు గెంజి. కోబె నగర సరిహద్దుల్లో ఉన్న 'సుమా' సురక్షిత ప్రాంతమని సూచిస్తారు సలహాదార్లు. రహస్యంగా వెళ్లి పోతున్నాడు గనక మురసాకినీ వదలక తప్పదు. నవలలోని అనేక అధ్యాయాలు గెంజి అంతర్మథనాన్ని హృద్యంగా చిత్రిస్తుంది రచయిత్రి. అనుకోని పరిస్థితుల్లో అందరూ మంచు తుఫానులో చిక్కుకుంటారు. కొంతసేపటికి, తుపాను తీవ్రత తగ్గిన తర్వాత, తెప్పమీద ఒక ధనికుడు ప్రత్యక్షమై కాలువ అద్దరినున్న తన ఇంటికి అతిథిగా రమ్మని ఆహ్వానిస్తాడు. ధనికుని ఇంట్లో కొన్నాళ్లు సుఖంగానే గడుస్తుంది. గెంజి అతని కూతురు అకాషితో సంబంధం పెట్టుకుంటాడు. ఆమె గర్భం దాలుస్తుంది. రాజధానికి తిరిగి రమ్మని గెంజికి పిలుపు వస్తుంది. అప్పటికే అతడికి మొదటి భార్యతో ఒక కొడుకున్నాడు. పేరు యుగిరి. ఆమె మరణించి చాలా కాలమైంది. ఫుజిట్సుబో వల్ల పుట్టిన కుమారుడు, భావి రారాజు రెయిజి కూడా పెరుగుతున్నాడు. ఈ మూడో సంతానం ఆడపిల్ల. రెయిజి తర్వాత ఆమె సింహాసనాన్ని అధిరోహిస్తుంది. నవలలో ఈ పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. రాజవంశానికి చెందిన అత్యున్నత వ్యక్తిగా, అంటే చక్రవర్తి మాతామహుడు అనే హోదాను గెంజికి కల్పిస్తుందీమె. దేశాంతర వాసం నుండి తిరిగి వచ్చిన గెంజి బలం పుంజుకుంటాడు. అయినా అప్పుడప్పుడూ స్త్రీ అందాలు అతణ్ణి లొంగదీసుకుంటూనే ఉంటాయి. ఇప్పుడతని ఆలోచనలు సౌందర్యారాధనకే పరిమితం. తొలిదశలో గెంజి, ఒకేసారి రాకుమారి అసాగావోతో ప్రేమలో పడతాడు. అయితే ఆ వ్యవహారం ఎక్కువ కాలం కొనసాగదు. అసాగావోలో కూడా అతడు తల్లిపోలికలు

---

–మా ఇద్దరి సంగతి చెప్పనక్కరలేదు. నాకు ఆమెపట్ల సమ్మోహమే కలిగింది; ప్రతిసారీ, ఆట ఓడిపోయుండేవాడినే; ఆమెకూడ నా పరిస్థితిలోనే ఉండటంతో ఆమెకూడ అదే పని చేసింది. ఫలితంగా మాఇద్దరిలో ఎవరూ ఓడిపోలేదు; అలా ఎందుకు జరుగుతూందో తెలుసుకునే ఆలోచనకూడ మాకు కలగలేదు; తెలిసింది, మేం ఆనందంగా ఉన్నామనే. మరో విషయం పట్టించుకునే తీరికలేదు; పైగా మాకెవరూ అవరోధం కల్పించకూడదనీ కోరుకున్నాం. ఆమెకు చెప్పాను,

చూశాడని మనం భావించాలి. అధికార వర్గాలలో పెరుగుతున్న పలుకుబడి వల్ల మురసాకి తనకు సరిజోడు కాదనుకుంటాడు గెంజి. రాజ కుటుంబానికి చెందని స్త్రీలకు అంతఃపురంలో ఉన్నత స్థానం లభించదు. త్వరలో గెంజి అనూహ్యంగా ఎదిగిపోతాడు. దివంగతురాలైన తన ప్రేయసి రోకుజో నోమియా సుజోకురో వల్ల సంక్రమించిన సంపదతో నాలుగు అద్భుత హర్మ్యాలు నిర్మిస్తాడు. వాటి అంతర్భాగంలో ఒకదాని నుండి మరొకదానికి దార్లుంటాయి. ఈ నాలుగు భవనాలూ నాలుగు రుతువులకు ప్రతీకలు. ఒక్కొక్క దాంట్లో ఒక్కొక్క ఇష్టసఖి ఉంటుంది. దీనికి రోకుజో భవన సముదాయం అని నామకరణం చేస్తాడు. ఈ దశలోనే చక్రవర్తి తన రహస్య సంతానమైన అతణ్ణి 'విరమించిన గౌరవ చక్రవర్తి'గా' నియమిస్తాడు. జపాను చరిత్రలో ఇటువంటి హోదా కల్పించటం అదే ప్రథమం. ఒకసారి తన సవతి సోదరుడు 'విరమించిన చక్రవర్తి' సుజాకు నుండి గెంజికి వర్తమానం వస్తుంది. సుజాకు బలహీనుడు. తను ఈ లోకాన్ని త్యజిస్తాననీ, తన కూతురు (చిన్నపిల్ల) పోషణ బాధ్యతలు స్వీకరించమని, పెళ్లి చేసుకొనమని అర్థిస్తాడు. గెంజి అంగీకరిస్తాడు. ఈ పిల్ల కూడా త్వరలో మురసాకి అంత సుందరిగా ఎదుగుతుందని భావిస్తాడు. ఈమె కూడా పుజిట్సుబో మేనకోడలే. అయితే ఆ పిల్లను పెళ్లాడాలనుకునే యువకులకు కొదవలేదు. కారణం మురసాకికి లేని అధికార హోదా ఈమెకుంది. ఆమె 'విరమించిన గౌరవ చక్రవర్తి'కి భార్య కాగలదు.

అయితే తన నిర్ణయానికి త్వరలోనే పశ్చాత్తాపడతాడు గెంజి. 'చక్రవర్తి' కూతురు గనక  ఆమెను ఉపేక్షించటానికి వీల్లేదు. కాని అనారోగ్యంలో ఉన్న మురసాకిని వదిలి ఉండలేడు. రాజవంశీకులకు ఇది ఘోర అవమానం. సుజాకి కూతురు ఒంటరిగా ఉన్న సమయంలో ఓ యువకుడు ఆమెను లొంగదీసుకుంటాడు. ఈ విషయం తెలిసి గెంజి, ప్రతీకారేచ్ఛతో రగిలిపోతాడు. కాని ఈలోగా మరో ఉపద్రవం ముంచుకొస్తుంది. సుజాకి కూతురు గర్భం దాల్చి కొడుకు కావోరూని ప్రసవిస్తుంది. అందరూ అది గెంజి సంతానమే అనుకుంటారు. గర్భానికి కారకుడైన యువకుడు పశ్చాత్తాపంతో మరణిస్తాడు. సుజాకి కూతురు సన్యాసం స్వీకరిస్తుంది. మురసాకి ఆరోగ్యం క్షీణిస్తుంది. గెంజికి కొత్త వివాహం అలా చేదు జ్ఞాపకంలా మిగిలిపోతుంది.

రెండు మూడేళ్ళ తర్వాత మురసాకి నలభయ్యో పడిలో మరణిస్తుంది. గెంజికి అప్పటికి యాభై దాటినై. జీవితంలో సకల సౌఖ్యాలూ అనుభవించి, తన ప్రియాతి ప్రియమైన మురసాకిని పోగొట్టుకుని జీవచ్ఛవంలా మిగిలిపోతాడు. మరి కొన్నాళ్ళకు సన్యాసం స్వీకరించి, శేషజీవితం ఒక దేవాలయంలో గడిపి ప్రశాంతంగా కళ్లు మూస్తాడు. అయినా గెంజి గాథ ఇంకా కొనసాగుతుంది. కావోరూ, గెంజి మనుమడు నియోవు (ఇప్పుడు రారాణిగా ఉన్న అకాశి కూతురి కొడుకు) యువకులుగా తెరమీదికి వస్తారు. ఇద్దరూ మంచి మిత్రులు. ప్రేమ వ్యవహారాలలో తరచూ పోటీ పడుతుంటారు. చక్రవర్తి కొలువులో మోహంమొత్తి, భార్యను కోల్పోయిన ఒక రాకుమారుడు తన ఇద్దరు కూతుళ్ళతో రాజధానికి సమీపంలో ఉన్న ఉజి గ్రామానికి తరలిపోతాడు. అక్కడ ఉజి నదీతీరంలో ఆశ్రమం ఏర్పరచుకుని ఆధ్యాత్మిక చింతనలో గడుపుతుంటాడు. ఆ సాధుపుంగవుని పవిత్ర జీవితం కావోరూను ఆకర్షిస్తుంది. రాకుమారుని కూతుళ్లు కూడా అతణ్ణి ఆకర్షిస్తారు. పెద్దమ్మాయి 'ఒయిగిమి'ని గాఢంగా ప్రేమిస్తాడు. నిజానికి ఇద్దరూ కావాలని కోరుకుంటాడు. కానీ తన మిత్రుడు నియోవు చిన్నకూతురు 'నకనోకిమిని' ఇష్టపడతాడు. ఈ దశలో నకనోకిమిని నియోవు వివాహం చేసుకోవాలి. కాని అతడికి ఉజి రావటానికి వీలు పడదు. సుదీర్ఘ కాలం పాటు సంపర్కం పెట్టుకోకపోవటంతో తనమీద అతడికి ఇష్టం లేదు కాబోలు ననుకుంటుంది నకనోకిమి. కావోరూను ప్రేమిస్తే తన పరిస్థితీ ఇంతేనని భయపడుతుంది ఒయిగిమి. కోరిక  తీరకపోవటంతో నిరాహారదీక్ష చేసి ఆత్మాహుతికి పాల్పడుతుంది ఒయిగిమి.

ఈ సంఘటన నియోవులో మార్పు తెస్తుంది. నకనోకిమిని తన వెంట నగరానికి తీసుకుపోతాడు. కాని అక్కడ రాజకీయ ఒత్తిళ్లకు లొంగి, తల్లిదండ్రుల ఆజ్ఞను జవదాటలేక యుగిరి కుమారుడి కూతుర్ని వివాహం చేసుకుంటాడు. నకనోకిమితో కావోరూ పరిచయం కొనసాగుతుంది. ఆమె తన సోదరి అనే భావన అతనిలో పెరుగుతుంది. కాని వీళ్ల సాన్నిహిత్యం చూసి నియోవు  అనుమానిస్తాడు. తమ ఇద్దరి మధ్యా లైంగిక సంబంధం లేదని నియోవుకు చెబుతుంది నకనోకిమి. తన పోలికున్న సవతి 'ఉకిపునె'. ఆమెలో 'ఒయిగిమి'ని చూస్తాడు కావోరూ. పెళ్లంటూ చేసుకుంటే ఆమెనే చేసుకుంటానంటాడు.

కొన్నాళ్ళ తర్వాత నకనోకిమి ఇంటికి వచ్చిన ఉకపునెను చూసి నియోవు ఆమెను ప్రేమిస్తాడు. కాని అప్పటికే కావోరూ ఆమెతో సంబంధం పెట్టుకుని ఉజిలోని ఒక ఇంటిలో దాస్తాడు. అయినా నియోవు ఆమెను వెంబడించి లోబరచుకుంటాడు. అలా ఇద్దరి ప్రేమికుల మధ్య నలిగిపోతుంది ఉకిపునె. హోదాలో కావోరూ చాలా ఉన్నతుడు. అతడి భార్యలలో ఒకతిగా ఉండగలిగితే తన అదృష్టం పండినట్టే. ఎలాగైనా అతణ్ణి సంతోషపెట్టమని తల్లి కూడా బలవంతం పెడుతుంది. కాని నియోవు ఆమెనెక్కువ ఆకర్షిస్తాడు. ఆమెను వెంట దీసుకుపోవటానికి వస్తాడు కావోరూ. నియోవు ఆమెను అపహరించటానికి ప్రయత్నిస్తాడు. ఇద్దరి మధ్యా తేల్చుకోలేక నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుంది ఉకిపునె. అలా ఆమె అదృశ్యమైన తర్వాత వాళ్లు ఆమె అంత్యక్రియలు కూడా నిర్వహిస్తారు. కావోరూ, నియోవు శోకదినాలు పాటిస్తారు. అయితే నిజానికామె మరణించలేదు. ఒక ఏకాంత ప్రదేశంలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఉకిపునే ఇద్దరు సన్యాసుల కంటపడుతుంది. వాళ్లు ఈ విషయం తమ ప్రధానాచార్యునికి నివేదిస్తారు. ఆశ్రమం నుండి ఒక సన్యాసిని వచ్చి ఆమెను చేరదీస్తుంది. అయితే అప్పటికే ఉకిపునే జ్ఞాపకశక్తి కోల్పోతుంది. ఆ సన్యాసుల బృందం పుణ్యక్షేత్రాల పర్యటనలో భాగంగా ఉజి చేరుకుంటుంది. అక్కడ మరో సన్యాసిని ఆమెను 'ఓనో' గ్రామానికి తీసుకెడుతుంది. అక్కడ మంత్ర ప్రయోగంతో జ్ఞాపకశక్తిని పునరుద్ధరిస్తారు. ఆ తర్వాత ఉకిపునే కూడా సన్యాసిదీక్ష స్వీకరిస్తుంది. ఉకిపునే అదృశ్యమైన ఏడాదికి ఆమె బతికే ఉంటుందని సందేహం వ్యక్తపరుస్తాడు కావోరూ. వేగులవాళ్ల ద్వారా ఆమె జాడ తెలుసుకుంటాడు. పరిస్థితిని వివరిస్తూ లేఖ పంపిస్తాడు. ఉకిపునే దాన్ని చదవటానికి కూడా నిరాకరిస్తుంది. ఇది 'నియోవు' కుట్రనుకుంటాడు కావోరూ.

ఇంతటితో అర్థాంతరంగా ముగుస్తుంది నవల.

రచయిత్రి అనివార్య పరిస్థితుల్లో ఇలా అసమగ్రంగా ముగించిందా? ఆ రాజకుటుంబీకుల కథలో చెప్పటానికి ఇంకేమీ లేదని అనుకుందా? రచయిత్రి మరణంతో కథనం ఆగిపోయిందా? ఇలాంటి విషయాలు నేటికీ చర్చనీయాంశమే.

---

ఆమెను ప్రేమిస్తున్నానని; ఇంక ఆమె, సిగ్గు పడింది, తనూ ప్రేమిస్తున్నానని చెప్పింది. అలాంటి చక్కటి సాయంత్రమెప్పుడూ గడపలేదు నేను!

నేను చాల నిజాయితీగా ఆమెతో మాట్లాడాను; ఆమె నా వద్ద ఉన్న మిలియన్ పౌండునోటును గురించి ఎంతో వినిఉన్నది. అది తప్ప ఈ ప్రపంచంలో నా దగ్గర చిల్లి గవ్వలేదని ఆమెకు చెప్పాను; అదికూడ నాది కాదని చెప్పాను; నా కథంతా మొదటినుండీ, నేను ఆమెకు చెప్తే, ఆమె పడీపడీ

నవ్వింది. ఈ దేశంలో దేన్ని గురించి ఆమె నవ్వలేదో నేను తెల్సుకోలేకపోయాను; ఉల్లాసంగా ఉండాల్సిందేం లేకపోయినా ఉల్లాసంగా ఉండే ఆమెను చూసి, ఆమె పట్ల నాకు మరింత ప్రేమ కలిగింది; నాకు బహుశః త్వరలోనే అలాంటి భార్య లభించేట్టున్నాయి, పరిస్థితులు! అయితే, నేను ఆమెకు చెప్పాను, నాకు వేతనం లభించేవరకు, ఓ రెండేళ్లపాటు వివాహానికి ఆగవల్సి వస్తుందని; ఆమె ఫరవాలేదంది; ఖర్చుల విషయంలో నేను జాగ్రత్తగా ఉండాలట! అజ్ఞాత పరిస్థితిలో, మొదటి యేడులోనే పెద్దవేతనంతో మొదలెట్టటంలో, మేమేమన్నా పొరపాటు చేస్తున్నామా, అనీ వివేకంతో అన్నది; అది విన్నాక, నా కంతకు ముందు ఉన్న విశ్వాసం లేకపోయింది; అయితే, అది నాకో చక్కటి బిజినెస్ ఐడియా నిచ్చింది; నేను దాన్ని సూటిగా బయటకు చెప్పేశాను.

## 15

"ఆ రోజు నేను ఆ ముసలి పెద్ద మనుషులను ఎదుర్కొనే సమయంలో, నువ్వు నాకు తోడుగా ఉంటావా, పోర్షియా, డియర్?"

ఆమె కొద్దిగా కుదించుకపోయింది, కానీ అన్నది: "లేదు, కానీ, నేను నీతో ఉంటే నీకు ఉత్సాహంగా ఉంటుందను కుంటే, సరే. కానీ అది సరైన పనేనా?"

"లేదు, నాకు తెలీదు, సరైందో కాదో! బహుశః కాకపోవచ్చు. కానీ, దానిమీద నేను ఎంత ఆధారపడివున్నానో..."

"అలా అయితే, అది సరైందయినా, కాకపోయినా, నేను నీతో వస్తాను'' అందామె, చక్కటి, ఉదారత్వంతో. "లేక పోయినా, నీకు సాయం చేస్తున్నానన్న భావన నాకెంతో ఆనందం కలిగిస్తుంది."

"సాయమా, డియర్? అసలు చేసే దంతా నువ్వే. అందంగా అందరి హృద యాలను గెల్చుకుంటావు. నా పక్కన నువ్వుంటే, ఆ ముసలివాళ్లను ఢీకొనగలను, ఇంకెప్పుడూ పోటీపడాలనే, పోరాడాలనే తపన వాళ్లకుండదు."

ఆ ముఖంలోకి ఎర్రటి రక్తం ప్రవ హించింది, ఆ కళ్లు మెరిశాయి! "నువ్వు ధూర్త భట్రాజువు. నీ మాటల్లో ఒక్క నిజంలేదు. అయినా, నేను నీతోపాటు వస్తాను. అందువల్ల ఇతరులను నీ కళ్లతో చూడమని ఆశించకూడదన్న బుద్ధి నీకు వస్తుంది."

నా సందేహాలు నాశనమయ్యాయా? నా ఆత్మవిశ్వాసం నాకు తిరిగొచ్చిందా? ఈ వాస్తవంవల్ల మీరు తీర్పివ్వవచ్చు. ప్రయివేటుగా నేను ఆ క్షణంలోనే నా వేతనాన్ని మొదటేడుకు పన్నెండు వందలకు పెంచుకున్నాను. కానీ, ఆమెకు చెప్పలేదు: కానీ, ఆమెను చకితురాలిని చేద్దామని నా మనసులోనే దాచుకున్నాను.

ఇంటికి వెళ్తూ, తోవ పొడుగూతా, నేను మేఘాల్లో విహరించాను. హేస్టింగ్స్ మాట్లాడుతున్నాడు, కానీ, నేను ఒక్క మాట వినలేదు. అతడూ, నేనూ మా పార్లర్‌లోకి అడుగుపెట్టాక, నా బహువిధసుఖాలు, విలాసాలనుగురించి ఉద్వేగంతో ప్రశంసిస్తూ, నన్ను మళ్లా నాలోకి తీసుకు వచ్చాడు: "నన్ను ఒక్కసారి ఇక్కడ నిలబడి నా కళ్లారా చూసుకోనీ మిత్రమా! ఇది రాజభవనమయ్యా! ఇది నువ్వెంత ధనవంతుడవో నాకు గుర్తు చెయ్యటంలేదు; నా ఎముకల్లోకి, మూలగలోకి జ్ఞాతమయ్యేలా, నేనెంత పేదవాడినో గుర్తుకు తెస్తున్నది; అయ్యో, నేనెంత పేదవాడిని, దుఃఖభాజనుడిని, పరాజితుడిని, విజితుడిని, నిర్ధూమధా ముడిని!!"

## 16

దాన్ని మహమ్మారి నాశనం చెయ్య! ఆ భాష నాలో శైత్యప్రకంపనలు పుట్టించి, నన్ను పూర్తిగా జాగ్రదావస్థలోకి తీసుకువచ్చింది. ఇప్పుడు గొంతులోతు అప్పులు, ప్రపంచంలో ఎక్కడా సెంటు లేనితనం జ్ఞాతమయింది.; ఒక చక్కటి సుందరితోడి ఆనందం లేక దుఃఖం నా చేతుల్లో ఉంది; ఎదురుగా నా వేతనం తప్ప మరేం లేదు; ఆ వేతనం కూడ ఎప్పటికీ, ఎప్పటికీ సాకారం కాకపోవచ్చు. అయ్యయ్యో! నేను బాగుపడతాననే ఆశ లేదు! ఇప్పుడింక నన్ను రక్షించ గలిగేదేమీ లేదు!

"హెన్రీ, నువ్వు పెద్దగా చెప్పుకోవాల్సి ఉండని చిల్లర మల్లర దైనందిన ఆదాయం బహుశః...."

"ఆఁ, నా దైనందిన ఆదాయం! ఇదుగో కూర్చో, వెచ్చటి స్కాచ్ గొంతులో పోసుకో, మజా చేసుకో! ఇంక అంతే! లేదూ, ఆకలి వేస్తుంటే, కూర్చో, నేను..."

"తినటానికేమీ వద్దు. ఆ టైమయి పోయింది. నేను ఈ రోజుల్లో పెద్దగా తినలేను. అయితే, నీతో కూర్చుని పడిపోయిందాకా తాగుతా."

"కానీ, నువ్వో పీపా, నేనో పీపా! నేను సిద్ధం! కానీ... ఆఁ ఇప్పుడు చెప్పు లాయడ్, తాగుతూ, నీ కథ విప్పు."

"విప్పనా? మళ్లానా? మళ్లా నువ్వ దంతా వినాలనుకుంటున్నావా? చూడు, హెన్రీ, నువ్వు నన్ను భయపెట్టేస్తున్నావు! మనం ఇక్కడికి వచ్చేప్పుడు నేను నీకు నా కథంతా విన్పించ లేదా?"

"మళ్లానా? నీ మాటల కర్థమేంటి? నువ్వు విన్పించావా? నేను ఒక్క మాట వింటే నన్ను చంపెయ్యి."

"హెన్రీ, ఇది చాల సీరియస్ వ్యవ హారం! నాకు దిగులుగా ఉంది. అక్కడ దూరంగా ఆ మతబోధకుడితో కూర్చుని ఏం తాగావ్?"

వాడు తోడేలు వంటివాడు,
తోకతో తన అడుగుజాడలు
మనకి కనిపించకుండా
చెరిపేస్తాడు.

-లక్కవరపు కోట సామెత

---

జ్ఞానం కంటే
ఊహాశక్తి గొప్పది.
జ్ఞానానికి హద్దులుంటాయి గానీ
ఊహాశక్తి ఎల్లలు లేనిది.

-ఐన్‌స్టీన్

## 17

అప్పుడు నా బుర్ర ఒక్కసారిగా వెలిగింది. నన్ను మనిషిలా చేసింది, అంగీకరించాను.

"ప్రపంచంలోకెల్లా ప్రియమైన అమ్మాయిని నేను బందీని చేశాను!"

అప్పుడతడు నా దగ్గరకు దుమికాడు, మేం చేతులు కలుపుకున్నాం, చేతులు నొప్పి పుట్టిందాకా కలుపుకున్నాం; మేం మూడు మైళ్లు నడచి వచ్చేటప్పుడు అతడు చెప్పిన కథలో ఒక్క మాటకూడ నేను విననందుకు అతడు నన్ను నిందించలేదు. ఓపిగ్గా కూర్చుని, మళ్లా ఆ మంచి మనిషి నాకా కథ విన్పించాడు. దాని సారాన్ని క్లుప్తంగా చెప్పాలంటే ఇది: తన కేదో పెద్ద అవకాశం లభిస్తుందన్న

ఆలోచనతో అతడు ఇంగ్లాండుకొచ్చాడు; గోల్డ్ అండ్ కర్రీ మైనింగ్ విస్తరణ "అప్షన్ల" (నిర్ణీత షరతులకు లోబడి, నిర్ణీత సమయంలోపల లావాదేవీలను-అమ్మటం, కొనటం-జరిపే ప్రత్యేకాధికారం) ను, గనులవల్ల లాభపడదల్చుకున్న వాళ్లకు (లొకేటర్‌లకు) అమ్మే ఉద్దేశంతో అతడొచ్చాడు, మిలియన్ డాలర్ల పైగా సంపాదించాలని వచ్చాడు. కష్టపడి పనిచేశాడు, వీలైన వారిచేత చెప్పించాడు, ఎలాంటి నిజాయితీగల ప్రయోజనకారి ఉపాయాన్నీ ప్రయోగించకుండా వదల్లేదు; తన కున్న డబ్బంతా ఖర్చుపెట్టేశాడు; తన మాటలను వినటానికి ఒక్క పెట్టుబడిదారుడూ ముందుకు రాలేదు. అతడి 'అప్షను' ఈ నెలాఖరుకల్లా అయిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, అతడు నాశనమైపోయాడు. లేచి పెద్దగా అరిచాడు: "హెన్రీ, నువ్వు నన్ను రక్షించగలవు! నువ్వు నన్ను రక్షించగలవు; ఈ ప్రపంచంలోకెల్లా నన్ను రక్షించగలిగినవాడివి నువ్వే! ఆ పని చేస్తావా, చెయ్యవా?"

"ఎట్లాగో చెప్పవయ్యా, బాబూ! మనసులో మాటేమిటో చెప్పు."

"నాకో మిలియన్ ఇవ్వు, నా 'అప్షను'కు ముక్తి ప్రసాదించమని నా ప్రార్థన!"

నేను కలతకు గురయ్యాను. "లాయడ్! నేనే గర్భదరిద్రుడిని, పైసకు ఠికానా లేనివాడిని. అప్పుల ఊబిలో కూరుకు పోయిన వాడిని" అన్న మాటలు నా గొంతువరకూ వచ్చేశాయి; కానీ, చక్కటి ఆలోచనొకటి మెరుపులాతట్టింది; దాంతో నాదవడలు బిగబట్టాను, పెట్టుబడిదారుడిలా నిష్ఠురంగా మనస్సును శాంత పరుచుకున్నాను. స్వాయత్తమైన మనిషి మాటల వ్యాపారధోరణిలో చెప్పాను.

"నిన్ను రక్షిస్తాను, లాయడ్...!"

"ఇంక నేను రక్షింపబడినట్లే! ఆ దేవుడు నిన్ను సదా కృపతో చూడు గాక! నాకెప్పుడైనా...."

## 18

"నన్ను పూర్తిగా మాట్లాడనీ, లాయడ్! నేను నిన్ను రక్షిస్తాను. కానీ, ఆ పద్ధతిలో కాదు; నువ్వింత కష్టపడ్డాక, అన్ని రిస్కులు తీసుకున్నాక, నీ కది న్యాయం చెయ్యదు. నేను గనులు కొనాల్సిన అవసరం లేదు. అందుకు భిన్నంగా, లండను లాంటి వాణిజ్యకేంద్రంలో, నా పెట్టుబడిని మరింత ప్రయోజనకరంగా వాడుకోవచ్చు; నేను ఎప్పుడూ చేస్తున్న పని ఇదే; సరే, నేనేం చెయదల్చుకున్నానో విను. నాకు గనుల సంగతి బాగా తెల్సు, వాటి విలువకూడ బాగా తెల్సు. ఎవరైనా వాటిని కొనాలనుకుంటే, ప్రమాణంచేసి వాటి విలువ గురించి చెప్తాను. నా పేరును స్వేచ్ఛగా వినియోగిస్తూ, నీ అప్షన్లనన్నింటినీ, ఒక పక్షం రోజుల లోపల మూడు మిలియన్ల నగదుకు అమ్మేస్తావు, మనమది చెరిసగంగా పంచుకుంటాం."

అతడు తన పిచ్చిఆనందంలో, నా ఫర్నిచర్‌తో డాన్సుచేయించి, అక్కడి వస్తువులన్నింటినీ విరగ్గొట్టి ఉండేవాడు, నేను గట్టిగా పట్టుకుని ఆపకపోయినట్లయితే.

ఇంక అతడు పరిపూర్ణ ఆనందంతో అక్కడ కూలబడ్డాడు, అన్నాడు:

> జ్ఞానులు
> తమ శత్రువుల నుంచి కూడా
> నేర్చుకోగలరు.
>
> -జగన్నాథపురం సామెత
>
> ---
>
> చదువుకున్నవాడికీ,
> ఇతరులకు
> ఎంత తేడా వుంటుందంటే
> బతికి వున్నవాడికీ,
> చచ్చినవాడికీ వున్నంత.
>
> -అరిస్టాటిల్

"నేను నీ పేరు ఉపయోగించుకోవచ్చా? ఆలోచిస్తేనే, నా బుర్ర తిరిగి పోతోంది. ఈ ధనిక లండనువాసులు ఇంక గుంపులు గుంపులుగా వస్తారు; స్టాక్ కొనటానికి కొట్టుకుంటారు. నేను మళ్లా మనిషినయ్యాను, ఇంక పడిపోయే ప్రశ్నే లేదు. నేను బతికున్నంత వరకు నువ్వు చేసిన మేలును మర్చిపోను."

ఇంక ఇరవైనాలుగ్గంటల లోపల లండను ఉడికిపోయింది. నాకు చెయ్యాల్సిన పనేం లేదు, ఇంట్లో కూర్చొని, వచ్చిన వాళ్లందరికీ చెప్పాను: "అవును. నేనే సిఫారసుచేశానని చెప్పమని చెప్పాను. నాకా మనిషి తెల్సు. గని సంగతీ తెల్సు. చరిత్ర విషయంలో అతడిని ఎవరూ ఆక్షేపించే పనిలేదు. ఇంక గని విషయం- అతనడుగుతున్న దానికంటే బాగా విలువయింది అది."

ఈ లోపల మతాధికారి ఇంట్లో ప్రతి సాయంత్రం పోర్షియాతో గడిపేశాను. ఆమెతో గని విషయంలో ఒక్క మాట చెప్పలేదు; ఎప్పుడో ఆమెకు ఆశ్చర్యం కల్గిద్దా మనుకున్నా. మేం వేతనం, ప్రేమ తప్ప మరో విషయం మాట్లాడుకోలేదు; ఇంక మతాధికారి, అతడి భార్య మా విషయంలో తీసుకున్న ఆసక్తి మా గొప్పది. మాకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా మతాధికారి భార్య, కూతురు చూపిన అంతులేని యుక్తులు, వివేకం, మతాధికారికి ఈ విషయం ఏం తెలియకుండా గోప్యంగా ఉంచటం- వారు మా పట్ల చూపిన ప్రేమకు నిదర్శనం.

## 19

చివరకు నెల గడిచిపోయేసరికల్లా, లండన్ అండ్ కౌంటీ బాంకులో నా పేరున ఒక మిలియన్ డాలర్లు జమయ్యాయి; ఇంక హేస్టింగ్స్ పరిస్థితికూడ అదే. మంచి డ్రెస్సు వేసుకుని, పోర్ట్‌లాండ్ ప్లేస్‌లోని ఇంటికి వెళ్లాను; ఇంటి పరిస్థితిని చూశాక, నాక్కావాల్సిన మనుషులు వచ్చారని తీర్మానించుకుని, మతాధికారి ఇంటికెళ్లి, నా అమూల్యరత్నాన్ని వెంటబెట్టుకుని, మేం తిరిగి వెనక్కి వెళ్లాం. ఉద్వేగం, వ్యాకులతలతో నిండిపోయిన ఆమె సౌందర్యం ఇనుమడించింది. నేను చెప్పాను:

"ప్రేయసీ, నువ్వు కనిపిస్తున్న రీతి చూస్తే, యేడాదికి మూడువేలకు పెన్నీ తక్కువకు ఒప్పందం జరిగినా నేరమనిపిస్తున్నది."

"హెన్రీ, హెన్రీ, నువ్వు మన ఆశలు భగ్నం చేస్తావు!"

"భయపడకు. నువ్వు అలా అందంగా ఉంటే చాలు, మిగతాది నేను చూసుకుంటాను. నన్ను నమ్ము. అంతా దివ్యంగా జరిగిపోతుంది."

జరిగిందేమంటే, అలా నేను అక్కడికెళ్లేదాకా ఆమెకు ధైర్యం నూరిపోస్తూనే ఉండాల్సి వచ్చింది. ఆమె నన్ను ప్రార్థించసాగింది, చెప్పింది:

# అమాన్ టిల్లడో

## ఎడ్గార్ అలెన్ పో (1809-1849)

అనువాదం: కాకాని చక్రపాణి



మనదేశంలో లాగానే, పందొమ్మిదో శతాబ్దంలో అమెరికాలో నటులు సంఘబాహ్యులు. వీరికి సభ్య సమాజంలో గౌరవం ఉండేది కాదు. అలాంటి తల్లిదండ్రులకు పుట్టిన బిడ్డే ఎడ్గార్ అలెన్ పో. మెస్సాచెట్స్‌లోని బోస్టన్ నగరంలో జన్మించాడు. అతని మూడేళ్ల వయసులో తల్లి మరణించగా రిచ్‌మండ్ పట్నంలోని ధనిక పొగాకు వర్తకుడు జాన్ అలెన్ అతన్ని పెంచుకున్నాడు. కానీ, వారి దయాదాక్షిణ్యాలమీద బతికిన భావన అతన్నెప్పుడూ వీడలేదు. కొంతకాలం సైన్యంలో పనిచేశాడు. ఇరవైరెండేళ్ల వయసులో సాహిత్య, పత్రికా రంగాల్లో ప్రవేశించాడు. బతకటానికి కథలు, కవితలు రాశాడు, పత్రికా సంపాదకుడయ్యాడు, మంచి విమర్శకుడనీ పేరు తెచ్చుకున్నాడు, నమ్మదగిన మనిషి కాదనీ అన్పించుకున్నాడు. తాగుడికి బానిస అయ్యాడు. చివరకు, నలభైయేండ్ల వయసులో, రిచ్‌మండ్ పట్న వీధుల్లో బట్టలుచినిగి, అపస్మారక స్థితిలో చనిపోయాడు. అందుకు కారణమేమిటో ఎప్పటికీ తేలని ప్రశ్న.

పో ప్రతీకాత్మక (సింబాలిస్టిక్) కవిత్వ పితామహుడు; ఫ్రెంచ్ కవులు మల్లార్మే, రాంబోలపై అతడి ప్రభావం ఎంతో ఉంది. అలాగే, డిటెక్టివ్ కథ (టేల్ ఆఫ్ రేషియోనేషన్) కూ అతడే ఆద్యుడు. ఏ కథైనా ముగింపుతో మొదలవుతుందని చెప్పిందతనే. పతాకస్థాయి (డినోమా) దృష్టిలో పెట్టుకునే కథా ప్రణాళిక సాగాలి. కథైనా, కవితైనా సుదీర్ఘంగా ఉండకూడదు. అరగంటలో పూర్తయ్యేట్టు ఉంటేనే, పాఠకుడి ఉత్సుకతను నిల్పుకోగలవు. అతడి కథలు 1839లో రెండు వాల్యూంలుగా Tales of the Grotesque and Arabesque అన్న పేరుతో ప్రచురితమయ్యాయి.

కథల్లోనూ, కవితల్లోనూ అతడు ఏకతాగుణానికి ప్రాధాన్యమిచ్చాడు. హాథారన్ రాసిన కథలకు సమీక్ష రాస్తూ, "కథ ఏకతా గుణం కలిగి ఉండాలి. ఒక ముద్ర, ప్రభావం పాఠకుడి మనసుకు హత్తుకు పోయేట్టు ఉండాలి. రచయిత మొదటి వాక్యంలోనే ఆ అభిప్రాయాన్ని కల్గించకపోతే, అతడు ప్రథమ పాదంలో అపజయం పొందినట్టు. మొత్తం రచన ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ తాను ఎంచుకున్న ప్రణాళికకు తగని ఒక్క మాటను గానీ అతడు ఉపయోగించకూడదు" అని చెప్పాడు. అతని జీవితకాలంలోనే పో ను ప్రముఖ సాహిత్య విమర్శకుడిగా పరిగణించటం జరిగింది."మహా విచక్షణాత్మక, తాత్త్విక, నిర్భయ విమర్శకుడ"ని తోటి విమర్శకుడు జేమ్స్ రస్సెల్ లోవెల్ చెప్పాడు. అతడి తీవ్రవిమర్శలకు పోను "తొమహాక్ మాన్" (Tomahawk Man కుఠార ప్రహారి) అని పిల్చేవారు.

వెయ్యిరకాల ద్రోహాలు, కుట్రలతో ఫార్చ్యునాటో నన్ను బాధించినా నేను సహించాను. అయితే అతను నన్ను అవమానించటం ప్రారంభించగానే, ఇంక పగ తీర్చుకోక తప్పలేదు నాకు. నా స్వభావం ఎలాంటిదో మీకు తెలుసు; అందువల్ల, బెదిరించటం, భయపెట్టటం లాంటి దిక్కుమాలిన పనులు నేను చేస్తానని మీరు భావించరు. ఏమైనా నేను పగ తీర్చుకోవాలి, తప్పదు! ఈ సంగతి కచ్చితంగా నిర్ధారణైపోయింది. అందులో ఏ రిస్కూ వుండకూడదని నిశ్చయించుకున్నాను. అతన్ని శిక్షించటమే కాదు, అందువల్ల నాకెలాంటి శిక్షా పడకూడదు. ఓ తప్పుకు పరిహారం చెల్లాలి. అయితే, బాధితుడినే దండించటం పరిహారం కాదు. అలాగే విద్రోహికి తాననుభవించింది రుచి చూపించకపోతే, పగ తీర్చుకునేవాడికి పరిహారం చెల్లింపైనట్లు వుండదు.

వాక్కువల్లగానీ, కర్మవల్లగానీ ఫార్చ్యునాటోకు నా మంచితనంపట్ల సందేహం కలిగేట్లు నేను ప్రవర్తించలేదు. ఎప్పటిలానే అతని ఎదుట నేను చిరునవ్వులు కురిపిస్తూనే వున్నాను. అయితే, ఇప్పటి నా చిరునవ్వు అతన్ని హతం చెయ్యాలన్న నా ఆలోచనవల్ల కలిగిందని అతను తెలుసుకోలేకపోయాడు.

అతని కో బలహీనత వుంది– ఈ ఫార్చ్యునాటో – మిగతా అన్ని సందర్భాల్లోనూ గౌరవించదగిన మనిషే. భయభక్తులు చూపాల్సిన మనిషే. ద్రాక్షసారా నాణ్యత చెప్పగల నిపుణుడు తనే. అందులో తనంత ప్రాజ్ఞుడు మరెవడూ లేడని అతను గర్వపడుతూ వుంటాడు. అలాంటి నైపుణ్యం కలిగిన ఇటాలియన్లెవరూ లేరు. చాలా సందర్భాల్లో బ్రిటిష్, అమెరికన్ మిలియనీర్లను మోసగించేందుకే అలాంటి ప్రాగల్భ్యాన్ని వాళ్లు ప్రదర్శిస్తూ వుంటారు. చిత్రలేఖనం, వజ్ర పరీక్షల్లోనూ, మిగతా అతని దేశస్థుల లాగానే, అతనూ ప్రాగల్భ్యాన్ని ప్రదర్శించే మనిషే. కానీ, పాత ద్రాక్షసారా విషయంలో మాత్రం అతను నిజాయితీ కలిగినవాడు. ఈ విషయంలో నాకూ, అతనికీ ఏం భేదంలేదు. ఇటాలియన్ ద్రాక్షసారా నైపుణ్యం గురించి నేనూ తెలియనివాడినేం కాను. అందువల్లే, నాకు వీలైనప్పుడల్లా, సీసాలు కొనుగోలు చేస్తూ వుంటాను.

నువు నడుస్తున్న
రోడ్డు చీలిందనుకో,
ఆ చీలిన
దారిలో నడు.
–సిద్ధవటం సామెత

అవి కార్నివాల్ జరుగుతున్న రోజులు; సంభ్రమంగా, ఉత్సాహంగా జరుపుకునే పండగ. అప్పుడో రోజు సాయంత్రం, చీకటి పడుతున్నప్పుడు, నా మిత్రుడు నా ఎదుటపడ్డాడు, చిత్తుగా తాగున్నాడు; అందుకే మహాప్రేమగా నా కభివాదం చేశాడు. పండగ కదా, విదూషకుడిలా చిత్రవర్ణాల డ్రెస్ వేసుకుని వున్నాడు; డ్రెస్సు బిగుతుగా వుండటంవల్ల, కొన్ని గుండీలు పెట్టుకోకుండా వదిలేశాడు; తలమీద గంటల కోనికల్ కాప్. అతనితో చేతులు కలపాల్సిన అవసరం ఇంక నాకుండదన్న ఆలోచనతో నాకానందం కలిగింది.

"సంతోషమయ్యా! అదృష్టవశాత్తూ కలిశావు. ఇవాళెంత చక్కగా కనిపిస్తున్నావు నువ్వు! సరే, ఇవాళే ఓ సీసా వచ్చింది. అమాన్‌టిల్లడో అంటున్నాడు. కానీ నాకనుమానంగా వుంది" అన్నాను నేను అతనితో.

"అమాన్‌టిల్లడో సీసానా? అసాధ్యం! కార్నివాల్ మధ్యలో రావటమా?"

"నాకూ అనుమానంగానే వుంది. ఈ విషయంలో నిన్ను సంప్రదించకుండానే మొత్తం అమాన్‌టిల్లడో ధర చెల్లించటం నా బుద్ధి తక్కువ. నువ్వు దొరకలేదు. బేరం పోతుందేమోనని భయపడ్డాను" అన్నాను నేను.

"అమాన్‌టిల్లడో...."

"ఏమో, సందేహమే....! నీకు తీరికలేదు. అందుకే లుఖేజీ దగ్గరికి వెళ్తున్నాను. కాస్తంత విమర్శక దృష్టి ఎవరికైనా వుందంటే, అతన్నే చెప్పుకోవాలి. అతను చెప్పొచ్చు."

"అది షెరీనో, అమాన్‌టిల్లడోనో లుఖేజీ చెప్పలేడు.వాడికా భేదం తెలీదు."

"కాని కొంతమంది బుద్ధిహీనులంటూ వుంటారు, రుచి చూసి చెప్పగల తెలివి నీ అంత అతనికుందని."

"నీ వాల్ట్‌లోకి వెళ్దాం పద!"

"వద్దు మిత్రమా! నీ మంచితనాన్ని వాడుకోవటం నా కిష్టంలేదు. నీకేదో పని వున్నట్టుంది, లుఖేజీ..."

"నాకేం పని లేదు, పద!"

"నీకు పని వుందని కాదు, నీకు బాగా జలుబు చేసినట్లుంది. వాల్టుల్లో మహాచల్లగా వుంటుంది. పెట్లుప్పుతో చెక్కు కట్టి వుంటాయని...."

"ఏం ఫర్లేదు. పద, వెళ్దాం. ఈ చలి నన్నేంచేస్తుంది? అమాన్‌టిల్లడో! నిన్నెవరో మోసం చేశారు. లుఖేజీకి షెరీ ఏదో, అమాన్‌టిల్లడో ఏదో తెలుసుకునే విచక్షణ లేదు." అలా చెప్తూ, ఫార్చ్యునాటో నా చేతిని గట్టిగా పట్టుకున్నాడు. నా భవనంవైపుగా అతన్ని తీసుకెళ్లాను.

సేవకులెవరూ ఇంట్లో లేరు; ఇల్లు కదలవద్దని స్పష్టంగా ఆదేశాలు జారీచేసి మరీ బయలుదేరాను. అలా నా వీపు తిరగ్గానే, ఒక్కొక్కడూ క్షణంలో ఇల్లొదిలి మాయమవటానికి ఆ ఆదేశం చాలని నాకు తెలుసు.

గోడకున్న బ్రాకెట్ల నుంచి రెండు కాగడాలను తీసి, ఒకటి ఫార్చ్యునాటో కిచ్చాను. ఇద్దరం నడుచుకుంటూ ఎన్నో గదులు దాటి, వాల్టులకు దారితీసే ఆర్చ్‌వేకు వచ్చాం. అక్కడి నుంచి కిందికి, తిరుగుతూ ఎన్నో మెట్లున్నాయి. అతను నన్నునుసరించాడు. "జాగ్రత్త!" అని హెచ్చరించాను. అలా ఎన్నో మెట్లు దిగాక భూగర్భంలోకి వచ్చాం. నేల తడిగా, చల్లగా వుంది. అది మా మాంత్రసర్లను సమాధిచేసేస్థలం. విశాలమైన జాగాలో ఎన్నోసొరంగాలున్నాయి. గదులు, సమాధుల కోసం అంతరప్రదేశాలూ వున్నాయి.

నా మిత్రుడి నడక ఒక తీరుగా లేదు. తూలిపోతున్నాడు. అతను నడుస్తూ వుంటే కాప్ మీదున్న గంటలు మోగుతున్నాయి.

"ఎక్కడా సీసా?" అనడిగితే, "ఇంకా ఆ పైన వుంది" అన్నాను. "కానీ, చూడు, గుహ గోడలకు పట్టి పెట్లుప్పు తెల్లగా ఎలా మెరుస్తూందో చూడు!"

అతను మత్తెక్కిన కంటిగోళాలను చీల్చుకుంటూ నావంక చూశాడు.

"అవునూ, ఎప్పటి నుంచీ నీకా దగ్గు?"

"ఖళ్! ఖళ్! ఖళ్!– ఖళ్! ఖళ్! ఖళ్! – ఖళ్! ఖళ్! ఖళ్! – ఖళ్! ఖళ్!"

కొద్దిక్షణాల దాకా పాపం, నామిత్రుడు నాకు సమాధాన మివ్వలేకపోయాడు. "పెద్ద, ఇదేం లేదు" అన్నాడతను చివరికి.

"పద" నేను నిశ్చింతగా చెప్పాను. "మనం వెనక్కు వెళ్లిపోదాం. ముందు నీ ఆరోగ్యం కాపాడుకోవాలి. నేను ఒకప్పుడున్నట్టుగానే నువ్వు ధనవంతుడివి, గౌరవనీయుడివి, ప్రశంసాపాత్రుడివి, ప్రేమపాత్రుడివి, సుఖజీవివి. నీలాంటి వాడిని పోగొట్టుకోటం కష్టం. నా సంగతికేం లే.వెనక్కు వెళ్లి పోదాం. నువ్వు జబ్బుపడటం నావల్ల జరక్కూడదు. ఆపైన, వుండనే వున్నాడు లుఖేజీ."

"ఇంక మాట్లాడకు! ఈ దగ్గును పట్టించుకోవాల్సిన పనిలేదు. అదేం నన్ను చంపదులే. దగ్గుతో నేను చావను!" అన్నాడతను.

"నిజమే, కాదనను" అని జవాబిచ్చాను.

"నిజానికి, అనవసరంగా నిన్ను భయపెట్టాలన్న ఉద్దేశం నాకు లేదు కానీ – మన జాగ్రత్త మనం పడాలి కదా! ఈ మెడాన్ (రెడ్‌వైన్) ఓ చుక్కేసుకో. ఈ చెమ్మకు విరుగుడుగా వుంటుంది."

నవలా పరిచయం

# డాన్ క్విక్సాట్

## మిగ్వెల్ ది సెర్వాంటెస్ సావెద్రా (1547 -1616)

లామాంకా ప్రాంతంలో ఓ యాభై ఏళ్ళ పేదవాడున్నాడు. పూట గడవటం కష్టమైనా హంగూ, ఆర్భాటాలకు మాత్రం కొదవలేదు. బల్లెం, బక్కచిక్కిన గుర్రం, జాగిలం డాన్ క్విక్సాట్‌కు తప్పనిసరి.

మన పడక్కుర్చీ వీరుడు ఏడాది పొడుగునా సాహసగాథలు చదివి కాలక్షేపం చేస్తాడు. కాలక్రమాన, ఈ పఠనావ్యాసంగం వ్యసనంగా మారింది. ఆస్తి అమ్ముకుని మరీ పుస్తకాలు కొన్నాడు. చదువుకు అంతం లేదు. రాత్రినుంచి తెల్లారిందాకా, ఉదయంనుంచి రాత్రి దాకా ఎడతెగని చదువు. కథల్లోని పాత్రలు, వాళ్ల అడ్వంచర్లే అతడి లోకం. పిచ్చి ముదిరితే ఏమవుతుంది? అలాంటి సాహసకార్యాలు తనూ స్వయంగా చెయ్యాలి. అది తన విద్యుక్త ధర్మమనుకున్నాడు. ప్రమాదం అంచున, సాహసమే ఊపిరిగా బతికే వాళ్లనేకదా వీరాధివీరులంటారు. శిష్టరక్షణ, దుష్టశిక్షణ తన కర్తవ్యం.

మొదట అటకమీది నుంచి తుప్పు పట్టిన, తాతలనాటి కవచాన్ని కిందికి దించాడు. ఎముకలు తేలిన గుర్రం (దాని పేరు రోసినాంట్) మీద జీను వేశాడు. బల్లెం పట్టుకుని బయల్దేరాడు.

వీరుడన్న తర్వాత ఒక ప్రేయసి ఉండక తప్పదు మరి. ఆమె కోసమే గదా ఈ సాహసాలన్నీ! ఆ ఊళ్లో ఓ స్త్రీ ఉంది. పేరు ఆల్డోన్సా లోరెంజో. ఛీ, పల్లెటూరి పేరు. పుస్తకాల్లోని హీరోయిన్ల కుండే పేరు కావాలి. తన ఊహల్లో ఆమెను డల్సినియా డెల్ టొబాసోగా ఊహించుకున్నాడు.

ఈ లోకం ప్రమాదంలో వున్నది. దీన్ని కాపాడవలసిన బాధ్యత తన మీదుంది.

కడప్రాణంతో వున్న గుర్రం. పైన మనిషి. మనిషికి నాల్గింతలు బరువున్న కవచం. ఊరు దాటి ఓ సత్రం చేరుకునే సరికి చీకటి పడింది. కవచంలోని మనిషిని గుర్తించటం కష్టం. ఎవరో పెద్దమనిషనుకుని సత్రం యజమాని సాదరంగా ఆహ్వానించాడు. "రాత్రికిక్కడ బస చేస్తారా? మీ అవసరాలేమిటో చెప్పండి" అంటూ అర్థించాడు. డాన్ క్విక్సాట్ దృష్టిలో అది సత్రం కాదు. ఒక దుర్భేద్యమైన కోట. దుర్గపాలకుడు తనకు నీరాజనం పడుతున్నాడు. భేష్! రూపం మాత్రమే కాదు డాన్ క్విక్సాట్ మాటలు కూడా వింతగా వుంటాయి. అన్నీ నాటకీయమైన జటిల వాక్యాలే. ఆ కవచంతో పడుకోవడం వీలు పడదు. కాని వీరులకు సుఖం ముఖ్యం కాదు, అంత బరువుతో నడవటం కూడా కష్టమే.

కవచం తొలగించి నీటి తొట్టి దగ్గర పెట్టాడు. నీళ్లు నింపటానికి వచ్చినవాడు దాన్ని కాస్త పక్కకు జరిపాడు. మన వీరునికదో అవమానం.

"ఓరి తుచ్ఛుడా! నీ స్పర్శతో నా కవచం మలినమైనది. నా కరవాలంతో నిన్ను ఖండఖండాలుగా..." అంటూ లంఘించాడు. ఈ హఠాత్పరిణామాన్ని ఊహించని పనివాడు కిందపడ్డాడు. సత్రం యజమాని, జుట్టు పీక్కుని, (ఈ తిక్కమాలోకంతో పెట్టుకోవటమెందుకని కాబోలు) సాహసవీరుణ్ణి శాంతించమని ప్రార్థించి "ఆ మూర్ఖుణ్ణి క్షమించ"మని ప్రాధేయపడ్డాడు. తొలి విజయంతో డాన్‌క్విక్సాట్‌లో ఉత్సాహం ఇనుమడించింది. కొత్త అడ్వెంచర్ల కోసం ప్రస్థానం కొనసాగించాడు. పైన ఎండ మాడ్చేస్తోంది. నోరు పిడచగట్టుకుపోతున్నది. దూరంగా గుర్రాల గిట్టల చప్పుడు. పదిమంది దాకా వున్నట్టుంది. మొహాల మీద ముసుగులు. వెంట ఏవో మాటలు. ఇంకెవరు – శత్రువులే. మన జగదేకవీరుడు వాళ్ళను యుద్ధానికి ఛాలెంజ్ చేశాడు.

వాళ్లంతా వ్యాపారస్తులు. ఊళ్లు తిరిగి వస్తువులమ్ముకోవటానికి బయల్దేరారు. మొదట పిచ్చివాడనుకుని ఉపేక్షిస్తారు. కాని డాన్ క్విక్సాట్ మాటలు కోటలు దాటుతాయి. బల్లెంతో గాయం చెయ్యబోయినప్పుడు, ఇంక లాభం లేదనుకుని, అందరూ కలసి దేహశుద్ధి చేస్తారు.

ముక్కుతూ మూలుగుతూ తిరిగి వస్తాడు. దెబ్బలతో వొళ్లు సలుపుతుంది. పదిహేను రోజులు పడకేస్తాడు. అప్పుడు జ్ఞాపకం వస్తుంది కథల్లో హీరోలకెప్పుడూ ఓ సైడ్‌కిక్ ఉంటాడని. ఆ ఊళ్లో, కూలి పని చేసుకుని బతికే సాంకోపాంజా కు బ్రెయిన్‌వాష్ చేస్తాడు. పాపం, ఆ అమాయకుడు పెళ్లాం పిల్లల్ని వదిలి డాన్ క్విక్సాట్‌ని అనుసరిస్తాడు. తనను ఓ చిన్న ద్వీపానికి గవర్నర్‌ని చేస్తానని వాగ్దానం చేశాడీ వీరుడు. ఆ మాటకొస్తే గవర్నరేం ఖర్మ, రాజు

---

అక్కడే నేలమీద వరుసగా పేర్చివున్న సీసాల్లో ఒక సీసా మూతి విరగ్గొట్టి, సారాను అతనికందిస్తూ "తాగు" అన్నాను. అతను సీసాను తమకంగా పెదాలకెత్తుకున్నాడు. ఓ క్షణమాగి, స్నేహపూర్వకంగా తలఊపాడు. దాంతో తల మీదున్న గంటలూ మోగాయి.

"మన చుట్టుపక్కలదీర్ఘవిశ్రాంతి పొందుతున్న సమాధిగతుల ఆత్మశాంతి కోసం తాగుతాను" అన్నాడు. నేను అతడి "ఆయురారోగ్యాల కోసం"అన్నాను.

అతను మళ్లీ నా చెయ్యిపట్టుకున్నాడు. మేం నడక సాగించాం.

"ఈ వాల్టులు చాలా విస్తృతంగా వ్యాపించి వున్నాయే!?" అన్నాడతను.

"మా మాంత్రసర్లవంశం గొప్పది. ఎంతో బలగం వున్న కుటుంబం."

"మీ వంశచిహ్నం, సూక్తివాక్య మేమిటో నేను మరిచిపోయాను."

"నీలాకాశ నేపథ్యంలో వుండే పెద్ద మానవ స్వర్ణపాదం, ఆ కాలు పగబట్టిన త్రాచును తొక్కేస్తూ వుంటుంది. దాని కోరలు కాలిమడమలో దిగి వుంటాయి. సూక్తి–శిక్షారహితంగా నాపైన ఎవరూ దాడి చేయలేరు!"

"బాగుంది" అన్నాడతను.

అతని కళ్లలో ద్రాక్షసారా తళుక్కుమంది. గంటలు మోగాయి. మెడాన్‌తో నా బుర్ర కూడా చురుగ్గా పనిచేయసాగింది. ఎముకల గుట్టల గుండా, ఆ పక్కల స్టోర్ చేసిన సీసాల గుండా నడుస్తూ, లోపల్లోపల ఎక్కడో వున్న సమాధులను దాటుకుంటూ వెళ్లాం. నేను ఓ క్షణం ఆగాను. ఈసారి ఫార్చ్యునాటో చెయ్యిపట్టుకుని ఆపాను.

"పెట్లుప్పు!" చెప్పాను నేనే. "చూడు, అదెలా పెరిగిపోతోందో! నీటి పాచి, పాకుడులా అది కప్పును పట్టుకునేలాడుతోంది. మనం నదీ గర్భం కింద వున్నాం. నీటి చెమ్మ ఎముకలపై బొట్లుబొట్లుగా పడుతూంటుంది. పద, మనం ఆలస్యం కాకముందే వెనక్కి వెళ్లిపోదాం. నీ దగ్గు–"

"అదేం చెయ్యదు!" అన్నాడతను. "మనం వెళ్దాం పద. అయితే ముందుగా

మాత్రం కాలేదా! అప్పుడు తన భార్య  రాణి కాదా. తన పిల్లలు రాకుమారులు కారా!

ప్రయాణం పునఃప్రారంభమవుతుంది. సాయంత్రం బడలికగా వుంది. ఎదురుగా విశాలమైన మైదానంలో దయ్యాలు చేతులూపుతూ విన్యాసాలు చేస్తున్నాయి.

"మహా ప్రభో, అవి గాలి మరలు!" అంటాడు సాంకో.

కాదు. అది రాక్షసుల మాయాజాలం. రోసినాంట్ వుత్సాహంగా ముందుకు పరిగెత్తుతుంది. గాలిమరల్లో చిక్కుకుని బల్లెం విరిగిపోతుంది.

"ఇది రానున్న మహాయుద్ధానికి నాంది మాత్రమే" అంటాడు డాన్ క్విక్సాట్. యజమాని చర్యలకు ఖిన్నుడై తలపట్టుక్కూచుంటాడు సాంకో.

దుష్ట శిక్షణే ధ్యేయంగా బతికిన డాన్ క్విక్సాట్ జీవితంలో మరో మజిలీ.

చలికాలం. ఉదయం లేయెండ సుఖంగా వుంది. దారిలో ఎదురుగా దుమ్ముతెర కమ్ముకున్నది.

"అవిగో జంట సైన్యాలు. నన్ను ఒంటరిని చేసి సంహరించటానికి దూసుకు వస్తున్నవి."

డాన్ క్విక్సాట్ మీద పుస్తకాల ప్రభావానికదో మంచి ఉదాహరణ. కనిపించిన ప్రతి దృశ్యమూ కథలో చదివినట్టుగానే దర్శనమిస్తుందతనికి.

"అదిగో యుద్ధభేరి! అవిగో పదఘట్టనలు. అదిగో పదాతిదళం..." అంటూ ముందుకు పరుగెత్తాడు మన వీరుడు. ఈ అరుపులకు ఎదురుగా వస్తున్న గొర్రెల మంద కాస్తా చెల్లాచెదరవుతుంది. కాపరులకు కోపం వచ్చి డాన్ క్విక్సాట్‌ను గురి చూసి వడిసెల రాళ్లు సంధిస్తారు.

దెబ్బలతో ఒళ్లంతా పచ్చి పుండైంది. మరి కాస్త దూరం ప్రయాణించారో లేదో, ఎదురుగా మరో శత్రువు.

చేతిలో కత్తి, డాలు.

డాన్ క్విక్సాట్ ఉగ్రరూపాన్ని చూసి శత్రువు తన గాడిద దిగి పారిపోతాడు. "వీరాధివీరుడా, వాడు శత్రువు కాదు. మంగలి. చేతిలో ఉన్నది గడ్డం చేసే కత్తి. అది డాలు కాదు నీళ్ల గిన్నె" అంటూ లబోదిబోమంటాడు సాంకోపాంజా.

సాహసకార్యాలకే జీవితాన్ని అంకితం చేసిన డాన్ క్విక్సాట్ ఎన్ని అవాంతరాలు వచ్చినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు.

ఒకనాడు రాజవంశీకుడొకడు (డ్యూక్), తారసపడతారు. ఈ కాలంలో కూడా ఇనుప కవచం తొడుక్కున్న వీరుణ్ణి చూసి ఆశ్చర్యపోతారు. తమ ఎస్టేట్‌కు వచ్చి ఆతిథ్యం స్వీకరించమని సాదరంగా ఆహ్వానిస్తారు. ముఖ్యంగా సాంకో తెలివితేటలు డ్యూక్‌ను చకితుణ్ణి చేస్తాయి. తన అధీనంలో ఉన్న ఒక గ్రామానికి సాంకోను గవర్నర్‌గా నియమిస్తాడు.

రాజరికంలో ఆకర్షణ ఉన్నదేమోగాని సుఖం లేదు. ఆంక్షలు లేని బతుక్కు అలవాటు పడ్డ సాంకో రాజమహలులోని ఇరుకు జీవితాన్ని భరించలేడు. ఎప్పుడు చూసినా, చుట్టూ సలహాదార్లే. తను స్వయంగా ఏ పనీ చెయ్యటానికి వీల్లేదు. రాజ వైద్యుడు ముందు రుచి చూడకుండా తనకిష్టమైనది నోట పెట్టుకోవటానిక్కూడా లేదు. ఆ ఊరి మీద దాడి జరుగుతుంది. సాంకో యుద్ధం చెయ్యక తప్పదు. గాయపడిన సాంకో, ఒక రాత్రి రహస్యంగా తన గాడిదనెక్కి తిరిగి యజమాని సేవలో చేరతాడు.

పుస్తకం నిండా డాన్ క్విక్సాట్ సాహస గాథలే. చిత్ర విచిత్ర అనుభవాలు.

తను సాధించిన విజయాలన్నీ ప్రేయసికి తెలియజేయా లనుకుంటాడు డాన్ క్విక్సాట్. రాయటానికి కాగితం దొరకలేదు. అందువల్ల చెట్ల బెరడు మీద రాసి ఇస్తానంటాడు. (డల్సినియాకు చదువు రాదు) సత్రంలో ఉన్న ఇతర అతిథులకు అతడి ప్రవర్తన వింతగా కనిపిస్తుంది. పిచ్చి ముదురుతున్నదని గ్రహిస్తారు. మొత్తంమీద కాసేపు శ్లాఘించి, మంచి మాటలతో లొంగదీసుకుని, అతణ్ణి ఓ బోనులో బంధించి పంపిస్తారు.

ఊళ్ళో రచ్చబండ దగ్గర బోను చుట్టూ మూగుతారు జనం. ఓ కుర్రాడు వెళ్లి డాన్ క్విక్సాట్ ఇంట్లో ఈ విషయం చెబుతాడు. చిక్కి శిథిలమైన శరీరం, ఒంటినిండా గాయాలు, జ్వరం. చికిత్స తర్వాత కాస్త కోలుకుంటాడు డాన్ క్విక్సాట్.

కథల పుస్తకలలో ఉన్నట్టుగా నిజ జీవితంలో ఆచరిస్తే ఎంత ప్రమాదమో తెలుసుకున్నాడు- బతకాలని ఉంది.

కానీ- అంతిమ క్షణాలు సమీపించాయి.

అందరి దగ్గర శలవు తీసుకుని తుది శ్వాస విడుస్తాడు.

---

ఓ చుక్క మెడాన్ వేసుకుందాం."

ది గ్రావ్ (మైల్డ్‌వైన్) బాటిలొకటి అతనికందించాను. ఓ గుక్కలో అతనది ఖాళీ చేశాడు. అతని కళ్లు కాంతిగోళాల్లా వున్నాయి. అతను నవ్వుతూ బాటిల్‌ను పైకి విసిరేశాడు. ఆ ప్రవర్తనేమిటో నాకర్థం కాలేదు. నేను ఆశ్చర్యపడుతూ అతనివంక చూశాను.

"మీ కర్థం కాలేదు కదూ?" అడిగాడతను.

"లేదు" జవాబిచ్చాను.

"అయితే, నువ్వు మా సోదరసంఘానికి చెందినవాడివి కాదన్నమాట!"

"అదెలా?"

"నువ్వు మాసన్ల ('మాసన్లు' లేక 'ఫ్రీ మాసన్లు' అంతర్జాతీయ రహస్య సంఘ సభ్యులు)కు చెందినవాడివి కావు."

"అదేం మాట? నేనూ మాసన్‌నే" అన్నాను నేను.

"నువ్వా? అసాధ్యం! మాసన్‌వే!"

"అవును, మాసన్‌నే!"

"అందుకు చిహ్నం?" అడిగాడతను.

"ఇదుగో చూడు" అంటూ నా అంగీ నుంచి బయటికి తీసి తాపీ పనిముట్టును చూపాను.

"నువ్వు జోక్ చేస్తున్నావు" అన్నాడతను విస్మయంతో నాలుగడుగులు వెనక్కు వేస్తూ. "సరే, పద, అమాన్‌టిల్లడో చూద్దాం."

"అలాగే" అన్నాను. తాపీ పనిముట్టును మళ్లీ నా అంగీలో దాచుకుంటూ, నా చెయ్యి మళ్లీ అతనికందిస్తూ.

అతను నా భుజంమీద బరువుగా వాలుతూ నడిచాడు. అమాన్‌టిల్లడో ఎక్కడుందో శోధిస్తూ మేం మళ్లీ మార్గం పట్టాం. బాగా కిందకున్న ఆర్చ్‌ల గుండా వెళ్లాం, కిందికి దిగాం. కొంతదూరం చదును నేలమీదే నడిచాం. మళ్లీ

కిందికి దిగాం. చివరికి లోతుగా వున్న ఓ గర్భగృహంలో కొచ్చాం. అందులో నుంచి వచ్చే దుర్గంధం మా కాగడాలను కొడిగట్టించేట్టు చేసింది కాని, వెలగనివ్వలేదు.

ఆ గర్భగృహానికి బాగా లోపలగా మరో గర్భగృహం కనిపించింది. అదంత విశాలంగా లేదు. పారిస్‌లోని గొప్ప భూగర్భ సమాధి స్థలాల్లో లాగా, మానవకంకాళశిథిలాలు దాని గోడలమీద వాల్ట్ కప్పు వరకూ పేరుకునున్నాయి. లోపల గర్భగృహపు మూడువైపులా ఇలాగే ఆభరణ భూషితమై వున్నాయి. నాలుగోవైపు నుంచి ఎముకల నెవరో తొలగించారు. అవి గుట్టగా నేల మీద పడివున్నాయి. ఆ గోడ మరో గూటికి దారిచ్చింది. గూటి ఎత్తు ఆరు-ఏడడుగులుంటుంది. వెడల్పు మూడడుగులు, లోతు నాలుగడుగులు. అది ఏ ప్రత్యేక ప్రయోజనం కోసమో నిర్మించినట్లు లేదు, భూగర్భ సమాధి స్థలం పై కప్పుకు పోటు నిచ్చేందుకు కట్టిన పెద్ద వెడల్పాటి స్తంభాల మధ్య ఖాళీ అది. దాని వెనక గట్టి గ్రానైటుతో చుట్టుగోడ వుంది.

తన కాగడాను పైకెత్తుతూ, ఫార్చ్యునాటో వృథాగా గూటి లోపలికి చూడ ప్రయత్నించాడు. ఆ పల్చటి వెలుగులో దాని లోతు మాకు తెలియలేదు.

"పద" అన్నాను నేను. "ఇక్కడే వుంది అమాన్‌టిల్లడో. లుఛేజీ విషయానికొస్తే."

"వాడొట్టి అజ్ఞాని!" అన్నాడు నా మిత్రుడు నా మాటలకు అడ్డొస్తూ. తూలుతూ లోపలికి ప్రవేశించాడు. నేనతన్ని అనుసరించాను. క్షణంలో అతను గూటి చివరికి చేరుకున్నాడు. గోడ అడ్డం రావటంతో ఆగిపోయి, మతి పోయినట్టు నిలబడిపోయాడు. మరుక్షణంలో నేనతన్ని గొలుసులతో గ్రానైట్‌కేసి బంధించాను. గ్రానైటు బండల ఉపరితలంలో రెండువైపులా, రెండడుగుల దూరంలో గోడకు అడ్డంగా రెండు ఇనుపరింగులున్నాయి. ఒక రింగు నుంచి పొడుగాటి గొలుసు వేలాడుతోంది. మరో దానికి ఓ పెద్ద తాళంవేసి వుంది. అతని మణికట్లను గొలుసులతో చుట్టబెట్టి గొలుసుకు తాళంవేయటం కొన్ని క్షణాల్లోనే జరిగిపోయింది. వ్యతిరేకించలేనంతగా అతను బిత్తరపోగొట్టుకుని నిలబడిపోయాడు. తాళంచెవి తీసి, నేను గూటి బయటికి అడుగుపెట్టాను.

> కాలం అందరికంటే గొప్ప గురువు. కానీ దానితో వచ్చిన చిక్కేమిటంటే, అది శిష్యుల్ని చంపేస్తుంది.
> -మామిడిపల్లి సామెత.

"నీ చెయ్యి గోడవైపు చాపు. పెట్లుప్పు తగలకుండా వుండదు. నిజానికి, బాగా చెమ్మగా వుందిక్కడ. మళ్లీ మరోసారి చెప్తున్నాను, వెళ్లిపోదామని. వద్దా? సరే, నిన్నింక నీ మానానికి వదిలేస్తాను. అయితే, నేను నీ పట్ల చూపాల్సిన శ్రద్ధంతా చూపకమానను!" అన్నాను.

"అమాన్‌టిల్లడో?" అని అరిచాడు నా మిత్రుడు. ఆశ్చర్యంలో నుంచీ అతనింకా కోలుకోలేదు.

"నిజమే, అమాన్‌టిల్లడో" జవాబిచ్చాను నేను. అలా అంటూనే నేనంతకు ముందు చెప్పిన ఎముకల గుట్టను తొలగించటంలో వ్యస్తమైపోయాను. అవి తొలగించగానే బండలూ, సున్నం కనిపించాయి. తాపీ ఎలాగూ వుంది. బండలను పేర్చి, సున్నంతో ప్లాస్టర్ చేస్తూ, గూటిని మూసెయ్యటానికి గూటి మొగదల గోడ కట్టటం ప్రారంభించాను.

మొదటి వరసగోడ లేపానో లేదో, కొంత మేరకు ఫార్చ్యునాటో మత్తు దిగిపోయినట్లనిపించింది నాకు. లోపలి నుంచి మూలుగుతూ ఏడుస్తున్న ధ్వని నాకు వినిపించింది. అది తాగుబోతు మనిషి ఏడుపు కాదు. ఆ తర్వాత చాలాసేపు మొండి నిశ్శబ్దం రాజ్యం చేసింది. ఆ తరువాత రెండో వరస, మూడోవరస, నాలుగోవరస లేపాను; అప్పుడు నాకు వినిపించాయి. లాక్కుంటున్న గొలుసుల రాపిడి ధ్వనులు. ఆ ధ్వనులు నాకు కొన్ని క్షణాల వరకూ వినిపించాయి. తృప్తిగా ఆ శబ్దాలను వినాలని పించింది నాకు. పని మానేసి బొక్కలగుట్ట మీద కూర్చున్నాను. చివరికి ఆ ఖణిల్లుమనే శబ్దాలు ఆగిపోగానే, తాపీతో పని మొదలెట్టాను. మరే అడ్డంకీలేకుండా ఐదు, ఆరు, ఏడు వరసల గోడ లేపాను. ఇప్పుడు గోడ నా గుండె ఎత్తుకువచ్చింది. ఆగాను. కాగడాను గోడపైకి ఎత్తిపట్టి, లోపలి మానవ విగ్రహం ఎలా వుందో చూశాను.

ఆ గొలుసులతో బంధితుడైన మానవాకారం నుంచి అరుపులూ, పెడబొబ్బలూ వినిపించాయి. ఓ క్షణం నేను వేగంగా వెనుకడుగు వేయక తప్పలేదు. ఓ లిప్తకాలం నేను సంకోచించాను. వణికిపోయాను. ఒరలో నుంచి నా కత్తిని తీసి కంతలో నుంచి పొడవసాగాను. మరుక్షణంలో కలిగిన ఆలోచన నాకు ఆశ్వాసన కలిగించింది. దృఢంగా నిర్మించిన సమాధులమీద చెయ్యివేశాను. నాకు తృప్తి కలిగింది. మళ్లీ గోడ దగ్గరికి వెళ్లాను. లోపల పెడబొబ్బలు పెడుతున్న మనిషికి సమాధానం చెప్పాను. నా అరుపులూ ప్రతిధ్వనించాయి. అతని అరుపులకు అలా సాయం చేశాను. బలంగా, పెద్దగా అరవటంలో, పెడబొబ్బలు పెట్టటంలో అతన్ని మించాను. అలా నేను చేయగానే లోపల అరుస్తున్న మనిషి నిశ్శబ్దంగా వుండిపోయాడు.

అర్ధరాత్రి అవుతోంది. నా పని కూడా చివరి కొచ్చేసింది. ఎనిమిది, తొమ్మిది, పదో వరుస కూడా పేర్చేశాను. చివరిది, పదకొండో వరుసలో కూడా చాలా భాగం కట్టేశాను. ఇంక ఒక్క రాతిని అమర్చి, సున్నంతో తాపీ చేయటమే వుంది. రాతిని ఎంతో కష్టం మీద పైకెత్తాను. అది పెట్టాల్సిన జాగాలో చాలావరకు అమర్చేశాను. అయితే, లోపలి నుంచి సన్నగా నవ్వు వినిపించింది. అది విని నా జుట్టు నిక్కబొడుచుకుంది. ఆ తర్వాత విచారం నిండిన కంఠధ్వని. ఆ కంఠం మన గొప్ప ఫార్చ్యునాటోదని పోల్చుకోవటం నాకు కష్టమైపోయింది. ఆ గొంతు పలికింది.

"అహ్హహ్హ! అహ్హహ్హ! అహ్హహ్హ! హి! హి! మంచి జోకే. నిజానికి చక్కటి హాస్యం! భవనంలో ద్రాక్షసారా పుచ్చుకుంటూ- హి! హి! హి! ఇంతకంటే గొప్ప జోకులెన్నో చెప్పుకోవచ్చు."

"అమాన్‌టిల్లడో!" అన్నాను. నేను.

"హి! హి! హి! హి! హి! అవును, అమాన్‌టిల్లడో, కానీ, ఆలస్యం అవటంలేదూ? ప్రాసాదంలో వాళ్లు మన కోసం నిరీక్షిస్తూండరూ, మా దొరసానీ, మిగతావాళ్లూ? పద, వెళ్లిపోదాం."

"అవును, వెళ్లిపోదాం" అన్నాను నేను.

"ఆ దేవుడి కటాక్షం కోసమైనా, మాంత్రెసర్!"

"అవును, దేవుడి కటాక్షంకోసమే!" అన్నాను నేను.

ఈ మాటలకు సమాధానం కోసం ఎదురుచూడటం వృథా. నన్ను అపహాస్యం చుట్టబెట్టింది. నేను పెద్దగా అరిచాను- "ఫార్చ్యునాటో!"

జవాబు లేదు. నేను మళ్లీ అరిచాను, "ఫార్చ్యునాటో!"

అప్పటికీ జవాబు రాలేదు. మిగిలిన కంతలో నుంచి కాగడా దూర్చి లోపల పడేశాను. సమాధానంగా గంటల శబ్దం మాత్రం వినిపించింది. సమాధుల చెమ్మతో నాకు వికారమనిపించింది. నా పని పూర్తిచేయటానికి హడావుడి పడ్డాను. ఎలాగో చివరి రాతిని ఆ జాగాలో వుంచాను. సున్నంతో ప్లాస్టర్ చేశాను. కొత్తగా కట్టిన ఈ గోడమీదికి ఎముకల గుట్టతో మరో గోడ కట్టాను. మరో అర్ధశతాబ్దం వరకూ నరమానవుడెవడూ ఆ గోడను భంగ పరచలేదు!

అతని ఆత్మశాంతించు గాక!

# దొంగే, కానీ నిజాయితీ మనిషి

## ఫయోదోర్ దోస్తవిస్కీ (1821-1881)

**అనువాదం: కాకాని చక్రపాణి**



ఫయొదోర్ దోస్తవిస్కీ మాస్కోలో 1821 నవంబరు 11న జన్మించాడు, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో 1881 ఫిబ్రవరి 9న మరణించాడు. అతని తల్లిదండ్రులు అతనికి విస్తృత సాహిత్య పరిచయం కల్గించారు. కరామ్‌జిన్, పుష్కిన్, డెర్‌ఝవిన్ లాంటి రష్యను రచయితలు, షిల్లర్, గెథేలాంటి కాల్పనిక రచయితలు సర్వాంటిస్, వాల్టర్ స్కాట్ లాంటి రచయితల రచనలు, హోమర్ ఇతిహాసాలు వగైరా అధ్యయనం చేయించారు. పందొమ్మిదవ శతాబ్దపు విపత్కర రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక వాతావరణంలో మానవ మనస్తత్వాన్ని విశ్లేషించిన ప్రముఖ కథా, నవలాకారుడు దోస్తవిస్కీ.. తల్లి చనిపోయాక 15యేండ్ల వయసులో నొకొలయెవ్ మిలటరీ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ఇంజనీర య్యాడు; కొంతకాలం అదనపు సంపాదన కోసం అనువాదాలు చేశాడు. తన మొదటినవల *Poor Folk* (1840) ద్వారా సాహిత్యసమాజంలో గుర్తింపు పొందాడు. 1846లో అతని రెండవ నవల *The Double* ప్రచురితమయింది. ఫ్రెంచి సామ్యవాద రచనలు చదివిన దోస్తవిస్కీ సామ్యవాదం పట్ల అనురక్తుడయ్యాడు. 1846- '48 మధ్యకాలంలో అతడెన్నో కథలు రాశాడు. ఒక ఉదారవాద, కల్పనాలోక, రహస్యసాహిత్య సంఘంలో సభ్యుడైనందుకు అతడిని 1849లో నిర్బంధించారు, మరణశిక్ష విధించారు. చివరి క్షణంలో, దాన్ని జార్ చక్రవర్తి రద్దుచేసి, నాలుగేళ్లపాటు, సైబీరియాలో కఠిన పరిశ్రమ శిక్షగా కుదించాడు. 1839లో మొదలైన మూర్ఛరోగం అతన్ని పీడించ సాగింది. విడుదలయ్యాక, మొదట్లో బలవంతంగా సైన్యంలోకి చేర్చుకున్నా, రోగనిర్ధారణ కాగానే, అతన్ని బయటకు పంపేశారు. ఆ తర్వాత పత్రికా రచయితగా పనిచేశాడు, పత్రికలకెన్నింటికో సంపాదకత్వం వహించాడు. పాశ్చాత్య ఐరోపాలో పర్యటించిన అతడు జూదపు వ్యసనానికి బానిస అయ్యాడు. ఒక సమయంలో డబ్బు అడుక్కునే స్థితికి కూడ వచ్చాడు. అయితే, ఆ కాలపు ప్రముఖ రచయితగా అతనికి పేరు వచ్చింది.

అతడి ప్రముఖ రచనలు -*Crime and Punishment* (1866), *The Idiot* (1869), *The Brothers Karamazov* (1880). అతడు పదకొండు నవలలు, మూడు నవలికలు, పదిహేడు పెద్ద కథలు, మరెన్నో రచనలు చేశాడు. అతడి రచనలు 170కు పైగా భాషల్లోకి అనూదితమయ్యాయి. ఆన్‌టన్ ఛెఖోవ్, ఎర్నెస్ట్ హెమింగ్వే, ఫ్రెడరిక్ నియట్సే, జీన్‌పాల్ సార్త్రే లాంటి ఎంతోమంది రచయితలను, తత్త్వవేత్తలను అతడు ప్రభావితం చేశాడు. చాలమంది సాహిత్య విమర్శకులు అతడిని ప్రపంచసాహిత్యంలో ప్రముఖ మానసిక శాస్త్రవేత్తగా పరిగణిస్తారు.

నవలా పరిచయం

# మాల్ ఫ్లాండర్స్

## డేనియల్ డీఫో (1660 - 1731)

మాల్ ఫ్లాండర్స్ పుట్టుకే (ఇంగ్లండులోని) న్యూగేట్ కారాగారంలో. తల్లి దొంగ తనానికి శిక్ష అనుభవిస్తున్న ఖైదీ. తండ్రి ఎవడో దారిన పొయ్యే దానయ్య. పెంచుకోవటానికి ఒకావిడ ముందుకొస్తుంది గానీ, అక్కడ యింటి చాకిరీ తప్ప మరే సుఖమూ లేదని మాల్ ఫ్రాండర్స్ గ్రహిస్తుంది. స్వేచ్ఛా జీవితం గడపాలని కోరిక. ఒక మేయరెస్ (ఆడ మేయర్) రమ్మంటుంది. స్వంత కూతురిలాగే చూసుకుంటుంది.

మాల్ అద్భుత సౌందర్యవతిగా వికసిస్తుంది. "పడుచు పిల్లకు అందం, తెలివితేటలు, వినయం, విధేయత, సత్ప్రవర్తన ఎన్ని వున్నా, డబ్బు లేకపోతే నిష్ఫలమే కద" అంటారు "అక్కలు". ఆ ఇంట్లోనే వరుసకు అన్నలాంటి వాడొకడు ఆమెను వశపర్చుకుంటాడు. మాల్ కూడా అతడి ప్రేమలో పడుతుంది. కాని ప్రేమికుడి తమ్ముడితో పెళ్లి జరుగుతుంది. అయిదేళ్ల తర్వాత భర్త మరణిస్తాడు. అప్పుడామె పరిస్థితిని డీఫో ఇలా వర్ణిస్తాడు. "1200 పౌండ్ల ఆస్తి సంక్రమించింది. నా భర్త తల్లిదండ్రులు (నా)పిల్లల పెంపకం బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రేమించి ఒకసారి కాలుజారాను. ఇక జీవితంలో అలాంటి పొరబాటు మళ్లీ చేయను. మంచి మనిషి దొరికితే పెళ్లి చేసుకుంటాను. లేదా ఒంటరి జీవితం...' కానీ త్వరలోనే మళ్లీ పెళ్లి చేసుకుంటుంది. డబ్బు ఖర్చయిపోతుంది. కొత్త భర్త అదృశ్యమైపోతాడు. "మంచి భర్త దొరికితే అందరాడవాళ్లలాగే బతాకాలనుకున్నాను" అంటూనే ఉంటుంది మాల్. వర్జీనియా (అమెరికా) వెళ్లాక మరోసారి పెళ్ళి చేసుకుంటుంది. పిల్లలు పుడతారు. ఈ భర్త మరెవరో కాదు. సోదరుడే. తన తల్లి సంతానమే. ఈ రహస్యం తెలిసిన క్షణాన మాత్రం కాస్త పశ్చాత్తాప పడుతుంది. పెళ్లిళ్లు తనకు అచ్చి రాలేదు. బతకాలంటే దొంగతనం తప్ప గత్యంతరం లేదు. "నీతిగా బతకాలని ఉంటుంది. కానీ అవసరం నేరం చెయ్యక తప్పని పరిస్థితి కల్పిస్తుంది" అంటూ మాల్ మాటల్లో ఢీఫో ఆమెను సమర్థిస్తాడు.

ఆ రోజుల్లో దొంగతనం చెయ్యటం చాలా సులభం కాబోలు. పన్నెండేళ్ల తర్వాత రెండు సిల్కు గుడ్డలు దొంగిలిస్తూ పట్టుపడుతుంది. ఉరిశిక్ష విధిస్తారు. కనీసం అప్పటికైనా తను ఎంచుకున్న మార్గం తప్పని గ్రహించినట్టే కన్పిస్తుంది. ఒక ప్రీస్టుగారి చొరవతో శిక్ష తగ్గించి ఆమెను మళ్లీ వర్జీనియా పంపిస్తారు. "అంతా మన మంచికే" అన్నట్టుగా ఆమెకు జైల్లో కూడా లాభం జరిగింది. మరో భర్త దొరుకుతాడు.

వర్జీనియాలో కొడుకు కనిపిస్తాడు. అదృష్టం కలిసివస్తుంది. తల్లి ఆస్తిలో కొంత సంక్రమిస్తుంది. తల్లి సంతానమైన "భర్త" మరణిస్తాడు. కష్టాలు గట్టెక్కుతాయి. "చిట్టచివరికి నేను భర్తా, పిల్లా పాపలతో సుఖంగా స్థిరపడ్డాను. కొందరివి పాపాలు చెయ్యక తప్పని జీవితాలు. గతానికి పశ్చాత్తాపపడటం తప్ప చెయ్యగలిగిందేముంది?" అంటూ కథ ముగిస్తుంది మాల్.

ఇలాంటి కథ రాసిన ఢీఫోను ఆనాటి మర్యాదస్తులు తిట్టని తిట్టు లేదు. పైగా, ఉపోద్ఘాతంలో రచయిత "ఆమె జీవితంలో విషాదం ఉంది. నీతి బాహ్యత లేదు" అంటాడు. మాల్ లాంటి జీవనసరళిని ఎంచుకున్న పతితులు కనీసం మూల్యం చెల్లించాలని ఆశిస్తాడు పాఠకుడు. కాని ఢీఫో "కథానాయిక ఏ తప్పూ చెయ్యలేదు. ఆమె విధి వంచిత మాత్రమే. అలా చెయ్యమని పరిస్థితులు ఆమెను బలవంత పెట్టాయి." అంటాడు ఉపోద్ఘాతంలో. (కథ మాల్ ఆత్మకథ రూపంలో వుంటుంది. దాన్ని పాఠకులకు పరిచయం చేశాడు రచయిత). "సుఖ జీవితం కోసం ఏమైనా చేస్తాను" అంటే పాఠకులు హర్షిస్తారా?

---

నాకు ఆరేళ్లబట్టీ అగ్రఫెనా వంటచేసి, బట్టలు ఉతికి, ఇంటి వ్యవహారాలు చూసే మనిషి. పెద్దగా మాట్లాడేది కాదు; భోజనంలోకి ఏం తయారు చెయ్యాలని అడగటం తప్ప. ఎంతోకాలంనుండి అలాగే సాగుతున్నది. కానీ, ఓ రోజు నేను ఆఫీసుకు వెళ్లబోతూంటే, "మీతో ఓ మాటచెప్పాలి. వంటగది పక్కనున్న చిన్న గదిని అద్దెకిద్దాం. పడుకోటానికి జాగా ఉంటే చాలు. ఆ నడవలో కూర్చుం టాడు, కుట్టుకోవటమో, ఏదో చేసుకుంటాడు. మంచిమనిషి, అనుభవజ్ఞుడు. నేనతనికి వండిపెడ్తాను. వసతికీ, భోజనానికి మాసానికి మూడు రూబుళ్లు ఇస్తాడు."

చాల ప్రశ్నలు వేసి నేను ఆమె నుండి రాబట్టిందేమిటంటే, ఆ పెద్దమనిషి తన్ను ఇంట్లో చేర్చుకోమని ఆమెకు నచ్చచెప్పటంలో సఫలీకృతుడైనట్లున్నాడని.

అగ్రఫెనా బుర్రలోకేమయినా పోతే అది అమలు కావల్సిందే, లేకపోతే ఆమె ప్రశాంతంగా బతకనివ్వదు. కనుక, మానసిక శాంతికోసం ఆమె మాటకు అంగీకరించక తప్పలేదు నాకు. అతనికి పాస్‌పోర్టు కూడా ఉందట!

మర్నాడు ఆ పెద్దమనిషి ఈ బ్రహ్మచారి కొంపలోకి వచ్చి దిగాడు; అందువల్ల నాకేం ఇబ్బంది అన్పించలేదు, పైగా సంతోషం కూడ కలిగింది. నేను ఒంటరిగా, తాపసిలా బతుకుతున్నాను. నాకు స్నేహితులుకూడ ఎవరూ లేరు; నేను సామాన్యంగా బయటక్కూడా వెళ్లను.

అస్తఫీ ఇవనోవిచ్‌కూ, నాకూ బాగానే కుదిరిపోయింది. తన జీవితంలోనే గడచిన సంఘటనల గురించి అతడు కథలుగా చెప్పటం చాల బాగుండేది. నాది అసలే బోరెత్తే జీవితం; అలాంటి మనిషికి ఇలాంటి కథకుడు లభ్యమవటం నిక్షేపం దొరికినట్లే. ఒక రోజు అతడో కథ చెప్పాడు. అది నా మనసులో గాఢమైన ముద్ర వేసింది. ఈ క్రింది సంఘటన అందుకు దారితీసింది.

నేను ఫ్లాటులో ఒంటరిగా ఉన్నాను; అస్తఫీ, అగ్రఫెనా వాళ్ల పనిమీద వాళ్లు వెళ్లారు. అకస్మాత్తుగా లోపలి గదిలోనుండి, కొత్తమనిషెవరో వచ్చిన శబ్దం నాకు విన్పించింది. ఆ శరత్కాలపు చల్లటి వాతావరణంలోకూడ ఓవర్‌కోటు వేసుకోని పొట్టిమనిషి ఒకడు నాకు కన్పించాడు.

"ఏం కావాలి నీకు?"

"అలెగ్జాండ్రోవ్ అనే గుమాస్తా ఇక్కడ ఉంటున్నాడా?"

"అలాంటి మనిషెవరూ లేరు. వెళ్లు"

"దావర్నిక్ చెప్పాడే, ఒక్కడుంటున్నాడని" అన్నాడతను, తలుపువైపు కదులుతూ.

మర్నాడు భోజనమయ్యాక, అస్తఫీ నా కోటును నాకు సరిపోయేట్టు మారుస్తుంటే, మరెవరో నడవాలోకి వచ్చారు. నేను సగం తలుపు తెర్చి చూస్తే, నిన్నటి మనిషే, ఏం భయపడకుండా, నా కళ్లముందే, పై చిలకనుండి నా

ఇందులో వ్యంగ్యముందంటారు కొందరు విమర్శకులు. 'మాటలకూ, చేతలకూ ఉన్న అంతరాన్ని చిత్రించి డీఫో వ్యక్తుల ద్వంద్వ విలువలను ఆవిష్కరించాడు' అని ఒక అభిప్రాయం. కథలో మొదటినించీ మాల్ నీతి, అవినీతి గురించి ఎంతో విజ్ఞతతో మాట్లాడుతుంది. కాని ఎంచుకునేది మాత్రం "అవినీతి".

"మంచి చెడులనేవి మనం కల్పించుకున్నవే. బతకటానికి కావలసింది అడ్డంకులను ఎదుర్కొని నిలదొక్కుకోగలగటమే" అంటున్నాడేమో అని డొరొతీవాన్ ఘెంట్ (ఒక విమర్శకురాలు) అభిప్రాయం. తన పనులను సమర్థించుకోగలిగిన నేర్పు మాత్రం మాల్ వద్ద దండిగా ఉంది. తాగి, పడిపోయిన ఒక యువకుడి నుండి ఒక గోల్డ్ వాచ్, మనీ పర్స్, మరిన్ని అభరణాలు, ఖడ్గం వగైరా లాక్కుని అతడి భార్యా, పిల్లల గురించి కన్నీరు కారుస్తుంది. ఒక పిల్ల దగ్గిర నెక్లేసు దొంగిలించి "పిల్లల్ని ఇలా ఒంటరిగా వదిలి పెట్టటం ఎంత ప్రమాదకరమో తల్లిదండ్రులకు తెలిసి రావాలి" అంటుంది.

ఇంక ఆమె సంతానం సంగతి కథంతా చదివినా స్పష్టంగా తెలియదు. ఎంత మందిని కన్నదో, ఎక్కడివాళ్ళనక్కడే ఎలా వదిలేసిందో కాని చివరికి మిగిలింది ఒక్కడు. (అనాథ పిల్లల కోసం ఆస్పత్రి కట్టించటానికి డీఫో చాలా కృషి చేశాడు!)

ఆర్థిక స్వావలంబన అన్నింటికన్నా ముఖ్యమని చెప్పదలచుకున్నాడేమో రచయిత. మాల్ చేసిన పనులన్నీ డబ్బు కోసమే. ఒకసారి దొంగతనం కేసులో ఆమెకు బదులుగా మరొకర్ని అరెస్టు చేస్తారు. మాల్ బాధ పడుతుంది. కాని నేరం అంగీకరించి ఆ మనిషికి శిక్ష తప్పించే ప్రయత్నం మాత్రం చెయ్యదు. "నాలో కనికరం చచ్చిపోయింది. నన్నెవరు రక్షించారని అవదలో, చౌర్య వృత్తిలో పోటీ మనిషి ఒక్కరైనా తగ్గినందుకు సంతోషంగా ఉంది" అంటుంది. మరో చోట. 'నాది ఆదర్శ జీవితం కాదు. కానీ వాస్తవంలో ఇలాగే జరుగుతుంది' అంటుంది.

"మనిషన్న తర్వాత ఇక్కట్లు తప్పవు. కాని సామాజిక అసమానతలకు అత్యంత హేయమైన నిదర్శనం పేదరికం"

నీతి వాక్యాలకోసం కాదు. జీవిత వాస్తవికతను తెలుసుకోవటం కోసం చదవాలి ఈ నవలను.

కథ ముగిసేనాటికి మాల్ వయసు నలభైరెండు. ఆస్తి ఐదువందల పౌండ్లు. అనేక ఒడుదుడుకుల తర్వాత కూడా ఆమె మనోస్థైర్యం ఏమాత్రం కోల్పోక "ఇక కొత్త జీవితం ప్రారంభిస్తాను" అంటుంది. ఆమె పరిచయం వల్ల నష్టపోయిన వాళ్ళెందరో. కాని తనను మోసం చేసిన వాళ్ల గురించి కూడా ఆమె చెడ్డగా ఆలోచించదు. "మనిషి మంచివాడే. ఘరానా వ్యక్తి. అతడు ఎన్ని ఇబ్బందుల్లో ఉండి అలా చేశాడో!" అనుకుంటుంది.

ఈ సమాజంలో, స్నేహం పురుషులకు లభించినంత సులభంగా స్త్రీలకు దొరకదు. మాల్ జీవిత గమనంలో ఆవిష్కృతమైన మరొక ముఖ్యమైన సత్యం ఇది. స్త్రీని వాడుకోవాలనుకునే వాళ్లేగానీ, సాటి మనిషిగా గౌరవిద్దామనుకునే మగాళ్ళు అరుదు.

డీఫో కాలానికి ఇలాంటి పుస్తకం రాయటం సాహసమే. కొత్తగా ప్రారంభమైన ప్రక్రియ. ఇంత ధైర్యంగా రాసి మర్యాదస్తులకు కోపం తెప్పించాడు. ఇప్పుడు దీన్ని 'తొలి వాస్తవిక' నవలగా గుర్తిస్తారు. ఇలా రాయటానికి డీఫోకు జర్నలిస్టు జీవితం కూడా సహాయం చేసి ఉంటుంది.

"జీవిత రహస్యాల్ని శోధించిన లాక్ (తాత్వికుడు) రచనలు అమ్ముడుపోవు. కాని రాబిన్‌సన్ క్రూసోనూ, మాల్ ఫ్లాండర్స్‌నూ విరగబడి కొంటారు. ఉత్తములకు తినటానికి తిండి ఉండదు. దిగజారిన వాళ్ళు మేడలు కట్టుకుంటారు" అంటూ 1738లో ఆనాటి బెస్ట్-సెల్లింగ్ రచయిత డేనియల్ డీఫోను అభిశంసించాడో పార్లమెంటు మెంబర్.

కనీసావసరాలు తీరని పేదరికం ఎన్ని నేరాలు చేయిస్తుందో వివరంగా చిత్రించిన నవల మాల్ ఫ్లాండర్స్. "సుమారు మూడు వందల ఏళ్ళ తర్వాత కూడా ఒక స్త్రీకి అలా జీవించే హక్కు ఉందని బహిరంగంగా అంగీకరించలేని పిరికివాళ్లం మనం" అంటాడు జాన్ సదర్‌లాండ్.

---

కోటును మడతపెట్టుకుని, చంకనిరికించుకుని, ఫ్లాటునుండి పరుగెత్తుకు పోయాడు. అగ్రఫెనా ఆశ్చర్యంతో నోరు తెరుచుకునుండిపోయింది. అస్తఫీ దొంగను పట్టుకోటానికి పరుగెత్తుకెళ్లి నిమిషాల తర్వాత వగరుస్తూ, ఖాళీచేతుల్తో తిరిగివచ్చాడు.

ఆ సంఘటనను నేను మర్చిపోయాను; కానీ అస్తఫీ మర్చిపోలేకపోయాడు. ప్రతి రెండు నిమిషాలకూ తను చేస్తున్న పని నలా వదిలేసి, అదంతా ఎలా జరిగిందో మళ్లా వర్ణించి, వర్ణించి చెప్పాడు, ఆ తర్వాత, వాచ్‌మన్ దగ్గరకు వెళ్లి, అతనికి విషయం చెప్పి, అలాంటి వెధవలనందర్నీ లోపలకు రానిచ్చి నందుకు అతడిని మందలించి వచ్చాడు; తిరిగొచ్చి అగ్రఫెనాను కూకలేశాడు. మళ్లా మళ్లా తనలో తనే గొణుక్కోవటం సాగించాడు.

ఆ సాయంత్రం అతనికి ఓ కప్పు చాయ్ ఇస్తూ, "అస్తఫీ, వాడు మనల్ని వెధవల్ని చేశాడు. కోటు పోయిన విషయాన్ని స్మరణకు తెచ్చుకుంటూ, మళ్లా మళ్లా అదే ప్రస్తావించటాన్ని తల్చుకుంటూ, పొద్దుపుచ్చదల్చుకున్నావా?" అన్నాను.

"మహా వెధవల్ని చేశాడు! పోయిన కోటు నాది కాకపోయినా, నాకు భలే కోపమొచ్చింది. ఈ ప్రపంచంలో దొంగకంటే మరో దుర్మార్గుడు ఉండడు. మరొకడు నువ్వు ఇవ్వగలిగింది తీసుకుంటాడు, దొంగ నీ చేతిలో పని, నీ నుదుటి చెమట, నీ సమయం తస్కరిస్తాడు...కోటుపోయినందుకు నీకేం బాధ లేదా?"

"నిజమే, తగలబడిపోయినా ఫర్లేదు కానీ, దొంగ పట్టుకెళ్లటం బాధాకరమే!"

"ఏం చేస్తాం, ప్రపంచమంతా దొంగలే! కానీ, నేనో మంచి దొంగను, నిజాయితీ పరుణ్ణి చూశాను. వాడంటే నాకు జాలివేస్తుంది."

"ఎందుకనీ? దొంగ నిజాయితీపరుడెలా అవుతాడు, అస్తఫీ ఇవనోవిచ్?"

"రెండేళ్ల క్రితమనుకుంటాను, నాకో మనిషితో హోటల్లో పరిచయమయింది. వాడు తాగుబోతు, దేశద్రిమ్మరి, బిచ్చగాడు. తాగుడు అలవాటుతో నౌకరీ పోగొట్టుకున్నాడు. వాడి బట్టలు– చొక్కా దానిపైన కోటు, అంతే! పైస దొరికితే తాగేస్తాడు. పోట్లాడేమనిషి కాదు, చాల నెమ్మది మనిషి, మంచివాడు కూడ. తాగుడికి డబ్బిమ్మని అడుక్కోటం వాడికి సిగ్గనిపించేది. వాడివంక చూస్తే,నీకేం అన్పిస్తుంది, పాపం తాగుడు లేక ఏడుస్తున్నాడని, నువ్వే పోయిస్తావు. మేం స్నేహితులమయ్యాం, నాకు అతుక్కు పోయాడనుకో. కుక్కపిల్లలా, నేనెక్కడికి వెళ్లినా, నన్ను అనుసరించి వచ్చేవాడు. మొదట కల్సినప్పుడు బొమికెలు వెళ్లుకొచ్చిన మనిషి. మొదటగా, 'రాత్రికి నీతో ఉంటాను' అంటే, పోనీ ఉండనీ అనుకున్నాను.

"వాడి పాస్‌పోర్టుకూడ చూశాను. మనిషి సరైనవాడే. మర్నాడూ అదే కథ. మూడో రోజువచ్చి, పగలంతా కిటికీలో కూర్చున్నాడు, రాత్రికి ఉండిపోయాడు. పోన్లే వెధవను ఉండనీ, తిండీ, తాగుడూ, రాత్రికి గూడూనే కదా అనుకున్నాను. నేనూ బీదవాడినే, నామీద బతికే ఈ వెధవొకడు. నా

దగ్గరకు వచ్చేముందు, ఇలాగే ఓ ప్రభుత్వ ఉద్యోగికి అతుక్కుపోయాడు. ఇద్దరూ కల్సి బాగా తాగేవాళ్లు; వాడు తాగితాగి చచ్చాడు. ఈ మనిషి పేరు ఎమిల్యాన్ ఇల్యిచ్. వీణ్ణేం చేయాలా అని బాగా ఆలోచించాను. తరిమెయ్యాలంటే నాకు సిగ్గేసింది. వాడిమీద జాలికూడ ఉంది. వాడొక్కమాట మాట్లాడేవాడు కాదు, ఏమీ అడిగేవాడు కాదు; అలా కూర్చుని కుక్కపిల్లలాగా చూసేవాడు. తాగుడు మనిషిని ఎంత హైన్యానికి దిగ జారుస్తుంది!

"నేనెప్పుడూ మనసులో ఎలా చెప్పాలా అని మననం చేసుకునేవాడిని: 'ఎమిల్యానౌష్కా! నువ్వు కదలాలయ్యా! ఇక్కడ నీకేముంది కనుక? నువ్వు సరైన జాగాకు రాలేదు; నాకే పూట గడవటం కష్టంగా ఉంది. ఆపైన నిన్నెక్కడ మోసేది?'

"అలా చెప్పాక, వాడేం చేస్తాడా అని ఆలోచించాను. వాడు నా మాటలు వింటే కనుక, ఆ మురికి బొక్కల కోటును చలి తగలకుండా చక్కగా వేసుకుని, కళ్లనీళ్లతో వెళ్లటం నా కళ్లకు కన్పట్టింది. పాపం, మనిషి సున్నితమైన మనస్సున్నవాడు! కానీ, అలా ఏ మనిషినీ నాశనమవమని బయటకు పంప కూడదు... ఎవరికైనా బాధ కలుగుతుంది.

"అలా కాకుండా, 'నేనే వేరే చోటుకు వెళ్తున్నానయ్యా, ఎమిల్యానౌష్కా! వెళ్లబోయేముందు మనమో విందు చేసుకుందాం. ఇంక ఆ తర్వాత నేను నీకు కనపడను. నేను అలెగ్జాండర్ ఫిలిమొనోవిచ్ దగ్గర బట్లర్‌గా పనిచేశాను. తను గ్రామానికి వెళ్తున్నాననీ, వచ్చాక మళ్లీ నన్ను పిలిపిస్తాననీ అన్నాడు (పాపం, చనిపోయాడా పెద్ద మనిషి, దేవుడు ఆయన ఆత్మకు శాంతి కలిగించుగాక!). ఇంకా ఉన్న కొద్దిడబ్బు, నా సామాన్లు తీసుకుని, కొంతకాలం విశ్రాంతి తీసుకుందామనే ఉద్దేశంతో, ఓ ముసలావిడ– పాతకాలంలో నర్సుగా పనిచేసింది, అందుకే ఆమెకో గది, పింఛను ఏర్పాటూ ఉంది– గది మూలలో కాలం గడిపాను. కనుక, ఎమిల్యానౌష్కా నువ్వు నన్నింక చూడలేవు, దయచెయ్యి!' అని పంపించి, ఆ పూటకు నాకు పరిచయమున్న ఒక వ్యక్తితో గడిపి, సాయంత్రానికి ఇంటికి వస్తే, నేను మొదటగా చూసింది, ఎమిల్యానౌష్కానే! అక్కడ నా పెట్టెమీద కూర్చునున్నాడు, పక్కన వాడి మూట; ఆ పాడుకోటు వేసుకుని నాకోసం ఎదురు చూస్తున్నాడు. నన్ను పసిగట్టేశాడు వెధవ! నా గుండె జారిపోయింది. అసలు నేను వీడిని పంపించిందెందుకు?

> యుద్ధం ఎప్పుడూ ప్రారంభానికి ముందే మొదలై, ముగియదానికి ముందే ముగిసిపోతుంది.
>
> –కురిచేడు సామెత.

"నేనక్కడ కూర్చుని ఆలోచించసాగాను: ఇలాంటి దేశద్రిమ్మరి నాకు కష్టం కలిగిస్తాడా? ఆలోచిస్తే వాడివల్ల నాకు పెద్ద ఇబ్బంది కలగదనిపించింది. పొద్దున ఒక రొట్టెముక్క, ఓ ఉల్లిపాయ, మధ్యాహ్నంకూడ దాంతోనే గడిపి, సాయంత్రం ఉల్లి, క్వాస్, కావాలంటే మరో రొట్టెతో లాగించెయ్యొచ్చు. ఇంకెప్పుడైనా కాబేజీ సూపుంటే సరిపోతుంది. నేనేం పెద్దగా తినే, తాగే మనిషిని కాను, వాడికీ తిండక్కరలేదు, కావాల్సింది బ్రాండీనో, వోడ్కానో! వాడి తాగుడితో నేను నాశనమయిపోతాను. అయితే, నా మనసులోకి మరో ఆలోచన వచ్చింది, నన్ను పట్టుకు వదల్లేదు; వాడెళ్లి పోయి, నాకు తింటానికి ఏం లేకపోతే...! ఆ క్షణంలోనే, నేను వాడికి సంరక్షకుడిలా వ్యవహరించాలని అనుకున్నాను. మెల్లగా వాడి తాగుడిని మాన్పిచ్చేస్తాను. కొద్దిగా ఓపిక పట్టాలి, అంతే! 'సరే, ఎమిల్యానౌష్కా! నువ్వుండు, కానీ నీ ప్రవర్తన మార్చుకోవాలి, చెప్పినమాట వినాలి.'

"వాడికేమైనా పని నేర్పిద్దామనిఅనుకున్నాను. వెంటనే కాకపోయినా, మెల్లమెల్లగా అది అమలు చెయ్యాలనుకున్నాను. కానీ, వాడిని మార్చటం తేలిగ్గాదు. వాడితో తాగుడు మానెయ్యాలని చెప్పాను. ఎమిల్యానౌష్కా తల కిందకు దించుకుని నా మాటలు విన్నాడు. వాడికి తాగి తాగి మాట్లాడటానికి నాలికే లేకుండా పోయింది, బుర్రున్న మాట ఒక్కటి మాట్లాడడు. వాడు నా మాటలు విని, నిట్టూర్చాడు. 'ఎందుకు ఎమిల్యాన్ ఇల్యిచ్ నిట్టూరుస్తున్నావు?' అనడిగాను.

" 'ఏం లేదు. నన్ను పట్టించుకోకు. ఇవాళ ఇద్దరు స్త్రీలు కొట్లాడుకున్నారు. ఒకామె మరొకామె పళ్లబుట్టను పొరపాటున పక్కకు దొర్లించింది. ఆమె ఆ రెండో ఆడమనిషి పండ్ల బుట్టను కావాలని దొర్లించి, వాటిని కాళ్లకింద వేసి తొక్కింది.'

" 'అయితే ఏమంటావు?'

" 'ఏం లేదు, నీకు తెలియాలని చెప్పా. గొరొహోవీ వీధిలోనో, శాడోవీ వీధిలోనో, ఒక పెద్ద మనిషి ఒక కరెన్సీ నోటు పారేసుకున్నాడు. ఒక రైతు చూసి, 'నేనెంత అదృష్టవంతుడినో' అనుకున్నాడు, మరో మనిషి, 'కాదు, నేను అదృష్టవంతుడిని. నీ కంటే నేను దాన్ని ముందు చూశాను' అన్నాడు. దాంతో, ఆ ఇద్దరూ కొట్టుకోసాగారు. అంతలో ఓ పోలీసు వచ్చి నోటు తీసుకుని, దాన్ని తిరిగి ఆ పెద్దమనిషికిచ్చేసి, వాళ్లిద్దరినీ, అరెస్టు చేస్తానని బెదిరించాడు.'

" 'బాగుంది! అందులో నువ్వు నేర్చుకోవాల్సింది ఏముంది?'

" 'ఏం లేదు, నిజమే. కానీ, జనం నవ్వుకున్నారు.'

" 'అబ్బా, ఎమిల్యానౌష్కా! నువ్వు నీ ఆత్మని దమ్మిడీకి కొరగాకుండా అమ్ముకున్నావు! కానీ, నేను నీకేం చెప్పదల్చుకున్నానో తెల్సా, ఎమిల్యాన్ ఇల్యిచ్?'

" 'ఏమిటి, అస్తఫీ ఇవనోవిచ్?"

" 'ఏదో ఒక ఉద్యోగం చూసుకో! ఇప్పటికి వందసార్లు చెప్పాను. కనీసం, నీమీదయినా నువు దయ చూపుకో వయ్యా!'

"నాకేం తెలియదు, నాకు నౌకరీ ఇచ్చేవాడు కూడ ఎవడూ లేదు."

"ఇదంతా నీ తాగుడువల్లే. ఎవడైనా నీ మొహం చూడంగానే తిప్పిపంపేస్తాడు!' అప్పుడు వాడు వెటర్, వ్లాస్‌లను ఆఫీసునుండి పంపేరన్న ప్రస్తావన తీసుకు వచ్చేసరికి, నాకు చిరాకొచ్చింది, 'ఆ దేవుడు మన పాపాలకు మన్ని శిక్షిస్తున్నాడు!' అని.

"కాని వెధవ జిత్తులమారి! నా మాటలు వినీ, వినీ, వాడికి బోరు కొట్టినట్లుంది. నాకు కోపమొస్తుందని పసిగట్టగానే, వాడు తన పాతకోటేసుకుని జారుకునేవాడు, పత్తా ఉండేవాడు కాదు. పగలంతా ఎక్కడ తిరిగేవాడో, రాత్రికి పూటుగా పట్టించి ఇంటికి వచ్చేవాడు. అందుకు డబ్బులెలా వచ్చాయో, దేవుడికే తెలియాలి; నేను మాత్రం ఇవ్వలేదు. నేను చెప్పాను వాడికి, 'చూడు ఎమిల్యాన్ ఇల్యిచ్! నువ్వు చెడిపోయావు! తాగుడు మానెయ్, నా మాట విను. మళ్లా తాగి ఇంటికి వచ్చావా, నువ్వు ఆ రాత్రి మెట్లమీదే గడపాలి. నేను నిన్ను ఇంట్లోకి రానివ్వను' అని.

"అది విన్నాక, ఎమిల్యానౌష్కా ఆ రోజూ, ఆ మర్నాడూ ఇంట్లోనే ఉన్నాడు; మళ్లా మూడో రోజు జారుకున్నాడు. నేను ఎంతసేపో ఎదురు చూశాను; వాడు రాలేదు. ఆ తర్వాత నాకు భయమేసింది, పాపం అన్పించింది. నేనేం పాడు పని చేశాను, వాడిని భయపెట్టానే! ఇప్పుడు వాడెక్కడికి వెళ్లి ఉంటాడు? బతికున్నాడా? దేవుడా! నా మీద దయ చూపించు!

"రాత్రయింది, వాడు రాలేదు. పొద్దున చూడ వెళ్తే, అక్కడ, మెట్టుమీద తలపెట్టుకుని పడుకునున్నాడు; చలితో గడ్డకట్టుకు పోయాడు.

" 'ఏమయింది, ఎమిల్యానౌష్కా! ఇంక దేవుడు నిన్నేగతికి తీసుకు వెళ్తాడో!'

“ ‘ఏం చెయ్యను, నీకు కోపం వచ్చింది. లోపలకు రానివ్వనన్నావు. అందుకే ఇక్కడ పడుకున్నా!’ అన్నాడు వాడు.

“నాకు కోపమూ వచ్చింది, విచారమూ వేసింది. ‘ఇక్కడ మెట్లకు కాపలా కాయటం కంటే మంచి పని చూసుకోవచ్చుగా, ఎమిల్యానౌష్కా!’ అన్నాను.

“ ‘ఏం చెయ్యమంటావు?’

“ ‘నువ్వింక బాగుపడవు! ‘కాస్త దర్జీ పనికూడ రాదా? నీ చిరుగుల బొంత కోటు చూడు. దాంతో మెట్లుకూడ తుడుస్తున్నావు! సూది తీసుకుని రెండు కుట్లు వేసుకోవచ్చుగా? తాగుబోతు వెధవా!’

“వాడేం చేశాడనుకున్నావయ్యా! వాడు సూది పట్టుకుని కూర్చున్నాడు. నేనేదో ఊర్కెనే అన్నా? కోటు విప్పాడు, సూదిలోకి దారం ఎక్కించ ప్రయత్నించాడు. వాడి చేతులు వణకుతున్నాయి. బెజ్జంలోకి దీక్షగా చూసి, దారం కొస తడిపి, వేలితో మెలితిప్పి ప్రయత్నించాడు, ప్రయత్నించాడు. కానీ, ప్రయోజనం లేదు. ఆ పని వదిలేసి నా వంక చూశాడు.

“ ‘బాగుందిరా, నాతో చక్కగా వ్యవహరిస్తున్నావు! ఇంకెవరైనా చూసుంటే, నేనేం చేసేవాడినో నాకే తెలీదు. నేను నిన్ను మందలిద్దామని చతుర్లాడాను. నీ వల్ల కాదుగానీ, ఆ పని వదిలెయ్! మెదలకుండా కూర్చో, నన్ను సిగ్గుపర్చేపని చెయ్యకు. నా మెట్లమీద పడుకుని నన్ను నవ్వులపాలు చెయ్యకు’ అన్నాను వాడితో.

“ ‘నన్నేం చెయ్యమంటావు, అస్తఫీ! నేను తాగుబోతునని, పనికిరానివాడినని నాకు తెల్సు. నీకు విసుగు పుట్టించటం తప్ప నాకేం తెలియదు...!’

నోరు మూసుకోవాల్సిన సమయం ఏదంటే నువ్వు ఏదైనా చెప్పాలని అనుకుంటావే అప్పుడన్నమాట.
-సూర్యాపేట సామెత

“వాడి నీలం పెదాలు అమాంతం వణికాయి, పాలిపోయిన బుగ్గలనుండి కన్నీళ్లు జారి, వాడి పెరిగిన గడ్డంమీదకు పడ్డాయి, ఇంక వాడు నిజంగానే రోదించ సాగాడు. నాకు గుండెలు పిండేసినట్లు అయింది. అంత సున్నితమైన మనస్సున్నవాడని నేనెప్పుడూ భావించలేదు. ఎవరు మాత్రం ఊహించగలరు? ‘ఇంక నీ చావు నువ్వు చావరా, ఎమిల్యానౌష్కా! నీ ఇష్టమొచ్చిన రీతిలో ఉండు. నిన్ను బాగు చెయ్యాలని మాత్రం నేను చస్తే తలపెట్టను’ అని అనుకున్నాను.

“ఇంకెందుకయ్యా, అనవసరంగా కథ సాగదియ్యటం! సరే, నాదగ్గరో చక్కటి రైడింగ్ బ్రీచెస్, నీలం రంగువి, గళ్లవి ఉన్నాయి. పల్లెటూరి పెద్దమనిషొకాయన వాటిని కుట్టమని నాకు ఆర్డరు ఇచ్చాడు, కానీ ఆయన వాటిని తీసుకెళ్లలేదు. తనకు సరిపోలేదన్నాడు. నా దగ్గరే వదిలేశాడు. వాటివల్ల కొంత లాభం కలుగుతుందని నేనాశించాను; ఏ సెకండ్‌హాండు డీలర్‌కమ్మినా, ఐదు వెండి రూబుళ్లయినా లభిస్తాయి. లేదూ, దాన్ని రెండు ట్రౌజర్లుగా తయారు చేసి పీటర్స్‌బర్గ్‌లో ఏ పెద్ద మనిషికైనా అమ్మొయ్య వచ్చు, ఆ పైన నాకు వేస్ట్‌కోటు కుట్టుకోటానికి కూడ బట్ట మిగులుతుంది అనుకున్నాను. మా లాంటి బీదవాళ్లకి ఏది దొరికినా దొరికినట్లే. ఆ సమయంలోనే ఎమిల్యానౌష్కా విచారగ్రస్తుడై ఇంట కూర్చుండిపోయాడు, రోజుల తరబడి తాగ లేదు, చుక్క గొంతు జారలేదు. గుడ్లగూబలా ముడుచుకు కూర్చుండిపోయాడు, ‘నువ్వు తాగుడు మానేశావు, హేతువుకు తలవొగ్గావు’ అనుకున్నాను. అలా గడిచింది. ఒక రోజు శలవు వచ్చింది. నేను వెస్పర్స్ (మత ఉత్సవం)కు వెళ్లాను; నేను ఇంటికి తిరిగొచ్చే సరికి, ఎమిల్యానౌష్కా పూర్తిగా తాగి, కిటికీలో కూర్చుని ఊగుతున్నాడు.

“ ‘ఆహాఁ, నాయనా, మళ్లా మొదలెట్టావా?’ అనుకుని, నా పెట్టెలో ఏదో తెచ్చుకుందామని చూస్తే, అందులో, బ్రీచెస్ లేవు... నేను అంతా గాలించి చూశాను; అవి అంతర్ధానమయ్యాయి. ఎక్కడా లేకపోయేసరికి, నన్నెవడో గుండెలో పొడిచినట్లయింది. ముందుగా ముసలావిడ దగ్గరకు వెళ్లి ఆమెను తిట్టేశాను; ఎమిల్యానౌష్కామీదకు నాకసలు అనుమానమే పోలేదు.

“ ‘భలేవాడివయ్యా! నీ బ్రీచెస్ నేను తియ్యలేదు, ఒట్టు!’ అందామె.

“ ‘మరెవరొచ్చారు ఇక్కడికి?’ అడిగాను.

“ ‘ఎవ్వరూ రాలేదు. నేను చూస్తూనే ఉన్నాను. ఎమిల్యాన్ ఇల్యిచ్ బయటికెళ్లాడు, తిరిగొచ్చాడు; అక్కడ కూర్చుని ఉన్నాడుగా, అతన్ని అడుగు.’

“ ‘ఎమిల్యానౌష్కా! నువ్వేమన్నా ఆ కొత్త రైడింగ్ బ్రీచెస్ తీశావా? ఆ ఊరి పెద్దమనిషికోసం నేనో జత తయారు చేశాను, నీకు గుర్తుందా?’

“ ‘లేదు, నేను వాటిని తాకనేలేదు.’

“నాకు విచిత్రమనిపించింది. అన్ని చోట్లా గాలించి వదలిపెట్టాను, ఎక్కడా లభ్యంకాలేదు. నేను మోకాళ్లమీద ఎమిల్యానౌష్కా ఎదురుగా కూర్చుని, వాడి ఛాతీవైపు వంగి, ఒకసారి వాడి వంక చూశాను... నా గుండె మండిపోయింది, అప్పుడు అమాంతం ఎమిల్యానౌష్కా నా వంక చూశాడు. ‘నువ్వు... నువ్వు ఆ రైడింగ్ బ్రీచెస్‌ను నేను తీశాననుకుంటున్నావు, కానీ, నేను వాటిని తాకనే లేదు.’

“ ‘మరయితే, అవి ఏమయివుంటాయి, ఎమిల్యాన్ ఇల్యిచ్? బహుశః అవి కాళ్లొచ్చి ఎగిరిపోయి ఉండాలి, అంతేనా?’

“ ‘అయుండొచ్చు, అస్తఫీ ఇవనోవిచ్!’

“వాడా మాట అన్నాక, నేను వెంటనే లేచి, దీపం వెలిగించి, నా కుట్టుపనికి కూర్చున్నాను. మా క్రింది అంతస్తులో ఉన్న ఒక గుమాస్తా వెస్ట్‌కోటును ఆల్టర్ చేస్తున్నా. నా గుండెల్లో ఎంత మంట, బాధ అన్పించిందంటే, నా దగ్గరున్న బట్టలన్నీ మంట పెట్టినా అంత తపన నాకు కలిగేది కాదు. వాడు నా గుండెల్లోని మంటను గమనించినట్లే కనపడ్డాడు. ఏమనిషయినా నేరస్థుడయితే, ఆకాశంలో పక్షులు తుఫాను రాకను ఎలా ముందుగానే పసిగడ్తాయో, అలా రాబోయే ప్రమాదాన్నీ పసిగడ్తాడు.

“ ‘నీకు తెల్సునా అస్తఫీ ఇవనోవిచ్?” ఎమిల్యానౌష్కా చెప్పటం మొదలెట్టాడు; ‘మొన్నామధ్య కోచ్‌మాన్ (బండి వాడు) చనిపోలా? అతని పెళ్లాం, పొద్దున, మందులునూరే వైద్యుడు ఆంతిప్ ప్రహోరిచ్‌ని పెళ్లిచేసుకుంది...’

“నేను వాడివంక ఎంత కోపంగా చూశానంటే, వాడదీ అర్థం చేసుకున్నాడు; లేచాడు, తన పక్క పడక దగ్గరకు వెళ్లి ఏదో వెతకసాగాడు. ఏమిటా అని నేనూ ఎదురు చూశాను– చాలసేపు వెతుకుతూ తనలోనే తను గొణుక్కోసాగాడు. ‘లేదు, అక్కడ లేదు, అబ్బ! ఎక్కడ చచ్చి ఉంటుందీ?’ వాడేం చేస్తాడోనని చూస్తున్నాను. చేతులు, మోకాళ్లతో మంచంకిందకు పాకాడు. నేనదింక భరించలేకపోయాను. ‘ఎందుకయ్యా, నువ్వు మంచంకిందకు దూరేది?’ అనడిగాను.

“ ‘ఆ బ్రీచెస్ కోసం చూస్తున్నాను, అస్తఫీ ఇవనోవిచ్!’

“ ‘ఎందుకయ్యా, వ్యర్థంగా మంచంకింద దూరి వెతకటం? అది నాకు సాయంచెయ్యట మనుకుంటున్నావా?’ అన్నాను నేను విసుగేసి.

“ ‘ఫర్లేదు, అస్తఫీ ఇవనోవిచ్! ఎక్కడైనా ఉందేమోనని చూస్తున్నాను.’

“ ‘నువ్వు నా తిండి తిన్నందుకు బదులుగా, వాటిని దొంగలాగా నా వద్దనుండీ దొంగిలించలేదా?’ అన్నాను నేను. వంగుని పాక్కుంటూ, నన్ను మూర్ఖుడిని చేసేట్టు వెతకటం నాకు కోపాన్ని తెప్పించింది.

“ ‘లేదు, అస్తఫీ ఇవనోవిచ్!’

“వాడలాగే, తలవంచుకుని మంచంకింద చాలసేపు కూర్చునుండిపోయాడు,

చివరకు పాక్కుంటూ బయటకు వచ్చాడు. లేచి నుంచున్నాడు, నా సమీపానే, కిటికీలో పదినిమిషాలపాటు కూర్చున్నాడు. లేచి, నా వైపుకు వచ్చాడు, చెప్పాడు, 'లేదు, అస్తఫీ ఇవనోవిచ్! నేను అస్సలు, నీ బ్రీచెస్‌ను తాకనే లేదు.'

"వాడు వణకిపోతున్నాడు, తన గుండెలను వణుకుతున్న వేలితో తాకుతూ ఉంటే, నేను భయపడిపోయాను, కూర్చున్నచోటే, అతుక్కుపోయాను.

" 'సరే, ఎమిల్యాన్ ఇల్యిచ్! నేను తెలివితక్కువగా నిన్ను అన్యాయంగా నిందించివుంటే, నన్ను క్షమించు. ఇంక బ్రీచెస్ అంటావా, ఎక్కడ తగలడ్డాయో, వదిలెయ్ వాటి సంగతి! అవి లేకపోయినా మనం బతగ్గలం. ఆ దేవుఁడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. మనకింకా చేతులున్నాయి, ఇంకో పేదవాడినుండి దొంగిలించో, అడుక్కోవాల్సిన గతో మనకు పట్టలేదు. మన తిండి మనం సంపాదించుకోవచ్చు."

"నా ముందు నిలబడి ఎమిల్యానొష్కా ఆ మాటలు విన్నాడు. నేను తలెత్తి చూసేసరికి, కూర్చున్నాడు; సాయంత్రందాకా అక్కడే కదలకుండా కూర్చున్నాడు. చివరకు నేను లేచి నిద్రపోయాను. పొద్దున నేను లేచాక, తన పాతకోటులో, వట్టినేలమీద ముడుచుకు పడుకునున్న ఎమిల్యానొష్కాను చూశాను. వాడికి దిగులుతో పడకచేరటానికి కూడ మనస్కరించినట్లు లేదు. ఆ రోజునుండి నాకు వాడంటే ఏమాత్రం ఇష్టం లేకుండా పోయింది; నిజానికి మొదటి కొద్ది రోజులు వాడంటే ద్వేషంగాకూడ ఉండేది. ఇంక వాడు ఒక పక్షం రోజుల పాటు మధ్య విరామం లేకుండా తాగుతూనే ఉన్నాడు, మురిగ్గా ఉండేవాడు. పొద్దున్నే వెళ్లి, రాత్రికి తిరిగి వచ్చేవాడు; నాతో ఒక్క మాట మాట్లాడలేదు. తాగితాగి చావాలనుకున్నట్టుగా ఉంది ఆ వ్యవహారం. చివరకు తాగటం మానేశాడు; తన దగ్గరున్నదంతా అయిపోయేదాకా తాగినట్లున్నాడు, మళ్లా కిటికీలో కూర్చోసాగాడు. మూడు పగళ్లు, మూడు రాత్రుళ్లు వాడక్కడ మాట్లాడకుండా కూర్చుని ఉన్నట్లు నాకు గుర్తు; అలాగే అమాంతం ఏడుస్తూ ఉండేవాడు. అలా అక్కడ కూర్చునేవాడు, ఏడుస్తూండేవాడు; అదో ప్రవాహమే; ఆ కన్నీళ్లు అలా ఎలా ప్రవహించేవో తెలియనట్లు ఏడ్చేవాడు. వయసుపైబడినవాడు, ముసలి వాడు; బాధ, విచారంతో శోకించటాన్ని చూడటం చాల విచారకరమన్పించేది.

> పంజాను బట్టి
> పులిని
> పోల్చుకోవాలి.
> -వరంగల్లు సామెత

" 'ఏమిటలా ఏడుస్తావెందుకు, ఎమిల్యానొష్కా?' అనడిగాను.

వాడి శరీరం మొత్తం వణకసాగింది. ఆ రోజు తర్వాత మళ్లా ఈ రోజే నేను వాడితో మాట్లాడటం. 'ఏం లేదు, అస్తఫీ ఇవనోవిచ్!'

'మరి ఇలా ఎందుకేడుస్తున్నావు! పోయిందేదో పోయింది వదిలెయ్!' అన్నాను. నాకు వాడి పట్ల జాలి కలిగింది.

" 'ఏం లేదు, అస్తఫీ ఇవనోవిచ్! అదేం కాదు. నేనేదయినా పని చూసుకోవాలనుకుంటున్నాను. నేనంతకు ముందు చేసిన పనే నాకు లభించవచ్చు. ఇప్పటికే ఫెదొసే ఇవనిచ్‌ని అడిగాను. నీకు భారం కాదల్చుకోలేదు, అస్తఫీ ఇవనోవిచ్. నాకు నౌకరీ దొరికితే, నేను నీ బాకీ అంతా తీర్చేస్తాను. నువ్వింత ఆతిథ్యమిచ్చినందుకు తిరుగా ఋణం తీర్చుకుంటాను.'

" 'చాల్లే, ఎమిల్యానొష్కా, జరిగిందేదో జరిగిపోయింది. ఆ విషయం గురించి మనం ఇంక మాట్లాడవద్దు. ఇదివరకెట్లా ఉన్నామో అలాగే ఉందాం.'

" 'లేదు, అస్తఫీ ఇవనోవిచ్! నువ్వనుకోవచ్చుగానీ, ఆ రైడింగ్ బ్రీచెస్‌ను నేను తాకనుకూడ లేదు. నేను నీతో పాటు ఇక్కడ ఉండలేను. నువ్వు నన్ను క్షమించాలి. నేనిక్కడ ఉండటం సరైన పని కాదు. నేను వెళ్లిపోవటమే మంచిది.'

"వాడి మనసుకు గాయమైనట్లుంది. తన పట్టు విడవలేదు. వాడు లేచి, తన పాత కోటు తొడుక్కున్నాడు.

" 'ఇంక గుడ్‌బై, అస్తఫీ ఇవనోవిచ్! నన్నాపవద్దు' అంటూ మళ్లా పిచ్చివాగుడు వాగటం మొదలెట్టాడు 'నేను వెళ్లిపోవటమే మంచిది. నువ్వు ఇదివరకటి మనిషివి కాదు.'

" 'ఏమంటావు, ఎప్పటి మనిషిని కాదా? నేను ఇదివరకటి మనిషినే. కానీ, నువ్వే ఎక్కడ నిస్సహాయుడిలా ఉండిపోతావోనని నా బెంగ, ఎమిల్యాన్ ఇల్యిచ్!'

" 'లేదు. నువ్విప్పుడు బయటికెళ్లేటప్పుడు, నీ పెట్టెకు తాళం వేసుకుని వెళ్తున్నావు. అది చూసి నాకు ఏడుపు వస్తున్నది. నువ్వు నన్ను వెళ్లిపోనీ, అస్తఫీ ఇవనోవిచ్! నీతో ఉన్న సమయంలో నీకు కలిగించిన కష్టానికి నన్ను క్షమించు.'

"అలా వాడు వెళ్లిపోయాడు. ఒక రోజు నిరీక్షించాను. సాయంత్రానికల్లా తిరిగివస్తాడనుకున్నాను. రాలేదు. మర్నాడూ, మూడోరోజూకూడ వాడి ఆచూకీ లేదు. నాలుగో రోజు నేను బయటకు వెళ్లి, అన్ని సత్రాల్లోను చూశాను, విచారించాను. లేదు, ఎమిల్యానొష్కా పోయినట్టే! 'నువ్వసలు బతికే ఉన్నావా, ఎమిల్యానొష్కా!' అనుకున్నాను. వెధవ, ఎక్కడో తప్పతాగి, ఏ కంచె పక్కనో చచ్చి పడివుంటాడు. వాడిని అలా వెళ్లనిచ్చినందుకు నన్ను నేను తిట్టుకోసాగాను. ఐదో రోజు– ఆ రోజెందుకో సెలవు– పొద్దున, తలుపు కిర్రుమనటం నాకు విన్పించింది. నేను తలెత్తి చూస్తే, నా ఎమిల్యానొష్కా తిరిగి రావటం కన్పించింది. వాడి ముఖం నీలంగా ఉంది, ఏ వీధిలోనో పడుకుంటున్నట్లు, వాడి జుట్టు దుమ్ముపట్టి ఉంది; చిక్కి పుల్లలా తయారయ్యాడు. వాడు తన పాతకోటు విప్పేసి, పెట్టెమీద కూర్చుని, నా వంక చూశాడు. నాకు వాడిని చూడటం సంతోషమేసింది. కానీ, అంతకంటే అధికంగా దిగ్భ్రమ కలిగింది. మీకు తెలియంది లేదు. నేను పాపం చేస్తే, తిరిగి రావటంకంటే, కుక్కచావు చావటం మేలనుకుంటూండేవాడిని. కానీ, ఎమిల్యానొష్కా తిరిగొచ్చాడు. అలా పతనమైవున్న మనిషిని చూడటం నిజానికి చాల విచారం కలిగిస్తుంది. వాడి వంక దయగా చూసి, వాడికి సాంత్వన కలిగిద్దామనుకున్నాను.

" 'మంచిది, ఎమిల్యానొష్కా! నువ్వు తిరిగి రావటం నాకు సంతోషం కలిగిస్తున్నది. నువ్వింకా తిరిగిరావటం ఆలస్యం చేసి ఉంటే, నేనివాళ మళ్లా సత్రాలన్నీ తిరిగి రావాల్సి వచ్చేది. ఆకలేస్తోందా?'

" 'లేదు అస్తఫీ ఇవనోవిచ్!'

"నేను వాడిని బలవంతం చేసి పెడ్తే, ఆ మనిషి బహుశః మూడు రోజులనుండీ కూడా తిండి తిన్నట్టు లేదు, ఆకలిగా, ఆబగా తిన్నాడు. ఈ ఆకలే వాడిని నా వద్దకు తోలుకువచ్చింది. వాడి దుర్భర పరిస్థితి చూస్తుంటే, నా గుండె కరిగిపోయింది. అంతకు ముందు, 'సత్రానికి వెళ్లి, నీమీద నాకేం కోపంలే'ని వాడికి నచ్చచెబ్దామనుకున్నాను. నేను వోడ్కా బాటిలు తీసుకు వచ్చాను. 'ఇవాళ సెలవు మనాయిద్దాం. ఓ చుక్కేసుకో, ఎమిల్యాన్ ఇల్యిచ్! బావుంటుంది. నీ కది మంచి చేస్తుంది.' వాడు చెయ్యి చాచాడు, ఆశపోతుగా చాచాడు, గ్లాసు తీసుకోబోతూ ఆగిపోయాడు. ఒక నిమిషం తర్వాత, పుచ్చుకున్నాడు, తన నోటివద్దకు తీసుకువెళ్లాడు, తన చొక్కా భుజంమీద అది ఒలికిపోయింది. తను వోడ్కా తాగినట్టు, గ్లాసును బల్లమీద పెట్టాడు. 'ఏమిటిది, ఎమిల్యానొష్కా?'

" 'లేదు, అస్తఫీ ఇవనోవిచ్! నేనో విధంగా ఇంక తాగదల్చుకోలేదు.'

" 'అంటే పూర్తిగా మానేసినట్టేనా, ఎమిల్యానొష్కా? లేక ఇవాల్టికి మాత్రమేనా?'

"వాడు జవాబు చెప్పలేదు. ఒక నిమిషం తర్వాత, వాడు తన తలను చెయ్యికి ఆనించుకోవటం కన్పించింది. 'ఏమయింది, ఎమిల్యానొష్కా? ఒంట్లో బాగా లేదా?'

" ' అవును అస్తఫీ ఇవనోవిచ్, బాగాలేదు.'

"నేను వాడిని తీసుకువెళ్లి పక్కమీద పడుకోబెట్టాను. వాడికి నిజంగానే బాగాలేదు, ఒళ్లు జ్వరంతో కాగుతోంది, వణకిపోతున్నాడు. నేను పగలంతా వాడి పక్కనే కూర్చున్నాను; రాత్రికి వాడి పరిస్థితి బాగా చెడిపోయింది. నూనె, ఉల్లిపాయ, క్వాస్, రొట్టెతుంపులతో ఓ మిశ్రమం తయారు చేశాను

" 'ఇది తిను. బహుశః నీకు స్వస్థత చేకూరుతుంది.' వాడు తల అడ్డంగా ఊపాడు. 'వద్దు, ఈ పూటేం తినను అస్తఫీ ఇవనోవిచ్!'

"నేను వాడికోసం టీ చేశాను. మా ముసల్దానికి బాగా గాబరా పుట్టించాను. వాడి పరిస్థితేం బాగున్నట్టు లేదు! మూడో రోజు నేనో వైద్యుడి దగ్గరకు వెళ్లాను, దగ్గరలోనే, నాకు తెల్సిన కోస్త్రవ్రోవ్ ఉన్నాడు. బోసోమ్యాజిన్‌ల వద్ద పనిచేస్తున్నప్పుడు నాకు అతడితో పరిచయం కలిగింది. వైద్యుడు వచ్చిచూసి, 'ఇతడి పరిస్థితేం బాగా లేదు. నన్ను నువ్వు తీసుకొచ్చావు కానీ, ప్రయోజనమేం లేదు. నువ్వు సరేనంటే ఒక చూర్ణమిస్తాను' అన్నాడు. ఇదేదో వైద్యుడి ఆటనుకుని నేను వాడికి ఆ చూర్ణమివ్వలేదు. ఐదోరోజూ అలాగే వుంది వాడి స్థితి.

"వాడు చస్తూ నా కళ్లముందే పడి ఉన్నాడు. నేను నా కుట్టుపని చేసుకుంటూ, కిటికీలోనే కూర్చున్నాను. మా ముసల్ది స్టవ్ వెలిగించింది. మేం నిశ్శబ్దంగా ఉన్నాం. ఆ పనికిరాని వెధవకోసం నా గుండె పగిలి పోతోంది. నా సొంత కొడుకునే పోగొట్టుకుంటున్నానే అన్న అనుభూతి. ఎమిల్యానొష్కా నా వంక చూస్తున్నాడని నాకు తెల్సు. తనేదో చెప్పాలని నిర్ణయం తీసుకున్నట్లూ, చెప్పే ధైర్యం లేకపోయినట్లూ నాకు వాడు పగలంతా కన్పించాడు.

**అనుభవం నుంచి**
**మంచి నిర్ణయం**
**చేసే నైపుణ్యమూ,**
**తప్పుడు నిర్ణయం నుంచి**
**అనుభవమూ పుడతాయి.**

**-పొట్లపాడు సామెత**

---

**పాకుతున్న పాముకు**
**పడగ వుందో లేదో**
**పోల్చుకోవడం కష్టం.**

**-మాచర్ల సామెత**

"చివరకు వాడు నావంక చూశాడు; ఆ కళ్లల్లో ఎంతో దుఃఖంఉంది. వాడు నా మీద కళ్లు నిలిపి ఉంచాడు; అయితే, నేను వాడి వంక చూసినప్పుడు, వాడు వెంటనే తల వాల్చేసుకున్నాడు. 'అస్తఫీ ఇవనోవిచ్!'

" 'ఏమిటి ఎమిల్యానొష్కా?'

" 'నువ్వు నా పాతకోటును సెకండ్ హాండ్ డీలర్ దగ్గరకు తీసుకెళ్తే అతనెంత ఇస్తాడంటావు?'

" 'ఏమో తెలీదు, ఒక రూబుల్ ఇస్తాడేమో, ఎమిల్యాన్ ఇల్యిచ్!'

" 'కానీ నేను తీసుకెళ్తే, నాకు దమ్మిడీకూడ ఇవ్వ జూపడు, పైగా నా ముఖంమీదే, ఆ చెత్త సరుకు తెచ్చినందుకు, పడీపడీ నవ్వుతాడు.'

వాడెంత తెలివిలేనివాడో నాకు తెల్సు, వాడి బాధాకర హృదయానికి సేద కలిగిద్దామని ఆ మాట చెప్పాను. 'కానీ, నీకు వాడు మూడు రూబుళ్లిస్తాడు, అస్తఫీ ఇవనోవిచ్! ఇది గుడ్డతో చేసింది. బట్టతో నేసిందానికి ఒక రూబులెలా ఇస్తాడు?'

" 'నాకు తెలీదు, ఎమిల్యాన్ ఇల్యిచ్, నువ్విది వాడి దగ్గరకు తీసుకు వెళ్దామన్న ఆలోచనలో ఉంటే, నువ్వు తప్పకుండా మూడు రూబుళ్లడగ వచ్చు!'

"వాడుకొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. మళ్లా నాతో అన్నాడు...'అస్తఫీ ఇవనోవిచ్! నేను చచ్చాక, నా కోటును అమ్మెయ్యి. దాంతోపాటు నన్ను సమాధి చెయ్యొద్దు. అది లేకుండా నేను పడుండగలను; దానికి కొంత విలువ ఉన్నది... పనికి రావచ్చు.'

"ఆ మాటలతో నాకెంతో బాధ కలిగింది. మృత్యుయాతన అనుభవిస్తున్నాడని నాకు తెలిసింది: వాడింకా నా వంకే చూస్తున్నాడు; నా కళ్లతో వాడి కళ్లు కలిసినప్పుడు, వాడు కళ్లు తిప్పుకున్నాడు.

" 'నీకేమన్నా తాగేందుకు మంచినీళ్లు కావాలా, ఎమిల్యాన్ ఇల్యిచ్?' అడిగాను.

" 'వద్దు, దేవుడు నిన్ను ఆశీర్వదించుగాక, అస్తఫీ ఇవనోవిచ్!'

"నేను మంచినీళ్లిచ్చాను

" 'ధన్యవాదాలు, అస్తఫీ ఇవనోవిచ్!' అన్నాడు వాడు.

" 'నువ్వింకా చెప్పు దల్చుకున్నదేమన్నా ఉందా, ఎమిల్యానొష్కా?'

" 'లేదు, అస్తఫీ ఇవనోవిచ్! నాక్కావాల్సిందేం లేదు. కానీ, నేను... నేను....'

" 'ఏమిటది?'

" 'నేను చెప్పేది విను'

" 'ఏమిటది ఎమిల్యానొష్కా?'

" 'ఆ రైడింగ్ బ్రీచెలు... నేనే... నేనే తీశాను, అస్తఫీ ఇవనోవిచ్!'

" 'పోనీ, దేవుడు నిన్ను క్షమిస్తాడు, ఎమిల్యానొష్కా!' అన్నాను నేను. 'అయ్యో! నిర్భాగ్య దామోదరా! ప్రశాంతంగా వెళ్లిపో, నాయనా!'

"నా గుండె పట్టేసినట్లయింది. గొంతు పెగల్లేదు, కళ్లు నీళ్లతో నిండుకున్నాయి. ఒక్క క్షణం ముఖం పక్కకు తిప్పుకున్నాను.

" 'అస్తఫీ ఇవనోవిచ్!...'

"ఎమిల్యానొష్కా నాకేదో చెప్పాలని ప్రయత్నించాడు; కూర్చుని, నాతో మాట్లాడాలన్న ప్రయత్నం చేశాడు. ఏదో గొణిగాడు. ఆమాంతం వాడి శరీరంలో రక్తం చిమ్మింది, మనిషి ఎర్రబడిపోయాడు. నా వంక చూశాడు; ఆ మరుక్షణం మళ్లా పేలవంగా తెల్లబడిపోయాడు. ప్రేతంలా తెల్లబడిపోయాడు; క్షణంలో కుంచించుకు పోయినట్లు కన్పించాడు. వాడి తల వెనక్కు పడిపోయింది. ఒక్కసారి గాలి పీల్చుకున్నాడు. దేవుడికి తన ఆత్మ సమర్పణ చేసుకున్నాడు."

"వాడు జవాబు చెప్పలేదు. ఒక నిమిషం తర్వాత, వాడు తన తలను చెయ్యికి ఆనించుకోవటం కన్పించింది. 'ఏమయింది, ఎమిల్యానౌష్కా? ఒంట్లో బాగా లేదా?'

" ' అవును అస్తఫీ ఇవనోవిచ్, బాగాలేదు.'

"నేను వాడిని తీసుకువెళ్లి పక్కమీద పడుకోబెట్టాను. వాడికి నిజంగానే బాగాలేదు, ఒళ్లు జ్వరంతో కాగుతోంది, వణకిపోతున్నాడు. నేను పగలంతా వాడి పక్కనే కూర్చునున్నాను; రాత్రికి వాడి పరిస్థితి బాగా చెడిపోయింది. నూనె, ఉల్లిపాయ, క్వాస్, రొట్టెతుంపులతో ఓ మిశ్రమం తయారు చేశాను

" 'ఇది తిను. బహుశః నీకు స్వస్థత చేకూరుతుంది.' వాడు తల అడ్డంగా ఊపాడు. 'వద్దు, ఈ పూటేం తినను అస్తఫీ ఇవనోవిచ్!'

"నేను వాడికోసం టీ చేశాను. మా ముసల్దానికి బాగా గాబరా పుట్టించాను. వాడి పరిస్థితేం బాగున్నట్టు లేదు! మూడో రోజు నేనో వైద్యుడి దగ్గరకు వెళ్లాను, దగ్గరలోనే, నాకు తెల్సిన కోస్త్రావోవ్ ఉన్నాడు. బోసోమ్యాజిన్‌ల వద్ద పనిచేస్తున్నప్పుడు నాకు అతడితో పరిచయం కలిగింది. వైద్యుడు వచ్చిచూసి, 'ఇతడి పరిస్థితేం బాగా లేదు. నన్ను నువ్వు తీసుకొచ్చావు కానీ, ప్రయోజనమేం లేదు. నువ్వు సరేనంటే ఒక చూర్ణమిస్తాను' అన్నాడు. ఇదేదో వైద్యుడి ఆటనుకుని నేను వాడికి ఆ చూర్ణమివ్వలేదు. ఐదోరోజూ అలాగే వుంది వాడి స్థితి.

"వాడు చస్తూ నా కళ్లముందే పడి ఉన్నాడు. నేను నా కుట్టుపని చేసుకుంటూ, కిటికీలోనే కూర్చున్నాను. మా ముసల్ది స్టవ్ వెలిగించింది. మేం నిశ్శబ్దంగా ఉన్నాం. ఆ పనికిరాని వెధవకోసం నా గుండె పగిలి పోతోంది. నా సొంత కొడుకునే పోగొట్టుకుంటున్నానే అన్న అనుభూతి. ఎమిల్యానౌష్కా నా వంక చూస్తున్నాడని నాకు తెల్సు. తనేదో చెప్పాలని నిర్ణయం తీసుకున్నట్లూ, చెప్పే ధైర్యం లేకపోయినట్లూ నాకు వాడు పగలంతా కన్పించాడు.

అనుభవం నుంచి
మంచి నిర్ణయం
చేసే నైపుణ్యమూ,
తప్పుడు నిర్ణయం నుంచి
అనుభవమూ పుడతాయి.

–పొట్లపాదు సామెత

పాకుతున్న పాముకు
పడగ వుందో లేదో
పోల్చుకోవడం కష్టం.

–మాచర్ల సామెత

"చివరకు వాడు నావంక చూశాడు; ఆ కళ్లల్లో ఎంతో దుఃఖంఉంది. వాడు నా మీద కళ్లు నిలిపి ఉంచాడు; అయితే, నేను వాడి వంక చూసినప్పుడు, వాడు వెంటనే తల వాల్చేసుకున్నాడు. 'అస్తఫీ ఇవనోవిచ్!'

" 'ఏమిటి ఎమిల్యానౌష్కా?'

" 'నువ్వు నా పాతకోటును సెకండ్ హాండ్ డీలర్ దగ్గరకు తీసుకెళ్తే అతనెంత ఇస్తాడంటావు?'

" 'ఏమో తెలీదు, ఒక రూబుల్ ఇస్తాడేమో, ఎమిల్యాన్ ఇల్యిచ్!'

" 'కానీ నేను తీసుకెళ్తే, నాకు దమ్మిడీకూడ ఇవ్వ జూపడు, పైగా నా ముఖంమీదే, ఆ చెత్త సరుకు తెచ్చినందుకు, పడీపడీ నవ్వుతాడు.'

వాడెంత తెలివిలేనివాడో నాకు తెల్సు, వాడి బాధాకర హృదయానికి సేద కలిగిద్దామని ఆ మాట చెప్పాను. 'కానీ, నీకు వాడు మూడు రూబుళ్లిస్తాడు, అస్తఫీ ఇవనోవిచ్! ఇది గుడ్డతో చేసింది. బట్టతో నేసిందానికి ఒక రూబులెలా ఇస్తాడు?'

" 'నాకు తెలీదు, ఎమిల్యాన్ ఇల్యిచ్, నువ్విది వాడి దగ్గరకు తీసుకు వెళ్దామన్న ఆలోచనలో ఉంటే, నువ్వు తప్పకుండా మూడు రూబుళ్లడగ వచ్చు!'

"వాడుకొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు, మళ్లా నాతో అన్నాడు...'అస్తఫీ ఇవనోవిచ్! నేను చచ్చాక, నా కోటును అమ్మెయ్యి. దాంతోపాటు నన్ను సమాధి చెయ్యొద్దు. అది లేకుండా నేను పడుండగలను; దానికి కొంత విలువ ఉన్నది... పనికి రావచ్చు.'

"ఆ మాటలతో నాకెంతో బాధ కలిగింది. మృత్యుయాతన అనుభవిస్తున్నాడని నాకు తెలిసింది: వాడింకా నా వంకే చూస్తున్నాడు; నా కళ్లతో వాడి కళు కలిసినప్పుడు, వాడు కళ్లు తిప్పుకున్నాడు.

" 'నీకేమన్నా తాగేందుకు మంచినీళు కావాలా, ఎమిల్యాన్ ఇల్యిచ్?' అడిగాను.

" 'ఇవ్వు, దేవుడు నిన్ను ఆశీర్వదించుగాక, అస్తఫీ ఇవనోవిచ్!'

"నేను మంచినీళ్లిచ్చాను

" 'ధన్యవాదాలు, అస్తఫీ ఇవనోవిచ్!' అన్నాడు వాడు.

" 'నువ్వింకా చెప్ప దల్చుకున్నదేమన్నా ఉందా, ఎమిల్యానౌష్కా?'

" 'లేదు, అస్తఫీ ఇవనోవిచ్! నాక్కావాల్సిందేం లేదు, కానీ, నేను... నేను....'

" 'ఏమిటి?'

" 'నేను చెప్పేది విను'

" 'ఏమిటది ఎమిల్యానౌష్కా?'

" 'ఆ రైడింగ్ బ్రీచ్‌లు... నేనే... నేనే తీశాను, అస్తఫీ ఇవనోవిచ్!'

" 'పోనీ, దేవుడు నిన్ను క్షమిస్తాడు, ఎమిల్యానౌష్కా!' అన్నాను నేను. 'అయ్యో! నిర్భాగ్య దామోదరా! ప్రశాంతంగా వెళ్లిపో, నాయనా!'

"నా గుండె పట్టేసినట్లయింది. గొంతు పెగల్లేదు, కళ్లు నీళ్లతో నిండుకున్నాయి. ఒక్క క్షణం ముఖం పక్కకు తిప్పుకున్నాను.

" 'అస్తఫీ ఇవనోవిచ్!...'

"ఎమిల్యానౌష్కా నాకేదో చెప్పాలని ప్రయత్నించాడు; కూర్చుని, నాతో మాట్లాడాలన్న ప్రయత్నం చేశాడు, ఏదో గొణిగాడు. అమాంతం వాడి శరీరంలో రక్తం చిమ్మింది, మనిషి ఎర్రబడిపోయాడు, నా వంక చూశాడు; ఆ మరుక్షణం మళ్లా పేలవంగా తెల్లబడిపోయాడు, ప్రేతంలా తెల్లబడిపోయాడు; క్షణంలో కుంచించుకు పోయినట్లు కన్పించాడు. వాడి తల వెనక్కు పడిపోయింది, ఒక్కసారి గాలి పీల్చుకున్నాడు, దేవుడికి తన ఆత్మ సమర్పణ చేసుకున్నాడు."

# ఇవాన్ ఇల్యిచ్ మరణం

## టాల్‌స్టాయ్ (1828-1910)

అనువాదం: ముక్తవరం పార్థసారథి



తను రాసిన నవలల్లాగే టాల్‌స్టాయ్ సుదీర్ఘమైన జీవితం అనూహ్యమైన మలుపులు తిరిగింది. సంపన్నుడు సన్యాసిగా మరణించాడు. పద్దెనిమిదవ శతాబ్దిలో టాల్‌స్టాయ్ ముత్తాతను పీటర్ ది గ్రేట్ 'కౌంట్' బిరుదుతో సత్కరించాడు. ఆ విధంగా టాల్‌స్టాయ్ వంశీకులకు జార్ చక్రవర్తి దర్బారుతో సన్నిహిత సంబంధాలేర్పడ్డాయి. లెవ్ నికొలాయెవిచ్ టాల్‌స్టాయ్ తులా (రష్యా)లో జన్మించాడు. తండ్రి పదిహేను వేల ఎకరాల భూస్వామి.

బాల్యంలోనే తల్లిదండ్రులు మరణించినప్పటికీ టాల్‌స్టాయ్‌కి సుఖ విలాసాలకేమీ లోటు రాలేదు. ప్రైవేటు ట్యూటర్ల వద్ద విద్యాభ్యాసం జరిగింది.

తరువాత కజాన్, పీటర్సబర్గ్ విశ్వవిద్యాలయాల్లో చదివినా అతడికి చదువు మీద శ్రద్ధ లేదు. అందుకే ఎక్కడా డిగ్రీ రాలేదు. యవ్వన ప్రావిర్భావంతో హై సొసైటీలో ప్రవేశించాడు. పెద్ద అందగాడేమీ కాదు. కాని ఫ్యాషనబుల్ దుస్తుల మీద మోజు. (టాల్‌స్టాయ్ తనకు తాను ఆత్మ నింద చేసుకున్నప్పటికీ అతడి మొహంలో ఒక ఆధ్యాత్మిక తేజం ప్రకాశించేదంటారు సమకాలికులు). మనిషి కోపిష్టి. ఆ కారణంగా అందరితో పోట్లాటలకు దిగేవాడు. ధనవంతులకు కాలక్షేపమంటే తాగుడు, జూదం, స్త్రీ లాలసత. ఎప్పటికప్పుడు జేబులు ఖాళీ అయ్యేవి. అయితేనేం డబ్బుక్కొదవలేదు.

82వ ఏట, 1910లో జీవితం మీద విరక్తి కలిగి ఫ్యామిలీ డాక్టర్ తోడుగా ఇంటి నుండి బయల్దేరాడు టాల్‌స్టాయ్. అది మహాభినిష్క్రమణం. భోరున కురుస్తున్న వర్షంలో రైలు ప్రయాణం చేశాడు. భార్యకు తన జాడ తెలియకూడదని రహస్యంగా ప్రయాణం కొనసాగించాడు. జలుబు, జ్వరం పట్టుకుంది. ఈ వృద్ధ ప్రయాణీకుడెవరో అందరికీ తెలిసిపోయింది. అస్టాపోవో స్టేషన్‌లో రైలాపాడు.

మరికొద్ది గంటల్లో టాల్‌స్టాయ్ గురించిన వార్త ప్రపంచవ్యాప్తంగా ప్రసారమైంది. వందలాదిమంది జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లతో ఆ కుగ్రామం నిండిపోయింది. చాలామంది రైలు కంపార్టుమెంట్లనే తమ కార్యాలయాలుగా మార్చుకుని వార్తలు పంపారు. అవి చివరి క్షణాలు-ప్రభుత్వాధినేతలు, ప్రైమ్‌మినిస్టర్లు టాల్‌స్టాయ్ గురించి వాకబు చేశారు. నవంబర్ ఏడు. ఆదివారం ఉదయం ఆరింటికి మరో ప్రస్థానం మీద బయల్దేరాడు టాల్‌స్టాయ్.

రచయితలందరూ నోబెల్ ప్రైజ్ అందుకోవటమే ఒక శిఖరారోహణ నుకుంటారు. నోబెల్ ప్రైజ్ అందుకోలేనంత మహోన్నతుడు టాల్‌స్టాయ్.

[కథల్లోకెల్లా తలమానికమైనది ఈ కథ. అందుకనే ప్రత్యేకమైన ఈ కథను పాఠకుల సౌకర్యార్థం అంతే ప్రత్యేకంగా ఈ కథను ప్రచురిస్తున్నామని మనవి.]

కోర్టులో మెల్విన్స్కి కేసు విచారణ జరుగుతున్నది. లంచ్ టైంలో లాయర్లూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిచ్చాపాటీ మాట్లాడుకోవటానికి షెబెక్ ఆఫీసుకు చేరుకున్నారు. సంభాషణ క్రాసోవ్ కేసు మీదికి మళ్ళింది. అయితే, అది తనకు సంబంధించిన విషయం కాదన్నాడు వసీల్యెవిచ్. ఎగొరోవిచ్ అతనితో విభేదించాడు. ఇదేమీ పట్టనట్టుగా వార్తాపత్రిక చదువుతున్న ఇవానివిచ్ ఒక్కసారిగా,

"జెంటిల్మెన్, ఇవాన్ ఇల్యిచ్ చచ్చిపోయాడు" అంటూ కేకేశాడు.

"నిజంగా?"

"ఇదిగో చదవండి. పత్రిక మీద సిరా తడికూడా యింకా ఆరలేదు. ఎలా వాసన వేస్తుందో చూడండి."

నలుపు బార్డర్‌తో వార్త కనిపించింది.

"ప్రముఖ న్యాయమూర్తి ఇవాన్ ఇల్యిచ్ గొలోవిన్ గారు 4-2-1882 నాడు స్వర్గస్తులయ్యారని తెలియజేస్తున్నాను.

శుక్రవారం ఒంటి గంటకు అంత్యక్రియలు నిర్వహించబడతాయి.

బంధు మిత్రులందరికీ యిదే నా వినతి–ఇట్లు ప్రస్కోవ్యా ఫ్యోదొరోవ్నా గోలోవినా (భార్య)."

అక్కడున్నవాళ్ళకు చిరకాల మిత్రుడు ఇవాన్ ఇల్యిచ్. అందరికీ అతడంటే గౌరవం, యిష్టం. కొంతకాలంగా బాధ పడుతున్నాడు. అది చికిత్సకు లొంగని వ్యాధి అని కూడా తెలుసు. ఒకవేళ ఆరోగ్యం కుదుటపడి, తిరిగి వుద్యోగంలో చేరదలచుకుంటే, ఆ పోస్టు తనకోసం ఖాళీగానే వుంచుతామని కూడా చెప్పారు అధికారులు. దురదృష్టవశాత్తూ మరణిస్తే ఆ వుద్యోగం అలెక్సీవ్‌కు దక్కుతుంది. అలెక్సీవ్ స్థానం ష్టాబెక్‌కు దక్కుతుంది. ఆ వార్త వల్ల వాళ్లలో కలిగిన ఆలోచన ఒక్కటే. కోర్టులో ఎవరెవరికి ప్రమోషన్లు వస్తాయి? ఎవరికి స్థానచలనం కలుగుతుంది?

"నాకు ష్టాబెక్ లేదా విన్నికోవ్ పోస్టు ఖాయం" అనుకున్నాడు వసీల్యెవిచ్, "ఇన్నాళ్లకు నా నిరీక్షణ ఫలించింది. ప్రమోషన్‌తో జీతం ఎనిమిది వందల రూబుళ్లు పెరుగుతుంది. పైగా అలవెన్సులు, ఇతర పెర్కులు కూడా."

"మా బావమరిదిని 'కటాగా' (నగరం) నుండి ట్రాన్స్‌ఫర్ చేయమని ఓ అర్జీ పెట్టుకోవాలి. నా భార్య సంతోషిస్తుంది. కనీసం నేను తనకేమీ చెయ్యలేదని నిష్ఠూరాలాడటం మానేస్తుంది." అనుకున్నాడు ఇవానీవిచ్.

"జబ్బు అలాంటిది. బతుకుతాడని నేనెప్పుడూ అనుకోలేదు."

"ఏమైందింతకూ? ఏం జబ్బది?"

"డాక్టర్లకే తెలియదు. మనకెలా తెలుస్తుంది? ఎవరికి తోచిన పేరు వాళ్ళు పెట్టుకున్నారు."

"ఆయన్ను చూసి చాలా కాలమైందిలే. ఈ విషయాలేవీ నాకు తెలియవు."

"నాలుగు రాళ్ళు వెనకేసుకున్నాడా?"

"భార్య వైపు వాళ్ళు కాస్త స్థితిమంతులే అని విన్నాను."

"పరామర్శించటానికెళ్లాలని వుంది. కాని యిల్లు చాలా దూరం గదూ?"

"మీ యింటి నుండి దూరం. నీకన్నీ దూరమే."

"అవునయ్యా, ప్రశాంతంగా వుండొచ్చని నదికి ఆవలివైపు యిల్లు కట్టుకున్నాను. అయితే ఏమిటి?" అంటూ కొంటెగా నవ్వాడు ఇవానివిచ్.

సంభాషణ మళ్లీ ట్రాన్స్‌ఫర్లూ, ప్రమోషన్ల మీదికి మళ్ళింది. తెలిసినవాడొకడు పోయాడు. మరణం తమ యింటి తలుపు తట్టనందుకు వూపిరి పీల్చుకున్నారు.

"అందరం కలిసే వుంటాం. కలిసే బతుకుతాం. కాని వున్నట్టుండి ఒకడు చస్తాడు. మరొకడు బాగానే వుంటాడు. ఇదే అంతుపట్టని వింత." అనుకున్నారు.

పరిచయస్తులందరికీ కాకపోయినా, 'సన్నిహిత' మిత్రులకు తప్పుదుగదా. ఎంత దూరమైనా, ఎన్ని యిబ్బందులున్నా ఆ యింటికి వెళ్లకా తప్పదు. అంత్యక్రియలకు హాజరు కాకా తప్పదు.

వసీల్యెవిచ్, ఇవాన్ ఇల్యిచ్‌తో కలిసి 'లా' చదివాడు. వెంటనే భార్యకు మిత్రుని మరణం గురించి చెప్పాడు. ఇవాన్ ఇల్యిచ్ యిప్పుడు లేడు గనక, ఆమె తమ్ముడి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నించవచ్చు. లంచి తర్వాత కునుకు తియ్యటం అతడి అలవాటు. కాని ఆ రోజు (తప్పనిసరి పరిస్థితుల్లో) డ్రెస్ చేసుకుని, ఇవాన్ ఇంటికి బయల్దేరాడు.

✡

శవ వాహనమూ, మరో రెండు బగ్గీలూ వున్నాయింటిముందర.

హాల్లో, మెట్ల దగ్గర, సిల్కు రిబ్బన్లు యితర అలంకరణాలతో ముస్తాబైంది శవ పేటిక. నల్ల దుస్తుల్లో (శోక చిహ్నం) వున్న యిద్దరు స్త్రీలు కళ్ళు తుడుచుకుంటూ కనిపించారు. అందులో ఒకరు ఇవాన్ ఇల్యిచ్ సోదరి. మరొకావిణ్ణి గుర్తుపట్టలేకపోయాడు వసీల్యెవిచ్. అప్పుడే యింటికి చేరిన అతని సహోద్యోగి ష్వార్జ్ దూరం నుండే సైగ చేశాడు. దాని అర్థం, "తిరకాసుంది. చచ్చేముందు ఇవాన్ ఇల్యిచ్ ఏదో మెలిక పెట్టి వుంటాడు." అని.

ఈ విషయం వసీల్యెవిచ్ గ్రహించాడు. ష్వార్జ్ ప్రవర్తన హుందాగా, గంభీరంగా వుంది. సందర్భానుసారంగా వ్యవహరించటంలో అతణ్ణి మించిన వాళ్ళు లేరు.

పక్కకు తొలిగి, స్త్రీలకు దారిచ్చాడు వసీల్యెవిచ్. ష్వార్జ్ మెట్లమీదే మర్యాదగా తలవంచుకుని నిల్చున్నాడు.

"సాయంత్రం పేకాట ఎక్కడాడాలా అని ఆలోచిస్తున్నాడు వాడు" అనుకున్నాడు వసీల్యెవిచ్. ఇవాన్ ఇల్యిచ్ భార్య వున్న మేడమీది గదిలోకి వెళ్ళారు స్త్రీలు. మృతదేహం ఫలాని గదిలో వుందంటూ చూపులతో సైగ చేశాడు ష్వార్జ్.

మరణించిన మిత్రుని ముందు ఎలా ప్రవర్తించాలో తెలియని కన్ఫ్యూజన్‌లో లోపలికెళ్లాడు వసీల్యేవిచ్. సందర్భమేదైనా, ఛాతీమీద చూపుడు వేలితో శిలువ గీసుకుంటే తప్పులేదని మాత్రం అతడికి తెలుసు. పూర్తిగా వంగి శ్రద్ధాంజలి ఘటించాలా వద్దా అనుకుని, సగం వంగి ఆ కార్యక్రమం అయిందనిపించాడు. అమర్యాద అనిపించుకోని పద్ధతిలో ఒకసారి గదంతా పరికించి చూశాడు. ఇద్దరు యువకులు–అందులో ఒకడు కాలేజీలో చదువుతూ వుండి వుంటాడు–శిలువ సైగ చేసుకుంటూ గదిలోంచి నిష్క్రమించారు. ఒక వృద్ధురాలు కళ్లు తుడుచుకుంటూ గోడకు చేరగిలబడింది. మరొక స్త్రీ, పక్కావిడ చెవిలో ఏదో గుసగుసలాడుతున్నది.

ఒక చర్చిమనిషి బైబిల్లోంచి బిగ్గరగా పఠిస్తున్నాడు. దుర్వాసన రాకుండా వుండటం కోసం సుగంధ ద్రవ్యాలు కలిపిన నీటిని గదిలో చిలకరిస్తున్నాడు. "శవం కుళ్లిపోతుందని కాబోలు" అని గుర్తు కొచ్చింది వసీల్యేవిచ్‌కు. గతసారి, తను వచ్చినప్పుడు, ఈ కుర్రాడే ఇవాన్ ఇల్యిచ్‌కు సేవలు చెయ్యటం చూశాడు.

ఛాతీ మీద శాలువ గీసుకుంటూనే దగ్గరగా వెళ్ళి శవాన్ని పరీక్షించి చూశాడు. మాటి మాటికీ శిలువ గీసుకోవటం విసుగనిపించింది.

శవపేటికలో భారంగా పడుకున్నట్టుంది శరీరం. దిండు మీద ఒక వైపు వాలి వున్నది తల. మొహం, ముఖ్యంగా నుదురు రంగు మారినట్టుంది. జుత్తు చెదిరింది. ముక్కు పుటాలు ఎవరో లోపలికి నొక్కినట్టుగా వున్నాయి. నోటికి ఎడమవైపు పెదాలు కాస్త తెరచుకున్నాయి. 'ఇవాన్ ఇల్యిచ్ ఎంత మారిపోయాడు!' అనుకున్నాడు వసీల్యేవిచ్. మనిషి సన్నబడ్డాడు. అయితే, మొహంలో ఏదో అందం కనిపించింది. మనుషుల అందం కాదది–శిల్పాల్లో వుండే అందం. బతికున్నప్పటికన్న చావులోనే మనుషులు బాగుంటారు. ప్రాణం నిలబెట్టటం కోసం జరగవలసిన పనులన్నీ జరిగాయి. మృత్యువులో కూడా ఇవాన్ ఇల్యిచ్ చిలిపిగా, బతికున్న వాళ్లందర్నీ హేళన చేస్తున్నాడు.

"తనను తప్ప అందర్నీ ఆటపట్టిస్తాడు ఇవాన్ ఇల్యిచ్" అనుకున్నాడు వసీల్యేవిచ్. జనంతో నిండుతున్నది గది. మరోసారి శిలువ గీసుకుని హడావిడిగా బయటికి నడిచాడు వసీల్యేవిచ్.

పక్కగదిలో ష్వార్జ్ నిరీక్షిస్తున్నాడు. హ్యాట్ సవరించుకుంటూ, సైగ చేసిన మిత్రుణ్ణి చూడగానే వసీల్యేవిచ్‌కు ప్రాణం లేచివచ్చినట్టైంది. మృత్యువాతావరణంలో కూడా సరదాగా వుండగలడు ష్వార్జ్. "అంత్యక్రియలు జరుగుతాయి. ఇది చాలా విషాదకరమైన సమయమే కావచ్చు. కాని సాయంత్రం మనం పేకాట ఆడటానికిది అడ్డంకి ఎలా అవుతుంది? మద్యం, మంచి భోజనం, మిత్రులతో సల్లాపం–ఇంతకన్న కావాల్సిందేమిటి?" అంటున్నాయి కళ్లు. "మా యింట్లో కలుసుకుందాం." అంటూ చెవిలో చెప్పాడు

కాని, ఆ సాయంత్రం వసీల్యేవిచ్ అనుకున్నట్టుగా జరగలేదు.

మృతుని భార్య ప్రస్కోవ్యా ఫ్యొదొరొవ్నా (భారీ శరీరం. పొట్టిగా వుంటుంది. విశాలమైన వక్షం. సన్నబడటానికి ఆమె చేసిన అశేష ప్రయత్నాల ఫలితమది) నల్లటి డ్రెస్సులో వసీల్యేవిచ్‌ను సమీపించి, "కార్యక్రమం ప్రారంభమవుతుంది. లోపలికి రండి." అంది. ష్వార్జ్ మర్యాదగా తల పంకించాడు.

"మీరతని ఆప్తమిత్రులని నాకు తెలుసు." అంది వితంతువు, వసీల్యేవిచ్‌తో.

"సందేహమా!" అని ఆమె చేతిని నొక్కుతూ వెంట నడిచాడు వసీల్యేవిచ్.

"నువ్వు బుట్టలో పడ్డావు. సాయంత్రం పేకాట కోసం మరో పార్ట్‌నర్ను వెదుక్కుంటానులే." అన్నట్టుగా చూశాడు ష్వార్జ్. కృతజ్ఞతగా, వసీల్యేవిచ్ చేతిని అదిమి పట్టుకుంది వితంతువు. ఆమెతో గదిలోకి అనుసరించాడతడు. టేబుల్ మీద చిన్న దీపం వెలుగుతోంది. ఆమె సోఫా మీద కూర్చుంది. ఎదురుగా, దిండు అమర్చిన స్టూలు మీద కూర్చున్నాడు వసీల్యేవిచ్. ఎందుకోగాని, ఆమె, తలవంచుకుని, ఛాతీమీద శిలువ గీసుకుంటూనే వుంది.

చేసేది లేక, అటూయిటూ చూశాడు వసీల్యేవిచ్. గదిలో ఫర్నిచర్ చెల్లాచెదురుగా పడివుంది. తలపై కప్పుకున్న లేసును తొలగించి, ఒకసారి వసీల్యేవిచ్ వైపు చూసి శోకాలు పెట్టిందావిడ. వసీల్యేవిచ్‌కు ఏం చెయ్యాలో పాలు పోలేదు. అంతలో, అదృష్టవశాత్తూ నౌకరు వచ్చి, సమాధి కోసం సెలెక్టు చేసిన ప్లాటు ఖరీదు రెండు వందల రూబుళ్లని చెప్పాడు. వితంతువు, ఏడుపాపి, బాధలో కాస్త కోపం కూడా కలిపి, "ఇన్ని ఖర్చులు భరించటం ఎంత కష్టమో చూడండి." అంది ఫ్రెంచిలో. (సంపన్నులూ, మధ్యతరగతివాళ్ళూ ఫ్రెంచిలో మాట్లాడటం ఆనాటి రష్యాలో ఒక స్టేటస్ చిహ్నం–ఇప్పుడు మనం తరచుగా యింగ్లీషు మాట్లాడు తున్నట్టు–) మర్యాదగా తలాడించాడు వసీల్యేవిచ్.

"సిగరెట్టు కాల్చాలనిపిస్తే కాల్చండి." అంటూ నిట్టూర్చింది వితంతువు–ఇలాంటి బలహీనతలను క్షమించటం తనకలవాటే అన్న అర్థంలో. ఆ తర్వాత, సమాధి స్థలం ధర గురించి నౌకరుతో మరింత చర్చించి, చర్చిలో ప్రార్థనలప్పుడు గాయకులకివ్వాల్సిన డబ్బు విషయం కూడా సెటిల్ చేసింది.

ఆ తర్వాత, "అన్నీ నేనే చూసుకోక తప్పదుగద. నా రాత అలా రాసుంది. ఏం చేస్తాను." అంటూ వసీల్యేవిచ్ వైపు జాలిగా చూసింది. సిగరెట్ బూడిద కార్పెట్ మీద పడే ప్రమాదముందని గ్రహించి, అర్జెంటుగా ఓ యాష్ ట్రే అందించింది.

"నేను మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడదామనుకుంటున్నాను." అన్నాడు వసీల్యేవిచ్ సందేహిస్తూ.

"చివరి రోజుల్లో ఆయన చాలా బాధ పడ్డాడు." అందామె.

"నిజంగా?"

"బాధను తట్టుకోలేక కేకలేసేవాడు. నిమిషాలు కాదు. గంటల కొద్దీ అరుపులతో యిల్లు మార్మోగింది. ఒక్కోసారి, వూపిరాడక, ప్రాణం పోతుందేమో నన్నంత భయమేసేది. ఏం చెయ్యను. ఇంట్లో ఒంటరి ఆడదాన్ని. అన్నీ భరించాను. మూడు గదులు ఆవలవున్నా వినిపించేదా మూలుగు."

"అంటే చివరిదాకా స్పృహలోనే వున్నాడన్న మాట".

"అవును. చివరి శ్వాసకు ముందు దాకా మాతో మాట్లాడుతూనే వున్నాడు."

ఈ సంభాషణలోని హిపోక్రసీ వెగటు పుట్టించినా, తన మిత్రుని చివరి రోజుల గురించి తెలుసుకున్నప్పుడు భయంతో వణికిపోయాడు వసీల్యేవిచ్. బాల్యంనుండీ యిద్దరూ కలిసి పెరిగారు. స్కూల్లో, కాలేజీలో, సహోద్యోగులుగా ఎన్నో అనుభవాలు పంచుకున్నారు.

"మూడు రోజులు నరక యాతన అనుభవించాడు. రేపు నాకూ అలాగే జరగొచ్చు." అనుకున్నాడు. అవును. తను ఇవాన్ ఇల్యిచ్ కాకపోవడమే తన అదృష్టం. కాని మృత్యువు ఎవర్నీ వదిలి పెట్టదు. కనీసం అందుకోసమైనా ఇవాన్ ఇల్యిచ్ గురించి మరింత తెలుసుకోవాలి.

ఆ చివరి మూడురోజుల వేదన మరింత వర్ణించింది వితంతువు. ఇవాన్ ఇల్యిచ్ బాధ గురించి చెప్పిందంతా తనకు అన్వయించుకుని, వూపిరి బిగపట్టి

విన్నాడు వసీల్యెవిచ్.

కాని, కబుర్లెంతసేపు చెప్పుకున్నా, జరగాల్సిన కార్యక్రమం గురించి కూడా ఆలోచించక తప్పదు గద.

కళ్ళు తుడుచుకుని, ముక్కు చీదినప్పుడు ఆమె వైపు సానుభూతిగా చూశాడు వసీల్యెవిచ్. నిజానికి, ఆమెకే అతనితో సంప్రదించాల్సిన అవసరం ఎక్కువగా కనిపించింది. భర్త మరణంతో ప్రభుత్వం ఆమె కిచ్చే పరిహారమెంత? పెన్షన్ గురించి అడుగుతున్నట్టుగా ప్రారంభించింది గానీ ఆ విషయాలన్నీ తన కన్నా ఆమెకే బాగా తెలుసని గ్రహించాడు వసీల్యెవిచ్. అయితే. తనతో చర్చించటంలో ఆమె వుద్దేశ్యం-ఏఏ రూల్సు ప్రకారం, ఏఏ కారణాలు చెప్పి మరింత రాబట్టడమెలా అని మాత్రమే. చేసేదేమీ లేక, వుద్యోగుల బాగోగులు పట్టించుకోని ప్రభుత్వాన్ని తనూ కాసేపు తిట్టి యింతకన్నా ఎక్కువ మరేమీ వచ్చే అవకాశం లేదని నిట్టూర్చాడు. అవసరం తీరిన తర్వాత ఈ మనిషితో తనింకా మాటలు కొనసాగించడమెందుకు అనుకుందామె. ఆమె ప్రవర్తనలో మార్పు గమనించి, సిగరెట్ నలిపేసి లేచి నిలబడ్డాడు వసీల్యెవిచ్.

డైనింగ్ రూంలో, ఇవాన్ ఇల్యిచ్ మోజుపడి కొనుక్కున్న పాత గడియారం కనిపించింది. అంత్యక్రియల కోసం వచ్చిన ప్రీస్టునూ, మరి కొందర్నీ పలకరించాడు వసీల్యెవిచ్. విషాద వదనంతో ఓ పడుచు పిల్ల దూరంగా నిల్చున్నది. ఆమె ఇవాన్ ఇల్యిచ్ కూతురు. నల్లటి డ్రెస్సూ, కళ్ళలో దాచుకున్న కోపమూ, సన్నటి నడుమూ ఆమెకో విలక్షణత కల్పించాయి. తన తండ్రి చావుకి "కారణం నువ్వే" అన్నట్టు చూసింది వసీల్యెవిచ్‌కేసి. ఆమె వెనకే మరో యువకుడు నిల్చున్నాడు. అతడామె ప్రియుడు-కాబోయే భర్త. ఇవాన్ ఇల్యిచ్ లాగే వున్న మరో పదమూడు సంవత్సరాల కుర్రాడు పక్కగదిలోంచి తొంగి చూశాడు-వాడు ఇవాన్ ఇల్యిచ్ కొడుకు వొలోద్యా.

మృతదేహం వద్ద ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. కొవ్వొత్తులు, అగరొత్తులు, ఏడ్పులు, కన్నీళ్లు, మూల్గులు. తలవంచుకుని నిల్చున్న వసీల్యెవిచ్ అక్కడ మూగిన జనం పాదాలను పరిశీలించాడు.

ఇదే సమయం బయల్దేరటానికి. నిశ్శబ్దంగా హాలు వైపు అడుగు వేశాడు. పని మనిషి గెరాసిం తల వంచి నమస్కారం చేశాడు. ఏదో ఒకటి మాట్లాడక తప్పదు.

"ప్చ్. ఎంత దారుణం."

"అంతా దేవుడి దయ. అందరం ఎప్పుడో ఒకప్పుడు పోవాల్సిన వాళ్లమే" అన్నాడు గెరాసిం. చదువూ సంధ్యాలేని పల్లెటూరి బైతువాడు.

వరండా మెట్లు దిగి గుర్రబ్బండీ ఎక్కి కూర్చున్నాడు వసీల్యెవిచ్.

"ఎక్కడికి సార్?" అంటూ అడిగాడు గుర్రబ్బండీ వాడు కొరడాతో గుర్రాలను అదిలిస్తూ.

అడ్రస్ చెప్పాడు వసీల్యెవిచ్.

ఆ రోజు అలా గడిచింది.

మిత్రుని యింట్లో పేకాట జోరుగా సాగుతున్నది.

## 2

లక్షల, కోట్లమంది లాగే అత్యంత సామాన్యమైన-అంటే అత్యంత భయానకమైన జీవితం గడిపాడు ఇవాన్ ఇల్యిచ్.

జడ్జీ వుద్యోగం చేస్తూ నలభై అయిదో ఏట మరణించాడు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో, కొన్నేళ్లు వుద్యోగం చేశాక, సర్వీసు రూల్సు, సీనియారిటీ ప్రకారం కొందరు వుద్యోగులు ఎంత అసమర్థులని తెలిసినా, పై అధికారులు వాళ్లనేమీ చేయలేరు. అలాంటి వాళ్లకోసం, పనీపాటా లేని కొన్ని కొత్త శాఖలు ఏర్పాటు చేసి, పనీపాటా లేని వుద్యోగాలు కల్పించి నెలనెలా ఆరేడువేల దాకా జీతభత్యాలిచ్చి మేపుతారు.

అలాంటి ఒక డిపార్టుమెంటులో ప్రీవీ కౌన్సిలర్‌గా వుద్యోగం వెలగబెట్టిన ఇల్యా గొలోవిన్‌కు ముగ్గురు మగసంతానం, ఒక ఆడపిల్ల. వాళ్లలో రెండోవాడు ఇవాన్ ఇల్యిచ్. మొదటివాడు తండ్రి అడుగుజాడల్లో నడిచి అలాంటి వుద్యోగమే చిక్కించుకున్నాడు. మూడోవాడు దారితప్పి రైల్వేలో పనిచేస్తున్నాడు. అన్నలిద్దరికీ, బంధువులకూ వాడంటే అసహ్యం. చెల్లెలు మరో వుద్యోగిని చేసుకుంది-ఆ అల్లుడు అసమర్థతలోనూ, నిరర్థకతలోనూ మామ గారికేమీ తీసిపోడు. ఇవాన్ ఇల్యిచ్ అటూ యిటూ గాక కాస్త మధ్యస్తంగా వుంటాడు. తనూ, తమ్ముడూ 'లా' చదవారు గాని తమ్ముడు ఫెయిలయ్యాడు. తను పాసయ్యాడు. ప్రభుత్వోద్యోగం చెయ్యటమంటే పై అధికారుల ఆజ్ఞల్ని తు.చ తప్పకుండా పాటించడమేనని ఎప్పుడో గ్రహించాడు. కింది వుద్యోగులు, పైవాళ్ళ కనుసన్నలలో మెలగాలి. డ్యూటీ సరిగా చెయ్యటమంటే వాళ్ళను మెప్పించటమే. ఒక్కో అంగుళం పైకెగబాకుతూ వాళ్లను చేరుకోవాలి. ఆదర్శవాదమూ, న్యాయబద్ధమైన పాలనా వుంటుందని తెలుసుగాని, ఏదైనా రూల్సు, పై అధికారులు అనుమతించినంత వరకే.

విద్యార్థిగా వున్నప్పుడు అతడు "కొన్ని చెయ్యకూడని పనులు" చేశాడు గాని పెద్ద మనుషుల యిళ్లలో కూడా యివి సర్వసాధారణంగా జరుగుతూనే వుంటాయని తెలిసి వాటి గురించి ఆలోచించటం మానేశాడు.

'లా' స్కూలు నుండి డిగ్రీ తీసుకుని, ఒక చిన్న ప్రభుత్వోద్యోగానికి అర్హత సంపాదించి, తండ్రి ఇచ్చిన డబ్బుతో కొత్త వుద్యోగానికి అవసరమైన కొత్త దుస్తులు కుట్టించుకుని, తోటి విద్యార్థులతో చివరి సారి విందారగించి, ప్రయాణానికి కొత్త సూట్ కేసులూ, పెట్టెలూ కొనుక్కుని, తండ్రి తన పరపతి వుపయోగించి సంపాదించి పెట్టిన నౌకరీలో చేరటానికి బయల్దేరాడు ఇవాన్ ఇల్యిచ్.

ఉద్యోగం సంపాదించినంత మాత్రాన సరిపోదు. దాని లోతుపాతులు కూడా పసిగట్టగలగాలి. కొద్దిరోజుల్లోనే ఇవాన్ ఇల్యిచ్, పై అధికారుల, సహోద్యోగుల, కింది వాళ్ల మెప్పు కూడా పొందగలిగాడు. అతడి నిర్ణయాలలో అవినీతికి తావులేదు. అందరితో స్నేహంగా వుంటాడు. ఎవరినీ నొప్పించడు. కాని 'లాంగేరకం' కూడా కాదని పేరు వచ్చింది. ఆఫీసు తర్వాత ఎంత సరదాగా, కలివిడిగా వున్నా, సీట్లో కూర్చున్నప్పుడు మాత్రం చండశాసనుడు.

రాజధానికి దూరంగా వున్న చిన్న నగరం గనక, ఇవాన్ ఇల్యిచ్‌కు ఆ వూర్లో గౌరవ మర్యాదలకేమీ తక్కువ లేదు. పడుచు పిల్లలు ఈ యువ లాయర్ మీద మనసు పారేసుకున్నారు. సాయంత్రాలు మందుపార్టీలు, విందు వినోదాలు-భార్యాపిల్లలతో వచ్చిన స్థానిక ప్రముఖులు కూడా ఇవాన్ ఇల్యిచ్ దృష్టిలో పడటానికి ప్రయత్నించారు. అలాంటి సందర్భాలలో, వ్యవహారాలు కాస్త హద్దు మీరటం సహజం. కాని అంత మాత్రాన, ఇవాన్ ఇల్యిచ్‌ను ఎవరూ తప్పుపట్టలేదు.

సంస్కారవంతులు, విద్యావంతులు, వున్నతోద్యోగులు ఏం చేసినా అందమే.

అయిదేళ్ల తర్వాత, సర్వీసు నిబంధనల్లో మార్పులు జరిగాయి. అదనపు కోర్టులు ఏర్పడ్డాయి. కొత్త న్యాయమూర్తులు అవసరమయ్యారు. అలాంటి క్రొత్త న్యాయమూర్తి ఇవాన్ ఇల్యిచ్. ఇప్పుడతడు ఎగ్జామినింగ్ మెజిస్ట్రేట్. కొత్త వూరికి బదిలీ అయ్యాడు. పాత మిత్రులకు, పాత ప్రియురాళ్ళకు వీడ్కోలు చెప్పి, గ్రూపు ఫోటోలు కూడా తీయించుకుని, వాళ్లిచ్చిన కానుకలు (ముఖ్యంగా వెండి సిగరెట్ కేస్) తీసుకుని రైలెక్కాడు.

కొత్త బాధ్యతలకు త్వరలోనే అలవాటు పడ్డాడు. ఆఫీసు జీవితానికి, ప్రైవేటు జీవితానికి ముడిపెట్టొద్దనే తన మౌలిక సిద్ధాంతం మాత్రం కొనసాగింది. ఇన్నాళ్లూ అతడు మరొకరికి అసిస్టెంటుగా పనిచేశాడు. ప్రజల విజ్ఞాపనలను, ఆర్జీలను అతడికి చేరవెయ్యడమే తన పని. కాని తనకంటూ ప్రత్యేక అధికారాలేవీలేవు. ఇప్పుడు తను తీర్పులు చెప్పగలడు. జీవితాలను నిలబెట్టగలడు. నాశనం చెయ్యగలడు. కోర్టుకు వచ్చిన వాళ్లందరి తలరాతలనూ మార్చగలిగిన విధాత తాను. పెద్ద మనుషులనబడే వాళ్లు వచ్చినప్పుడు, కూర్చోవటానికి అనుమతి కూడా యివ్వకుండా, బోనులో నిలబడే సాక్ష్యం చెప్పాలని ఆదేశించగలడు! అయితే, ఇవాన్ ఎప్పుడూ అధికార దుర్వినియోగానికి పాలుబడలేదు. నిర్ణయాధికారాలున్న వ్యక్తి దయాదాక్షిణ్యాలు చూపటంలో కలిగే తృప్తి గొప్పదని తెలిసి వచ్చింది. కేసు విచారణలోని మెళకువలను అధ్యయనం చేశాడు. వాదనలు రకరకాలుగా వుంటాయి. కాని, వివాదానికి 'నాడి' ఏదో తెలుసుకోగలగాలి. వ్యక్తిగతమైన యిష్టాయిష్టాలకు తావివ్వగూడదు. చట్టంలోని సెక్షన్లు, సబ్ సెక్షన్లన్నీ గుర్తుపెట్టుకుని, లొసుగుల్లేని తీర్పు చెప్పాలి. (రష్యాలో) 1864లో వచ్చిన కొత్త రాజ్యాంగానికి, కోర్టుల్లో భాష్యం చెప్పిన తొలి మెజిస్ట్రేట్‌లలో ఇవాన్ ఇల్యిచ్ ఒకడు.

కొత్త వుద్యోగంతో ఇవాన్ ఇల్యిచ్ ప్రవర్తనలోనూ కొంత మార్పు వచ్చింది. పరిచయాలు పెరిగాయి గాని, తనకూ, తనకోసం వచ్చే వ్యక్తులకూ మధ్య కొంత దూరం వుండటమే మంచిదని భావించాడు. ధనవంతులు, బాగా డబ్బు గడిస్తున్న కొద్దిమంది లాయర్లతో మాత్రమే సాన్నిహిత్యం పెంచుకున్నాడు. చేస్తున్నది ప్రభుత్వోద్యోగమే అయినా, ప్రభుత్వ విధానాలపట్ల, పనితీరుపట్ల కొంత అసంతృప్తిని కూడా వ్యక్తపరచడం వల్ల తన సంస్కరణాభిలాషను కూడా వ్యక్తపరిచాడు. ఫాషనబుల్ దుస్తులే వేసుకున్నాడు గాని, గడ్డం పెంచుకోవటం కూడా ప్రారంభించాడు.

కొత్త వూర్లో, జీవితం సరదాగానే వుంది. ఆ ప్రాంత గవర్నర్‌ను వ్యతిరేకించేవాళ్లంతా ఇవాన్ ఇల్యిచ్‌కు చేరువయ్యారు. జీతం పెరిగింది. పేకాట ఆడటం అతడు కొత్తగా అలవరచుకున్న సరదాలలో ఒకటి.

రెండేళ్ల కొత్త వుద్యోగం తర్వాత ఇవాన్ ఇల్యిచ్ తన కాబోయే భార్యను కలుసుకున్నాడు. అతనికి తెలిసిన కుటుంబాలలో ప్రస్కోవ్యా అంత అందగత్తె మరొకరు లేరు. బాగా తెలివైన పిల్లకూడా. యువకులకు ఎన్ని వినోదాలున్నా, ఆడపిల్లలతో గడపటమంత హాయిగొలిపే వ్యాపకం మరొకటి వుండదు గదా!

చిన్న వుద్యోగంలో వున్నప్పుడు అందరితో కలసి నాట్యం చెయ్యటంలో ప్రత్యేకత ఏమీలేదు. కాని యిప్పుడు ప్రమోషన్ తర్వాత కూడా, తనకన్నా తక్కువ హోదావున్న వాళ్లతో కలివిడిగా వుంటానని ప్రదర్శించటానికి నాట్యం చేస్తాడు. అలా, ఒక సాయంత్రం, ప్రస్కోవ్యాతో కూడా నాట్యం చేశాడు. అంతే. ఆమె, అతడి ప్రేమలో పడింది. నిజానికప్పుడు, ఇవాన్ ఇల్యిచ్‌కు పెళ్లి చేసుకునే వుద్దేశం లేదు కాని, తనను ప్రేమించిన అమ్మాయి ఆశగా తనవైపు చూసినప్పుడు "అవును ఎందుకు పెళ్లి చేసుకోగూడదు?" అనుకున్నాడు.

ప్రస్కోవ్యా అందగత్తె. మర్యాదస్తుల కుటుంబం నుండి వచ్చింది. కాసింత డబ్బు కూడా వెంట తెచ్చుకుంది. ఇవాన్ ఇల్యిచ్‌కు యింతకన్నా మంచి సంబంధం దొరికే అవకాశం లేకపోలేదు. "కాని యిదీ ఫరవాలేదులే." అనుకున్నాడు. తన జీతం, ఆమె డబ్బు కలిస్తే జీవితం సాఫీగా సాగిపోతుంది. ఇవాన్ ఇల్యిచ్ ఆమె ప్రేమలో పడి, తనులేకపోతే బతకలేనని ఆమెను చేసుకున్నాడనీ కాదు. తనవైపు బంధువులు ఈ సంబంధానికి అంగీకరించారు గనుక చేసుకున్నాడనీ కాదు. ఈ రెండూ కారణాలే గాక, 'పెళ్లి' అనే భావనలోనే ఒక ఆనందం వుంది. పైగా అది మర్యాదస్తుల లక్షణం.

అదీ ఇవాన్ ఇల్యిచ్ పెళ్లికి కారణం.

పెళ్లి ఘనంగా జరిగింది. ఆ తర్వాత తొలి ప్రణయం, కలహాలు, కొత్త దుస్తులు, కొత్త ఫర్నీచర్, తరచు విందు భోజనాలు, బెడ్‌రూంలోని కొత్త అలంకరణలు–ఒకటేమిటి–భార్యకు నెల తప్పిందాకా యిలాగే కొనసాగింది జల్సా. ఆ తర్వాత, ఎప్పుడో, ఒకసారి, పెళ్లి వల్ల తన హోదా తగ్గలేదుగదా, మిత్రులతో తన వినోదాలకిది ఆటంకం కావడం లేదు కదా అని సందేహం తొంగిచూసింది. పెళ్లివల్ల ఆనందం, స్టేటస్ పెరిగే అవకాశం కూడా లేదా! అయితే, భార్య నెలతప్పిన కొంత కాలానికి, అనూహ్యమైన, కలవరపరిచే పరిణామాలు కొన్ని చోటు చేసుకున్నాయి.

అకారణంగా–ఇది ఇవాన్ ఇల్యిచ్ అభిప్రాయం– భార్య తమ వైవాహిక ఆనందానికి అడ్డు కట్ట వేసింది. తన మీద అనుమానం పెంచుకుంది. పట్టించుకోవటం లేదంటూ అలగటం ప్రారంభించింది. తను చేసే ప్రతి పనిలో, ప్రవర్తనలో తప్పులెన్నటం అలవాటు చేసుకుంది. వెరసి, యింట్లో, రుసరుసలు, పోట్లాటలు నిత్యకృత్యంగా మారాయి.

మొదట, ఇవాన్ ఇల్యిచ్ వీటిని పట్టించుకోవద్దనుకున్నాడు. ఆమె కోపతాపాలను విస్మరించి వుద్యోగంలో మిత్రుల సాన్నిహిత్యంలో ఆనందం వెదుక్కున్నాడు. ఇంట్లో దుర్భరమనిస్తే, క్లబ్బులూ, మిత్రుల ఆవాసాలూ వుండనే వున్నాయి. అయితే, ఒకసారి, ఆమె కాళికారూపం చూసి ఇవాన్ ఇల్యిచ్ నిజంగా బెదిరిపోయాడు. ఆ తిట్లు, ఏడుపులు, పెడబొబ్బలు, సాధింపులు, చేతికి దొరికిందల్లా విసిరేయటాలు, పైనబడి రక్కినంత పనీ చేసి (ఇదంతా అతణ్ణి లొంగదీసుకునే ప్రయత్నం. కనీసం, యికనుండైనా ఆఫీసునుండి నేరుగా యింటికి చేరి, యింట్లో చెప్పినట్టు పడుంటాడని ఆశ) ప్రళయం సృష్టించింది. వివాహ జీవితంలో ఆనందం లేదు.

–కనీసం యిలాంటి భార్యలున్న యింట్లో, తన సుఖశాంతులు మరోచోట, మరో పద్ధతిలో వెదుక్కోక తప్పదు. ఇక నుండి యిలాంటి వుత్పాతాలకు తావియ్యకూడదు అని నిశ్చయించుకున్నాడు. అయితే, నిశ్చయించుకున్నంత మాత్రాన సరిపోతుందా! దానికి కార్యరూపమివ్వద్దూ! తన వుద్యోగ మంటే ఆమెకు విపరీతమైన గౌరవం. అది అడ్డం పెట్టుకుని, వుద్యోగ బాధ్యతలు, వుద్యోగ అవసరాల ముసుగులో ఆమె ప్రచ్ఛన్న దాడుల నుండి రక్షించుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్.

పిల్ల పుట్టిన తర్వాత, పురిటి సమస్యలు, తల్లీ పిల్లల ఆరోగ్యం గురించిన ఆందోళన–తను వాళ్లపట్ల చూపించవలసినంత ప్రేమాభిమానాలు, సానుభూతి చూపించటం లేదనే ఆరోపణలు– ఈ ఆరోపణల్లో ఇసుమంతైనా నిజం లేదని అతడి అభిప్రాయం–

ఇంటి బైటే సుఖముందనే ఆలోచనను ధృడపరిచాయి.

భార్య ప్రవర్తనలో వచ్చిన మార్పు అతణ్ణి ఆఫీసుకు అతుక్కుపోయేలా చేసింది. ఉద్యోగంలో అంచెలంచెలుగా పైకెళ్లడంలోనే తృప్తిని వెతుక్కున్నాడు.

పెళ్లైన సంవత్సరంలోనే చాలా విషయాలు తెలిసివచ్చాయి. దాంపత్య జీవితంలో కొన్ని సౌకర్యాలు లేవని కాదు. కాని నలుగురిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలంటే, పని గురించి పెట్టుకున్నట్టే ఇంటి గురించి కూడా కొన్ని నియమాలు పెట్టుకోవాలి.

ఇవాన్ ఇల్యిచ్ వైఖరిలో మార్పు వచ్చింది. ఇంట్లో సహజంగా సమకూరే వసతులు– భోజనం, చక్కగా అమర్చిన గదులు, పడకసుఖం– తప్ప మరేమీ ఆశించలేదు. పైగా, గృహస్థుడంటే సమాజంలో ఓ గౌరవముంటుంది. ఇక, తృప్తి, ఆనందం, కావాలంటే, అవి కోర్టుపనిలో మాత్రమే దొరుకుతాయి.

ఇవాన్ ఇల్యిచ్ సామర్థ్యానికి, అంకిత స్వభావానికి పై అధికారులు హర్షించారు. మూడేళ్లలో అతనికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రమోషన్ వచ్చింది. బాధ్యతలు నిర్వర్తించటంలో వున్న సంతోషం తెలిసి వచ్చింది. కోర్టులో అనర్గళంగా వాదించి, అందరి మెప్పు పొందటం, ముద్దాయిల నేరాలు నిరూపించి జైలుకు పంపటం, ప్రత్యర్థులను గడగడలాడించడం అతని వుద్యోగంలోని ప్రత్యేక ఆకర్షణలు.

పిల్లలు పుట్టుకొచ్చారు. భార్య మరింత గయ్యాళిగా మారింది. కాని, కొత్త వైఖరిని అలవర్చుకున్న ఇవాన్ ఇల్యిచ్ మీద అది కించిత్తు కూడా ప్రభావం చూపలేదు.

ఏడేళ్ల తర్వాత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హోదాలో మరో వూరికి మకాం మార్చాడు. డబ్బు సమస్య పెరిగింది. భార్యకు కొత్త వూరు నచ్చలేదు. జీతం పెరిగిందన్న మాటేగాని, ఆ వూరి ఖర్చులకవి సరిపోలేదు. ఇద్దరు పిల్లలు మరణించారు. జీవితం చేదుగా వుంది.

ఇబ్బందులన్నింటికీ భర్తనే నిందించింది ప్రస్కోవ్యా. ఏ చిన్న విషయం గురించి మాట్లాడాలనుకున్నా–వుదాహరణకు పిల్లల చదువు–అది పోట్లాటగా మారేది. కోరిక పెరిగి దగ్గరగా వచ్చిన క్షణాలు తప్ప, వాళ్లు కలసి గడిపిన క్షణాలు లేవు– పరస్పరం శతృత్వం అనే మహాసముద్రంలోని చిన్న ద్వీపాలవి. దంపతుల మధ్య దూరం పెరిగింది. ఒకప్పుడైతే ఇవాన్ ఇల్యిచ్ ఈ పరిణామాలకు బాధపడే వాడేమోగాని, యిప్పుడతనికిది చాలా సహజంగా కనిపించింది. సంసారమంటే యిలాగే వుంటుంది గనుక, దీన్నుండి బయటపడి, లేదా అంటీ ముట్టకుండా వుంటూ, నలుగుర్లో మర్యాదస్తుడిగా చలామణీ అవుతూ తను సాధించదలచుకున్న వాటికోసం కృషి చెయ్యాలి. ఇంట్లో వుండేదే తక్కువ. ఆ వున్నకాసేపూ మిత్రులనుగాని, మరెవరినైనా బయటివాళ్లను గాని పిలిచి గడిపే వాడు–భార్యతో ఒంటరిగా వుండకపోతే సరి! అయితే, పని భారంతో అతడు ఏకాంతానికి సాకులు వెదుక్కోవలసిన అవసరం అంతగా రాలేదు. ఉద్యోగం అతడి కవచం. అతడి కోట. అతడి విలాస మందిరం. అధికారం, అనేకమంది తలరాతలను తను రాస్తున్నాననే గర్వం (జైలుకా, ఉరికంబానికా, యింటికా? అని నిర్ణయించేది తనే!) అతణ్ణి ముంచెత్తింది. అనుచరులతో తను కోర్టు హాల్లోకి ప్రవేశించటమే ఒక గొప్ప అనుభవం. అందరూ తలవంచుకుని లేచి నిలబడతారు. తన కనుసైగల కోసం నిరీక్షిస్తారు. పైగా, జడ్జిమెంట్‌లు చెప్పటంలోని తన సామర్థ్యం, చట్ట నిబంధనల గురించి తనకున్న పరిజ్ఞానం పెద్దల మెప్పును కూడా పొందింది. కోర్టు తర్వాత, సహోద్యోగులతో పిచ్చాపాటీ, విందులకు ఆహ్వానాలు, పేకాట, అతడి జీవితంలోని ఖాళీని పూరించాయి. అంటే, యిప్పుడతడికే లోటూ లేదు. ఇంతకన్నా యింకేం కావాలి!

ఇలా, ఏడేళ్లు గడిచాయి. కూతురికి పదహారేళ్లొచ్చాయి. మరోపిల్ల మరణించింది. కొడుకు స్కూల్లో వున్నాడు. వాడి గురించే తనకూ, భార్యకూ మధ్య వాగ్వాదాలు నడిచాయి. వాణ్ణి 'లా' స్కూలుకు పంపించాలన్నాడు తను. కాని, కేవలం తన మాట చెల్లగూడదని భార్య వాణ్ణి మామూలు స్కూలుకు పంపించింది. కూతురు చదువు యింట్లోనే కొనసాగినా బాగానే నేర్చుకుంది. ఏమాట కామాటే చెప్పుకోవాలి. కొడుకు కూడా తెలివైన వాడే. బాగా చదువుకుంటున్నాడు.

## 3

ఇవాన్ ఇల్యిచ్ వైవాహిక జీవితంలో పదిహేడేళ్లిలా గడిచాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాగా అనుభవం గడించాడు. మరో మంచి హోదా కోసం, చిన్న చిన్న ప్రమోషన్లను వదులుకున్నాడు–

కాని అతని ఎత్తుగడ ఫలించలేదు. విద్యాకేంద్రమైన ఒక నగరంలో జడ్జి పోస్టు తనకే ఖాయం అనుకున్నప్పుడు, సహోద్యోగి ఒకడు దాన్నెగరేసుకుపోయాడు. కోపం పట్టలేక, ఇవాన్ ఇల్యిచ్ అతడితో, అతడికి ప్రమోషన్ యిచ్చిన పై అధికారులతోనూ పోట్లాట పెట్టుకున్నాడు. ఫలితంగా అతనికే మరింత నష్టం జరిగింది. ఆ తర్వాత జరిగిన వుద్యోగ నియమాకాల్లో అతణ్ణి విస్మరించారు వాళ్లు.

ఈ సంఘటనలన్నీ 1880లో జరిగాయి. ఇవాన్ ఇల్యిచ్ జీవితంలో అత్యంత దురదృష్టకరమైన సంవత్సరమది. ఖర్చులు యిబ్బడిముబ్బడిగా పెరిగాయి. జీతం సరిపోలేదు. ప్రమోషన్లు దక్కలేదు.

ఇంత చాకిరీ చేసినా పైవాళ్లు తనను గుర్తించలేదు–అన్నింటికన్నా పెద్ద అవమానమిది.

ఇతరులకిది చిన్న విషయమే కావచ్చు గాని ఆయనకది శరాఘాతం. అతని తండ్రికి కూడా కొడుకును ఆదుకోవాలని వూహకు రాలేదు. కల్లోల సముద్రంలో అందరూ అతణ్ణి ఒంటరిగా వదిలేశారు. 3,500 రూబుళ్లు సంపాదిస్తున్న వాడి జీవితం సజావుగానే సాగుతుందనీ–కాదు కాదు, అదృష్ట వంతుడు అనీ–అందరూ అనుకున్నారు. తన బతుకెంత నరక ప్రాయమో ఎవరికి తెలుసు? భార్య సాధింపులు, అప్పులతో మనశ్శాంతి ఎలా వుంటుంది?

ఆ వేసవిలో, డబ్బు ఆదా చెయ్యటం కోసం, కుటుంబ సమేతంగా, బావమరిది యింటికెళ్లాడు. ఆ వూళ్లో పనీపాటా లేక విసుగు రావటమే గాక, ఓ రకమైన బాధ కూడా అనుభవించాడు. ఈగలు తోలుతూ కూర్చోవటం అర్థరహితం, ఏదో చెయ్యాలి అనుకున్నాడు.

నిద్ర లేని ఒక రాత్రి డాబా మీద పచారు చేసి, పీటర్స్ బర్గ్ కెళ్లాలని నిశ్చయించుకున్నాడు. అక్కడ, కొందరితో సంబంధాలు పునరుద్ధరించుకుని, తన ప్రతిభను గుర్తించని పై అధికారులకు బుద్ధిచెప్పటానికి, మరో ప్రభుత్వ శాఖకు బదిలీ చేయించుకోవాలి.

మరునాడు, భార్యా, బావ మరిదీ ఎంత వారించినా వినకుండా పీటర్స్‌బర్గ్ బయల్దేరాడు. అక్కడి కెళ్లటంలో అతడి లక్ష్యం ఒక్కటే, ఎలాగైనా, అయిదు వేల రూబుళ్ల వుద్యోగం సంపాదించాలి. ఏ శాఖలో పని చెయ్యాలి. ఏ వుద్యోగం చెయ్యాలి అన్నది ముఖ్యం కాదు. ఐదు వేలు దొరికితే ఏ పని చెయ్యటానికైనా అభ్యంతరం లేదు– బ్యాంకుల్లో, రైల్వేల్లో, రారాణి మారియాగారి దాతృత్వ సంస్థల్లో, పరిపాలనా శాఖల్లో, చివరికి కస్టంస్ లోనైనా సరే– కాని ఐదువేలు కావాలి. తన నెత్తురు ధారపోసిన శాఖ తన ప్రతిభను గుర్తించనప్పుడు ఎక్కడ పనిచేస్తే ఏం.

అతని ప్రయాణం అనుకున్న దానికన్న మంచి ఫలితాలనే సాధించింది. కుర్స్క్ (రైల్వే) స్టేషన్‌లో పాత పరిచయస్తుడు ఇల్యిన్ తన ఫస్ట్‌క్లాస్ కంపార్ట్ మెంట్‌లోకి ప్రవేశించి కబుర్లు చెప్పే క్రమంలో ఓ ముఖ్యమైన వార్త చేరవేశాడు. గవర్నర్ గారు శాఖాధిపతులలో కొన్ని మార్పులు చేయబోతున్నారు. ఇవానోవిచ్

స్థానంలో సెమ్యోనోవిచ్‌ను నియమిస్తారు. ఇది తనకనుకూలమైన పరిణామం. న్యాయశాఖలో తనకు మంచి పోస్టు ఖరారైనట్టే.

వారం రోజుల తర్వాత భార్యకు టెలిగ్రామిచ్చాడు.

"శుభవార్త. నా ప్రమోషన్ సమస్య పరిష్కారమైంది."

ఎలాగైతేనేం ఇవాన్ ఇల్యిచ్, ఒకేసారి రెండు మెట్లు పైకెక్కి, కార్యసాధకుడనిపించుకున్నాడు. ఇప్పుడు జీతం ఐదువేలు. బదిలీ అయినందుకు అదనంగా ఖర్చుల నిమిత్తం మరో మూడువేల ఆరు వందలు కూడా దక్కాయి. పాత శత్రువుల పట్ల కోపం పటాపంచలైంది. జీవితానందాన్ని మరోసారి చవిచూశాడు.

ప్రస్కోవ్యా కూడా కొన్నాళ్లు కలహాలకు విరామమిచ్చి అనుకూలవతిగా మారింది. పీటర్స్‌బర్గ్‌లో తనకు లభించిన గౌరవ మర్యాదల గురించీ, శత్రువులను తను ఎలా అవలీలగా మట్టి కరిపించిందీ గర్వంగా భార్యకు చెప్పాడు ఇవాన్ ఇల్యిచ్.

భర్త చెప్పిందంతా ఓపిగ్గా విన్నది ప్రస్కోవ్యా. నమ్మినట్టే తలూపింది. ప్రశ్నలు వెయ్యలేదు. కొత్త వూళ్లో సంసారం, కొత్తగా ప్రారంభించడంలోని సమస్యల గురించి ఆలోచించింది. భార్య ఆలోచనా ధోరణితో పూర్తిగా ఏకీభవించాడు ఇవాన్ ఇల్యిచ్. కొన్ని సంవత్సరాల తుఫానులను, ఆటుపోటులను తట్టుకుని, సంసార నావ, జీవన సాగరంలో తిరిగి ప్రశాంతంగా పయనం కొనసాగించబోతున్నది.

సెప్టెంబరు పదినాడు కొత్త వుద్యోగంలో చేరాలి. ప్రస్తుతముంటున్న చోటునుండి, కొత్త వూరికి సంసారం యింకా మార్చలేదు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చెయ్యటానికి కొన్ని రోజులు సెలవు తీసుకున్నాడు. కొత్త వుద్యోగమంటే కొత్త హోదా. కొత్త వస్తువులు కొనాలి. ఇంటిని కొత్తగా అలంకరించాలి. ఈ విషయంలో భార్యవీ, అతనివీ ఒకే ఆలోచనలు.

ఈ దశలో, దంపతులు చాలా దగ్గరయ్యారు. కాని పనిఒత్తిడి మూలాన కలిసి వుండటం వీలు పడలేదు. భార్యను తక్షణమే వెంట తీసుకుపోవాలని కూడా అనుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. కాని, బావమరిదికీ, మరదలికీ ఎక్కడలేని ప్రేమా పుట్టు కొచ్చి, ప్రస్కోవ్యాను కొన్నాళ్లు తమవద్దే వుండ మన్నారు. అందువల్ల, ఇవాన్ ఇల్యిచ్ ఒంటరిగా, వుద్యోగ బాధ్యతలు చేపట్టటానికి బయల్దేరాడు.

ఉల్లాసంగా వుంది. శత్రువులను నిర్జించి సాధించిన విజయం ఒక వైపు, భార్య తన మాట వింటున్నదన్న తృప్తి మరోవైపు. సంతోషం రెట్టింపైంది. మంచి అపార్ట్‌మెంట్ వెదుక్కున్నాడు– భార్య కలలకు ప్రతిరూపమా అన్నంత అందంగా వుందా ఇల్లు. ఎత్తైన సీలింగ్, విశాలమైన డ్రాయింగ్ రూం, చక్కని స్టడీ రూం. కూతురికీ, కొడుక్కూ వేర్వేరు గదులు. తన కోసం మాస్టర్ బెడ్ రూం. ఒక టేమిటి–తన కోసమే కట్టించినట్టుగా వుందది. ఇంటిని స్వయంగా అలంకరించటానికి పూనుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. వాల్ పేపర్, ఫర్నిచర్, ఎక్కువగా ఆంటిక్స్ ఎంపిక చేశాడు. అంతా తననుకున్నట్టే జరుగుతున్నది. ఫర్నిషింగ్ పూర్తయిన తర్వాత, అతిథులందరూ దీన్ని 'మాడల్ అపార్ట్‌మెంట్' అనటం ఖాయం. అలసి సోఫాలో వాలినప్పుడు కళ్లు మూత పడ్డాయి. డ్రాయింగ్ రూం హుందాతనం కలలో కన్పించింది. అలంకరణ వస్తువులూ, ఫర్నిచర్, పరదాలు వుండవలసిన స్థానంలో వుంటే ఆ హాలు అందం పొగడతరమా! తను యింత మంచి యిల్లు సంపాదించినందుకు పిల్లలెంత సంతోషిస్తారు !ధర తక్కువైనా, ఖరీదైనవనిపించే వస్తువులు కొన్నాడు. వాళ్లీ రహస్యం తెలుసుకోలేరు. డబ్బులు ముఖ్యం కాదు. ఘరానా మనుషుల నివాసం అనిపించటం ముఖ్యం. ఇంటిమీద మమకారం ఎంత పెరిగిందంటే కోర్టు పని మీద శ్రద్ధ తగ్గింది. సీరియస్‌గా విచారణ జరుగుతున్నప్పుడు పరదాల రంగు గురించీ, వాల్ పేపర్ గురించీ, అలంకరణ సామాగ్రి గురించీ ఆలోచించాడు. ఒకసారి. పనివాళ్లకు, పని పురమాయించటం కోసం, చిన్న నిచ్చెన ఎక్కినప్పుడు, బాలెన్సు తప్పి కిందపడినంత పనైంది. కాని నేర్పుగా, తలుపుకొక్కెం పట్టుకుని నిభాయించుకున్నాడు. ఆ ప్రయత్నంలో, పక్కటెముకలకేదో నొక్కినట్టై కాస్త నొప్పెంది. కాని, వెంటనే తగ్గిపోయింది. అయినా, ఇల్లు సమకూర్చుకుంటున్న ఆనందంలో యిది ఏపాటి!

"నా వయస్సు పదిహేనేళ్లు తగ్గి యవ్వనం తిరిగి వచ్చినట్టుగా వుంది" అంటూ భార్యకు వుత్తరం రాశాడు. సెప్టెంబరులోనే యింటిపని పూర్తి కావాలి. కాని అక్టోబర్ మధ్య దాకా కొనసాగింది. కాస్త ఆలస్యమయితేనేం, అంతా, చక్కగా, అనుకున్నట్టుగా జరిగింది. చూసినవాళ్లు కళ్లు తిప్పుకోనేంత అందంగా వుందిల్లు.

నిజానికది, మధ్యతరగతి వాళ్లు, ధనికుల్ని అనుకరిస్తూ యిళ్లు అలంకరించుకుంటారే, అలాగే వుంది–అలాంటి యిళ్లన్నీ ఒక్కలాగే వుంటాయి. పై తరగతికి చెందినట్టుగా కనిపించాలనే కోరికతో దిగువ తరగతులవాళ్లు యిళ్లను అలా చవకబారు వస్తువుల్తో అమర్చుకుంటారు. చూసినవాళ్లకా విషయం యిట్టే తెలిసిపోతుంది గాని యింటి యజమానులు దాన్నెప్పుడూ గ్రహించరు. స్టేషనుకెళ్లి, భార్యా పిల్లల్ని రిసీవ్ చేసుకుని, యూనిఫాం వేసుకున్న పని మనుషులు తలుపు తీయగా, ధగధగా వెలిగిపోతున్న యింట్లోకి ప్రవేశించి, ఒకొక్క గదీ తిరుగుతూ, ఆ అందాలు వర్ణించి, వాళ్ల పొగడ్తలు విని పొంగిపోయి వుబ్బితబ్బిబ్బయ్యాడు ఇవాన్ ఇల్యిచ్. ఆ సాయంత్రం, టీ తాగుతున్నప్పుడు భర్తకు జరిగిన ప్రమాదం గురించి ప్రశ్నించింది ప్రస్కోవ్యా. పెద్దగా నవ్వి, తను ఎంత చాకచక్యంగా, పడిపోకుండా రక్షించుకున్నాడో నటించి చూపాడు ఇవాన్ ఇల్యిచ్.

"ఆరోగ్యం బాగుంది. అవయవాల్లో సత్తువుంది. ఎగరగలను. దుంక గలను. మరెవరైనా అయితే, చచ్చివూరుకునేవాడే కాని నేనో, యిదిగో, చెక్కు చెదరలేదు. ఇక్కడ కాస్త బొడిపె మాత్రం వచ్చింది. ఇంకా కాస్త నొప్పిగా వుందనుకో. కాని, త్వరలో అదికూడా పోతుంది. చాలా చిన్న దెబ్బ."

కొత్త యింట్లో సంసారం కొనసాగింది. ఎంత యిష్టపడినా, అంతా బాగానే వుంటుంది గాని, ఒక గది చిన్నదనిపిస్తుంది. వచ్చే జీతం అవసరాల కెప్పుడూ సరిపోదు. కనీసం అయిదు వందలు ఎక్కువ వస్తే ఎంత బాగుండునని పిస్తుంది. అయితేనేం పెద్దగా యిబ్బందులు లేవు. కొత్త ఫర్నిచర్‌తో, వస్తువులతో నిండిపోయింది అపార్ట్‌మెంట్. ఉన్నవి సరిపోదన్నట్టు, మరిన్ని కొన్నారు. ఇక్కడివి తీసి అక్కడా అక్కడివి తీసి యిక్కడా పెట్టారు. అప్పుడప్పుడు అభిప్రాయ భేదాలు వచ్చినా, ఆ తగువులు కూడా మధురంగానే వున్నాయి. ఇంట్లో ఏం తోచటం లేదన్నప్పుడు ఇరుగు పొరుగుల్ని, మిత్రుల్ని, పార్టీలకు ఆహ్వానించారు.

ఇవాన్ ఇల్యిచ్, వుదయం కోర్టుకెళ్లి డిన్నర్ టైంకు యింటికి చేరుకుంటాడు. అయితే, యింటి పరిస్థితి చూసి మనసు చివుక్కుమంటుంది. (టేబుల్ క్లాత్ ముడతలు పడి వుంటుంది. తివాసీకి పోగులూడి ఉంటాయి. పరదాలు వుండవలసిన పద్ధతిలో వుండవు. తను ప్రాణప్రదంగా అమర్చుకున్న యిల్లు. 'కొందరి' అశ్రద్ధవల్ల యిలా నిరాదరణకు గురి అవుతుందనే ఆవేదన). మొత్తం మీద ఇవాన్ ఇల్యిచ్ జీవితం తను ఆశించినట్టుగానే కొనసాగింది–శుభంగా, సరదాగా, నలుగురిలో తలెత్తుకుని తిరిగే పద్ధతిలో. రోజూ, వుదయం తొమ్మిదింటికి లేస్తాడు. కాఫీ తాగి, వార్తా పత్రికలు తిరగేసి కోర్టుకెళతాడు. అప్పటికే అనేకమంది కూర్చుని అరిగిపోయిన పాత సీట్లో కూర్చుని పని ప్రారంభిస్తాడు. పిటిషనర్లు, ఆఫీసుకు వచ్చే నివేదనలు, తాకీదులు, వుత్తరాలు, కోర్టు సెషన్లతో రోజు గడిచిపోతుంది. ఆలోచించాల్సిన అంశం ఏదైనా వుంటే పక్కన పెట్టేయాలి–ఎందుకొచ్చిన తలనొప్పి. సహోద్యోగులతో, కింది వాళ్లతో "ఆఫీసు సంబంధాలు"

మాత్రమే పెట్టుకోవాలి. "వ్యక్తిగతం" అంటూ ఏమీ వుండకూడదు. అంతా కేవలం "అఫీషియల్". ఉదాహరణకు, ఎవరో ఒకరు వచ్చి ఏదో సమాచారం కావాలంటారు. కాని, వుద్యోగిగా తను యితర బాధ్యతలు నిర్వర్తిస్తూన్నందువల్ల, అతడి అభ్యర్థనను తోసిపుచ్చక తప్పుదు. కాని, అదే వ్యక్తి, తన పరిధిలోవున్న, కోర్టుకు సంబంధించిన విషయం అడిగితే, నిబంధనలకు లోబడి అంగీకరించక తప్పదు. అప్పుడు కాస్త స్నేహంగా వుంటాడు. అవసరమనుకుంటే మర్యాద కూడా చూపిస్తాడు. అయితే, ఆ పని పూర్తికాగానే, పరిచయం ముగుస్తుంది. వ్యక్తిగత జీవితానికీ, వుద్యోగ జీవితానికీ దూరం పాటించడంలో ఇవాన్ ఇల్యిచ్ గొప్ప ప్రావీణ్యం సంపాదించాడు. అనేక సంవత్సరాల అనుభవంతో, అప్పుడప్పుడూ, సరదాగా, రెంటినీ కలిపి ఒక 'క్రీడ' లాగా ఆనందించాడు. తనవంటి నిష్ణాతులకు మాత్రమే అది సాధ్యం. బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు కూడా, టీ తాగుతూ, సిగార్ కాలుస్తూ రాజకీయాల గురించీ, యితర విషయాల గురించీ పిచ్చాపాటీ మాట్లాడేవాడు. అలాగ, సంగీత కచేరీలో, తన వాయిద్యం అద్భుతంగా వాయించిన సంగీత కళాకారునిలాగా, గర్వంగా యింటికి చేరటం అలవాటు చేసుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. అప్పటికి, భార్యా, కూతురూ యిరుగు పొరుగుల యిళ్లలో బాతాఖానీ కొడుతుంటారు. కొడుకు స్కూలు నుండి యింకా తిరిగిరాడు. లేదా ప్రైవేటు ట్యూటర్ వద్ద స్పెషల్ క్లాసులకు వెళ్లివుంటాడు. ఇబ్బందేమీ లేదు. అంతా హాయిగా వుంది. డిన్నర్ తర్వాత, అతిధులెవరూ లేకపోతే, అప్పుడు సంచలనం రేకెత్తించిన పుస్తక మేదైనా కాసేపు చదువుతాడు. లేదా ఆఫీసు కాగితాలు ముందరేసుకుని కూర్చుంటాడు. కోర్టుపనితో అతనికి విసుగెత్తినరోజు లేదు. పేకాట వుంటే ఈ పని విసుగేగాని, ఒంటరిగా వున్నప్పుడు ఇదీ కాలక్షేపానికి బాగానే వుంటుంది-భార్యతో గడపటం కంటే మేలే. హోదా గలవాళ్లను డిన్నరు పార్టీలకు ఆహ్వానించటం అలవాటు చేసుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. అతడు గర్వపడే డ్రాయింగ్ రూం లాగే, ఆ డిన్నరు పార్టీలు కూడా సర్వసాధారణమైనవే.

ఒక సాయంత్రం డాన్సు పార్టీ ఏర్పాటు చేశాడు ఇవాన్ ఇల్యిచ్. పార్టీ అనుకున్నదానికన్న బాగా జరిగింది గాని పేస్ట్రీలు, మరేవో తినుబండారాల గురించి భార్యతో భయంకరమైన పోట్లాట జరిగింది. వాటిని ఎలా తయారు చేయాలి అనే విషయమై ఆమెకు కొన్ని స్థిరమైన అభిప్రాయాలున్నాయిగాని ఇవాన్ ఇల్యిచ్ ఖరీదైన బేకరీ నుండి తెప్పిస్తానని పట్టుపట్టాడు. పార్టీ ముగిసే సరికి, కొన్ని పేస్ట్రీలు మిగిలిపోయాయి. బిల్లు నలభైఅయిదు రూబుళ్లయింది. పోట్లాట ఎందాకా పోయిందంటే, ప్రస్కోవ్యా భర్తను "చేత కాని మూర్ఖుడనీ", దుబారాగాడనీ తిట్టింది. రెండు చేతుల్తోనూ తలపట్టుకుని విడాకుల గురించి సీరియస్‌గా ఆలోచించాడు ఇవాన్ ఇల్యిచ్. అయితే, పార్టీ బాగానే జరిగింది. 'ప్రిన్సెస్ తృఫోనోవా' ('నీ బాధ నాది' అనబడే దాతృత్వ సంస్థను స్థాపించిన తృషనోవాగారి సోదరి ఈవిడ) తో డాన్సు చేశాడు ఇవాన్ ఇల్యిచ్.

ఇవాన్ ఇల్యిచ్‌కు బాధ్యతలు నిర్వర్తించడం గర్వంగా వుంటుంది. సమాజంలోని పెద్ద మనుషులతో కలసి తిరగటంతో యితర్ల కన్న వున్నతుణ్ణనే అహంభావంతో నిండిన ఆనందం వుంటుంది. పేకాటలో మాత్రమే నిజమైన సంతోషం వుంటుంది. జీవితంలో ఎన్ని ఆటుపోటులు రానీ. సంసారం మరెంత ముళ్లకంపగా మారినా సరే. చీకట్లో చిరుదివ్వెలాగ, మిత్రులతో కలిసి ఆడే పేకాటను మాత్రం వదులుకోడు. (నిజానికి నలుగురే ఆడాలి అది. కాని తరచుగా అయిదుగురు కూర్చుంటారు. అయినా ఫరవాలేదు) పైగా, పేకాటలో భోజనంతో పాటు వైను కూడా వుంటుంది. పేకాట తర్వాత-ముఖ్యంగా గెలిచినప్పుడు-హాయిగా నిద్ర పడుతుంది.

అలా గడిచింది జీవితం-మర్యాదస్తుల సాంగత్యంలో, మర్యాదగా. వదిలించుకోదలచిన తక్కువ రకం మనుషుల్ని వదిలించుకుని. ఘరానా వాళ్ళను మాత్రమే ఎంచుకో గలగటం ఓ కళ. ఈ విషయంలో భార్యా భర్తలది ఏకాభిప్రాయమే. పేదవాళ్లొస్తే గుమ్మంలోనే మాట్లాడి పంపించటమెలాగో పెద్దమనుషులొస్తే, లోపలికి ఆహ్వానించి, ప్రత్యేకంగా భద్రపరిచిన జపనీస్ ప్లేట్లలో పిండివంటలు వడ్డించటంచటమెలాగో యిద్దరికీ తెలుసు. అతడి పేకాట మిత్రులదీ యిదే స్వభావం. "అవాంఛితులకు వాళ్ల గ్రూపులో ప్రవేశం నిషేధం"

ఉన్నత కుటుంబాలకు చెందిన యువకులు ఇవాన్ ఇల్యిచ్ కూతురు లిజాంకాతో స్నేహానికి వువ్విళ్లూరుతారు.

"కోరుకోవటానికేమీ లేదు" అనుకోగలిగిన జీవితం అది.

## 4

ఇంట్లో అందరి ఆరోగ్యమూ బాగానే వుంది. ఇవాన్ ఇల్యిచ్‌కు అప్పుడప్పుడూ నోరు అరుచిగా వున్నట్టనిపించింది. ఛాతీలో ఎడం వైపు కాస్త నొప్పిగా తోచింది. కాని, అంత మాత్రాన, దాన్ని అనారోగ్యమనటం భావ్యం కాదు.

అయితే ఆ యిబ్బంది తగ్గలేదు సరిగదా నెమ్మదిగా పెరిగింది. చిన్నదైనా, పెద్దదైనా నొప్పిని భరించటం కష్టమే. భరించలేనప్పుడు ఇవాన్ ఇల్యిచ్ చిర్రుబుర్రులాడాడు. కోపం పట్టలేక తిట్లు కూడా ప్రారంభించాడు. హాయిగా, ఆనందంగా సాగుతున్న తన జీవన నావ ఒడుదుడుకుల పాలైనందుకు గుండె పగిలింది. దంపతుల మధ్య పోట్లాట లిప్పుడు రోజువారీ వ్యవహారమైనాయి. సఖ్యత, సర్దుకుపోవటం అనే మాటలిద్దరూ మరిచిపోయారు. పలకరించుకోవటమంటే మాటల యుద్ధమే. మాటలు లేకపోయినా యిల్లు యుద్ధరంగమే. కల్లోల సముద్రంలో ద్వీపాలు లేవని కాదు. కాని, యిప్పుడు వాటిని గుర్తించటం కష్టం. పొరబాటున యిద్దరూ ఎదురు పడ్డారంటే, అరుపులూ కేకలే.

ఇలాంటి భర్తను భరించటం కష్టమని చెప్పుకోవటానికి ప్రస్కోవ్యాకిది మంచి అవకాశం. ఏమీ లేనప్పుడు కూడా చిలవలు పలవలు కల్పించటం అలవాటున్న ఆమె, భర్త మొదటి నించీ యింతే అని అందరికీ చెప్పుకుంది. ఇలాంటి మనిషితో యిరవైఏళ్లు నెగ్గుకొచ్చానంటే, ఓపిగ్గా తనెన్ని ఆగడాలు భరించి వుంటానో వూహించుకొమ్మంది. ఇటీవలి పోట్లాటకతడే కారణమన్న మాట వాస్తవమే. డిన్నరుకు కూర్చున్నాడో లేదో ప్రతిదాని గురించీ తప్పులెన్నటం ప్రారంభిస్తాడు.

సూప్‌తో ప్రారంభమవుతుంది అతడి విమర్శ. ప్లేటు అంచుల దగ్గర కొద్దిగా పగిలిందంటాడు. ఏది వడ్డించినా సరే, "ఇది మనుషులు తినే తిండా?" అని వ్యంగ్య బాణం సంధిస్తాడు. కొడుక్కు టేబిల్ మీద మోచెయ్యి పెట్టడం ఎవరు నేర్పించారంటాడు. కూతురు జుత్తు అలా చింపిరిగా ఎందుకుంది, దువ్వుకోవటం అలవాటు చెయ్యొద్దా అంటాడు. మొత్తం మీద ఏ చిన్న తప్పు ఎవరు చేసినా, ప్రస్కోవ్యాదే బాధ్యత. మొదట ఆమె సర్ది చెప్పటానికి ప్రయత్నించింది. తరువాత ప్రతిఘటించింది. మరికొన్నాళ్ల గ్గాని అర్థం కాలేదు-తింటున్నప్పుడు అతడికేదో శారీరక బాధ పెరుగుతున్నట్టుంది. అందువల్లే అంతు పట్టలేని కోపం. ఆ పరిస్థితిలో మాటలు పెంచి లాభమేమి? ఎంత త్వరగా భోజనం ముగించి, టేబుల్ దగ్గర నుండి లేస్తే అంత మంచిది. ఎన్ని కష్టాలు వచ్చినా, భర్త ఎంత అవమానించినా, సంయమనం పాటించడమే తన గొప్ప సుగుణం అనుకుంది ప్రస్కోవ్యా. భర్త అనారోగ్యం వల్లే తనకీ పరిస్థితి ఏర్పడింది గదా అని తనమీద తను జాలిపడింది. ఆ జాలితోపాటు భర్త పట్ల ద్వేషం కూడా పెరిగింది. ఈ మనిషి చచ్చినా బాగుండుననుకుంది. కాని, ఆ కోరిక తీరినా కష్టమే. భర్త లేకపోతే, నెలసరి

ఆదాయం ఎక్కణ్నుంచి వస్తుంది? ఇది మరీ దారుణం. తను అసహ్యించుకునే వ్యక్తి మీద అధారపడి బతకటమంత నీచమైన స్థితి మరేముంటుంది!

ఓపిక పట్టటం కష్టమైపోతున్నది. అలా, తనను తాను కంట్రోల్ చేసుకునే ప్రయత్నంలో కోపం మరింత పెరిగింది.

ఒకసారి నిష్కారణంగా కలహం ప్రారంభించాడు ఇవాన్ ఇల్యిచ్. ఆ విషయం అతడికీ తెలుసు. వెంటనే, తన కోపానికి, కారణం అనారోగ్యం అని వివరణ యిచ్చుకున్నాడు. పరిస్థితి అంత దారుణంగా వుంటే డాక్టరుకెందుకు చూపించుకోవడం లేదంది ప్రస్కోవ్యా.

నగరంలో కెల్లా పెద్ద వైద్యుణ్ణి సంప్రదించాడు ఇవాన్ ఇల్యిచ్. ఈ తతంగం ఎలా వుంటుందో తనకు తెలుసు. మొదట వెయిటింగ్ రూంలో నిరీక్షించాలి. తరువాత, తనంత ముఖ్యమైనంత వ్యక్తి ప్రపంచంలో మరెవరూ లేనట్టుగా డాక్టరు నుండి పిలుపు వస్తుంది. (కోర్టులో కూడా కార్యక్రమం యిలాగే వుంటుంది) ప్రాథమిక పరీక్ష తర్వాత పేషెంటు చెప్పింది ఓపిగ్గా వింటాడాయన. అనారోగ్యానికి కారణం తెలిసినా, అనవసరమైన కొన్ని ప్రశ్నలకు అనవసరమైన సమాధానాలు చెప్పాలి. ఆ తర్వాత 'ఏం ఫర్వాలేదు. నేనున్నానుగా. అంతా నాకొదిలేసి నిశ్చింతగా వుండండి. ఏం చెయ్యాలో నాకు తెలుసు. చిన్నా పెద్దా అనే తేడాలు నా వద్ద వుండవు. అందరికీ ఒకే వైద్యం." అంటాడు. అవును. కోర్టులో తనూ యిలాగే 'ప్రవచిస్తాడు.' విచారణ జరుగుతున్నప్పుడు ముద్దాయిలతో తను ఎలా ప్రవర్తిస్తాడో, డాక్టరు తనతోనూ అలాగే ప్రవర్తించాడు.

డాక్టరు వువాచ- ఫలాని ఫలాని లక్షణాలను బట్టి నీకు ఫలాని ఫలాని జబ్బులున్నట్టుగా తెలుస్తున్నది. మరికొన్ని పరీక్షల తర్వాత వ్యాధిని నిర్ధారిస్తాం. ఆ తర్వాత, దానివల్ల వచ్చే ఫలాని ఫలాని పరిణామల గురించి వివరంగా మాట్లాడుకుందాం. మన పరీక్షలో, అనుకోని విషయాలు మరేమైనా తేలితే.... నావుద్దేశమేమంటే... "ఇవాన్ ఇల్యిచ్‌కు ఈ సోది అంతా వినే ఓపిక లేదు. తన పరిస్థితి బాగుపడే అవకాశముందా లేక సీరియస్ వ్యవహారమా? అని తెలుసుకుంటే చాలు. అయితే, పేషెంటు వ్యక్తం చేసిన యింత ముఖ్యమైన సందేహానికి కించిత్తు విలువ కూడా యివ్వలేదు డాక్టరు. అసలిది చర్చించవలసిన విషయమే కాదన్నాడు. రోగనిర్ధారణ ముఖ్యం. ఈ నొప్పికి కారణం ఏమిటి? జారిపోయిన మూత్ర పిండం, లేక శ్వాస సంబంధిత వ్యాధి లేక అపెండిసైటిస్? అతడి ఆలోచన ఇవాన్ ఇల్యిచ్ ప్రాణం గురించి కాదు. జారిన మూత్రపిండానికి, అపెండిసైటిస్ కూ మధ్య జరుగుతున్న సంఘర్షణను పరిష్కరించటం ఎలా? అని మాత్రమే. అపెండిసైటిస్ వైపే మొగ్గు చూపించి- అయితే, మూత్ర పరీక్ష తర్వాత లభించిన కొత్త సాక్ష్యాలను బట్టి మాత్రమే ఏ విషయమైనా నిర్ధారించటం జరుగుతుంది. ఇలాంటి విచారణ కొన్ని వేల సార్లు తన కోర్టులో జరిపాడు ఇవాన్ ఇల్యిచ్-తను వున్నతాసనం మీదా, ముద్దాయి బోనులో. రహస్యం తెలిసిందన్న సంతోషంతో బలే వుత్సాహంగా వున్నాడు డాక్టరు. కళ్ళద్దాలు సవరించుకుంటూ 'ఖైదీ' వైపు తదేకంగా చూశాడు. చివరగా ఆయన చెప్పినదాన్నిబట్టి పరిస్థితి అంత సంతృప్తికరంగా ఏమీ లేదు కాని యిది డాక్టరుకు గానీ, మరెవరికి గానీ సంబంధించిన విషయం కాదు. పేషెంటే ఆలోచించుకోవాలి. డాక్టరు చెప్పిన మాటలు ఇవాన్ ఇల్యిచ్‌ను షాక్ చేశాయి. ఇంత నిర్లిప్తంగా, ఎదుటి మనిషి బాధను పట్టించుకోని డాక్టరును సంప్రదించినందుకు తనమీద తనకే జాలేసింది.

కాని పోట్లాడీ, మాటలు పెంచుకునీ ప్రయోజనమేమి? లేచి, ఫీజు డబ్బులు టేబుల్ మీద పెట్టి, నిట్టూర్చి, "నిజమేనండీ డాక్టరుగారూ, మాలాంటి జబ్బు మనుషులు తలాతోకాలేని ప్రశ్నలు వేసి మీ కాలం వృధా చేస్తారు. కాని, యింతకూ, నా వ్యాధి సీరియసో కాదో చెప్పలేదు." అన్నాడు.

డాక్టరు నిర్దయగా కళ్లద్దాల్లోంచి చూస్తూ," ఖైదీ, నీ వరస మారకపోతే, కోర్టు హాల్లోంచి బైటికి పంపించాల్సి వస్తుంది." అన్నట్టుగా "చెప్పాల్సింది చెప్పాను. పరీక్ష తర్వాత ఏం తేలుతుందో చూద్దాం" అంటూ కన్సల్టేషన్‌కు ముగింపు పలికాడు.

గది నుండి నెమ్మదిగా నడిచివచ్చి స్లెడ్జి బండిలో యింటికి బయల్దేరాడు ఇవాన్ ఇల్యిచ్. మనసులో డాక్టరు మాటలే మెదులుతున్నాయి. ఆ సాంకేతిక పదాలను తన భాషలోకి మార్చుకుంటే ఏమర్థమవుతుంది? తన పరిస్థితి సీరియసా, అతి సీరియసా? లేక పెద్దగా, ఆందోళన చెందవలసిన దేమీ లేదా? డాక్టరు చెప్పిన దాని సారాంశం "వెరీ సీరియస్" అనే తను గ్రహించాడు. వీధుల్లో విషాద వాతావరణం కనిపించింది. బండి నడిపేవాడు, ఇళ్లు, రోడ్డు మీది జనం, దుకాణాలు-అంతటా, సర్వజీవాల్నీ, వస్తువులనూ విషాదం కమ్మేసింది. పెద్దగా పట్టించుకోనవసరం లేదనుకున్న నొప్పికి డాక్టరు కొత్త భాష్యం చెప్పాడు. 'చిన్న ఇబ్బంది' అనుకున్న దాని పరిణామం ప్రాణాంతకమా?

ఇంటికి చేరి, భార్యకు జరిగిందంతా చెప్పాడు. ఆమె ఓపిగ్గానే విన్నది కాని మధ్యలో, డ్రెస్సు వేసుకుని, హ్యాటు పెట్టుకుని వచ్చిన కూతురు, తల్లితో కలిసి బజారుకెళ్లాలంది. తప్పదన్నట్టుగా కాసేపు వినటానికి ప్రయత్నించిందిగాని, ఎక్కువసేపు ఓపిక పట్టలేక పోయిందామె . భార్యకూడా అంత వివరంగా తెలుసుకోవటం అనవసరమని భావించి, కూతురితో కలిసి నిష్క్రమించే క్రమంలో,

"డాక్టరు దగ్గరకు వెళ్లటం మంచిదైంది. మందులు వేళ తప్పకుండా వేసుకో. డాక్టరు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ నాకివ్వు. పనిమనిషితో తెప్పిస్తాను" అంది.

ఆమె వున్నంత సేపూ గుక్క తిప్పుకోకుండా మాట్లాడిన ఇవాన్ ఇల్యిచ్, ఆమె వెళ్లిపోగానే, "నిజమే. ఆందోళన చెందవలసిందేమీ కాదేమో." అనుకున్నాడు.

డాక్టరు చెప్పిన సూచనలన్నీ పాటించాడు. మందులు వేసుకున్నాడు-మూత్ర పరీక్ష తర్వాత మందులు మారాయి. అయితే, ట్రీట్‌మెంట్ గురించి కొంత గందరగోళం ఏర్పడింది. ఎంత అడిగినా డాక్టర్ ఏమీ చెప్పడు. కాని జరగవలసిన చికిత్స జరగటం లేదనిపించిది. కొన్ని ముఖ్యమైన విషయాలు ఆయన గమనించి వుండకపోవచ్చు లేదా తన నించి దాస్తుండవచ్చు. లేదా అబద్ధాలాడుతుండి వుండవచ్చు. ఏదేమైనా, డాక్టరు ఆదేశాలు తు.చ తప్పకుండా పాటించాడు ఇవాన్ ఇల్యిచ్. కొంత ఫలితం కూడా కనిపించినట్టే వుంది.

శరీరం డాక్టరు అధీనంలోకి వెళ్ళిన తర్వాత ఇవాన్ ఇల్యిచ్ జీవితం మారిపోయింది. ఆరోగ్యం, మందులు, రోగ లక్షణాలను గమనించటం తప్ప మరో ధ్యాస లేదు. ఇతర రోగులను చూసినప్పుడూ, లేదా తనలాంటి సమస్యతో బాధపడి మరణించిన వాళ్ళ గురించి విన్నప్పుడూ లోపల అనేక సందేహాలూ, భయాలు వుప్పెనలా పెరిగేవి.

నొప్పి తగ్గలేదు. కాని, వ్యాధి తగ్గుతున్నదని తనను తాను నమ్మించుకునే ప్రయత్నం చేశాడు ఇవాన్ ఇల్యిచ్. మామూలుగా తిరగ గలిగినప్పుడు దాని గురించి ఆలోచించటమెందుకనుకున్నాడు. కాని, భార్యతో పోట్లాడినప్పుడూ, పేకాటలో పోగొట్టుకున్నప్పుడూ, అనుకున్నవి అనుకున్నట్టుగా జరగనప్పుడూ నొప్పి గుర్తుకువచ్చి బాధించింది. ఇలాంటి సమస్యలు, ఇది వరలో ఎదురైనప్పుడు, వాటిని త్వరలో అధిగమించగలననే ధైర్యముండేది. అజేయులనుకున్న శత్రువులను మట్టి కరిపించిన సందర్భాలెన్ని లేవు! కాని యిప్పుడు పరిస్థితి మారింది. బేలతనం వచ్చేసింది. "ఆరోగ్యం కాస్త మెరుగు పడుతుందనుకున్నప్పుడల్లా దురదృష్టం నన్ను వెంటాడుతుంది. ఏదో ఒకటి జరిగి పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది." అని ఆత్మనింద చేసుకున్నాడు. తనకు గిట్టని వాళ్లమీద వచ్చే క్రోధాగ్ని, తననే దహించి వేస్తున్నదని కూడా

గ్రహించాడు. కాని, లోపలి మంటల్ని ఆర్పటం అసాధ్యం. తన వుద్వేగాలు తనకే శత్రువులుగా మారి, ఆరోగ్యాన్ని మరింత దిగజారుస్తున్నప్పుడు, ఎవరు ఏమన్నా, ఏం చేసినా, ఎలా ప్రవర్తించినా పట్టించుకోకపోవటమొక్కటే పరిష్కారం. అనారోగ్యం గురించి కూడా బెంగ పెంచుకోకూడదు కాని, అతడి ఆలోచనలు తద్వ్యతిరేకంగా కొనసాగాయి. 'తనకు మనశ్శాంతి కావాలి.' అనుకుని, ఎవరు తనకు నచ్చని పని చేసినా కోపంతో రగిలిపోయాడు. అతడు చేసిన అన్నింటికన్నా పెద్ద పొరబాటు వైద్య గ్రంథాలు చదవటం, మరింత మంది డాక్టర్లను సంప్రదించటం. క్రమేపీ అతడి పరిస్థితి ఎంత నెమ్మదిగా దిగజారిందంటే, "నిన్నటికీ ఈవాళ్టికీ పెద్ద తేడా లేదులే" అనుకుంటూ గడిపాడు. కాని, డాక్టర్లను కలిసిన ప్రతిసారీ "ఆరోగ్యం మరింత పాడైం" దన్నారు వాళ్లు. అయినా, అతడు వాళ్లను సంప్రదించటం మానలేదు.

కొన్నాళ్లకు ఇవాన్ ఇల్యిచ్ మరో ప్రముఖ వైద్యుణ్ణి కలిశాడు. ఈ ప్రముఖుడు, మరో ప్రముఖుడు చెప్పిందే కాస్త డొంక తిరుగుడుగా చెప్పాడు. అందువల్ల అతడి భయాలు, సందేహాలు మరింత పెరిగాయి. తన మిత్రుని మిత్రుడైన మరో డాక్టరు నొప్పికి కొత్త భాష్యం చెప్పాడు.

"వ్యాధి తగ్గే అవకాశముంది" అంటూనే, అతడు పెట్టిన షరతులు "యిలా యిలా జరిగితే యిలా యిలా చెయ్యాలి" అంటూ చేసిన వ్యాఖ్యానాలు చూస్తే ఇవాన్ ఇల్యిచ్ భయం యిసుమంతైనా తగ్గలేదు సరిగదా మరింత పెరిగింది. ఒక హోమియోపతి వైద్యుడు, జబ్బును మరోరకంగా నిర్ధారించి, మందులిచ్చాడు, ఎవరికీ తెలియకుండా, వారం రోజులపాటు, అవి కూడా వేసుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. వారం తర్వాత, ఏ ఫలితమూ కనిపించక పోవటంతో, హోమియోపతీతో పాటు, అన్ని వైద్య విధానాల మీదా నమ్మకం సడలి మరింతగా నిరాశలో కూరుకుపోయాడు.

ఒకసారి ఒక ముసలావిడ, కొన్ని ప్రతిమలను పూజిస్తే మహిమలు జరుగుతాయని చెప్పింది. ఆ మాటల్ని పూర్తిగా విశ్వసించిన ఇవాన్ ఇల్యిచ్ అది సాధ్యమనే అనుకున్నాడు. కాని, వెంటనే సందేహం వచ్చి "నేనింత మూర్ఖంగా ఎలా ఆలోచిస్తున్నాను? ఇలాంటి పిచ్చిమాటలు నమ్మి మోసపోవటం కన్నా ఒక మంచి డాక్టర్ని సంప్రదించి, అతడు చెప్పినట్టుగా చేయటం శ్రేయస్కరం గద!" అనుకున్నాడు.

అయితే, ఇలాంటి నిర్ణయాలు చేసుకోవటం సులభమేగాని పాటించటం అసాధ్యం. నొప్పి తిరగబెట్టినప్పుడల్లా నిస్త్రాణ వచ్చేది. ఆ బాధ ఓ పట్టాన తగ్గేది కాదు. ఇక వుపశమనం వుండదేమోననిపించేది. ఏదీ రుచించదు. శ్వాసకూడా ఏదో వాసన వేస్తున్నట్టు తోచేది. ఆకలి లేదు. బరువు తగ్గింది. ఇంక వ్యాధి తగ్గుతుందనే భ్రమల్లో గడపటం అనవసరం. శరీరంలో కొత్త కొత్త మార్పులు వస్తున్నాయి. ఇంతవరకూ తెలియని అనుభవం తనను సమీపిస్తున్నది. చూసేవాళ్ళది గ్రహించలేరు. లోపల జరుగుతున్న మార్పులు తనకు మాత్రమే తెలుసు. పైగా తన గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఎవరికున్నది! బాహిర్ ప్రపంచంలో ఏమీ మార్పు లేదు. జరిగేదంతా లోపలే. అతని ఆందోళన పెరగటానికి కారణమిదే. ఇంట్లో వున్న మనుషులు-ముఖ్యంగా తన భార్యా కూతురూ-బయట తిరిగి రావటానికిష్టపడుతారే తప్ప, తనేదైనా చెప్పబోతే, విసుక్కుంటారు. "జరిగిందానికి బాధ్యత నీదే. మమ్మల్నెందుకు సాధిస్తావు" అన్నట్టుగా చూస్తారు. స్పష్టంగా చెప్పరు గాని తన వునికే వాళ్ల సరదాలకి అడ్డంకిగా మారింది. తను ఏమన్నా, ఎంత విసుక్కున్నా, ఎంత మొత్తుకున్నా, ఆమె వైఖరి ఒక్కటే. "ఈయన మహా నిర్లక్ష్యం మనిషి. డాక్టరు చెప్పినదేదీ పాటించడు. ఒక రోజు వేళకు మందు వేసుకుంటాడు. పథ్యం పాటిస్తాడు. కాని నేను వెంటపడలేదనుకో, మరుసటి రోజు మందులేవీ వేసుకోడు సరిగదా, జిహ్వా చాపల్యం అణచుకోలేక, డాక్టరు వద్దని చెప్పినవన్నీ తింటాడు. రాత్రంతా పేకాటాడుకుంటూ కూర్చుంటాడు."

"అలా దారుణంగా మాట్లాడకు. ఒక్కసారేగా కాస్త ఎంజాయ్ చేసింది." అంటాడు ఇవాన్ ఇల్యిచ్ .

"నిన్న రాత్రి సంగతేమిటి?"

"నొప్పితో నిద్ర పట్టనప్పుడు పేకాట ఆడితే మాత్రం తప్పేమిటి?"

"ఏం చేసినా నీకు తప్పనిపించదు. జబ్బు తగ్గటం లేదని మమ్మల్ని హింసించి చంపకపోతే చాలు."

భర్త గురించీ, అతని మిత్రుల గురించీ ఆమె చేసిన వ్యాఖ్యల సారాంశమేమంటే, "తన అనారోగ్యానికి కారణం కేవలం అతడే బాధ్యుడు. తను మూలుగుతూ, భయపడుతూ, యింట్లో ఎవరికీ సుఖశాంతులు లేకుండా చేస్తున్నాడు." విసుగొచ్చి ఆమె అలా అని వుంటుంది అని సరిపెట్టుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. కాని ఆ మాటల పరుషత్వం అతణ్ణి అప్పటికే గాయపరిచింది.

కోర్టులో వున్నప్పుడు కూడా అతడి ప్రవర్తనలో మార్పు వచ్చింది. అందరూ తనను వింతగా చూస్తున్నారనిపించేది. తను కూర్చున్న సీటు త్వరలో ఖాళీ అవుతుందనీ, అక్కడ మరొకరు కూర్చుంటారనీ – వాళ్ళు నిరీక్షిస్తున్నట్టుగా వూహించేవాడు. మరికొన్ని సార్లు, సరదాగానే మిత్రులు అతడి భయాల గురించి ఆట పట్టించేవారు. అతడి జబ్బు, బాధ వూహాజనిత మన్నట్టుగా వుండేది వాళ్ల ప్రవర్తన! ముఖ్యంగా అతడి మిత్రుడు ష్వార్ట్జ్ వైఖరి ఎక్కువగా చీకాకు పర్చింది. దానిక్కారణం, ఐదేళ్ల క్రితం ఇవాన్ ఇల్యిచ్ సరిగ్గా అలాగే అందర్నీ ఏడిపించేవాడు.

ఒకనాడు. మిత్రబృందం వచ్చి పేకాటక్కూచున్నారు. కొత్త కార్డులు మెత్తబడటానికి కాస్త వంచి డీల్ చేశారు. ఇవాన్ ఇల్యిచ్‌కు ఏడు డైమండ్లు వచ్చాయి. అతడి పార్టనర్ "నోట్రంప్స్" అన్నాడు (అతడి దగ్గిర రెండు డైమండ్లున్నాయి) ఆటలో గెలవటానికి అంతకన్నా యింకేం కావాలి! గ్రాండ్ స్లామ్ అవకాశాన్ని ఆనందించకుండా వుండటం సాధ్యమా! కాని, అప్పుడే, ఆ క్షణాన, ఎడం పక్కన నొప్పి మొదలైంది. నోటిలో రుచి మారింది. అంత ఆనందకరమైన క్షణాలలో కూడా మొహం బాధతో వంకర్లు తిరిగింది.

ఉత్సాహంగావున్న అతడి పార్టనర్, ఇవాన్ ఇల్యిచ్ పరిస్థితి గమనించినట్టుగా, అతడి యిబ్బంది తగ్గించాలనే ప్రయత్నంలో, కార్డులను అతడి వైపుకు నెట్టాడు. కాని ఇవాన్ ఇల్యిచ్, "వాడికి నేను అంత బలహీనంగా, చేతకాని వెధవలాగా కనిపిస్తున్నానా?" అనుకున్నాడు. అనుకోవటమేమిటి, ఆ కోపంతో, మూడు కార్డులు కింద పడేశాడు-ఫలితంగా గ్రాండ్ స్లామ్ అవకాశం చేజార్చుకున్నాడు (ఈ మూర్ఖమైన పనికి) తన పార్టనర్ ఏవగింపుగా తనవైపు చూడటం మరింత కోపం తెప్పించింది. ఓటమి గురించి తనకు లేని బాధ వీడికెందుకు!

ఇవాన్ ఇల్యిచ్ పరిస్థితి గమనించి, "ఆటకాసేపు ఆపుదాం. రెస్టు తీసుకో." అన్నారు మిత్రులు. తనెందుకు రెస్టు తీసుకోవాలి! అలసి పోలేదే! ఆట ముగిశాక విశ్రాంతి తీసుకోవచ్చు. అందరూ మొహాలు వేలాడేసుకుని కూర్చోవటం మరింత చీకాకు పర్చింది. వాళ్లు అలా వుండటానికి కారణం తనే అని అతడికి తెలుసు. కాని నిస్సహాయుడు. ఏమీ చెయ్యలేడు. భోజనాల తర్వాత మిత్రులు ఎవరిళ్ళకు వారు వెళ్లిపోయారు. ఇవాన్ ఇల్యిచ్ ఒంటరిగా మిగిలాడు. తన జీవితంలో ఆనందం అడుగంటింది. తన సంపర్కంతో యితరుల జీవితాల్లో కూడా విషాదమే మిగులుతున్నది. బాధ అనే విషం ఒక చోట ఒక బిందువుగా ప్రారంభమై

శరీరమంతా వ్యాపిస్తున్నది.

ఆ రాత్రి పడకమీద వాలినప్పుడు అతడి ఆలోచనలివే. బాధతో, బెంగతో చాలా సేపు నిద్ర రాలేదు. మరుసటి వుదయం, లేచి, డ్రెస్ చేసుకుని, కోర్టుకెళ్లి రాతకోతలలో మునిగిపోతాడు. లేదా బాధతో సుళ్లు తిరుగుతూ మళ్లీ పడక మీద వాలతాడు. ఇప్పుడు ఇదీ అతడి జీవన సరళి. పెను విషాదం పొంచి వుంది. అయినా, అర్థం చేసుకునేవాళ్లుగాని, సానుభూతి చూపేవాళ్లు గాని ఒక్కరూ లేరు.

## 5

నెల గడిచింది. మరో నెల గడిచింది. కొత్త సంవత్సరానికి కొద్ది రోజులు ముందర, చూసి పోవటానికి బావ మరిది వచ్చాడు. అతడింటికొచ్చినప్పుడు ఇవాన్ ఇల్యిచ్ కోర్టులో వున్నాడు. ప్రస్కోవ్యా బజారుకెళ్లింది. తిరిగి వచ్చిన బావమరిది సూట్‌కేస్ లోంచి వస్తువులు బయటికి తీస్తూ కనిపించాడు. ఒక్కసారి ఇవాన్ ఇల్యిచ్‌ను చూసి అతడు అవాక్కయ్యాడు. ఆ చూపులోనే అంతా అర్థమైపోయింది. చెప్పటానికి నోరురాని వాడల్లే వున్నాడు బావమరిది.

"ఏమిటి–నాలో ఏమైనా మార్పొచ్చిందా?"

"అవును."

ఆ తర్వాత, ఎంత ప్రయత్నించినా, ఎంత ప్రశ్నించినా, అతడు నోరు మెదపలేదు. ప్రస్కోవ్యా యింటికి రాగానే, ఆమెతో మరోగదిలో సమావేశ మయ్యాడు. తలుపుగది మూసేసి, తనను తాను అద్దంలో చూసుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్–మొదట మొహం, తర్వాత శరీరం, కొన్నాళ్ల క్రితం భార్యతో కలసి దిగిన ఫోటోతో పోల్చుకుని చూసుకున్నాడు. అసలు పోలికే లేనంతగా మారిపోయాడు. తరువాత, కోటు, షర్టు విప్పి చేతులు, భుజాలు చూసుకున్నాడు. మరికాసేపటికి, స్టూలు మీద కూర్చున్నాడు. చీకటికన్న నల్లనైన నిర్వేదం నిండింది అతనిలో.

"ఇలా జరగడానికి వీల్లేదు" అని తనకు తాను ధైర్యం చెప్పుకోవడానికి ప్రయత్నించాడు. లేచి వెళ్లి టేబులు సొరుగులోంచి ఓ కేసు ఫైలు తీసి చదవటం ప్రారంభించాడు. కాని చదువు కొనసాగలేదు. తలుపుతీసి హాల్లో కెళ్లాడు. డ్రాయింగ్ రూం తలుపు మూసివుంది. దగ్గిరగా వెళ్లి నిల్చుని, లోపలి సంభాషణ విన్నాడు.

"నువ్వు నన్ను అనవసరంగా భయపెడుతున్నావు" అంది ప్రస్కోవ్యా.

"ఆరోగ్యం ఎంత దిగజారిందో కనిపించడం లేదా? అతడు నడుస్తున్న శవం. ఆ కళ్లు చూశావా? వాటిలో ప్రాణమే లేదు. ఇంతకూ అతని వ్యాధి ఏమిటి?"

"ఎవరికీ అంతుపట్టటం లేదు. నికొలయెవ్ (ఒక డాక్టర్) చెప్పిన దానికీ, లెష్చెటిట్స్కీ (ప్రముఖ డాక్టర్) చెప్పిన దానికీ అసలు పొంతన లేదు. ఒకరు ఒక వ్యాధంటే, మరొకరు మరొకటంటారు. నా కేమీ అర్థం కావటం లేదు."

ఇవాన్ ఇల్యిచ్ తన గదిలోకెళ్ళి కూర్చుని దీర్ఘంగా ఆలోచించాడు. "మూత్రపిండాలు..... కిందకి జారిన మూత్ర పిండాలు... ఒకటా...రెండా..."అవి వదులై కిందికి జారాయన్నాడు డాక్టరు. ఆ మాటల్ని పదేపదే మననం చేసుకున్నాడు. తన వూహాశక్తితో జారుతున్న మూత్ర పిండాన్ని చేత్తో పట్టుకుని తిరిగి దానిస్థానంలో పెట్టటానికి ప్రయత్నించాడు. తనకు సాధ్యమైన పని డాక్టరుకెందుకు సాధ్యం కావడం లేదు? ఇంత చిన్న పని కూడా చెయ్యలేడా? "నేను ప్యోత్ర్ (తనకో డాక్టరు తెలుసని చెప్పిన మిత్రుడు) వద్దకెళతాను" అనుకుని, తక్షణమే గుర్రబ్బండీ తెప్పించుకుని బయల్దేరటానికి సిద్ధమయ్యాడు ఇవాన్ ఇల్యిచ్.

"ఎక్కడికెడుతున్నావు?" అంటూ ఎదురొచ్చింది ప్రస్కోవ్యా. ఇదివరకెన్నడూ ఆమె గొంతులో అంత బాధ వినిపించలేదు.

ఆ, అనూహ్యమైన సానుభూతి అతనికి కోపం తెప్పించింది.

ప్యోత్ర్, తనూ కలసి డాక్టరు యింటికెళ్ళారు. అతడు వెంటనే అప్పాయింట్‌మెంటిచ్చాడు. చాలా సేపు మాట్లాడాడు ఇవాన్ ఇల్యిచ్.

ప్రస్తుత శరీర పరిస్థితిని సుదీర్ఘంగా వివరించాడు డాక్టరు. ఇవాన్ ఇల్యిచ్‌కు అంతా అర్థమైంది. అసలు సమస్య అపెండిసైటిస్‌లో వుంది. సులభంగానే వ్యాధి నయమవుతుంది. ఒక అవయవంలో శక్తిని పెంచి మరొక అవయవంలో తగ్గించాలి. అప్పుడు సమతుల్య స్థితి ఏర్పడి త్వరలో అంతా సర్దుకుంటుంది.

ఇంటికి ఆలస్యంగా చేరాడు ఇవాన్ ఇల్యిచ్. డిన్నర్ కూడా లేటైంది. భోజనం తర్వాత సరదాగా చాలా సేపు కబుర్లు చెప్పాడు. కాని, తనగదిలోకెళ్ళి కూర్చుని, పని చేసుకోవటానికి మనస్కరించలేదు.

మరికాసేపటికి, అతి ప్రయత్నం మీద పనికుపక్రమించాడు. ఏకాగ్రతతో కొన్ని కేసులు చదివాడు గాని, అతిముఖ్యమైన తన వ్యక్తిగత విషయానికి టైం కేటాయించలేకపోతున్నానని గుర్తుకొచ్చింది. ఆ ముఖ్యమైన విషయం మరేమీగాదు. అపెండిసైటిసే. కాని, దాని గురించి ఆలోచించటానికి బదులు, టీ తాగటానికి డ్రాయింగ్ రూంలో కెళ్లాడు.

అతిథులు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. ఒకరు పియానో వాయిస్తున్నారు. మరొకరు పాడుతున్నారు. ఆ అతిథుల్లో, తన కూతురితో స్నేహానికిష్టపడుతున్న కుర్రాడు (ఎగ్జామినింగ్ మెజిస్ట్రేట్) కూడా వున్నాడు. ఆ సాయంత్రం, ప్రస్కోవ్యాకు, చాలా వుత్సాహంగా, వుల్లాసంగా కనిపించాడు భర్త. కాని, ఇవాన్ ఇల్యిచ్‌కు మాత్రం యింకా అపెండిసైటిస్ గురించి తేల్చుకోవాల్సి వుంది. రాత్రి పదకొండింటికి, అందరికీ 'గుడ్‌నైట్' చెప్పి తన గదిలోకెళ్లాడు ఇవాన్ ఇల్యిచ్. వ్యాధి ప్రారంభమైనప్పటి నుండీ, స్టడీ రూంకు పక్కనున్న గదిలో, ఒంటరిగానే పడుకుంటున్నాడు ఇవాన్ ఇల్యిచ్. దుస్తులు మార్చుకుని, పక్కమీద వాలి చదవటానికి (ఎమీల్) జోలా నవల తీసుకున్నాడు. కాని, ఆలోచనలు ముప్పిరి గొన్నాయి. అతని ధ్యాసంతా అపెండిసైటిస్ గురించే. డాక్టరు చెప్పిన చికిత్సా పద్ధతి గురించి తీవ్రంగా ఆలోచించాడు "నిజమే, అతడు చెప్పిందే సరైన పద్ధతి అనిపిస్తుంది. ప్రకృతి తన సమస్యలు తనే పరిష్కరించుకుంటుంది. మనం దానికా అవకాశం ఇవ్వాలి." వేసుకోవలసిన మందు జ్ఞాపకం వచ్చింది. ఒక డోసు తీసుకుని వెనక్కు వాలి, అది లోపల అవయవాల మీద ఎలా ప్రభావం చూపుతున్నదో వూహించాడు. బాధతో యుద్ధం చేసి దాన్ని చంపేస్తుంది మందు. "వేళ తప్పకుండా మందు తీసుకుంటే సరి. రోగాన్ని ప్రకోపింప చేసేవి తినగూడదు. మందు తీసుకున్నానుగా. ఈ కాసేపట్లోనే ప్రభావం కనిపిస్తున్నది" అనుకున్నాడు. కొవ్వొత్తి ఆర్పేసి పక్కకు తిరిగి పడుకున్నాడు. అపెండిసైటిస్ బాగైంది. మామూలు స్థితికి వచ్చింది. అంతలోనే, నొప్పి తిరగబెట్టింది. నోటి రుచి మారింది. అదే పాత నొప్పి–లోపల నులి పెట్టినట్టుగా. నులి మినట్టుగా. గుండె జారింది. "మళ్లీ వచ్చింది. ఇక దీనికంతం లేదు." అనుకున్నాడు. తనూ తన అవయవాలూ. ఒక అపెండిసైటిస్. ఒక మూత్రపిండం. దీనికంతకూ కారణం అపెండిసైటిస్, మూత్రపిండాల సమస్య. ఇది నా జీవన్మరణ సమస్య. నేను బ్రతికున్నాను. ప్రాణమున్నది. కాని నెమ్మదిగా పోతున్నది. ఏమి చేసీ అది పోకుండా ఆపలేను. నన్ను నేను

మభ్యపెట్టుకోవటమెందుకు? అబద్ధాలు చెప్పుకుని నమ్మించుకోవటమెందుకు? నేనెక్కువ రోజులు బతకనని అందరికీ తెలుసు. కొన్ని వారాలు. కొన్ని రోజులు. లేదా కొన్ని నిమిషాలు కూడా కావచ్చు. ఒకప్పుడు నా చుట్టూ వెలుగు నిండి వుండేది. ఇప్పుడు ఎటు చూసినా చీకటి. ఒకప్పుడు ఇది నా చోటు. ఇప్పుడు శలవు తీసుకుని వెళ్లిపోతున్నాను. ఎక్కడికీ? ఒళ్లంతా చమట పట్టింది. ఊపిరి ఆగినట్టైంది. గుండె కొట్టుకోవటం మాత్రం వినిపించింది.

"త్వరలో వెళ్లిపోతాను. అప్పుడేం జరుగుతుంది? ఏం మిగులుతుంది? ఏమీ లేదు. అంతా శూన్యం. ఇక్కడి నుండి వెళ్ళి ఎక్కడికి చేరుకుంటాను? మృత్యువంటే ఇదేనా? నాకక్కర్లేదు." అంటూ దిగ్గున లేచి కూర్చుని, వణికే చేతుల్తో కొవ్వొత్తి వెలిగించటానికి ప్రయత్నించాడు. కొవ్వొత్తీ, దాని స్టాండ్ కూడా కింద పడ్డాయి. మళ్లీ పడుకున్నాడు. "ఎందుకివన్నీ ఆలోచించటం. జరిగేదెట్లాగూ జరుగుతుంది." అనుకున్నాడు చీకట్లోకి కళ్లప్పగించి చూస్తూ. "మరణం.......అవును. మరణమే. ఎవరికీ (నా గురించి) తెలుసుకోవాలని ఆసక్తి లేదు. జాలిలేదు. నాతో ఆడుకుంటున్నారు."

(మూసిన తలుపుల గుండా ఒక గొంతు వినిపించింది. దాని వెంట మరో శబ్దం) "నా సమస్య వాళ్ళకనవసరం. కాని ఒకనాడు వాళ్ళూ మరణించక పోరు. మూర్ఖులు. మొదట నేను పోతాను. తరువాత వాళ్లు. తమకు చావే రాదన్నట్టుగా జల్సాలతో మునిగి తేలుతున్నారు. జంతువుల కన్నా అధ్వాన్నం." అతని వుద్వేగం గొంతుకడ్డుపడింది. చెప్పుకోలేని బాధ అతణ్ణి సతమతం చేసింది. మనుషులందరూ యిలాంటి బాధననుభవించక తప్పదని తెలిసి ఆత్మగ్లాని మరింత పెరిగింది. లేచి కూర్చున్నాడు.

"ఎక్కడో ఏదో పొరబాటు జరిగింది. ప్రశాంతంగా మొదటి నుండీ ఆలోచించాలి" అనుకున్నాడు. "వ్యాధి అసలెలా మొదలైంది? నిచ్చెన ఎక్కిన రోజు కింద పడకుండా చేసిన ప్రయత్నంలో ఎడం పక్కకు కొట్టుకున్నాను. ఆ రోజూ, మరుసటి రోజూ కూడా నొప్పి పెద్దగా తెలియలేదు. తరువాత క్రమంగా యిబ్బంది పెరిగింది. డాక్టర్లు వచ్చారు. మరింత బాధ. కొత్త డాక్టర్లు కాని, ఆ మొదటి రోజు నుండే నా చివరి రోజులు ప్రారంభమయ్యాయి. ఒంట్లో శక్తి క్రమేపీ తగ్గింది. అవును. చరమ దశ వైపు కదులుతూనే వున్నాను. ఇప్పుడు శరీరం శిథిలమైంది. కళ్లలో వెలుగు లేదు. ఒకవైపు మృత్యువు రారమ్మంటుంటే నేనింకా అపెండిసైటిస్ గురించి ఆలోచిస్తున్నాను. నేను చావక తప్పదని నిశ్చయమైన తర్వాత, అపెండిసైటిస్ బాగుపడితే మాత్రమేమి? ఇది మృత్యువు. నిజమింతేనా? భయం ఆవహించింది. ఊపిరాడలేదు. కింద పడకుండా టేబుల్ మీద చేతులు ఆనించి, అగ్గి పెట్టెకోసం వెదికాడు. నొప్పి అడ్డుపడింది. వంగడంతో నొక్కినట్టైంది. నొప్పి మరింత పెరిగింది. భయం లేకుండా వుంది. నిస్సహాయంగా వెనక్కు వాలాడు. శ్వాస ఆగినట్టైంది. "ఇదే మృత్యువు" అనుకున్నాడు.

అతిథులు వెళ్లిపోతున్నారు. ప్రస్కోవ్యా అందరికీ వీడ్కోలు చెబుతున్నది. లోపల ఏదో పడ్డ చప్పుడై తలుపు తీసింది.

"ఏమైంది?"

"జారింది. పొరబాటున ఏదో తగిలింది."

కొవ్వొత్తి తీసుకుని వచ్చింది ప్రస్కోవ్యా. మైలుదూరం నుండి పరిగెత్తుకొచ్చిన వాడిలా రొప్పుతూ కింద పడివున్నాడు ఇవాన్ ఇల్యిచ్. భార్యను కొత్త మనిషిని చూసినట్టు చూశాడు.

"ఏమైంది? మాట్లాడవేం?" అంటూ భర్తను అనునయంగా పలకరించింది ప్రస్కోవ్యా.

"ఏమీలేదు. చిన్న పొరబాటు. జారింది. అంతే." (చెప్పి ఏం లాభం? ఆమె ఎట్లాగూ అర్థం చేసుకోలేదు.)

ఆమెకు నిజంగానే అర్థం కాలేదు. స్టాండ్ టేబుల్‌పై నిలబెట్టి లేపి, కొవ్వొత్తి వెలిగించి వెళ్ళిపోయింది-ఆమె వీడ్కోలు చెప్పటానికి మరో అతిథి మిగిలి వున్నాడు మరి.

ఆమె తిరిగి వచ్చేసరికి, అతడింకా వెల్లకిలా పడుకునే వున్నాడు. కళ్లు తేలేశాడు.

"ఏమైంది? బాధగా వుందా?"

"అవును"

అతడి పక్కనే కూర్చుంటూ.

"డాక్టరుకు కబురు పెట్టనా?"

"ఆ 'ప్రముఖ' డాక్టరును మళ్లీ రప్పించనా?అంత ఎక్కువ ఫీజు తగలెయ్యటమెందుకు?" అని వుద్దేశం కాబోలు. నవ్వటానికి ప్రయత్నించి, "వద్దు" అన్నాడు.

ఆమె మరికాసేపు కూర్చుని, నుదుటి మీద ముద్దు పెట్టుకుని వెళ్లి పోయింది.

ఆమె ముద్దు పెట్టుకుంటున్నప్పుడు, అతడి అణువణువూ ఆమెను అసహ్యించుకుంది. దూరంగా తోసెయ్యకుండా వుండటానికి చాలా నిగ్రహించుకున్నాడు.

"గుడ్‌నైట్. కళ్లు మూసుకుని పడుకో. నిద్ర పడుతుంది."

"అలాగే!"

## 6

తను మరణిస్తున్నానని ఇవాన్ ఇల్యిచ్‌కు తెలిసిపోయింది. నిరాశ, నిస్పృహ ఆవరించింది.

మరణిస్తున్నానని తెలిసినా ఆ సత్యాన్ని అతడు అంగీకరించలేకపోయాడు. దాని పరిణామమూ, దాని అర్థమూ అతని అవగాహనా శక్తికి మించినది.

కాలేజీలో వున్నప్పుడు నేర్చుకున్న లాజిక్ "కేయస్ (CAIUS) ఒక మనిషి. మనుషులందరూ మరణించక తప్పదు. అందువలన కేయస్ కూడా మరణించక తప్పదు." అన్నవాదన, కేయస్ కు మాత్రమే వర్తిస్తుంది తనకు వర్తించదనుకున్నాడు. కేయస్ అనబడే వాడు ఒక నైరూప్యజీవి. అందువల్ల వాదన అంత వరకూ సబబే. కాని, తను కేయస్ కాదు. నైరూప్య వ్యక్తి కాదు. ఇతరులందరికన్నా భిన్నమైన, విలక్షణమైన, నిర్దుష్టమైన వ్యక్తి తను. చిన్నప్పుడు అమ్మా, నాన్నా తనను ముద్దుగా "వాన్యా" అని పిలిచారు. మిత్యా, వొలొద్యాలు తనతో ఆడుకున్నారు. తను బొమ్మలతో ఆడుకున్నాడు. ఆ తర్వాత, తన నర్సు, కాటెంకా, వన్యాలతో స్నేహం పరిచయం. ఎన్ని ఆనందాలు. ఎన్ని ఆశాభంగాలు. శైశవంలో, బాల్యంలో, యవ్వనంలో ఎంత వుత్సాహం. ఉరకలెత్తిన వుద్వేగాలు. వాన్యా మోజుపడిన రబ్బరుబంతి వాసన ఎలా వుంటుందో కేయస్‌కు తెలుసా? కేయస్ ఎప్పుడైనా తన తల్లి డ్రెస్‌లో తలదూర్చి, ఆ ముడతలు పట్టుకుని ఆడుకున్నాడా? స్కూల్లో పేస్ట్రీలు నచ్చనప్పుడు కేయస్ అరిచి కేకలేశాడా? అతడెప్పుడైనా తనలాగా ప్రేమించాడా? తనలాగ, కోర్టులో జడ్జీ స్థానంలో కూర్చున్నాడా?

కేయస్ ఒక సామాన్య మానవుడు. అలాంటి వాళ్లు మరణించటం కూడా సహజమే. కాని యిన్ని అనుభవాలు, ఆలోచనలు, వుద్వేగాలు, వుద్రేకాలున్న తన- అంటే ఇవాన్ ఇల్యిచ్-సంగతి వేరు. తన లాంటి వాళ్లు కూడా మరణిస్తారా? అది సాధ్యమేనా? ఎంత దారుణం.

అవీ అతడి ఆలోచనలు.

'కేయస్ లాగ మరణించటం తప్పనిసరి అయివుంటే, ఆ విషయం నాకు ముందే తెలిసి వుండేది గద. నా అంతర్వాణి నాకు యిప్పటికే ఆ సమాచారం యిచ్చివుండేది. కాని నాకెప్పుడూ ఆ వూహ కూడా రాలేదే! నేనూ, నా మిత్రులూ-మేం వేరు. కేయస్ కన్న భిన్నమైన వాళ్లం. కాని, యిప్పుడేం జరిగింది? ఇలా జరగటానికి వీల్లేదసలు. కాని, కళ్ల ముందర చూస్తున్న దాన్ని, అనుభవిస్తున్న దాన్ని నమ్మకపోవటం సాధ్యం కాదుగద. ఎలా అర్థం చేసుకోవాలీ విపరీత పరిణామాన్ని?

అతను అర్థం చేసుకోలేకపోయాడు గనక, ఇదంతా అబద్ధమనీ, హేతు విరుద్ధమనీ, తప్పుదారి పట్టిన ఆలోచనలిలాగే వుంటాయనీ తోసి పుచ్చటానికి ప్రయత్నించాడు. కాని, ఎంత మరచిపోవటానికి ప్రయత్నిస్తే, అంత బలంగా తిరిగి వచ్చాయి అవే ఆలోచనలు.

ఆలోచనలు మరల్చుకోవటానికి ప్రయత్నించాడు ఇవాన్ ఇల్యిచ్. 'చావు గురించి కాక, ఆశావహమైన విషయాలు స్మరణకు తెచ్చుకుంటే బాగుంటుంది.' అనుకున్నాడు. కొన్నాళ్ల క్రితం దాకా యిది సాధ్యపడింది. కాని యిప్పుడు మనసు మరణం గురించి తప్ప మరేమీ ఆలోచించలేకపోతున్నది. "అసలు, పాత అలవాట్లు యిప్పుడు పనికిరావా?" పని ముందరేసుకుంటే సరి. అన్ని మరచిపోవచ్చు. అనుకున్నాడు. కోర్టుకెళ్లి, వుద్యోగ బాధ్యతల్లో మునిగి, సహోద్యోగులతో కాలక్షేపం చేసి, గుంపులుగా మూగిన జనాన్ని చూస్తూ, ఎండిన మోడుల్లాంటి తన చేతుల్ని కుర్చీ చేతుల మీద అనించి, అదీయిదీ మాట్లాడుతూ, కాగితాలు తిరగేస్తూ, కళ్లెత్తి అందర్నీ పరికించి చూస్తూ, నిటారుగా నిలబడి కోర్టు వ్యవహారాలు ప్రారంభం కావచ్చని ఆజ్ఞలు జారీ చేస్తూ రోజు గడపవచ్చు. కాని, అకస్మాత్తుగా, వున్నట్టుండి, కోర్టు విచారణ మధ్య నొప్పి మొదలవుతుంది. ముఖ్యమైన విషయాలలో తలమునకలవు తున్నప్పుడు కూడా లెక్కచేయకుండా అది తనను లోపలినుండి మెలివేస్తుంది. నొప్పి మొదలైందంటే మరే ఆలోచనా రాదు. మరే పనీ చెయ్యలేడు. తన ప్రత్యర్థిలాగ, అది అనుకోని సమయాల్లో తన మీద దాడి చేస్తుంది. దొంగ దెబ్బ తీస్తుంది. కళ్లలో కళ్లుపెట్టి తనను వెక్కిరిస్తుంది. తను భయవిహ్వలుడైతే అది వికటాట్టహాసం చేస్తుంది. గాజు కళ్లతో, "ఇదంతా నిజమేనా?" అని ప్రశ్నించుకుంటాడు ఇవాన్ ఇల్యిచ్. సమర్థుడైన, చతురుడైన జడ్జి క్షణంలో జీవచ్ఛవంలా మారి చిన్నపిల్లలు కూడా చెయ్యని తప్పులు చెయ్యడం చూసి సహోద్యోగులు ముక్కుమీద వేలేసుకుంటారు. వెంటనే కోలుకుని, కోర్టుని ఆర్డర్‌లో పెట్టటానికి ప్రయత్నిస్తాడు ఇవాన్ ఇల్యిచ్. లేదా ఆనాటి కార్యక్రమాలకు ముగింపు పలికి యింటికి చేరుకుంటాడు. ఇలా ఎంతో కాలం కొనసాగదని అతడికీ తెలుసు. అంతులేని మరణ వేదన నుండి కోర్టు కాదుగదా, మరేపనీ అతణ్ణి రక్షించలేదు. ఈ జీవి చేస్తున్న అన్ని కార్యకలాపాల్లోనూ తానున్నానని చెప్పటమే దాని లక్షణం. అలా, ప్రతిరోజూ, ప్రతి క్షణం మృత్యువుతో ముఖాముఖీ కొనసాగింది.

కొన్ని సార్లు డ్రాయింగ్ రూంలో ఒంటిరిగా కూర్చున్నాడు ఇవాన్ ఇల్యిచ్-అలంకరించే ప్రయత్నంలో తాను దెబ్బ తగిలించుకున్న డ్రాయింగ్ రూం అదే-తన ప్రాణాన్ని బలిగొన్న డ్రాయింగ్ రూం. తను పడ్డచోట, టేబుల్ మీద వార్నిష్ కొంత మేర గీరుకుపోయింది. అసలెందుకు నిచ్చెన జారిందో తెలుసుకోవటానికి ప్రయత్నించాడు. గోడకు తగిలించిన ఒక ఇత్తడి అలంకరణ వస్తువు కాస్త వంగింది. అది ఖరీదైంది. తను ఎంతో జాగ్రత్తగా అమర్చిన వస్తువులను అశ్రద్ధ చేస్తున్నందుకు కూతురు మీదా, ఆమె మిత్రబృందం మీదా కోపం వచ్చింది. ఒక ఫోటో ఆల్బం చిరిగింది. కొన్ని ఫోటోలు తలకిందులుగా అతికించారు. అవన్నీ, సరిగా, ఎక్కడ వుండవలసినవి అక్కడ అమర్చాడు ఇవాన్ ఇల్యిచ్.

కాసేపటికి, అతనికి, ఆల్బంలన్నీ గదిలో మూలకు, మొక్కలున్న చోటికి చేర్చితే బాగుంటుందనిపించింది. పనిమనిషిని పిలవాలి. భార్యా, కూతురూ వస్తారు. అవునంటే కాదని వాదిస్తారు. మాటామాటా పెరుగుతుంది. అరుచుకుంటారు. అయినా మంచిదే. కనీసం అలాగయినా, నొప్పి నుండి దృష్టి మళ్లుతుంది. ఒక్క క్షణం దాన్ని మరచిపోగలిగినా చాలు.

అతడు టేబుల్ కదల్చటానికి ప్రయత్నిస్తుంటే, భార్యవచ్చి, "ఆ పనులన్నీ పనివాళ్లు చేస్తారులే. మళ్లీ ఏదో తగిలించుకుంటావు." అంది. అప్పుడే, ఆ క్షణాన్నే తన మనో ఫలకం మీద అది దర్శనమిచ్చింది. విస్మరించటానికి లేదు. మరచి పోవటానికి లేదు. తనను తట్టి, గిల్లి, కొరికి, చీల్చి మరీ పలుకరిస్తుంది. తన ప్రతి కదలికలో, వుచ్ఛ్వాసనిశ్వాసలో, వూహల్లో నిరంతర సహచరి. మొక్కల వెనకనుండి తననే చూస్తున్నది.

"పరదాలు సరి చేయటమే నాకు ఆత్మహత్యగా మారిందా?

అంత చిన్న పని చేయబోయి ప్రాణం మీదికి తెచ్చుకోవటమెంత మూర్ఖం!"

స్టడీ రూంలోకెళ్లి పక్క మీద వాలాడు. మళ్లీ 'అది' వచ్చి తన పక్కన నిల్చుంది. తన కళ్లలో కళ్లు పెట్టి చూసింది. తను దాన్నేమీ చేయలేడు. భయంతో బిక్కచచ్చి, దీనంగా దానివైపు చూశాడు ఇవాన్ ఇల్యిచ్.

పరిణామ క్రమాన్ని వివరించటం అసాధ్యమేగాని, క్రమంగా, గుర్తుపట్టలేనంత నెమ్మదిగా ప్రారంభమైంది అంతిమ దశ. ఇవాన్ ఇల్యిచ్ గాయపడిన మూడోనెలలో అతని భార్య, కూతురు, కొడుకు, బంధుమిత్రులు, పరిచయస్తులందరూ ఆ రోజు కోసం- అంటే వాళ్ల జీవితాల్లోంచి అతనెంత త్వరగా తప్పుకుంటాడా, అతని బాధల నుండి అతడికెప్పుడు విముక్తి లభిస్తుందా అని - ఎదురు చూశారు. ఒకరకంగా, అతడు కూడా నిరీక్షించాడు.

నిద్ర తగ్గింది. నల్లమందూ, మార్ఫిన్ ఇంజక్షన్లూ యిచ్చారు. అయినా వుపశమనం లభించలేదు. అపస్మారక స్థితిలోని అతని బలహీనమైన మూల్గులు-తొలి రోజుల్లో-నొప్పి తగ్గి వుంటుందనే భ్రమ కల్పించాయి గాని, తరువాత అతని కేకలు విన్న తర్వాత అదంతా అబద్ధమని తేలిపోయింది.

డాక్టరు ఆదేశాల మేరకు అతని కోసం భోజనం ప్రత్యేకంగా సిద్ధం చేశారు. కాని రుచీపచీలేని ఆ వంట ముట్టటానికి అతను సుతరామూ యిష్టపడలేదు.

కాలకృత్యాల కోసం కూడా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. కాని, అందరికీ యిదో గండం లాగే వుంది. ఆ అసహ్యం, మురికి, దుర్గంధం, మరో మనిషి భరించాలంటే అలాగే వుంటుంది మరి.

అయితే, ఇంత హేయమైన పనులలో కూడా ఇవాన్ ఇల్యిచ్ కొంత సుఖం అనుభవించాడు. పనిమనిషి గెరాసిం, అతడి బెడ్‌పాన్ (ఛేంబర్‌పాట్) ఎప్పటికప్పుడు ఖాళీ చేశాడు. గెరాసిం, ఆరోగ్యవంతుడైన యువకుడు. శుభ్రంగా వుంటాడు. ఊరినుండి వచ్చాడు. నగర జీవితానికి అలవాటు పడ్డాడు. అంత చక్కటి కుర్రాడి

చేత 'అలాంటి' పనులు చేయించుకోవటం మొదట ఇవాన్ ఇల్యిచ్‌కు బాధగానే అనిపించింది.

ఒకసారి, అతడు బెడ్‌పాన్‌పై నుండి లేచినపుడు, పాంటు పైకి లాక్కునే ఓపిక కూడా లేక వాలు కుర్చీలో జారగిలబడ్డాడు. కండలు కరిగి, చర్మం పెళుసు బారిన తన తొడలు చూసి భయమేసింది. అప్పుడే నవ్వుమొహంతో, పెద్ద అడుగులతో లోపలికి ప్రవేశించాడు గెరాసిం. ఉతికిన షర్టు చేతులు పైకి ముడుచుకున్నాడు. వాడి ప్రతి కదలికలో జీవితానందం తొణికిసలాడుతున్నది. జబ్బు మనిషి బాధ పడతాడేమోనని వుత్సాహాన్ని దాచుకుంటున్నట్టుగా కనిపించాడు. ఇవాన్ ఇల్యిచ్ పై నుండి చూపులు పక్కకు తిప్పుకుని బెడ్‌పాన్ తీసుకున్నాడు.

"గెరాసిం" అంటూ పిలిచాడు ఇవాన్ ఇల్యిచ్ బలహీనంగా. తప్పు చేశానేమోనన్నట్టుగా వులిక్కిపడి చూశాడు గెరాసిం. వాడి చుబుకం మీద గడ్డం అప్పుడప్పుడే మొలుస్తున్నది.

"ఏం కావాలి సార్!"

"ఇది నీకు చాలా అసహ్యంగా వుంది గదూ. నన్ను క్షమించు. నేను కదలనైనా లేను."

"అలా అనకండి సార్. నేను మీకు సేవ చేస్తే తప్పేమిటి? మీ ఆరోగ్యం బాగోలేదుగదా." అంటూ చిరునవ్వు నవ్వాడు గెరాసిం. వాడి పలువరుస తళుక్కున మెరిసింది. బెడ్‌పాన్ తీసుకుని వెళ్లినవాడు అయిదునిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు.

కదలలేని ఇవాన్ ఇల్యిచ్ వాలు కుర్చీలో అలాగే వెనక్కి వాలి పడుకున్నాడు.

కొత్త బెడ్‌పాన్ పెట్టగానే, "గెరాసిం, ఇలా రా. నన్ను కాస్త లేపి కూర్చోబెట్టు. నాకై నేను లేవలేను. వేరే పనిమనిషులెవరూ లేరు." అన్నాడు ఇవాన్ ఇల్యిచ్.

గెరాసిం, తన బలమైన చేతులతో అతణ్ణి సుతారంగా ఎత్తి, పాంటు పైకి లేపి కూర్చో బెట్టి పోతున్నప్పుడు, ఇవాన్ ఇల్యిచ్ తనను సోఫా మీదికి చేర్చమని అడిగాడు. అతడి శరీరం బరువే లేనట్టు గెరాసిం అవలీలగా అతణ్ణి సోఫామీద కూర్చోబెట్టాడు.

"థాంక్యూ. ఎంత నేర్పుగా లేపావు."

గెరాసిం చిరునవ్వు నవ్వి నిష్క్రమించబోయాడు. ఇవాన్ ఇల్యిచ్‌కు వాణ్ణి చూస్తే సరదాగా, ధైర్యంగా వుంది. వాడు వెళ్లి పోవటం అతడి కిష్టం లేదు.

"మరొక్క చిన్న పని. ఆ కుర్చీ కాస్త యిటు జరుపు. అది కాదు, ఆ పక్క కుర్చీ నా కాళ్ళకింద పెట్టు. మొదట వీటిని పైకి లేపు."

గెరాసిం కుర్చీ తీసుకొచ్చి, ఇవాన్ ఇల్యిచ్ కాళ్లు లేపి దాని మీద పెట్టాడు. ఆ కుర్రాడు పక్కనుంటే అతడికి చాలా సౌకర్యంగా, సుఖంగా వుంది.

"కాళ్లు పైన పెట్టుకుంటే హాయిగా వుంది. కింద దిండు కూడా పెట్టరాదూ."

గెరాసిం, తన యజమాని చెప్పినట్టల్లా చేశాడు. వాడు కాళ్లు లేపి పట్టుకున్నప్పుడు చాలా హాయిగా అనిపించింది. కిందపెట్టగానే నొప్పి మొదలైంది.

"గెరాసిం, నీకు వేరే పనేమైనా వుందా?"

"లేదుసార్," అంటూ జవాబిచ్చాడు గెరాసిం వినయంగా. పనిమనుషులు, యజమానులతో ఎలా మాట్లాడాలో వాడు ఈ వూరికొచ్చి నేర్చుకున్నాడు.

"ఇదిగాక, ఈ యింట్లో నువ్వింకేం పనులు చేస్తావు?"

"అన్ని పనులూ చేసేశాను సార్, రేపటికి కలప కొట్టటం తప్ప."

"అలాగైతే, నా కాళ్లు మరికాస్త పైకెత్తి పట్టుకో రాదూ."

"మీ ఇష్టం సార్" అంటూ గెరాసిం కాళ్లు పైకిలేపాడు. ఈ పొజిషన్‌లో ఇవాన్ ఇల్యిచ్‌కు ఏ మాత్రం నొప్పి అనిపించలేదు.

"మరి వంట చెరకు మాటేమిటి?"

"ఏం ఫరవాలేదు సార్. ఆ పని కూడా చేసేస్తాను."

కాళ్ళెత్తి పట్టుకున్న గెరాసింతో సంభాషణ కొనసాగించాడు ఇవాన్ ఇల్యిచ్. సుఖంగా వుంది.

ఆ తర్వాత, గెరాసిం కోసం తరచుగా కబురుపెట్టాడు ఇవాన్ ఇల్యిచ్. గెరాసిం తన యజమాని కాళ్లు భుజాల మీద పెట్టుకుంటాడు. ఇవాన్ ఇల్యిచ్ వాడితో ఏదో కబుర్లు చెబుతాడు.

ఏ పనీ భారమనుకోకుండా, అసహ్యం లేకుండా, సరదాగా, వుత్సాహంగా చేస్తాడు గెరాసిం. ఇతర వ్యక్తుల శరీర దారుఢ్యం, వుల్లాసం, నవ్వులు చూసి ఇవాన్ ఇల్యిచ్‌కి కోపం వస్తుంది. కాని గెరాసిం బలం అతడి నొప్పికి రాసిన లేపనం లాగా సుఖంగా వుంటుంది.

అందరూ అబద్ధమాడుతున్నారని అతనికి తెలిసి పోయింది. పైగా ఆ అబద్ధాన్ని అందరూ అంగీకరించారు. తను మరణించటం లేదు. కేవలం జబ్బుగా వున్నానంటారు. ప్రశాంతంగా వుండి, చికిత్స చేయించుకుంటే ఫలితం వుంటుందట. కాని తనకు తెలుసు. ఏం చేసినా, ఎన్ని మందులు తీసుకున్నా, ఎన్ని పథ్యాలు పాటించినా బాధ పెరుగుతుందేగాని తగ్గదు. మృత్యువు అనివార్యం. మరణం కన్నా అతణ్ణి ఎక్కువ బాధించింది – వీళ్లు చేస్తున్న అసత్య ప్రచారం. అందరికీ తెలిసిన సత్యం తమకు మాత్రం తెలియదన్నట్టు ఎందుకు నటిస్తున్నారు. వాళ్ల కపట నాటకంలో తానూ పాత్ర ధరించాలని ఎందుకు కోరుకుంటున్నారు?

మరణానుభవాన్ని కూడా ఎద్దేవా చేసి, అవమానించే ఈ క్రూరమైన పరిహాసం, వీళ్ల ఆటపాటలు మిత్రులతో విందు వినోదాలు, కేరింతలు, అట్టహాసంగా ఆహ్వానాలు, వీడ్కోళ్లు, అలంకరణలు తన జీవితశేషాన్ని నరకప్రాయం చేస్తున్నాయి. ప్రతిక్షణం చిత్రహింసలకు గురిచేస్తున్నాయి. వాళ్లు తన ముందర ఈ నాటకాలాడుతున్నప్పుడు, ఈ దొంగవేషాలేస్తున్నప్పుడు చాలాసార్లు, "షటప్. నేను ఛస్తున్నాను. మీ అబద్ధాలాపండికనైనా." అని అరవాలనిపించేది. కాని ధైర్యం చాలలేదు. ఇంత ప్రగాఢమైన, మార్మికమైన, ఆత్మికమైన అనుభవాన్ని వాళ్లు "ఒక చిన్న యిబ్బంది, కాసింత అసౌకర్యం" అన్నట్టుగా చూస్తున్నారు. (వ్యక్తి గదిలోకి ప్రవేశించినప్పుడు దుర్వాసన వేస్తే ఎలా యిబ్బందిగా చూస్తామో, తన పరిస్థితి అంతే అనుకుంటున్నారు) మర్యాదలు పాటించటం తనే నేర్పించాడు వాళ్లకు. ఇప్పుడు తనపట్లా వాళ్లు అవే మర్యాదలు పాటిస్తున్నారు. ఎవరూ తన పరిస్థితిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం లేదు. అందువల్ల ఎవరికీ తనమీద జాలి లేదు. గెరాసిం సాంగత్యంలో మాత్రమే తనకు సుఖంగా, సౌకర్యంగా వుంది. కొన్ని సార్లు రాత్రంతా కాళ్లు భుజాల మీద పెట్టుకుని, "ఫరవాలేదు సార్, మీరు నన్నేమీ బాధపెట్టటం లేదు. నేను తర్వాత నిద్రపోతాను." అంటాడు. లేదా, కబుర్లు చెబుతున్నప్పుడు, "మీ ఆరోగ్యం బాగుంటే యివన్నీ అవసరం లేదుగా. జబ్బు మనుషులకు సేవచేస్తే తప్పేంటి.' అని చిరునవ్వు నవ్వుతాడు. అబద్ధాలాడనివాడు గెరాసిం ఒక్కడే. తనను పూర్తిగా అర్థం చేసుకున్నట్టుగా వుంటుంది వాడి

ప్రవర్తన. బలహీనమైన, కృంగి, కృశించిన తన యజమాని పట్ల జాలి వుంది. ఒకనాడు, పని ముగించుకుని వెళ్లిపోతూ, "అందరం ఎప్పుడో ఒకప్పుడు చావాల్సిన వాళ్లమే. ఈ పరిస్థితిలో మీకు సాయం చేస్తే మంచిదేగా." అన్నాడు. అంటే, ఈ పని తనకో భారం కాదనీ, మరణిస్తున్న వాళ్లకు సపర్యలు చేయటం తన ధర్మమనీ వాడి వుద్దేశం. ఆ రోజొచ్చినప్పుడు తనకు కూడా ఎవరో ఒకరు యిలాగే చేస్తారని నమ్మకం.

అబద్ధాలు మాత్రమే గాక, మనుషుల జాలిలేని తనం ఇవాన్ ఇల్యిచ్‌ను అమితంగా గాయపర్చింది. భరించలేని బాధను భరించవలసినప్పుడు (సిగ్గుపడాల్సిన విషయమే కావచ్చుగాక) చిన్నపిల్లలను గారాబంగా చూస్తామే, అలా ఎవరైనా జాలి చూపిస్తే ఎంత బాగుండేదో! చిన్నపిల్లల్ని ఎత్తుకుని, కౌగలించుకుని, ముద్దాడి ఓదార్చుతామే అలా. కాని తను గడ్డం నెరిసిన యింటి పెద్ద. అందువలన తననెవరూ అలా లాలించరు. ఆ విషయం తనకూ తెలుసు. అయినా కోరిక అణచుకోలేక పోయాడు. అయితే, యిలాంటి సంబంధం గెరాసింతో ఏర్పడింది. వాడు వస్తేనే ఓదార్పుగా వుంటుంది. ఏడ్వాలనీ, ఏడ్చినప్పుడు తననెవరైనా కౌగలించుకుని సముదాయించాలనీ వుంది. కాని తన సహోద్యోగి షెబెక్ వచ్చి, గంభీరంగా మొహం పెట్టి కోర్టు విషయాలు చర్చించి తన అభిప్రాయం చెప్పమంటాడు. తన బంధుమిత్రుల్లో, పరిచయస్తుల్లో వున్న ఈ తెచ్చిపెట్టుకున్నతనం, కృతకత్వం, భేషజం అతడి చివరి రోజుల్ని విషతుల్యం చేశాయి.

## 7

ఉదయం.

గెరాసిం వెళ్లి మరో పనిమనిషి ప్యోత్ర్ వచ్చాడు గనుక అది వుదయమని తెలుసుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. కొవ్వొత్తులు ఆర్పేసి, పరదాలు తీసి గది శుభ్రం చెయ్యటం ప్రారంభించాడు ప్యోత్ర్. ఉదయం, సాయంత్రం, శనివారం–ఆదివారం–అన్నివేళలూ, అన్ని రోజులూ ఒకటే. కాలమే తెలియదు– క్షణం విరామమివ్వని, సలుపుతున్న నొప్పి తప్ప జీవితం గడిచిపోయింది. చివరి క్షణాలు కూడా కరిగి పోతున్నాయి. యిక ఏదీ తిరిగిరాదు అనే స్పృహ. భయంకరమైన, అనివార్యమైన, అసహ్యకరమైన వాస్తవం–అదే మృత్యువు. తనను స్పృశిస్తున్నది. కబళించటానికి నోరుతెరచి నిరీక్షిస్తున్నది. మరొకవైపు వాళ్ల అబద్ధాలు కొనసాగుతూనే వున్నాయి. వారాలా, రోజులా, గంటలా–లెక్కపెట్టుకోవటమెందుకు?

"టీ తీసుకురానా సార్?"

'వాడికి నా ఆదేశం కావాలి. యజమానులు వుదయం టీ తాగుతారని వాడి అభిప్రాయం.' అనుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్.

"వద్దు"

"సోఫా జరపమంటారా సార్?"

'గది శుభ్రం చేస్తున్నాడు గదా, ఈ సోఫా అడ్డం వచ్చింది. నేనున్నచోట మురికి వుండదామరి.' అనుకుని, "అక్కర్లేదు. నన్ను విసిగించకు." అన్నాడు

పని మనిషి మరికాసేపు అక్కడే తచ్చాడాడు. ఇవాన్ ఇల్యిచ్ చెయ్యి చాచాడు.

ప్యోత్ర్ పరుగెత్తుకుని వచ్చి,

"ఏం కావాలి సార్." అంటూ అడిగాడు.

"నా వాచ్ యిటివ్వు."

ఇవాన్ ఇల్యిచ్ చెయ్యి మరొక్క రవ్వ చాపితే అందుకోగలిగినంత దూరంలోనే వుంది వాచ్. ప్యోత్ర్ దాన్ని చేతికందించాడు.

'ఎనిమిదిన్నరైంది. అందరూ లేచారా?"

"లేదుసార్. మీ అబ్బాయి స్కూలు కెళ్లాడు. అమ్మగారింకా లేవలేదు.

మీరు పిలిస్తే లేపమంది. లేపమంటారా సార్?"

"అక్కర్లేదులే. నాక్కాసింత టీ యివ్వు."

టీ తీసుకు రావటానికి ప్యోత్ర్ తలుపుదాకా వెళ్లాడో లేదో, గదిలో ఒంటరిగా వుండటానికి భయపడ్డాడు ఇవాన్ ఇల్యిచ్. "వాడు నా పక్కనే వుండాలంటే ఏం చెయ్యాలి?" అనుకుని,

"మందివ్వు" అన్నాడు–"ఎంతో కొంత పని చెయ్యకపోదు."

ఓ చెంచాడు మందు మింగాడో లేదో, "దండగ. ఇదంతా వట్టి నాన్సెన్సు. ఏం వేసుకున్నా నొప్పి మాత్రం తగ్గదు. ఎలా, ఏం చెయ్యాలి. ఒక నిమిషం వుపశమనం కలిగితే ఎంత బాగుండును. " అంటూ తనను తాను నిందించుకున్నాడు.

"ఇక లాభం లేదులే. టీ తీసుకురా."

ప్యోత్ర్ నిష్క్రమించగానే, నొప్పి వలన గాక, మృత్యువాసన్నమైందన్న బాధతో మూల్గాడు ఇవాన్ ఇల్యిచ్. అదే బాధ. అదే నొప్పి. రాత్రి లేదు. పగలు లేదు. ఈ క్షణ క్షణ నరకం నుండి త్వరగా విముక్తి దొరికితే ఎంత బాగుండును. విముక్తి తర్వాత ఏముంటుంది? మృత్యువు. చీకటి.... మృత్యువు లేని బాధా విముక్తి వుండదా?...

టీ తీసుకొచ్చిన ప్యోత్ర్ వైపు వింతగా, కొత్త మనిషిని చూసినట్టు చూశాడు ఇవాన్ ఇల్యిచ్. ప్యోత్ర్ కాస్త యిబ్బందిగా మొహం పెట్టటం చూసి, "కాస్త నా ఒళ్లు తుడిచి, కొత్త షర్టు తొడిగించు." అన్నాడు అనునయంగా.

చేతులూ, మొహం కడుక్కుని, పళ్లు తోముకుని, తల దువ్వుకుని–అలసినప్పుడు కాసేపు విశ్రాంతి తీసుకుని–అద్దంలో ఒకసారి చూసుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. అద్దంలో మొహం వికృతంగా కనిపించింది. తన శరీరాన్ని చూసుకుంటే తనే జడుసుకుంటానని అతడికి తెలుసు. అందువల్ల, షర్టు మార్చుకుంటున్నప్పుడు అద్దంలోకి చూడలేదు. ఆ తర్వాత, డ్రెస్సింగ్ గౌన్ వేసుకుని, శాలువా కప్పుకుని టీ తాగటానికి, వాలు కుర్చీలో ఆసీనుడైనాడు. ఒక్క క్షణం కాస్త 'ఫ్రెష్'గా అనిపించింది. కాని టీ తాగటం ప్రారంభించగానే నోటి అరుచి వెగటు కలిగించింది. నొప్పి తిరిగి వచ్చింది. బలవంతంగా టీ ముగించి, వెనక్కువాలి, కాళ్లు జాపుకుని ప్యోత్ర్‌ను పంపించి వేశాడు.

ఒక్క క్షణం నిమ్మళంగా వుంటుంది. మరుసటి క్షణం దుర్భరంగా వుంటుంది. ఒకసారి బతికితే బాగుంటుందనిపిస్తుంది. మరోసారి యింతకన్న చావే

నయమనిపిస్తుంది. కానీ, చూస్తూ, చూస్తూ చావుని కోరుకోవటం అసాధ్యం. ఒక గంట, ఒక రోజు కాదాయె. ఎలా భరించటం? ఎలా జీవించటం? ఒంటరివాడు. ఎవరూ పలకరించరు. పలకరించినా అదో ప్రహసనం. ఒక ప్రాక్టికల్ జోక్, వాళ్లకిదో 'చిన్నజబ్బు.' 'తగ్గిపోతుందిలే' అనుకుంటారు. అబద్ధాలు. మాటకారి తనం. ఎవరినైనా పిలవాలనుకుంటాడు. కాని ఫలితం శారీరకమైన నొప్పి కన్నా బాధాకరంగా వుంటుంది. "మార్ఫిన్ తీసుకుంటే మేలు. స్పృహ కోల్పోతే నొప్పి తెలియదు. ఎవరితో పని లేదు. డాక్టరును అడుగుతాను." అనుకుంటాడు.

ఓ గంటా మరో గంటా గడుస్తుంది. కాలింగ్ బెల్ మోగుతుంది. డాక్టరు వచ్చాడా?

అవును. డాక్టరే. ఇస్త్రీ చేసిన బట్టల్లో, ఫ్రెష్‌గా నవ్వుతూ ఆరోగ్యంగా. "అనవసర భయాలు పెట్టుకోకు. తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నాం. డోంట్ వర్రీ." అన్నట్టుగా వుంటుందా వైఖరి. ఇది, అంత ధైర్యంగా మాట్లాడవలసిన సందర్భం కాదని అతడికీ తెలుసు. కాని డాక్టరు మరోలా వుండ కూడదు గనుక అలాగుంటాడు. తెల్లకోటు వేసుకున్న తర్వాత 'దేన్నైనా నయం చేస్తాను' అనాలే తప్ప 'లాభం లేదు' అనకూడదు.

వేడికోసం చేతులు ఒక దాంతో ఒకటి రాసుకుంటూ, "బలే చలిగా వుందవతల. ఎటు చూసినా మంచు. ఒక నిమిషం ఆగవోయ్" అంటాడు డాక్టరు–'ఒక నిమిషం ఆగితే పరిస్థితి అంతా చక్కబడుతుంది' అన్నంత ధైర్యంగా.

'ఇంతకూ ఎలావుంది?"

డాక్టరు వుద్దేశమేమిటి? ఇంకెన్నాళ్లుంటాననా? "రాత్రి ఎలా గడిచింది?" – ఇవాన్ ఇల్యిచ్‌నే డాక్టరు తదేకంగా చూస్తూ,

'ఇలా రోజూ అబద్ధాలు చెప్పటానికి సిగ్గెయ్యటం లేదూ!' అనుకుంటాడు ఇవాన్ ఇల్యిచ్.

కాని, డాక్టరుకు యింత చిన్న ప్రశ్న అర్థం కాదు.

"అన్ని రాత్రులూ ఎలా గడుస్తున్నాయో నిన్నా అలాగే గడిచింది. నొప్పి పోదు. తగ్గదు. ఏదన్నా కొత్త మందివ్వరాదూ."

"జబ్బు మనుషులలాగే వుంటారులే. డోంట్ వర్రీ. చేతులు కాస్త నులివెచ్చగా అయినాయి. ప్రస్కోవ్యా కూడా నా టెంపరేచర్ ఓకే అంది. గుడ్ మార్నింగ్ గుడ్ మార్నింగ్" అంటూ కరచాలనం చేస్తాడు.

ఆ వెంటనే, కబుర్లాపి, సీరియస్‌గా మొహం పెట్టి పరీక్ష ప్రారంభిస్తాడు. నాడీ, టెంపరేచర్ చెక్ చేస్తాడు. ఛాతీ మీద కొట్టి చూసి గుండె, వూపిరితిత్తుల పరిస్థితి తెలుసుకుంటాడు.

ఇదంతా పచ్చిమోసం. వట్టి నాన్సెన్స్ అని ఇవాన్ ఇల్యిచ్ ఎప్పుడో గ్రహించాడు. డాక్టర్ వంగినప్పుడు, మోకాళ్లు పరీక్షించినప్పుడు, చెవి ద్వారా ఏవో రహస్య సందేశాలు విన్నప్పుడు, అతడేదో కొత్త విషయం చెప్పబోతున్నాడని ఇంప్రెస్ అవుతాడు ఇవాన్ ఇల్యిచ్–కోర్టులో లాయర్ల వుపన్యాసాలు విన్నప్పుడూ యిలాగే అనిపించేది–వాళ్లు వాగేదంతా పచ్చి అబద్ధమని గ్రహించటానికి ఎంతో సమయం పట్టదు.

డాక్టర్ వంగి పరీక్షిస్తున్నప్పుడు, గది గుమ్మంలో సిల్కుగౌను ముడతలు సరిచేసిన శబ్దం వినిపించింది. డాక్టర్ వచ్చిన విషయం తనకెందుకు చెప్పలేదంటూ, ప్యోత్ర్‌ను చివాట్లేస్తున్నది ప్రస్కోవ్యా.

లోపలికి వచ్చి (ఆచారం ప్రకారం) భర్తను ముద్దాడి, తను అప్పటిదాకా అక్కడే వున్నాననీ, చిన్న గొడవ మూలంగా అప్పుడే బయటికెళ్లాననీ, డాక్టరు అనుకోవాలన్నట్టు ప్రవర్తిస్తుంది.

నఖశిఖ పర్యంతం ఆమెను పరిశీలించి ఆ బట్టల తెలుపు, ఆ వొంటి మెరుపు, బొద్దుగా వున్న చేతులు, సువాసన వేస్తున్న మెడ, భుజాలు, చక్కటి శిరోజాలం కరణను ఏవగించుకుంటాడు. అణువణువునా ఆమె పట్ల అసహ్యం నిండుతుంది. ఆమె స్పర్శ అతనిలో ద్వేషాన్ని పెంచుతుంది.

అతని అనారోగ్యం గురించి ఆమె వైఖరిలో ఏమీ మార్పు లేదు. డాక్టరు లాగే ఆమెకు కూడా అతడి గురించి మొదటినుండీ ఒకే అభిప్రాయం. "పథ్యం పాటించటం లేదు. మందులు సరిగా వేసుకోవడం లేదు. తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోవటం లేదు. అందువలన, ఈ పరిస్థితికి అతనిదే బాధ్యత." తను అతణ్ణి ప్రేమగా చూసుకోగలదు. కాని బలవంతంగా అతనితో ఏమీ చేయించలేదుగా.

"ఎంత చెప్పినా వినడండీ. మహామొండి. ఎలా చచ్చేది. మందులు వేసుకొమ్మని రోజంతా మొత్తుకుంటాను. కాని వేసుకోడే. పైగా, ఆ పడుకునే పద్ధతి చూశారూ, పైకి కాళ్లు పెట్టుకుని పడుకోవటం వల్ల జబ్బు మరింత ముదురుతుంది. అంతా నా ఖర్మ." అంటూ, గెరాసింతో ఎలా కాళ్లు భుజాల మీద పెట్టించుకున్నదీ డాక్టరుకు పూస గుచ్చినట్టు చెప్పింది.

చిరుకోపం ప్రదర్శిస్తూనే, "ఏం చేస్తాం, చెప్పండి. పేషెంట్లు యిలాగే వింత వింతగా ప్రవర్తిస్తుంటారు. మనం చెయ్యగలిగిందేం లేదు." అంటూ నవ్వుతాడు డాక్టరు. డాక్టర్ పరీక్ష తర్వాత, చేతికున్న వాచీలో టైం చూసుకున్నాడు. ఆ తర్వాత, అతడికిష్టమున్నా లేకున్నా ఈ డాక్టరూ, మరో ప్రముఖ డాక్టరూ కలిసి మరోసారి పరీక్షించి చికిత్సా పద్ధతి నిర్ణయిస్తారని ప్రకటించింది ప్రస్కోవ్యా.

"అందువల్ల, ఇక వాదోపవాదాలు అనవసరం. ఇదంతా నీ కోసం కాదు. నా కోసం చేస్తున్నాను సరేనా." అని కూడా అంది వ్యంగ్యంగా. అలా అనటంలో వుద్దేశం అదంతా కేవలం అతడికోసమేనని చెప్పటమేగాక, అతడికి నిరసన తెలిపే అవకాశం యివ్వకపోవటం కూడా. ఇవాన్ ఇల్యిచ్ రోజంతా మూలుగుతూనే వున్నాడు. ఈ సారి కోపంగా మూల్గాడు. ఈ అబద్ధాల మాయాజాలంలో, ఏ మాటలో ఎంత నిజముందో తెలుసుకోవటం అసాధ్యం.

నిజానికి, ఆమె చేస్తున్నదంతా తనకోసమే. అతడి కిష్టమున్నా లేకపోయినా, ఆ నిర్ణయాలన్నింటికీ అంగీకారం తెలపటం అతడి విధి అని ఆమె గాఢ నమ్మకం.

పదకొండున్నరకు 'ప్రముఖ' డాక్టరు రానే వచ్చాడు. మళ్లీ పరీక్ష జరిగింది. మొదట పేషంటు సమక్షంలో, తర్వాత, పక్క గదిలో మూత్రపిండాల గురించీ, అపెండిసైటిస్ గురించీ చర్చలు జరిగాయి. అనేక ప్రశ్నలకు అనేక జవాబులు చెప్పుకున్నారు. అదే ఆత్మ విశ్వాసం. అన్నీ తెలుసుననే భేషజం. ఇవాన్ ఇల్యిచ్ జీవన్మరణ సమస్య కాదు– అతడి మూత్ర పిండం, అపెండిసైటిస్‌లు ముఖ్యం. అతడికేమైనా ఫరవాలేదు. వాటిని బాగు చెయ్యటమెలా అన్నదే వాళ్ల ఏకైక సమస్య. రోజూ వచ్చే వైద్యుడు, ప్రధాన వైద్యుని వాదనను ఖండించి తన చికిత్సా విధానాన్ని కొనసాగిస్తాడు. కాస్త నొచ్చుకున్నా, ఆశావహ దృక్పథంతోనే శలవు తీసుకున్నాడు ప్రముఖ వైద్యుడు. "వ్యాధి నయమయ్యే అవకాశముందా?" అని ఇవాన్ ఇల్యిచ్ దీనంగా అడిగినప్పుడు "హామీ యివ్వలేను గాని అవకాశం

లేకపోలేదు." అంటూ చూపులు తిప్పుకున్నాడు. భర్త అలా వేడుకోవడాన్ని చూడలేని ప్రస్కోవ్యా భళ్లున విలపించి ప్రముఖ వైద్యునికి ఫీజు సమర్పించుకోవటానికి నిష్క్రమించింది.

డాక్టర్లు కల్పించిన ఆశలతో ఇవాన్ ఇల్యిచ్ తన ఆరోగ్యం మెరుగు పడుతుందనుకున్నాడు గానీ ఆ భ్రమలు ఎంతో కాలం నిలవలేదు. అదే గది. అవే (గోడలమీది) బొమ్మలు, అవే పరదాలు, అదే వాల్ పేపర్, అవే మందుల సీసాలు, అదే నొప్పి, అదే శల్యమవుతున్న శరీరం. ఇవాన్ ఇల్యిచ్ నొప్పి భరించలేక మూల్గటం ప్రారంభించాడు. అతనికో ఇంజక్షన్ చెయ్యటంతో స్పృహ కోల్పోయాడు.

మళ్లీ మెలకువ వచ్చే సరికి సాయంత్రమైంది. డిన్నర్ తీసుకొచ్చారు. కొద్దిగా సూప్ తాగడానికి ప్రయత్నించాడు. మళ్లీ మామూలే. నొప్పి. దీర్ఘరాత్రి అప్పుడే ప్రారంభమైంది.

డిన్నర్ తర్వాత, ఏడింటికి, ఈవెనింగ్ డ్రెస్‌లో ప్రస్కోవ్యా గదిలోకి వచ్చింది. ఆమె ఎత్తైన వక్షోజాల్ని బిగించి కట్టుకుంది. మొహం మీది పౌడరు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. సాయంత్రం నాటక ప్రదర్శనకు వెళ్లాలని వుదయమే చెప్పింది. సారా బెర్న్‌హార్ట్ (ఆనాటి ప్రఖ్యాత నటీమణి) వూరికి వచ్చింది. అతడి ఒత్తిడితోనే వాళ్లు సీట్లు కూడా రిజర్వు చేయించుకున్నారు. విషయం మరచి, భార్య అలంకరణను చూసి అతడు నొచ్చుకున్నాడు. కోపం దాచుకుని, కళాపరిచయం పిల్ల ఎదుగుదలకు సహాయం చేస్తుంది అని సరిపెట్టుకున్నాడు.

ప్రస్కోవ్యా సంతోషంగానే వుందిగాని వెళ్ళాలంటే గిల్టీగా వున్నట్టుంది. పక్కన కూర్చుని, "ఎలావుంది?" అంటూ పలకరించింది. మర్యాదకోసం మాట్లాడే పద్ధతి అది. ఎలావుందో నిజంగా తెలుసుకోవాలనే కోరిక ఆమెకు లేదు. ఆమె తెలుసుకోవలసింది కూడా ఏమీ లేదు. సీట్లు రిజర్వు చేసుకోకుండా వుంటే, తను వెళ్లే దాన్నే కానని చెప్పింది. ఆమె అలాగే మాట్లాడుతుందని కూడా అతడికి తెలుసు. పైగా, కూతురూ, ఆమె ప్రేమికుడు కూడా వెళుతున్నారు. ఎక్కడికీ వెళ్లాలని లేదు. తన దగ్గిరే కూర్చోవాలని ఉంది. తను లేనప్పుడు డాక్టరు సూచనలు తప్పక పాటించాలి సుమా!

"ఫ్యోదర్ (కూతురి ప్రియుడు) నిన్ను చూడటానికి వస్తానన్నాడు. రమ్మని చెప్పనా?"

"సరే"

కూతురు అధునాతనంగా డ్రెస్ చేసుకుని వచ్చింది గాని శరీరం మీద తగినంత ఆచ్ఛాదన లేదు. ఏ శరీరమైతే అతణ్ణి యింత యాతనకు గురి చేస్తున్నదో, ఆ శరీరాన్నే ఆమె గర్వంగా ప్రదర్శిస్తున్నది. ఆరోగ్యంగా, అందంగా వున్న ఆ పిల్ల రోగం, బాధ, మృత్యువులను తన ఆనందానికి అవరోధాలుగా భావించింది.

అతడి వెనకాల, స్కూలుకెళ్లే తన కొడుకు కొత్త యూనిఫాం వేసుకుని, కళ్లకింద నల్లటి చారలతో, చేతులకు గ్లవ్స్‌తో నిల్చున్నాడు. వాణ్ణి చూసినప్పుడల్లా ఇవాన్ ఇల్యిచ్‌కి దిగులుగా వుంటుంది. భయంతో బెదిరిపోయే వాడి కళ్లు చూస్తే జాలేస్తుంది. గెరాసిం తర్వాత, తనను పూర్తిగా అర్థం చేసుకున్నది తన కొడుకే అనుకుంటాడు ఇవాన్ ఇల్యిచ్.

అందరూ కూర్చుని, మరోసారి, "ఎలావుంది?" అంటూ పరామర్శించారు. ఆ ప్రశ్నకు నిశ్శబ్దమే సమాధానం. ఆపెరా (నృత్యనాటిక) చూడటానికవసరమైన కళ్లజోడు గురించి తల్లిని అడిగింది కూతురు. ఎక్కడ పెట్టావని తల్లి, కూతుర్ని తిరిగి ప్రశ్నించింది. ఇద్దరి మధ్యా వాదనతో వాతావరణం కాస్త బరువెక్కింది.

"సారా బెర్న్‌హార్ట్ ప్రదర్శనను ఎప్పుడైనా చూశారా?" అంటూ ఇవాన్ ఇల్యిచ్‌ను అడిగాడు ఫ్యోదోర్. మొదట ఆ ప్రశ్న అర్థం కాలేదుగాని, కాసేపటికి అతడి వుద్దేశం గ్రహించి,

"లేదు. నువ్వు చూశావా?" అంటూ తిరిగి ప్రశ్నించాడు ఇవాన్ ఇల్యిచ్.

"ఆఁ. "అడ్రియెన్ లెకూవ్రో" (నాటకం)లో చూశాను." అన్నాడు ఫ్యోదోర్.

ఆ నటి ఏదో ఒక నాటకంలో అత్యద్భుతంగా నటించింది – అంది ప్రస్కోవ్యా. కూతురు, తల్లి అభిప్రాయంతో భేదించింది. ఆ నటి అందచందాల గురించీ సహజ నటనా సామర్థ్యం గురించీ కబుర్లు మొదలైనాయి–అలాంటి విషయాల గురించి అందరూ తరచు అలాగే మాట్లాడతారు.

కబుర్ల మధ్యలో, ఇవాన్ ఇల్యిచ్ వైపు చూసి, ఫ్యోదోర్ మాట్లాడటం ఆపేశాడు. అతడి వైపు చూసి మిగతావాళ్లు కూడా నోరు మెదపలేదు. కోపాన్ని దాచుకోలేక, వాళ్లవైపు నిప్పులు కక్కుతున్నట్టు చూశాడు ఇవాన్ ఇల్యిచ్. పరిస్థితి తక్షణం శాంతించాలి కానీ సరిదిద్దటమెలాగో ఎవరికీ తెలియదు. నిశ్శబ్దాన్ని ఛేదించి ఎవరో ఒకరు మాట్లాడాలి. ఎవరికీ అంత ధైర్యం లేదు. ఇప్పుడు ఎవరు నోరు విప్పినా అబద్ధం పటాపంచలై పోతుంది– మర్యాద మాటున దాగిన అబద్ధం! నిజం బలవంతంగా వాళ్ల కళ్లు తెరిపిస్తుంది.

కూతురు కలగచేసుకుని, –దాచుకోలేక, మాట్లాడక తప్పని పరిస్థితిలో, ధైర్యం చేసి–

"నాటకానికి వెళ్లదలుచుకుంటే త్వరగా బయల్దేరటం మంచిది." అంది వాచి వైపు చూసుకుంటూ– అది తండ్రిచ్చిన కానుకే. తరువాత తన ప్రియుడి వైపు చూసి ఏదో అన్నది గాని అది వాళ్లిద్దరికే తప్ప మరెవరికీ అర్థం కాలేదు. ఆ వెంటనే, డ్రెస్ సరిచేసుకుంటూ లేచి నిల్చుంది.

ఆ తర్వాత అందరూ లేచి వీడ్కోలు చెప్పి వెళ్లి పోయారు.

ఆ నిష్క్రమణ తర్వాత ఇవాన్ ఇల్యిచ్‌కు నిజమైన ప్రశాంతి లభించిన అనుభూతి కలిగింది. అబద్ధం బద్దలైంది. వాళ్ల వెంటే వెళ్లిపోయింది. కాని, నొప్పి మిగిలింది. అదే నొప్పి. అదే భయం. క్షణ క్షణానికీ దిగజారుతున్న ఆత్మస్థైర్యం.

ఒక్కొక్క నిమిషం భారంగా గడిచింది. గంటలు గడవటమెలా? ప్యోత్ర్ ఏదో అడిగాడు.

"గెరాసింను పంపించు." అంటూ గొణిగాడు ఇవాన్ ఇల్యిచ్.

## 8

ఆ రాత్రి ఆలస్యంగా యింటికి తిరిగి వచ్చిన భార్య నిశ్శబ్దంగా అడుగులు వేస్తూ లోపలికి ప్రవేశించింది. అయినా ఆమె అడుగుల చప్పుడు అతనికి వినిపించింది. కళ్లు తెరచి చూసి మళ్లీ కళ్లు మూసుకున్నాడు. గెరాసింను పంపించి వేసి తనే అతని పక్కన కూర్చోవాలనుకుంది కాని అతను కళ్లు తెరిచి,

"వద్దు. నువ్వే వెళ్లిపో." అన్నాడు.

"నొప్పి ఎక్కువగా వుందా?"

"దాని దారి దానిది"

"కాస్త నల్లమందు తీసుకో."

సరేనంటూ కొద్దిగా తాగాడు. ఆమె వెళ్లిపోయింది.

తెల్లవారి మూడింటిదాకా అతడు భరించలేని బాధతోనే అపస్మారక స్థితిలో గడిపాడు. తననూ, తన నొప్పినీ కలిపి ఒక నల్లటి గోనెసంచీలోకి కూరుతున్నారు. కాని ఎంత కూరినా తాము అడుగుకు మాత్రం అందుకోలేకపోతున్నాం అనిపించింది అతనికి. తనూ, నొప్పీ కలసి ఈ సంచీలో వుండక తప్పని పరిస్థితే బాధ సంచీ అంటే భయమే. కాని త్వరగా అడుగుకు చేరితే బాగుండును. బాధతో నిత్యమూ ఘర్షణే. అయినా దానికి సహకరిస్తూనే వున్నాడు. అంతలో స్పృహ వచ్చింది. గెరాసిం యింకా మంచం కాళ్ల వద్ద కూర్చుని జోగుతున్నాడు. ఎంత ఓపిక! వాడి భుజాల మీద, మేజోళ్లు తొడిగిన, శిథిలమైన తన కాళ్లు విశ్రాంతి తీసుకుంటున్నాయి. కొవ్వొత్తిపైన అదే షేడ్. అదే నొప్పి.

"ఇక వెళ్లిపో గెరాసిం." అన్నాడు. గొంతు బలహీనంగా వుంది.

"ఫరవాలేదు సార్, మరి కాసేపుంటాను."

"లేదు, వెళ్లిపో."

కాళ్లు కింద పెట్టి, పక్కకు తిరిగి, చెంపకు చెయ్యి పెట్టుకుని విచారంగా కనిపించాడు గెరాసిం. వాడు పక్క గదిలోకి వెళ్లగానే, ఇక ఆపుకోలేక, పసిపిల్లాడిలా వెక్కివెక్కి రోదించాడు ఇవాన్ ఇల్యిచ్. నిస్సహాయత, ఏకాకిగా బతుకుతున్నాననే బెంగ, చుట్టూ వున్న మనుషుల క్రౌర్యం, భగవంతుని నిర్దయ, కాఠిన్యం, దేవుడు లేడనే నిరాశ-అన్నీ కలిసి కన్నీళ్ల వర్షం కురిసింది.

"ఎందుకిలా చేశావు? ఎందుకు నాకీ స్థితి కల్పించావు? ఎందుకీ చిత్రహింస? ఎందుకు ఏ పాపానికి?"

అతడు సమాధానాలు ఆశించటం లేదు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు లేవు గనకా, వుండవు గనకా రోదించాడు. నొప్పి మళ్లీ పెరిగింది. కాని ఈ సారి అతడు కదల్లేదు. ఎవర్నీ పిలవలేదు. "హింసించు. ఇంకా హింసించు. కాని, ఎందుకిలా చేస్తున్నావో చెప్పు. ఏ పాపానికీ శిక్ష? ఏ నేరం చేశాన్నేను?"

అని తనలో తాను మాట్లాడుకున్నాడు.

తరువాత, స్థిమితపడి, ఏడుపాపి, వూపిరి బిగపట్టి ఏకాగ్రతతో ఆలకించాడు- వినిపించని వాణిని వింటున్నట్టుగా తన ఆత్మ, వుబికి వస్తున్న ఆలోచనలతో మాట్లాడుతున్నది.

"ఏం కావాలి నీకు?" వ్యక్తపరచగలిగిన మొదటి మాట అది.

"ఏం కావాలి నీకు? ఏం కావాలి నీకు?" అంటూ పునశ్చరణ చేసుకుని, "ఏమిటి? బాధ పడకూడదా? ఇంకా బతకాలా?" అని సమాధానం చెప్పుకున్నాడు.

మరోసారి, మరింత శ్రద్ధగా విన్నాడు. ఈసారి పెరుగుతున్న నొప్పి కూడా అతని దృష్టిని మళ్లించ లేకపోయింది.

"బతకాలా? ఎలా?" అని అడిగింది ఆత్మ వాణి.

"ఎలాగేమిటి? ఎప్పటిలాగే. హాయిగా, సరదాగా."

"అదెలా సాధ్యం?"

తన జీవితంలోని ఆనందకరమైన క్షణాలన్నీ మననం చేసుకున్నాడు. కాని, ఆ జ్ఞాపకంలో అప్పటి ఆనందం కనిపించలేదు-బాల్య స్మృతులలో తప్ప. బాల్యం నిజంగా, ఎంత సంతోషంగా గడిచింది-ఆ రోజులు తిరిగి రాగలిగితే శాశ్వతంగా ఆ దశలోనే జీవించగలిగితే ఎంత బాగుంటుంది! కాని, ఆ ఆనందాన్ని అనుభవించిన వ్యక్తి యిప్పుడు లేడు. మరొకరి జీవితంలోని సంఘటనలను గుర్తు చేసుకుంటున్నట్టనిపించింది.

ప్రస్తుతమున్న ఇవాన్ ఇల్యిచ్ దశకు వచ్చేసరికి, ఆనందమంతా ఆవిరై, యవ్వనం లోని ఆ సరదాలు సుఖాలు చాలా తుచ్ఛమైనవిగా, అసహ్యమైనవిగా కనిపించాయి.

బాల్యం తర్వాత ఏమైనా మంచి యింకా వుందనుకుంటే అప్పుడు మాత్రమే మిగిలివుంది. ఆ స్నేహితుల పరిచయాలలో, ఆటపాటలలో నైర్మల్యం వుంది. జీవితం పట్ల 'ఆశ' కూడా వుంది. పెద్ద మనుషుల తరగతికి చేరుకునే సరికి జీవితంలోని 'అమాయకత్వం, స్వచ్ఛత, మంచితనం' చచ్చిపోయాయి. ఆ తర్వాతి రోజుల్లో కూడా కొన్ని మధుర క్షణాలు లేవని కాదు-స్త్రీ పట్ల తొలిప్రేమ అనుభూతి గొప్పది. ఆ తర్వాత జ్ఞాపకాలన్నీ కలగాపులగమై, 'మంచి' తక్కువా, అక్కర్లేనిది ఎక్కువా అయింది. కాలక్రమంలో 'మంచి' తగ్గుతూ వచ్చింది.

తన పెళ్లి-అది కేవలం ఒక యాదృచ్ఛిక సంఘటన- త్వరలోనే దాని గురించి తొలగిన భ్రమ, భార్య నోటి దుర్వాసన, కాముకత్వం, భేషజం-, డబ్బు సమస్యలు..... అన్నీ గుర్తు కొస్తున్నాయి. అలాగే, ఏడాది, రెండేళ్లు, పదేళ్లు, ఇరవై ఏళ్లు గడిచాయి. సమస్యలవే. కాని కాలం గడిచిన కొద్దీ పరిస్థితి మరింత విషమంగా మారింది. భరించటం కష్టమైంది.

"శిఖరాన్ని ఎక్కుతున్నాననే భ్రమలో కిందికి జారాను. అవును. సరిగ్గా అదే జరిగింది. జనం దృష్టిలో నేను పై మెట్టుకు చేరుకున్నాను. కాని జీవితం నాకు తెలియకుండానే జారి పోయింది. ఇప్పుడేమీ మిగల్లేదు-మరణం తప్ప!

దీని అర్థమేమిటి? ఎందుకిలా జరిగింది? అంత మూర్ఖంగా, అంత అసహ్యంగా ఎలా బతికాను? ఎంత ఆలోచించినా అంతు పట్టటం లేదు. జీవితం నిజంగా మూర్ఖంగా అసహ్యంగా వుంటే నేనెందుకు చావాలి మరి? ఈ బాధను భరిస్తూ మరీ చావాలా? ఏదో తిరకాసుంది. ఎక్కడో తప్పు జరిగింది. బహుశా, నేను జీవించవలసిన పద్ధతిలో జీవించలేదు......కాని చెయ్యవలసినవన్నీ, నిర్వర్తించాల్సిన బాధ్యతలన్నీ నిర్వర్తించానే! "అనుకున్నాడు. అలా, పీటముడి లాంటి అంతుపట్టని జీవిత సమస్యకున్న ఒకే ఒక పరిష్కారాన్ని, అసాధ్యమనుకుని తిరస్కరించాడు.

"ఏం కావాలి నీకు? బతుకుతావా? ఎలా బతుకుతావు? కోర్టు బంట్రోతు "కోర్టు ప్రారంభమవుతోంది?" అంటూ అరిచి, నిన్ను తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెడతాడే-అలా బతుకుతావా?" అనుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. "ఇక తీర్పు వెలువడబోతున్నది. నేను నేరం చెయ్యలేదు. అయాం నాట్ గిల్టీ." అంటూ అరిచాడు. కాసేపటికి రోదన ఆపి, గోడకు తిరిగి, "ఎందుకీ హింస? ఎందుకీ నరకం!" అంటూ ప్రశ్నించాడు.

కాని, ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. తను బతకవలసిన పద్ధతిలో బతక లేదనే వూహ వచ్చింది గాని, తాను చాలా చక్కగా, ఆదర్శంగా బతికినప్పుడు అలాంటి వింత ఆలోచనే అనవసరమనుకుని దాన్ని మొగ్గలోనే చిదిమేశాడు.

## 9

మరో రెండు వారాలు గడిచాయి. ఇవాన్ ఇల్యిచ్ సోఫా పై నుండి లేవలేదు. మంచం మీద యిష్టం లేక సోఫా మీద పడుకున్నాడు. అక్కడ గోడకు తిరిగి పడుకుని, ఒంటరిగా బాధనుభవించాడు. ఎంత ఆలోచించినా, అనూహ్యమైన, కారణం తెలియని బాధ. "ఏమిటి? ఎందుకిలా జరుగుతోంది? నిజంగా ఇది మృత్యువేనా?" అంతర్వాణి అవునని సమాధానం చెప్పింది. మరో ప్రశ్న "కాని హింస ఎందుకు?" "ప్రత్యేకమైన కారణమేమీ లేదు. అదంతే." ఈ ప్రశ్నలకు ముందూ వెనకా అంతా శూన్యం.

వ్యాధి పారంభమైన నాటి నుండీ, డాక్టరును మొదటిసారి సంప్రదించిన నాటి నుండీ ఇవాన్ ఇల్యిచ్ జీవితం రెండు పరస్పర విరుద్ధమైన భావనల మధ్య కొట్టు మిట్టాడుతున్నది. ఒకటి నిరాశ. నిస్పృహ. అనివార్యమైన మృత్యువు. మరొకటి ఆశావహ దృక్పథం. తనను తాను పరిశీలించి చూసుకుని, ఆరోగ్యం కుదుట పడకపోదనే ఆశ. ఒక మూత్రపిండం, ఒక ప్రేగు తాత్కాలికంగా విధులు నిర్వర్తించటం లేదు. అది చాలా చిన్న విషయం. మరోసారి, అంతుపట్టని, భయానకమైన మృత్యువు సమీపిస్తున్నదన్న భయ విహ్వలత.

మొదటి రోజుల్లో రెండు భావనలూ సమపాళ్ల లోనే వున్నా, వ్యాధి ముదిరిన తర్వాత, పాడైన మూత్రపిండం గురించీ, ఆసన్నమవుతున్న మరణం గురించి మాత్రమే ఆలోచిస్తున్నాడు.

మూడునెలల క్రితం తనెలా వున్నాడు, ఇప్పుడెలా వున్నాడు అని చూసుకున్నా, ఆరోగ్యం ఎంతగా దిగజారిందీ స్పష్టంగా తెలుస్తుంది. ఇప్పుడిక ఆశ లేదు.

గతకొన్నాళ్లుగా గోడవైపుకు తిరిగి పడుకుని సోఫా మీద ఒంటరి జీవితం గడుపుతున్నాడు. జనసాంద్రత అధికంగా వున్న ఈ నగరంలో, లెక్కకు మించిన బంధు మిత్రుల మధ్య తనది ఏకాకి జీవితం. భూగర్భంలోనైనా, సముద్రపు లోతుల్లో నైనా యింత ఒంటరితనం వుండదు. ఆ చివరి రోజుల్లో కేవలం గతస్మృతుల సాహచర్యంలో మాత్రమే గడిపాడతడు. గడిచిన సంఘటనలన్నీ ఒక దాని తర్వాత ఒకటి గుర్తుకొచ్చాయి. ఇటీవలి జ్ఞాపకాలతో ప్రారంభమై క్రమంగా వెనక్కెళ్లాయి- చివరికి శైశవానుభవాల దాకా. వుదయం తిన్న వుడికిన ప్రూన్ పళ్ల గురించి ఆలోచిస్తే, బాల్యంలో తిన్న, వడిలిపోయిన, కచ్చిగాయలు(అని ఫ్రెంచి ప్రూన్ కాయలు) గుర్తుకొచ్చాయి. వాటి ప్రత్యేకమైన రుచికి నోట్లో నీరూరింది. ఆ ఒక్క జ్ఞాపకంతో, ఆ రోజుల అనేక సంఘటనలు కూడా మనో ఫలకం మీద మెదిలాయి- తనను పెంచిన నర్సు, తన తమ్ముడు. తన బొమ్మలు. "ఆ విషయాలు ఆలోచించ గూడదు. అవి చాలా బాధాకరం." అనుకుని మళ్లీ ప్రస్తుత స్థితివైపు మనసు మళ్లించుకున్నాడు – సోఫా వెనకవైపున్న బటన్ వైపూ, ముడత వైపూ చూసి,

ఈ సోఫా చర్మం చాలా ఖరీదైంది. అయినా ఎక్కువ రోజులు మన్నదు. దీని గురించి మా యిద్దరి మధ్యా పోట్లాట గూడా జరిగింది. అవును. ఒకసారి, నాన్న తోలు బ్రీఫ్‌కేస్ చించినప్పుడు దెబ్బలు పడ్డాయి. కాని అమ్మ మిఠాయిలిచ్చింది తర్వాత. మరోసారి బాల్యంలోకి. అవే నిరంతరమైన ఆలోచనలు.

ఈ జ్ఞాపకాలతో సమాంతరంగా, వ్యాధి గురించిన ఆలోచన కూడా కొనసాగింది. ఇక్కడ కూడా ఎంత వెనక్కెళ్లితే, జీవితం అంత విశాలంగా తోచింది. తొలి రోజుల్లోనే జీవితంలో 'మంచి' ఎక్కువగా వుండేది. క్రమేపీ అది తగ్గింది. పైగా, తరువాతి కాలంలో అవి పోల్చుకోలేనంతగా పెనవేసుకు పోయాయి. "బాధ పెరిగింది. జీవితం కూడా నరకకూపంలో కూరుకుపోయింది." అనుకున్నాడు. ఏమైనా వెలుగంటూ వుంటే అది బాల్యంలోనే. తరువాతంతా చీకటే.-అది కూడా మొదట మసకబారి నట్టి తరువాత దట్టమైన, కన్నుపొడుచుకున్నా కనిపించనంత చీకటిగా మారింది. 'మృత్యువు' సమీపించిన కొద్దీ చీకటి కూడా పెరిగింది. అనుకున్నాడు ఇవాన్ ఇల్యిచ్. "కొండపై నుండి కిందికి జారిపడుతున్న రాతిబండ" అనబడే దృశ్యం అతని మనసులో గాఢంగా నాటుకు పోయింది. బాధలు క్రమంగా పెరుగుతూ వచ్చిన జీవితం, చివరి దశలో అత్యంత వేగంగా కిందికి పడిపోతుంది. అవును. చివరి క్షణాలు అత్యంత బాధాకరం. "నేను కిందికి పడిపోతున్నాను....." వణుకొచ్చింది. ఉలిక్కిపడ్డాడు. పడి పోకుండా ప్రతిఘటించటానికి ప్రయత్నించాడు. కాని ఆ దశలో ఏ ప్రయత్నాలూ ఫలించవు. ముందుకు చూడటానికి ధైర్యంలేక, సోఫా వెనక వైపు చూస్తూ నిరీక్షించాడు. 'ప్రతిఘటన అసాధ్యం' అనుకున్నాడు. ఈ బాధకు కారణం తెలుసుకోగలిగితే చాలు. కాని, అదీ అసాధ్యమే 'బతకవలసిన పద్ధతిలో నేను బతకలేదు' అనుకుంటే కారణం స్ఫురిస్తుందా? కాని, ఆ వ్యాఖ్యానాన్నే నేను అంగీకరించను. అన్ని నియమాలకు, సాంప్రదాయాలకు, చట్టాలకు లోబడి దేన్నీ, ఎక్కడా వుల్లంఘించకుండా గడచిన జీవితం-అది 'జీవించవలసిన పద్ధతి కాదు' అని ఎలా అంగీకరిస్తాను?

అంగీకరించడు గనకనే, మిగతా ఏ ప్రశ్నకూ సమాధానం దొరకదు. "మరే, వివరణా అనవసరం. బాధ, మృత్యువు ఎందుకు?"

## 10

అలాగే, మరో రెండు వారాలు గడిచాయి. ఈ కాలంలోనే ఇవాన్ ఇల్యిచ్, అతని భార్యా ఆశగా ఎదురు చూసిన శుభ ఘడియ వచ్చింది. ఫ్యోదోర్, కూతుర్ని పెళ్లి చేసుకోవటానికి అంగీకారం తెలిపాడు. ఒక సాయంత్రం జరిగిందా సంఘటన. మరునాడు, ఈ విషయం భర్త చెవిన వెయ్యటం ఎలా అని సందేహిస్తూ అతని గదిలోకెళ్లింది. కాని, ఆ క్రితం రాత్రే అతని పరిస్థితి మరింత దిగజారింది. సోఫా మీదే వున్నాడు గాని పొజిషన్ మారింది. వెల్లకిలా పడుకున్నాడు. మూలుగుతున్నాడు. కళ్లు కదల్చకుండా చూరుకేసి చూస్తున్నాడు.

మందుల గురించి ఏదో ప్రస్తావించింది ప్రస్కోవ్యా. అతడు కళ్లు ఆమె వైపు తిప్పాడు. అతని కళ్లలోని కోపం, ద్వేషం చూసి ఆమె భయపడిపోయి, చెప్పాలనుకున్నది చెప్పకుండానే గది వెలుపలికొచ్చేసింది.

"భగవాన్! కనీసం నన్ను ప్రశాంతంగా చావనివ్వవా!" ఆ అరుపు విని ఆమె పరుగెత్తబోయింది గాని అప్పుడే తండ్రికి గుడ్‌మార్నింగ్ చెప్పటానికి వచ్చింది కూతురు. ఆమె వైపు కూడా ఆలాగే కోపంగా చూశాడతడు. ఎలాగున్నావని అడిగితే త్వరలోనే యిద్దరికీ తన పీడా విరగడవుతుందన్నాడు. ఇద్దరూ ఒక నిమిషం మౌనంగా అతడి వైపు చూసి నిష్క్రమించారు.

"ఇందులో మన తప్పేముంది?" అంటూ తల్లిని అడిగింది కూతురు.

"నాన్న పరిస్థితి చూస్తే జాలేస్తుంది. కాని ఆయన మనల్నిలా హింసించడమెందుకు?"

యధావిధిగా డాక్టరు వచ్చాడు. అతడేమడిగినా, ఇవాన్ ఇల్యిచ్ ముభావంగా 'అవును' 'కాదు' అంటూ జవాబులు చెబుతూ, కోపంగా వురిమురిమి చూశాడు.

చివరికి,

"నువ్వింక ఏమీ చేయలేవని నీకూ తెలుసు. నా మానాన నన్ను వదులు ఇకనైనా." అన్నాడు.

"మీ బాధ మేం తగ్గించగలం." అన్నాడు డాక్టరు. ఆ తర్వాత, డ్రాయింగ్ రూంలో కెళ్లి, "పరిస్థితి చాలా విషమంగా వుంది. అతను బాధపడకుండా వుండటానికి యివ్వగలిగిన ఒకే ఒక ఔషధం నల్లమందు" అని ప్రస్కోవ్యాతో చెప్పాడు.

"శారీరక బాధ చాలా ఎక్కువగా వుంది." అన్నాడు డాక్టరు.

అది నిజమే. అయితే అంతకన్నా తీవ్రమైనది అతని నైతికగ్లాని. అదే అతని చివరి క్షణాలను నరకప్రాయం చేస్తున్నది.

ఆ నైతిక గ్లానికి కారణం క్రితం రోజు రాత్రి, ఆరోగ్యవంతమైన, వుత్సాహంగా సేవ చేస్తున్న గెరాసిం ముఖాన్ని పరిశీలించినప్పుడు ఒక్కసారిగా ఒక ప్రశ్న వుత్పన్నమైంది. "నా జీవితం, నాకు తెలిసిన నా జీవితమంతా- నిజం కాదు- అయితే అబద్ధమా?"

ఇన్నాళ్లూ తను తెలుసుకోవటానికి నిరాకరించిన సత్యం-

అనూహ్యమనుకున్నది-బతకవలసిన పద్ధతిలో బతకలేదన్న విషయం-

యిప్పుడు గ్రహింపునకు వస్తున్నదా? అదే నిజమా? సంపన్నులు, మర్యాదస్తులు, కులీనులు అభిలషణీయమనుకున్న వాటిపట్ల నిరసన తెలపాలన్న చిన్న చిన్న కోరికల్ని చంపుకోవటం, అణచుకోవటం తన జీవితాన్ని కలుషితం చేసింది. సత్యం మీద ముసుగు గప్పి అసత్యాన్ని నిజమని తనను తాను నమ్మించుకున్నాడు. తన అధికార విధి నిర్వహణ, హోదా, కుటుంబం, ఇతరుల విలువలు తనవే అనుకుని ఆచరించటం, వృత్తిధర్మం-యివేవీ నిజం కాదు. ఇన్నాళ్లూ వాటిని సమర్థించాడు. ఇప్పుడు వాటి డొల్ల తనం, వాటి అసత్య స్వరూప స్వభావాలు గ్రహింపునకు వస్తున్నాయి. ఈ దశలో, తను సమర్థించవలసినదంటూ ఏమీ మిగలలేదు.

"అంటే, అమూల్యమైన జీవిత విలువల్ని చేజేతులా నాశనం చేసుకున్నాను, ఇక సరిదిద్దుకునే అవకాశం కూడా లేదన్న స్పృహతో జీవితానికి వీడ్కోలు చెబుతున్నానా? ఇప్పుడెలా మరి?" అంటూ వెల్లకిలా పడుకుని గతాన్ని ఈ కొత్త వెలుగులో పునస్సమీక్షించుకున్నాడు.

ఉదయం, మొదట పని మనిషినీ, తరువాత భార్యను, తరువాత కూతుర్ని, తరువాత డాక్టర్ని చూసినప్పుడు వాళ్ల ప్రతి మాట, చూపు, చేతలు అన్నీ తన కొత్త అవగాహనను ధృవపర్చాయి. వాళ్లలో అతను, తనను తాను చూసుకున్నాడు. తన అబద్ధపు బతుకు, జీవన్మరణ వాస్తవాల్ని విస్మరించిన ఆత్మ వంచన, అసత్యాన్ని సత్యంగా నమ్మిన భ్రమ వాళ్లలో ప్రతిఘటించింది. ఈ అవగాహన, ఈ చైతన్యం అతని శారీరక బాధను పదిరెట్లు తీవ్రతరం చేసింది. మూలుగుతూ, అటూ యిటూ పొర్లుతూ బెడ్‌షీట్లు పిడికిళ్లతో పట్టుకుని లాగాడు. అందరూ కలసి తనకు వూపిరాడకుండా చేస్తున్నారనిపించింది. అందువల్ల వాళ్లపట్ల అసహ్యం మరింత పెరిగింది.

అతని కేకలు వినలేక పెద్ద డోసు నల్లమందు తాగించటంతో స్పృహ కోల్పోయాడు. కాని డిన్నర్ వేళకు మళ్లీ మొదలైంది గోల. అరిచి, అందర్నీ పంపించి వేసి, పిచ్చిగా అటూయిటూ పొర్లాడాడు.

భార్య వచ్చి అనునయంగా పలికింది.

"ప్లీజ్. నా మాట నమ్మండి. ఒక్కసారి. నా కోసం. (నా కోసం?) దీని వల్ల మంచే జరుగుతుంది గాని చెడు జరగదు. నమ్మండి. ఆరోగ్యవంతులు కూడా దీన్ని తీసుకుంటారు. సందేహించకండి. ప్లీజ్."

కళ్లు తెరిచాడు.

"ఏమిటి? సాక్రమెంట్ తీసుకోనా? (తులసి తీర్థమా?) ఎందుకు? ఎందుకిస్తున్నావు? అంతా అయిపోయిందా?"

ఆమె కన్నీళ్లు పెట్టుకుంది. బిగ్గరగా ఏడ్చింది.

"తీసుకుంటావు గదూ! ప్రీస్ట్ కోసం కబురు పెడతాను. ఎంత మంచివాడో!"

"గుడ్. అలాగే కానీ."

ప్రీస్ట్ వచ్చి, కన్ఫెషన్ విన్న తర్వాత, కాస్త స్థిమిత పడి, సందేహ నివృత్తి జరిగి,- దాని పరిణామంగా బాధ కూడా కొంత తగ్గింది-

ఒక్కక్షణం ఆశ చిగురించింది. మరోసారి, అపెండిసైటిస్ గురించి ఆలోచించి, దానికి చికిత్స జరిగే అవకాశమూ లేక పోలేదనుకున్నాడు. సాక్రమెంట్ తీసుకుంటున్నప్పుడు, అతడి కళ్లలో నీరు నిండింది.

అతణ్ణి కిందికి చేర్చినప్పుడు ఆరోగ్యం మెరుపడినట్లనిపించి, జీవితం పట్ల ఆశ పెరిగింది. డాక్టర్లు ప్రతిపాదించిన ఆపరేషన్ గురించి కూడా ఆలోచించాడు. "బతకాలి, ఎలాగైనా బతకాలి." అనుకున్నాడు.

సాక్రమెంటు తీసుకున్నందుకు భార్య అభినందించింది.

"ఇప్పుడు మెరుగ్గా వుంది గదూ?" అని కూడా అడిగింది.

"అవును." అన్నాడతడు ఆమె వైపు చూడకుండానే.

ఆమె దుస్తులు, ఆమె స్వరం, ఆమె ముఖ కవళిక అన్నీ, 'ఇది నిజం కాదు' అని అరుస్తున్నాయతని చెవుల్లో. "నీ బతుకంతా అబద్ధం. అసత్యం ఆధారంగా బతికిన బతుకు. ఆత్మవంచనతో బతికిన బతుకు. జీవన్మరణ వాస్తవాలను విస్మరించిన బతుకు." ఈ ఆలోచన రాగానే అతనిలో అసహ్యం పెల్లుబికింది.

గునపాలతో గుచ్చినట్టుగా భరించలేని నొప్పి మళ్లీ మొదలైంది. నొప్పితో పాటే అంతిమ క్షణాలు ఆసన్నమయినాయనే గ్రహింపు. నొప్పి యిప్పుడు కొత్త దశకు చేరుకుంది.

నులిమినట్టు, పొడిచినట్టు, వూపిరాడనట్టు కూడా వుంది.

'అవును' అన్నప్పుడే అతని మొహం వివర్ణమైంది. బాధతో విచిత్రంగా ముడుచుకు పోయింది. ఆ మాట తర్వాత, అతడు భార్యవైపు సూటిగా చూశాడు. అంత బలహీనంగా వున్న వ్యక్తి అలా చూడటం అసాధారణమే.

ఆ తర్వాత, బోర్లా పడుకుని "వెళ్లిపో. వెళ్లిపో. నన్నొంటరిగా వదులు." అంటూ గొంతు చించుకుని అరిచాడు.

## 12

ఆ క్షణం నుండే అరుపులు మొదలయ్యాయి- మూడు రోజుల పాటు నిర్విరామంగా. ఎంత పెద్ద అరుపులంటే రెండు గదుల ఆవల వున్నవాళ్లు కూడా భయంతో వణికిపోయారు. భార్య మాటకు 'అవును' అని జవాబు చెప్పినప్పుడే తను అంతా పోగొట్టుకున్నాననీ, అదేదీ తిరిగి రాదనీ, యిక ముగింపు తథ్యమనీ గ్రహించాడు. ఆ చరమ క్షణంలో కూడా తీరని సందేహాలు అతడి వెంటే వున్నాయి.

"వద్దు. వద్దు. నో. నా కొద్దు" అంటూ అనేక సార్లు, అనేక రకాలుగా అరిచాడు. అతను చేసిన ప్రతి శబ్దం 'ఓ' అంటూ ధ్వనించింది.

మూడు రోజులు-కాలం అతనికి తెలియదు-అదృశ్య శక్తి ఏదో అతణ్ణి నల్లని గోతాంలో కూరుతోంది. లోపలికి తోస్తున్నది. ఉరికంబమెక్కిన వ్యక్తి తలారిని ప్రతిఘటించినట్టుగా నిష్ఫలమని తెలిసీ-ప్రతిఘటించాడు. ఒక్కొక్క క్షణం గడిచిన కొద్దీ తను నిరాకరిస్తున్న భయానక సత్యానికి చేరువయ్యాడు. తను ఆ చీకటి గహ్వరంలోకి నెట్టివేయబడుతున్నందుకూ, అందులోకి త్వరగా చేరలేనందుకు కూడా గ్లాని అనుభవించాడు. తను జీవించిన పద్ధతి సరైనదేననే విశ్వాసం అతడు లోపలికి చేరకుండా అడ్డుకుంది.

ఇలా తనను తాను సమర్థించుకోవటం వల్ల అతడు ముందుక్కదలటం సాధ్యం కాలేదు. ఆ విశ్వాసమే అన్నింటికన్న ఎక్కువగా అతడి మరణ వేదనను కూడా యినుమడింప చేసింది.

ఆకస్మాత్తుగా, అతని ఛాతీ మీదా, పక్కలోనూ బలంగా మోదింది ఒక శక్తి. ఆ దెబ్బకు వూపిరి తీసుకోవటం కష్టమైంది.

ఎట్టకేలకు, చీకటి గహ్వరం అట్టడుగుకు చేరుకున్నాడు. ఏదో మెరుస్తూ కనిపించిందక్కడ. అసలు జరిగిందేమిటంటే, రైల్లో కూర్చుని ముందుకు పోతున్నాం అనుకుంటాం గాని నిజానికి వెనక్కు కదులుతుంటామే-అలా. చివరి క్షణాన గాని మనమెటువైపు కదులుతున్నామో తెలిసిరాదు.

"అవును. అది నిజం కాదు.  అయితేనేం. దాన్నే సత్య మార్గంగా చేసుకోగలను. కాని సత్యమేమిటి?" అని ప్రశ్నించుకున్న ఇవాన్ ఇల్యిచ్‌ను తక్షణమే అంతిమ ప్రశాంతత కమ్మేసింది.

మూడోరోజు సాయంత్రం, అతని మరణానికి ఒక గంట ముందు జరిగిందీ పరిణామం. అప్పుడే, అతని కొడుకు నెమ్మదిగా గదిలోకి ప్రవేశించి తండ్రి వద్దకెళ్లాడు. మరణ వేదనలో వున్న వ్యక్తి బిగ్గరగా కేకలు వేస్తూ, రెండు  చేతులూ కొట్టుకుంటున్నాడు- ఒక చెయ్యి కొడుకు తల మీద పడింది. కొడుకు దాన్ని గట్టిగా పట్టుకుని పెదాలతో నొక్కి రోదించాడు. ఆ క్షణంలో ఇవాన్ ఇల్యిచ్‌కు వెలుగు కనిపించింది. జీవితం గడపవలసిన పద్ధతిలో గడప లేదనీ, అయినా పరిస్థితి చక్కదిద్దవచ్చుననీ బోధపడింది.

"కాని నిజమేమిటి?" అని ప్రశ్నించుకుని, (అంతర్వాణిని) వింటూ ప్రశాంతంగా వుండి పోయాడు. అప్పుడే తన చేతినెవరో ముద్దాడుతున్నట్టు తెలిసింది. కళ్లు తెరిచి కొడుకును పలకరించాడు. వాడిని చూస్తే బాధేసింది. భార్య గదిలోకి ప్రవేశించి అతని చెంతకు చేరింది. అతడామె వైపు చూశాడు.

ముక్కుమీదా, చెక్కిళ్ల మీదా కన్నీరు ధారలు కట్టగా, విషణ్ణ వదనంతో ఆమె అతణ్ణి తదేకంగా చూసింది. అతనికి కూడా ఆమెను చూస్తే బాధేసింది.

"అవును. నేను వాళ్లను హింస పెడుతున్నాను. వాళ్లు నా గురించి విచారిస్తున్నారు. నేను మరణిస్తేనే వాళ్లకు మంచిది" అనుకున్నాడతడు. ఈ మాటలు వాళ్లతో చెప్పాలనుకున్నాడు. శక్తి చాలలేదు. "కాని చెప్పటమెందుకు. ఏదైనా చేసి చూపించాలి." అనుకుని, భార్యవైపు చూసి, కొడుకును చూపిస్తూ,

"వాణ్ణి తీసికెళ్లు. వాడి గురించీ, నీ గురించీ బాధగా వుంది." అనాలనుకుని, 'మరచిపో' అన్నాడు. మాట సరి చేసుకునే ఓపిక లేక ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. 'అర్థం చేసుకోదలచిన వాళ్లు అర్థం చేసుకుంటారులే' అని సరిపెట్టుకున్నాడు.

అకస్మాత్తుగా-అతణ్ణి బాధిస్తున్నదీ, విముక్తి లేకుండా చేస్తున్నదేదో తొలగి పోతున్నట్టుగా రెండు వైపుల నుండి, పది వైపుల నుండి, అన్ని వైపుల నుండి-తెలిసి వచ్చింది. వాళ్లంటే బాధగా వుంది. వాళ్లు గాయపడకుండా ఏమైనా చేయాలి. కాని తనకూ, వాళ్లకూ విముక్తి దొరకటం ఎంత సులభం! అవును. ఇప్పుడు నొప్పి మాయమైంది.

"నొప్పీ, ఎక్కడికి పారిపోయావు?" అనుకున్నాడు.

ఆ తర్వాత, అది తిరిగి వస్తుందేమోనని ఓపికగా నిరీక్షించాడు.

"ఆc. అక్కడే వుంది. ఉండనీ. ఉంటేనేం!"

మృత్యువు కోసం అన్వేషించాడు గాని అదెక్కడా కనిపించలేదు. మృత్యువెక్కడ? మృత్యువు లేదు గనక భయం కూడా లేదు.

ఇదంతా ఒకే క్షణంలో జరిగింది. కాని 'ఆ క్షణం'  ప్రాధాన్యం చిరకాలం నిలుస్తుంది. అక్కడ చేరినవాళ్లు, అతని మరణ బాధ మరో రెండు గంటలు అనుభవించారు. ఛాతీలో ఏదో కొట్టుకున్న శబ్దం వినిపించింది. శిథిలమైన ఆ శరీరం ఒకసారి కదిలింది. ఆ తర్వాత, కొట్టుకోవటం, ఎగశ్వాస నెమ్మదిగా ఆగింది.

అతని పక్కన నిల్చున్న వాళ్లెవరో "అంతా అయిపోయింది." అన్నారు.

అతనీ మాటలు విని, ఆత్మలో పునశ్చరణం చేసుకున్నాడు.

"మృత్యువే ముగిసింది. ఇక మృత్యువు లేదు." అనుకున్నాడు.

చివరి శ్వాస మధ్యలో ఆగింది. ఇవాన్ ఇల్యిచ్ మరణించాడు.

# గుమ్మటం

## హెన్రీ ఆర్బర్ట్ గై ది మపాసా (1850-1893)

అనువాదం: కాకాని చక్రపాణి



19వ శతాబ్దపు ఆధునిక ఫ్రెంచి కథాపితామహుడని పిలువబడే గై ది మపాసా 1850 ఆగస్టు 5న జన్మించాడు, నలభై రెండేళ్ల వయసులో 1893 జులై 6న మరణించాడు. అతడు కథారచయిత, నవలాకారుడు, కవి కూడ. 11 యేండ్ల వయసులో, అతని తల్లి భర్తనుండి విడాకులు పుచ్చుకుని, అతడినీ, అతడి తమ్ముడినీ, పెంచి పెద్దచేసింది. తల్లి విద్యావంతురాలైన మహిళ; ఆమె ప్రభావం అతడిపై విపరీతంగా ఉంది. అతనికి తండ్రి పట్ల విపరీతమైన ద్వేషం; అది అందరి భర్తలపట్లా ఏహ్యంగా కొనసాగింది. స్త్రీలపట్ల అతనికున్న సానుభూతి ప్రతి కథలోనూ కనిపిస్తుంది. అతడు చదువుకునే చిన్న వయసు నుండే మతంపట్ల వైషమ్యాన్ని, మత బోధకుల పట్ల ఏవగింపును అలవర్చుకున్నాడు.

1868లో, 18యేండ్ల వయసులో ప్రముఖ కవి స్విన్‌బర్న్‌ను సముద్రంలో మునిగిపోకుండా కాపాడాడు. అక్కడే అతడు ప్రముఖ రచయిత ఫ్లబర్ట్ (Gustave Flaubert) ను కలుసుకోటం జరిగింది. 1870లో గ్రాడ్యుయేషన్ అయ్యాక ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధంలో చేరాడు. ఫ్లాబర్ట్ అతనికి సాహిత్య మార్గదర్శి అయ్యాడు. పత్రికా రచనలోకీ, సాహిత్యంలోకీ మార్గం చూపాడు. ఫ్లాబర్ట్ ఇంట్లోనే అతడు ఎమిలీ జోలానూ. రష్యను నవలాకారుడు ఇవాన్ టర్జనీవ్‌నూ కలుసుకున్నాడు. 1880-1891 మధ్యకాలంలో అతడెన్నో కథలను రాశాడు. 1883లో తన మొదటినవల యూన్ వీ (Unne Vie -ఒక స్త్రీ జీవితం అని ఆంగ్లంలోకి అనూదితమైంది) నీ, 1885లో, రెండవ నవల బెల్ అమీ (Bel Ami)నీ రాశాడు. ప్రాకృతికవాదం, దుఃఖితుల (Les Miserables) తర్వాత ఒక స్త్రీ జీవితం లాంటి మరో నవల రాలేదని టాల్‌స్టాయ్ అభిప్రాయపడ్డాడు. వాస్తవికవాదాలు (naturalism and realism) అతడి రచనల్లో ప్రతిఫలిస్తాయి. తన జీవితంలోని చివరి రోజులలో అతడు సిఫిలిస్ కారణంగా, ఎంతో మనోవేదనకూ, శారీరక బాధకూ గురయ్యాడు.

ప్రష్యన్లు రూవెన్ పట్నంలోకి ప్రవేశించారు. వీథుల్లో ప్రష్యను సైనికుల గస్తీ. జనం వీథుల్లోకి రావటానికి భయపడుతున్నారు. తలుపులు గడియ పెట్టుకుని ఇండ్లలోనే వుండిపోతున్నారు. కొంతమంది సైనికులు తలుపులపై టకటక కొట్టారు. బిక్కచచ్చి పోయిన జనం తలుపుతీయగానే లోపలికి ప్రవేశిస్తున్నారు. దాడి తరువాత అన్నిటినీ స్వాధీనం చేసుకోవటం అది. విజేతల పట్ల విధేయంగా వుండాల్సిన బాధ్యత మొదలైంది విజితులకు.

కొంత కాలమయ్యాక ఫ్రెంచ్ ప్రజలకు మొదటున్న భయంపోయింది. కొత్తరకం ప్రశాంతత నెలకొన్నది. ప్రష్యను ఆఫీసరు ఇంట్లో భోంచేస్తాడు. మంచి కుటుంబంలో నుంచి వచ్చిన మనిషే అతను. మర్యాదస్తుడే. ఫ్రాన్సుపట్ల జాలి వుంది. తన కిష్టంలేకపోయినా తప్పదు. ఇంటి యజమాని అలాంటి భావాలున్న ప్రష్యను ఆఫీసరు పట్ల కృతజ్ఞత వ్యక్తపరుస్తాడు. అతిథిమర్యాదలు చేస్తాడు. జనం ఇప్పుడు వీథుల్లోకి వెళ్తున్నారు. వీథుల్లో గస్తీ తిరుగుతున్న ప్రష్యను సైనికులిప్పుడు అంత అహంకారం ప్రదర్శించటం లేదు. విజేతలు ఇంట్లో ప్రవేశించి, డబ్బివ్వమని అడిగేవాళ్లు. ఇవ్వకతప్పదు ఫ్రెంచ్ ప్రజలకు. ధనవంతులైన నగరవాసులకు ఇది మరీ సంకటమైంది.

తమ బెసగని క్రమశిక్షణతో, నగరాన్ని ఆక్రమణదారులు పూర్తిగా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. విజితప్రజ పట్ల కిరాతకంగా ప్రవర్తించలేదు. జనం మెల్లమెల్లగా ధైర్యం కూడగట్టుకో సాగారు. వర్తకవాణిజ్యాలు సాగించారు. కొంత మందికి హావ్రేలో వ్యాపారాలున్నాయి. అది ఫ్రెంచ్ సైనికుల అధీనంలోనే వుంది. దీపే దాకా బండిలో వెళ్లి, అక్కడి నుంచి పడవలో హావ్రే రేవుపట్నం చేరుకోవా లనుకున్నారు. జర్మను సైనికుల దగ్గర తనకున్న పలుకుబడిని వినియోగించారు వాళ్లు. చివరికి సైన్యాధికారి వాళ్లు రూవెన్ నగరం విడిచివెళ్ల అనుమతించాడు. పదిమంది బండిలో సీట్లు రిజర్వు చేసుకున్నారు. గుట్టుగా, మంగళవారం తెల్లవారు జామునే వెళ్లిపోవాలని వాళ్లనుకున్నారు.

**నా పుస్తకాలు
పిల్లలకు,
పెద్దలకు కూడా...
-మార్క్‌ట్వేన్**

ఆ రోజు తెల్లవారుజాము నాలుగున్నరకు ప్రయాణికులందరూ హోటల్ నార్మండీ ఆవరణలో జమయ్యారు. విపరీతమైన చలిగా వుంది. ఉన్నిగుడ్డలు కప్పుకున్నారు. ఆ అస్పష్టమైన వెలుగులో ఎవరు ఎవరో వాళ్లకు తెలియలేదు.

వాళ్లలో ఒకతనన్నాడు: "మేం మళ్లీ రూవెన్‌కు తిరిగి రాం. ప్రష్యన్లు హావ్రేను కూడా పట్టుకుంటే, మేం ఇంగ్లాండు వెళ్లిపోతాం."

మిగిలినవాళ్లూ అదే భావాన్ని వ్యక్తపరిచారు.

ప్రయాణం కష్టం. అందుకే, గుర్రబ్బండికి నాలుగు గుర్రాలకు బదులు ఆరింటిని కట్టారు. మంచు విపరీతంగా కురుస్తోంది. ప్రయాణికులంతా బండి ఎక్కాక బండి కదిలింది. బండి చక్రాలు మంచులో కూరుకుపోతుండటంతో ప్రయాణం మెల్లగా సాగింది. బండివాడు గుర్రాలను అదిలిస్తున్నాడు. చర్నాకోల ఝళిపిస్తున్నాడు. అయినా ప్రయాణం మెల్లగానే కొనసాగింది. కొంతదూరం ప్రయాణించాక తెల్లవారింది. అందరూ తమ తోటి ప్రయాణికులెవరో తెలుసుకోవాలనే కుతూహలంతో ఒకళ్లనొకళ్లు చూచుకున్నారు.

బండిలో వెనక మొదటిసీటులో ల్యాసో కూర్చునివున్నాడు. మద్యం వ్యాపారి; వ్యాపారంలో లక్షలు గడించాడు ల్యాసో. నాసిరకం మద్యం రిటైలర్లకు అమ్మేవాడు. స్నేహితులూ, తోటివ్యాపారస్తులూ "అమ్మో, దొంగనాకొడుకు!" అనుకునే వాళ్లు. సరదామనిషి; భార్య అతని ఎదుటిసీటులో కూర్చుని వుంది.

అతని పక్కన కూర్చున్న కారే లమదాన్‌కి మూడు మిల్లులున్నాయి, పత్తి వ్యాపారంలో బాగా సంపాదించాడు. జనరల్‌కౌన్సిలు మెంబరు కూడా. సన్నగా, అందంగా వున్న భార్య వయసులోవున్నది; ఆమె అతడి ఎదురుగా కూర్చుంది; ఆమె అతనికంటే చాలా చిన్నది.

ఆమె పక్కన బ్రెవిల్ జమీందారిణి. ఆమె కెదురుగా జమీందారు కూర్చున్నాడు. 'ది బ్రెవిల్'లు ప్రాచీన రాజవంశానికి చెందినవాళ్లు. జమీందారు వయసులో పెద్దవాడే అయినా, బలంగా, ఆరోగ్యంగా వున్నాడు. ది బ్రెవిల్ కుటుంబంలోని ఓ స్త్రీని రాజు మోహించి, ఆమెకు కడుపుచేస్తే, రాజు ఆమె భర్తకు జమీందారీని ప్రసాదించాడని చెప్పుకుంటారు. జమీందారు హ్యూబర్ట్ కూడా జనరల్ కౌన్సిలు మెంబరు. కారే లమదాన్‌తో అతనికి పరిచయముంది. జమీందారిణి 'సెలోన్' గురించి గొప్పగా చెప్పుకుంటారు. అందులో ప్రవేశం అంత తేలిగ్గా లభించదు. జమీందారు బాగా ధనవంతుడు. ఆ ఆరుగురూ బండిలో మూలస్తంభాల లాంటివాళ్లు. ప్రశాంతంగా, నిజాయితీగా బతికే వాళ్లు. వాళ్లకు మతం పట్ల అనురక్తి వుంది. జీవిత విలువలున్నాయి.

జమీందారిణి పక్కనకూర్చున్నవాళ్లు ఇద్దరు నన్‌లు. చేతుల్లో పూసలదండలు పట్టుకుని జపం చేసుకుంటున్నారు. ఈ భక్తురాళ్ల కెదురుగా ఓ పురుషుడూ, స్త్రీ కూర్చుని వున్నారు. పురుషుడి పేరు కార్నుదే. ప్రజాస్వామ్యవాది. గౌరవనీయులకు అతడంటే భయం. తండ్రి సంపాదించి ఇచ్చిన ఆస్తి, ప్రజాస్వామ్య వర్గాల్లో మంచిపేరు కూడ అతనికుంది; పదవికి కారణంకూడ అతను బాగా ఖర్చుపెట్టగలగడమే నంటారు. ఇప్పుడు రూవెన్‌లో కంటే హావ్రేలో తను చేయాల్సిన ప్రజాసేవ అధికమని భావించి అతనా ప్రయాణానికి సిద్ధపడ్డారు.

అతని పక్కన – 'వగలాడి' అని పిలుస్తారే. అలాంటి స్త్రీ కూర్చుని వుంది. లావుగా వుంటుంది. అందుకే 'గుమ్మటం' అన్న నిక్‌నేమ్‌తో అందరూ పిలుస్తారు. చేతి వేళ్లు లావు; ముఖం ఆపిల్‌పండులా గుండ్రం; నల్లటి కళ్లు, పెద్ద కనుబొమలు, ఆకర్షణీయమైన నోరు, చిన్న పలువరస; విస్తృత వక్షఃస్థలం బట్టల వెనక ఊగుతూ వుంటుంది. ఆమెలో ఏదో తాజాదనం వుంది, చురుకుదనం వుంది. అవే ఆమె అంటే ఇతరులు ఇష్టపడటానికి కారణాలు.

ఆమెను గుర్తుపట్టగానే సభ్యస్త్రీలు చెవులు కొరుక్కున్నారు. "వేశ్య", "కళంకిత" లాంటి వ్యాఖ్యలు వినబడగానే ఆమె వాళ్లను రెచ్చగొట్టేట్టుగా, నిబ్బరంగా వాళ్ల వంక చూసింది. అందరి నోళ్లూ పడిపోయాయి. నిశ్శబ్దం రాజ్యం చేసింది. అప్పటిదాకా ముభావంగా వున్న స్త్రీలు, ఆమె కారణంగా, అమాంతం స్నేహపూర్వకంగా, సన్నిహితంగా మాట్లాడుకోసాగారు. సిగ్గు లేకుండా ఒళ్లమ్ముకోటంకంటే వైవాహిక జీవితం ఎంత సుఖప్రదమో ఆమెకు తెలియజెప్పటమే లక్ష్యమన్నట్టుంది వాళ్ల సంభాషణ. కార్నుదేను చూడగానే ముగ్గురు పురుషపుంగవుల్లోనూ ఆత్మరక్షణభావం జాగ్రుతమై, డబ్బును గురించీ, ప్రష్యను దండయాత్రవల్ల కలిగిన నష్టంగురించీ మాట్లాడు కోసాగారు.

బండి మెల్లగా వెళ్తోంది. ఉదయం పదిగంటలైనా వాళ్లు నాలుగు కోసుల దూరంకూడ ప్రయాణం చెయ్యలేదు. తోత్స్‌లో అప్పటికల్లా వాళ్లు అల్పాహారం తీసుకుంటూ వుండాల్సింది. బండిరాత్రికిగాని, తోత్స్‌కు చేరేట్టు కనిపించక పోవటంతో వాళ్ల గుండెల్లో దిగులు ప్రారంభమైంది. తోవలో ఏదైనా చిన్న హోటలు కనిపిస్తుందేమోనని చూశారు. మంచులో కూరుకుపోయిన బండి చక్రాలను బయటికి తీయటంలోనే రెండుగంటల కాలం గడిచిపోయింది. ఉధృతమవుతున్న ఆకలి వాళ్లను బాధించసాగింది. తోవలో ఎక్కడా హోటళ్లూ, మద్యం దుకాణాలు కూడ తెరిచిలేవు. ప్రష్యనుదండ్ల భయంతో అన్నీ మూతబడ్డాయి. మధ్యాహ్నం ఒంటిగంట అయేసరికల్లా తన కడుపులో ఎలుకలు

పరుగెత్తుతున్నా యన్నాడు ల్వాసో. అందరిదీ అదే పరిస్థితి. ఆకలి సంభాషణను మందగింపజేసింది. అందరూ సమాజంలో తమకున్న స్థానాన్ని బట్టీ, తమ శీలాన్నిబట్టీ, జీవితాన్ని గురించిన తెలివిని బట్టీ ఆవలిస్తున్నారు. గుమ్మటం క్షణం సందేహించింది. చుట్టూ వున్నవాళ్ల వంక చూసింది. సర్దుకు కూర్చుంది. ఓ చిన్న మాంసం ముక్క ఇస్తే వెయ్యి ఫ్రాంకులు ఇస్తానన్నాడు ల్వాసో, అతని భార్య అతని వంక నిరసనగా చూసింది. డబ్బు దుబారా గురించి ఎవరు మాట్లాడినా ఆమె కిష్టముండదు. "ఏదన్నా తినటానికి తీసుకొస్తే బావుండేది. నాకు అలాంటి ఆలోచనే తట్టలేదు ఎందుకో?" అన్నాడు జమీందారు. అందరూ అలాంటి ఆలోచనలోనే వున్నారు. కార్నుదే దగ్గర ఓ ఫ్లాస్కు రమ్ వుంది. "పుచ్చుకోండి" అంటూ అతను అందరికీ చెప్పాడు కానీ ఎవరూ దాన్ని స్వీకరించలేదు. ల్వాసో మాత్రం రెండు గుక్కలు తాగాడు. దాంతో కాస్తంత ఉత్సాహం వచ్చింది అతనికి. "ఆ పాటేదో – దాంట్లో ఓడ ప్రయాణికులు ఆకలికి తాళలేక కొవ్వుపట్టి, బలిసివున్న ప్రయాణికుణ్ని తింటారు. చూశారు– అలా మనమూ చెయ్యాలి" అన్నాడు. గుమ్మటాన్ని గురించి ఈ పరోక్షవ్యాఖ్య సభ్యజనానికి బాగనిపించలేదు కానీ ఎవరూ మాట్లాడలేదు. కార్నుదే ఒక్కడే నవ్వాడు. ఇద్దరు క్రైస్తవ సోదరీమణుల చేతుల్లోని పూసలు తిరగటం మానేశాయి.

చివరికి మూడు గంటలకు గుమ్మటం సీటు కింద నుంచి ఓపెద్ద బుట్టను బయటికి లాగింది. కప్పివున్న నాప్‌కిన్‌ను తొలగించి, ఓ పింగాణి పళ్లెం తీసింది. బుట్టలో మూడు రోజులకు సరిపడా ఆహారపదార్థాలున్నాయి. స్వీట్లు, పండ్లు, మరెన్నో వంటకాలు. ఆమె చికెన్ పళ్లెంలో వడ్డించుకుని తినసాగింది. అందరి దృష్టీ ఆమెవైపు పడింది. వంటకాల సువాసన వాళ్ల ముక్కుపుటాలపై దాడి చేసింది. వాళ్ల నోట్లో నీరూరసాగింది. ఆమె పట్ల స్త్రీల హేయభావం ద్విగుణీకృతమైంది. ఆమెనూ, బుట్టనూ మంచులోకి విసిరేయాలనిపించింది.

> టీచర్ పుస్తకాలలోని
> అద్భుతాలను
> పిల్లలకు వివరించాలి.
> -అబ్రహాంలింకన్

కానీ ల్వాసో కళ్లు చికెన్‌ను తినేస్తున్నాయి: "అదృష్టవశాత్తూ మదాం (మేడం) మనకంటే ముందుచూపున్న మనిషి" అన్నాడు.

"ఆకలికి వుండటంకష్టం! మీరూ ఒక ముక్క పుచ్చుకోండి" అన్నది.

"నిజం, ఆకలికి తాళటంకూడా కష్టమే" అంటూ జేబులోని చాకు తీసి మాంసం కాలిముక్కకు గుచ్చి, ఆవురుమని తింటూ తృప్తిగా తేన్చాడు.

క్రైస్తవసోదరీమణులు గుమ్మటం ఆహ్వానంపై మారుమాట్లాడకుండా ఆతిథ్యాన్ని స్వీకరించారు. కార్నుదే ఆతిథ్యాన్ని తిరస్కరించని మనిషి. అతనూ అందులో పాలు పంచుకున్నాడు. ల్వాసో భార్య కూడా, భర్త నచ్చజెప్పాక, తనూ కొవ్వు బంతి ఆతిథ్యాన్ని స్వీకరించింది. మిగిలిన నలుగురినీ రుచికరమైన వంటకాల పరిమళం బాధించ సాగింది. అంతలో కారే లమదాన్ భార్య స్పృహ తప్పిపడిపోయింది. క్రైస్తవ సోదరి గుమ్మటం తెచ్చిన ద్రాక్షసారాను ఓ కప్పు ఆమెకు పట్టించింది. ఆమెకు స్పృహ వచ్చింది.

అప్పుడంది గుమ్మటం : "మీలాంటి పెద్దలను ఈ నా ఆహారం స్వీకరించమని అడగలేకపోయాను. అందుకు ధైర్యం చాలలేదు నాకు!"

ల్వాసో అందుకున్నాడు. "ఇలాంటి సమయంలో అందరం సమానులమే. మనం సోదరభావంతో మెలగాలి. ఇక ఔపచారికాల కోసం చూడకండి. ఉన్నది అందరం పంచుకుందాం. బండి నడక చూస్తుంటే మనం రేపు మధ్యాహ్నానికైనా తోత్స్‌కు చేరుతామో లేదోననిపిస్తున్నది."

ఇంక ఎవరూ సంకోచించలేదు. సాంఘికహోదాలను పక్కనపెట్టి ఆతిథ్యాన్ని స్వీకరించారు. గుమ్మటంతో మాట్లాడకుండా ఆ ఆతిథ్యాన్ని ఆ భద్రమహిళలు స్వీకరించలేరు. అందుకే, ముభావంగా మాట్లాడటం మొదలుపెట్టిన వాళ్లు ఆపైన గుండె తెరిచి మాట్లాడసాగారు. జమీందారిణి, కారే లమదాన్ భార్య కిందివాళ్లను దయతో చూస్తున్నట్టుగా మాట్లాడారు. సహజంగానే సంభాషణ యుద్ధంవైపు మళ్లింది. గుమ్మటం ఆవేశంతో – కింది తరగతివాళ్లు అలా ఆవేశపడటం సహజమే– అంది: "నిజానికి నాకూ రూవెన్ వదిలిపెట్టాల్సిన పనిలేదు. తెలియని చోటికి వెళ్లటం కంటే ఆ ప్రష్యను వెధవలు నా తిండి తింటే తిన్నారని సమాధానపడదామనుకున్నాను. కానీ, వాళ్లను చూస్తే నా ఒళ్లు మండిపోయేది., చంపుదామన్నంత ఆవేశం వచ్చేది. నా మనసు బయటపడ్డాక ఇంక నేనక్కడ వుండని పరిస్థితి వచ్చింది. అవకాశం దొరగ్గానే ఇలా పారిపోయి వస్తున్నాను." ఆమె దేశభక్తి నందరూ మెచ్చుకున్నారు. పదిగంటలకల్లా వున్నది పూర్తిచేశారు. ఇక తినటానికేం లేదే అని చింతించారు. సంభాషణ కొంతసేపు కొనసాగింది. అయితే, తినటం పూర్తయింది కనుక సంభాషణ అంత ఉత్సాహంగా సాగలేదు. బాగా చీకటి పడిపోయింది. పదమూడు గంటలు ప్రయాణించాక చివరికిబండి తోత్స్‌లోని కామర్స్ హోటల్ ముంగిట ఆగింది. బండి తలుపుతెరవగానే బయట ఓ జర్మను ఆఫీసరు నిలబడి కనిపించాడు. ప్రయాణికులకు గుండె చిక్కబట్టినట్టయింది. "దిగ్రేం, ఇంకా కూర్చున్నారు?" అన్నాడు ఆఫీసరు.

సాధుజీవనానికి అలవాటుపడ్డ క్రైస్తవ సోదరీమణులు ముందుగా దిగారు. జమీందారు, ఆయన భార్య, పారిశ్రామికుడు, ఆయన భార్య, ల్వాసో, ఆయన భార్య వరసగా దిగారు. ల్వాసో ఆఫీసరులకు అభివాదం చేశాడు. మర్యాదకు కాదు. వివేకంతో చేసిన పని అది. గుమ్మటం, కార్నుదే తలుపు దగ్గరగా వున్నా చివరగా దిగారు. ఆమె తనకోపాన్ని అణచుకో ప్రయత్నించింది. శత్రువు ఎదుట క్షుద్రంగా లొంగుబాటును ప్రదర్శించినవాళ్ల కంటే ఆమె ప్రదర్శించిన ఆభిజాత్యం గొప్పది. హోటలు కిచెనులోకి వెళ్లారు వాళ్లు. అక్కడ వాళ్ల ప్రయాణపత్రాలను (వాటిలో ప్రయాణికుల పేర్లు, వృత్తి వగైరా వివరాలుంటాయి) క్షుణ్ణంగా పరిశీలించాక, ఆఫీసరు, తృప్తిపడి వెళ్లిపోయాడు.

అప్పుడు వాళ్లు గాలి పీల్చుకున్నారు. ఆకలిగా వుండటంతో భోజనానికి ఆర్డరుచేశారు. భోజనం తయారీకి అరగంటవుతుందని వాళ్లు తమ తమ గదులకు వెళ్లారు. చివరికి భోజనానికి టేబుల్ దగ్గరికి వచ్చి కూర్చున్నారు. హోటలు యజమాని ఫొలెన్వీ వచ్చాడు.

"ఇక్కడ ఎలిజబెత్ రూసేట, ఎవరూ?" అని అడిగాడు.

గుమ్మటం ఉలిక్కిపడింది. "నేనే" అని జవాబిచ్చింది.

"ప్రష్యను ఆఫీసరుగారు తమతో తక్షణం మాట్లాడాలిట!"

ఆమె కలవరపడిపోయింది. ఓ క్షణం ఆలోచించి, జవాబిచ్చింది. "అది నా పేరే. కాని నేనక్కడికి వెళ్లను!"

కదలిక మొదలైంది జనంలో. అందరూ ఈ ఆదేశానికి కారణమేమిటో వితర్కించసాగారు. జమీందారు, "నువ్వు తప్పు చేస్తున్నావమ్మాయ్! నువ్వు తిరస్కరించటం నిన్నే కాదు, అందర్నీ కష్టాల్లో పడేస్తుంది. అధికారం వున్నవాళ్లను వ్యతిరేకించి ప్రయోజనం లేదు. ప్రమాదం ఏంలేదు, వెళ్లిరా, ఏదో ఫార్మాలిటీ మరిచిపోయుంటారు" అన్నాడు. అందరూ అతనికి వంతపాడారు. వెళ్లమని బతిమిలాడారు. అర్థించారు. ఆమె అవిధేయతవల్ల వచ్చే అనర్థాలను గురించి అందరూ భయపడ్డారు. చివరికామె అంది: "సరే, మీ కోసమే వెళ్తున్నాను."

జమీందారు "నీ ఋణం మేం ఎప్పుడూ తీర్చుకోలేం" అన్నాడు.

ఆమె వెళ్లింది. తమకే అలా పిలుపొస్తే ఏం చేయాలా అని ఆలోచించ

నవలా పరిచయం

# గలివర్స్ ట్రావెల్స్

## జొనతన్ స్విఫ్ట్ (1667 - 1745)

బడా భూస్వాముల ప్రజాస్వామ్యంలో అవినీతి రాజ్యమేలుతోంది. ధనిక వ్యాపారులు, షిప్పింగ్ మాగ్నెట్లు, స్టీలు, బొగ్గు, వజ్రాలు, బంగారం, మద్యం వగైరా పరిశ్రమల పెట్టుబడిదారీ ప్రభువుల పాలనకు పునాది పడుతోంది. డబ్బు, అధికారం తప్ప మరో కోరిక లేదు. వ్యక్తికుండాల్సిన ఏకైక సుగుణం ధనార్జన అనే మనస్తత్వం బలపడుతోంది. మత గురువులు కూడా అధికారుల ప్రాపకం కోసం పాకులాడారు. రాజకీయాలకు మరో పేరు నయవంచన. అధికార పక్షాన్ని విమర్శించడమే ప్రతిపక్షానికున్న సింగిల్ పాయింట్ ఎజెండా. పద్దెనిమిదవ శతాబ్దంలో ఇంగ్లండు వాతావరణమది. దీనిపై సంధించిన శరాలే జొనాథన్ స్విఫ్ట్ రచనలు. అందులో భాగంగా వెలవడిందే "గలివర్ ట్రావెల్స్". ప్రపంచ సాహిత్యంలో ఆయనకు శాశ్వత స్థానం సంపాదించి పెట్టింది. బహుశా తొలి సోషియో ఫాంటసీ నవల ఇదే కావచ్చు. కెప్టెన్ లెమూర్ గలివర్ స్వంత అనుభవాలు చెప్పుకున్నట్లుగా రాసిన ఈ నవలలోని వ్యంగ్యం నేటికీ పలితుల్ని చకితుల్ని చేస్తుంది. 1699లో, మే నెల, నాలుగో తారీకునాడు నాలుగవందల పౌండ్ల కట్నం తెచ్చిన నా పడుచు భార్యను వదిలి, 'ఆంటిలోప్' అని పిలిచే నావకు సర్జన్‌గా దక్షిణప్రాంత సముద్రం దిశగా యాత్ర ప్రారంభించాను. వాన్ డీమాన్స్ లాండ్ చేరగానే ఒక భయంకరమైన తుఫాను వచ్చి నావ మధ్యలో విరిగి ఒక కొండను ఢీకొట్టింది. కళ్లు తెరిచేసరికి నేను ఒంటరిగా, నిర్మానుష్యమైన బీచ్‌లో ఉన్నట్టుగా గ్రహించాను. అలసి, అక్కడే కాసేపు నిద్రించాను. మరి కాసేపటికి స్పృహ వచ్చింది. లేవలేకపోయాను. నా కాళ్లూ, చేతులూ, జుత్తూ ఎవరో తాళ్లతో కట్టేశారు. చుట్టూ గోల. అల్లరి. శరీరం మీద ఏవో కీటకాలు పాకుతున్నాయి. నా ఛాతీ మీద ఓ మానవాకారం నిల్చున్నది. ఎత్తు ఆరంగుళాలు. చేతిలో విల్లంబులున్నాయి. నమ్మలేని నిజం. బిగ్గరగా నవ్వాను. ఆ శబ్దం వాళ్లను భయపెట్టింది కాబోలు. పారిపోయారు. కట్లు తెంచుకోబోయాను. గుండుసూదుల్లాంటి వందలాది బాణాలు నా ఎడమ చేతికి తగిలాయి. మరికాసేపటికి వాళ్లలో ముఖ్యుడొకడు – నా మధ్య వేలంత ఉంటాడు– స్టేజెక్కి ఏదో మాట్లాడాడు. నేను లేవటానికి ప్రయత్నించలేదు. ఆకలిగా వుంది. భోజనం కావాలని సైగ చేశాను. ఓ వంద మంది నిచ్చెన వేసుకుని నా నోటి దగ్గరకు భోజనం తీసుకొచ్చారు. ఒక్కొక్క పళ్లెంలో గోళీకాయకన్నా చిన్న భోజనం ముద్దలున్నాయి. అయిదారు ముద్దలు ఒకేసారి నోట్లో వేసుకున్నాను. (ఆ దేశం పేరు లిల్లిపుట్) వాళ్లు నా ఆకలికి ఆశ్చర్యపడి ఆనందంగా నా ఛాతీ మీద నాట్యం చేశారు. ఖైదీకి అన్ని సదుపాయాలూ కల్పించాలని హర్గో (ఉన్నతాధికారి) ఆజ్ఞ జారీచేశాడు. ఆ రాజ్యంలో అతిపెద్ద ఇంజన్ మీద నన్ను రాజధానికి తీసికెళ్లారు. ఒక పాడు పడిన గుళ్లో నన్ను బంధించారు. చక్రవర్తి అక్కడ చూడటానికి వచ్చాడు.

పట్టుబడిన ఖైదీని చంపకుండా, సపర్యలు చెయ్యమని ఆదేశించిన ఈయనగారు యూరోపులో ఉన్న దేశాధీశులందరిలోకి ఉత్తముడనటంలో సందేహం లేదు. చక్రవర్తి ఇతర్లకన్నా గోరంత ఎక్కువ పొడగున్నాడు. వాళ్లు వేసుకున్న రంగు రంగుల దుస్తులు నేలపై రంగవల్లికల్లా కనిపించాయి. రాజుగారి కప్పటికే వృద్ధాప్యం వచ్చినట్టుంది. వయసు ఇరవై తొమ్మిదేళ్లు (ఏడేళ్లు పాలించాడు). తరుచు నాతో మాట్లాడి, వాళ్ల భాష కూడా నేర్పించాడు. మరికొన్నాళ్లకు నన్ను సోదా చెయ్యనివ్వమని అభ్యర్థించాడు. నా అంగీకారంతో ఇద్దరాఫీసర్లు నా జేబుల్లో దూరి నా వద్ద దొరికిన వస్తువుల లిస్టు తయారు చేశారు. నా సత్ప్రవర్తన చక్రవర్తి గారి మెప్పు పొందింది. ఆస్థానంలో నాకోసం అనేక వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశాడు. అయితే దేశంలో పరిస్థితులు విదేశీయులు మెచ్చుకున్నంత గొప్పగా ఏమీ లేవని అర్థమయ్యింది. రెండు రాజకీయ పక్షాల మధ్య గొడవలతో సంక్షోభం నెలకొంది. బ్లెఫస్కూ ద్వీపవాసులు లిల్లిపుట్ మీద దాడికి సిద్ధమవుతున్నారు. గుడ్డును ఎటు నుంచి పగలగొట్టాలన్న విషయం మీద రేగిన వివాదమే అందుకు కారణం. చక్రవర్తి నా సహాయం అర్థించాడు. రెండు దేశాల మధ్య ఎనిమిది వందల గజాల సముద్రం ఉంది. శత్రుసైనికులు కనిపిస్తున్నారు. నేను కోటూ, బూట్లూ విప్పి, నీళ్లలోకి దిగి (ఆరడుగులలోతే వున్నది) అరగంటలో అటువైపుకు చేరుకున్నాను. నామీద బాణాల వర్షం కురిసింది. కళ్లద్దాలు పెట్టుకోకపోతే కళ్లు పోయేవే. శత్రువుల నౌకలూ, ఆయుధాలూ పట్టుకుని వచ్చి లిల్లిపుట్ చక్రవర్తికి సమర్పించాను. కాని పాలకుల ఆశకంతుండదు. బ్లెఫస్కూ రాజ్యం తనకు కావాలనీ, దాన్ని తన ప్రతినిధి పాలించాలనీ చక్రవర్తి కోరిక. ప్రజలను బానిసలుగా చేసుకోవటం నాకిష్టం లేదు. చక్రవర్తి మాట తిరస్కరించినందుకు నామీద కుట్ర చేశారు. అక్కడి ఉన్నతాధికారులు నా మీద దేశద్రోహ నేరం మోప చూస్తున్నారని తెలిసింది. ఒకబోటు సాయంతో బ్లెఫస్కూ చేరుకున్నాను. దారిలో తారసపడ్డ ఓ ఇంగ్లీష్ నావికుడికి నా అడ్వెంచర్ చెప్పాను. అతడు నమ్మలేదు. జేబులో శాంపిల్‌గా వేసుకొచ్చిన పశువుల్నీ, గొర్రె పిల్లల్నీ చూపించాను.

ఇంగ్లండులో రెండు నెలలు విశ్రాంతి తీసుకున్నాను. వెంట తెచ్చుకున్న బుల్లి జంతువుల్ని ప్రదర్శించి కాసింత డబ్బు కూడా చేసుకున్నాను. ఆ తర్వాత సూరత్ వెళుతున్న బోట్ ఎక్కి నా రెండవ యాత్ర ప్రారంభించాను. మలాకా దీవులు దాటాక మాన్‌సూన్‌లో చిక్కుకున్న బోటు మమ్మల్ని ఏ అజ్ఞాత ద్వీపానికో చేర్చింది. ఓ డజను మందిమి తాగటానికి నీళ్లు ఎక్కడ దొరుకుతాయో తెలుసుకోవటానికి బయల్దేరాం. కాసేపట్లోనే అన్వేషణకు వెళ్లిన వాళ్లు ప్రాణభయంతో బోటులో వెనక్కు తిరిగి వచ్చారు. ఓ రాక్షసుడు నీళ్లలో పెద్ద పెద్ద అంగలు వేస్తూ వాళ్ల వెంట పడ్డాడు. నలభై అడుగుల ఎత్తుకెదిగిన పంట పొలంలో నేను దాక్కొన్నాను. ధ్వజస్తంభాలంత ఎత్తున్న ఏడుగురు కోతలకు కాబోలు వచ్చారు. ప్రాణాలు అరచేత పట్టుకొని నక్కి దాక్కున్నాను. నన్ను మహాకాయుడనుకున్న లిల్లిపుట్‌లు జ్ఞాపకం వచ్చారు. ఓ రాక్షసుడు నా మీద అడుగెయ్యబోతే బిగ్గరగా అరిచాను. వాడు నన్నో కీటకమనుకుని నేల రాసేవాడే. కాని నా సైగలతో

---

సాగారు. పదినిముషాల్లో తిరిగివచ్చింది. కోపంగా, ముక్కుపుటాలు అదురుతూంటే, "దొంగ నా కొడుకులు!" అంది. మాటలు తడబడ్డాయామెకు.

అందరూ ఆమె చుట్టూచేరారు, ఏంజరిగిందో తెలుసుకోటానికి, ఆమె ఆత్మగౌరవంతోనే స్పందించి వుంటుందని జమీందారు అన్నాడు. "ఇది మీకు సంబంధించింది కాదు. అంత కంటే నేనేం చెప్పలేను" అంది.

టేబుల్ దగ్గర అందరూ భోజనాలు చేస్తున్నారు.

"ఈ మిలిటరీవాళ్లు మన్ని దోచేస్తున్నారు. ఎందుకా డ్రిల్లులూ, ఎక్సర్‌సైజులూ! అంతకంటే వాళ్ల దేశంలో పొలం దున్నుకుంటేనో, రోడ్లు వేసుకుంటేనో

వాణ్ణి వారించాను. బొటనవేలూ, చూపుడువేలు మధ్య నన్ను పట్టుకుని రైతు వద్దకు తీసుకెళ్లాడు.రైతు భార్య నన్ను చూసి కప్పను చూసి జడుసుకునే ఇంగ్లీషు ఇల్లాలిలా బెదిరింది. రైతు కూతురు నన్నో బొమ్మలా చూసుకొని మురిసింది. ఇరుగు పొరుగులకు నేనో వింత జంతువును. బజార్లో నిలబెట్టి అందరికీ చూపించారు. తరువాత పెట్టెలో పెట్టి గుర్రం మీదవేసి తీసుకెళ్లారు. కొత్త ఊరి సత్రంలో నాతో 'షో' ఏర్పాటు చేశారు. నేను విన్యాసాలు చేసి చూపించాలి. ప్రతి 'షో'కూ కొత్త ప్రేక్షకులు టికట్లు కొనుక్కుని మరీ వచ్చారు. నేను లాభసాటి 'జంతువు'నని తెలిశాక, ప్రధాన నగరం లార్బ్రుల్‌గ్రడ్‌లో కూడా ప్రదర్శనలిప్పించారు. రాణిగారికీ వార్త తెలిసి నన్ను కొనుక్కుంది. ఆమెకు నన్ను చూస్తే భలే సరదా. రోజూ ఆమెతోపాటు డిన్నర్ టేబుల్ వద్ద కూర్చునే వాణ్ణి. అయితే ఆమె భోజనంచేసే పద్ధతి నాకు వెగటు పుట్టించింది. సీమకోడికన్నా తొమ్మిది రెట్లు పెద్దగా ఉన్న మాంసం ముద్దలు నోట్లో పెట్టుకుని మింగేది. ఇంక బ్రెడ్డు సంగతి చెప్పక్కర్లేదు. రాజుగారు ప్రతి బుధవారం ఆమెతో కలిసి భోజనం చేసే వాడు. ఆ రోజు ఆయన యూరోపియన్ దేశాల పద్ధతులు నాకు వివరించి చెప్పేవాడు. నేను మన దేశ చరిత్ర ఆయనకు తెలియజెప్పాను. "దురాశ, క్రౌర్యం, ద్వేషం, రాజ్యకాంక్షల మూలంగా చేసిన కుట్రలు, హత్యాకాండలు, తిరుగుబాట్లు తప్ప మరేం జరిగింది గత శతాబ్దిలో. అజ్ఞానం, దుర్వ్యసనాలు ప్రజాప్రతినిధులకు ఉండవలసిన లక్షణాలు. చట్టాలను వక్రీకరించేవాళ్లూ, ఉల్లంఘించేవాళ్లూ వాటిని ప్రశంసిస్తారు. "మీ దేశావాసులు ఈ ప్రకృతిలోని విషకీటకాలు. మీది నీచాతినీచమైన జాతి" అంటూ చీదరించుకున్నాడు రాజుగారు. రాజుగారి మెప్పు పొందాలని, మందుగుండు సామాగ్రి తయారుచెయ్యటం గురించి చెప్పాను. "దీన్ని ఉపయోగించి, ఊళ్లనూ, నగరాలనూ పేల్చివేయవచ్చు" అన్న నా మాటలు విని రాజుగారు ఖిన్నుడయ్యాడు. "ఎదురు తిరిగినంత మాత్రాన నగరాలు ధ్వంసం చెయ్యటమేనా. నా రాజ్యాన్నయినా వదులుకుంటాను గాని అలాంటి పని చెయ్యన"న్నాడు. బ్రాబ్‌డింగ్‌నాగ్‌లో రెండేళ్లు గడిపాను. పంజరంలో చిలకలాగా ఉంది బతుకు. రాణిగారు ఒకసారి తనవెంట సముద్ర తీరానికి తీసికెళ్లింది. అక్కడ, ఒక డేగ నేనున్న పంజరాన్ని ఎత్తుకెళ్లి సముద్రంలో వదిలింది. అటుగా వచ్చిన ఒక ఓడలోని వాళ్లు నన్ను రక్షించారు. వాళ్లంతా బాగా కురుచ మనుషులు. రెండు నెలల తర్వాత మళ్లీ ఇంగ్లండు నుండి ఈస్ట్ ఇండీస్‌కు బయల్దేరాను. దారిమధ్యన సముద్రపు దొంగలు వచ్చి నావను స్వాధీనం చేసుకున్నారు. నేను మరో చిన్న పడవలో ఒక ద్వీపానికి చేరుకున్నాను. హఠాత్తుగా మేఘాలు కమ్ముకున్నట్లైంది. పైన, గాలిలో ఒక ద్వీపం తేలియాడుతోంది. పది వేల ఎకరాల వైశాల్యమున్నది. మూడు వందల గజాల మందం. ఆ ద్వీపవాసులు దాన్నలా కంట్రోల్ చేస్తున్నారు. నా సైగలు చూసి వాళ్లు నన్ను పైకి లాక్కున్నారు. ఇలాంటి జాతి మనుషులనింత వరకూ చూడలేదు. తలలన్నీ కుడికో ఎడమకో వంగి ఉన్నాయి. రెండు కళ్లలో ఒకటి లోపలికీ, ఒకటి పైకీ తెరుచుకుంది. వాళ్ల దుస్తుల మీద సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, సంగీత వాయిద్యాల బొమ్మలున్నాయి. అందరూ తన్మయులై ఉన్నారు. వాళ్ల దృష్టి నాకర్షించటానికి సేవకులు పెద్ద చప్పుళ్లు చేస్తారు. అతి ప్రయత్నం మీద రాజుగారి దృష్టిని నావైపు తిప్పుకోగలిగాను. ఇక్కడ తిరుగుబాట్లనణచటానికి రాజుగారు ఓ వినూత్న పద్ధతి ప్రయోగిస్తారు. విప్లవకారులమీద ద్వీపం తన నీడ కప్పేసి ఎండ లేకుండా చేస్తుంది. ఫలితంగా క్షామం, రోగాలు సంభవిస్తాయి. ఒక కోర్టు అధికారి సహకారంతో నాకు లాగాడో నగరం వెళ్లటానికి అనుమతి దొరికింది. ఇక్కడ ఇళ్లన్నీ పాడుబడి నట్టుగా వున్నాయి. మనుషులూ అలాగే వున్నారు. వీళ్లంతా లాపూటియన్ సిద్ధాంతాల గురించి బుర్రలు పాడు చేసుకుంటూ, జీవతానికవసరమైన పనులు చెయ్యటం మానేశారు. దేశమంతా క్షామం వచ్చినట్టుగా కనిపించింది. ఆ తర్వాత నేను మాంత్రికుల ద్వీపం గ్లబ్ డ‌చ్‌రిచ్ చేరుకున్నాను. ఆ ద్వీప గవర్నర్ నాకు మృతులను చూడగలిగే అవకాశం కల్పించాడు. అలెగ్జాండర్, సీజర్‌లతో మాట్లాడాను. చరిత్ర అధ్యయనం నాలో అసహ్యం పెంచింది. అమ్ముడుపోయిన చరిత్రకారులు పిరికిపందలను సాహసవీరులుగా, మూర్ఖులను విజ్ఞులుగా, భట్రాజులను నిజాయితీపరులుగా చిత్రించారు.

అటునుంచి, జపాన్ సమీపంలోని లగ్నాగ్ రాజ్యం చేరుకున్నాను. రాజు సన్నిధిలో నేను పొట్టమీద పాకి, నేల మీది దుమ్ము నాకాలట... ఆచారం. తప్పదు మరి. అక్కడ చిరాయువులుంటారట. అక్కడే వుండి సంపన్నుణ్ణై, సకల కళలూ, శాస్త్రాలు నేర్చుకుని, చరిత్రనంతా రికార్డుచేసి, జ్ఞానిని కావాలనుకున్నాను. కాని అక్కడి వృద్ధుల దీనావస్థ చూసి అభిప్రాయం మార్చుకున్నాను. అయిదున్నర ఏళ్లు ప్రయాణం చేసి కేప్ ఆఫ్ గుడ్ హోప్ ద్వారా ఏప్రిల్ 11న ఇంగ్లండు చేరుకున్నాను. అయిదు నెలల విశ్రాంతి తర్వాత "అడ్వెంచర్" నౌకకు కెప్టెన్‌గా తిరిగి బయల్దేరాను. దక్షిణ దిశగా ప్రయాణిస్తున్నప్పుడు సముద్రపు దొంగలు నన్ను పట్టుకుని ఓ అజ్ఞాత ద్వీపం మీద వదిలారు. అక్కడ ఇంతవరకూ నా యాత్రల్లో చూడని ఓ మనిషిని చూశాను. అతడి తలమీదా, ఛాతీ మీదా జుత్తు అట్ట కట్టుకుపోయింది. గోధుమరంగు చర్మం. లావాటి పెదవులూ, పెద్ద ముక్కుపుటాలూ. చేతులు మనలాగానే ఉన్నాయి. గోళ్లుమాత్రం పొడుగ్గా ఉన్నాయి. ఈ మానవమృగం నామీద దాడి చేయబోయింది. గాని ఎందుకో పరుగుతీసింది. గడ్డిమేస్తూ ఓ గుర్రం అటుగా రావటమే అందుక్కారణం. కాసేపట్లో మరో గుర్రం వచ్చింది. రెండూ సకిలిస్తూ ఏదో మాట్లాడుకుని, నన్ను పరీక్షగా చూశాయి. మారువేషంలో వచ్చిన మాంత్రికుల్లాగ. ఓ గుర్రం నన్ను దగ్గరలో వున్న భవనానికి తీసికెళ్లింది. అక్కడ మరో అయిదు గుర్రాలు మనుషుల్లాగే ఇంటిపనులు చేసుకుంటున్నాయి. హూన్మ్ అంటే గుర్రం లేదా పరిపూర్ణ ప్రకృతి రూపం. హూన్మ్‌ల వద్ద ఈ మనుషుల్లాంటి జంతువులు (యాహూలు) బానిసలుగా ఉంటున్నారు. యాహూల పోలికలున్న నేను తెలివిగా మాట్లాడటం చూసి ఆశ్చర్యపడ్డారు. నన్ను వాళ్లతో పోల్చొద్దని విన్నవించుకున్నాను.హూన్మ్‌లది హేతుబద్ధ జీవన విధానం.ఇలాంటి విషయాలు విని, తెలుసుకుని నా తెలివితేటలు పెంచుకున్నాను. ఇది పరిపూర్ణ జీవితం. అయితే కొంతమంది హూన్మ్ ప్రతినిధులు నాకు– ఒక యాహూకు– తమతో సమాన హోదా కల్పించినందుకు యజమానిని తప్పుపట్టారు. ఇంక అక్కడ ఉండటం వీలుపడదు. బాధతో, దుఃఖంతో గుండె బరువెక్కింది. యజమాని వద్ద వీడ్కోలు తీసుకుని లిస్బన్‌కు బయల్దేరాను. కాని హూన్మ్‌ల ఉన్నత జీవితానికి అలవాటు పడిన నాకు మనుషులంటే ఏవగింపు మాత్రమే మిగిలింది. పాఠక మహాశయా, నా యాత్రల విశేషాలన్నీ మీకు వినిపించింది కీర్తి, డబ్బుకు ఆశపడి కాదు. ఇవి తెలుసుకుని జీవితాన్ని సక్రమ మార్గంలో పెట్టుకోవాలని మాత్రమే అని గలివర్ యాత్రాకథనాన్ని ముగిస్తాడు.

---

బాగుంటుంది. సైనికుడివల్ల ఎవరికీ ప్రయోజనం లేదు. బీదా బిక్కీ జనం, వాళ్లకు తిండిపెట్టాలి, లేకపోతే వాళ్ల చేతిలో చావాలి. మనుష్యులను చంపటం ఎంత దుర్మార్గం! వేటలో జంతువులను చంపినట్లు చంపడం! ఛీ, ఛీ! నేనసలు అర్థం చేసుకోలేకుండా వున్నాను" అంది, వాళ్లతోపాటు భోజనం చేస్తున్న హోటలు యజమానురాలు.

"ప్రశాంతమైన పొరుగుదేశంపై దాడి చేయటం కిరాతకం, అయితే, దేశంకోసం ప్రాణాలర్పించటం ప్రతిపోరుడి పవిత్ర కర్తవ్యం" అన్నాడు కార్నుదే.

"అవును, అది నిజమే కానీ, తమ సంతోషంకోసం యుద్ధంచేసే ఈ

రాజులనందరినీ చంపేస్తే ఎంత బావుంటుంది?"

కార్నుదే కళ్లు మెరిశాయి. "మహా బాగా చెప్పావు" అన్నాడు.

భోజనాలయ్యాయి. ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లారు. ల్వాసోకు మాత్రం నిద్రపట్టలేదు. 'కారిడార్ భాగోతా'లంటే అతనికిష్టం. ఓ గంటగడిచాక అతని ప్రయత్నం ఫలించింది. కార్నుదే, గుమ్మటం లోగొంతులో మాట్లాడుకుంటున్నారు. గుమ్మటం అతన్ని తన గదిలోకి రానివ్వటంలేదు. ల్వాసోకు అన్ని మాటలూ వినబడలేదు. అంతలో వాళ్ల గొంతులు పెద్దవయ్యాయి.

"నీవి అర్థంలేని భయాలు. జరిగే హానేముంది?" అంటున్నాడు కార్నుదే.

గుమ్మటం కోపంగా అంది: "ఛీ, ఛీ! ఇలాంటి పరిస్థితుల్లోనా? సిగ్గుచేటు!"

అతని కర్థమైనట్టు లేదు. సిగ్గెందుకు అన్నట్టున్నాడు. అప్పుడామె పెద్దగా అరిచినట్లుగా అంది: "ఎందుకా? ఎందుకని అడుగుతావు? హోటల్లో అంతటా ప్రష్యన్లు, మన పక్క గదిలోనే వాళ్లున్నప్పుడు, ఛీ ఛీ!"

అతను మౌనంగా వుండిపోయాడు. దేశభక్తితో కూడిన ఆ వేశ్య మాటలు అతనిలో నిద్రాణమైవున్న భావాలను జాగృతం చేసినట్టున్నాయి. అతను మారుమాట్లాడకుండా వెళ్లిపోయాడు. మాటేసిన ల్వాసో క్కూడా మరక్కడ పనిలేదు. కనుక, వెళ్లిపడుకున్నాడు. మర్నాడు పొద్దున ఎనిమిది గంటలకల్లా వాళ్లు ప్రయాణమవటానికి హోటలు కిచెనులో జమయ్యారు. కానీ, గుర్రబ్బండి వాడు కనిపించలేదు. గుర్రపుశాలలో చూశారు; అతన్ని వెతకటానికి బయలుదేరారు వాళ్లు. ఓ వైపున చర్చి, మరోవైపున ఇళ్లున్నాయి. అక్కడ ప్రష్యను సైనికులు కనిపించారు. ఓ సైనికుడు ఓ ఇంట్లో బంగాళాదుంపల పొట్టు తీస్తున్నాడు. మరోచోట మరో సైనికుడు క్షవరశాలను శుభ్రం చేస్తున్నాడు. ఇంకోచోట ఇంకో సైనికుడు బిడ్డను ఊయల్లో ఊపుతున్నాడు. కట్టెలు కొట్టటం, సూపు వండటం, కాఫీ గింజలు పట్టటం– ఓ ఇంట్లో ఓ ముసలావిడ బట్టలు కూడా ఉతుకుతున్నాడు. జమీందారుకు అదంతా ఆశ్చర్యమనిపించింది. ఓ ముసలతన్ని అడగ్గా అతనన్నాడు: "వాళ్లేం దుర్మార్గులు కాదు! ప్రష్యన్లట. ఎక్కడో దూరప్రాంతాల నుంచి వచ్చారు. పెళ్లాంబిడ్డలను వదలివచ్చారు. యుద్ధం వినోదమేం కాదు. ఇక్కడంత దుఃఖంలేకపోవటానికి కారణం వాళ్లు మనకేం కీడు చేయకపోవటమే. వాళ్ల ఇంట్లో పనిచేసుకున్నట్టే ఇక్కడా చేస్తున్నారు. బీదవాళ్లు ఒకళ్లకొకళ్లు సాయంచేసుకోవాలి."

> బాగా ఎత్తుకి దూకాలనుకొనేవాళ్ళు చాలా దూరం పరిగెట్టాల్సి వుంటుంది.
>
> –డేనిష్ సామెత

విజితులకూ, విజేతలకూ మధ్య వున్న ఈ సత్సంబంధాలు చూసి కార్నుదే ఒళ్లు మండిపోయింది. ల్వాసో ఓ జోకేశాడు: "వాళ్లు మనదేశంలో జనాభా పెంచుతారు." "పాపప్రక్షాళన చేసుకుంటున్నారు వాళ్లు" అన్నాడు కారే లమదాన్.

వెతగ్గా వెతగ్గా బండివాడు ఓ కఫేలో కూర్చుని కనిపించాడు వాళ్లకు.

"ఎనిమిది గంటలకల్లా బండి సిద్ధం చేయమని చెప్పలా మేం నీకు?" అడిగాడు జమీందారు.

"అవును, ప్రష్యను కమాండరు మరో ఆర్డరు వేశాడు, బండి కట్టవద్దని!"

"ఎందువల్ల?"

"నా కా సంగతి తెలీదు. బండి కట్టొద్దన్నారు. కట్టను, అంతే!"

"నీకాయనే అలా అని చెప్పాడా?"

"లేదు, హోటలు యజమాని ద్వారా కబురుపెట్టాడు."

ముగ్గురు పురుషపుంగవులూ హోటలుకు తిరిగివచ్చారు. హోటలు యజమానికోసం చూశారు. అతను ఉబ్బసంరోగి, ఉదయం పదిగంటలవరకూ లేవడట. ప్రష్యన్ ఆఫీసర్ని కలవాలని వాళ్లనుకున్నారు కానీ హోటలు యజమాని, ఫాలెన్వీతో తప్ప మరెవరితోనూ అతను పౌరవ్యవహారాలు మాట్లాడట. వాళ్లు ఫాలెన్వీ కోసం నిరీక్షించారు. అతను పదిగంటలకు కనిపించాడు. తన ఆదేశంలేకుండా ప్రయాణికుల బండి కదలడానికి వీల్లేదని ఆఫీసరు తనకు చెప్పాడట. జమీందారు, లమదాన్ ఆఫీసర్ను కలుసుకోవాలనుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తన్ను కలుసు కోవచ్చని అతను కబురుపెట్టాడు. జమీందారు, లమదాన్, ల్వాసో వెళ్లారు. కార్నుదే "ఈ జర్మన్లతో నేనేం సంబంధం పెట్టుకో"నని చెప్పి వెళ్లలేదు.

వాళ్లు రావటం చూసి ఆఫీసరు అడిగాడు: "ఏం కావాలి మీకు?"

జమీందారు, "మేం వెళ్లిపోవాలనుకుంటున్నాం" అన్నాడు, బృందానికి ప్రాతినిధ్యం వహిస్తూ.

"వీల్లేదు!"

"అనుమతి నిరాకరించటానికి మేం కారణం తెలుసుకోవచ్చా?"

"నాకిష్టంలేదు. అంతే!"

"కాని ఛీఫ్ జనరల్‌గారు మాకు దీపే వెళ్లటానికి అనుమతించారు. మీకు కష్టం కలిగించే పని మేమేం చేయలేదు."

"నా కిష్టంలేదు. అంతే, మీరిక వెళ్లవచ్చు."

వాళ్లు తిరిగివచ్చారు. ఆఫీసరు బుర్రలో ఏముందో వాళ్లకర్థంకాలేదు. అందరూ కలిసి పరిస్థితిని గురించి చర్చించారు. రకరకాల ఊహలు చేశారు. తమను బందీలు చేశారా? లేక హోస్టేజీలుగా పట్టుకున్నారా? తమ విడుదలకు ఎంత పెద్ద మొత్తాలు అడుగుతారు? ఈ ఆలోచన వాళ్లలో భయాన్ని కలిగించింది. ముఖ్యంగా ధనవంతులకు; తమ ప్రాణాలు కాపాడుకోటం కోసం బంగారుసంచులను ఆ దుష్టుడైన ఆఫీసరు కందించే దృశ్యం కూడా ఊహించి భయకంపితులయ్యారు వాళ్లు. తాము బీదవాళ్లమని ఎలా చెప్పుకోవాలా అని ఆలోచించసాగారు.

వాళ్లు డిన్నర్‌కు వెళ్తున్న సమయంలో ఫాలెన్వీ వచ్చి, "ఎలిజబెత్ రూసే తన మనసు మార్చుకున్నదేమో కనుక్కురమ్మని నన్ను పంపారు" అన్నాడు. గుమ్మటం నిలబడిపోయింది. ఆమె ముఖం పాలిపోయింది. ఆ తర్వాత కోపంతో ఆమె ముఖం ఎర్రబడిపోయింది. చివరికిగా కోపంగా అంది: "నువ్వెళ్లి ఆ దౌర్భాగ్యుడు, ఆ వెధవ, ఆ ప్రష్యను పందికి చెప్పు, నేనెప్పటికీ మనసు మార్చుకోనని! ఎప్పటికీ మార్చుకోనని చెప్పు!" హోటలు యజమాని తిరిగి వెళ్లిపోయాడు. ప్రయాణికులంతా ఆమె చుట్టూ మూగారు. ఆఫీసరు ఏమడిగాడో చెప్పమని ఆమెను నిర్బంధించారు. ప్రార్థించారు. వేడుకున్నారు. ఆమె మొదట్లో సమాధానం చెప్పనిరాకరించింది, చివరికి విసుగుపుట్టి చెప్పింది: "వాడికేం కావాలి? వాడికేం కావాలో నిజంగా మీకు తెలుసుకోవాలని వుందా? అయితే వినండి, వాడు నాతో గడుపుతాడట!"

ఎవరినోటా మాటరాలేదు. అందరూ ఆగ్రహంతో ఉడికిపోయారు. కార్నుదే అయితే కోపంతో బలంగా బల్లను బాది చేతిలోని గ్లాసు విరక్కొట్టాడు. వీళ్లు కిరాతకుల్లా ప్రవర్తిస్తున్నారని జమీందారు అన్నాడు. ప్రత్యేకంగా స్త్రీలు గుమ్మటంపట్ల ఎంతో సానుభూతిని వ్యక్తంచేశారు. క్రైస్తవ సోదరీమణులు తలలు వంచుకున్నారు. మొదట వచ్చిన ఆగ్రహం కొంత తగ్గాక, వాళ్లు భోంచేశారు. కానీ, ఎవరూ మాట్లాడలేదు. ఆలోచనల్లో పడిపోయారు.

ఎక్కువ పొద్దుపోక ముందే స్త్రీలు పడుకోటానికి తమ తమ గదుల్లోకి వెళ్లిపోయారు. మగవాళ్లు పేకాట ఆరంభించారు. హోటలు యజమాని ఫాలెన్వీని కూడా ఆహ్వానించారు. ఈ ఆఫీసరు వ్యతిరేకత నెలా జయించాలా అని

యథాలాపంగా అన్నట్లు అతన్ని ప్రశ్నలు వేశారు. "ఆట, ముందు ఆటాడండి" అన్నాడు కానీ, మరింకో విషయంపై అతను దృష్టిసారించలేదు. అతన్నుంచి ఇంకేం రాబట్టలేమని వాళ్లకు తెలిశాక, వాళ్లు ఆట ఆపేసి, తమ తమ గదులకు వెళ్లిపోయారు.

ఏదోవిధంగా ఇక్కడ నుంచి వెళ్లిపోగలమనే చెప్పలేని ఆశతో పొద్దున్నే నిద్రలేచారు వాళ్లు. ఆ దరిద్రపు హోటల్లో మరో రోజు గడపాలనే ఆలోచనే వాళ్లకు భయాన్ని కలిగిస్తోంది. గుర్రాలు గుర్రపుశాలలో వున్నాయి. బండివాడు కనిపించలేదు. ఏం తోచక బయటికి అడుగుపెట్టారు. బండిచుట్టూ తిరిగారు.

బ్రేక్‌ఫాస్టేం బాగాలేదు. గుమ్మటంపట్ల ముభావంగా వుండటం మొదలుపెట్టారు వాళ్లు. రాత్రి నిద్రపోయాక వాళ్ల ఆలోచనల్లో మార్పులొచ్చాయి. ఆ రాత్రి ఆ పిట్ట ఆ ప్రష్యనుతో గడిపితే బావుండేది అనుకున్నారంతా. ఆ పని ఎంత సరళమైంది! ఎవరికి మాత్రం ఏం తెలుస్తుంది? తోటిప్రయాణికుల దుఃస్థితి చూసి తనా పని చేయ పూనుకున్నానని ఆఫీసరుకు చెప్పి, పరువు కాపాడుకోవచ్చు. అయినా ఆ పిల్లకు వీడైనా, వాడైనా పెద్ద తేడా ఏముంది? అయితే, ఎవరూ ఈ ఆలోచనలకు మాటల రూపమివ్వలేదు.

అక్కడ వుండీ వుండీ, అందరికీ విసుగ్గా వుంది. "అలా ఊళ్లోకి వెళ్లొద్దాం. పదండి" అన్నాడు జమీందారు. కార్నుదే తప్ప మిగతా అందరూ బయలుదేరారు, తమ శరీరాలను ఉన్ని బట్టల్లో కప్పుకుని. క్రైస్తవ సోదరీమణులు చర్చిలో వుండటంవల్ల రాలేదు. నలుగురు స్త్రీలూ ముందు నడుస్తున్నారు. ముగ్గురు పురుషులూ వాళ్లను అనుసరించారు.

"ఈ పిల్ల మనను ఎప్పటికీ ఇక్కడే వుంచేలా వుంది" అన్నాడు ల్వాసో. "తనంతట తాను ముందుకు వచ్చి త్యాగం చేయ సిద్ధపడితే తప్ప మనమేం చేయలేం" అన్నాడు ఎప్పుడూ మర్యాదగా మాట్లాడే జమీందారు.

"ఫ్రెంచ్ సైనికులు దీపేగుండా వస్తే, తోత్స్‌లో తప్పకుండా పెద్ద యుద్ధం జరుగుతుంది" అన్నాడు లమదాన్. అది మిగతావాళ్లలో వణుకు పుట్టించింది.

"మనం నడిచి వెళ్లిపోగలిగితే ఎంత బావుండు!" అన్నాడు ల్వాసో.

"మంచు ఇలా కురుస్తున్నప్పుడు అది జరిగే పనిటయ్యా- పైగా ఈ ఆడవాళ్లతో కుదిరే పనా?" అన్నాడు జమీందారు. వాళ్లలా మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. వీధి చివరి నుంచి ఠీవిగా వస్తున్న ఆఫీసరు కనిపించాడు వాళ్లకు. మహిళల పక్కగా నడుస్తూ అభివాదం చేశాడు. మగవాళ్ల వంక ఏహ్యంగా చూశాడు. అతన్ని చూడనట్టు అభినయించి పరువు కాపాడుకున్నారు పురుషులు. ల్వాసో మాత్రం హాట్ ఎత్తి అభివాదప్రయత్నం చేశాడు. గుమ్మటంముఖం ఎర్రబడిపోయింది. తాము అలక్ష్యంగా చూసిన ఆ పిల్లతో కలిసి తమను ఆ ఆఫీసరు చూడటంవల్ల ఉడుకెత్తిపోయారు ఆ స్త్రీలు. అయితే, వాళ్లతన్ని గురించి మాట్లాడారు. అతని రూపం, అతను ముఖం బాగానే అనిపించాయి లమదాన్ భార్యకు. "అతను ఫ్రెంచ్ వాడైనట్లయితే, ఏ స్త్రీ అయినా అతని కోసం వెంపరలాడేది" అని అందామె. హోటలుకు తిరిగి వచ్చారు వాళ్లు. ఏం చెయ్యాలో తోచలేదు ఎవరికీ. భోజనాలయ్యాయి. నిశ్శబ్దంగా ఎవరి గదులకు వాళ్లు వెళ్లిపోయారు. మర్నాడు పొద్దున చర్చిలో బాప్టిజం జరుగుతూంటే చూద్దామని వెళ్లింది గుమ్మటం. ఆమె అలా వెళ్లగానే అందరూ కుర్చీలు దగ్గరికి లాక్కుని కూర్చున్నారు. నిర్ణయమేదైనా తీసుకోవాలని, ఆ పిల్లను ఒక్కదాన్నీ అక్కడుంచి, తమను పంపెయొచ్చుగా అన్నది ల్వాసో ఆలోచన. హోటల్ యజమాని ఫాలెన్వీ ద్వారా ఆఫీసరుకు కబురు పంపారు. అతనికి మానవస్వభావం తెలుసు. తన కోరిక ఈడేరనంత వరకూ ఎవరూ ఊరు విడిచిపోవ వీల్లేదని కబురు పంపాడు అతను.

అప్పుడు ల్వాసో భార్య తన లేకితనాన్ని వ్యక్తపరుస్తూ అంది: "మనకు ముసలితనం వచ్చేస్తుంది. ఇక్కడ వుండీ వుండీ! దాని వృత్తే అది- అందరికీ వసతి కల్పించటం. మరలాంటప్పుడు వీడిని తిరస్కరించటంలో అర్థమేమిటో నాకు తెలియటంలేదు. రూవెన్‌లో అది బండివాళ్లతో కూడా పక్క పంచుకుంది. అలాంటిదానివల్ల మనం ఇవాళ ఇన్ని అవస్థలు పడాల్సి వచ్చింది. నా అభిప్రాయంలో ఆఫీసరు ప్రవర్తన మర్యాదగానే వుంది. పాపం, ఎంత కాలం నుంచి పొందులేక కష్టాలు పడుతున్నాడో అతను! మన ముగ్గురినీ కోరినా తప్పులేదు. కానీ, అలా జరగలేదే! ఉమ్మడి ఆస్తిలో తనకూ భాగం ఇమ్మన్నాడు. వివాహితస్త్రీల పట్ల గౌరవంగా వుంటాడతను. పైగా అతను ఇక్కడ అధికారి. 'నాక్కావాలి' అంటే చాలు, సైనికులు బలవంతంగా మనందరినీ తీసుకెళ్లి అతని కాళ్లముందు పడేసినా మనకు దిక్కులేదు!"

మిగతా ఇద్దరు స్త్రీలూ వణికిపోయారు. కారే లమదాన్ భార్య ముఖం పాలిపోయింది. ఆఫీసరు బలవంతంగా తన్ను పట్టితీసుకెళ్తున్న దృశ్యం ఆమె ఊహించసాగింది.

మగవాళ్లు కలిసి విషయాన్ని చర్చించారు. కాళ్లూ, చేతులూ కట్టేసి ఆ ముండను శత్రువు కప్పగించాలన్నాడు ల్వాసో. మూడు తరాలుగా రాయబారులుగా పనిచేసిన రక్తం ప్రవహిస్తోంది జమీందారు శరీరంలో. "అంతకంటే వేరే మార్గమేమన్నా వుంటే చూద్దాం"మన్నాడు అతను. అందరూ కూర్చుని కుట్ర పన్నసాగారు. ప్లానులు వేశారు. ఎవరు ఎట్లా మాట్లాడాలో తేల్చుకున్నారు. ఒక్క కార్నుదే మాత్రం వీటన్నిటికీ దూరంగా వున్నాడు. గుమ్మటం చర్చి నుంచి వచ్చాక, మధ్యాహ్నం లంచ్ సమయం దాకా స్త్రీలందరూ ఆమెతో చాలా స్నేహంగా మెలిగారు. ఆమె మరింత ఒద్దికగా తమపట్ల ప్రవర్తించే టట్లూ, తామిచ్చిన సలహాతో ఆమెకు విశ్వాసం కుదిరేటట్లూ మాట్లాడారు వాళ్లు. భోజనం టేబుల్ దగ్గర అసలు దాడి ప్రారంభమైంది. ప్రాచీన ఉదాహరణలు ప్రస్తావించారు. జూడిత్, హాలోఫెర్నెస్‌ల ఉదాహరణ లిచ్చారు. ల్యూక్రీ, సెక్స్‌టస్‌ల సంగతి చెప్పారు. క్లియోపాత్రా ఎలా ఎందరు శత్రుసేనానులను తనకు దాసులుగా చేసుకుందో చెప్పారు. పురుషులు యుద్ధంలో ఓడిపోయినా, స్త్రీలు శత్రువుల నెలా చుట్టుముట్టి చివరికి విజయాన్ని పొందారో చెప్పారు. ఓ ఇంగ్లీషు స్త్రీకి ఎలా భయంకరమైన అంటువ్యాధిని ఇనాక్యులేట్ చేసి బోనపార్టీని చంపటానికి పంపిందీ, చివరికతను జబ్బుచేసి ఆమెను కలవలేకపోయాడు కానీ, లేకపోతే చనిపోయేవాడేననీ చెప్పారు. ఈ మాటలన్నీ ప్రేమగా, స్నేహాన్ని వెలారుస్తూ చెప్పారు. అలాంటి గొప్పవాళ్ల త్యాగపథంలో పయనించటమే ఆమె కర్తవ్యమన్నట్టు చెప్పారు. ఈ మాటలన్నీ విన్న గుమ్మటం ఏం మాట్లాడలేదు. ఆ రోజు మధ్యాహ్న మంతా ఆమెను ఆలోచించుకోనిచ్చారు వాళ్లు.

మీ ముత్తాతగారెంత
పొడుగుండేవారో
అనవసరం.
మీరెంత ఎత్తు పెరిగారో
అది ముఖ్యం.
-ఐరిష్ సామెత

రాత్రి భోజనమప్పుడు, హోటలు యజమాని, ఫాలెన్వీ పాతపాటే పాడుతూ వచ్చాడు: "ఎలిజబెత్ రూసేగారు తమ మనసు మార్చుకున్నారేమో తెలుసుకు రమ్మని ప్రష్యన్ ఆఫీసరుగారు నాకు ఆదేశమిచ్చారు" అంటూ.

గుమ్మటం పొడిపొడిగా అంది: "లేదండీ!" అని, ఇంక టేబుల్ దగ్గర కూర్చున్న జనమంతా ఆలోచించసాగారు. కొత్త ఉదాహరణ లేమన్నా దొరుకుతాయేమోనని. వాళ్లకు ఒక్కటీ తట్టలేదు. అప్పుడు జమీందారిణి సెయింట్ల జీవితాల్లోని గొప్ప సంఘటనలను గురించి చెప్పమని పెద్ద సిస్టర్ని అడిగింది. వాళ్లు చేసిన పనులు మనబోటి వాళ్ల దృష్టిలో నేరాలుగా కనిపిస్తాయి. కానీ, చర్చి దృష్టిలో అవి పాపాలు కావన్నది. ఎందుకూ? వాళ్లు ఏం చేసినా దేవుడి

ఘనత స్థాపించటం కోసం చేశారు. ప్రజాబాహుళ్య క్షేమం కోసం చేశారు. అలా చాలాసేపు మాట్లాడాక పెద్ద సిస్టర్ని అడిగింది: "నువ్వు చెప్పు, సిస్టర్! ఉద్దేశం పవిత్రమైందైనప్పుడు, దేవుడు ఉద్దేశ్యాన్ని స్వీకరించి, కర్మలను క్షమిస్తాడంటావా, లేదా?" "అందులో సందేహించటానికేముంది, మేడం! ఓ కర్మ కళంకపూరితమే కావచ్చు, కానీ, ఎలాంటి ఆలోచనల నుంచి అది జనించిందో అదే ముఖ్యం. కనుక ఆలోచనను బట్టి అది పుణ్యకార్యమవుతుంది."

అలా భగవంతుడి ఇచ్ఛలను వెలారుస్తూ వాళ్లు మాట్లాడారు. అయితే, పవిత్రురాలైన ఆ క్రైస్తవ సోదరీమణి చెప్పిన ప్రతి మాటా ఆ వేశ్య వ్యతిరేకతను భగ్నం చేయటంలో కృతకృత్యమైంది. ఆ తరువాత సిస్టర్, తమ సుపీరియర్ గురించీ, తమను గురించీ చెప్పింది. మశూచితో బాధపడుతూ మృత్యుముఖంలో వున్న వందలాది సైనికుల సేవకోసం తమను హాస్రే పంపిస్తున్నారట. ఈ ప్రష్యను ఆఫీసరు తమను ఆపేయటంతో, బతకవలసిన ఎంతోమంది ఫ్రెంచ్ సైనికులు మృత్యువువాత పడతారని ఆమె బాధ పడుతూ చెప్పింది. ఆమె మాట్లాడిన తరువాత మరెవరూ మాట్లాడలేదు.

మర్నాడు లంచ్ నిశ్శబ్దంగా ముగిసింది. మధ్యాహ్నం తిరిగి రావటానికి ఊళ్లోకి వెళ్లారు వాళ్లు. జమీందారు గుమ్మటంతో చాలా ప్రేమగా మాట్లాడాడు. చివరికన్నాడు: "అయితే, నీ జీవితంలో అంతకుముందు ఎందరినో అనుగ్రహించిన దాన్ని అతనికి నిరాకరించి, అపజయం తర్వాత కొనసాగే హింసకు నువ్వు మమ్మల్ని పాల్పడజేస్తావన్న మాట! సరే కానీ" అని, ఆ తర్వాత ఆ మాటలూ ఈ మాటలూ చెప్పి, "చూడమ్మాయ్, అతనికీ గొప్పగా చెప్పుకోటానికేదైనా కావాలిగా? తన దేశంలో అలభ్యమయ్యే అందమైన అమ్మాయిని ఫ్రాన్సులో తను కలుసుకున్నానని చెప్పుకోవాలిగా?" అనీ అన్నాడు.

గుమ్మటం ఆ మాటలకేం సమాధానం చెప్పలేదు. హోటలుకు వెళ్లగానే తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది. మళ్లీ ఎవరికీ కనిపించలేదు. ఆ పిల్ల ఇంకా అలాగే నిరాకరిస్తూ వుంటే తమకిక అథోగతే అని అందరూ మనస్తాపపడసాగారు. డిన్నరు గంట మోగింది. అందరూ టేబుల్ దగ్గర వచ్చి కూర్చున్నారు. "రూసేకు ఒంట్లో బాగుండలేదు. అందువల్ల ఆమె ఇప్పుడు భోజనానికి రాదు" అని వచ్చి చెప్పాడు హోటల్ యజమాని ఫొలెన్వీ. జమీందారు అతని దగ్గరగా వెళ్లి స్వరం తగ్గించి అడిగాడు: "అతడు లోపల వున్నాడా?"

"అవును."అతను పైకేం అనలేదుగానీ, తల పంకించి సంజ్ఞ చేశాడు. అందరి హృదయాలూ సేదదీరినట్లయ్యాయి. ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. హాయిగా మాట్లాడుకోసాగారు వాళ్లు. అంతలో ల్యాసో, "ష్, మాట్లాడకండి" అని కళ్లూ, చేతులూ సీలింగ్వైపు ఎత్తి వింటూ అన్నాడు: "బాగుంది, అంతా సక్రమంగానే జరుగుతోంది."

మొదట్లో అర్థం చేసుకోలేకపోయినా, వెంటనే నవ్వులతో భళ్లుమన్నారు. వాళ్లు తమ అభిరుచిని వెలారుస్తూ కుళ్లు జోకులు వేసుకున్నారు. ఆ తర్వాత ల్యాసో గ్లాసెత్తి, "మన విడుదల కోసం తీర్థం పుచ్చుకుంటున్నాను" అన్నాడు. ఇంత కోలాహలంగా వున్నా కార్నుదే ఒక్క మాట మాట్లాడలేదు. గంభీరంగా, ఎందుకో కోపంగా వుండిపోయాడు. "ఏం మిత్రమా, నువ్వేం సరదాగా లేవు ఇవ్వాళ?" అనడిగాడు ల్యాసో. కార్నుదే ఒక్కసారిగా తలెత్తి, తీక్షణంగా చూస్తూ అన్నాడు: "మీకందరికీ ఇవ్వాళ దక్కేది అపకీర్తి తప్ప మరేంలేదు. ఇంత కంటే దౌష్ట్యం మరేదీ లేదు" అని ఆపైన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ల్యాసో మొదట తగ్గిపోయినా, మళ్లీ ఉత్సాహాన్ని పుంజుకున్నాడు. 'కారిడార్ భాగోతం' గురించి చెప్పాడు. "నిజమా, నువ్వు చూశావా?" అనడిగాడు జమీందారు, కారే లమడాన్లు.

"అవును, నా కళ్లతో చూశాను. ప్రష్యను ఆఫీసరు పక్కగదిలో వున్నాడు. అది తిరస్కరించింది." నమ్మనట్లు చూసి, "ఒట్టుపెట్టుకు చెప్తున్నాను" అన్నాడు.

అందరూ గుస్స తెచ్చుకోలేనట్లు నవ్వారు.

"అందుకే వాడలా వున్నాడు" అన్నాడు ల్యాసో.

మర్నాడు ఉదయం ఆకాశం నిర్మలంగా వుంది. మంచుమీద సూర్యకిరణాలు పడి మెరుస్తున్నాయి. బండి ప్రయాణానికి సిద్ధమై హోటలు తలుపు దగ్గర నిలబడి వుంది. తక్కిన ప్రయాణానికవసరమైన తినుబండారాలు మూట కట్టుకుని, ప్రయాణీకులందరూ బండెక్కారు. గుమ్మటం కోసం నిరీక్షించారు. చివరికి ఆమె వచ్చింది. ఆమె ముఖం సిగ్గుతో కుంచించుకుపోయింది. పిరికిగా, ఆమె తన సహప్రయాణీకుల వంక చూసింది. వాళ్లు ముఖాలు పక్కకు తిప్పుకున్నారు. జమీందారు అపవిత్రమైన గుమ్మటం స్పర్శ సోకకుండా భార్యను తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. గుమ్మటం పార్క్రామెకుడి భార్యకు అభివాదం చేసింది కానీ ఆమె ఏం మాట్లాడలేదు. గుమ్మటం బట్టల్లో ఏదో అంటురోగం వున్నట్టు అందరూ ఆమెకు దూరంగా తొలిగారు.

బండి మెల్లగా కదిలింది. మిగిలిన ప్రయాణం మొదలైంది. ఎవరూ ఆమెతో మాట్లాడలేదు. గుమ్మటానికి కళ్లెత్తి చూసే ధైర్యం లేకపోయింది. సహప్రయాణీకుల పట్ల ఆమెకు కోపంగా వుంది. వీళ్లే కపటంగా తనను ఆ ప్రష్యనువెధవ మురికిచేతుల్లోకి నెట్టారు. అతనికి లొంగిపోయిన అవమానభారం ఆమెను బాధించింది. ఆమెను వదిలేసి, అక్కడ ఆమె లేనట్లే అందరూ మాట్లాడుకోసాగారు. మూడుగంటల ప్రయాణమయ్యాక, ల్యాసో అన్నాడు: "నాకు ఆకలి వేస్తోంది" అని. అతని భార్య కింద వున్న బుట్ట తీసింది. అందరూ తాము తెచ్చుకున్న ఆహారాన్ని తినసాగారు. గుమ్మటం తన హడావుడిలో ఏం తెచ్చుకోలేకపోయింది. తన్నే మాత్రం గమనించకుండా పొట్టలు పగిలేట్టు తింటున్నవాళ్ల వంక ఏహ్యంగా చూసింది. వాళ్లను తినేయాలన్నంత కోపం వచ్చింది. కానీ నోరెత్తలేకపోయింది. ఘృణతో ఆమె నోరు మూసుకుపోయింది. ఎవరూ ఆమెను చూడలేదు. ఆమెను పట్టించుకోలేదు. తనను మొదటగా బలిపెట్టి, ఆ తర్వాత పనికిరాని వస్తువులా చెత్తకుండీలోకి విసిరేసిన ఆ దుర్మార్గ సజ్జనుల ఏహ్యంలో తను మునిగి పోయినట్లుగా ఆమె భావించింది. ప్రయాణం మొదటిరోజున తను వాళ్లకందించిన ఆహారపదార్థాలూ, తినుబండారాలూ, క్రీములూ ఆమెకు గుర్తుకు వచ్చాయి. ఆమెకు దుఃఖం ముంచుకు వచ్చింది. ఎంతో ప్రయత్నంచేసి కానీ ఆమె తన దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. తన్నుకొస్తున్న వెక్కిళ్లను మింగేసింది. కానీ, కళ్లనుంచి కారుతున్న కన్నీళ్లను ఆమె ఆపలేకపోయింది. జమీందారిణి ఆమె దుఃఖాన్ని గుర్తించింది. సంజ్ఞచేసి భర్తకు చెప్పింది. అతను భుజాలు కుదించుకుంటూ, 'అందుకు నన్నేం చేయమంటావు? అది నా తప్పు కాదు!' అన్నట్లు ప్రవర్తించాడు. "సిగ్గుతో అది ఏడుస్తోంది" అంది గుసగుసగా ల్యాసో భార్య. క్రైస్తవ సోదరీమణులు తాము తినగా మిగిలింది పేపర్లో చుట్టి ప్రార్థన చేసుకోసాగారు. ఆత్మారాముణ్ణి శాంతింపజేసుకున్న కార్నుదే పాటను హమ్ చేసుకోసాగాడు. మంచుగడ్డ పడింది కనుక వాళ్ల ప్రయాణం త్వరగా సాగింది. కుదుపుల రోడ్డులో, ముసురుకుంటున్న చీకటిలోకి బండి పయనించింది.

గుమ్మటం దారి పొడుగూతా ఏడుస్తూనే వుంది. అప్పుడప్పుడూ ఆమె ఆపుకోలేని వెక్కిళ్లు, ఆ రెండు సీట్ల వరసల మసకల నీడల మధ్యా ప్రతిధ్వనించాయి. ●

> **నీళ్ళు ప్రశాంతంగా వున్నాయి గదా అని అందులో మొసళ్ళు లేవని భ్రమ పడకు.**
> **-మలయన్ సామెత**

ఘనత స్థాపించటం కోసం చేశారు. ప్రజాబాహుళ్య క్షేమం కోసం చేశారు. అలా చాలాసేపు మాట్లాడాక పెద్ద సిస్టర్ని అడిగింది: "నువ్వు చెప్పు, సిస్టర్! ఉద్దేశం పవిత్రమైందైనప్పుడు, దేవుడు ఉద్దేశ్యాన్ని స్వీకరించి, కర్మలను క్షమించేస్తాడంటావా, లేదా?" "అందులో సందేహించటానికేముంది, మేడం! ఓ కర్మ కళంకపూరితమే కావచ్చు, కానీ, ఎలాంటి ఆలోచనల నుంచి అది జనించిందో అదే ముఖ్యం. కనుక ఆలోచనను బట్టి అది పుణ్యకార్యమవుతుంది."

అలా భగవంతుడి ఇచ్ఛలను వెలారుస్తూ వాళ్లు మాట్లాడారు. అయితే, పవిత్రురాలైన ఆ క్రైస్తవ సోదరీమణి చెప్పిన ప్రతి మాటా ఆ తుచ్ఛవేశ్య వ్యతిరేకతను భగ్నం చేయటంలో కృతకృత్యమైంది. ఆ తరువాత సిస్టర్, తమ సుపీరియర్ గురించీ, తమను గురించీ చెప్పింది. మశూచితో బాధపడుతూ మృత్యుముఖంలో వున్న వందలాది సైనికుల సేవకోసం తమను హావ్రే పంపిస్తున్నారట. ఈ ప్రష్యను ఆఫీసరు తమను ఆపేయటంతో, బతకవలసిన ఎంతోమంది ఫ్రెంచ్ సైనికులు మృత్యువువాత పడతారని ఆమె బాధ పడుతూ చెప్పింది. ఆమె మాట్లాడిన తరువాత మరెవరూ మాట్లాడలేదు.

మర్నాడు లంచ్ నిశ్శబ్దంగా ముగిసింది. మధ్యాహ్నం తిరిగి రావటానికి ఊళ్లోకి వెళ్లారు వాళ్లు. జమీందారు గుమ్మటంతో చాలా ప్రేమగా మాట్లాడాడు. చివరికన్నాడు: "అయితే, నీ జీవితంలో అంతకుముందు ఎందరినో అనుగ్రహించిన దాన్ని అతనికి నిరాకరించి, అపజయం తర్వాత కొనసాగే హింసకు నువ్వు మమ్మల్ని పాల్పడజేస్తావన్న మాట! సరే కానీ" అని. ఆ తర్వాత ఆ మాటలూ ఈ మాటలూ చెప్పి, "చూడమ్మాయ్, అతనికీ గొప్పగా చెప్పుకోటానికేదైనా కావాలిగా? తన దేశంలో అలభ్యమయ్యే అందమైన అమ్మాయిని ఫ్రాన్సులో తను కలుసుకున్నానని చెప్పుకోవాలిగా?" అనీ అన్నాడు.

నీళ్ళు ప్రశాంతంగా వున్నాయి గదా అని అందులో మొసళ్ళు లేవని భ్రమ పడకు.
–మలయన్ సామెత

గుమ్మటం ఆ మాటలకేం సమాధానం చెప్పలేదు. హోటలుకు వెళ్లగానే తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది. మళ్లీ ఎవరికీ కనిపించలేదు. ఆ పిల్ల ఇంకా అలాగే నిరాకరిస్తూ వుంటే తమకిక అధోగతే అని అందరూ మనస్తాపపడసాగారు. డిన్నరు గంట మోగింది. అందరూ టేబుల్ దగ్గర వచ్చి కూర్చున్నారు. "రూసేకు ఒంట్లో బాగుండలేదు. అందువల్ల ఆమె ఇప్పుడు భోజనానికి రాదు" అని వచ్చి చెప్పాడు హోటల్ యజమాని ఫొలెన్వీ. జమీందారు అతని దగ్గరగా వెళ్లి స్వరం తగ్గించి అడిగాడు: "అతడు లోపల వున్నాడా?"

"అవును."అతను పైకేం అనలేదుగానీ, తల పంకించి సంజ్ఞ చేశాడు. అందరి హృదయాలూ సేదదీరినట్లయ్యాయి. ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. హాయిగా మాట్లాడుకోసాగారు వాళ్లు. అంతలో ల్వాసో, "ష్, మాట్లాడకండి" అని కళ్లూ, చేతులూ సీలింగ్‌వైపు ఎత్తి వింటూ అన్నాడు: "బాగుంది, అంతా సక్రమంగానే జరుగుతోంది."

మొదట్లో అర్థం చేసుకోలేకపోయినా, వెంటనే నవ్వులతో భళ్లుమన్నారు. వాళ్లు తమ అభిరుచిని వెలారుస్తూ కుళ్లు జోకులు వేసుకున్నారు. ఆ తర్వాత ల్వాసో గ్లాసెత్తి, "మన విడుదల కోసం తీర్థం పుచ్చుకుంటున్నాను" అన్నాడు. ఇంత కోలాహలంగా వున్నా కార్నుదే ఒక్క మాట మాట్లాడలేదు. గంభీరంగా, ఎందుకో కోపంగా వుండిపోయాడు. "ఏం మిత్రమా, నువ్వేం సరదాగా లేవు ఇవ్వాళ?" అనడిగాడు ల్వాసో. కార్నుదే ఒక్కసారిగా తలెత్తి, తీక్షణంగా చూస్తూ అన్నాడు: "మీకందరికీ ఇవ్వాళ దక్కేది అపకీర్తి తప్ప మరేంలేదు. ఇంత కంటే దౌష్ట్యం మరేదీ లేదు" అని ఆపైన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ల్వాసో మొదట తగ్గిపోయినా, మళ్లీ ఉత్సాహాన్ని పుంజుకున్నాడు. 'కారిడార్ భాగోతం' గురించి చెప్పాడు. "నిజమా, నువ్వు చూశావా?" అనడిగాడు జమీందారు, కారే లమదాన్‌ను.

"అవును, నా కళ్లతో చూశాను. ప్రష్యను ఆఫీసరు పక్కగదిలో వున్నాడని అది తిరస్కరించింది." నమ్మనట్టు చూస్తే, "ఒట్టుపెట్టుకు చెప్తున్నాను" అన్నాడు.

అందరూ గుక్క తిప్పుకోలేనట్లు నవ్వారు.

"అందుకే వాడలా వున్నాడు" అన్నాడు ల్వాసో.

మర్నాడు ఉదయం ఆకాశం నిర్మలంగా వుంది. మంచుమీద సూర్యకిరణాలు పడి మెరుస్తున్నాయి. బండి ప్రయాణానికి సిద్ధమై హోటలు తలుపు దగ్గర నిలబడి వుంది. తక్కిన ప్రయాణానికవసరమైన తినుబండారాలు మూట కట్టుకుని, ప్రయాణికులందరూ బండెక్కారు. గుమ్మటం కోసం నిరీక్షించారు. చివరికి ఆమె వచ్చింది. ఆమె ముఖం సిగ్గుతో కుంచించుకుపోయింది. పిరికిగా, ఆమె తన సహప్రయాణికుల వంక చూసింది. వాళ్లు ముఖాలు పక్కకు తిప్పుకున్నారు. జమీందారు అపవిత్రమైన గుమ్మటం స్పర్శ సోకకుండా భార్యను తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. గుమ్మటం పారిశ్రామికుడి భార్యకు అభివాదం చేసింది కానీ ఆమె ఏం మాట్లాడలేదు. గుమ్మటం బట్టల్లో ఏదో అంటురోగం వున్నట్టు అందరూ ఆమెకు దూరంగా తొలిగారు.

బండి మెల్లగా కదిలింది. మిగిలిన ప్రయాణం మొదలైంది. ఎవరూ ఆమెతో మాట్లాడలేదు. గుమ్మటానికి కళ్లెత్తి చూసే ధైర్యం లేకపోయింది. సహప్రయాణికుల పట్ల ఆమెకు కోపంగా వుంది. వీళ్లే కపటంగా తనను ఆ ప్రష్యనువెధవ మురికిచేతుల్లోకి తోశారు. అతనికి లొంగిపోయిన అవమానభారం ఆమెను బాధించింది. ఆమెను వదిలేసి, అక్కడ ఆమె లేనట్టే అందరూ మాట్లాడుకోసాగారు. మూడుగంటల ప్రయాణమయ్యాక, ల్వాసో అన్నాడు: "నాకు ఆకలి వేస్తోంది" అని. అతని భార్య కింద వున్న బుట్ట తీసింది. అందరూ తాము తెచ్చుకున్న ఆహారాన్ని తినసాగారు. గుమ్మటం తన హడావుడిలో ఏం తెచ్చుకోలేకపోయింది. తన్నే మాత్రం గమనించకుండా పొట్టలు పగిలేట్టు తింటున్నవాళ్ల వంక ఏహ్యంగా చూసింది. వాళ్లను తిడదామన్నంత కోపం వచ్చింది, కానీ నోరెత్తలేకపోయింది. ఘృణతో ఆమె నోరు మూసుకుపోయింది. ఎవరూ ఆమెను చూడలేదు. ఆమెను పట్టించుకోలేదు. తనను మొదటగా బలిపెట్టి, ఆ తర్వాత పనికిరాని వస్తువులా చెత్తకుండీలోకి విసిరేసిన ఆ దుర్మార్గ సజ్జనుల ఏహ్యంలో తను మునిగి పోయినట్లుగా ఆమె భావించింది. ప్రయాణం మొదటిరోజున తను వాళ్లకందించిన ఆహారపదార్థాలూ, తినుబండారాలూ, డ్రింకులూ ఆమెకు గుర్తుకు వచ్చాయి. ఆమెకు దుఃఖం ముంచుకు వచ్చింది. ఎంతో ప్రయత్నంచేసి కానీ ఆమె తన దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. తన్నుకొస్తున్న వెక్కులను మింగేసింది. కానీ, కళ్లనుంచి కారుతున్న కన్నీళ్లను ఆమె ఆపలేకపోయింది. జమీందారిణి ఆమె దుఃఖాన్ని గుర్తించింది. సంజ్ఞచేసి భర్తకు చెప్పింది. అతను భుజాలు కుదించుకుంటూ, 'అందుకు నన్నేం చేయమంటావు? అది నా తప్పు కాదు!' అన్నట్టు ప్రవర్తించాడు. "సిగ్గుతో అది ఏడుస్తోంది" అంది గుసగుసగా ల్వాసో భార్య.క్రైస్తవ సోదరీమణులు తాము తినగా మిగిలిందాన్ని పేపర్లో చుట్టి ప్రార్థన చేసుకోసాగారు. ఆత్మారాముణ్ణి శాంతింపజేసుకున్న కార్నుదే పాటను హమ్ చేసుకోసాగాడు. మంచుగట్టి పడింది కనుక వాళ్ల ప్రయాణం త్వరగా సాగింది. కుదుపుల రోడ్డులో, ముసురుకుంటున్న చీకటిలోకి బండి పయనించింది.

గుమ్మటం దారి పొడుగూతా ఏడుస్తూనే వుంది. అప్పుడప్పుడూ ఆమె ఆపుకోలేని వెక్కులు, ఆ రెండు సీట్ల వరసల మనుషుల నీడల మధ్యా ప్రతిధ్వనించాయి.

# స్వార్థ రక్కసుడు

## ఆస్కార్ వైల్డ్ (1854- 1900)

అనువాదం: కాకాని చక్రపాణి



ఆస్కార్ వైల్డ్ డబ్లిన్‌లో, 1854 అక్టోబరు 15న జన్మించాడు. అతడి తల్లిదండ్రులిద్దరూ సాహిత్యవేత్తలే, కనుక చిన్నప్పటినుండి అతడు సాహిత్య వాతావరణం లోనే పెరిగాడు. విద్యార్థిదశలోనే, అతడు కవిగా, విద్వాంసుడుగా, సంభాషణ చతురుడుగా పేరొందాడు. రెవెన్నా, గ్రీస్‌లను సందర్శించాక, 1878లో రెవెన్నా అన్న సుదీర్ఘకవితను రాశాడు. బహుముఖీన ప్రతిభా సంపన్నుడతడు. డాంటే, మిల్టన్, కీట్స్ మొదలైన మహా కవులపట్ల తన భక్తిశ్రద్ధలను చమత్కార సుందరంగా ప్రదర్శిస్తూ, 1881లో తన మొదటి కవితాసంకలనం 'పోయెమ్స్' వెలువరించాడు. జాన్ రస్కిన్, వాల్‌టయిర్, పేటర్‌ల రచనలవల్లకూడ ప్రభావి తుడయ్యాడు. 'కళ కళ కోసమే' అన్న సిద్ధాంతాన్ని నమ్మాడు, దానికెంతో ప్రచారం కల్పించాడు. "కళను ఆవిష్కరించటం, కళాకారుడిని గోప్యంగా వుంచటమే కళ పరమార్థం" అని వైల్డ్ అభిప్రాయం. మహా రచయితలెవ్వరూ జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించలేరనీ, ఒకవేళ ఎవరైనా అలా చిత్రిస్తే వాళ్లు కళాకారులు కారనీ వైల్డ్ అభిప్రాయం. వైల్డ్ రాసిన ఒకేఒక్క సాంఘిక నవల ది పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే (1890). హాపీ ప్రిన్స్ అండ్ అదర్ టేల్స్ (1888), ఎ హౌస్ ఆఫ్ పామెగ్రనేట్స్ (1891) అతని కథల సంకలనాలు; అతని నాటకాల్లో గొప్పది ది ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్ (1899).

జీవితంలోనూ, సమాజంలోనూ పేరుప్రఖ్యాతులు సంపాదించి, ఉన్నతస్థానంలో ఉన్నప్పుడు, ఓ పరువునష్టం దావాలో ఓడిపోయి, రెండేళ్లపాటు (1895-97) రెడింగ్ జైలులో కఠిన కారాగారశిక్ష అనుభవించాడు. విడుదలయ్యాక, ఇంగ్లాడునుండి పారిస్‌కు పారిపోయాడు. స్నేహితులు అతడిని పట్టించుకోటం మానేశారు. మెచ్చుకున్న జనం అతడిని నిర్లక్ష్యం చేశారు. చితికిపోయిన మనిషిగా, ఫ్రాన్సులో సెరిబ్రల్ మెనింజైటిస్‌తో తీసుకుని 1900 నవంబరు 20న మరణించాడు.

ఆస్కార్ వైల్డ్ ఎంతో ప్రతిభావంతుడు. బెర్నార్డ్ షా లాంటివాడే అతడి సంభాషణ చాతుర్యాన్ని గొప్పగా ప్రశంసించాడు.

ప్రతిరోజూ మధాహ్నం, స్కూలునుండి తిరిగివస్తూ, పిల్లలు రాక్షసుడి తోటలోకి వెళ్లి ఆడుకునే వారు.

అది చక్కటి పెద్ద తోట, మెత్తటి గడ్డి పరిచి ఉండేది. అక్కడక్కడా చక్కటి గడ్డి పూలు నక్షత్రాల్లా మెరిసేవి. ఆ తోటలో పన్నెండు పీచ్ చెట్లు ఉండేవి. అవి వసంతకాలంలో తెలుపు, ఊదా రంగుపూలను పూసేవి; అవే ఆకురాలుకాలంలో చక్కటి ఎర్రటి పండ్లయేవి. చెట్లపై పక్షులు కిలాకిలారావాలు ఆలపించేవి. వాటి పాటలు విని పిల్లలు తమ ఆటలు మానేవారు. "మనకిక్కడ ఎంత బావుంది?" అనుకునేవారు.

ఒకరోజు రాక్షసుడు తిరిగి వచ్చాడు. అతడు తన మరో రాక్షసమిత్రుడింటికి వెళ్లాడు. ఏడేళ్ల పాటు అక్కడే ఉండిపోయాడు. ఏడేళ్లయాక, తన మాటలే కొద్ది కనుక తను చెప్పాల్సిందంతా చెప్పేశాక, తన భవనానికి తిరిగి వద్దామనే నిర్ణయం తీసుకున్నాడు. తను వచ్చేటప్పటికి, పిల్లలు తోటలో ఆడుకోటం కన్పించింది.

"ఏం చేస్తున్నారు, మీరంతా ఇక్కడ, ఆఁ?" అని గద్దించి అడిగాడు. దాంతో పిల్లలంతా పారిపోయారు.

"నా తోట నా స్వంతం, ఆయ్! ఆ మాత్రం తెలీదా? ఇందులోకి నేను తప్ప ఎవరూ ప్రవేశించ అనుమతి లేదు" అనుకున్నాడు, దాని చుట్టూ పెద్ద ఎత్తయిన గోడ కట్టాడు, ఓ నోటీసు-బోర్డు కూడ పెట్టాడు.

అతడు మహాస్వార్థపరుడైన రాక్షసుడు.

పాపం, పిల్లలకు ఇప్పుడు ఎక్కడా ఆడుకోటానికి జాగాలేక, రోడ్డుమీద ఆడుకోటానికి ప్రయత్నించారు, కానీ రోడ్డంతా దుమ్ము, ధూళి. పైగా రాళ్లు. వాళ్లకది ఇష్టం లేక స్కూల్లో పాఠాలయిపోయాక, ఆ తోట ఎత్తయిన గోడల చుట్టూ తిరిగేవారు. లోపలి అందమయిన తోట గురించి మాట్లాడుకునేవారు. "మన కక్కడ ఎంత బావుండేది?" అనుకునేవారు.

తరువాత వసంతకాలం వచ్చింది. దేశమంతటా పూలు విరగబూశాయి, పక్షులు పాటలు పాడాయి. స్వార్థరాక్షసుడి తోటలో మాత్రమే ఇంకా శీతాకాలం నిలచిపోయింది. పిల్లలు లేకపోవటంతో పక్షులు అక్కడ పాటలు పాడ నిరాకరించాయి. చెట్లు పూలు పూయటం మర్చిపోయాయి. ఒకసారి ఓ అంద మైన పుష్పం గడ్డిలోనుండి పైకి ముఖమెత్త ప్రయత్నించింది. అయితే నోటీసు-బోర్డు కన్పించగానే, పిల్లల పట్ల జాలి కలిగింది దానికి; దాంతో మళ్లా గడ్డిలోకి ముడుచుకుని నిద్రపోయింది. తోట పట్ల ప్రేమ ఒలకబోసింది మంచు. 'వసంతం ఈ తోటను స్పృశించ మర్చిపోయింది. మనమిక్కడ సంవత్సరమంతా హాయిగా కాలక్షేపం చెయ్యొచ్చు' అనుకున్నాయి. మంచు తన తెల్ల దుప్పటితో గడ్డినంతా కప్పేసింది. చెట్ల నన్నింటికీ వెండి రంగు పూసేసింది. ఇంక వాళ్లు ఉత్తరపు గాలిని తమతో ఉండమని ఆహ్వానించారు. అతడూ వచ్చి, ఉన్ని దుస్తులేసుకుని, పగలంతా తోటలో వీచాడు, చిమ్నీలమీది మూతలను విరగ్గొట్టాడు. "ఇది చాల ఆహ్లాదకరమైన ప్రదేశం. మనం పిడుగును ఆహ్వానిద్దాం, తోటను సందర్శించ రమ్మని" అన్నాడతను. ఇంకేం... పిడుగ్గాడు కూడ విచ్చేశాడు. ప్రతిరోజూ మూడు గంటలపాటు అతడు భవంతి కప్పులమీద గర్జించేవాడు; చాల కప్పు పలకలన్నీ విరిగిపోయాయి. ఆ తరువాత బూడిదరంగు బట్టలేసుకుని మహావేగంగా తోట చుట్టూ తిరిగేవాడు. అతడి శ్వాస మంచును తలపించేది.

'వసంతకాలం రావటం ఇంత ఆలస్యమెందుకయిందో నాకర్థం కావటం లేదు' అనుకున్నాడు స్వార్థరాక్షసుడు, తన కిటికీ దగ్గర కూర్చుని, చల్లటి తోట వంక చూసుకుంటూ. 'వాతావరణంలో ఇంకనైనా మార్పు రావచ్చేమో!'

అయితే, వసంతకాలం రాలేదు, వేసవీ రాలేదు. శరత్కాలంలో అన్ని మంచి పళ్లు తోటల్లో కాశాయి. అయితే, రాక్షసుడి తోట బోసిబోయింది. 'వీడు మరీ స్వార్థపరుడు' అనుకుంది శరత్కాలం. కనుక, అక్కడ నిరంతరం శీతాకాలమే; ఉత్తరపు గాలి, పిడుగు, హిమం, చెట్ల సందుల్లోకుండా నృత్యం చేశాయి.

ఒకరోజు ఉదయం ఇంకా తను పక్కమీద పడుకుని ఉండగానే రాక్షసుడికి ఓ చక్కటి సంగీతం విన్పించింది. అతడి చెవులకా సంగీతం ఎంత మధురంగా విన్పించిందంటే, రాజుగారి సంగీతవిద్వాంసులు ఆ తోవన పోతున్నారని అతడు అనుకున్నాడు. నిజానికది అతడి కిటికీ బయట తోటలో ఓ చిన్ని జీనువాయి పిట్ట పాడిన పాట. అది అతడికి ప్రపంచంలో కెల్లా మధురమయిన పాట అన్పించింది. అప్పుడు పిడుగు అతడి తలమీద నృత్యం చెయ్యటం ఆపేశాడు, ఉత్తరపు గాలి గర్జించం మానేసింది, ఓ మృదువయిన పరిమళం అతని కిటికీకుండా వీచింది. 'చివరకు ఎట్లాగో వసంతకాలం వచ్చినట్లుంది' అనుకున్నా డతను; అతడు పడకనుండి కిందకు దూకి, బయటకు చూశాడు.

తనకేం కన్పించింది?

చాల అందమైన దృశ్యం అతని నయనానందకరం చేసింది. గోడలోని ఓ సందుకుండా పిల్లలు లోపలకు దూరారు, చెట్ల కొమ్మలమీద కూర్చుని ఉన్నారు. తనకు కన్పించిన ప్రతి చెట్టుకొమ్మ మీదా ఓ పిల్లవాడున్నాడు. పిల్లలు మళ్లీ తమ దరికి రావటంతో చెట్టు ఎంతగా సంతసించి పోయాయంటే, అవి పూలతో విస్ఫోటించి విరాజిల్లాయి, మృదువుగా పిల్లల తలలపై తమ హస్తాలతో రాశాయి. ఆనందంతో కువకువమంటూ పక్షులు విహరిస్తున్నాయి,

---

**ప్రపంచ రచయిత్రుల పరిచయాలు**

## కాథరైన్ మేన్స్‌ఫీల్డ్ (1888-1923)

కాథరైన్ మేన్స్‌ఫీల్డ్ (అసలు పేరు కాథరైన్ మేన్స్‌ఫీల్డ్ బ్యూచాంప్) న్యూజిలాండ్ లోని వెల్లింగ్టన్‌లో జన్మించింది. తండ్రి ఒక పారిశ్రామికవేత్త, బ్యాంకర్. 1903లో సెల్లో (సంగీతవాయిద్యం) నేర్చుకోవటానికి లండన్ వచ్చి ప్రముఖ రచయితలు డి.హెచ్.లారెన్స్, వర్జీనియావూల్ఫ్‌ల పరిచయంతో రచయిత్రిగా జీవితం కొనసాగించాలనుకుంది. ఈమె తొలికథా సంకలనం "ఇన్ ఎ జర్మన్ పెన్షన్" 1911లో అచ్చయింది. అదే సంవత్సరం, సాహిత్య విమర్శకుడు, ప్రచురణకర్త జాన్ మిడిల్‌టన్ ముర్రీతో స్నేహబంధం ప్రేమగా మారి, యిద్దరూ 1918లో వివాహం చేసుకున్నారు. 1920లో "బ్లిస్", 1922లో "ది గార్డెన్ పార్టీ" కథా సంకలనాలను ప్రచురించింది

మేన్స్‌ఫీల్డ్ కథలకు ప్రేరణ, ఆదర్శం 'చెహోవ్'. ఆయనలాగే, అత్యంత సహజంగా, గొప్ప ఎకానమీతో కథ చెప్పటం ఈమె కథల్లోనూ కనిపిస్తుంది.

1918లోనే ఆమెకు క్షయ సోకింది. ఇక రాయలేనేమోననే బెంగతో "ఎన్ని కథలు నీకోసం నిరీక్షిస్తున్నాయో. 'అదిగో, మాగురించి రాయి' అంటూ పాత్రలందరూ వెంటబడుతున్నారు. ఎలా రాయను? ఒంట్లో శక్తి లేదు. మరెన్నాళ్లు కలం పట్టుకోగలనో తెలియదు. రాయగలిగీ, రాయలేకపోవటమే నిజమైన దురదృష్టం" అంటూ రాసుకుంది 'జర్నల్' (1927లో అచ్చయింది) లో. చికిత్సకోసం, ఫ్రాన్సులో ప్రముఖ మిస్టిక్ జార్జి ఇవానోవిచ్ గుర్డియెఫ్ నిర్వహిస్తున్న ఆశ్రమానికి వెళ్లింది. (ఆధ్యాత్మిక, శారీరక రుగ్మతలను నయం చేస్తాడాయన!). అక్కడే తన ముప్పైనాలుగో ఏట మరణించింది.

చెహోవ్, జేమ్స్‌జాయస్‌ల లాగ, తరువాతి తరాల కథా ప్రక్రియ మీద ఈమె ప్రభావం అధికంగా వుంది.

*

## ప్రపంచ రచయిత్రుల పరిచయాలు

### ఫ్లానెరీ ఓకానర్ (1925 - 1964)

జార్జియా (ఏ.ఐ.జు.) రాష్ట్రంలోని సవానాలో జన్మించింది ఫ్లానెరీ ఓకానర్. తల్లిదండ్రులు రోమన్ కాథలిక్కులు, ఆమెకు పదమూడేళ్లున్నప్పుడు, తండ్రికి "డిసెమినేటెడ్ లూపస్" అనే వ్యాధి సోకింది. దీనివల్ల శరీరంలో ఆంటీబాడీస్ పెరిగి, రోగనిరోధక శక్తి తగ్గుతుంది. 1941లో, తండ్రి మరణం తర్వాత, జార్జియా స్టేట్ కాలేజ్ ఫర్ విమెన్(మిల్లెడ్జ్‌విల్) లో విద్యాభ్యాసం కొనసాగించిన ఫ్లానెరీ, అక్కడే ఒక సాహిత్య పత్రికకు సంపాదకత్వం వహించి, కొన్ని కథలు కూడా ప్రచురించింది ఈ కథల ఆధారంగా, యూనివర్సిటీ ఆఫ్ అయోవా నిర్వహించిన రైటర్స్ వర్క్‌షాప్‌లో ఫెలోషిప్ సంపాదించి, తరువాత ఎం.ఎఫ్.ఎ కోర్సు కూడా పూర్తి చేసింది. 1950లో తనకూ 'లూపస్' వున్నట్టుగా గుర్తించిన ఫ్లానెరీ, మిల్లెడ్జ్‌విల్‌కు తిరిగి వచ్చి, రకరకాల చికిత్సలతో, ప్రాణాంతకమైన వ్యాధిని కొన్నాళ్ల పాటు నియంత్రించగలిగింది. రోజంతా రచనా వ్యాసంగంలోనూ, నెమళ్ల పెంపకంలోనూ గడిపి అద్భుత కథా సాహిత్యాన్ని సృష్టించింది ఫ్లానెరీ.

ఆమె మొదటి నవల "వైజ్‌బ్లడ్" 1952లో అచ్చయింది. 1955లో ఒక కథా సంకలనం "ఎ గుడ్‌మాన్ ఈజ్‌హార్డ్‌టు ఫైండ్" వెలువడింది. లూపస్ ముదిరిన దశలో కూడా మరోనవల "ది వయలెంట్ బేర్ యిట్ అవే" ప్రచురించింది. ఆమె మరణానంతరం, మరో కథా సంకలనం "ఎవెరీథింగ్ దట్ రైజెస్ మస్ట్ కన్వర్జ్" అచ్చయింది. "కంప్లీట్ స్టోరీస్" పుస్తకానికి, 1972లో ప్రతిష్ఠాత్మక నేషనల్ బుక్ అవార్డ్ వచ్చింది.

ఫ్లానెరీ ఓకానర్ కథల్లో మత విశ్వాసాలకూ, దైవ భావనకూ ప్రాధాన్యత ఎక్కువ.

*

---

పచ్చగడ్డిలోనుండి పూలు తలలు పైకెత్తి నవ్వుతున్నాయి. అయితే, ఓ తోటలోని మారుమూల ప్రదేశంలో మాత్రం ఇంకా శీతాకాలం వదలి పోలేదు. అక్కడో చిన్న పిల్లవాడు నిలబడున్నాడు. చెట్టు కొమ్మ ఎక్కలేక ఆ పిల్లవాడు, ఆ చుట్టూతా తిరుగుతూ ఏడుస్తున్నాడు. పాపం, ఆ చెట్టు ఇంకా హిమంతో కప్పబడే ఉంది; ఉత్తరపు గాలి వీస్తూ, దానిపైన గర్జిస్తోంది. "పైకి ఎక్కు, నాయనా!" చెప్పింది చెట్టు. తన చాతనైనంత కిందకు వంగింది, అతడెక్కటానికి వీలుగా. కానీ, ఆ పిల్లవాడు చాల చిన్నవాడు.

అది చూసిన రాక్షసుడి గుండె కరిగిపోయింది. "నేను ఇంతకాలం ఎంత స్వార్థపరుడిగా బతికాను! నా కిప్పుడర్థమయింది, ఇంతకాలం వసంతం ఎందుకు ముఖం చాటేసిందో! 'నేను ఇప్పుడా పిల్లవాడిని చెట్టుపై కూర్చోపెడతాను. ఆ తరువాత గోడ పడగొడ్తాను. ఇంకెప్పటికీ నా తోట పిల్లల క్రీడాస్థలమే అవుతుంది.' అతడికి నిజంగానే తాను చేసిన పనికి పశ్చాత్తాపం కలిగింది.

అతడు మెట్టుదిగి క్రిందకు వచ్చాడు, ముందు వాకిలి మెల్లగా తెరచి, తోటలోకి వెళ్లాడు. అయితే, అతన్ని చూసి పిల్లలు భయపడి పోయారు, పారిపోయారు. తోటలో మళ్లా శీతాకాలం తిష్ఠ వేసింది. ఆ చిన్న పిల్లవాడు మాత్రమే పరుగెత్త లేదు. అతడి కళ్లు కన్నీటితో నిండి ఉండటం వల్ల అతడు రాక్షసుడిని చూడ లేకపోయాడు. రాక్షసుడు అతడికి తెలీకుండా వెనగ్గా వెళ్లి, మృదువుగా చేతుల్తో ఎత్తి, చెట్టుపైన కూర్చోబెట్టాడు. వెంటనే చెట్టుపై పూలు విరగబూశాయి. పక్షులు వచ్చి వాలాయి, పాటలు పాడాయి. చిన్న పిల్లవాడు చేతులు చాచి, రాక్షసుడి మెడచుట్టూ వేసి, అతడిని ముద్దు పెట్టుకున్నాడు. రాక్షసుడు దుర్మార్గుడు కాడని తెలుసుకున్నాక, పిల్లలు మళ్లా పరుగెత్తుకుంటూ వెనక్కు తిరిగి వచ్చారు. వాళ్లతోపాటు వసంతకాలంకూడ వచ్చింది.

"పిల్లలూ, ఇదింక మీ తోటే!" అన్నాడు రాక్షసుడు.

ఒక గునపం తీసుకుని మొత్తం గోడనంతా పడగొట్టాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు జనం మార్కెట్టుకు వెళ్తూ, తామంతకు ముందెప్పుడూ చూడని చాల అందమైన తోటలో రాక్షసుడు పిల్లలతో ఆడుకోటం చూశారు. పగలంతా వాళ్లు ఆడుకున్నారు. సాయంత్రం, ఇంటికి వెళ్తూ, రాక్షసుడికి వీడ్కోలు పల్కటానికి వెళ్లారు.

"సరే, మీతోటి చిన్న పిల్లవాడెక్కడ? ఆ పిల్లవాడినే నేను చెట్టుమీద కూర్చో పెట్టాను" అనడిగాడు రాక్షసుడు వాళ్లను. రాక్షసుడికి ఆ పిల్లవాడంటే ఎంతో ఇష్టం కలిగింది. అతడు తనను ముద్దు పెట్టుకున్నాడు.

"మాకు తెలీదు. వాడెళ్లిపోయాడు" అన్నారు పిల్లలు.

అతడెక్కడవుంటాడో తమకు తెలియదని, తామంతకు ముందెప్పుడూ అతడిని చూడలేదని ఆ పిల్లలు చెప్పారు. రాక్షసుడికి చాల విచారం కలిగింది.

పిల్లలు తోటకు వచ్చి, రాక్షసుడితో ఆడుకోసాగారు. ఆ చిన్న పిల్లవాడు మాత్రం మళ్లా ఎప్పుడూ కన్పడలేదు. రాక్షసుడు పిల్లలందరి పట్లా దయగా వున్నా, తను మొదట కల్సిన ఆ చిన్న మిత్రుడికోసం అతడి హృదయం పరితపించేది.

సంవత్సరాలు గడిచాయి. రాక్షసుడు బాగా ముసలివాడయ్యాడు, ఒంట్లో బలం బాగా తగ్గిపోయింది. తను ఆడలేక, పిల్లలు ఆడుతూంటే, పడకకుర్చీలో కూర్చుని, వీక్షించేవాడు, తోటవంక ప్రశంసాపూర్వకంగా చూసేవాడు. 'నా తోటలో ఎన్ని అందమైన పువ్వులు! కానీ, పిల్లలు పువ్వులన్నింటికంటే అందమైన వాళ్లు!' అనుకునే వాడు.

ఒక శీతాకాలపు ఉదయం, అతడు కిటికీలోకుండా బయటకు చూశాడు. ఇప్పుడతనికి శీతాకాలమంటే అయిష్టం లేదు. అతనికి తెల్సు సుషుప్తిలో ఉన్న వసంతమే శీతాకాలమనీ, పూలు విశ్రాంతి తీసుకుంటున్నాయనీ. అమాంతం అతడు ఆశ్చర్యపోతూ, నిజమా, కాదా అన్నట్లున్న అద్భుతమైన దృశ్యం చూశాడు. తోటలో దూరంగా ఉన్న ఓ మూల, ఓ చెట్టు తెల్లటిపూలతో విరగబూసింది. ఆ చెట్టు కొమ్మలు బంగారు వర్ణంలో ఉన్నాయి. వెండి పండ్లు దాన్నుండి వేలాడుతున్నాయి. దానికింద ఆ చిన్నపిల్లవాడు నిలబడి ఉన్నాడు.

మహదానందంతో రాక్షసుడు మెట్లు దిగి, తోటలోకి పరుగెత్తాడు. హడావుడిగా గడ్డిలో నడుస్తూ, అతడు పిల్లవాడి దగ్గరకు వచ్చాడు. అతడికి దగ్గరగా వచ్చేటప్పటికి, రాక్షసుడి ముఖం కోపంతో ఎర్రబడిపోయింది. "నీకు గాయం చేసిన ఆ దుర్మార్గుడెవడు?" అనడిగాడు. పిల్లవాడి అరచేతుల్లో, పాదాల్లో రెండు, రెండు మేకులు దించిన గుర్తులున్నాయి.

"చెప్పు, ఎవడు అంత ధైర్యం చేసింది? నా పెద్ద కత్తి తీసుకుని వాడి ప్రాణం తీసేస్తాను" అనరిచాడు రాక్షసుడు.

"లేదు, ఇవి ప్రేమ గాయాలు" అని పిల్లవాడు జవాబిచ్చాడు.

"నువ్వెవరు?" అనడిగాడు రాక్షసుడు. ఓ విచిత్రమైన భక్తిభావన అతడిని ఉక్కిరిబిక్కిరి చేసింది. అతడు పిల్లవాడి ముందు సాగిలబడి ప్రణామం చేశాడు.

పిల్లవాడు రాక్షసుడిని చూసి చిరునవ్వు నవ్వాడు.

"నువ్వొకసారి నన్ను నీ తోటలో ఆడనిచ్చావు. ఇవాళ నువ్వు నాతో తోటకు వస్తావు. అది స్వర్గం" అన్నాడు.

ఆ రోజు మధ్యాహ్నం పిల్లలు తోటలోకెళ్లేటప్పటికి, పూలతో నిండి ఉన్న చెట్టుకింద, రాక్షసుడు చచ్చి పడి ఉండటం కన్పించింది. ●

# లాటరీ టిక్కెట్టు

## ఆన్‌టన్ పావ్‌లోవిచ్ చెఖోవ్ (1860- 1904)

అనువాదం: కాకాని చక్రపాణి



ఆన్‌టన్ చెఖోవ్ 1860 జనవరి 29న రష్యాసామ్రాజ్యం లోని తాగన్‌రోగ్‌లో జన్మించాడు. వృత్తిరీత్యా డాక్టరు; నాటకకర్త, ప్రముఖ కథాకారుడు. ఒకసారి, "వైద్యం నా చట్టబద్ధమైన భార్య అయితే, సాహిత్యం నా ప్రేయసి" అన్నాడు చెఖోవ్.

చెఖోవ్ మొదట్లో కథలను డబ్బుకోసమే రాశాడు; అయితే అందులో చేయి తిరిగిన వాడై, ఆధునిక కథా పరిణామాన్ని ప్రభావితం చేశాడు. తొలిగా చేతనాస్రవంతి కథారచనను ప్రారంభించిన వాడతను; సంప్రదాయ కథానిర్మాణంలో కన్పించే నైతికసూత్రాన్ని నిరసించాడు.; కళాకారుడి పని ప్రశ్నించటమే కానీ, సమాధానాలు చెప్పటం కాదన్నాడు.

చెఖోవ్‌పై తల్లి యవ్‌జెనియా ప్రభావం ఎంతో ఉంది. ఆమె చక్కటి కథలు చెప్పి పిల్లలను అలరించేది. "నా ప్రతిభను మా నాయన్నుండి తెచ్చుకుంటే, నా ఆత్మ మా అమ్మ" అన్నాడు చెఖోవ్ ఒకసారి. చిన్నప్పుడు చాల కష్టాలు పడ్డాడు. తాగన్ రోగ్‌లో స్కూలు చదువు పూర్తి చేశాక, మాస్కో విశ్వవిద్యాల యంలో వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు. తన చదువు కొనసాగించ టానికీ, కుటుంబ పోషణకూ సమకాలీన సమాజాన్ని గురించిన చిత్రాలను, హాస్యస్ఫోరకంగా రోజూ పత్రికలకు రాసేవాడు. 1884లో, డాక్టరు పట్టా పుచ్చుకున్నాక, ఆ వృత్తిలో అంతగా డబ్బు సంపాదించలేకపోయినా, అది ముఖ్యవృత్తని భావించేవాడు. పేదలకు ఉచితవైద్యం అందించేవాడు. అదే సంవత్సరంలో అతడికి క్షయవ్యాధి సోకింది కానీ, ఆ విషయాన్నతడు ఎవరికీ చెప్పలేదు. 1887లో, పనిభారం తోనూ, అనారోగ్యంతోనూ అలసిపోయిన చెఖోవ్ యుక్రైన్‌కు వెళ్లాడు. అక్కడి గడ్డి మైదానాల సౌందర్యంతో పరవశించిపోయిన అతడు తిరిగి వచ్చాక, పెద్ద కథ 'ది స్టెప్పీ'ని రాశాడు. 1890లో చెఖోవ్ సుదూర తూర్పు రష్యాలో శాఖలిన్ ద్వీపంలోని పీనల్ కాలనీ (ఖైదీల ఆవాసం) కి వెళ్లాడు. అక్కడి పరిస్థితులను చూశాక అతడి మనస్సు ఎంతో గాయపడింది. వాళ్లకు కావల్సింది దయ, దాతృత్వాలు కాదు, ప్రభుత్వం వాళ్లను మనుషులుగా చూడాలి అని భావించాడతను. 1892లో మెలిఖోవోలో నివసించిన చెఖోవ్ అక్కడ ప్రజలకు వైద్యం అందించాడు. 1904 జులై 15న, జర్మను సామ్రాజ్యంలోని బాడెన్‌వైలర్‌లో క్షయవ్యాధితో మరణించాడు.

ఇవాన్ డిమిట్రిచ్ మధ్యతరగతి మనిషి. సాలుకు పన్నెండొందల ఆదాయంతో, తన కుటుంబంతో సుఖసంతోషాలతో బతుకుతున్నాడు. ఆ రాత్రి భోజనమయ్యాక, సోఫాలో కూర్చుని పేపరు చదువుకోసాగాడు.

"నేనివాళ పేపరు చూట్టం మర్చిపోయాను" అందతని భార్య, టేబుల్ శుభ్రం చేస్తూ. "లాటరీ డ్రాల జాబితా ఏమన్నా ఇచ్చారేమో, చూడు."

"ఉంది. నంబరేమిటి?" అన్నాడు ఇవాన్ డిమిట్రిచ్.

"సీరీస్ 9,499, నంబర్ 26."

"సరే చూస్తాను. 9,499, 26, అంతేనా?"

ఇవాన్ డిమిట్రిచ్‌కు లాటరీ అదృష్టంలో నమ్మకం లేదు. ఇప్పుడు చెయ్యాల్సిన పనేమీ లేదు. కనుక, నంబర్ల వరుసల వెంట కిందకు తన వేలును నడిపితే, తన అపనమ్మకాన్ని అపహాస్యం చేస్తున్నట్లు, పైనుండి రెండో పంక్తిలోనే, 9,449 పై అతడి కన్ను పడింది! తన కండ్లను నమ్మలేకపోయాడతను, టికెట్ నంబరు చూడకుండానే పేపరు పక్కన పడేశాడు. అతడి ఒంట్లో సుఖమైన భావన కలిగింది.

"మాషా, 9,449 ఉంది" అన్నాడతను బొంగురు కంఠంతో.

"9,449, అదేనా?" అనడిగిందామె. ఆమె ముఖం పాలిపోయినట్లయింది, భయభీతమైనట్లయిపోయింది. మడతపెట్టిన టేబుల్ క్లాత్‌ను టేబుల్‌మీద పడేసింది.

"అవును... అవును, నిజంగానే ఆ నంబరుంది."

"మరి టికెట్ నంబరూ?"

"ఉంది. టికెట్ నంబరూ ఉంది. సీరీస్ నంబరయితే ఉందంటున్నా..."

వెలుగులీనే ఒకవస్తువును బిడ్డకిస్తే, నవ్వినట్లు అతడు భార్యవంక చూసి పిచ్చినవ్వు నవ్వాడు. అతని భార్యకూడ చిరునవ్వు చిందించింది. అతడు సీరీస్‌నే చూశాడు కానీ, గెల్చుకున్న టిక్కెట్టు నంబరు చూడ ప్రయత్నించలేదు; అయినా, అతనికి లాగానే ఆమెకూ సంతోషం కలిగింది. సాకారమవబోయే అదృష్టం గురించిన ఆశలతో తన్ను తాను హింసించుకోటం ఎంత మధురంగా, ఆనందంగా ఉంటుందో!

"అది మన సీరీసే, కనుక మనం గెల్చుకునే అవకాశం ఉంది" అన్నాడు ఇవాన్ డిమిట్రిచ్ చాలసేపటి తర్వాత.

"బావుంది. మరిప్పుడు చూడు!"

"కాస్త సేపుండు. నిరాశ పడటానికి మనకు బోల్డంత సమయముంది. పైనుండి రెండోపంక్తిలో అది ఉంది. కనుక, బహుమతి డెబ్బయ్యయిదు వేలు. అంత డబ్బు డబ్బు కాదు, అధికారం, పెట్టుబడి! ఇంకో నిమిషంలో నేను లిస్టులో చూస్తాను. అది 26, అంతేనా? నిజానికి మనమే అది గెల్చుకుని ఉండేట్లయితే...!"

మాట్లాడకుండా భార్యా, భర్తా ఒకళ్లనొకళ్లు చూసుకుంటూ ఆనందంగా నవ్వుకున్నారు. డెబ్బయ్యయిదు వేలు రావచ్చని వాళ్లెప్పుడూ కలలోకూడ అనుకోలేదు, వస్తే ఏం చెయ్యాలో, ఏం కొనుక్కోవాలో, ఏయే ప్రదేశాలు చూడాలో అనికూడ మాట్లాడుకోలేదు. వాళ్ల ఆలోచనల్లో 9,449, 75,000- ఈ రెండు సంఖ్యలే మెదిలాయి. అంత డబ్బుతో సాధ్యపడే సుఖసంతోషాలను గురించి కూడ వాళ్లెప్పుడూ ఊహించలేదు.

ఇవాన్ డిమిట్రిచ్ చేతిలో పేపరు పట్టుకుని ఇంట్లో ఒకమూలనుండి మరోమూలకు చాలసార్లు తిరిగాడు. మనసు కలలు కనటం ప్రారంభించింది.

అతనన్నాడు: "మనం అది గెల్చుకుంటే, నిజానికది మనకో కొత్త జీవితమే అవుతుంది, అది ఓ పెద్ద పరివర్తనే! టిక్కెట్టు నీది. నాదయితే, మొదటగా నేను ఇరవయ్యైదువేలతో ఒక ఎస్టేటు కొంటాను, తక్షణ ఖర్చులు, కొత్త ఫర్నిచరు, ప్రయాణాలు, బాకీలు తీర్చటం వగైరాలకు ఓ పదివేలు సరిపోతుంది. మిగతా నలభైవేలు బాంకిలో వేసుకుంటే, దానిమీద వడ్డీ వస్తుంటుంది."

"అవును, ఎస్టేట్! చాల మంచి ఆలోచన!" అంది అతని భార్య, క్రింద కూర్చుని, తన చేతులు ఒళ్లో పెట్టుకుంటూ. "తులా లేకపోతే ఆర్యోల్ ప్రాంతంలో అయితే బావుంటుంది... నిజానికి, మనకు వేసవి భవనమయితే అవసరం లేదు. అయితే, దానివల్ల ఎప్పుడూ ఆదాయం లభిస్తూవుంటుంది."

అతని ఊహలో ఒకదానికంటే మరొకటి మరింత కమనీయంగా, మరింత కవితామయంగా కన్పించి, ఎన్నో చక్కటి కల్పనలు ముసురుకున్నాయి. ఈ అన్ని కల్పనలు, చిత్రాల్లో అతడు తన్ను మృష్టాన్న భోజనం చేసేవాడిలా, ప్రశాంతంగా, ఆరోగ్యంగా, వెచ్చగా చిత్రించుకున్నాడు. చల్లగా ఉన్న వేసవి సూపు పుచ్చుకున్నాక, తోటలో నిమ్మచెట్టుకిందో, సెలయేటికి సమీపంలో మండుతున్న ఇసుకలో పడుకునో ఉంటాడు. చిన్న కూతురూ, కొడుకూ అతని పక్కన పాకుతూనో, ఇసుకలో గుంటలు తవ్వుతూనో, గడ్డిలో ఎగిరే చిన్న పురుగులను పట్టుకుంటూనో ఆడుకుంటారు. చీకూ, చింతా లేకుండా, ఆఫీసుకెళ్లాలనే గోల లేకుండా, సుఖంగా కునుకుతీస్తాడు తను.. లేదూ, పడుకుని పడుకుని విసుగొచ్చాక, పొలానికి వెళ్తాడు, లేక కుక్కగొడుగులకోసం అడవికి వెళ్తాడు. లేకపోతే రైతులు వలలతో చేపలు పట్టటాన్ని చూస్తాడు. సూర్యాస్తమయమయ్యాక, టవలూ, సోపూ తీసుకుని మెల్లగా స్నానాల రేవుకు వెళ్తాడు. హడావుడిలేకుండా బట్టలు విప్పి, మెల్లగా తన ఛాతీని చేతుల్తో రుద్దుకుంటాడు, అప్పుడు నీళ్లలోకి ప్రవేశిస్తాడు. నీళ్లల్లో, చిన్న చేపలు అటూఇటూ దూకుతుంటాయి, పచ్చటి నీటి మొక్కలు తలలు ఊపుతుంటాయి. స్నానమయ్యాక, క్రీమూ, మిల్క్ రోల్స్‌తో టీ పుచ్చుకుంటాడు. సాయంత్రం అలా నడచి వెళ్తాడు, లేదూ, పొరుగువాళ్లతో కబుర్లు చెప్తాడు.

పుస్తకాల ద్వారా
మానవ మేధో
పరిమితులు
నాకు
అవగతమయ్యాయి.
-చెహోవ్

"ఏమయినా ఎస్టేట్ కొనటం మంచిదే" అంది అతని భార్య. ఆమెకూడ కలలు కంటోంది. ముఖంలో ఆమె ఆలోచనల సమ్మోహనత్వం వ్యక్తమయింది.

ఇవాన్ డిమిట్రిచ్ వానలు కురిసే శరత్కాలంలో, ఆ చల్లటి సాయంత్రాలలో, సెయింట్ మార్టిన్ వేసవిలో తననూహించుకున్నాడు. ఆ ఋతువులో తను తోటలోనూ, నది పక్కనూ సుదూరం నడచివెళ్లి, వచ్చాక ఓ పెద్ద గ్లాసు వోడ్కా పుచ్చుకుంటాడు, ఊరేసిన కుక్కగొడుగునో, ఊరేసిన దోసకాయనో తింటూ, మరో గ్లాసు పుచ్చు కుంటాడు... పిల్లలు కిచెన్‌గార్డెన్‌లోనుండి తాజా మట్టి వాసన వేస్తుండే కారట్‌నో, ముల్లంగినో పట్టుకొస్తారు... తను సోఫామీద కాళ్లు బారజాపుకుని పడుకుని, ఏదో పత్రికపుటలను బద్ధకంగా తిప్పుతాడు, లేదూ, దాన్ని ముఖంమీద కప్పుకొని, వేస్ట్ కోటు బటన్లు తీసేసి, ఓ కునుకు తీస్తాడు.

సెయింట్ మార్టిన్ వేసవితర్వాత మబ్బులుపట్టి, చీదరగా వుండేకాలం వస్తుంది. పగలూ, రాత్రీ వానలు కురుస్తూంటాయి. నగ్నంగా చెట్లు విలపిస్తుంటాయి, గాలి తేమగా, చల్లగా వీస్తూంటుంది. కుక్కలు, గుర్రాలు, పక్షులు అన్నీ తడిసి ముద్దయివుంటాయి. విచారంగా ముఖాలు నేలకేసుకుని ఉంటాయి. అలా తిరిగొచ్చే ప్రదేశమే ఉండదు. రోజుల తరబడి అసలు బయటికెళ్లటమే కుదరదు; విషణ్ణంగా, మబ్బుగా వున్న కిటికీ వంక చూస్తూ,

గదిలోనే అటూ ఇటూ తిరగాల్సివస్తుంది. నిరుత్సాహంగా ఉంటుంది! ఇవాన్ డిమిత్రిచ్ ఆగి, తన భార్యవంక చూశాడు.

"నేను విదేశాలకు వెళ్లాల్సి రావచ్చు, మాషా" అన్నాడతను.

శరత్కాలంలో ఆలస్యంగా విదేశాలకు, ఎక్కడో దక్షిణ ఫ్రాన్సులో ఓ చోటికి, లేదూ ఇటలీకో, ఇండియాకో వెళ్తే ఎంత బావుంటుంది!

"నేనూ విదేశాలకు వస్తాను. ముందు టికెట్ నంబరు చూడు" అంది భార్య.

"ఆగు, తొందరేం?"

అతడు గదిలో తిరుగుతూ, ఆలోచనలో పడిపోయాడు. విదేశాలకు భార్యతో కాకుండా ఒంటరిగా వెళ్తేనే ఆనందంగా ఉంటుంది. జాగ్రత్తలేని, తేలికదనంకలిగిన ఆడాళ్లను వెంటబెట్టుకు వెళ్తే ఏం బావుంటుంది? వర్తమానంలో బతుకుతూ, ఆలోచనలే లేకుండా ప్రయాణకాలమంతా తమ పిల్లల గురించి తప్ప మరేం మాట్లాడదు, ఖర్చుపెట్టే ప్రతిపైసాకూ నసుగుడు! ట్రెయినులో పెద్ద సరంజామా వేసుకుని, బుట్టలు, సంచులతో సిద్ధం! తనకీ రైలు ప్రయాణం తలనొప్పి కలిగిస్తుందంటూ, తను అంత డబ్బు ఖర్చుపెట్టాల్సి వచ్చిందని గొణిగే భార్యను ఊహించాడు ఇవాన్ డిమిత్రిచ్... ఇంక ప్రతి స్టేషన్లోనూ బండి ఆగగానే తను వేడినీటికోసం, రొట్టె, వెన్న కోసం నిరంతరం పరుగెత్తుతూ ఉండాలి...

'నేను పైసఖర్చు పెడ్తే సహించలేదు' అనుకున్నాడతను, భార్యవంక చూపు విసుర్తూ. 'లాటరీ టికెట్ తనది, నాది కాదు కదా? అంతేకాకుండా ఆవిడ విదేశాలకు వచ్చి ఏం ప్రయోజనం? ఆమెకక్కడ కావల్సిందేముంది? హోటల్లో తలుపులు మూసుకు కూర్చుంటుంది, తన దృష్టిలోనుండి నేను జారిపోకుండా కాపలా కాస్తుంది... నాకు తెల్సు దాని సంగతి!'

తనింకా వయసులో, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉన్నాడు, నిజానికి తనింకో పెళ్లి చేసుకున్నా బాగానే ఉంటుంది. అలాంటప్పుడు, తన భార్య ముసలిదవుతోంది, బండలా తయారవుతోంది, పూర్తిగా వంటకంపు కొడుతుంటుంది అన్న భావన తన జీవితంలో మొదటిసారిగా అతనికి కలిగింది.

'సరే, ఇప్పుడదంతా కుదర్దు కానీ, ... ఇప్పుడది విదేశాలకెందుకు? దానివల్ల దానికేం లాభం కలుగుతుంది? అయినా సరే, ఆ వస్తుంది... నాకు తెల్సు, నేను ఊహించగలను. దానికి తను నేపుల్స్‌లోవున్నా ఒకటే, క్లిన్‌లోవున్నా ఒకటే! నాకు అడ్డంకిగా, ప్రతిదానికీ అవరోధంగా మాత్రమే తగలడుతుంది. నేను ప్రతి దానికీ దానిమీద ఆధారపడి ఉండాలి! సంసారపక్షం మనిషి! అలా డబ్బు రాగానే, పెట్టెలోపెట్టి తాళం వేసేస్తుంది... తన బంధువులకు బాగా డబ్బు దొబ్బపెడ్తుంది, నాకు పైస ఇవ్వాలంటే ఏడిచ్చస్తుంది.'

ఆమె బంధువుల గురించిన ఆలోచన ఇవాన్ డిమిత్రిచ్‌కు వచ్చింది. ఆ దౌర్భాగ్యులైన ఆమె సోదరులు, సోదరీమణులు, మేనత్తలు, మామలు లాటరీ తగిలిన విషయం వినగానే పాక్కుంటూ వస్తారు, ముష్టివెధవల్లాగా దీనాలాపాలు చేస్తారు, జిడ్డుమొహాలు, దొంగచిరునవ్వులతో తయారవుతారు. మహా దౌర్భాగ్యపు మనుషులు! వాళ్లకు ఏమన్నా ఇస్తే చాలు, మరింత ఇమ్మని కొసరుతారు; లేదు పొమ్మంటే, తమను బూతులు తిడతారు, అపవాదులు వేస్తారు, తమకు అన్ని రకాల దురదృష్టం, దుస్థితి కలగాలని కోరుకుంటారు.

ఇవాన్ డిమిత్రిచ్ తన స్వంత బంధువులను గురించీ ఆలోచించాడు; వాళ్లముఖాలు గుర్తుకు వచ్చాయి. పాతకాలంలో వాటివంక నిష్పక్షపాతదృష్టితో చూసేవాడు; ఇప్పుడా మొహాలు కంపరం కలించేటట్లూ, రోతపుట్టేట్టూ ఉన్నాయి.

'అమ్మో! విషప్పురుగులు!' అనుకున్నాడతను.

ఇంక తన భార్య ముఖంకూడ అంత రోతా, ద్వేషం కలిగించేటట్లుంది. ఆమెపట్ల అతని గుండెల్లో ఆగ్రహం పొంగిపొర్లింది. 'డబ్బుసంగతి ఏమీ తెలీని వట్టి పిసినారి ముఖం! లాటరీ గెలిస్తే, నాకో వంద రూబుల్లిచ్చి మిగతాది పెట్టెలోపెట్టి, తాళం వేసుకుంటుంది, ముదనష్టపుది!'

ఇప్పుడు భార్యవంక చూస్తే, అతని ముఖంలో చిరునవ్వు లేదు, విద్వేషం తాండవమాడింది. ఆమెకూడ అతనివంక చూసింది. ఆమె ముఖంలోనూ ఆగ్రహం, విద్వేషం గూడు కట్టుకునే ఉన్నాయి. ఆమె పగటికలలు ఆమెకున్నాయి, ఆమె పథకాలు, ఆమె ఆలోచనలు ఆమె కున్నాయి; తన మొగుడి స్వప్నాలేవో, తను గెల్చే డబ్బును మొదటగా చేజిక్కించుకునేదెవరో కూడ ఆమెకు తెల్సు.

'ఇతరులను పణంగా పెట్టి పగటి కలలు కనటం చాల బావుంటుంది!' అన్న భావాన్ని ఆమె కళ్లు వ్యక్తం చేశాయి. 'చూడు, నా డబ్బుమీద చెయ్యేసి చూడు, నా సంగతేదో తెలుస్తుంది!'

ఆ చూపును అర్థం చేసుకున్నాడు; తన భార్యమీద పగతీర్చుకోటానికన్నట్లు అతడు న్యూస్ పేపరులోని నాలుగో పేజీ వంక చూసి, విజయవంతంగా చదివాడు:

"సీరీస్ 9,449, నంబర్ 46! 26 కాదు!"

విద్వేషం, ఆశ రెండూ ఒక్క దెబ్బతో మాయమయ్యాయి. తన పెళ్లాం నల్లగా ఉంది; గదులు చిన్నవిగా, చీకటిగా, అధమస్థాయిలో ఉన్నాయి; తాను తిన్న రాత్రి కూడు తన ఒంటికి పడినట్టు లేదు, బండలా పొట్టలో పడివున్నది; సాయంత్రాలు దీర్ఘంగా విసుగుగొల్పేట్టు ఉన్నాయి– అన్పించింది ఇవాన్ డిమిత్రిచ్‌కి.

"ఏంవిటీ కొంపలో దరిద్రం!" అన్నాడు కోపంగా ఇవాన్ డిమిత్రిచ్. "అడుగేస్తే చాలు, ఎక్కడపట్టినా కాయితం ముక్కలు, మెతుకులు, రొట్టె తుంపులు. గదుల్నెప్పుడూ చిమ్మటముండదు! కొంపలో ఉండటం దుర్భరమవుతున్నది. నేను నరకానికి పోనీ, బయటికెళ్లి కన్పించిన మొదటి చెట్టుకు ఉరేసుకుంటాను!"

"మనల్ని గుచ్చి గాయపరిచి, ఇబ్బంది పెట్టే రచనల్నే మనం చదవాలి. మనం చదువుతున్న పుస్తకం మన తలపై మొట్టి మేల్కొలపని పక్షంలో అసలు చదవటం ఎందుకు? మంచి పుస్తకం ఒక దుస్సంఘటన లాగా మనల్ని ప్రభావితం చేయాలి. మనకన్నా మిన్నగా మనం ప్రేమించే ఆత్మీయుల మరణం లాగా మనల్ని తీవ్రంగా కలిచివేయాలి. అందరికీ దూరంగా ఏకాంతంగా అరణ్యాలకు పారిపోవాలనిపించేలా ప్రేరేపించాలి. పుస్తకం మన లోపల గడ్డకట్టిన సముద్రాన్ని గొడ్డలిగా పగలగొట్టాలి" – అంటారు మహా రచయిత కాఫ్కా.

# గుండెల్లో శిలువ

## ఓ హెన్రీ (1862- 1910)

అనువాదం: కాకాని చక్రపాణి



ఓ హెన్రీ 1862 సెప్టెంబర్ 11న అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో జన్మించాడు. అతడి అసలు పేరు విలియం సిడ్నీ పోర్టర్. అతడికి చదువుచెప్పిన టీచర్– ఇవలినా మారినా పోర్టర్– అతడిలో సాహిత్యస్ఫూర్తిని రగిలించింది. పదిహేనేళ్ల వయసులో హెన్రీ తన అంకుల్ డ్రగ్‌స్టోర్‌లో గుమాస్తాగా పనిచేశాడు. ఆ తరువాత టెక్సాస్‌లోని లా శాల్ కౌంటీలోని ఓ రాంచ్ (పశుసంరక్షణకు ఏర్పడ్డ వేల ఎకరాల ఫారాలు) లో పనిచేశాడు. అప్పటి అనుభవాలే తను రాసిన టెక్సాస్ కథల్లో ప్రతిబింబించాయి. 1887లో అతడి వివాహం ఎథోల్‌తో జరిగింది. ఆస్టిన్‌లోని ఫస్ట్ నేషనల్ బాంక్‌లో టెల్లర్‌గా పని చేశాడు. ది రోలింగ్ స్టోన్ అనే పత్రికనుకూడ నడిపాడు. 1895లో పాత్రికేయుడుగా డెయిలీ పోస్ట్‌లో పనిచేశాడు. 1896లో, బాంకులో పనిచేస్తున్న కాలంలో డబ్బు స్వాహా చేశాడన్న ఆరోపణపై అతడిమీద కేసు నడిచింది. ప్రవృత్తిరీత్యా అతడు వ్యాపారి కాదు, పైగా ఉదారస్వభావి. ఇతరులు అపహరించిన డబ్బుకు అతను బలయ్యాడు. జైలు శిక్షకు భయపడి హోండ్యూరాస్‌కూ, లాటిన్ అమెరికాకూ పారిపోయాడు. భార్య ప్రాణాపాయస్థితిలో వుందని తెల్సి స్టేట్స్‌కు రాగా, చట్టం చేతికి దొరికి, ఓహియో పెనిటెన్షియరీలో ఐదేళ్ల శిక్ష పడింది. మంచిప్రవర్తన కారణంగా మూడేళ్ల మూడునెలలకు, 1901లో విడుదలయ్యాడు. తరువాతి జీవనమంతా న్యూయార్క్‌లోని మామగారి హోటల్‌లో గడిపాడు.

డబ్బు బాగా గడించినా, విపరీతమైన తాగుడు, దాతృత్వంతో చేతిలో పైస ఆడేది కాదు. చట్టంనుండి పారిపోతున్న జనంతోనూ, జైల్లో నికృష్టులతోనూ, న్యూయార్క్‌లోని కఫేలు, రెస్టారెంట్లు, కాబరేలలోను, అతి సామాన్యజనం– షాప్ గర్ల్స్‌తోనూ, వారిపట్ల ప్రగాఢ సానుభూతితోనూ గడిపాడు. 'ది ఫోర్ మిలియన్స్' అని ప్రేమగా వారిని పిల్చేవాడు. 1890కల్లా కథారచనలో కీర్తిశిఖరాలు అందుకున్నాడు.

కథాంతంలో ఊహించని మలుపు తిప్పటంలో సిద్ధహస్తుడు ఓ హెన్రీ. అది కథ ప్లాటులో కలసిపోయినట్లుంటుంది. సునిశిత హాస్యంతో, కరుణాప్లావితమై అతని కథలుంటాయి.

బాల్డీ వుడ్స్ చెయ్యిచాచి బాటిల్ అందుకున్నాడు. మొదటి రెండు పెగ్గుల కంటే ఓ వేలికణిపెడు ఎక్కువగా మూడోపెగ్గును గ్లాసులో పోసుకున్నాడు బాల్డీ. అతను ఎవరికో సలహా ఇస్తున్నాడు; సం[ప్రతిస్తున్న వ్యక్తి ఇతనికి సరైన జోడీనే.

"నేనే నువ్వయితే రాజులా- మహారాజులా బతికేవాడిని" చెప్పాడు బాల్డీ.

వెబ్‌యేజర్ తన స్టేట్ సన్‌హాటును వెనక్కు జరుపుకున్నాడు. ఆ ప్రయత్నంలో అతని గడ్డిరంగు జుట్టు మరింత చిందరవందర అయింది తప్ప మరేం ప్రయోజనం కలగలేదు. అందుకే, బాల్డీలాగా తనూ గ్లాసులో ద్రవం పుచ్చుకున్నాడు. "ఓ మగాడు రాణిని పెళ్లి చేసుకుంటే రాజే అవ్వాలిగా! అతన్ని రెండోస్థానానికి రాణిమొగుడి స్థానానికి దిగజార్చకూడదు" అన్నాడు వెబ్, తన బాధకు మాటల రూపం ఇస్తూ.

"నిజమే" అన్నాడు బాల్డీ, సానుభూతిని జోడించి, ఇంకా తనకు దాహంగా వున్నా. పేకముక్కల్లోని సాపేక్షవిలువల సంగతి అతనికి బాగా తెల్సు. అందుకే అన్నాడు, "నీ హక్కుల ప్రకారం నువ్వు రాజువే. నేనే నువ్వయితే మళ్లీ ముక్కలు పంచమంటాను. నీకు మంచి పేకముక్కలే వచ్చాయి. నువ్వు వెబ్ యేజర్‌వని తెలుసుకో."

"ఏంవిటి?" అడిగాడు వెబ్. అతని నీలికళ్లలో ఆశ ద్యోతకమైంది.

"నువ్వు రాణి భర్తవి."

"సర్లే, నేను నిన్నెప్పుడూ వంచించలేదు, నిన్ను మోసం చెయ్యలేదు. అలాంటి మాటలు చెప్పకు" అన్నాడు వెబ్.

"మరి అదే! పదవి పేరు. నువ్వో, నేనో లేదూ- ఓ డచ్ డ్యూకో రాచకుటుంబపు పిల్లని పెళ్లి చేసుకుంటే ఏమవుతుంది? మన భార్య రాణి, మనం రాజులమా? వెయ్యేళ్లయినా కాము! వేడుకల్లో రాణి పక్కన వుంటాము. ఫోటోల్లో మనం కనిపిస్తాం. వారసుడికి జన్మనిస్తాం. అదే మన ప్రయోజనం. అవునండీ, తమరు రాణి భర్త, అంతే! నేనే నువ్వయితే ఓ విప్లవం తీసుకొచ్చేవాడిని. స్వాతం[త్ర్యం కోసం పోరాడేవాడిని. ఏదో ఒకటి చేసి వుండేవాడిని, పేకముక్కల్లో అట్టడుగు నుంచి వచ్చినా, రాజై వుండేవాడిని."

ఆ మాటకు సమర్థింపుగా బాల్డీ గ్లాసు ఖాళీచేశాడు.

"చూడు బాల్డీ! నువ్వూ, నేనూ ఆవులు మేపుకుంటూ ఒకేచోట బతుకుతున్నాం. ఏళ్లతరబడిగా, చిన్నప్పటి నుంచి ఒకే ప్రాంతంలో, ఒకే బాటల గుండా ప్రయాణిస్తూ బతికాం. నా కుటుంబ వ్యవహారాల గురించి నీతో తప్ప నేను మరెవరితోనూ చర్చించను. నేనూ, శారిటా మెకెలిస్టర్ పెళ్లి చేసుకున్నప్పుడు, నపాలిటా రాంచ్ (రాంచ్, పశు సంరక్షణకు ఏర్పడ్డ వేల ఎకరాలున్న ఫారం) లో నువ్వు లైన్ రైడర్‌గా వుండేవాడివి, అప్పుడు నేను ఫోర్మన్‌ని. ఇప్పుడు నేనేమిటి? ఆ గుంజకు వేసిన తాడు ముడిని కూడా కాదు!"

"వెస్ట్ టెక్సాస్‌లో ముసలి మెకెలిస్టర్ పశువుల పంపకంలో రాజుగా వున్నప్పుడు, నీకు కొంత ప్రాముఖ్యం వుండేది. రాంచ్‌లో నీ మాటకు ఎదురుండేది కాదు" అన్నాడు బాల్డీ మృదువుగా వ్యంగ్యాన్ని జోడించి.

"నిజమే" ఒప్పుకున్నాడు వెబ్. "కాని అదెంత కాలం? నేను శాంటాకు గాలం వేస్తున్న సంగతి తెలియనంతవరకూ. ఆ తర్వాత నన్ను రాంచ్ హౌసుకు, ఆ పరిసరాలకు దూరంగా వుంచేశాడు. ముసలాయన చావంగానే, వాళ్లంతా శాంటాను 'పశువుల రాణి' అన్నారు. నేను ఆ పశువుల పై అధికారిని-అంతే. బిజినెస్ తానే చూసుకుంటుంది. డబ్బు వాడేది కూడా తనే. నాకో ముసలి ఎద్దును అమ్మే అధికారం కూడా లేదు. శాంటా 'రాణి', నేనేమిటి? 'సున్న!'

"నేనే నువ్వయితే రాజయ్యేవాడిని" తిరిగి అవే మాటలు ఉచ్చరించాడు రాచరికపు పక్షపాతి అయిన బాల్డీ వుడ్స్. "రాణిని పెళ్లి చేసుకున్న మగాడు ఆమెతో సరిసమానంగా ఎదగాలి. నపాలిటాలో నీ మాటకు చెల్లుబాటు లేదని జనం నవ్వుతున్నారు. శాంటానేదో అంటంకాదు, ఈ ప్రాంతంలో ఈమె గొప్ప స్త్రీనే. కాని, మగాడన్న తర్వాత తన ఇంటికి యజమానై వుండాలి!"

మృదువుగా, పచ్చగా వుండే యేజర్ ముఖం సాగి దెబ్బతిన్న విచారపు ముసుగేసుకుంది. తనకంటే చిన్నవాడు, అధికబలాన్ని ప్రదర్శిస్తూ స్కూల్లో నాయకత్వాన్ని లాక్కున్నప్పుడు ఆ పెద్ద పిల్లవాడి మనస్తత్వంలా వుంది వెబ్ పరిస్థితి. అతని చెదిరిపోయిన గడ్డిరంగు జుట్టూ, అమాయకమైన నీలిరంగు కళ్లూ, ఓ స్కూలు పిల్లవాడిని గుర్తుచేసేట్టుగా వున్నాయి. కాని అతను చురుకుదనం, నరాల పటుత్వంతో డెబ్బైరెండు అంగుళాలున్న అతని ఎత్తూ, బెల్టులో దోపుకున్న రివాల్వరూ ఆ ఉపమానాన్ని కాదంటున్నాయి.

వెబ్ యేజర్ నిట్టూర్చాడు. నేలమీదున్న ఒరలో వున్న కత్తిని తీసుకున్నాడు. "తిరిగి రాంచ్‌కి వెళ్తాను ఇవాళ. పొద్దున్నే శాప్ ఆంటోనియోకు ఆవులమందను తోలాలి" అన్నాడు.

"డ్రయ్ లేక్ దాకా నీతోపాటే వస్తా"నన్నాడు. బాల్డీ.

ఓ చిన్న రైల్వే సెటిల్‌మెంటు దగ్గర వాళ్లు కలుసుకున్నారు ఆ ఉదయం. దాహమనిపిస్తే ద్రావకం పుచ్చుకున్నారు. ఆ తర్వాత మిత్రులిద్దరూ గుర్రాలెక్కి బయలుదేరారు. డ్రయ్‌లేక్ దగ్గర వాళ్ల మార్గాలు విడిపోతాయి. అక్కడ కళ్లాలు లాగి గుర్రాలను ఆపారు. సిగరెట్లు ముట్టించారు. వెబ్ అన్నాడు:

> తనను తాను హెచ్చించుకున్న వాడు తగ్గించబడును, తనను తాను తగ్గించుకున్న వాడు హెచ్చించబడును.
>
> -ఏసుక్రీస్తు

"నీకు గుర్తుండి వుండాలి, బాల్డీ! అప్పుడు శాంటాకు ఇంత స్వాతంత్ర్యం వుండేది కాదు. ముసలి మెకెలిస్టర్ మేం కలుసుకోకుండా దూరంగా వుంచిన రోజులు నీకు గుర్తున్నాయా? తనకు నన్ను చూడాలనిపించినప్పుడు ఆమె ఓ సంకేతం పంపేది. నేను కనుక తుపాకి వేటు దూరంలో రాంచి దగ్గర కనిపిస్తే నా శరీరాన్ని చిల్లుల చెత్తబుట్టలా మారుస్తానని చెప్పాడు ముసలి మెకెలిస్టర్. నీకు గుర్తుందా అప్పుడు ఆమె పంపే సంకేతం? గుండెలో శిలువ!"

"నాకా?" అన్నాడు మత్తులో పెద్దగా బాల్డీ.

"దున్నపోతు వెధవా! గుర్తులేదా? అందుకే మీ నాయన చేతిలో బూతులు తినేవాడిని. కాంపులో అందరికీ తెలుసు ఆ సంకేతం! రాంచి నుంచి బయటకొచ్చే ట్రక్కుల మీద వుండేది, పిండిబస్తాల మీద బొగ్గుతోనూ, పేపర్ల మీద పెన్సిలుతోనూ గీసి వుండేది. ఓ సారి ముసలి మెకెలిస్టర్ కొత్త వంటవాడిని పనిలోంచి తీసేసి రాంచినుంచి బయటికి పంపేస్తే, వాడి వీపు మీద కనిపించిందా గుర్తు. శాంటా తండ్రి నాకు ఉత్తరాలు రాయకూడదనీ, నాకే కబురూ పంపకూడదనీ ఆమెదగ్గర మాట తీసుకున్నాడు. గుండెలో శిలువ ఆమె కనిపెట్టిందే. తనకు నన్ను చూడాలని అనిపించినప్పుడల్లా, నేను చూస్తానని తనకు నమ్మకమున్న చోట ఈ సంకేతముండేది. అది కంటపడగానే ఆ రాత్రే ఎక్కడున్నా ఉరుక్కుంటూ రాంచికి వచ్చేవాడిని."

"తెలీకేం? అందరికీ తెలుసు. మేమంతా మీ పక్షమే. అందుకే ఎవరూ బయటికి చెప్పలేదు. నువ్వు వేగంగా పరుగెత్తే గుర్రాన్ని వుంచుకున్నదెందుకో మాకు తెలుసు. ఆ సంకేతం కనపడగానే, పాపం ముసలి పింటో (గుర్రం) దాణా మానేసి మైళ్లు తిని బతికేదనీ తెలుసు."

"చివరిసారి శాంటా ఆ సంకేతాన్ని పంపినప్పుడు ఆమెకు జబ్బుచేసింది. కాంపుకు రాగానే గుర్తును చూశాను. పింటోను ఆ రాత్రి నలభైమైళ్లు ఉరుకులు పరుగులు పెట్టించాను. ఆమె మేం ఎప్పుడూ కలుసుకునే ప్రదేశంలో లేదు.

నేను ఇంట్లోకి వెళ్లాను. తలుపు దగ్గర ముసలాయన ఎదురయ్యాడు. 'చావటానికి వచ్చావా?' అనడిగాడాయన. 'ఈసారికి అనుమతిస్తున్నాను. నిన్ను తీసుకురమ్మని ఓ మెక్సికన్‌ను పంపబోతున్నాను. శాంటా నిన్ను చూడాలని అంటోంది. ఆ గదిలో వుంది. వెళ్లు! ఆ తర్వాత నా దగ్గరికి రా!' అన్నాడు.

"శాంటా జబ్బుతో బాధపడుతూ పక్కమీద పడుకుంది. నన్ను చూసి పేలవంగా నవ్వింది, నా చేతిలో చెయ్యివేసింది, నేను పక్కమీద కూర్చున్నాను. 'నువ్వు గంటల తరబడి గుర్రంమీద స్వారీ చేసి వచ్చావు. నువ్వు వస్తావని నాకు తెలుసు. సంకేతాన్ని చూశావా?' అందామె సన్నటి గొంతుతో, 'కాంపుకు రాంగానే చూశాను. ఉల్లిపాయలూ, ఆలుగడ్డలూ వున్న బస్తామీద కనిపించింది అది' అన్నాను. 'అవెప్పుడూ కలిసే వుంటాయి. జీవితాంతమూ' అంది ఆమె హీనస్వరంతో. 'మాంసపు వంటకంలోనూ అవి కలిసే వెళ్తాయి' అన్నాను నేను. 'నేను చెప్పేది గుండె- శిలువ గురించి. అది మన గుర్తు - ప్రేమించటానికీ, బాధపడటానికీ అది సంకేతం. వాటి అర్థం అదే!' అంది ఆమె.

"అక్కడే వున్నాడు ముసలి డాక్టరు- మస్‌గ్రోవ్. విస్కీ తాగుతూ, తాటాకు విసనకర్రతో విసురుకుంటున్నాడు. మెల్లగా శాంటా నిద్రలోకి జారిపోయింది. డాక్టరు ఆమె నుదురు తాకిచూశాడు. 'నువ్వు మంచి ఔషధానివే. ఇంక నువ్వు బయటపడ్డే మంచిది. రోగనిర్ధారణ చేశాను. తమరి దర్శనం ఇంక డోసుల్లో అవసరంలేదు. నిద్ర లేచాక, చిన్నమ్మ బాగానే వుంటుంది' అన్నాడు.

"నేను బయట ముసలి మెకెలిస్టర్‌ను కలిశాను. 'ఆమె నిద్రపోతోంది. నువ్వింక చెత్తబుట్టకు చిల్లులుపెట్టే పని కానీ. నీక్కావలసినంత సమయం తీసుకో. నా తుపాకి గుర్రంజీను మీదే వుంది. తీసుకురాలేదు' అన్నాను.

"ముసలి మెకెలిస్టర్ నవ్వాడు. అన్నాడు: 'పశ్చిమ టెక్సాస్‌లో కెల్లా మంచి రాంచి మేనేజరు బుర్రలోకి తూటాలు దింపటం సరైన వ్యాపారలక్షణ మనిపించటం లేదు నాకు. నీలాంటివాడు మరొకడు దొరుకుతాడన్న నమ్మకమూ లేదు. అల్లుడన్న భావనే నీలో తూటాలు నింపాలన్న కోరిక కలిగించింది నాలో. నా కుటుంబంలో నీకు సభ్యత్వాన్ని ఇవ్వాలన్న ఆలోచన నాకు లేదు. నువ్వు రాంచిహౌసుకు దూరంగా, ఈ పరిసరప్రాంతాలకు రాకపోతే నిన్నుద్యోగంలో వుంచుకుంటాను. సరే, నువ్వుపైకెళ్లి పడుకుని ఓ కునుకు తియ్యి. నీకు కాస్తంత విశ్రాంతిలభించాక మళ్లీ మాట్లాడుకుందాం' అని."

బాల్డీ తన హాటు తీశాడు. గుర్రం పరుగు పెట్టాలని ఆత్రంతో తిరిగిపోతూ వుంటే వెబ్ కళ్లాన్ని లాగి పట్టాడు. ఇద్దరు వీడ్కోలుగా చేతులు కలుపుకున్నారు.

"వెళ్లొస్తా మిత్రమా! నిన్ను కలవటం ఎంతో సంతోషంగా వుంది. నీతో మాట్లాడటం హాయిగా వుంది" అన్నాడు వెబ్.

గుర్రాల గిట్టల చప్పుడు వేగిరమవుతూ వుంటే దిక్సూచిలోని భిన్న ప్రాంతాలకు వాళ్లు స్వారీచేస్తూ వెళ్లిపోయారు.

మర్నాడు ఉదయం ఎనిమిదిగంటలకు నపాలిటా రాంచ్ హౌసు ముందు బిడ్ టర్నర్ గుర్రం దిగాడు. ఆ పొద్దున శాన్ ఆంటోనియోకు వెళ్లాల్సిన పశువులమందకు కాపరి అతను. ఎర్రమట్టి కుండీలో పెరుగుతున్న హయాసింత్ మొక్కలకు నీళ్లు పోస్తూ గాలరీలో నిలబడి వుంది శాంటా.

మెకెలిస్టర్ 'రాజు' గారి చాలా లక్షణాలు కూతురికి వచ్చాయి. ఆయన నిశ్చలత్వం, ధైర్యం, తన కాళ్లమీద తను నిలబడాలనే తత్త్వం, కొమ్ములు - గిట్టల పాలకుడుగా ఆయనకున్న గర్వం- అన్నీ ఆమెకు వారసత్వంగా వచ్చాయి. స్త్రీ విలక్షణతను పొందాయి. ఆమె తల్లిలా సన్నగా వుండేది, బలంగా వుండేది.

బీదవాని జ్ఞానము తృణీకరించబడును.

-సొల్మన్

గంభీరంగా, మృదులంగా వుండే ఆమె రూపంలో తండ్రి రాచఠీవి, ఆయన నియంతృత్వపు కళ్లలో కనిపించే తీక్షత ఒదిగిపోయాయి.

వెబ్, గాలరీకి ఓ చివర నిలబడి, వేర్వేరు కాంపుల నుంచి ఆదేశాల కోసం వచ్చిన కాపరులకు ఆదేశాలిస్తున్నాడు.

"నమస్కారం" అన్నాడు బిడ్. "టౌన్లో ఆవులనూ, ఎద్దులనూ ఎక్కడ అమ్మమంటారు? ఎప్పటిలాగానే బార్బర్‌కే ఇమ్మంటారా?"

ఆ ప్రశ్నకు జవాబివ్వాల్సిన అధికారం రాణిది. బిజినెస్‌కు సంబంధించిన అన్ని పగ్గాలూ- కొనటం, అమ్మటం, బ్యాంకు వ్యవహారాలు- సమర్థమైన ఆమె చేతిలోనే వుండేవి. పశుపోషణకు సంబంధించిన వ్యవహారాలన్నిటినీ భర్తకే అప్పగిస్తుండేది. శాంటా తండ్రికి కార్యదర్శిగానూ, సహాయకురాలుగానూ పనిచేసేది. తెలివిగా ఆ పనులను కొనసాగించింది. అందువల్ల లాభమూ చొనగూరింది. ఆమె తన నిర్ణయం చెప్పకముందే రాణి భర్త తన నిర్ణయాన్ని వ్యక్తపర్చాడు. "నువ్వా మందను జిమ్మర్‌మాన్, నెస్బిట్ల గొడ్ల సావడికి తోలు. ఇంతకుముందే ఈ విషయం నేను జిమ్మర్‌మాన్‌తో మాట్లాడాను."

బిడ్ తిరిగి వెళ్లిపోబోయాడు. "ఆగు!" అంది శాంటా వెంటనే. భర్త వంక ఆశ్చర్యంగా చూసింది ఆమె. "ఏమిటి నువ్వనేది, వెబ్? జిమ్మర్‌మాన్, నెస్బిట్‌లతో నాకెప్పుడూ వ్యాపారసంబంధాలు లేవు. ఐదేళ్లుగా ఈ రాంచ్ పశువుల మందలను మార్కెట్లో విక్రయించింది బార్బరే. ఇప్పుడతన్ని మార్చటం నాకిష్టంలేదు." ఆమె బిడ్ టర్నర్ వంక తిరిగింది. "వాటిని బార్బర్ గొడ్ల కొట్టానికే తోలు!" అని నిశ్చయంగా చెప్పింది.

గాలరీపై వేలాడుతున్న నీటిజారు వంక బిడ్ అసహనంగా చూశాడు. కాలు మార్చి తమలపాకు నమలసాగాడు.

"ఈ మంద జిమ్మర్‌మాన్, నెస్బిట్ల సావడికే వెళ్లాలి!" అన్నాడు వెబ్, కళ్లల్లో మసక కమ్ముతుంటే.

"అర్థంలేదు!" అంది శాంటా అసహనంగా. "నువ్వు వెంటనే బయలుదేరటం మంచిది బిడ్! లేకపోతే లిటిల్ ఎల్మ్‌కొలనుకు మధ్యాహ్నానికైనా చేరలేవు. ఇంకో మందను మరో నెలరోజుల్లో పంపుతామని బార్బర్‌కు చెప్పు."

బిడ్ సంకోచిస్తూ వెబ్ వంక చూశాడు. మన్నింపు కోరుతున్నట్టు వుంది అతని చూపు. ఆ చూపులో జాలి కూడా కనిపించింది వెబ్‌కు.

"ఇంకా ఎందుకు నిలబడి వున్నావు బిడ్? వేరే పనేమైనా వుందా?"

"ఏం లేదమ్మా" అన్నాడు బిడ్. అయితే వెళ్లటానికి ముందు ఓ క్షణం అక్కడే తచ్చాడాడు. నిజానికి మగవాడికి మిత్రుడు మరో మగాడే. శాంసన్ని ఫిలిస్తీనులు ఆ విధంగా బంధించినప్పుడు కూడా అలాగే సిగ్గుపడి వుంటాడు.

"మీ యజమానురాలు చెప్పిన మాట వినిపించిందిగా?" అన్నాడు వెబ్, వ్యంగ్యంగా. బిడ్ ముందున్న నేల తాకేట్టు వంగి ఆమెకు సలాము చేశాడు.

"నువ్వీవాళ మహామూర్ఖంగా ప్రవర్తిస్తున్నావు వెబ్!" అంది శాంటా, మందలిస్తున్నట్టు.

"విదూషకుడిని, ప్రభ్వీణీ! ఇంతకంటే తమరు నా నుంచి ఆశించేదేముంటుంది? ఒక సంగతి. ఈ పశువులమంద రాణిని కట్టుకోటానికి ముందు నేనో మనిషిని. ఇప్పుడేమిటి నేను? కాంపులో జనం నోళ్లలో నానుతున్న విదూషకుడిని. మళ్లీ నేను మనిషినవుతాను" అన్నాడతను మెల్లగా.

శాంటా అతన్ని పరీక్షగా చూసింది. "అర్థం లేకుండా మాట్లాడకు వెబ్! ఇక్కడ నిన్నెవరూ తక్కువగా చూడటంలేదు. పశుసంరక్షణలో నేనెప్పుడైనా జోక్యం కలిగించుకున్నానా? రాంచికి సంబంధించిన బిజినెస్ వ్యవహారాలు నీకంటే నాకు బాగా తెల్సు. నాన్న అన్నీ చెప్పాడు. తెలిసి మాట్లాడు!"

**నవలా పరిచయం**

# టామ్ జోన్స్

## హెన్రీ ఫీల్డింగ్ (1707-1754)

సామర్సెట్‌షైర్‌లోని ఒక పెద్ద ఎస్టేట్‌కు యజమాని స్క్వైర్ ఆల్వర్దీ. ఇంట్లో వుంటున్న ఒకే ఒక ఆడదిక్కు ఆయన చెల్లెలు మిస్ బ్రిడ్జెట్ – ఆవిడ ఒకప్పుడు అందంగా వుండేదేమో గాని యిప్పుడు కాస్త మొరటుగా తయారైంది. తాను స్త్రీ సహజమైన కోరికలకు అతీతురాలైనట్టుగా ప్రవర్తిస్తూ, ఆడపిల్లలందరూ పాడైపోతున్నారని విమర్శిస్తూ వుంటుంది.

వ్యాపార లావాదేవీల కోసం లండన్ వెళ్లిన ఆల్వర్దీ మూడు నెలల తర్వాత యింటికి తిరిగివచ్చి, పడకగదిలోకి ప్రవేశించినప్పుడు అక్కడో శిశువు కనిపిస్తుంది. ఇది ఊహకందని వింత. అందాల మగశిశువునిక్కడ వదిలి వెళ్లిన కఠినాత్ములెవరు? ఆ పసికందు పోషణ బాధ్యతలను చెల్లెలికప్పగిస్తాడు ఆల్వర్దీ. ఆమెకూ పిల్లలంటే ఇష్టమే. కాని అప్పటికే ఇంట్లో అతిథిగా వుంటున్న కెప్టెన్ బ్లయిఫుల్‌తో రహస్యంగా ప్రేమవ్యవహారం కొనసాగిస్తున్నది. బ్లయిఫుల్‌ను, బ్రిడ్జెట్ కన్నా ఆమె ఆస్తి ఎక్కువ ఆకర్షించింది. ప్రేమికులిద్దరూ పెద్దల మాటల్ని ఖాతరు చెయ్యక పెళ్లి చేసుకున్నారు. ఆల్వర్దీ కూడా ఈ అనూహ్య పరిణామాన్ని ఆహ్వానించక తప్పలేదు. బ్లైఫుల్ యిప్పుడు కొత్తగా సంక్రమించిన అధికారంతో అక్కడే తిష్ఠవేశాడు.

సరిగ్గా ఎనిమిది నెలల తర్వాత బ్రిడ్జెట్ ఒక మగశిశువును ప్రసవించింది. అందరూ అది నెలలు నిండని ప్రసవమన్నారు కాని అసలు విషయం తల్లికే తెలుసు.

బుల్లి మేనల్లుణ్ణి చూసి ఆల్వర్దీ మురిసిపోయాడు. బ్రిడ్జెట్ మాత్రం స్వంత పిల్లాడికన్న అనాథగా పెరుగుతున్న టామ్(జోన్స్)నే ఎక్కువ ముద్దుచేసేది. ఇది చూసి చాలా సార్లు బ్లైఫుల్ భార్య మీద కోపగించుకున్నాడు. అయినా ఆమెలో మార్పురాలేదు.

బ్లైఫుల్‌కేదో అంతుచిక్కని మనోవ్యాధి పట్టుకుంది. ఒకనాడు ఫిట్స్‌తో మరణించాడు.

టామ్ జోన్స్‌పై బ్రిడ్జెట్ చూపిన ప్రేమ ఎవరికీ నచ్చలేదు. 'పేగుబంధం కన్న పెంచిన బంధం ఎక్కువా?' అని ముక్కు మీద వేలేసుకున్నారు. ఆల్వర్దీ మాత్రం లోలోపలే సంతోషించి వాడికి, తన మేనల్లుడితో సమంగా విద్యాబుద్ధులు నేర్పించాడు.

అయితే టామ్ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఇరుగుపొరుగుల తోటల్లోకి ప్రవేశించి పళ్లు కోయడం, బాతులు ఎత్తుకు రావటం, మాస్టర్ బ్లైఫుల్ జేబులోంచి డబ్బులు కాజెయ్యటం వాడి హాబీ. అందరూ ఈ దుర్బుద్ధిని అసహ్యించుకున్నారు. జంతువులను వేటాడి తెచ్చే జార్జి సీగ్రాం వాడికి నమ్మినబంటు.

ఒకనాడు వీళ్లిద్దరూ కలిసి వేటకెళ్లినప్పుడు, స్క్వైర్ వెస్టర్న్ గారి ఎస్టేట్‌లో చెట్ల మీద వాలిన కౌజు పిట్టల దండు కనిపించింది. మరొకరి పొలంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశించగూడదని ఆల్వర్దీ తన సేవకులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాడు గాని టామ్ కోరిక మేరకు సీగ్రాం ఒక పిట్టను గురిచూసి తుపాకీ పేల్చాడు. చప్పుడు విని స్క్వైర్ వెస్టర్న్ పరుగెత్తుకొచ్చాడు. భయంతో, సీగ్రాం ఒక పొద వెనుక నక్కాడు. టామ్ చేతిలో గిలగిలా కొట్టుకుంటున్న పక్షి కనిపించింది. తన మనుషులిలా నేరం చేశారని ఆల్వర్దీకి కబురు పెట్టాడు వెస్టర్న్. పంచాయితీ జరిగింది. "కాల్చింది నేనే" అన్నాడు టామ్. అదంతా గమనించిన బ్లైఫుల్, అసలు నేరస్థుడు సీగ్రాం అని సాక్ష్యం చెప్పాడు. తక్షణమే వేటగాణ్ణి పనిలోంచి తొలిగించి టామ్‌ను చీవాట్లేశాడు ఆల్వర్దీ.

మొత్తం మీద ఈ సంఘటన తర్వాత టామ్‌పై వెస్టర్న్‌కు ప్రేమ పెరిగింది. మరొకరి నేరం తన మీద వేసుకున్న వాడెంత ఉత్తముడు! ఇలాంటి కొడుకుంటే జీవితం ధన్యమయ్యేదని టామ్‌ను యింటికి ఆహ్వానించాడు. వెస్టర్న్. తన తుపాకులు, జాగిలాలు, గుర్రాలు అన్నీ టామ్ స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. ఇదే అదనుగా సీగ్రాంకు తిరిగి వుద్యోగం యిప్పించటానికి ప్రయత్నించాడు టామ్. ఇందుకోసం వెస్టర్న్‌గారి కూతురు, అందాల బరిణె సోఫియా సాయం అర్థించాడు.

ఇంకేం, తొలిచూపులోనే ఆమె టామ్‌కు మనసిచ్చింది. అతడిలాగ, పరోపకారం చేసే యువకులు అరుదుగా వుంటారు.

టామ్ కూడా ముందే అతడు సీగ్రాం చిన్న కూతురు మాలీ అందాలకు దాసోహమన్నాడు. ఈ విషయం తెలియని సోఫియా, టామ్ ఒంటరిగా తనతో మాట్లాడినప్పుడు తెగ సిగ్గుపడిపోయి బుగ్గలు ఎరుపెక్కగా, ఆనందపరవశురాలై అతడి ప్రతిపాదన కోసం నిరీక్షించింది. కాని చివరికి, ఈ మహాశయుడి వల్ల సీగ్రాంకు మళ్లీ వుద్యోగం దొరికింది. టామ్‌కు వేట పిచ్చి తిరగబెట్టింది. ఇద్దరూ కలిసి వెళ్లి, రోజంతా తిరిగి డిన్నర్ టైమ్‌కు వచ్చేవాళ్లు. సోఫియా తన అందాల్ని అరబోస్తూ, టేబుల్ వద్ద టామ్‌కు వడ్డించేది. కూతురుకి వేటలో ఆసక్తి వుందని తెలుసుకున్న వెస్టర్న్ ఆమెను కూడా వీళ్ల వెంట వెళ్లమన్నాడు. ఒకనాడు గుర్రంపై నుండి పడిపోతున్నపుడు టామ్ సోఫియాను రక్షించాడు. ఆ క్షణంలోనే ఆమె అతడి మనసు దోచింది.

కూతురు అన్యమనస్కంగా వుండటం గమనించి మిసెస్ వెస్టర్న్(సోఫియా తల్లి) ఈ అమ్మాయి మాస్టర్ బ్లైఫుల్‌తో ప్రేమలో పడింది కాబోలుననుకుని సంతోషించింది. తగిన సంబంధం, ఆస్తిపాస్తుల్లో తమతో సరితూగే సజ్జనుడు ఆల్వర్దీ. కాని కొద్దిరోజుల్లోనే అసలు విషయం తెలిసిపోయింది.

---

"జరిగే దాంట్లో నా ప్రమేయం లేకపోతే రాజ్యాలూ, రాచరికాలూ నా ఒంటికి పడవు! నేను మందల కాపరిని, నువ్వు కిరీటధారిణివి. ఇక్కడ రాణిగారి బానిసగా పనిచేయటంకంటే, ఓ గొడ్లసావడికి యజమాని అవటమైనా నాకిష్టమే. ఇది నీ రాంచ్, బార్బర్‌కే గొడ్లను తోల్తాం" అన్నాడు వెబ్.

వెబ్ ఇంట్లోకి వెళ్లి సుదీర్ఘప్రయాణం చేసేటప్పుడు వాడే తన బ్లాంకెట్లు తెచ్చాడు. రెయిన్ కోటునూ, తాడునూ తీసుకున్నాడు. వీటినతను గుర్రపుజీను మీద కట్టసాగాడు. శాంటా ముఖం వివర్ణమైంది. అతన్ని అనుసరించింది.

వెబ్ ఎగిరి గుర్రంమీద కూర్చున్నాడు. గంభీరంగా వున్న అతని నున్నటి

స్క్వైర్ వెస్టర్న్, ఆల్వర్దీ ఇంటికెళ్ళి టామ్ ఎలా హద్దుమీరి ప్రవర్తిస్తున్నాడో వివరించాడు. ఆల్వర్దీ శాంత స్వభావుడు. తను దయతో పెంచిన అనాథ అలా చెయ్యటం అతడికి ఇష్టంలేదు. బ్లైఫుల్– సోఫియాల వివాహానికి సమ్మతించాడు. టామ్‌కు మాలీతో సంబంధమున్నట్టుగా తెలిసింది.

ఇలా ఆడపిల్లల్ని మోసం చేస్తున్నందుకు టామ్‌కు కొన్ని డబ్బులిచ్చి ఇంట్లోంచి గెంటేశాడు ఆల్వర్దీ.

ప్రేమించటమే నేరమా? తండ్రిలాంటి ఆల్వర్దీని, ప్రియురాలు సోఫియానూ దూరం చేసుకున్న టామ్, దిగులుగా, దేశాటన చేస్తూ బ్రిస్టల్ నగరం చేరుకుంటాడు,.

అక్కడ ఒక హోటల్లో సైనికులతో పరిచయం పెరిగి, వాళ్ల మందుపార్టీలో పాల్గొంటాడు. డ్రింకు చేసేటప్పుడు అందరూ గ్లాసు చేత పట్టుకుని తమకిష్టమైన వ్యక్తులకు టోస్ట చెయ్యటం రివాజు. ఎన్ సైన్ (సైనిక హోదా) నార్దర్టన్, “నాకు తెలిసిన సోఫియా వెస్టర్న్‌కు, ఆమెతండ్రి సోమర్ సెట్‌షైర్‌లో పెద్ద భూస్వామి...బాత్ (నగరం)లో సగంమందిని తృప్తిపరచిన ఆ సుందరికోసం” అంటూ గ్లాసు పట్టుకుని తాగిన మత్తులో బిగ్గరగా అరుస్తాడు.

ఈ అవమానం భరించలేని టామ్ “యూ రాస్కెల్” అంటూ వాడి మీదికి లంఘిస్తాడు. ఆ పెనుగులాటలో నార్దర్టన్ బాటిల్‌తో టామ్ తలమీద బలంగా బాదుతాడు.

గాయంతో కదలలేని స్థితిలోనివున్న టామ్‌కు పార్ట్రిడ్జ్(ఒకప్పుడు ఆల్వర్దీ వద్ద పని చేసినవాడే) చికిత్స చేస్తాడు. టాం కాస్త కోలుకున్న తర్వాత, ఇద్దరూ కలిసి గ్లూసెస్టర్ గుండా అప్టన్ నగర పొలిమేరలకు చేరుకుంటారు.

అక్కడ అడవిలో ఆర్తనాదం వినిపిస్తుంది. టామ్ పరిగెత్తి ఒక స్త్రీని బలాత్కరిస్తున్న నార్దర్టన్ చితగొట్టి, ఆమెను రక్షిస్తాడు.

ఆ సుందరి పేరు మిసెస్ వాటర్స్. మధ్య వయస్కురాలు. భర్తను వదిలి, ఈ నమ్మక ద్రోహితో లేచివచ్చింది. ఆమె కష్టాలు విని కరిగిపోతాడు టామ్. రోజూవచ్చి తనకు ధైర్యం చెప్పి వెళ్లమని టామ్‌ను వేడుకుంటుంది మిసెస్ వాటర్స్.

సామర్సెట్ షైర్‌లో సోఫియాకు విరహం పెరుగుతుంది. మరోపక్క తనను పెళ్లి చేసుకొమ్మని బ్లైఫుల్ రోజూ వేధిస్తుంటాడు. వివాహం ఇష్టం లేదని ఎంత చెప్పినా తండ్రి కూడా తన మాటవినడు. “నా ఆజ్ఞను ధిక్కరిస్తే ఇంట్లో వుండొద్దు” అంటూ కన్న కూతుర్నే దూరం చేసుకుంటాడు స్క్వైర్ వెస్టర్న్.

ఇల్లు వీడిన సోఫియా అనేక ఊళ్లు తిరిగి, ప్రియుడి అన్వేషణలో అప్టన్ చేరుకుంటుంది. అక్కడ సత్రం యజమానురాలు, తన అతిథిగా వుంటున్న ఒక యువకుడి గురించి చెబుతుంది. వర్ణనను బట్టి అతడే టామ్ అని గ్రహించింది సోఫియా. హాల్లో ఒక మూలన తాగిన మత్తులో జోగుతున్న పార్ట్రిడ్జ్ కూడా కనిపిస్తాడు. “ఆయన గదిలో ఇప్పటికే ఒక స్త్రీ వున్నది. మీరుకూడా వెళ్లి ఏం చేస్తారు?” అంటుంది యజమానురాలు.

మరొక స్త్రీ అతడి జీవితంలో ప్రవేశించగలదని ఊహించని సోఫియా,తన ఆనవాలు ఒకటి అక్కడ వదిలి వెళ్లిపోతుంది.

కొన్ని గంటల తర్వాతగాని టామ్‌కి విషయం తెలియలేదు. ప్రియురాల్ని వెదకటానికి హడవిడిగా ప్రయాణమవుతాడు. అప్పటికే అక్కడికి చేరిన వెస్టర్న్, టామ్‌ను చెడామడా తిట్టి తనుకూడా కూతురికోసం బయల్దేరుతాడు. అయితే వంశగౌరవాన్ని మంటగలపిన సోఫియాను చంపాలనేదే అతడి ఉద్దేశం. ‘ఎక్కడని వెదుకుతావు’. ఇంటికెళ్లి నిరీక్షించు’ అని మిత్రులు సలహా ఇచ్చినా, టామ్ తన అనుచరుడితో కావెంట్రీ, సెయింట్ ఆల్బాన్స్ తదితర ఊళ్లన్నీ తిరుగుతాడు. చివరికి ఆమె లండన్ వైపు వెళ్లిందని తెలుస్తుంది.

లండన్ ఒక మహనగరం. అక్కడున్న వందలాది సంపన్నుల విలాస హర్మ్యాలలో ఎక్కడ దాగిందో! టామ్ తన అన్వేషణ కొనసాగిస్తాడు. లేడీ బలాస్టన్ ఇంట్లో సోఫియా వున్నట్టుగా తెలుసుకుని, తన ప్రేమను మన్నించమని ప్రాధేయపడతాడు. ఆమె గౌరవం కాపాడటానికే తాను నార్దర్టన్‌తో యుద్ధం చేశాడు. ప్రియుడ్ని విడిచి వుండలేనని సోఫియాకు కూడా తెలుసు.

అప్పటికి టామ్, మిసెస్ మిల్లర్ ఇంట్లో అతిథిగా వుంటున్నాడు. ఆమె ఆల్వర్దీ ఆశ్రితురాలు. టామ్ ఇంటికి చేరేసరికి, ఆల్వర్దీ నుండి వచ్చిన ఉత్తరం గురించి చెబుతుంది. మిసెస్ బ్లైఫుల్(బ్రిడ్జెట్) మరణించింది. ఆల్వర్దీ,మాస్టర్ బ్లైఫుల్‌తో కలిసి కొన్నాళ్లు లండన్‌లో గడపటానికి వస్తున్నాడు. అందువల్ల టామ్ తక్షణం ఇల్లు ఖాళీ చెయ్యాలి. కథ క్లైమాక్సుకు చేరుకున్నది.

కూతురి వేటలో వెస్టర్న్ లండన్ వస్తాడు. టామ్ మీద మరులు పెంచుకున్న స్త్రీ మిసెస్ ఫిట్జ్‌పాట్రిక్. తనకు పోటీగా వున్న సోఫియాను తొలగించుకోవాలని ప్రయత్నిస్తుంది. ఈ విషయం తెలిసి, ఆమె భర్త టామ్‌ను డ్యుయెల్(కత్తి యుద్ధం)కు ఛాలెంజి చేస్తాడు.యుద్ధంలో టామ్ అతణ్ణి తీవ్రంగా గాయపరుస్తాడు. హత్యానేరం మీద పోలీసులు అతణ్ణి అరెస్టు చేస్తారు. మొదట కత్తి దూసింది తను కాదంటాడు టామ్ కాని, అతని మాట ఎవరూ నమ్మరు.

ఈ అనూహ్య పరిణామాలకు ఆల్వర్దీ విస్తుపోతాడు.సరిగ్గా అప్పుడే మిసెస్ వాటర్స్ ఒక జన్మరహస్యం వెల్లడిస్తుంది. అనాథ అని అందరూ అనుకుంటున్న టామ్ నిజానికి ఆల్వర్దీ మేనల్లుడే. కొంత కాలం అతడింట్లో అతిథిగావున్న మిస్టర్ సమ్మర్‌కూ,బ్రిడ్జెట్‌కూ మధ్య ప్రేమాయణం నడిచింది. వాళ్ల సంతానమే టామ్. ప్రసవం జరగగా చూసిన ప్రత్యక్ష సాక్షి తానే. మరణశయ్య మీద, బ్రిడ్జెట్ ఓ ఉత్తరం రాసి మాస్టర్ బ్లైఫుల్‌కిచ్చిందని, అతడు దాన్ని వారికి చూపించానని అబద్ధం చెప్పినట్లుగా ఆమె ద్వారా తెలుస్తుంది. నమ్మక ద్రోహం చేసినందుకు వెళ్లగొడతాడు ఆల్వర్దీ. ఫిట్జ్‌పాట్రిక్‌కు ప్రాణాపాయం తప్పుతుంది.

స్క్వైర్ వెస్టర్న్ స్వయంగా తన కూతురి వివాహం టామ్‌తో జరిపిస్తాడు.

ఇది చదివిన వాళ్లకు పాత సినిమా కథ ఏదైనా గుర్తుకు వస్తే, ఆ పాపం ఫీల్డింగ్ ది కాదు. రెండున్నర శతాబ్దాలలో టామ్ జోన్స్ ఎన్ని రకాల రూపు మార్చుకుని తరతరాల పాఠకులను, ప్రేక్షకులను ఎంతగా అలరించిందో!

---

ముఖంలో ఎలాంటిభావమూ వ్యక్తం కాలేదు. అతని కళ్లల్లో మాత్రం ఓ మొండి వెలుగు రాజుకుని వుంది.

“ఫ్రయో దగ్గర వాండో కొలను సమీపాన ఆవుల దూడల మందను అడవికి దూరంగా తోలాలి. మూడుదూడలను తోడేళ్లు చంపేశాయి. నేను చెప్పటం మరిచిపోయాను. సిమ్సును ఆ సంగతి చూడమని చెప్పు” అన్నాడతను.

శాంటా గుర్రం కళ్లెం మీద చేయివేసి భర్త కళ్లల్లోకి చూసింది. “నన్ను వదిలేసి వెళ్తున్నావా నువ్వు, వెబ్?” అని అడిగిందామె ప్రశాంతంగా.

“నేను మళ్లీ మనిషిని అవబోతున్నాను” జవాబిచ్చాడతను.

# ఆ శరద్రాత్రి

## మాక్జిం గోర్కీ (1868-1936)

అనువాదం: కాకాని చక్రపాణి



'మాగ్జిం గోర్కీ' అన్న కలంపేరుతో రచనలు చేసిన అలెక్షీ మాగ్జిమోవిచ్ పెష్కోవ్ 1868 మార్చి 28న నిఝ్నీవ్ నోవ్‌గారోద్‌లో జన్మించాడు, 1936 జూన్ 18న గోర్కీ లెనిన్స్కీవ్‌లో మరణించాడు. 'గోర్కీ' అంటే చేదు. తను జీవితంలో చూసిన చేదునే అతడు తన కలంపేరుగా ఉపయోగించుకున్నాడు. అతడు నవల, కథ, నాటక ప్రక్రియలలో తన రచనలు చేశాడు. చాల చిన్న వయసులోనే అనాథ అయిన గోర్కీని అతని తాత, అమ్మమ్మ పెంచారు. పన్నెండేళ్ల వయసులో ఇంటినుండి పారిపోయిన గోర్కీ, ఐదేండ్లపాటు రష్యను సామ్రాజ్యంలో కాలి నడకన తిరిగాడు, పొట్టనింపుకోటానికెన్నో ఉద్యోగాలు చేశాడు, అలాగే తన భవిష్య రచనలకు సమాచారాన్నీ సేకరించాడు. ఓడలో పనిచేస్తున్న కాలంలో ఒక వంటాయన గోర్కీకి పుస్తక పఠనం మీద ఆసక్తి కలిగించాడు.

1899-1906లో తాను సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నివసించిన కాలంలో అతడు మార్క్స్ సిద్ధాంతాలవల్ల ప్రభావితమయ్యాడు. సోషల్ డెమోక్రాటిక్ పార్టీలో చేరాడు. 1901లో రాసిన 'సాంగ్ ఆఫ్ ఆర్మీ పెట్రల్' కారణంగా అరెస్టయ్యాడు. విడుదలయ్యాక, క్రిమియాలో రష్యన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్‌లో సభ్యుడయాడు, జ్ఞానియే (విజ్ఞానం) అన్న ప్రచురణ సంస్థను నెలకొల్పాడు. 1917లో బోల్షెవిక్కులు అధికారం కైవసం చేసుకోవటాన్ని ప్రతిఘటించాడు. ఎనిమిదేళ్లపాటు ఇటలీ ప్రవాసంలో గడిపి, 1928లో రష్యాకు తిరిగివచ్చి, స్టాలిన్‌కు తన సహాయ సహకారాలందించాడు. చివరకు కుట్రకు బలై మరణించాడు. గోర్కీ మొట్టమొదట రాసిన కథ "Chalkash" (1892). ఆ తర్వాత మరెన్నో కథలు రాశాడు. 1895లో "Chalkash" ప్రచురణతో అతడికెంతో పేరొచ్చింది.. గోర్కీ రాసిన మొదటి నవల *Foma Gordeyev (The Man Who was Afraid* 1899) అతడి ప్రసిద్ధ నవల అమ్మ. తన ఆత్మకథను అతడు మూడు సంపుటాలుగా వెలువరించాడు. 1902 ప్రాంతంలో గోర్కీకి ఆంద్రెయేవ్, చెఖోవ్, టాల్‌స్టాయ్‌లతో స్నేహమేర్పడింది. 'సామ్యవాద వాస్తవికత' అన్న కొత్త సిద్ధాంతాన్ని ప్రవచించిన సాహిత్యవేత్త గోర్కీ. అది సాహిత్య నికషోపలం అంటారు చాలమంది. అతని రచనలు వాస్తవికతకు అద్దం పట్టాయి; అతడి రచనల్లో గొప్ప శక్తీ, ఆశావాదం ఉంటాయి.

ఓ శరదృతువులో నా పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. మహాదుర్భర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. అంతకుముందే తెలిసిన వాళ్లెవరూలేని ఆ పట్నానికి వచ్చాను. జేబులో కోపెక్కు లేదు. తల దాచుకునే గూడు లేదు.

వచ్చిన మొదటి కొద్దిరోజుల్లోనే నా బట్టల్లో కొన్ని అమ్మేశాను. ఆ తర్వాత ఉస్త్యేకు చేరుకున్నాను. అది ఓ చిన్న రేవుపట్నం, నౌకల ప్రయాణానికి అనువైన ఋతువైతే అది మహాబిజీగా ఉండే ఊరు. అక్టోబరు మాసం చివరలో అది నిశ్శబ్దంగా, నిర్జనంగా వుంది. తడి ఇసుకను పెల్లగిస్తూ అందులో కప్పెట్టినదేదైనా తినటానికి పనికి వస్తుందేమోనని నిశితంగా పరిశీలిస్తూ ఆ నిర్జనభవంతుల మధ్య సంతపాకల్లో తిరిగాను, కడుపు నిండుగా ఉంటే ఎంత బావుండునూ అని ఆలోచించుకుంటూ.

ఇప్పుడున్న సాంస్కృతికాభివృద్ధి దశలో ఆధ్యాత్మికక్షుధను చల్లార్చుకోవటం తేలికే గానీ, ఆకలిని మాత్రం కాదు. వీధిలో నడుస్తూంటే ఇరుపక్కలా ఇళ్లు బయటికి అందంగానేవున్నాయి. లోపల కూడా సుఖవంతంగానే వుంటాయను కోవచ్చు. వెచ్చటి, సుఖదమైన బట్టలు వేసుకున్న మనుషులు రోడ్డుమీద తారసపడతారు. మహా మర్యాదస్తులు నీకు తోవ ఇవ్వటానికి పక్కకు తొలుగుతారు కానీ, నీ దుఃఖదమైన ఉనికిని మాత్రం గమనించేందుకు ఉత్సాహించరు. నిజం, క్షుధార్తుడి ఆత్మ కడుపు నిండినవాడి ఆత్మకంటే గొప్పదీ, మరింత ఆరోగ్యంగా పల్లవించేదీను. ఈ విరోధాభాసం నుంచి కడుపు నిండినవాడి పక్షంగా కొన్ని మహానిశితనిర్ధారణలను లాగటం సాధ్యమే!

> బెత్తం!
> ఉపాధ్యాయుడి
> నిఘంటువులో
> వుండగూడని పదం.

పొద్దు కుంకబోతోంది. వాన కురుస్తోంది. ఉత్తర దిక్కునుంచి అడపాదడపా గాలి వీస్తోంది, ఖాళీ సంత పాకల్లో గుండా ఈల వేస్తోంది, మూసిన హోటల్ కిటికీలను తాకి చప్పుడూ చేస్తోంది, నదిలో ఉత్తుంగతరంగాలనూ సృజిస్తోంది. బురదగా ఉన్న తీరంలో నురగ పూసుకున్న అలలు ఒకదానిమీద ఒకటి దూకుతున్నాయి. ఆకాశం భారంగా, నల్లగా ఉంది. విడవకుండా కురుస్తోంది వాన; విరిగి పడిపోయిన రెండు విల్లో చెట్లు, వాటి వేళ్ల దగ్గర తలకిందులైన పడవ శోకతప్తం, విచారగ్రస్తంగా ఉన్న నా స్థితికి నాంది పలికాయి. తలకిందులై పడివున్న పడవ వెన్ను పలక విరిగిపోయింది. వీస్తున్న చల్లటిగాలి చెట్ల ఆచ్ఛాదనలను ఊడ్చేసింది. నా చుట్టూ అంతా విరిగి, వికటంగా, ఊసరంగా, మృతంగా ఉంది. ఆకాశం అనంతంగా కన్నీళ్లు కారుస్తోంది. నా చుట్టూ నిర్జనంగా, చీకటిగా ఉంది. అంతా మృతమవుతున్నట్లూ, నే నొక్కణ్ణే బతికున్నట్లూ, ఆ పైన శీతలమృత్యువు నా కోసం కూడా ఎదురుచూస్తున్నట్లూ అనిపించింది.

అప్పుడు నా వయసు పదిహేడేళ్లు. మహా గొప్ప వయసు!

ఆ చల్లటి, తడి ఇసుకలో నడిచాను. ఆకలికీ, చలికీ గౌరవార్థంగా నా పళ్లు సంగీతం పాడాయి. తినటానికేమైనా దొరుకుతుందేమోనన్న వృథాప్రయాసలో ఓ సంతపాక వెనగ్గా వెళ్లాను. అక్కడ అకస్మాత్తుగా, నేలమీద వంగి ఉన్న ఓ ఆకారం వానకు ముద్దగా తడిసిపోయి, వంగిన భుజాల కంటుకుపోయిన స్త్రీ దుస్తుల్లో కనిపించింది నాకు. ఆమె చేతులతో ఇసుకలో గుంటచేస్తూ, పాకలోకి సొరంగం తవ్వుతున్నట్టుగా అనిపించింది నాకు.

"ఎందు కీ పని?" అడిగాను, ఆమె పక్కనే మడమలమీద కూర్చుంటూ.

ఆమె గొంతు నొక్కిపట్టి అరిచింది. మరుక్షణంలో ఒక్క ఉదుటున లేచి నిలబడింది. భయం నిండిన కళ్లను విప్పార్చుకుని నా వంక చూసింది. ఆమెదీ నా వయసే. అందమైన ముఖం. దురదృష్టవశాత్తూ దానిమీద మూడు గాయాలు; ఆ రూపాన్ని అవి కొద్దిగా చెడగొట్టాయి.

ఆ అమ్మాయి నా వంక చూసింది. ఆమె కళ్లలోని భయం తొలగిపోయింది. తర్వాతి క్షణంలో ఆమె తన చేతుల కంటిన ఇసుకను దులుపుకుంటూ, తలకట్టుకున్న నూలు స్కార్ఫ్‌ను సరిచేసుకుంటూ, వీస్తున్న గాలికి ఒదిగిపోతూ అంది; "నీకూ ఆకలేస్తోంది. అవును కదూ... మరైతే నువ్వూ తవ్వు. తవ్వి తవ్వి నా చేతులు పడిపోయాయి. అక్కడ రొట్టెలున్నాయి" అంటూ సంతపాకవైపు తలఊపింది.

మేం నిశ్శబ్దంగా పనిచేయటం ప్రారంభించాం. ఆ క్షణంలో నాకు నేరచట్టం, నీతి, ఆస్తి వగైరాలు మనసులో తట్టాయని నేను చెప్పలేను. నాకు గుర్తున్నంతవరకూ నిజం చెప్పాలంటే ఆ క్షణంలో నేను సంతపాకకు కన్నం వేయటమనే పనిలో పూర్తిగా నిమగ్నమైపోయాను. పొద్దు కుంకుతోంది. చీకటి, చిత్తడి, ఎముకలు కొరికే చలి మా చుట్టూ దట్టంగా పేరుకుపోతున్నాయి. అలల హోరు ఇదివరకంత పెద్దగా లేదు. కానీ, పాక చెక్కలమీద వాన మృదంగవాద్యం వినిపిస్తోంది. ఎక్కడో రాత్రి గస్తీ తిరిగేవాడి అలికిడి మాకు వినిపించింది.

"అక్కడ నేల చదును చేసి వుందా, లేదా?" అడిగింది నా సహాయకురాలు మెల్లగా. ఆమె మాటలు అర్థంకాక మౌనంగా వుండిపోయాను.

"పాక నేల సిమెంటుతో చదునుచేసి వుందా అని అడుగుతున్నాను. ఉంటే మనం చేసే పని అంతా దండగ! దానిమీద గట్టి బల్లచెక్కలుకూడా ఉంటాయి. మనం లోపలికి ప్రవేశించాలంటే... వాటినెలా తీస్తావు? అంతకంటే తాళం విరగ్గొట్టటం మంచిది. అదేం అంత గట్టిది కాదు."

మంచి ఆలోచనలు ఎప్పుడోకానీ ఆడవాళ్ల బుర్రల్లోకి రావు. మంచి ఆలోచనలను ప్రశంసించేవాళ్లలో నే నొకణ్ని; ఆ పైన శక్తివంచన లేకుండా వాటిని ఆచరణలో పెట్టే వాణ్ని. తాళం పట్టుకుని ఓ గట్టి దెబ్బవేశాను. అది వచ్చేసింది. తలుపు తెరిచాను. మా సమాఖ్య సభ్యురాలు పాములాగా వంగి లోపలికి జొరబడింది.

"అద్భుతంగా చేశావు!" అందామె ఆమోదముద్ర వేస్తూ.

ఆ స్త్రీ నుంచి వచ్చిన ఒక్క ప్రశంసాత్మకవాక్యం నాకెంతో ప్రియమైంది. ఓ కవిత చదివినా నా కంత ప్రియమనిపించదు. అయితే, ఆ క్షణంలో నా మనసు తుళ్లిపడలేదు. ఆమె ప్రశంసావాక్యాన్ని పట్టించుకోకుండా భయపడుతూ క్లుప్తంగా అడిగాను. "ఏమైనా ఉందా అక్కడ?" అని,

వైవిధ్యంలేని గొంతుతో ఆమె తను చూసినవాటి పేర్లను చెప్పసాగింది. "ఓ పాత సీసాల బుట్ట... గోనె సంచులు- ఖాళీవి... ఓ గొడుగు... ఓ ఇనపబకెట్టూ. చివరకు ఉత్సాహంగా కేకేసింది: "అబ్బ! దొరికింది!"

"ఏవిటి?"

"రొట్టె... గుండ్రంగా, పెద్దదిగా ఉంది... తడిసిపోయి ఉంది. పట్టుకో!"

ఆ గుండ్రటి రొట్టె నా కాళ్ల దగ్గరికి చక్రంలా తిరుగుతూ వచ్చింది. ఆ వెనుకనే వచ్చింది నేరంలో నా భాగస్వామిని అయిన వీరనారి. అప్పటికే నే నో ముక్కను తుంచి నమలసాగాను.

"మనం ఇక్కడి నుంచి బయటికెళ్లిపోవాలి. ఎక్కడికెళ్దాం?"

తన చుట్టూ కళ్లు విప్పార్చి చీకట్లోకి చూసిందామె... అంతా చీకటిగా, రొచ్చురొచ్చుగా ఉంది.

"చూడు, అక్కడ తలకిందులైన పడవ లేదూ... అక్కడికెళ్దామా?" అంది.

"పద!" మేం కొల్లగొట్టిన సంపదను ముక్కలుగా తుంపుకుంటూ, ఆ తుంపులను నోట్లో కుక్కేసుకుంటూ నడిచాం.

వాన విపరీతంగా కురుస్తోంది. నది ఘోష పెడుతోంది. ఎక్కడి నుంచో మరి అపహాస్యపు ఈల ఒకటి ధ్వనించింది. ఈ దుర్భరమైన శరత్కాల

**ప్రపంచ రచయిత్రుల పరిచయాలు**

## ఇసాబెల్ అలెండె (1942 - )

1970 దశాబ్దంలో నెత్తురోడుతున్న గుండెకాయ లాంటి చిన్నదేశం చిలీ (లాటిన్ అమెరికా)–ఎగిసిపడుతున్న చరిత్ర కెరటాలతో అతలాకుతలమవుతున్నది. సాల్వడార్ అలెండె నాయకత్వంలో సామ్యవాద ప్రభుత్వం అప్పుడే అధికారంలోకి వచ్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా ఎన్నికైన అధ్యక్షుడు సాల్వడార్ అలెండె. తరతరాలుగా దోపిడికీ గురైన అసంఖ్యాక ప్రజల ఆశాజ్యోతి. చరిత్ర పరిశీలకులకు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజునే తెలిసిపోయింది, రోజులు మనలేదని. హెన్రీ కిస్సింగర్ మాటల్లో "లాటిన్ ఆమెరికా యు.ఎస్. ఎకు 'పెరడు'." 1973 సెప్టెంబరు 11 నాడు జనరల్ పినోషె, యునైటెడ్ స్టేట్స్ సహాయంతో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి నియంతృత్వ పాలనకు నాంది పలికాడు. ఆ తర్వాత చిలీ చరిత్ర రక్తాక్షరాలతో

---

సామ్రాజ్యాన్నీ, మమ్మల్నీ.... ఈ సాయంకాలపు నాయికానాయకులనూ... అపహాస్యంచేస్తూ ఘోష పెట్టినట్లుగా ఉంది అది. అది విన్న నాకు గుండెలో ఏదో చిక్కబట్టినట్లుగా అనిపించింది. ఏమైనా, నేను ఆబగా తిన్నాను. నా పక్కన నడుస్తున్న ఆ అమ్మాయీ అదే పనిచేసింది.

"నీ పేరేమిటి?" ఏదో ప్రేరేపించింది నన్నా ప్రశ్న అడగటానికి.

"నటాషా!" జవాబిచ్చిం దామె, ముందుకు గెంతుతూ.

నే నామెవంక చూశాను. నా గుండె బాధగా చిక్కబట్టింది. వ్యంగ్యవికారపు నా విధి నన్ను చూసి రహస్యంగా శైత్యపు చిరునవ్వు నవ్వినట్లనిపించింది నాకు.

పడవ చెక్కలమీద వాన నిర్దయగా కురుస్తూంటే, పడవ అడుగు పగులు నుంచి గాలి ఈల వేసి లోపలికి జొరబడింది. ఆ పగులులో వదులుగా వున్న ఓ చెక్క ముక్క గాలికి ఊగిపోతూ, పడవకేసి నెత్తి బాదుకుంటూ భయోత్పాత విషాదసంగీతాన్ని వినిపించింది. నది అలలు ఒడ్డును బలంగా తాకుతున్నాయి. వాటి శబ్దాలు వైవిధ్యరహితంగా, ఆశారహితంగా వున్నాయి; చెప్పటానికే అసహ్యపడుతూ వేసారివున్నట్టూ వున్నాయి; నిర్జనతీరంలో గుడ్డిగా గాలి వీచింది. నురుగులు కక్కే నది ఏడుపు గొంతుతో పాటలు పాడింది.

పడవ కింద మాకు లభించిన వసతి సౌకర్యంగా లేదు. ఉన్న కొద్ది జాగా తడిగా వుంది. దాని అడుగునున్న రంధ్రంలో నుంచి చల్లటి చిన్న వాన చినుకులు పడుతున్నాయి. దాని గుండా గాలివిడతలు విడతలుగా దూసుకువస్తోంది. మేం నిశ్శబ్దంగా కూర్చుండిపోయాం. చలికి వణికిపోయాం. నాకు నిద్రపోవాలని వుంది. నటాషా పడవ పక్కకు ఆనుకుని బంతిలా ముడుచుకు కూర్చుంది. మోకాళ్లను గడ్డానికి ఆనించుకుని, కళ్లు విప్పార్చుకుని నిశ్చలంగా నదివైపు చూస్తున్నది. తగిలిన గాయాల మూలంగా ఆ తెల్లటి ముఖంలో ఆ కళ్లు మరింత పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఆమె కదల్లేదు.

ఆమె మొదట మాట్లాడింది. "ఎంత రొచ్చు జీవితం!" స్పష్టంగా, సంక్షిప్తంగా ఉచ్చరించిందామె, మహావిశ్వాసాన్ని ధ్వనించే గొంతుతో.

ఫిర్యాదీకు పట్టని అలక్ష్యాన్ని ధ్వనించా యా మాటలు. తన పద్ధతిలో విషయాన్ని గురించి స్పష్టమైన నిర్ధారణకు వచ్చినట్లు కనిపించిందామె. అవే ఆమె బయటికి చెప్పింది. నే నామె మాటలను ఖండించలేదు. లేకపోతే నాకు నేను ద్రోహం చేసుకున్నట్లవుతుంది. నే నక్కడ లేనట్టే ఆమె అక్కడ నిశ్చలంగా కూర్చుండిపోయింది.

"పడుకుని చచ్చిపోవటం... అదొక్కటే మార్గమనిపిస్తోంది" అన్నది నటాషా మళ్లీ. ఈ సారి ఆమె ఆలోచిస్తున్నట్టుగా, మృదువుగా అంది. సాధారణ మానవజీవితాన్ని గురించి ఆలోచించి, ఆ తర్వాత తన సొంత బతుకును గురించి పర్యాలోచించుకున్నాక, జీవితంలోని కిరాతకాలనుంచి తనను రక్షించుకునే మార్గం ఒక్క 'పడుకుని చచ్చిపోవటం' తప్ప మరేం లేదన్న ప్రశాంత నిర్ధారణకు ఆమె వచ్చినట్లనిపించింది.

అలాంటి ఆలోచనల స్పష్టత చూశాక, నాలో భరించరాని విచారమేదో బయలుదేరి నట్లనిపించింది. ఏదో వెంటనే అనకపోతే ఏడుపు వస్తుందనిపించింది. ఓ స్త్రీ ముందు– అదీ ఆమె ఏడవనప్పుడు– ఏడవటం నాకు సిగ్గనిపించింది. ఆమెతో మాట్లాడే ప్రయత్నం చెయ్యాలని నిర్ణయించు కున్నాను.

"ని న్నెవరు కొట్టారు?" అడిగాను, మరో తెలివైన మరో ఆలోచన తట్టక.

"పాష్కా, మామూలే. పెద్ద ఇదేంలేదు" జవాబిచ్చిం దామె ప్రశాంతంగా.

"ఎవ రతను?"

"ఓ స్నేహితుడు – రొట్టెలమ్మేవాడు."

"అతను తరచూ నిన్ను కొడుతుంటాడా?"

"తాగినప్పుడల్లా..."

ఆ పైన, అమాంతం కదిలి, నా పక్కన కూర్చుంటూ ఆమె తనను గురించీ, పాష్కాతో తనకున్న సంబంధాన్ని గురించీ చెప్పటం ప్రారంభించింది. ఆమె 'అందరమ్మాయిల్లో ఒకతి. వాళ్లు....' ఆ బేకర్– రొట్టెలమ్మేవాడు, ఎరుపు మీసాల పాష్కా అకార్డియన్ చక్కగా వాయించేవాడు. 'మేడమ్ ఇంట్లో' తనను తరచూ చూసేవాడు. ఆమెకు అతనంటే ఇష్టంకలిగింది. అతని బట్టలు చక్కగా ఉండేవి. అతని కోటు పదిహేను రూబుళ్లు చేస్తుంది. చక్కటి మృదువైన చర్మం బూట్లు వేసుకునేవాడు. ఈ కారణాలవల్ల ఆమె అతన్ని ప్రేమించసాగింది. అతనామెకు 'ప్రత్యేక మిత్రు'డైపోయాడు. అలా అయ్యాక, మిగతా 'మిత్రులు' స్వీట్లు కొనుక్కోమనీ, తాగమనీ ఇచ్చిన డబ్బును అత నామెనుంచి గుంజుకోవటం, కొట్టటం ప్రారంభించాడు. అదేం పెద్ద చెడ్డతనమేం కాదు. తన కళ్లముందే మిగతా ఆడాళ్లతో వెళ్లటం మొదలెట్టాడు.

"అదెలా భరించగలను నేను? పోనీ, నేనేం వాళ్లకంటే తక్కువగా వున్నానా? కాదు... ఆ పంది నాలో కోసం తెప్పించటానికి ఆ పని చేస్తాడు. మొన్న మేడం నాకు సెలవిచ్చింది... అలా తిరిగిరమ్మని, అతనింటికి వెళ్లాను. దవాంకా అక్కడ కూర్చుని ఉంది చిత్తుగా తాగి. వాడూ మస్తుగా తాగున్నాడు. 'నువ్వు పంది వెధవ్వి! నీ అంత మోసగాడు మరొక డుండడు!' అని అన్నాను. వాడు నన్ను చావ చితక్కొట్టాడు. కాళ్లతో తన్నాడు. జుట్టు పట్టుకు లాగాడు. పోనీ, అదేంపెద్ద తప్పు కాదు. నా బట్టలు చింపేశాడు. వెధవ! నేనేం చేయాలి? నా ముఖం మేడంకెలా చూపించను? అన్నీ చింపేశాడు, నా డ్రెస్సు, నా జాకెట్టూ... కొత్తవి. నా తలక్కట్టుకున్న స్కార్ఫ్ కూడా పట్టుకు లాగాడు. అయ్యో దేవుడా! నేనేం చేయగలను?" ఆమె గొంతు విక్షుబ్ధ రోదనలోకి మళ్లిపోయింది.

మరింత బలంగా, మరింత చల్లగా వీస్తూ గాలికూడా రోదించసాగింది. నా పళ్లు మళ్లీ నర్తించసాగాయి. ఆమె కూడా చలికి మరింత ముడుచుకుపోయి, నాకు బాగా దగ్గరగా జరిగింది. చీకట్లో ఆమె కళ్లు మెరిశాయి.

"మీరు... మగవాళ్లు... మహా దుర్మార్గులు! నా కాళ్లకింద వేసి మిమ్మల్ని తొక్కేస్తాను! మీ కాళ్లూ, చేతులూ విరిచేస్తాను! మగోడెవడైనా పడుకుని ఛస్తూ కన్పిస్తే, ఆడినోట్లో ఊస్తాను! అందుకేం బాధపడను! దొంగసచ్చినాళ్లు, పశువులు.... రొచ్చుకుక్కల్లా తోకాడించుకుంటూ ఏడుపు ముఖం పెట్టుకు వస్తారు. మరో బుద్ధిలేనిఆడది మీ పట్ల జాలి పడితే చాలు, ఇహ అక్కడికంతే! తనకేమైందో తెలుసుకోక ముందే దాన్ని గిరవాటేస్తారు... దొంగనా కొడుకులు! మగలంజలు!"

లిఖించబడింది.

ఇసాబెల్ అలెండె రచనా నేపథ్యం ఇది. కథలలో తప్ప ఆమె తన గురించి తాను చెప్పుకోవటానికిష్టపడదు. "జీవితం అంటే కొన్ని సంఘటనలు కావు. అసలు రహస్యాలు హృదయపు లోతుల్లో దాగి వుంటాయి. అవి ఎప్పుడూ, ఎవరికీ చెప్పుకోలేం" అంటుంది.

రికార్డుల ప్రకారం ఆమె పుట్టింది పెరూలో. తల్లిదండ్రులు. చిలియన్లు. మొదట జర్నలిస్టుగా పనిచేసింది. కొంత కాలం వెనుజుయెలా, ప్రస్తుతం కాలిఫోర్నియాలో నివాసం. ఇరవయ్యేడు భాషల్లోకి అనువదింపబడి, తెరకెక్కిన తన తొలి నవల "ది హౌస్ ఆఫ్ స్పిరిట్స్"కు ముందు ఆమె చాలా నాటకాలు రాసింది. ఇసాబెల్ యిప్పటికి రాసిన నవలల్లో కొన్ని 'ఆఫ్ లవ్ అండ్ షాడోస్'. 'ఈవాలూనా', 'ది ఇన్ఫినిట్ ప్లాన్', 'డాటర్ ఆఫ్ ఫార్చ్యూన్', 'సిటీ ఆఫ్ బీస్ట్స్', 'మై ఇన్వెంటెడ్ కంట్రీ', 'కింగ్‌డం ఆఫ్ ది గోల్డెన్ డ్రాగన్' వగైరా, శృంగారోద్దీపనం కలిగించే ఆహారపానీయాల గురించి రాసిన పుస్తకం 'ఆఫ్రొడైట్'. కథల సంకలం 'స్టోరీస్ ఆఫ్ ఈవాలూనా'.

---

ఆమె తిట్లూ, శాపనార్థాలూ, మహావైవిధ్యంగా ఉన్నాయి. కానీ, ఆ మాటల్లో పదును మృగ్యం; మహాకోపంగానీ, నిజమైన ద్వేషంగానీ ఆమె 'దొంగనాకొడుకులు! మగలంజలు!'లో నాకు కనిపించలేదు. ఆమె చెప్పే మాటలకూ, ఆ గొంతుకూ పొందిక లేదు. ఆ గొంతు ప్రశాంతంగా వుంది, విషాదంగా, వైవిధ్యరహితంగా ఉంది.

ఏమైనా నేను అంతకుముందూ, ఆ తర్వాతా చదివిన, విన్న మహాద్భుత విషాదకావ్యాలూ, ఉపన్యాసాలకంటే ఉద్ధృతంగా ఆమె చెప్పిన మాటలు నన్ను కదిలించేశాయి. కళాత్మకంగా చేసిన మృత్యువర్ణన కంటే, పోయేవాళ్లు పడే మరణబాధ మరింత సహజంగా ఉంటుంది; మన మనసును కలచివేస్తుంది.

నా కక్కడ మహాద్భుతంగా ఉంది. బహుశా అది నా సహవాసి చెప్పే మాటలవల్ల అయుండదు; చలే అందుకు కారణం. మెల్లగా మూలిగాను... నా పళ్లు గజగజమన్నాయి. అప్పుడు అదే క్షణంలో రెండు చల్లటి చిన్న చేతులు నన్ను స్పృశించాయి. మరుక్షణంలో ఆతురతగా, మృదువుగా ప్రశ్న వినిపించింది. "ఏమైందీ నీకు?"

నటాషా కాదు, మరెవరో నన్ను ప్రశ్నించినట్లనిపించింది. ఎందుకంటే ఆమె అంతకుముందే మగాళ్లను పందులని తిట్టింది, నరకానికి పోవాలని శపించింది. కానీ, ఆమె మాటలు దొర్లిస్తూ, బరబరా మాట్లాడేస్తోంది. "ఏమైందీ? ఆఁ? చలేస్తోందా? వణుకు పుడుతోందా? మహా పెద్దమనిషివిలే! అక్కడ కూర్చుని గుడ్లగూబలా... ఒక్క మాట మాట్లాడకుండా... ఏం మనిషివి? చలేస్తోందని నా కెప్పుడో చెప్పాల్సుండె. అదీ, అక్కడ నేలమీద కాళ్లు చాచి పడుకో... నేను పడుకుంటాను... ఆఁ అదీ! నన్ను కావలించుకో గట్టిగా... ఇప్పుడు నీకు కాస్త వెచ్చదనం కలిగి ఉండాలి... ఆ తర్వాత వీపూ, వీపూ ఆనించుకుని పడు కుందాం... ఈ రాత్రి తెల్లారిందంటే భయం లేదు... అస లేమైంది? తాగుడుకు అలవాటు పడ్డావా? నౌకరీ పోయిందా? దిగులు పడాల్సిందేమీ లేదు." ఆమె నాకు ఊరట కలిగించటానికీ, నాలో కొత్త గుండె ప్రవేశపెట్టటానికీ ప్రయత్ని స్తోంది.

నేను మహాశాపగ్రస్తుణ్ణి అయుండాలి. ఇదెంత వ్యంగ్యభరితమై ఉంది! నే నక్కడ మానవజాతి గమ్యాన్ని గురించి తీవ్రంగా మథనపడుతూ, రాజకీయాన్నీ... మొత్తం సమాజాన్నీ... పునర్వ్యవస్థీకరించాలని కలలు కంటూ, విప్లవం కోసం పరితపించిపోతూ, రచయితలకే పూర్తిగా అర్థమై ఉండని గహనవిషయాల గ్రంథాలు చదువుతూ, ఓ బలవత్తర క్రియాశీలశక్తిగా అంకితమయ్యే ప్రయత్నంలో వున్నాను. ఇక్కడ ఓ దుఃఖిత తాడిత వేశ్యబతుకులో ఏ స్థానమూ లేని, పనికి మాలినదని అందరూ అనే కిరాయి ఆడదాని పరిష్వంగంలో వెచ్చదనం పొందుతున్నాను. ఆమె లాంటి స్త్రీకి సాయమందించాలనే స్పృహే నాలో ఎప్పుడూ లేదు; ఒకవేళ అలాంటి ఆలోచన కలిగినా అదెలా చెయ్యాలో తెలిసివుండేది కాదు నాకు. అదంతా ఓ కలలా, ఓ అర్థంలేని దుఃఖదస్వప్నంలో జరిగి పోతున్నట్టుగా అనిపించింది నాకు.

అయ్యో! నాకలా ఆలోచించే హక్కులేదు. ఎందుకంటే, చల్లటి వానచినుకులు నా మీద పడుతున్నాయి; ఆ స్త్రీ వక్షోజాలు నా గుండెకు హత్తుకుంటున్నాయి. ఆమె వెచ్చటి ఊర్పులు నా ముఖాన్ని తాకుతున్నాయి. వాటిల్లో ఓడ్కా కంపు నన్ను తాకితేనేం... అవి నన్ను బతికించేట్టుగా ఉన్నాయి.

గాలి హోరెత్తింది. ఈలలు వేసింది. వాన పడవను వాయిస్తోంది. అలలు గట్టిగా తాకుతున్నాయి. ఆ గాఢపరిష్వంగంలోనూ మేం చలికి వణికిపోయాం. ఇదంతా పూర్తిగా వాస్తవమే. ఆ వాస్తవమంత దుఃస్వప్నాన్ని మరెవరూ కనివుండరని నాకు నిర్ధారణ అయింది.

నటాషా ఏదో విషయాన్ని గురించి మృదువుగా, సానుభూతితో మాట్లాడు తూనే ఉంది. అలా స్త్రీలు మాత్రమే మాట్లాడగలరు. ఆమె చెప్తున్న మృదువైన, అమాయకపు మాటల ప్రభావంలో పడ్డ నాలో ఓ బలహీన జ్వాలాకీల వెలిగింది. అదిచ్చిన వెచ్చదనం నా గుండెను కరిగించింది.

ఆ తర్వాత నా కళ్లల్లో నీళ్లు జాలువారాయి, నా గుండెల్లో క్రితం రాత్రివరకూ పేరుకుపోయిన చేదుతనాన్నీ, కోరికనూ, బుద్ధిహీనతనూ, మురికినీ తొలగిం చేస్తూ, పరిశుభ్రం చేస్తూ..

నటాషా నాకు సంతోషం కలిగించే ప్రయత్నంచేస్తూనే ఉంది. "చాలు, చాలు! ఇంక ఏడవ్వొద్దు. చెప్పానా.. దేవుడి దయంతో ఈ పరిస్థితి తొలగి పోయింది. మళ్లీ నీ నౌకరీ నీ కొస్తుంది..." అలాంటి మాటలే మరెన్నో.... ఆ పైన ఆమె నన్ను ముద్దు పెట్టుకుంది. వెచ్చగా, ఉదారంగా ముద్దులు కురిపించింది.

జీవితం నాకు మొదటిసారిగా ప్రసాదించిన ముదిత ముద్దులు అవి. మహాశ్రేష్ఠమైనవి. ఆ తరువాత అవి నా చేత ఎంతో ఖర్చు పెట్టించాయిగానీ నాకేమీ ఇవ్వలేదు.

"అదుగో, అదే చెప్పానా.... ఏడవ్వొద్దని! ఏం పాడు పని! నీ కెక్కడికీ వెళ్లటానికి దారిలేకపోతే, రేపు నిన్ను ఎక్కడో అక్కడ పనిలో పెడతాగా..." నిద్రమత్తులో జోగుతూ ఆశ్వాసాన్ని అందించే ఆమె మాటలను విన్నాను.

అలా మేం ఒకళ్ల చేతుల్లో ఒకళ్లం తెల్లవారు జాముదాకా ఉండిపోయాం.

వెలుగొచ్చాక పడవలోనుంచి పాకుతూ బయటికొచ్చాం. పట్నంలోకి వెళ్లాం. స్నేహపూర్వకంగా వీడ్కోలు తీసుకున్నాం; మళ్లీ కలవకుండా విడిపోయాం. అయితే, ఇప్పుడు నేను చెప్పిన, ఓ శరత్కాలపు రాత్రి నేను గడిపిన నటాషా కోసం ఆరునెలలు నేను వెదకని మురికి వాడలులేవు.

ఆమె ఇప్పటికే చనిపోయిందా? అది ఎంత అద్భుతమైన విషయం ఆ జీవితంలో! ఆమె ప్రశాంతంగా విశ్రమించుగాక! ఆమె బతికివున్నా ఆమెకు శాంతి కలగాలి! ఆమె ఆత్మ పాపభావనతో కుదించుకుపోకూడదు. అది ఆమెకు అనావశ్యకమైన వ్యథనే కలుగజేస్తుంది గానీ, ఆమె జీవనపద్ధతిలో మార్పేం తీసుకురాలేదు. ●

# శానటోరియం

## విలియం సోమర్‌సెట్ మామ్ (1874- 1965)

అనువాదం: కాకాని చక్రపాణి



విలియం సోమర్‌సెట్ మామ్ 1874 జనవరి 25న పారిస్‌లో జన్మించి, 1965 డిసెంబరు 16న ఫ్రాన్సులోని నీస్‌లో మరణించిన ప్రముఖ ఆంగ్ల నాటకకర్త, నవలాకారుడు, కథారచయిత. తల్లి, తండ్రి అతని బాల్యంలోనే చనిపోయారు. మత గురువుగా ఉంటున్న పెదతండ్రి హెన్రీ మామ్ సంరక్షణలో పెరిగాడు. చిన్న వయసులో మామ్‌కున్న నత్తి కారణంగా తాను చదువుకున్న కాంటర్‌బరీ స్కూలు పిల్లల హేళనకు గురయ్యాడు మత గురువులో వుండాల్సిన ప్రేమ, ఔదార్యం, ఆధ్యాత్మిక చింతన తన పెత్తండ్రిలో లేకపోవటం చూసిన మామ్‌కు మత గురువుల్లో నమ్మకం పోయింది. ప్రార్థనతో కొండలు కూడ కదులుతాయి. తనకు నత్తి పోవాలని ఎంతో విశ్వాసంతో ప్రార్థించినా నత్తిపోలేదు. అది అతడు నాస్తికుడవటానికి ఒక కారణం. తండ్రి లాగా తనూ డాక్టరవుదామని, లండనులోని సెయింట్‌థామస్ మెడికల్ స్కూల్లో చదివి, 1897లో డాక్టరు పట్టా పుచ్చుకున్నాడు కానీ, ప్రాక్టీసు చెయ్యలేదు, రచనా వృత్తిని చేపట్టాడు. డాక్టరీ చదువు చివరియేడులో పురుళ్లు పోసేప్పుడు మురికివాడలను నిశితంగా పరిశీలించిన ఫలితమే అతడి మొదటి రచన *Liza of Lambeth* (1897). అతడి ఉత్తమ రచన *Of Human Bondage* (1915) నవల. దాన్లో తన బాల్యాన్నంతా యథాతథంగా చిత్రించాడు మామ్. 'నన్ను బాధించే కొన్ని సంఘటనలు, క్రుంగదీసే అంతరంగం- వీటి నుండి విముక్తుణ్ణవటానికే ఈ నవల రాశా'నని చెప్పుకున్నాడు మామ్. మామ్ భౌతికవాది, నాస్తికుడు, ఆదర్శవాదమంటే పడదు అతనికి. మనిషి కార్యాచరణకు ముఖ్యకారణం స్వార్థం. దాన్ని దుర్మార్గంగా చిత్రించే ఆదర్శవాదం (మతం) మనిషిని కపటిని చేస్తుంది. బాధలు మనిషిని ఉన్నతుణ్ణి చేస్తాయనటం అబద్ధం; అవి మనిషిలో చిరచిరలాడే స్వభావాన్ని కలిగిస్తాయి. 'డబ్బంటే లెక్కలేనట్టు మాట్లాడే మనుషులంటే నాకు అసహ్యం; అలాంటి వాళ్లు కపటులో, మూర్ఖులో అయి ఉండాలి. డబ్బన్నది ఆరో ఇంద్రియం. అది లేకపోతే మిగతా ఇంద్రియాలు పనిచెయ్యవు' అని డబ్బుపట్ల తనకున్న ఆరోగ్యకరమైన భావనను ఒక పాత్రద్వారా చెప్పిస్తాడు. మామ్ దృక్పథంలో ఏ మనిషి ఎప్పుడు ఎట్లా ప్రవర్తిస్తాడో చెప్పటం కష్టం.

తెలుగులో ప్రముఖరచయిత అయిన బుచ్చిబాబు మామ్‌వల్ల ఎంతో ప్రభావితుడయ్యాడు. అతడి చివరకు మిగిలేది ఆ ప్రభావంతో రాసినదే.

శానటోరియంలో చేరిన మొదటి ఆరు వారాలూ ఆషెన్‌డెన్ బెడ్‌మీదే వున్నాడు. ఉదయం, సాయంత్రం అతన్ని చూడటానికి వచ్చే డాక్టరూ, నర్సులూ, భోజనం తెచ్చే ఆయాను తప్ప అతను మరెవర్నీ చూడలేదు. లండన్ డాక్టరు. క్షయవ్యాధిని నిర్ధారించి, అతన్ని ఉత్తర స్కాట్‌లండ్‌లోని ఒక శానటోరియానికి పంపాడు.

తను ఓపిగ్గా ఎదురుచూస్తున్న రోజు చివరికి వచ్చింది. ఇంక అతను లేచి తిరగవచ్చని డాక్టరు చెప్పారు. ఆ మధ్యాహ్నం నర్స్ అతన్ని వరండాలోకి తీసుకెళ్లింది. రగ్గుతో ఒళ్లంతా కప్పి, నిర్మలాకాశం నుంచి కురుస్తున్న ఎండ చూస్తూ ఎంజాయ్ చెయ్యమని చెప్పి వెళ్లిపోయింది.

శానటోరియాన్ని కొండపైన కట్టారు. అక్కడినుంచి చూస్తూంటే మంచులో కప్పిన గ్రామీణప్రాంతం కనిపిస్తూ ఉంటుంది. వరండాలో డెక్ చైర్లలో చాలా మంది కూర్చునున్నారు. కొంతమంది పక్కవాళ్లతో మాట్లాడుతుంటే, మరి కొంతమంది చదువుకుంటున్నారు. అప్పుడప్పుడూ ఎవరో ఒక రోగి ఖళ్లుఖళ్లని దగ్గి, ఆ తెర తగ్గాక భయపడిపోతూ జేబు గుడ్డ వంక చూసుకోవడమూ కనిపిస్తుంది. ఆషెన్‌డెన్ నర్స్ అతని పక్క కుర్చీలో ఉన్న వ్యక్తికి, "వీరు ఆషెన్‌డెన్" అంటూ, "ఈయన మెక్లాడ్, వీరు కాంబెల్. ఇక్కడున్న వాళ్లందర్లోకి ముందు వచ్చినవాళ్లు. ఎంతో కాలంగా ఇక్కడ వుంటున్నారు" అని ఆషెన్‌డెన్‌కు పరిచయంచేసి వెళ్లిపోయింది.

ఆషెన్‌డెన్‌కు మరోపక్కన ఓ అందమైన అమ్మాయి కూర్చుని ఉంది. ఎర్రటిజుట్టు, నీలికళ్లు. ఆమె మేకప్ చేసుకోలేదు. పెదవులూ, బుగ్గలూ ఎర్రగా ఉన్నాయి. మిగతా చర్మం అందుకు భిన్నంగా తెల్లగా ఉంది. ఆ తెల్లదనం జబ్బుకు చిహ్నమని తెలిసినా అది ఎంతో అందంగా ఉంది. ఫర్‌కోటు వేసుకుని రగ్ కప్పుకుంది. ఆమె ఆషెన్‌డెన్ వంక స్నేహపూర్వకంగా చూసింది కానీ మాట్లాడలేదు. కొత్తవాళ్ల మధ్య సిగ్గుపడే అతనూ మాట్లాడలేదు.

> పిల్లలకు చెప్పడానికి ఎప్పుడూ వంద కథలను జేబులో పెట్టుకుని తిరగాలి టీచరు.

"ఇదే మొదటిసారా, మిమ్మల్ని లేచి తిరగవచ్చని చెప్పింది? మీ గదెక్కడ?" అడిగాడు మెక్లాడ్.

ఆషెన్‌డన్ చెప్పాడు.

"చిన్నగదే. ఇక్కడున్న ప్రతి గదీ నాకు తెలుసు. పదిహేడేళ్ల నుంచి ఇక్కడుంటున్నాను. ఇక్కడున్న వాటిల్లోకెల్లా మంచి గదిని నాకిచ్చారు. నా చేత దాన్ని ఖాళీ చేయించి అది తను తీసుకోవాలని చూస్తున్నాడు కాంబెల్. వాణ్ని అందులో అడుగుపెట్టనివ్వను. ఆ గదిమీద నాకు హక్కుంది. తనకంటే నేను ఆర్నెల్లు ముందు వచ్చాను."

మెక్లాడ్ పొడగరి, చర్మం ఎముకల మీద బిగుతుగా సాగింది. గుంటల బుగ్గలు, కృశించిన ముఖంలో పెద్దముక్కు- కళ్లు అసాధారణంగా కన్పిస్తాయి.

"పదిహేడేళ్లంటే దీర్ఘకాలం" అన్నాడు ఆషెన్‌డెన్, మరేమనాలో తోచక.

"కాలం వేగంగా గడచిపోతోంది. నాకిక్కడ బాగుంది. ఒకటి రెండేళ్లయాక తర్వాత వేసవిలో బయటికెళ్లాను. అంతే, ఆ తర్వాత వెళ్లలేదు. ఇప్పుడు ఇదే నా ఇల్లు. ఓ తమ్ముడూ, ఇద్దరు చెల్లెళ్లూ ఉన్నారు. వాళ్ల సంసారాలు వాళ్లవి, నా సంగతి పట్టదు. ఇన్నేళ్లు ఇక్కడున్నాక, ఆ ప్రపంచం నచ్చదు మనకు. మన స్నేహితులకు వాళ్ల పనివాళ్లకుంటుంది. ఇప్పుడెళ్తే అంతా కొత్త, అంతా హడావుడి, సంరంభం, పనికిమాలినదాని కోసం. నిజానికి ఇక్కడే బావుంటుంది. ఇంక కాటికి తీసికెళ్లేవరకూ నేనిక్కడి నుంచి కదలను!"

కొంతకాలం తను జాగ్రత్తగా ఉంటే నయమై బయిటికిపోవచ్చని చెప్పాడు ఆషెన్‌డెన్‌కు డాక్టరు. మెక్లాడ్ వంక విచిత్రంగా చూస్తూ, "పగలంతా మీరేం చేస్తుంటారు?" అనడిగాడు ఆషెన్‌డెన్.

"చెయ్యడమా? టీబీ జబ్బే హోల్ టైం జాబ్! టెంపరేచర్ చూసుకోవాలి. బరువు చూసుకోవాలి. బట్టలు వేసుకోవాలి. అన్ని పనులూ మెల్లగా చేస్తాను. బ్రేక్‌ఫాస్ట్ తీసుకుని, పేపర్లు చదువుతాను. అలా నడిచివస్తాను. ఆ తర్వాత విశ్రాంతి. లంచయ్యాక బ్రిడ్జ్ ఆడతాను. మళ్లీ విశ్రాంతి. రాత్రి భోజనం. కాసేపు మళ్లీ బ్రిడ్జ్. ఆ తర్వాత పడుకొంటాను. ఇక్కడో మంచి లైబ్రరీవుంది. కొత్త పుస్తకాలు తెప్పిస్తారు. నిజానికి నాకు పుస్తకాలు చదివే తీరికలేదు. జనంతో మాట్లాడుతుంటాను. రకరకాల మనుషులు వస్తుంటారు, పోతూంటారు. కొంతమంది తమకు నయమైందనుకుని వెళ్లిపోతారు. కానీ వాళ్లలో చాలామంది తిరిగి వస్తుంటారు. కొంతమంది మరణించి వెళ్లిపోతుంటారు. నేను వెళ్లిపోయే ముందు ఇంకెంత మందిని చూడాలో!"

ఆషెన్‌డెన్‌కు మరో పక్క కూర్చున్న అమ్మాయి అకస్మాత్తుగా అంది, "పోయేవాళ్లని గురించి మెక్లాడ్‌లాగా హాస్యంగా మాట్లాడేవాళ్లెవరూ ఉండరు."

మెక్లాడ్ నవ్వాడు. "నాకు తెలీదులే, ఎవరి విషయం వాళ్లు చెప్పటం మానవస్వభావం కాదు. నన్ను కాక మరో వ్యక్తిని వాళ్లు పట్టుకెళ్లడం నాకు సంతోషమే" అన్నాక, ఆ పిల్లతో ఆషెన్‌డెన్‌కు పరిచయం లేదని గుర్తొచ్చి, "ఆ అమ్మాయి పేరు ఐవీ-ఐవీ బిషప్. ఇంగ్లీషు పిల్లే, కాని చెడ్డపిల్ల మాత్రం కాదు" అన్నాడు ఆషెన్‌డెన్‌తో.

"మీరెన్నాళ్ల నుంచి ఉంటున్నారు ఇక్కడ?" అడిగాడు ఆషెన్‌డెన్ ఆమెను.

"రెండేళ్లే. ఇది నేనుండే చివరి శీతాకాలం. ఇంక కొన్ని నెలల్లో నాకు బాగైపోతుంది. ఇంటికి వెళ్లిపోవచ్చని అన్నారు డాక్టర్ లెన్నాక్స్."

"పోదూ!" అన్నాడు మెక్లాడ్. "ఇక్కడే ఉండు, హాయిగా ఉంటావు."

అప్పుడో మనిషి ఓ కర్ర ఆసరాగా వరండాలో మెల్లగా నడుస్తూ వచ్చాడు.

"ఆయన మేజర్ టెంపుల్‌టన్" అంది ఐవీ, చిరునవ్వు నీలికళ్లలో వెలుగులీనుతూంటే. అతను దగ్గరకి రాగానే, "మిమ్మల్ని మళ్లీ చూసి నాకు ఆనందంగా ఉంది" అంది.

"మరేంలేదు. కొద్దిగా జలుబు చేసింది. ఇప్పుడు బాగానే ఉన్నా." ఆ మాటలన్నాడో లేదో, అతను ఖళ్లుఖళ్లుమని దగ్గసాగాడు. ఆ తెర తగ్గిపోగానే, నవ్వుతూ "ఈ వెధవ దగ్గు తగ్గి చావటంలేదు. పొగతాగటం ఎక్కువైంది. మానెయ్యమంటాడు డాక్టర్ లెన్నాక్స్. లాభంలేదు. అది నావల్ల కాదు!"

పొడుగు మనిషి; అందగాడే; పాలిపోయిన ముఖం, నల్లటికళ్లు, చక్కగా కత్తిరించుకున్న నల్లటి మీసాలు. ఆస్ట్రఖన్ కాలరున్న కోటువేసుకున్నాడు. చురుగ్గా, డాబుగా ఉన్నాడు. ఐవీ, ఆషెన్‌డెన్‌ను పరిచయంచేసింది. అతను మర్యాదకు రెండు మంచి మాటలు చెప్పాడు. తన్ను శానటోరియం వెనకున్న చెట్లమధ్య నడవమని డాక్టరు చెప్పాట్ట! ఐవీని తనతో రమ్మన్నాడు. వాళ్లు నడచిపోతూంటే మెక్లాడ్ వాళ్లను చూడసాగాడు.

"వాళ్ల మధ్య ఏదో ఉంది. జబ్బు పడకముందు, తగిలిన అమ్మాయిని వదిలేవాడు కాదంటారు అతన్ని గురించి" అన్నాడతను.

"ఇప్పుడలాంటి పరిస్థితిలో అతనున్నట్లు లేదే!" అన్నాడు ఆషెన్‌డెన్.

"ఎవరు చెప్పగలరు? ఇక్కడ నేనెన్ని భాగోతాలు చూడలేదూ? కథలు కథలుగా చెప్పగలను మీక్కావాలంటే."

"చెప్పండి, అవేమిటో విందాం."

మెక్లాడ్ నవ్వాడు. "ఒక్కటి చెప్తాను. మూడు- నాలుగేళ్ల క్రితం ఇక్కడొకావిడ

## ప్రపంచ రచయిత్రుల పరిచయాలు

### గ్రేస్ పాలీ (1922 – 2007)

పెళ్ళికి ముందు ఆమె పేరు గ్రేస్ గుడ్‌సైడ్. బ్రాంక్స్ (న్యూయార్క్)లో జననం. తల్లిదండ్రులు రష్యానించి వలస వచ్చిన యూదులు. రచనల మీదా, తరువాతి రాజకీయ కార్యకలాపాల మీదా ఈ బాల్యం చాలా ప్రభావం చూపింది.

హంటర్ కాలేజీలోనూ, తరువాత న్యూయార్క్ యూనివర్సిటీలోనూ విద్యాభ్యాసం చేసింది గాని డిగ్రీ తీసుకోలేదు. "కవిత్వం గురించి తెలుసుకోవాలనుకున్నాను. కథా శిల్పం నేర్చుకోవటానికి కవిత్వం చాలా సహాయం చేస్తుంది." అంటుంది.

1940ల ప్రారంభ దశకంలో న్యూ స్కూల్ ఫర్ సోషల్ రీసర్చ్‌లో ప్రముఖ కవి W.H.Auden తో పరిచయం ఏర్పడింది.

1942లో పెళ్లైంది. భర్త జెస్ పాలీ. ఇద్దరు పిల్లలు. 1950లలో తొలుత కవిత్వం, తరువాత కథలు రాయడం ప్రారంభించింది. మొదటి కథా సంకలనం "ది లిటిల్ డిస్టర్బెన్సెస్ ఆఫ్ మాన్" (1959)తోనే ఆమెకు విలక్షణ కథా రచయిత్రిగా గుర్తింపు వచ్చింది. "అమెరికన్ కథాచరిత్రలో ఈ పుస్తక ప్రచురణకు ఒక చారిత్రక ప్రాధాన్యత వుంది" అన్నారు విమర్శకులు.

1960, 1970లలో అమెరికా చేసిన వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా వుద్యమించింది. గ్రీన్‌విచ్ విలేజ్ (న్యూయార్క్) శాంతి కేంద్రానికి సెక్రటరీగా వుంది. నిరసనకారులను ఏ ప్రభుత్వం క్షమించదు. గ్రేస్ పాలీ జైల్లో కొంతకాలం గడిపింది. "అనార్కిస్టు"గా ముద్ర పడింది. శాంతి బృందాలతో కలిసి హనోయ్ (వియత్నాం), మాస్కోలను సందర్శించింది. రాజకీయ నిరసనల మీద ఆంక్షలు విధించినందుకు 1973లో మాస్కోను కూడా విమర్శించింది. తరువాతి కాలంలో అణ్వస్త్ర వ్యతిరేక వుద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించింది. 1974లో ఆమె రెండవ కథాసంకలనం 'ఎనార్మస్ చేంజెస్ ఎట్ ద లాస్ట్ మినిట్" వెలువడింది. 1985లో మరో కథాసంపుటి "లేటర్ ది సేమ్ డే" ఆమెకు మరింత పేరు తెచ్చింది. లాక్షణికులు, విమర్శకులు మంచి కథలకు వుదాహరణలుగా ఆమె కథల గురించి విద్యార్థులకు బోధిస్తారు. ఆమె స్వయంగా కొలంబియా, సైరాక్యూస్ యూనివర్సిటీలలో, ఇతర కాలేజీల్లో "క్రియేటివ్ రైటింగ్" బోధించింది.

1988లో న్యూయార్క్ స్టేట్ శాసనసభ ఆమెను "స్టేట్ ఆథర్"గా ప్రకటించింది.

అమెరికా ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని విమర్శిస్తూ పాలీ నికరాగువా, ఎల్‌సాల్వడర్ దేశాలలో కూడా పర్యటించింది.

'ఫిక్షన్' కోసం గగెన్‌హైమ్ ఫెలోషిప్, 'కథా రచన'కు గాను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్' సంస్థ అవార్డు కూడా ఆమెను వరించింది.

న్యూయార్క్‌కూ, అక్కడి జీవితసరళికీ ప్రతిబింబాలు ఆమె కథలు. "మిసిసిపీకి విలియమ్ ఫాక్నర్ ఎలాగో, న్యూయార్క్‌కు గ్రేస్‌పాలీ అలాగ" అంటారు.

1993లో ఆమెకు రీ అవార్డు (కథారచనకు గాను యిచ్చే అత్యున్నత సత్కారం) కూడా వచ్చింది.

---

ఉండేది. మహారంధి ఉన్న మనిషి. ఆమె మొగుడు ప్రతి పక్షానికి ఆమెను చూడటానికి వచ్చేవాడు: ఆమె అంటే పిచ్చి అతనికి, లండను నుంచల్లా విమానంలో వచ్చేవాడు. ఆమె ఇక్కడెవడితోనో వ్యవహారం నడుపుతూందని డాక్టర్ లెన్నాక్స్‌కు అనుమాన మొచ్చింది. కానీ ఆ వ్యక్తి ఎవరో తెలీలేదు. ఓ రోజు రాత్రి అందరూ పడుకున్నాక ఆమె గది గుమ్మం ముందు పల్చగా రంగు పూయించాడు. మర్నాడు అందరి స్లిప్పర్లూ పరీక్ష చేశాడు. దొరికాడు దొంగ! వాణ్ని పంపించేశారు బయటికి. ఈ విషయంలో అతను కచ్చితమైన మనిషి. శానటోరియానికి చెడ్డపేరు రావటం అతని కిష్టంలేదు."

"ఎన్నాళ్ల నుంచి టెంపుల్‌టన్ ఇక్కడ ఉంటున్నాడు?"

"మూడు– నాలుగు నెల్లు పక్క వదల్లేదు. అతనికేం పర్లేదు. ఆ ఐవీ పిల్ల వాడంటే పడిఛస్తుంటే మాత్రం అంత కంటే మరో మూర్ఖపు అమ్మాయి ఉండదు! ఆమెకు నయమయ్యే అవకాశం ఉంది. నేను చాలామందిని చూశాను. అందుకే చెప్పగలను. ముఖం చూస్తే చాలు నయమవుతుందో లేదో, లేకపోతే ఎంతకాలం అవ్వవచ్చో చెప్పగలను. నేనెప్పుడూ పొరపాటు పడలేదు. టెంపుల్‌టన్ రెండేళ్ల కంటే బతకడు!" అన్నాడు మెక్లాడ్.

తనవంక గంభీరంగా చూస్తున్న మెక్లాడ్ ఆలోచన పసిగట్టిన ఆషెన్‌డెన్ వేడుగ్గా అతని వంక చూసినా, అతనిగుండె చిక్కపట్టకపోలేదు. ఆషెన్‌డెన్ మనసులోని ఆలోచన గుర్తించి, మెరుస్తూన్న కళ్లతో అతని వంక చూసి మెక్లాడ్ చెప్పాడు: "నీకేం భయంలేదు. నీకు నయమైపోతుంది. నాకు నిశ్చయంగా తెలియకపోతే నేనా మాట చెప్పను, తన రోగిష్ఠి పక్షులను భయపెడుతున్నానని డాక్టర్ లెన్నాక్స్ బయటకు తోలేస్తాడేమోననే కానీ, లేకపోతే..."

అంతలో ఆషెన్‌డెన్ నర్సు వచ్చింది. అతన్ని బెడ్‌కు తీసుకువెళ్లటానికి. అతనక్కడ కూర్చుంది ఓ గంటే కానీ, అలసిపోయాడు. సాయంత్రం చూట్టానికి వచ్చిన డాక్టర్ లెన్నాక్స్ అతని టెంపరేచర్ ఛార్ట్ వంక చూసి, "పర్లేదు, బానే వుంది" అన్నాడు.

లెన్నాక్స్ కుదిమట్టంగా, చురుగ్గా, దయగా ఉండే మనిషి. అతను మంచి డాక్టరు; చేపలు పట్టటం అతనికి వ్యసనం. చేపలు పట్టే ఋతువులో పనిని అసిస్టెంట్ల కప్పజెప్పి చేపలుపట్టటానికి వెళ్లేవాడు. పేషెంట్లు గొణిగేవాళ్లు కానీ, అతను తెచ్చిన లేత సాల్మన్ చేపలకూరతో భోజనంలో మార్పు వచ్చేటప్పటికి సద్దుమణిగేవారు. లెన్నాక్స్‌కు మాట్లాడటమంటే ఇష్టం. అందుకే ఆషెన్‌డెన్ బెడ్ చివరన నిలబడి ఆ మధ్యాహ్నం ఎవరితోనైనా పరిచయమైందా అని అడిగాడు. మెక్లాడ్‌ను నర్సు తనకు పరిచయం చేసిందని ఆషెన్‌డెన్ అతనికి చెప్పాడు.

డాక్టర్ లెన్నాక్స్ నవ్వాడు. "చిరకాల కాపురస్థుడు. శానటోరియం గురించీ, రోగుల గురించీ అతనికి నాకంటే బాగా తెలుసు. ఎలా పట్టుకుంటాడోకానీ, ఇక్కడున్న వాళ్లందరి ప్రైవేటు జీవితాన్ని గురించి అతనికి తెలియనిదేం లేదు. ఎక్కడ ఏ భాగోతం నడుస్తుందో వాసన పట్టే ముసలిదానికంటే కనాకష్టం. కాంబెల్ సంగతి చెప్పాడా అతను?"

"ఆఁ. పేరు చెప్పాడు."

"ఇద్దరికీ ఒకళ్లంటే ఒకళ్లకి ద్వేషం. ఇద్దరూ ఇక్కడ పదిహేడేళ్లబట్టీ ఉంటున్నవాళ్లే. ఇద్దరికీ ఒక్క ఊపిరితిత్తి మాత్రమే బాగా పనిచేస్తుంది. ఒకరి నీడంటే ఒకరికి పడదు. ఇద్దరూ ఫిర్యాదులు చేస్తూ వస్తారు నా దగ్గరికి. నేను వినటం మానేశాను. కాంబెల్ గది, మెక్లాడ్ గది కిందే. కాంబెల్ ఫిడేల్ వాయిస్తుంటాడు. అదంటే మంట మెక్లాడ్‌కు. పదిహేనేళ్ల నుంచి అవే గీతాలూ, రాగాలూ వింటున్నానంటాడు మెక్లాడ్. ఎవరికీ నిద్రాభంగం కలగకుండా మిగతాప్పుడు వాయించుకుంటుంటే, అతన్ని మానెయ్యమని చెప్పే హక్కు నాకెక్కడుంది? అందుకే మెక్లాడ్ గది మారుస్తానని చెప్పాను. అందుకొప్పుకోలేదతను. అది మంచి గది, తన్నాగదిలో నుంచి బయటికెళ్లగొట్టటానికే కాంబెల్

"కథా రచన గ్రేస్‌పాలీ సహజ ప్రవృత్తి. ప్రతి క్రీడాకారుడూ తను రాణించగలిగిన ఏదో ఒక ఆటను ఎంచుకుంటాడు. అలాగ గ్రేస్‌పాలీ కథా రచనలో తనకు తానేసాటి అని నిరూపించుకుంది. కథా కథన సంవిధానంలోనూ, శిల్పంలోనూ ఆమెదొక విలక్షణ పద్ధతి. కలైడోస్కోప్‌లోని రంగురాళ్ల లాగ, ఆమె పదాలు ప్రతిసారీ కొత్త రంగుల్లో కొత్త అర్థాలతో, కొంత అందాలతో మనల్ని ముగ్ధుల్ని చేస్తాయి. హాస్యం, వ్యంగ్యం, అధికార గర్వం పట్ల కోపం, సగటు మనిషి మీది ప్రేమ, కరుణ, రోజువారీ జీవితాల్లోని చిన్నచిన్న కష్టాలనూ, సుఖాలనూ తన కథాకావ్యాలలో అద్భుతంగా చిత్రించిన రచయిత్రి" అంటూ కీర్తించారు న్యాయనిర్ణేతలు.

ఇంతాచేసి పాలీ రాసింది తక్కువే. "బాధ మాత్రమే కలాన్ని కదిలిస్తుంది. అందువల్ల కేవలం కథ కోసం రోజూ రాయటం కుదరదు" అంటుంది.

పరిశీలన అవసరం. ముఖ్యంగా పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి వాళ్ల కష్టసుఖాల్ని తెలుసుకోగలగాలి. ఆ తర్వాత, తెలుసుకోవటానికీ, తిరిగి చెప్పగలగటానికీ మధ్య మనం వూహించలేనంత విరామం వుంటుంది.

మరొక రష్యన్ యూదు రచయిత ఇసాక్ బేబెల్ లాగ, "వాసి తగ్గని కొద్ది గొప్ప కథలు రాసిన" రచయిత్రి గ్రేస్ పాలీ.

తను రాసిన 'నాన్నకో కథ' గురించి రచయిత్రి:

ప్రతి సృజనాత్మక ప్రక్రియకూ ఏదో ఒక కేంద్ర బిందువుంటుంది. దాని చుట్టూ ఒక ఆకారం ఏర్పాటు చేస్తాం. అయితే రచనాక్రమంలో కొన్నిసార్లు కేంద్రబిందువు మారిపోతుంటుంది. అలాంటప్పుడే ఒకటనుకుని మరొకటి రాస్తాం.

అంతేకాదు. కేవలం రచనలకు మాత్రమే జీవితాన్ని అంకితం చేస్తామనే వాళ్లకు రాయటానికేమీ దొరకదు. అనేక యితర పనులు చేస్తున్నప్పుడు ఏదో ఒకటి రాయటానికి తడుతుంది. నా మట్టుకు నేను కథాప్రక్రియలోని రహస్యాలు కవిత్వం చదివి, రాసి నేర్చుకున్నాను.

మా నాన్నకు ఎనభైఆరేళ్లు. చాలాకాలంగా మంచం పట్టాడు. ఒకప్పుడతడు మంచి ఆర్టిస్టు. వృత్తిరీత్యా వైద్యుడైనా బాగా బొమ్మలేసేవాడు. వారానికోసారి నే నాయన్ను చూడటానికి వెళ్లేదాన్ని ఒకసారి నన్ను, 'మంచి కథ రాయ'మన్నాడు నాన్న. ఆ సంభాషణా ఫలితమే ఈ కథ. సాహిత్య ప్రక్రియను గురించిన ఈ కథ కల్పనే. కాని ఆ 60 ల నాటి వాతావరణం (యుద్ధ పరిస్థితి, నిరసన ప్రదర్శనలు) యిచ్చిన ప్రేరణతో రాసిన కథ. ముఖ్యంగా డ్రగ్స్, హిప్పీలు. మానాన్న జారు (చక్రవర్తి) కాలం నాటి రష్యాలో పుట్టాడు. ఇరవైయ్యేళ్లున్నప్పుడు శరణార్థిగా యిక్కడికి వచ్చి అనేక కష్టనష్టాలకోర్చి మెడిసిన్ చదివాడు. అన్ని కథల్లాగే నాకు ఈ కథ రాయటానికి కూడా కొన్ని నెలలు పట్టింది. ఎన్ని సమస్యలున్నా జీవితాన్ని ఎదుర్కొనాలని నాకు ధైర్యం చెప్పిన నాన్న (కథ) చివరకు తన మరణానికి కూడా నన్ను సిద్ధం చేస్తున్నాడా అని అడిగారు కొందరు. నాకు తెలియదు. చాలా సార్లు, రాసినవాళ్లకన్నా, చదివిన వాళ్లకే కథలు బాగా అర్థమవుతాయి.

---

ఫిడేలు వాయిస్తున్నాడంటాడు. తన్ను బయటికెళ్లగొట్టి వాడు తన గది నాక్రమిస్తే ఛస్తాడంటాడు. విచిత్రంగా లేదూ? ఇద్దరు మధ్యవయస్కులు ఇలా ఒకరి జీవితం మరొకరు నరకం చేయటం. ఒకర్ని విడిచిపెట్టి మరొకరుండరు. ఒకే టేబుల్ దగ్గర భోజనం చేస్తారు. కలిసి బ్రిడ్జి ఆడతారు. అయినా, గొడవ పడకుండా రోజు గడవదు. సర్దుకుని ఉండకపోతే ఇద్దర్నీ బయటికి పంపేస్తానని చాలాసార్లు బెదిరించాను కూడా. రెండు రోజులు ప్రశాంతంగా ఉంటారు. ఇక్కడ వాళ్లు ఎంతోకాలంగా ఉన్నారంటే బయట వాళ్లని పట్టించుకునేవాళ్లే లేరు. ఇప్పుడు బయటి ప్రపంచంలో నెగ్గుకురాలేరు. కొన్నేళ్ల క్రితం రెండునెల్లు సెలవు తీసుకుని వెళ్లాడు కాంబెల్. వారంలో తిరిగి వచ్చాడు. బయటిగోల తను భరించలేట్ట. వీథుల్లో జనాన్ని చూసి భయం వేసిందట."

అలా ఆషెన్‌డెన్‌కు కొత్త ప్రపంచంతో పరిచయమైంది. అతని ఆరోగ్యం మెరుగవుతుంటే, అతను మిగతా రోగుల్ని కలుసుకోసాగాడు. ఓ రోజు పొద్దున్న తనింక డైనింగ్ రూంలో లంచ్ చేయవచ్చని డాక్టర్ లెన్నాక్స్ అతనికి చెప్పాడు. అక్కడ అతనికి చాలామంది మనుషులు కనిపించారు. అన్ని రకాల వయసు వాళ్లూ- యువకులు, మధ్యవయస్కులు, ముసలివాళ్లు ఉన్నారు. మెక్లాడ్, కాంబెల్‌లలాగా అక్కడే ఎంతోకాలంగా వుంటూ, అక్కడే చనిపోవాలని అనుకుంటూండేవాళ్లు వున్నారు. కొద్ది నెలల క్రితమే వచ్చిన వాళ్లున్నారు. మిస్ ఇట్కిన్ అనే ముసలికన్య కూడా ఉంది. కొన్నేళ్ల నుంచి చలికాలంలో అక్కడ గడుపుతూ, వేసవికాలంలో బంధుమిత్రులతో గడుపుతుంది. ఆమె అక్కడే పూర్తికాలం ఉండొచ్చు. కానీ, ఇక్కడి జీవితమంటే ఇష్టం ఆమెకు. దీర్ఘకాలం ఇక్కడ ఉండటంవల్ల ఆమెకో హోదా వచ్చింది. ఆమె ఆనరరీ లైబ్రేరియన్‌గా వ్యవహరించేది. మాట్రన్‌తో చేతులు కలిపేది. కబుర్లకు ఆమె ఎప్పుడూ సంసిద్ధమే. అయితే, ఆమె నోట్లో నువ్వుగింజ నానదు; కళ్లబడకుండా ఏదీ ఉండదు. తన పేషెంట్లు ఎలాంటి అవివేకపు పనులూ చేయటంలేదనీ, తన ఆదేశాలన్నిటినీ పాటిస్తున్నారనీ తెలుసుకోవాలి డాక్టర్ లెన్నాక్స్. ఆమె నుంచి మాట్రన్‌కూ, మాట్రన్ నుంచి డాక్టర్‌కూ సమాచారం అందేది. సీనియర్ కనుక, ఆమె కూడా మెక్లాడ్, కాంబెల్‌ల టేబుల్ దగ్గరే భోజనానికి కూర్చునేది; మరో ముసలి జనరల్ కూడా అక్కడ కూర్చునేవాడు, హోదా రీత్యా అతనికాస్థానం ఇచ్చారు. మిగతా టేబుళ్లలాంటిదే అది. కానీ పాతకాపులంతా అక్కడే తిష్ఠవేస్తారు కనుక ఆ టేబుల్‌కి గౌరవనీయ, వాంఛనీయస్థానం లభించింది. అయితే, ప్రతి వేసవికాలంలోనూ నాలుగైదు నెలలు మాత్రం అక్కడ ఉండి వెళ్లే మిస్ ఇట్కిన్‌కు, సంవత్సరమంతా ఉండే తమను కాదని, ఆ గౌరవస్థానం ఇవ్వటం, కొంతమంది పెద్దవయసు స్త్రీలకు కష్టమనిపించింది. మెక్లాడ్, కాంబెల్‌ల తర్వాత దీర్ఘకాలం నుంచి అక్కడే ఉంటున్న ఓ ఇండియన్ సివిలియన్ మహాకినుకగా ఎదురుచూస్తున్నాడు, మెక్లాడ్, కాంబెల్‌లలో ఎవరో ఒకరి మృతికోసం. అప్పుడతనికి మొదటి టేబుల్ దగ్గర స్థానం లభిస్తుంది. ఆషెన్‌డెన్‌కు కాంబెల్‌తో పరిచయమయింది. బట్టతల, సన్నటి మనిషి. కుర్చీలో అవయవాలు ముడుచుకుని అతను గువ్వలా కూర్చునే పద్ధతి చూస్తే తోలుబొమ్మలాటలో మరుగుజ్జు గుర్తుకువస్తాడు. అతను విరసంగా మాట్లాడే మనిషి. ముట్టుకుంటే మీద పడి కరిచేటట్టుంటాడు. పరిచయం కాగానే అతను ఆషెన్‌డెన్‌తో "నీకు సంగీతమంటే ఇష్టముంటే నా గదికి రా. నీకు వయొలిన్ వాయించి విన్పిస్తాను. ఇక్కడ ఒక గాడిద కిష్టంలేదు" అన్నాడు.

అతని మాటలు విన్న మెక్లాడ్, "వెళ్లకు, అదో పెద్దహింస" అన్నాడు.

"అంత పరుషంగా మాట్లాడతావెందుకూ? కాంబెల్ బానే వాయిస్తాడు" అంది మిస్ ఇట్కిన్.

"ఈ దరిద్రపు జాగాలో రాగాల్లో తేడా తెలిసిన ఒక్క గాడిదా లేదు."

అవహేళనగా నవ్వుకుంటూ మెక్లాడ్ లేచి వెళ్లిపోయాడు. మిస్ ఇట్కిన్ ప్రశాంతపరచేందుకు, "మెక్లాడ్ అన్నదానికి నువ్వేం బాధపడకు" అన్నది.

"అతడి సంగతా? ఎప్పుడో ఒకరోజు ఇంతకింతా చేస్తాను!"

## ప్రపంచ రచయిత్రుల పరిచయాలు

## ఉర్సులా కె.లిగూన్ (1929 - )

"ఆ ద్వీపంలో మరణాన్ని జయించిన వాళ్లుంటారు. నీకు వెళ్లాలనుందా?"

"లేదు"

"వెళ్ళకపోవటమే మంచిది. మరణాన్ని జయించటం చాలా ప్రమాదకరం".

సైన్సు/ఫాంటసీ సాహిత్యానికి కొత్త అర్థాన్నిచ్చిన ఉర్సులా కె.లిగూన్ రాసిన "ది ఐలండ్ ఆఫ్ ఇమ్మోర్టల్స్"లోని సంభాషణ అది.

ఉర్సులా తండ్రి కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం (బర్కిలీ)లో ప్రముఖ ఆంత్రొపాలజీస్టు ఆల్ఫ్రెడ్ లూయీ క్రోబర్. తల్లి థియోడోరా రచయిత్రి (బాలసాహిత్యం). శాస్త్రీయ దృక్పథమూ, సాహిత్యాభినివేశమూ ఉర్సులాకు బాల్యం నుండే అలవడ్డాయి. రాడ్‌క్లిఫ్ కాలేజ్, కొలంబియా యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం ముగించి,

మధ్యయుగాల నాటి యూరోపియన్ సాహిత్యం మీద పరిశోధన చేసింది. 1953లో చరిత్రకారుడు ఛార్ల్స్ లిగూన్‌తో వివాహం. ముగ్గురు పిల్లలు. చిన్నప్పుడు తండ్రి వొళ్లో కూర్చుని, అనేక తెగల గురించీ, వాళ్ల వింత ఆచార వ్యవహారాల గురించీ (ముఖ్యంగా అమెరికన్ ఆదివాసుల జీవిత పద్ధతులు) విన్న కబుర్లూ, తల్లి రాసిన 'అనగనగా' కథలూ తొలిదశలో ఆమెను బాగా ప్రభావితం చేశాయి. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్ ఆమె అధ్యయనం కొనసాగిచటానికి సహాయం చేసింది. రచనలు చేస్తూనే మెర్సర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఐడాహో, పాసిఫిక్, వాషింగ్టన్, పోర్ట్ లాండ్ స్టేట్, రీడింగ్, కాలిఫోర్నియా, టులాన్ విశ్వవిద్యాలయాల్లో బోధించింది.

ఆమె ప్రతి రచనా యించుమించు ఏదో ఒక బహుమతి/ సత్కారానికి ఎంపికైంది. మొత్తం అయిదు హ్యూగో అవార్డులు, గాండాల్ఫ్ అవార్డ్ (1979), నెబ్యులా అవార్డులు-5(ఇవన్నీ సైన్స్ ఫిక్షన్ పుస్తకాలకిచ్చే బహుమతులు), జాకేట్ హైడింగర్, కాఫ్కా బహుమతులు (1986), పుష్కార్ట్ ప్రైజ్ (1991), నేషనల్ బుక్ అవార్డ్ ఆమెను వెదుక్కుంటూ వచ్చాయి.

ఉర్సులా తొలి రచనలు సైన్సు ఫిక్షన్ అభిమానుల్ని మాత్రమే ఆకర్షించినా, తన "ది లెఫ్ట్‌హాండ్ ఆఫ్ డార్క్‌నెస్"తో ఆమె ఆ పరిధిని అధిగమించి సాహిత్య విమర్శకుల మన్ననలు కూడా పొందింది. ఇందులో ఆమె ఒక ఊహాగ్రహం మీద నివసించే "బై సెక్సువల్" మనుషుల గురించి రాస్తుంది. ప్రజలంతా సామాజిక జీవులన్నాడు ఆరిస్టాటిల్. కాని మనం పొరుగువాళ్లను స్త్రీ పురుషులుగా విభజించి చూడగలమే తప్ప 'మనుషులు'గా గుర్తించలేం.

తన సాహిత్యానికి ప్రేరణ టాల్‌స్టాయ్, చెహోవ్, వర్జీనియా వుల్ఫ్ అంటుంది ఉర్సులా. అనేక విలక్షణ రచనలు చేసింది. ఇంకా చేస్తూనే వుంది. "ప్లానెట్

---

ఆ రోజు మధ్యాహ్నమంతా మళ్లీ మళ్లీ అతను ఒకే గీతాన్ని వాయించాడు. కబురు పంపినా కాంబెల్ పట్టించుకోలేదు. ఆ తర్వాత వాళ్లిద్దరూ కలుసుకున్నప్పుడు ఇద్దరి మధ్యా పెద్ద వాగ్యుద్ధమైంది.

ఐవీ బిషప్, టెంపుల్‌టన్, ఓ లండను ఎకౌంటెంట్, హెన్రీ ఛెస్టరు కూర్చునే టేబుల్ దగ్గర ఆషెన్‌డెన్‌ను కూర్చోబెట్టారు. విశాలమైన భుజాలు, దృఢంగా ఉన్నట్టు కనిపిస్తాడు హెన్రీ. అతనికి క్షయవ్యాధి అకస్మాత్తుగా సోకింది, అశనిపాతంలా. అతను సామాన్యగృహస్థు. పెళ్లాం, ఇద్దరు పిల్లలు. ముప్ఫయి నలభైల మధ్య వయసు. తన కుటుంబం, తన వ్యాపారం తప్ప అతనికి వేరే ఆసక్తులేవీ లేవు. తన పనిపట్ల అతనికెంతో ఇష్టం. సుఖంగా బతకటానికి కావలసిన డబ్బు సంపాదించేవాడు. ప్రతియేటా కొంత డబ్బు వెనకేసేవాడు. గోల్ఫ్ ఆడేవాడు. ప్రతి ఆగస్టులోనూ మూడువారాల సెలవు మీద తూర్పు తీరప్రాంతాలకు వెళ్లేవాడు. పిల్లలు పెరిగి పెద్దయ్యాక, వాళ్లకు పెళ్లి చేస్తాడు. కొడుక్కు వ్యాపారం అప్పజెప్పేసి, భార్యతో ఊళ్లో ఉన్న ఇంట్లో విశ్రాంతజీవనం గడుపుతాడు. అతను జీవితం నుంచి అంతకంటే ఎక్కువ ఆశించిందీ లేదు. అతను సగటు పౌరుడు. ఎప్పుడూ డాక్టరును చూసినవాడు కాదు. ఒంట్లో బావుండకపోవటంతో, భార్య పోరు పెట్టాక, అతనికి డాక్టరు దగ్గరకు వెళ్లక తప్పలేదు. అదో పెద్ద షాకు. భయంకరమైన షాకు. అతని రెండు ఊపిరితిత్తులకూ వ్యాధి సోకింది. వెంటనే శానటోరియంలో చేరితే బతికే అవకాశం ఉంది. రెండేళ్లలో నయమై మళ్లీ తన పని తాను చేసుకోవచ్చని చెప్పాడు అప్పుడా స్పెషలిస్టు. రెండేళ్లు గతించాయిగానీ, డాక్టర్ లెన్నాక్స్ మరో ఏడాది దాకా ఆ ఆలోచన పెట్టుకోవద్దని చెప్పాడు. ఉమ్మిలో క్షయజీవుల్ని అతనికి చూపాడు. ఎక్స్-రేలో వ్యాధి ఉన్న ప్రాంతాలు చూపాడు. అతనికి గుండె జారిపోయింది. క్రూరవిధి నిర్దయగా తనతో ఆడుతున్న నాటకమది అని అతని కనిపించింది. తను తాగి తందనాలాడో, జులాయిలాగా ఆడాళ్లతో తిరిగో, రాత్రిపూట నిద్రకాచో ఆరోగ్యం చెడగొట్టుకోలేదు. ఇది తన పట్ల జరిగిన దుర్మార్గం. అతనికి పుస్తకాలన్నా, మరేదన్నా ఆసక్తిలేదు. అందుకే ఎప్పుడూ తన ఆరోగ్యం సంగతే ఆలోచించేవాడు. తన రోగలక్షణాల్ని దిగులుగా పరిశీలించు కునేవాడు. రోజుకో డజను సార్లు టెంపరేచరు చూసుకుంటున్నాడని థర్మామీటరు అతన్నుంచి తీసేసుకున్నారు. తన వ్యాధి విషయంలో డాక్టరు సరైన చికిత్స చేయడంలేదని, డాక్టరు తనకు శ్రద్ధగా చికిత్స చేయటం కోసం టెంపరేచరు భయపెట్టేట్టు పెరిగే అన్ని ప్రయత్నాలు చేసేవాడు. ఫలించనప్పుడు అతను ముఖం ముడుచు కునేవాడు. మాట్లాడితే పోట్లాటకు దిగేవాడు. స్వభావరీత్యా అతను కులాసాగా, స్నేహపూర్వకంగా ఉండే మనిషి, తనను గురించి మరిచిపోయినప్పుడు హాయిగా మాట్లాడేవాడు. ఆనందంగా నవ్వేవాడు. అప్పుడతనికి గుర్తుకు వచ్చేది తను వ్యాధిగ్రస్తుడని. అతని కళ్లల్లో మృత్యుభయం తారట్లాడేది.

ప్రతి నెల చివరా అతని భార్య ఒకటి రెండు రోజులు పక్కనున్న లాడ్జింగ్ హౌస్‌లో దిగేది. రోగులనిలా బంధువులొచ్చి చూడటం ఇష్టంలేని డాక్టర్ లెన్నాక్స్, అది వాళ్లను ఆవేశానికి గురిచేస్తుంది, అస్థిరులను చేస్తుంది అనేవాడు. భార్య రాకకోసం హెన్రీ ఛెస్టర్ ఆత్రుతగా ఎదురుచూడటం గుండె కదలిపోయేట్టుగా ఉండేది. అయితే ఆమె వచ్చాక, ఎదురుచూసినంత ఆనందం అతని కుండేది కాదు. ఛెస్టర్ భార్య మంచి మనిషి. ఆమెను చూస్తే, అనుకూలవతి అయిన భార్య అనీ, ప్రేమించే పిల్లల తల్లి అనీ, పొదుపుగా ఖర్చు పెట్టే ఇల్లాలనీ, ఇతరుల విషయాల్లో జోక్యం కలిగించుకొనని స్త్రీ అనీ మనకు తెలుస్తుంది.. సాధారణగృహస్థజీవితంలో ఆమెకు సంతృప్తి ఉంది. ఎప్పుడో ఓ సినిమాకు వెళ్లటం, లండను సిటీ షాపుల్లో ఎప్పుడో ఓ సారి బట్టలు కొనుక్కోవటం ఆమె జీవితంలో ఆనందం కలిగించిన సంఘటనలు. మార్పులేని యాంత్రికజీవనం అని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. ఆమెకు తన జీవితంపట్ల తృప్తి ఉంది. ఆషెన్‌డెన్‌కు ఆమె అంటే ఇష్టంకలిగింది. ఆమె మురిపంగా తన పిల్లల్ని గురించి చెప్పినప్పుడూ, తన ఇల్లు, పొరుగు వాళ్లు, తను రోజూ చేసే పనుల గురించి చెప్తున్నప్పుడూ అతను ఆసక్తిగా విన్నాడు. అతను ఆమెనోసారి రోడ్డుమీద కలిశాడు. ఇద్దరూ కలిసి రోడ్డుమీద వెళ్లసాగారు. ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకున్నారు కాస్సేపు. అప్పుడామె అకస్మాత్తుగా తన భర్త ఎలా ఉన్నాడని తననుకుంటున్నాడని అడిగింది.

"అతను బాగానే కోలుకుంటున్నాడని నాకనిపిస్తోంది."

ఆఫ్ ఎక్సైల్"(1966),"సిటీ ఆఫ్ ఇల్యూషన్స్"(1967),"ఫోర్‌వేస్ టు ఫర్‌గివ్‌నెస్" (1997), "ది డిస్పొసెస్డ్"(1997)లు ఆమె ఉత్తమ రచనలంటారు.

యువత కోసం రాసిన "ఏ విజర్డ్ ఆఫ్ ఎర్త్‌సీ"(1968), "ది టూంబ్స్ ఆఫ్ అట్వాన్' (1971),"ది ఫార్తెస్ట్ షోర్" (1972)లను కూడా విమర్శకులు ప్రశంసించారు. టావో తాత్వికత బోధించే పరస్పర ఆధారత (ఇన్ భావజాలం) ఆమె రచనల్లో తొంగి చూస్తుంటుంది. కొందరు ఉర్సులా దార్శనికత, జె.ఆర్.ఆర్. టోల్కియన్ రాసిన "ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్" లోని (ఇటీవల సినిమాగా కూడా వచ్చింది) భవిష్యత్ చిత్ర పటానికి దగ్గిరగా వుందన్నారు.

విమర్శలనూ, ప్రశంసలనూ పట్టించుకోని ఉర్సులా తన కథలన్నీ "అతి మౌలిక విషయాల్ని గురించి రాయటానికి చేసిన చిన్న ప్రయత్నాలు మాత్రమే" అంటుంది. సులభంగా కనిపించే విషయాల్లోనే ఆలోచనల్ని తికమకపెట్టే క్లిష్టత వుంటుంది మరి.

"ఆనందానికి అటూ ఇటూ" అన్న తన కథ గురించి రచయిత్రి–

ఇది ఒక సైకోమిత్ (మేథోకల్పన?). దోస్తోవ్‌స్కీ రాసిన 'బ్రదర్స్ కరమజోవ్' (కరమజోవ్ సోదరులు) నవలలో ఎక్కడో వున్నట్టుగా అనిపించింది. హెన్రీ జేమ్స్ కూడా తన 'ది మోరల్ ఫిలాసఫర్ అండ్ ది మోరల్ లైఫ్'లో ఈ విషయం ప్రస్తావిస్తాడు. "మన సమస్యలన్నింటికీ ఓ సాకు కావాలి. అంటే ఒక దిష్టిబొమ్మ. సర్వజనులూ సుఖంగా వుండాలంటే ఏక్కడో ఎవరో ఈ కష్టాలన్నీ తనమీద వేసుకుని భరించక తప్పదు. ఒక అజ్ఞాత, అనామక జీవి అనుభవిస్తున్న దుఃఖమే మన ఆనందానికి కారణం."

ఈనాటి అమెరికన్ చేతనను ఇంతకన్నా బాగా మరెవరూ పట్టుకోలేదు.

తిరుగుబాటుదారుడిగా కనిపించే దోస్తోవ్‌స్కీలో కనిపించని విప్లవభావాలు, అతిసౌమ్యుడైన హెన్రీ జేమ్స్‌లో కనిపిస్తాయి. చరిత్రనూ, సామాజిక శాస్త్రాన్నీ అధ్యయనం చేసి మనం గ్రహించే వాస్తవాలే కథా వస్తువులు. సైన్స్‌ఫిక్షన్ అంటే రేపటి కథ.

అయితే సిద్ధాంతాలను గ్రహించినంత మాత్రాన కథలు తట్టవు. దేనిదారి దానిదే. ఇందులోని వూరిపేరు ఓమేలాస్ (Omelas). ఒకసారి రోడ్డుమీద ప్రయాణిస్తున్నప్పుడు Salem (Oregon) అని కనిపించింది. అది తిరగరాస్తే కథలోని వూరు. సేలం అంటే సలాం. అంటే శాంతి.

"మీకు కథలెక్కణ్ణించి వస్తాయి, ఉర్సులా?"

"సింపిల్. దోస్తోవ్‌స్కీని మరచిపోతూ, సైన్‌బోర్డులను తిరగ చదువుతూ...... ఆలోచిస్తా. మరో పద్ధతేమైనా వుందా? మీరే చెప్పండి"

"నిత్యం తనను తాను ధ్వంసం చేసుకుంటున్న ఈ లోకంలో స్త్రీలు మాత్రమే జీవన ప్రదాతలు" అని నిర్ద్వంద్వంగా ప్రకటించింది ఉర్సులా కె.లిగూన్.

*

"నాకెంతో దిగులుగా ఉంది."

"ఇది మెల్లగా, దీర్ఘకాలం సాగే చికిత్స. ఓర్పుండాలి. అతన్ని గురించి నిజానికి దిగులు పడాల్సిందేం లేదు" అన్నాడు ఆషెన్‌డెన్ మృదువుగా.

ఇంకా కొద్దిదూరం నడిచాక ఆమె ఏడవటం కనిపించిందతనికి. ఆ తర్వాత ఆమె చెప్పసాగింది, "మీకు తెలీదు. నేనిక్కడికి వచ్చినప్పుడు అతనితో వేగలేకపోతున్నాను. ఆ విషయం నేను మీతో మాట్లాడకూడదు నిజానికి. మిమ్మల్ని విశ్వసించి చెప్తాను. అతనంటే నాకెంతో ప్రేమ. అతన్ని నేను ఆరాధిస్తాను. ఈ ప్రపంచంలో అతని కోసం నేను చేయందిలేదు. మేం ఎప్పుడూ పోట్లాడుకుంది లేదు. ఏ ఒక్క విషయం గురించీ భిన్నాభిప్రాయాలు కూడా లేవు. అతనిప్పుడు నన్ను అసహ్యించుకోవడం మొదలెట్టాడు. అది నా గుండె ముక్కలు చేస్తోంది."

"అయ్యో, నాకు నమ్మకం కలగటంలేదు. మీరిక్కడ లేనప్పుడు నిత్యం మీ గురించే చెప్తుంటాడు. అంత కంటే భార్యను గురించి ఎవరూ చెప్పరు. అతనికీ మీరంటే ఆరాధనే."

"అవును, నిజమే. అది నేనిక్కడ లేనప్పుడు! నేనిక్కడికి వచ్చాక, నన్ను ఆరోగ్యంగా, బాగా చూశాకే అతనికి నా పట్ల అసహ్యం కలుగుతుంది. తను జబ్బు పడివుండటం, నేను కులాసాగా ఉండటం అతనికిష్టంలేదు. తను చచ్చిపోతానని అతనికి భయం. నేను బతికుంటానని అతనికి ద్వేషం. ప్రతిక్షణం నేను జాగ్రత్తపడి మాట్లాడాలి. పిల్లల విషయం మాట్లాడినా, మా భవిష్యత్తును గురించి మాట్లాడినా అతనికి చిర్రెత్తుకొస్తుంది. అతను నన్ను గాయపరిచే మాటలు మాట్లాడతాడు. ఇంటి విషయంగానీ, పనివాణ్ని మార్చే విషయంగానీ మాట్లాడినా, తన్నింక లెక్కించదగిన మనిషి కాదని నేనన్నట్లు చిరాకుగా మాట్లాడతాడు. మేం కలిసిమెలిసి బతికాం. ఇప్పుడు మా మధ్య వైరభావన నెలకొనివుంది. అతని లోపంలేదనీ, ఆ జబ్బువల్లే ఇదంతా వచ్చిందనీ తెలుసు, తను చాలా మంచిమనిషి అనీ నాకు తెలుసు. చాలా దయ కలిగిన మనిషి. ఎవర్నీ బాధపెట్టే మనిషికాదు. కానీ, ఇప్పుడు ఇక్కడికి రావటమంటేనే భయమేస్తున్నది. వెళ్లిపోవటం సాంత్వన కలిగిస్తున్నది. నాకే కనుక క్షయవ్యాధి వస్తే అతనంత బాధపడేమనిషి మరొకరుండరు. కానీ నాకు తెలుసు, అతని గుండె లోతుల్లో అతనికి సేదతీరినట్లవుతుందని. నేనూ చచ్చిపోతున్నానని అతననుకుంటే, అతను నన్ను క్షమించగలడు, విధిని క్షమించగలడు. ఒక్కోసారి, తను చనిపోయాక నేనేంచెయ్యాలో చెప్తూ నన్ను రంపపుకోత పెడ్తాడతను. నాకు ఏడుపొచ్చి అలా మాట్లాడొద్దంటే, కొన్ని రోజుల్లో చచ్చిపోయేవాడికి ఆ మాత్రం ఆనందమిస్తేనేం, నువ్వు ఏళ్ల తరబడి హాయిగా బతుకుతావుగా అంటాడు. అయ్యో, ఇన్నేళ్లూ ఒకరి పట్ల ఒకరికున్న మా ప్రేమ ఇంత హైన్యంగా, దైన్యంగా క్షీణించిపోవటం చూస్తే నాకెంతో భయం కలుగుతుంది."

హెన్రీ భార్య రోడ్డుపక్కనున్న ఓ బండ మీద కూర్చుని వెక్కిళ్లు పెట్టి ఏడవసాగింది. ఆషెన్‌డెన్ ఆమె వంక జాలిగా చూశాడు. కానీ ఆమెకు గుండె దిటవునిచ్చే ఒక్క మాటా చెప్పలేకపోయాడు.

"ఓ సిగరెట్టివ్వండి" అందామె చివరకు. "నా కళ్లు ఎర్రగా, వాచివుంటే నేనేడుస్తూన్నానని హెన్రీ అనుకుంటాడు, తన్ను గురించి చెడువార్త విన్నాననుకుంటాడు. మనమంతా మృత్యువంటే అలా భయపడతామా?"

"నాకు తెలీదు" అన్నాడు ఆషెన్‌డెన్.

"మా అమ్మ చనిపోయేప్పుడు ఇంత భయపడినట్లనిపించలేదు నాకు. అది వస్తోందని తెలిసీ, దాన్ని గురించి హాస్యమాడింది. అయితే, ఆమె ముసల్ది!"

హెన్రీ భార్య ఇప్పటికి కొంత దిటవు చేసుకోగలిగింది. మళ్లీ నడవసాగారు. నిశ్శబ్దంగా. "నేను హెన్రీని గురించి చెప్పినందుకు అతను చెడ్డమనిషని మీరనుకోకండి. అతను మంచి భర్త, మంచి తండ్రి. నా జీవితంలో అతనికంటే మంచిమనిషిని నేను చూడలేదు. ఈ రోగం వచ్చేదాకా, ఒక్క పరుషపు మాట అని ఎరగడు, ఒక్క దుర్మార్గ ఆలోచన అతని బుర్రలోకి రాలేదు."

ఈ సంభాషణ ఆషెన్‌డెన్‌ను ఆలోచనల్లో పడేసింది. మానవస్వభావం గురించి అతనికి తక్కువ అభిప్రాయం ఉందని జనం అంటూంటారు. తన చుట్టూ ఉండే మనుషులను గురించి తను మామూలు ప్రమాణాల ప్రకారం తీర్పువ్వకపోవడమే అందుకు కారణం. ఇతరులను విభ్రమంలో ముంచెత్తిన విషయాలను అతను ఓ చిరునవ్వుతోనో, ఓ కన్నీటిబొట్టుతోనో స్వీకరించేవాడు. అలాంటి మామూలు, మంచిమనిషి గుండెలో చెడు ఆలోచనలు ఉన్నాయని

## ప్రపంచ రచయిత్రుల పరిచయాలు

### ఎ.ఎస్.బ్యాట్ (1936 - )

ఆంటోనియా సూజన్ బ్యాట్ యార్క్ షైర్‌లో పుట్టింది. క్వేకర్ స్కూల్, న్యూన్‌హాం కాలేజ్, సామర్‌విల్ కాలేజీల్లో, విద్యాభ్యాసం. లండన్ యూనివర్శిటీలోని కుడ్య చిత్ర విభాగంలోనూ, సెంట్రల్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్‌లోనూ కొంత కాలం బోధించింది. ఇంగ్లిషు సాహిత్య అధ్యాపకురాలిగా మరికొంత కాలం పనిచేసింది. అనేక సాహితీ బహుమతులకు (బుకర్ ప్రైజ్‌తో సహా) న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టైమ్స్‌లిటరరీ సప్లిమెంట్‌లో ఈమె రాసిన విమర్శనా వ్యాసాలకు మంచి పేరొచ్చింది.

తండ్రి మాటకు ఎదురు చెప్పలేని ఒక చిన్నపిల్ల కథ "షాడో ఆఫ్ ఎ సన్" – ఈమె రాసిన తొలి నవల. 1964లో అచ్చయ్యింది. అక్కాచెల్లెళ్ల అనుబంధాన్ని చిత్రించిన నవల "ది గేమ్" 1967లో విమర్శకుల ప్రశంసలు పొందింది. ఒక యార్క్ షైర్ కుటుంబాన్ని గురించి రాసిన నాలుగు పుస్తకాల నవలా మాలిక "ది వర్జిన్ యిన్ ది గార్డెన్"తో 1978 ప్రారంభమైంది. మిగతా మూడు స్టిల్‌లైఫ్, బేబెల్ టవర్ (పెన్/మాక్‌మిలన్ సిల్వర్ పెన్ అవార్డు గెల్చుకుంది), ఎ విజిలింగ్ వుమన్.

బ్యాట్‌కు విశేష ఖ్యాతిని ఆర్జించి పెట్టిన నవల "పొజెషన్" 1990లో బుకర్ ప్రైజ్‌కు ఎంపికైంది.'ఐరిష్ టైమ్స్' పత్రిక ఇంటర్నేషనల్ ఫిక్షన్ ప్రైజ్‌తో సత్కరించింది. సాహిత్య జీవితాన్ని ప్రతిభావంతంగా చిత్రించిన పుస్తకమిది.

"ఏంజిల్స్ అండ్ ఇన్‌సెక్ట్స్" అనే రెండు నవలికలు 1992లో వెలువడ్డాయి. పందొమ్మిదవ శతాబ్ది యింగ్లండులో మృత్యువు –దాని చుట్టూ అల్లుకున్న ఆచారాల గురించి చేసిన అధ్యయనం –"ది కాంజుగల్ ఏంజిల్". అదే కాలానికి

---

ఆశించకపోవటం నిజమే. కానీ, మనిషి ఎలాంటి లోతులకు పతనమవగలడో, ఎలాంటి ఎత్తులకు ఎక్కగలడో ఎవరు చెప్పగలరు? తప్పంతా అతని భావదారిద్ర్యంలో ఉంది. హెన్రీ ఛెస్టర్ అతిసాధారణ, సగటు జీవితం గడపటానికి పుట్టి పెరిగాడు. బతుకులో వచ్చే మామూలు ప్రత్యయాల నెదుర్కున్నాడు. కానీ, ఈ ఊహించని దుర్ఘటనను ఎదుర్కునే మార్గాలేవీ అతనికి తెలీవు. భవనపు వెయ్యి ఇటుకల్లో తను ఒక ఇటుక. కానీ, అందులో లోపంవల్ల పనికిరాని ఇటుకైపోయాడు. తనూ చెయ్యగలిగిందేం లేదని తన దౌర్భాగ్యంతో రాజీపడి పోగలిగే భావన అతను చేయలేకపోయాడు. అందరూ కలల్లోనో, ఆలోచనల్లోనో ఓదార్పు పొందలేరు. ఈ సాధారణజనం ఆశను కల్పించే భగవంతుడిలో విశ్వాసం కోల్పోవటమే ఈ కాలపు జీవితంలోని విషాదం! ఆ జాగాలో మరొకటి పాదుకొల్ప లేకపోవటమే విషాదం.

కష్టాలు మనుషుల్ని పునీతం చేస్తాయనే మనుషులున్నారు. అది నిజం కాదు. సాధారణంగా అవి మనుషుల్ని అల్పులుగా, దెబ్బలాడే మనుషులుగా, స్వార్థపరులుగా తయారుచేస్తాయి. క్షయవ్యాధి కొన్ని దశల్లో, మనిషిని ఆవేశపూరితుణ్ని చేస్తుంది. రోగి చురుగ్గా ఉన్నా, అంతశ్చేతనలో మృత్యుభావన అతన్ని వెన్నాడుతూనే ఉంటుంది.

ఆషెన్‌డెన్ శానటోరియంలో చేరిన కొద్ది కాలానికి ఓ ఇరవై యేళ్ల యువకుడు అక్కడికి వచ్చాడు. నేవీలో – సబ్‌మెరైన్‌లో సబ్-లెఫ్టినెంట్‌గా పనిచేసిన మనిషి. అతనిది మహాదూకుడు క్షయవ్యాధి. అతను పొడుగాటి మనిషి. చూపరి. రింగులజుట్టు. నీలికళ్లు, పెదాల మీద తియ్యటి చిరునవ్వు. అతను టెర్రస్‌మీద ఎండలో పడుకుని ఉండగా రెండుమూడుసార్లు ఆషెన్‌డెన్ చూశాడు. ఓ రోజు అతనితో మాట్లాడాడు కూడా. అతను కులాసా యువకుడు. సంగీతం, పాటలు, సినిమాతారల గురించీ అతను మాట్లాడాడు. ఫుట్‌బాల్ ఫలితాల కోసం, బాక్సింగ్ వార్తల కోసం పేపర్లుచదివేవాడు. ఆ తర్వాత అతన్ని పక్కమీద నుంచి లేవనివ్వలేదు వాళ్లు. ఇంక ఆషెన్‌డెన్ అతన్ని చూడలేదు. బంధువుల్ని పిలిపించారు. రెండు నెలల్లో అతను చనిపోయాడు. పశువుకు తెలిసినట్లు తనకేమవుతుందో అతనికి తెలీదు. జైల్లో ఓ ఖైదీని ఉరితీస్తే ఏర్పడే వాతావరణమే ఒకటి రెండురోజులు శానటోరియంలో నెలకొంది.

విశ్వజనీనమైన అంగీకారంలా, ఆత్మరక్షణ సహజాతానికి విధేయంగా ఆ యువకుడిని మనసు నుంచి తుడిచేశారు జనం. జీవితం ఎప్పటిలాగనే కొనసాగింది, కాంబెల్, మెక్లాడ్‌కు విసుగు పుట్టించే ఫిడేలు సాధన కొనసాగించాడు. బ్రిడ్జి ఆటలో తన ప్రావీణ్యం, ఇతరుల ఆరోగ్యం – వీటి గురించిన ముచ్చట్లను మెక్లాడ్ కొనసాగించాడు. మిస్ ఏట్కిన్ చాడీలు చెప్పటం మానలేదు. తన పట్ల డాక్టర్లు సరిగ్గా శ్రద్ధ చూపటంలేదని హెన్రీ ఛెస్టర్ ఫిర్యాదు చేశాడు. తనంతటి చక్కటి జీవితం గడిపాక కూడా విధి తన్ను వంచించిందని తిట్టాడు. ఆషెన్‌డెన్ తన చదువు కొనసాగించాడు. తన తోటి మనుషుల చిత్తచాంచల్యాన్ని వేడుగ్గా సహనంతో వీక్షించాడు.

నలభైయ్యేళ్లు దాటిన మేజర్ టెంపుల్‌టన్‌తో అతనికి సాన్నిహిత్యం పెరిగింది. అతను గ్రెనడియర్ గార్డ్స్‌లో పనిచేశాడు. యుద్ధం అయ్యాక పదవీ విరమణ చేశాడు. డబ్బున్న మనిషి. జీవితాన్నుంచి సుఖాన్ని పిండుకోసాగాడు- రేసింగ్ సీజన్లో రేసులాడాడు. షూటింగ్ సీజనులో షూటింగ్ చేశాడు. హంటింగ్ సీజనులో వేటాడాడు. అవయ్యాక మాంట్ కార్లోకు వెళ్లాడు; జూదంలో ఎంతో డబ్బు పోగొట్టుకున్నాడు. అతనికి అమ్మాయిలంటే ఇష్టం. అతని కథనం ప్రకారం, వాళ్లకీ అతనంటే ఇష్టం. అతనికి మంచి ఆహారం, చక్కటి డ్రింకు అంటే ఇష్టం. అరడజను క్లబ్బుల్లో అతను సభ్యుడు. అలా వ్యర్థంగా, ప్రయోజనరహిత స్వార్థపరజీవితం సంవత్సరాలు గడిపాడు. భవిష్యత్తులో బతక అసాధ్యమైన జీవితం గడిపాడు. ఎలాంటి సందేహాలూ లేకుండా జీవితాన్ని ఎంజాయ్ చేశాడు. మళ్లీ తన పూర్వజీవితం తనకు లభిస్తే ఆ పనే చేస్తానని అతను ఆషెన్‌డెన్‌కు చెప్పాడు. అతను చక్కగా మాట్లాడతాడు. ఆకట్టుకుంటాడు. ఆనందంగా, వ్యంగ్యంగా మాట్లాడతాడు. విషయాలను గురించి పైపైన తెలుసు. వాటిని గురించే కులాసాగా మాట్లాడతాడు. శానటోరియంలోని వృద్ధకన్యలను నవ్విస్తూ కబుర్లు, ముఖం ముడుచుకునే ముసలాళ్లతో హాస్యం చేసేవాడు. బాగా డబ్బుండి, దాన్ని ఏంచేయాలో, తెలియని జనప్రపంచంలోకి ఎలా ప్రవేశించాలో అతనికి తెలుసు. అతను బెట్లు కడతాడు; స్నేహితులకు సాయంచేస్తాడు; దొంగవెధవని తెలిసీ ఓ పది ఇస్తాడు. అతను ప్రపంచానికి పూర్తిగా మంచి చెయ్యకపోయినా కీడూ చెయ్యలేదు. గొప్పవాడు కాదు. శీలవంతులు, ప్రశంసాపాత్రులు అయిన అనేకుల కంటే మంచి స్నేహితుడు. అతనికి వ్యాధి ముదిరింది. తను చనిపోతున్నాడన్న సంగతి తెలుసతనికి. మిగతా వాటిని ఎలా నవ్వుతూ స్వీకరించాడో, దీన్నీ అలాగే అంగీకరించాడు. క్షయవ్యాధి రావటం దురదృష్టం. పోనీ, వస్తే వచ్చింది. ఎవడూ అనంతంగా బతకలేడుగా! తను యుద్ధంలోనూ పోయుండొచ్చు. ఓడిపోయే పందెం వేశాం. డబ్బు చెల్లించు, మరిచిపో దాని సంగతి. అదీ అతని జీవితసూత్రం. నడుస్తున్నంతసేపూ అది మంచిపార్టీనే. కానీ ఏ పార్టీ అయినా ముగింపులోకి రావాల్సిందే. పార్టీ నుంచి మర్నాడు పొద్దున్నైనా హాయిగా ఇంటికి వెళ్లొచ్చు. లేదూ పార్టీ జరుగుతున్నప్పుడే వెళ్లిపోవచ్చు.

శానటోరియంలో ఉన్న జనమందరిలోకీ నైతికదృష్టిలో అతను కనిష్ఠుడు. కానీ అనివార్యమైన దానికోసం శోకించనివారిలో గరిష్ఠుడతను. అతను మృత్యువునే ఎదిరించాడు.

అతను శానటోరియానికి వచ్చినప్పుడు, తనంతగా ప్రేమలో కూరుకు

చెందిన ఒక ప్రకృతి శాస్త్రజ్ఞుడి గురించి రాసిన నవల "మార్ఫో యూజెనియా"ను తరువాత సినిమాగా తీశారు. మరో నవల "ది బయాగ్రాఫర్స్ టేల్" 2000లో వెలువడింది.

పాఠకులు బాగా యిష్టపడ్డ ఆమె కథా సంకలనాలు: "షుగర్ అండ్ అదర్ స్టోరీస్' (1987), మాటిస్ స్టోరీస్ (1993), (ప్రముఖ ఫ్రెంచి చిత్రకారుడు మాటిస్ చిత్రాల ప్రేరణతో రాసిన కథలు) "జిన్ అండ్ ది నైటింగేల్స్-స్టోరీస్ ఆఫ్ ఫైర్ అండ్ ఐస్ (1998) .

ఐరిస్ మర్డోక్ రచనల మీద రెండు పరిశోధనా గ్రంథాలు ప్రచురించింది బ్యాట్. ఇంగ్లిష్ కవులు వర్డ్స్‌వర్త్, కోలరిడ్జ్‌ల మీద కూడా అధ్యయనం చేసింది. చిత్రకళలో ప్రావీణ్యం వున్న బ్యాట్, ఎమిల్‌జోలా, మార్సెల్ ప్రూ, స్ఐరిస్ మర్డోక్‌ల నవలల్లో చిత్రాల ప్రాధాన్యాన్ని గురించి "పోర్ట్రెయిట్స్ యిన్ ఫిక్షన్" అనే పుస్తకం రాసి 2001లో ప్రచురించింది.

రచయితలు రచయితల్ని సృష్టిస్తే వాళ్లే కథలు రాసుకుంటారు.

"కథా కథన నైపుణ్యానికి పరాకాష్ఠ బ్యాట్ రచనలు" అంటారు విమర్శకులు. సరదాగా చదువుకుందామనుకునే వాళ్లకు ఆమె కొరుకుడు పడకపోవచ్చు. కాని కొంత కృషిచేస్తే కలిగే పఠనానందం అపూర్వమైనది.

"భాషంటే నాకు ప్రాణం. దానితో ఆడుకోవాలనిపిస్తుంది. సముద్ర తీరంలో వుండే సన్నటి యినకలాంటి పదాలతో కట్టే మట్టిగూళ్లు నవలలు. రచయితలందరూ స్వభావ రీత్యా ఏకాకులే. రచన ఒక ఏకాంత క్రీడ. కొందరికి సెక్సు, తిండి అంటే యిష్టమున్నట్టే నాకు ఆలోచనలంటే ఇష్టం. నారికేళ పాకం నాకిష్టమని కాదు. కాని ఏం చెయ్యను? మరోలా రాయలేను." అంటుంది ఎ.ఎస్.బ్యాట్.

*

---

పోతాడని ఊహించలేదు. అతనంతకు ముందు ఎందర్నో ప్రేమించాడు. కాని అవన్నీ పైపై ప్రేమలే. కోరస్ అమ్మాయిల కాసుప్రేమలోనూ, పార్టీల్లో గాలంలోపడే తేలిక స్త్రీలతోనూ అతను సంతృప్తిపడ్డాడు. తన స్వాతంత్ర్యాన్ని హరించే బంధనాల్లో ఇరుక్కోకుండా జాగ్రత్తపడ్డాడు. సెక్సుకు సంబంధించి వీలైనంత ఆనందాన్ని జుర్రుకోవడమే అతని జీవితలక్ష్యం. అనంతవైవిధ్యంలో అతనికి అనుకూలతే కనిపించింది కానీ అసౌలభ్యం అనిపించలేదు. కానీ, అతనికి స్త్రీలంటే ఇష్టం. ముసలివాళ్లతో మాట్లాడినా అతని గొంతులో మార్దవం, ప్రేమ ధ్వనిస్తాయి. వాళ్లను సంతోషపెట్టడానికి ఏం చెయ్యటానికైనా అతను వెనుకాడడు. అతను ఆషెన్‌డెన్‌తో ఓసారి చెప్పిన మాటల్లో అతని మనఃప్రవృత్తి గోచరించింది. "మీరుకోరుకున్న ఆడది మాటల్లో పడుతుంది. గట్టి ప్రయత్నం చెయ్యాలి అంతే. అయితే, ఓసారి మీ చేతిలో పడ్డాక, స్త్రీల పట్ల నిజంగా సానుభూతి వున్న మనిషి మాత్రమే, అవమానపరచకుండా ఆమెను వదిలించు కోగలడు. మిగతావాళ్ల కది కష్టం!"

అతను అలవాటు చొప్పున ఐవీ బిషప్‌ను ప్రేమించసాగాడు. శాన టోరియంలో అందరి కంటే చిన్నదీ, అందమైనదీ కూడా ఆమె. మొదట్లో ఆషెన్‌డెన్ అనుకున్నంత చిన్నది కాదు. ఆమె వయసు ఇరవై తొమ్మిది, కిందటి ఎనిమిదేళ్ల నుంచి ఒక శానటోరియం నుంచి మరో శానటోరియానికి తిరుగు తున్నదామె. స్విట్జర్లండు, ఇంగ్లాండు, స్కాట్‌లాండుల్లో అన్ని శానటోరియాలూ చూసింది. ఇరవై ఏళ్ల వయసు కంటే ఎక్కువ వున్నదానిలా కనిపించదు. తను ప్రపంచాన్ని గురించి తెలుసుకున్నదంతా ఈ శానటోరియంలోనే. అందుకే ఆమెలో మహా అమాయకత్వం, మహానాగరికతా కలిసి ద్యోతకమవుతూ ఉంటాయి. రకరకాల దేశస్థులు ఆమె ప్రేమలో పడ్డారు. ఆత్మనిగ్రహంతోనూ, సరదాగానూ ఆమె వాళ్ల ప్రేమ నంగీకరించింది. అయితే, వాళ్లు మరీ దూరంగా పోకుండా ఆమె జాగ్రత్తపడేది, పూలబాలలాగా వున్నా, సమయ మొచ్చినప్పుడు తన మాటల్ని ఎంత స్పష్టంగా, కచ్చితంగా చెప్పాలో చెప్పగలిగే వ్యక్తిత్వం ఆమెలో ఉంది. జార్జి టెంపుల్‌టన్‌తో సరాగానికి ఆమె సిద్ధపడే వుంది. అది ఆట అని ఆమెకు తెలుసు. అతనిపట్ల సొగసులు కురిపించకపోలేదు. అయితే, తనాతన్ని పూర్తిగా అంచనావేసిందనీ, అతని లాగా తనూ ఈ భాగోతాన్ని మనసుకు పట్టించుకోదనీ సరాగపుమాటలలో చెప్పకనే చెప్పింది. టెంపుల్‌టన్ సాయంత్రం ఆరుగంటలకల్లా పడక చేరేవాడు. తనగదిలోనే భోజనం చేసేవాడు. అందువల్ల అతను పగటిపూటే ఐవీని చూడటం సాధ్యపడేది. ఇద్దరూ కలిసి నడచివెళ్లే వాళ్లు. ఎప్పుడోకానీ, ఒంటరిగా ఉండేవాళ్లు కాదు. లంచ్ సమయంలో నలుగురూ- ఐవీ, టెంపుల్‌టన్, హెన్రీ ఛెస్టర్, ఆషెన్‌డెన్- ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకునేవారు. టెంపుల్‌టన్ ఆహ్లాదంగా ఆకట్టుకునేట్టు కబుర్లుచెప్పే వాడు. ఇప్పుడు అతను ఐవీతో సరసాలస్థాయి దాటినట్టు ఆషెన్‌డెన్‌కు అనిపించింది. అతని ప్రేమలో నిజాయితీ, గాఢతా కనిపించసాగాయి. ఆ విషయం అతను చెప్పలేకపోయాడు. ఆమె అది గుర్తించిందో లేదో, అందులో ఆమెకి స్వారస్యం కనిపించిందో లేదో, సందర్భోచితంగా అతను సన్నిహితత్వాన్ని, తెల్పే మాట ఏదో అనేప్పటికి, ఆమె అందరికీ నవ్వొచ్చేట్టుగా దాన్ని వ్యంగ్యంతో తేల్చిపారేసేది. తన్నామె ప్లే బాయ్‌గా పరిగణించటం అతనికి తృప్తి కలిగించలేదు. ఐవీతో పరిచయం పెరిగినకొద్దీ ఆమె అంటే అతనికిష్టం కూడా పెరగసాగింది. ఆమె రుగ్మతాగ్రస్తశరీరంలో విషాదసౌందర్యమేదో ఉంది: అందమైన పారదర్శకచర్మం, సన్నని ముఖంలో వెలిగే పెద్ద నీలికళ్లు, ఆమె పరిస్థితిలోనూ విషాదం ఉంది. చాలామందిలాగే ఆమె కూడా ప్రపంచంలో ఒంటరిది. ఆమె తల్లికి తీరుబాటులేని సాంఘిక జీవనం, అక్కాచెల్లెళ్లకు పెళ్లిళ్లయ్యాయి. తమనుంచి ఎనిమిదేళ్ల క్రితం విడిపోయిన ఐవీ పట్ల వాళ్లకంత ఆసక్తిలేదు. వాళ్లు ఉత్తరాలు రాస్తారు. అప్పుడప్పుడు వచ్చి చూస్తారు. అయితే, వాళ్ల మధ్య మిగిలిందేదీ లేదు. కోపం, ద్వేషం లేకుండానే ఆమె ఆ పరిస్థితిని స్వీకరించింది. అందరితో స్నేహంగా ఉండేది. ఎవరు తమ బాధలు చెప్పుకున్నా ఓపిగ్గా, సానుభూతితో వినేది. తన ప్రవర్తనకు భిన్నంగా హెన్రీ ఛెస్టర్‌తో మెలిగేది. అతన్ని ఉల్లాసపర చటానికి ప్రయత్నించేది.

"ఛెస్టర్, సెలాఖరు- మీ భార్య మిమ్మల్ని చూడటానికి రేపు వస్తుంది. ఆమె రాక మీకానందం కలిగిస్తుంది" అందామె ఓసారి లంచ్ చేసేటప్పుడు.

"లేదు, ఈ నెల ఆమె రావటంలేదు" అన్నాడతను మెల్లగా.

"అయ్యో! ఎందుకనీ? పిల్లలు బాగున్నారా?"

"ఆమె రాకపోతేనే నాకు మంచిదని డాక్టర్ లెన్నాక్స్ అనుకున్నాడు."

అందరూ నిశ్శబ్దమైపోయారు. ఐవీ అతని వంక బాధగా చూసింది.

"దురదృష్టం! డాక్టర్ లెన్నాక్స్‌కు చెప్పకపోయావా, ఆమె రావటం, రాకపోవటం నీకనవసరమని!" అన్నాడు టెంపుల్‌టన్ తన మామూలు కులాసా ధోరణిలో.

"ఈ విషయాలు మనకంటే అతనికి బాగా తెలుసు" అన్నాడు హెన్రీ.

అతనివంక మరోసారి చూసి ఐవీ మరో విషయంవైపు దృష్టి మళ్లించింది.

వెనక్కి తిరిగి చూస్తే, ఆమె సత్యాన్ని గమనించిందని అర్థంచేసుకున్నాడు ఆషెన్‌డెన్. అతను మర్నాడు హెన్రీతో మాట్లాడాడు. "మీ భార్య రాకపోవటం నాకు విచారంగా ఉంది. అది మీకెంతో కష్టం కలిగిస్తుంది" అన్నాడతను.

"అవును, చాలా" అన్నాడు, పక్కచూపులు చూశాడు. అతను ఏదో చెప్పాలనుకుంటున్నాడు. కానీ చెప్పుకోలేకపోతున్నాడని అర్థమైంది ఆషెన్‌డెన్‌కి.

"ఆమె రాకపోవటం నా తప్పే! ఆమెను రావొద్దని లెన్నాక్స్‌కి చెప్పి నేనే

రాయించాను. ఆమె రాకకోసం నెలంతా ఎదురుచూసి, వచ్చాక ఆమెను ద్వేషిస్తాను. ఈ దరిద్రపు జబ్బంటే నాకు కోపం. ఆమె బలంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఆమె కళ్లల్లో బాధ చూసినప్పుడు నాకు పిచ్చెక్కుతుంది. నిజానికి నాకు జబ్బు చేస్తే ఆమెకేం? వాళ్లు బాధను నటిస్తారు. జబ్బొచ్చింది నీకుగాని, వాళ్లకు కాదని సంతోషపడతారు. నేనొట్టి పందివెధవని కదూ?"

ఆమె బండమీదకూర్చుని ఏడ్చిన దృశ్యం ఆషెన్‌డెన్‌కు గుర్తుకొచ్చింది.

"రానివ్వకపోవటంవల్ల ఆమెకు బాధ కలుగుతుందని మీకు తెలీదా?"

"తప్పదు, భరించాలి. నాకున్న దుఃఖం చాలు, ఆమె బాధను కూడా ఎక్కడ పట్టించుకునేది?" ఆషెన్‌డెన్‌కు ఏం చేప్పాలో తెలియలేదు. మౌనంగా ఉండిపోయాడు. అమాంతం చిరాగ్గా హెన్రీ అన్నాడు – "మీరు బతికివుంటారు కనుక, అనాసక్తంగా, నిస్వార్థంగా ఉండటం మీకు బాగానే ఉంటుంది. కానీ, నేను చావబోతున్నాను. చావటం నాకిష్టంలేదు. ఎందుకు చావాలి? న్యాయం కాదు." కాలం గడిచింది. శానటోరియం లాంటి జాగాలో విషయాలు దాగవు. జార్జి టెంపుల్‌టన్ ఐవీ బిషప్‌ను ప్రేమిస్తున్నాడని అందరికీ తెలిసిపోయింది. అయితే, ఆమె భావాలేంటో ఎవరికీ తెలీదు. అతను పక్కనుండటం ఆమెకిష్టమే. కానీ అందుకోసం ఆరాటపడలేదామె. ఆపైన అతనితో ఒంటరిగా ఉండకుండా ముసలి స్త్రీలు ఆమె మనసులో మాట రాబట్ట ప్రయత్నించారు. తెలివిగల ఆమె వాళ్ల కంతుచిక్కలేదు. వాళ్ల సూచనలను నిర్లక్ష్యం చేసింది. సీదా ప్రశ్నలు వేసినప్పటికీ నమ్మనట్టు నవ్వేసింది. దాంతో వాళ్లకు విసుగుపుట్టేసింది. "తనంటే అతనికి పిచ్చని గమనించనంత మూర్ఖురాలు కాదు అది."

"అలా అతనిపట్ల ప్రవర్తించే హక్కు దానికి లేదు."

"అతనిలాగే, అదీ అతని ప్రేమలో పడ్డదని నా నమ్మకం."

"డాక్టర్ లెన్నాక్స్ ఈ సంగతి దాని తల్లికి తెలియజెప్పాలి."

మెక్లాడ్‌కు వచ్చినంత కోపం మరెవరికీ రాలేదు. "అర్థంపర్థం లేదు. వాడు క్షయతో తీసుకుంటున్నాడు. ఆ పిల్లా అదే పరిస్థితిలో వుంది! ఇదేం పని?" కాంబెల్ అన్నాడు వ్యంగ్యంగా. "ఉన్న సమయంలో సరదాగా బతకనీండి. ఏదో భాగోతం నడుస్తూందని తెల్సు కానీ, నేను వాళ్లను తప్పు పట్టను." "వాళ్లను గురించి నువ్వలాగే మాట్లాడతావు" అన్నాడు మెక్లాడ్.

"మాట్లాడకు. తనకేం రాని పక్షంలో, అలాంటి అమ్మాయితో అలా ప్రవర్తించే మనిషి కాదు టెంపుల్‌టన్. ఆమె కూడా అమాయకురాలేం కాదు!"

ఇద్దరినీ దగ్గరగా గమనించిన ఆషెన్‌డెన్‌కు అందరికంటే బాగా తెలుసు. చివరకు టెంపుల్‌టన్ అతనికి తన మనసులోని మాట చెప్పాడు. తన పరిస్థితికి తనకే నవ్వు వచ్చిందతనికి. "ఇప్పుడు ఈ జీవితంలో ఓ మంచి అమ్మాయితో ప్రేమలో పడటం విచిత్రం! నేనెప్పుడూ ఊహించనిది. గొంతు లోతున కూరుకుపోయి ఉన్నాను. రేపామెను నన్ను పెళ్లి చేసుకోమని అడుగుతాను. మంచి అమ్మాయిలు వట్టి బోర్ అని నేనెప్పుడూ అనుకుంటుండేవాడిని. ఆమె బోర్ కాదు. ఆ పైన మహాతెలివిగలది, అందమైంది కూడా. అమ్మో! ఎలాంటి చర్మం! ఆ జట్టు! కానీ, ఇవి కాదు... నన్ను ప్రేమలో పడేసింది. మీకు తెలుసా అదేమిటో? తెలిస్తే నవ్వుతారు. నేనొట్టి లఫూట్ వెధవని. ఆమెలోని పవిత్రత, శీలం! అవీ నన్నాకర్షించింది. నాకు నవ్వు వస్తోంది. స్త్రీలలో అవి దుర్లభమని నేనెప్పుడూ అనుకుంటాను. వాటికోసం చూడను.కానీ, అవి ఆమెలో ఉన్నాయి. వాటి నుంచి నేను తప్పించుకోలేను. ఆమె పవిత్రత ముందు నేను పురుగులా ఉన్నాను. మీకు ఆశ్చర్యంగా ఉందా, ఇదంతా?"

"ఏ మాత్రం లేదు" అన్నాడు ఆషెన్‌డెన్. "అమాయకత్వానికి చిక్కిన మొదటి తప్పుడు మనిషివి నువ్వే కాదు, మధ్యవయస్కుల్లో ఉండే భావుకత్వం మాత్రమే అది.""నువ్వొట్టి దుర్మార్గుడివి!" నవ్వాడు టెంపుల్‌టన్.

**పిల్లలు మాతృ భాషతో పాటు పొరుగు భాషలను నేర్చుకోవాల్నే గానీ ద్వేషించగూడదు.**

"అందుకామె ఏంచెప్పింది?"

"అమ్మో, నేనామెకు చెప్పాననుకున్నావా? ఇంత మటుకు మిగతా వాళ్లకు చెప్పనిదేమీ ఆమెకు చెప్పలేదు. నేను ఆరునెలల్లో చనిపోవచ్చు. ఆపైన నాలాంటివాడు అలాంటి పిల్లకు ఇవ్వగలిగిందేముంది?"

ఇప్పుడు ఆషెన్‌డెన్‌కు పూర్తిగా నమ్మకం కుదిరిపోయింది. అతనిలాగానే ఆమె కూడా అతని ప్రేమలో పడిపోయిందని. డైనింగ్ రూంలోకి అతను వచ్చినప్పుడు ఆమె బుగ్గలు ఎర్రబడటం ఆషెన్‌డెన్ గమనించాడు. ఆమె అతనివంక మృదువుగా, ప్రేమగా చూడటంకూడా చూశాడు. తన పాత అనుభవాల్ని గురించి అతను చెప్తున్నప్పుడు విరిసే ఆమె చిరునవ్వులో ఏదో ప్రత్యేకమధురిమ ఉంది. పైన టెర్రస్‌మీద చలికి పేషెంట్లు ఎండలో కూర్చున్నట్లు, ఆమె అతని ప్రేమలో స్నాత అయింది. అంతటితో ఆ విషయాన్ని వదిలేసిందామె. అతనికి తెలియకూడదని ఆమె బహుశః అనుకుంటూంటే అతనికి తెలియజెప్పటమూ తన పనికాదని ఆషెన్‌డెన్ అనుకున్నాడు.

అప్పుడు సంఘటనొకటి జరిగింది. మెక్లాడ్, కాంబెల్ కల్సి బ్రిడ్జిఆడేవారు. టెంపుల్‌టన్ వచ్చిందాకా శానటోరియంలో అలాంటి మంచి ఆటగాళ్లు మరెవరూలేరు. ఒకళ్లనొకళ్లు తిట్టుకునేవాళ్లు. ఆటయ్యాక అంతులేని విమర్శలు చేసుకునేవాళ్లు. అన్నేళ్లు ఆడాక ఒకళ్ల ఆట మరొకళ్లకి పూర్తిగా తెలిసిపోయింది. ఒకళ్లనొకళ్లు మించాలని ప్రయత్నించే వాళ్లు. టెంపుల్‌టన్ మంచి ఆటగాడైనా, వాళ్లతో జట్టుగా ఆడటానికి ఇష్టపడలేదు. ఐవీతో జట్టుకట్టి ఆడటమే అతని కిష్టం. ఆమె ఆట చెడగొడుతుందని మెక్లాడ్, కాంబెల్ ఇద్దరూ అంగీకరించారు. అందుకే ఆమెతో జట్టుకట్టటం వాళ్లకిష్టంలేదు. పొరపాటుచేసి ఆటఓడిపోయాక ఆమె నవ్వి, "ఏం లేదు, చిన్నపొరపాటు, అదే తేడా!" అనేది. ఆ రోజు ఆమెకు తలనొప్పి; ఆటకు రాలేదు. ఆమెకుబదులు ఆషెన్‌డెన్‌ను వేసుకున్నారు. మెక్లాడ్ భాగస్వామి టెంపుల్‌టన్. కాంబెల్ భాగస్వామి ఆషెన్‌డెన్. ఆట జోరుగా సాగింది. మెక్లాడ్, కాంబెల్ అవతలివాళ్లు గెలవకూడదన్న పట్టుదలతో ఆడారు. మధ్యలో ఇద్దరి మధ్యా వాగ్వివాదా లయ్యాయి. సాయంత్రం ఐదున్నర అయింది. చివరి రబ్బరు మొదలైంది. ఆరింటికల్లా విశ్రాంతి గంట మోగుతుంది. గంట మోగగానే విశ్రాంతి తీసుకోవాలి. ఆట మహాపట్టుగా సాగింది. జనం టేబుల్ చుట్టూ మూగారు. అందరికీ ఉత్కంఠ పెరిగింది. ఆవేశంలో మెక్లాడ్ ముఖం పాలిపోయింది. నుదుట చెమట పట్టింది. చేతులు వణికాయి. కాంబెల్ ముఖం గంభీరమైపోయింది. ఆత్రైపోయింది. మెక్లాడ్ గెల్చాడు. జనం చప్పట్లు చరిచి ప్రశంసించారు. విజయగర్వంతో మెక్లాడ్ ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. పిడికిలి బిగించి ఊపాడు కాంబెల్ నుద్దేశించి. "ఇంక వాయించు నీ దరిద్రపు గొట్టు ఫిడేలు మీద!" అనరిచాడు. "గ్రాండ్ శ్లాం, డబులూ, రీడబులూ, నా జీవితమంతా అది గెలవాలనే అనుకున్నాను. చివరికి విజయం సాధించాను. దేవుడా, దేవుడా!"అతను ఊపిరందక ఆయాసపడ్డాడు. తూలి, టేబుల్‌మీద పడిపోయాడు. నోటి నుంచి రక్తం బయటికి ప్రవహించింది. డాక్టరు కోసం కబురంపారు. అటెండెంట్లు వచ్చారు. అతను చనిపోయాడు.

రెండురోజుల తర్వాత అతన్ని ఖననం చేశారు. రోగుల మనసు చెదిరి పోకుండా ఆ రోజు పొద్దున్నే శవపేటికను తీసుకెళ్లారు. అంత్యక్రియలకు అతని బంధువు గ్లాస్‌గో నుంచి వచ్చాడు. అతనంటే ఎవరికీ ఇష్టంలేదు. ఎవరూ విచారించనూ లేదు

# ఒక మాంసం ముక్క

## జాక్ లండన్ (1876-1916)

అనువాదం: కాకాని చక్రపాణి



జాక్ (జాన్ గ్రిఫిత్) లండన్ 1876 జనవరి 12న అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జన్మించాడు, నలభై యేండ్ల వయసులో 1916 నవంబరు 22న మరణించాడు. అతడు పేరొందిన అమెరికా కల్పనా, పత్రికా రచయిత, సామాజిక కార్యకర్త. వ్యాపార పత్రికలలో కల్పనా సాహిత్యానికి పెద్ద పీట వేసిన రచయిత. అతడు తన కథలు, నవలల రచన వల్ల ప్రపంచ ప్రఖ్యాతి పొందటమేకాక, అపార ధనంకూడ గడించాడు. నిజానికతను రచనను ఒక వ్యాపారంగానూ, తన పేదరికాన్ని బాపేదిగానూ భావిం చాడు. అతడికి ఎంతో పేరు తెచ్చిన నవలలు *Call of the wild* (1902), *White Fang* (1906). ఇవి తెలుగులోకి కూడ అనువదితమయ్యాయి. *A Daughter of Snows* (1902), *Sea Wolf* (1904), *Iron Hell* (1908) కూడా పేర్కొనవల్సిన నవలలే. *Theft* అన్న నాటకం కూడ రాశాడు. అతని రచనల్లోని గొప్పదనం, అతడు పాఠకుడిని ఒక అసహజ పరిస్థితికి పరిచయం చేస్తూకూడా, సంఘటనలు సహజమనిపించేంతవిగా ఉండటం. కథల్లో రాబోయే సంఘటనకు అతడు పాఠకుడిని సిద్ధం చేస్తాడు. ఆ లక్షణం ప్రస్తుత కథలోకూడా వ్యక్తమవుతుంది. మనని అతని కథ చదువడానికి సిద్ధం చేశాక, అతడు ఏ అసంబద్ధ కథ చెప్పినా మనం విశ్వసిస్తాం. కార్మిక ఉద్యమ, సామ్యవాద ప్రగతి వాంఛించిన వాడతను. కార్మికుల హక్కుల కోసం అతడెంతో కృషి చేశాడు. అతడు నాస్తికవాది కూడ.

ఇరవై ఒక్కేళ్ల వయసులో, తన బావగారితో కల్సి అతడు క్లోండిక్ గోల్డ్ రష్‌లో పాల్గొన్నాడు. అతని ఆ ప్రయాణం అతని ఎన్నో కథలకు నేపథ్యాన్ని చేకూర్చింది కానీ, అతని ఆరోగ్యాన్ని పాడు చేసింది. లండన్‌లో తన అతి తాగుడు కారణంగానూ, స్త్రీ వ్యసనం కారణంగానూ ఆత్మహత్య చేసుకున్నాడంటారు కానీ, అందులో నిజం లేకపోవచ్చు. అతని రచనల్లోని సంఘటనలు అలా భావించటానికి అవకాశమిచ్చాయి. అతడు యురేమియా అంటే మూత్రపిండాలలోని రాళ్ల జబ్బుతో మరణించాడు. ఆ జబ్బు వల్ల అతనెంతో నొప్పితో బాధపడేవాడు. బాధానివారణకోసం మార్ఫిన్‌ను తీసుకునేవాడు.

చివరి రొట్టె తుంపుతో, ప్లేటులో గ్రేవీ ఏమీ మిగలకుండా తుడిచేసి, దాన్ని నోట్లో పెట్టుకుని మెల్లగా నమలసాగాడు, ఆలోచనలో పడిపోయి. తను టేబుల్‌మీద నుండి లేచినా తనకు ఆకలి మందగించనందుకు మనసు అతడిని బాధించింది. అయినా తను మాత్రమే తిన్నాడు. పక్క గదిలో పడుకునున్న ఇద్దరు పిల్లలినీ రాత్రికి తమకు తిండిలేదన్న సంగతి మరిపించేందుకు, పెందరాడే నిద్ర పుచ్చింది అతడి భార్య; ఆమె ముద్ద ముట్టింది లేదు. అయినా మౌనంగా వ్యగ్రతతో కూర్చుంది. ఆమె సన్నగా ఉంది, కార్మిక వర్గానికి చెందిన స్త్రీ కనుక ఇలకర్చుకునే ఉంది. అయినా ఒకప్పటి సౌందర్య రేఖలు ఆమెలో పూర్తిగా మృగ్యమవలేదు. చావిడి కటువైపు ఉండే పొరుగావిడనుండి గ్రేవీకి కావల్సిన పిండిని అరువు తెచ్చుకున్నది. చివరి రెండు హాఫ్‌పెన్నీలు రొట్టెను కొనటానికి వ్యయమయ్యాయి.

కిటికీ పక్కనున్న కుర్చీలో కూర్చుని యాంత్రికంగా పైపును నోట్లో పెట్టుకుని, తన కోటు పక్క జేబులోకి చెయ్యి పోనిచ్చాడు. అందులో పొగాకులేదు. పైపును పక్కన పెట్టేశాడు. అతడి శరీరం గట్టిది, ఆవేశరహితుడిగా కన్పించాడు. అతని ఆకారం అసూయ కల్గించేట్టు ఉన్నది. అతని మోటు బట్టలు పాతవి, నలిగిపోయి ఉన్నాయి. అతని బూట్ల మడమల రిపేరు కూడా ఇటీవలది కాదు. అతని నూలు చొక్కా రెండు షిల్లింగులు పెట్టి కొన్న చౌకబారు సరుకు. దాని కాలరూ చిరిగివుంది.

అయితే, తనేమిటో ప్రకటించేది టామ్ కింగ్ ముఖం. అది నమూనా ప్రొఫెషనల్ బాక్సర్‌ను తెల్పే ముఖం. ఆ నలుచదరపు రింగులో సుదీర్ఘకాలం గడపినవాడి ముఖం. ఏ లక్షణమూ ఇతరుల దృష్టికి దాటిపోని ముఖం; నున్నగా గడ్డం చేసిన ముఖం. పెదవులు ఆకారం లేనివి, నోరు ముఖంలో గాటు పెట్టినట్టుగా ఉంటుంది. దవడ కలహ శీలంగా, పాశవికంగా, భారీగా ఉంది. మెల్లగా కదిలే కళ్లు, బరువైన కనురెప్పలతో, వాటి కింద భావరహితంగా ఉన్నాయి. అతడు జంతువే, కళ్లు జంతు లక్షణాన్ని వ్యక్తం చేసేవే. అవి మత్తుగా, పోరాడే జంతువు సింహం కళ్లలాగా ఉన్నాయి. జుట్టును కురచగా కత్తిరింపించుకున్నాడు. నుదురు వేగంగా జుట్టులోకి వాలిపోయింది. తలలోని ప్రతి దెబ్బను బాహిరం చేస్తోంది. రెండుసార్లు విరిగిన ముక్కది. అసంఖ్యాకమైన దెబ్బలతో వివిధంగా మార్పులు పొందింది. కాలీఫ్లవర్ లాంటి చెవి, శాశ్వతంగా వాచిపోయి, రెండు సార్లు వికృతి పొంది, అతని రూపానికి అలంకారంగా భాసించింది. అతని గడ్డం నున్నగా గీసినా, ఓ నీలపు-నలుపు మరకను ముఖానికి ప్రసాదిస్తుంది.

> **కొన్ని పుస్తకాలను రుచి చూడాలి. కొన్నింటిని మింగి వేయాలి, కొన్నింటిని నమిలి జీర్ణం చేసు కోవాలి.**
>
> **-బేకన్**

మొత్తంమీద, చీకటి సందులోనో, లేక ఒంటరి ప్రదేశంలోనే భయాన్ని రేకెత్తించే ముఖమే అది. అయితే టామ్ కింగ్ నేరస్థుడు కాదు, ఎలాంటి నేరాన్నీ చేసినవాడు కాదు. అతడు ఎవరితోనూ పేచీ పెట్టుకున్న మనిషి కూడ కాదు. అతడు వృత్తినిపుణుడు; పాశవికంగా పోరాడేతత్త్వం తన వృత్తిపర ప్రదర్శనలకు పరిమితమై ఉంటుంది. రింగు బయట, అతడు నెమ్మదయిన మనిషి, మృదు స్వభావి. తన చిన్న వయసులో, డబ్బు చేతిలో ఆడుతుంటే, అతడు చెయ్యిజార్చిన మనిషే. అతడికి ఎవరి పట్లా పగ, ప్రతీకారాలు లేవు. అతనికి శత్రువులూ లేరు. పోరాటమన్నది అతడికి వ్యాపారం. రింగులోపల అతడు బాధకలి గించేందుకే కొట్టేవాడు, కాలో, చెయ్యో పడేట్టే కొట్టేవాడు, నాశనం చెయ్యాలనే కొట్టేవాడు. కానీ, అది శత్రుత్వంతో కాదు. అది పూర్తిగా వ్యాపార వ్యవహారం. మనుషులు ఒకరితో మరొకరు తలపడుతుంటే చూసేందుకే ప్రేక్షకులు అక్కడ జమయ్యేవారు. గెలుపొందినవాడికి అధిక లాభం కలిగేది, డబ్బు ముట్టజెప్పే వారు. ఇరవైయ్యేళ్ల క్రితం, ఊలూమూలూ గూగర్‌తో తలపడ్డాడు. న్యూ కాజిల్‌లో బాక్సింగ్ పోటీలో గూగర్ దవడ పగిలాక, స్వస్థమవటం మొదలెట్టి అప్పటికి నాలుగునెలలే అయిందని అతనికి తెలియదు. అదో క్రీడ, ఇద్దరికీ ఆ క్రీడ తెల్సు, అందుకే క్రీడించారు.

టామ్‌కింగ్ మాటల మనిషి కాదు. అతడు విచారంగా మౌనంగా తన చేతులను చూసుకున్నాడు. అతడిచేతుల వెనుక రక్తనాళాలు పెద్దగా లేచి, వాచి వున్నాయి; దెబ్బలు తిన్న వేలి కణుపులు పొంగాయి; వత్తిడి పతాకస్థాయిలో ఉన్నప్పుడు అతని గుండె రక్తనాళాల్లోకి ఎంతో రక్తాన్ని పంపించేది. వాటినుండి స్థితిస్థాపకతను వ్యాకోచింప చేశాడు, వాటి వ్యాకోచంతో తన ఓర్పు పరీక్షలో ఉత్తీర్ణుడయ్యేవాడు. ఇప్పుడు అతను తేలిగ్గా అలసి పోతున్నాడు; ఇరవై రౌండ్లు కూడ నిలబడలేక పోతున్నాడు. గట్టిగా తగిలిన దెబ్బకు దీటుగా జవాబివ్వలేక పోతున్నాడు; అంతిమంగా మహోదగ్రం, శీఘ్రం అయిన దెబ్బను తీయలేక పోతున్నాడు. చివరకు ఇరవయ్యో రౌండులో, ప్రేక్షకులు లేచి నిలబడి, అరుస్తుంటే, తను ముందుకు దూకి దెబ్బతీయటం, ఎదుటి దెబ్బను కాచుకోవటం, ప్రత్యర్థిపై దెబ్బల వర్షం కురిపించటం, అలాంటి వర్షాన్నే గ్రహించటం, సాగుతూంటే, గుండె విశ్వసనీయంగా ఇంతసేపూ, కావల్సినంత రక్తాన్ని సిరల్లోకి పంపించేది. ఆ సమయంలో పొంగిపోయిన సిరలు, మళ్లా సంకోచించేవి. కానీ, పూర్తిగా కాదు మొదట్లో అంతగా తెలిసేది కాదు. మెల్లమెల్లగా అవి పొంగివుండటమే వాటి అసలు స్థితి అయింది. అతను వాటి వంక, దెబ్బలు తిన్న తన వేలి కణుపుల వంక చూసుకున్నాడు. ఒకసారి తన యవ్వనంలో ఉండే వాటి గొప్ప స్థితిని గురించిన దృశ్యం అతడికి దృశించింది. అది బెన్నీ జోన్స్- వెల్ష్ టెర్రర్ కూడ అంటారు- తలమీద తన మొదటి వేలి కణుపు విరగటానికి ముందు దృశ్యం.

తన ఆకలిని గురించిన భావన మళ్లా అతన్ని కదిలించింది.

“దౌర్భాగ్యం! ఒక్క మాంసం ముక్క కూడ దొర క్కూడదా?” తన పెద్ద పిడికిలి మడిచి, అనుకున్న తిట్టును వదుల్తూ, పెద్దగానే గొణుక్కున్నాడతను.

“బర్క్ షాపులోనూ, సాలీ షాపులోనూ ప్రయత్నించాను. హాఫ్‌పెన్నీ మేరకు కూడ! బర్క్ అన్నాడూ....” ఆమె తొట్రు పడింది. “ఇవాళ శాండల్ నీ పని చెప్తాడనీ, నీ లెక్క ఇప్పటికే ఎక్కువుందన్నాడు.”

టామ్ కింగ్ గొణిగాడు, కానీ జవాబివ్వలేదు. తను చిన్న వయసులో పెంచుకున్న బుల్ టెరియర్ (కుక్క) అతనికి గుర్తుకు వచ్చింది. తను దానికి అంతులేకుండా మాంసం ముక్కలు తినిపిస్తూండేవాడు. అప్పుడయితే, బర్క్ తనకు వెయ్యి మాంసం ముక్కలయినా అరువిచ్చేవాడు. అయితే కాలం మారిపోయింది. టామ్ కింగ్ ముసలివాడవుతున్నాడు; వ్యాపారస్థులు పెద్దగా అప్పులివ్వాలని, సెకండ్ రేటు క్లబ్బుల్లో ఆడే ముసలివాళ్లు, ఆశించకూడదు.

ఓ మాంసం ముక్క తినాలన్న కోరిక అతడిని పొద్దుటినుంచీ సతాయిస్తూనే ఉంది. ఆ కోరికలోని తీవ్రత క్షీణించలేదు. పోరాడటానికి కావల్సిన చక్కటి శిక్షణ అతనికి లభించలేదు. అది శుష్క వర్షం; ఆస్ట్రేలియాలో రోజులు కష్టంగా గడుస్తున్నాయి. నిత్యం కాకపోయినా అప్పుడప్పుడయినా పని దొరకటం కష్టమై పోయింది. ముష్టియుద్ధపోటీలో శిక్షణకోసం తనకు భాగస్వామి ఎవడూ లేడు. అతనికి దొరికే ఆహారమూ శ్రేష్ఠమయినది కాదు, అది సరిపోయేదీ కాదు. దొరికినప్పుడు కొద్దికాలం నౌకలో కూడ పని చేశాడు. భార్య, ఇద్దరు పిల్లలు. వాళ్లను పోషించాల్సిన బాధ్యత కూడ అతనిపై ఉంది. శాండల్‌తో పోరాడినప్పటి

నుండీ, వ్యాపారస్థుల వద్ద అప్పు లభించటం కష్టమయింది. గెయిటీ క్లబ్ సెక్రటరీ అతడికి మూడు పౌండ్ల అడ్వాన్సు ఇచ్చాడు. అది ఓడిపోయినా లభించే ప్రతిఫలం. అంతకు మించి ఇవ్వనన్నాడు. తన పాత మిత్రులనుండి కొన్ని షిల్లింగులు అప్పు చేసేవాడు. ఆ దుర్భిక్షపు సంవత్సరంలో వాళ్లకే జీవితం కష్టంగా గడుస్తోంది.

"ఎంత టైమయింది, లిజ్జీ?" అడిగాడతను

అతని భార్య చెప్పింది, "పావుతక్కువ ఎనిమిది" అని.

"కొన్ని నిమిషాల్లో వాళ్లు రౌండుకు దిగుతుంటారు" అన్నాడతను. "ప్రాక్టీసు లాంటిది. ఆ తరువాత, డీలర్ వెల్స్, గ్రిండ్లేల మధ్య నాలుగు-రౌండ్ల ముష్టి యుద్ధం, ఆ తరువాత పది-రౌండ్ల పోరాటం స్టార్‌లైట్, నావికుడెవడో వాడి మధ్యా జరుగుతుంది.. నేను వచ్చే సరికి మరో గంటపైగా పడుతుంది."

మరో పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాక, అతడు లేచాడు. హాట్ తలమీద పెట్టుకుని, తలుపువైపుగా నడిచాడు. వెళ్లేప్పుడు ఆమెను ముద్దు పెట్టుకోలేదు. అసలా అలవాటు లేదతనికి. కానీ, ఇవాళ ఆమె, అతని చుట్టూ చేతులేసి, అతని తల వంచి, ముద్దు పెట్టుకునే ధైర్యం చేసింది.

"గుడ్ లక్, టామ్! నువ్వు వాడిని చిత్తు చేయబోతున్నావు!" అందామె.

"అవును, వాణ్ణి చిత్తు చేయ బోతున్నాను" అన్నాడతను ఆ మాటలనే తిరిగి ఉచ్చరిస్తూ. "చెయ్యాల్సిందదే, వాణ్ణి చిత్తుచెయ్యాల్సిందే!"

ప్రసన్నంగా ఉండే ప్రయత్నం చేస్తూ అతడు నవ్వాడు, ఆమె అతనికి మరింతగా కరుచుకు పోయింది. ఆమె భుజాలమీదుగా శూన్యంగా ఉన్న ఆ గది వంక చూశాడతను. ప్రపంచంలో అతనికున్నదదే. కిరాయి బాకీ పడిన ఆ ఇల్లు, పెళ్లాం, పిల్లలు. తన సహచరికి, పిల్లలకు మాంసం పట్టుకు రావటానికి, అతడు ఆ రాత్రిపూట బయలు దేరాడు. తన యంత్రాన్ని నడిపించే ఆధునిక కార్మికుడు కాదతను, పాత, ఆదిమ, జంతు పద్ధతిలో, అందుకోసం యుద్ధం చేసే మనిషతను.

> విద్యార్థులు గ్రంథాలయాన్ని నట్టిల్లుగా, పుస్తకాన్ని కన్నతల్లిగా ఎంచి పుస్తక పఠనం అలవరచుకోవాలి.

"వాణ్ణి చిత్తు చేయ బోతున్నాను. గెల్చినా, ముప్ఫయి క్విడ్‌లు (వంద పెన్నీలు). ఉన్న బాకీలన్నీ తీర్చెయ్యొచ్చు. ఇంకా డబ్బు కూడ మిగుల్తుంది. ఓడిపోయానా, నాకొచ్చేదేమీ ఉండదు. ట్రామెక్కి ఇంటికి రావటానికికూడ పెన్నీ మిగలదు. వెళ్లొస్తానోయ్! గెలిస్తే, సీదా ఇంటికే వస్తాను."

"అలాగే, నీకోసం ఎదురు చూస్తుంటాను" అందామె చావిడికుండా.

గెయిటీకి రెండు మైళ్లపైనే దూరం. నడుస్తూ, అతడు తన మంచి రోజులను గుర్తు చేసుకున్నాడు. ఒకప్పుడతను న్యూ సౌత్ వేల్స్‌లోనే హెవీ వెయిట్ ఛాంపియన్. బాక్సింగ్‌కు వెళ్లేప్పుడు టాక్సీలో వెళ్లేవాడు. టామీ బరన్స్, ఆ యాంగ్రీ నీగ్రో, జాక్‌సన్- వీళ్లు మోటరు కార్లనెక్కి వస్తారు. తను నడచి వెళ్తాడు! బాక్సింగుకు వెళ్లేముందు రెండు మైళ్ల దూరం నడవటం చక్కటి ప్రారంభం కాజాలదు. తను ముసలాడు, నౌకలో పనిచేయటానికి తప్ప తనెందుకూ పనికి రాడు. ఇప్పుడీ విరిగిన ముక్కుతో, వాచిన చెవులతో తనందుకూ పనికిరాడు. తనేదయినా వృత్తిని నేర్చుకునివుంటే బావుండేది; కానీ తనకెవరూ చెప్పిన వాళ్లు లేరు. వాళ్లెవరయినా చెప్పినా, తను వాళ్ల మాట వినేవాడు కాదని అతనికి తెలుసు. పెద్ద డబ్బు- తీవ్రం, ఉజ్జ్వలం అయిన ఘనత- ఎంతో విశ్రాంతి, మధ్యలో కాలక్షేపం- ఆత్రుతగా పొగిడే అనుచరగణం, వీపుతట్టి ప్రోత్స హించటాలు, కరచాలనాలు, తనతో ఐదు నిమిషాలు మాట్లాడే బులపాటం తీర్చుకోవటానికి తనకు డ్రింకులు కొనిచ్చే డబ్బున్నోళ్లు, సుళ్లు తిరిగే చివరి దెబ్బ, రిఫరీ "కింగ్ గెలిచాడు" అని అరవటం, మర్నాడు క్రీడల కాలంలో తన పేరు రావటం- ఇవన్నీ మర్చిపోయేవా?

అవీ రోజులు! మెల్లగా, దీర్ఘకాలం ఆలోచించిన మీదట తనకు తెల్సింది, ముసలాళ్లని విసిరేస్తారని. తను యువకుడు, పైకి వస్తున్నవాడు; వాళ్లు వయసుదాటిన వాళ్లు, జారిపోతున్న మనుషులు. ఎలా తను ముసలి స్టోషేర్ బిల్‌ను, రాష్ కట్టర్స్ బేలో, పద్దెనిమిదో రౌండులో మట్టి కరిపించిందీ, ఆ తరువాత, ముసలి బిల్ పసిపిల్లవాడులా డ్రస్సింగ్ రూంలో ఏడ్చిందీ అతనికి గుర్తుకు వచ్చింది. బహుశః ముసలి బిల్ అద్దె బకాయి పడి ఉంటాడు. బహుశః అతడికి కూడ ఇంట్లో ఓ పెళ్లాం, పిల్లలూ ఉండి ఉంటారు. బహుశః బిల్ కూడ పోరాడాల్సిన ఆ రోజే ఓ మాంసం ముక్క కోసం ఆకలితో కొట్టుకు పోయివుండొచ్చు. ఆడి ఓడాడు; మరి ఆశ్చర్యమేముంది, ఆ తర్వాత బిల్ డ్రస్సింగ్ రూంలో ఏడ్చాడంటే!

ప్రతివాడికీ, తన్ను సృజించిన పద్ధతి ప్రకారం, తన ఒంట్లోని కండల నాణ్యత ప్రకారం వాడిన్ని ఫైట్లు చేయగలడని నిశ్చితమై ఉంటుంది. అన్ని పోరాటాలూ అయిపోయాక, అతని పని అయిపోయినట్లే! బహుశః తనలో మిగతావారందరికంటే అధిక సంఖ్యలో పోరాడే శక్తి ఉండొచ్చు. తనవంతు కంటే అధికంగా కష్టమైన, అలసట కలిగించే పోరాటాలను చేసి ఉండొచ్చు- అవి తన గుండెను, ఊపిరితిత్తులను ఛిద్రం చేసేటటువంటివి; తన ధమనుల నుండి స్థితిస్థాపక శక్తిని నాశనం చేశాయి; తన శక్తిని బలాన్ని బలహీన పరిచాయి. అవును, వాళ్లందరికంటే తను బాగా శ్రమించాడు. తన పాత పోరాట భాగస్వాములెవరూ మిగిలి లేరు. పాత కాలపు మనుషుల్లో మిగిలినవాడు తనే. వారందరి పనీ అంతమవటం తను చూశాడు; కొందరిని అంతం చేయటంలో తన హస్తమూ ఉంది.

ముసలివాళ్లకు వ్యతిరేకంగా తను పోరాడేట్టు వాళ్లు చేశారు. ఒకరి తరువాత మరొకరిని తను నిర్జించాడు. ముసలి స్టోషేర్ బిల్ లాగ, వాళ్లు డ్రస్సింగ్ రూంలో ఏడ్చినప్పుడు తను నవ్వాడు. ఇప్పుడు తనే ముసలివాడు. ఇప్పుడు వాళ్లు తనపై యువకులను ప్రయోగిస్తున్నారు. ఇప్పుడీ పిల్లవాడు శాండల్ న్యూజిలాండునుండి వచ్చాడు. ఇప్పుడు శాండల్ కనుక ప్రతిభ చూపితే, అతడికి మరింత గట్టి మనుషులతో పోరాడే అవకాశం వస్తుంది. మరింత పెద్ద పర్సులూ అతని పరం అవుతాయి. దీని వల్ల అతడన్నీ పొందుతాడు- డబ్బు, ఘనత, జీవనోపాధి; ఆ కీర్తి, భాగ్యరేఖను కాపాడే ముసలి టామ్ కింగ్ గెల్చేదేమీ లేదు; ఇంటి యజమానికి, వ్యాపారస్థులకు చెల్లించాల్సిన ముప్ఫయి క్విడ్‌లు తప్ప, మరేం లేదు. అలా టామ్ కింగ్ ఆలోచిస్తూ ఉంటే, అతడి శాంత దృష్టి పథంలోకి తన యవ్వనం, ఆ గొప్ప యవ్వనం, గుర్తుకు వచ్చింది. అవును, యవ్వనం శాపమయింది. అది ముసలివాళ్లను నాశనం చేసింది, దాంతో తృప్తి పడలేదు, ఆ ప్రయత్నంలో తననూ నాశనం చేసుకున్నది. తన వంతుగా యవతతో పరాజితమయింది. యువత నిరంతరం జవ్వనంగానే ఉంటుంది. వయసు మాత్రమే ముసలితనాన్ని పొందుతుంది.

కాజిల్‌రీఫ్ స్ట్రీటు వద్ద అతడు ఎడమకు తిరిగాడు. మూడు బిల్డింగులు దాటి, గెయిటీకి వచ్చాడు. చిన్న సైజు రౌడీల గుంపొకటి తలుపు బయట జమయి వుంది. వాళ్లు అతనికి గౌరవంగా దారివదలి నిలబడ్డారు. అతని చెవిన బడ్డది, వాళ్లు ఒకళ్లతో ఒకళ్లు చెప్పుకోవటం : "అతనే. అతనే టామ్ కింగ్!"

".ఎలా ఉన్నావు, టామ్?" అతనడిగాడు.

"నాకేం, బాగా ఉన్నాను" కింగ్ జవాబిచ్చాడు, తను అబద్ధం చెబుతున్నట్టు అతనికి తెలిసినప్పటికీ. తన దగ్గరే కనుక ఒక క్విడ్ ఉంటే అది పెట్టి ఓ

ప్రపంచ రచయిత్రుల పరిచయాలు

## టోనీ కేడ్ బాంబారా (1939 - 1995)

టోనీ కేడ్ బాంబారా అసలు పేరు మిల్టోనా మిర్కిన్‌కేడ్. (స్కూల్లో వున్నప్పుడు పేరు మార్చుకుంది) జననం నల్లవాళ్లు నివసించే (న్యూయార్క్) హార్లెంలో. పెరిగింది బెడ్‌ఫోర్డ్ స్టువీసాంట్, ఇటలీ, పారిస్‌లలో. చిన్నప్పటినుంచే కథలు రాయటం అలవాటు. తండ్రి చదివే వార్తాపత్రిక మార్జిన్‌లలో తొలి కథలు రూపుదిద్దుకున్నాయి. అవి సరిపోనప్పుడు తల్లి సూపర్ మార్కెట్ నుండి పట్టుకొచ్చిన అట్ట డబ్బాల మీద కూడా రాసింది.

"నల్లవాళ్లకు జీవితమంటే పోరాటమని బాల్యంలోనే తెలిసి వచ్చింది. ప్రత్యక్ష యుద్ధమే కాదు. మాటలను కూడా ఆయుధాలుగా వాడగలగాలి" అని చెప్పింది అమ్మ. "అన్యాయానికి ప్రతిఘటన" ప్రతి వ్యక్తికీ కనీస కర్తవ్యం... ఆనందం అందరి జన్మహక్కు. హాయిగా, కడుపుబ్బ నవ్వగలగాలి. తుపాకీ గుళ్లనూ, బాయ్‌నెట్ పోట్లనూ ఎదిరించి నవ్వగలగటం మా నల్ల జాతికే సాధ్యం"

హైస్కూలు పత్రికలో మొదటిగా కథలు అచ్చయ్యాయి. వివక్షతను నిరసిస్తూనే, 'శాంతియుత సహజీవనం, సమాన హక్కులు' కావాలంటూ వుద్యమించిన అనేకమంది నీగ్రో గాయకులు, సంగీతకారులు (ప్రముఖంగా పాల్ రోబ్‌సన్-శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం రాసిన యోగ్యతాపత్రం చదివిన వాళ్లకీ పేరు గుర్తుంటుంది) బాంబారా లౌకిక దృష్టిని ప్రభావితం చేశారు. మొత్తం మీద స్కూలు పాఠాలు నేర్పని విజ్ఞానం నిత్యజీవిత సంఘర్షణలో అనుభవ పూర్వకంగా గ్రహించింది బాంబారా. "మా అమ్మ. హెలెన్ బ్రంట్ హెండర్సన్ కేడ్ బ్రెహన్, క్షణం విరామమెరుగక చేసిన చాకిరీ చూశాను. అదొక్కటి చాలు, పేదల జీవితాలెంత దుఃఖభూయిష్టమో తెలుసుకోవటానికి."

బాంబారా రాసిన తొలికథ "స్వీట్‌టౌన్'కు జాన్ గోల్డెన్ అవార్డు వచ్చింది. 1962-65 దాకా బ్రూక్లిన్‌లోని కాలనీ సెటిల్‌మెంట్ హౌజ్‌లో ప్రోగ్రాం డైరెక్టర్‌గా పనిచేస్తూనే ఎం.ఏ. కూడా పూర్తిచేసింది. ఆ తర్వాత న్యూయార్క్‌లోని సిటీ కాలేజ్‌లో అధ్యాపకురాలిగా ఉద్యోగం. అప్పుడే సామాజిక, రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనటం ప్రారంభించింది.

పౌరహక్కుల ఉద్యమంలో చురుకుగా పాలుపంచుకున్న బాంబారా 'బ్లాక్ ఉమన్' అనే సంకలనాన్ని ఎడిట్ చేసింది. "నిక్కి జియోవనీ', ఆడ్రెలార్డ్' ఆలిస్ వాకర్, పాల్‌మార్షల్ లాంటి నల్లజాతి స్త్రీవాద రచయిత్రులతో పరిచయా లేర్పడ్డాయి. ఆఫ్రో అమెరికన్ రచయిత్రులు తమ గురించి తాము లోకానికి పరిచయం చేసుకున్న తొలి పుస్తకంగా ఈ సంకలనం గొప్ప సంచలనం సృష్టించింది.

ఇందులో రాసిన ఒక వ్యాసంలో బాంబారా "పెట్టుబడిదారీ సమాజంలో పురుషుడికే సర్వాధికారాలూ, సర్వసుగుణాలూ. స్త్రీ తల వంచుకుని, పురుషుడి కనుసన్నలలో అతడి ఆజ్ఞాపాలనే తన ధ్యేయంగా బతకాలి" అంటూ తన

---

మాంసం ముక్కను కొనుక్కుని తిని ఉండేవాడు.

అతడు డ్రస్సింగ్ రూంనుండి, వెనుక తన సెకండ్స్ అనుసరిస్తూండగా, నలుచదరపు రింగుకు దారితీసే నడవాలోకి ప్రవేశించగానే, నిరీక్షిస్తున్న గుంపునుండి అభివాదనలు, ప్రశంసలు వెల్లువగా కురిశాయి. అందరి ప్రణా మాలను అతను స్వీకరించాడు.ఎత్తుగా ఉన్న వేదిక మీదకు అతడు దూకాడు. తాళ్లగుండా దూరి, మూలకు చేరుకున్నాడు. అక్కడ ఉన్న ఫోల్డింగ్ స్టూల్ మీద కూర్చున్నాడు. రిఫరీ, జాక్‌బాల్, దగ్గరకు వచ్చి అతనితో కరచాలనం చేశాడు. బాల్ భగ్న బాక్సర్. అతడు తనకు రిఫరీగా రావటం కింగ్‌కు సంతోషం కలిగించింది. వారిద్దరు పాతవాళ్లు. శాండల్‌తో వివాదం వచ్చినప్పుడు, నియతాలు దాటికూడ, తను బాల్‌పై ఆధారపడి బయటపడవచ్చు.

హెవీవెయిట్లుగా ఎదగాలని ఆశిస్తున్న యువకులను, ఒకరి తరువాత మరొకరుగా రింగులోకి వస్తున్న వారిని, రిఫరీ ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాడు. వారి బదులుగా వారి సవాళ్లను కూడ ప్రకటిస్తున్నాడు.

ప్రేక్షకులు ప్రశంసించారు. ఆ తరువాత శాండలే స్వయంగా తాడు దాటి వచ్చి తనకు కేటాయించిన మూల కూర్చున్నప్పుడు మళ్లా కరతాళ ధ్వనులు మోగాయి. టామ్ కుతూహలంగా రింగుగుండా అతడి వంక చూశాడు. అతని ముఖం చాల అందంగా ఉంది, పైన వంకులజుట్టు. అతడి బలమైన కండరాల మెడ అతడి శారీరక విలాసాన్ని వెలారుస్తోంది.

ఛాలెంజీలు కొనసాగాయి. బాక్సింగ్ గేమ్‌లో ఈ యువకులు ఎప్పుడూ లేస్తూంటారు, తాడుగుండా లోపలకు జొరబడుతుంటారు, తమ ధిక్కారాన్ని విన్పిస్తుంటారు; వారి ముందునుండి ముసలివాళ్లు తొలగిపోతూంటారు. ముసలివాళ్ల శరీరాలపైనుండి వాళ్లు విజయసోపానాల నధిరోహిస్తారు. మళ్లీ మళ్లీ యువకులు- ఆపరాని, ప్రతిఘటించరాని యువత- వచ్చి ముసలివాళ్లను దాటి వెళ్తారు, తామే స్వయంగా ముసలివాళ్లవుతారు. యువతకు మార్గం లభిస్తుంది, దానికి మరణం లేదు.

కింగ్ ప్రెస్ బాక్స్ వంక చూశాడు. స్పోర్ట్స్‌మన్‌కు చెందిన మోర్గన్, రిఫరీకి చెందిన కార్బెట్‌ల వంక చూసి తల ఊపాడు. తన సెకండ్స్ సిడ్ సల్లివాన్, ఛార్లీ బేట్స్‌లు చేజోళ్లు వేసుకుని, హాటి లేసులు బిగించాక, వారితో చేతులు కలిపాడు టామ్. శాండల్ ట్రౌజరును లాగేశాడు; అప్పుడు టామ్‌కు కన్పించింది- ఆకారం ధరించిన యవ్వనం. పెద్ద ఛాతీ, భారీగా, తెల్లటి పట్టు చర్మంకింద జీవద్వంతంగా కదులుతూ ఉండే కండరాలతో కన్పించాడతను. మొత్తం శరీరమంతా జీవంతో పాకిపోయి ఉంది. సుదీర్ఘ యుద్ధాల్లో, తను ప్రవేశించిన ప్పుడున్నంత యవ్వనం కూడ మృగ్యమై, నిష్క్రమించటం జరుగుతుంది.

ఆ మనుషులిద్దరూ కలుసుకోటానికి ముందుకు నడిచారు. గంట మోగింది. సెకండ్లు ఫోల్డింగ్ స్టూళ్లతో రింగు బయటకొచ్చారు. వాళ్లు కరచాలనం చేసుకున్న వెంటనే, పోరాడే వైఖరిని ప్రదర్శించారు. ఆ వెంటనే గన్ ట్రిగ్గర్ పై సరితూగే, స్టీలు-స్ప్రింగులా, శాండల్ లోపలికి, బయటికి, మళ్లాలోపలికి వచ్చి, ఓ ఎడమ దెబ్బ కళ్లకు, ఓ కుడి దెబ్బ పక్కటెముకలకు తగిలిస్తూ, ఎదురు దెబ్బను తప్పించుకుంటూ, తేలిగ్గా నృత్యం చేస్తూ, మళ్లా తిరిగి ప్రమాదకరంగా నృత్యంచేస్తూ వచ్చాడు. అతడు తెలివినీ, వేగాన్నీ చూపాడు. అదో మిరిమిట్లు గొల్పే ప్రదర్శన. క్రీడాభవనం తన ఆమోదాన్ని తెల్పుతూ అరిచింది. అయితే, టామ్ కళ్లు మెరిసిపోలేదు. అతడెన్నో యుద్ధాలను చూసినవాడు, ఎంతోమంది యువకులతో పోరాడినవాడు. ఆ దెబ్బలెలాంటివో అతడికి తెల్సు. అవి వేగవంతమయినవి, నిపుణతను ప్రదర్శించేవే కానీ, ప్రమాదభరితమైనవి కావు. ప్రత్యర్థిని ముంచెత్తాలన్న తపనలో తన విలాసాన్నీ, ఉత్కృష్టతను వ్యయం చేసే యువత తీరే అది.

శాండల్ లోపలకొచ్చాడు, బయటకు వెళ్లాడు, అక్కడా, అన్ని చోట్లా అతడే. వేగవంతమయిన కదలిక, తపన పడే గుండె, తెల్లమాంసపు జీవితాద్భుతం, మెరుపు దాడిని రచించే మందే కండలు, చర్మ నుండి చర్మకు దుముకుతూ, అన్నీ తనకూ, భాగ్యానికీ అడ్డుగా నిలబడ్డ టామ్ కింగ్ వినాశనాన్ని లక్ష్యించి సాగాయి. టామ్ కింగ్ ఓర్పుగా సహించాడు. తన పనేమిటో అతనికి తెల్సు, ఎదుటివాడు కొంత ఆవిరి పోగొట్టుకున్నదాకా చెయ్యాల్సిందేమీ లేదని అతని

ఆక్రోశాన్ని వ్యక్తపరుస్తుంది.

1971లో "టేల్స్ అండ్ స్టోరీస్ ఫర్ బ్లాక్ ఫోక్స్' అన్న మరో సంకలాన్ని ఎడిట్ చేసింది బాంబారా. "ఇందులో ఏడు వంటింటి కథలున్నా"యని చమత్కరించింది. అవును మరి. అమెరికాలో కూడా, స్త్రీ జీవిత పరిధి వంటింటిని దాటటం అరుదే. నల్లజాతి వాళ్ల మౌఖిక కథాసంప్రదాయం ఈ సంకలనంలోని రచనల్లో బాగా ప్రతిఫలించింది.

బాంబారా తొలి కథలు సంపుటి పేరు "గొరిల్లా, మై లవ్"– అన్నీ నల్లజాతి వాళ్ల సామాజిక, ఆర్థిక జీవన పరిస్థితులను అధ్యయనం చేసిన కథలే. "పేదలకు కావలసింది వైయక్తిక పరిష్కారాలు కావు. సామూహిక, సామాజిక చైతన్యం. సమిష్టి ఆచరణ" అంటుంది బాంబారా.

ఆమె రెండవ కథా సంకలనం "ది సీ బర్డ్స్ ఆర్ స్టిల్ అలైవ్" (1977). కూతురు 'కర్మ' పుట్టిన తర్వాత బాంబారా క్యూబా, వియత్నాం దేశాలు పర్యటించింది. ఈ నూతన సమాజాలలోని స్త్రీలు చెయ్యని పనంటూ లేదు. "స్త్రీ వెనుకబాటుదనానికీ, పెట్టుబడీదారీ ఆర్థిక విధానాలకీ సంబంధముందా?" అని ఆలోచించింది. ముఖ్యంగా అమెరికా లాంటి దేశాల్లో పిల్లలమీద జరుగుతున్న హింస ఆమెను కలచివేసింది.

బాంబారా నవల "ది స్టాల్ ఈటర్స్" 1980లో అచ్చయింది. అప్పటికే ఆమె కథలు "గొరిల్లా, మై అవ్", "మెడ్లీ", "విచ్ బర్డ్"లు ఆధారంగా సినిమాలు తీశారు. హాలీవుడ్, నల్లవాళ్ల జీవితాల్ని వక్రీకరించి చూపుతున్నదని బాంబారాకు కోపం. 1985లో ఫిలడెల్ఫియాలోని ఒక నల్లజాతి సంస్థమీద ప్రభుత్వం బాంబింగ్ చేసింది. కోపంతో రగిలిపోతున్న బాంబారా ఇదే కథావస్తువుగా 1986లో తీసిన ఒక డాక్యుమెంటరీకి అవార్డు కూడా వచ్చింది.

రచయిత్రిగా, చలనచిత్ర రంగంలో అగ్రశ్రేణి దర్శకురాలిగా కీర్తి శిఖరాలనధిరోహించిన దశలో బాంబారాకు 'కోలోన్ కాన్సర్' ఉన్నట్టుగా నిర్ణయించారు డాక్టర్లు. జీవిత లక్ష్యాలను నిర్ణయించుకున్న వ్యక్తులు అనారోగ్యాన్ని పట్టించుకోరు. "కిక్ కాన్సర్స్ ఆస్" (కాన్సర్‌ను ముడ్డిమీద తన్ను) అని బాంబారా డబ్ల్యు.ఇ.బి.దుబ్వా (ప్రముఖ నీగ్రో నాయకుడు) గురించిన డాక్యుమెంటరీ ప్రారంభించింది. 1995 ప్రారంభంలో ఆ సినిమా విడుదలైంది. అదే సంవత్సరం డిసెంబరు 9 నాడు ఫిలడెల్ఫియాలో కన్ను మూసింది బాంబారా.

రచయిత్రి, సామాజిక కార్యకర్త, స్త్రీవాద, చలనచిత్ర దర్శకురాలు బాంబారా ఒక ఇంటర్వ్యూలో "నా ఉద్దేశంలో మనిషికుండవలసిన ముఖ్యమైన లక్షణాలు రెండు. ఒకటి "అన్యాయం పట్ల లావా చిమ్మగలగడం", రెండు: "ఎంతటి కష్టాల్లోనైనా నవ్వగలగటం." అంటుంది. ఆమెకు రచన కూడా తన పోరాటంలో భాగమే. పగటి కలల్నీ, భ్రమల్నీ వదిలించుకుని, ఈ పెట్టుబడిదారీ విష సంస్కృతిని ధిక్కరించి పేదలూ, పతితులూ నిరంతర విముక్తి పోరాటం కొనసాగించాల్సిందే. "వ్యక్తి జీవితానికి అంతం ఉంటుంది. కాని పోరాటం నిరంతర ప్రక్రియ." అవీ ఆమె చివరి మాటలు.

*

---

ఆలోచన. క్రీడాకారుడు తన వేలి కణుపుల గురించి జాగ్రత్త పడాలి. ప్రత్యర్థి తలమీద మోదాలని ప్రయత్నించటం తనకే ప్రమాదం. కింగ్ బాగా కిందకు వంగి తప్పించుకోవచ్చు, దెబ్బ తగలక పోయేదే. అయితే, కింగ్ తొలికాలపు పోరాటాలను గుర్తుకు తెచ్చుకున్నాడు. తను తన మొదటి వేలి కణుపును ఎలా వెల్ష్ టెర్రర్ తలమీద మోది విరుచుకున్నాడో అలా శాండల్ వేలి కణుపొకటి టామ్ తలకు జమయింది. అయితే, శాండల్ ఇప్పుడది లెక్కించడు, ముందుకు దూకుతాడు. పోరాడినంత సేపూ గట్టిగా దెబ్బ తీయాలనే ప్రయత్నిస్తాడు. అయితే ఆ తర్వాత, సుదీర్ఘపు రింగు యుద్ధాలు నేర్పటం మొదలెట్టాక, అతడా వేలి కణుపు గురించి విచారిస్తాడు. తనెలా టామ్ కింగ్ తలమీద మోది దాన్ని విరుచుకున్నాడో గుర్తుకు తెచ్చుకుంటాడు.

మొదటి రౌండంతా శాండల్‌దే. తన సుడిగాలి దెబ్బల వేగానికి క్రీడాభవన మంతా అరుపులతో మారు మోగిపోయింది. కింగ్‌పై దెబ్బల వర్షం కురిపించటంతో అతడు గుక్క తిప్పులేకపోయాడు. తన్ను కాపాడుకోవటం, అడ్డగించటం, తప్పించుకోవటం, శిక్షను తప్పించుకో చూడటంతో తృప్తి పడిపోయిన అతను ఒక్క దెబ్బ తీయలేదు. అప్పడప్పుడు దెబ్బతీస్తున్నట్టు అభినయించాడు కానీ, దెబ్బ పడటంతో, తల విదిలించేసేవాడు, ఆవేశరహితంగా కదిలేవాడు, దుముకటంలో కానీ, గంతువెయ్యటంలో కానీ, ఒక్క ఔన్సు బలాన్ని వృథా చెయ్యలేదు. వయసు బదులు తీర్చుకోటానికి ముందు శాండల్ యవ్వనపు నురగను కక్కెయ్యాలి. కింగ్ కదలికలు, మెల్లగా, పద్ధతి ప్రకారంగా సాగాయి. అతని కళ్లు మత్తులో దిమ్మతిరిగిన భావాన్ని కలిగించాయి. అయినా ఆ కళ్లు అన్నీ చూస్తూనే వున్నాయి.

రౌండయాక, తనకు కేటాయించిన మూల ఓ నిమిషపు విశ్రాంతికోసం కూర్చున్న కింగ్, క్రీడాభవనంలోని గొంతులను విన్నాడు. "దెబ్బతీయటం లేదెందుకు, టామ్?", "అతడంటే భయం పుట్టలేదు కదా, నీకు?"

"కండరాలు పట్టేశాయి" ముందు సీటులో కూర్చున్న ఒక వ్యక్తి వ్యాఖ్యానించటం అతడు విన్నాడు. "అతడు వేగంగా కదల్లేడు, ఒకటికి రెండు క్విడ్‌లు శాండల్‌పై."

గంటమోగింది. ఇద్దరూ తమ సీట్లనుండి లేచి ముందుకు సాగారు. శాండల్ మూడొంతుల దూరం, మళ్లా ప్రారంభించాలన్న ఆత్రుతతో, ముందుకొచ్చాడు. తన పొదుపు విధానానికి అది అనువుగానేవుంది. తనకు శిక్షణ లభించలేదు, తినటానికి కూడ తగినంత లభించలేదు. అందువల్ల, ప్రతి అడుగూ లెక్కలోకి వస్తుంది. అదనంగా తనక్కడికి రావటానికి రెండుమైళ్లు నడిచాడు. మొదటి రౌండు పునశ్చరితమయింది. శాండల్ సుడిగాలిలా దాడి చేశాడు. శాండల్ యువకుడు. ఏమాత్రం లెక్కించని ఉదారత్వంతో అతడు తన బలాన్ని విసిరివేయ సాగాడు. రింగు నాయకత్వం కింగ్‌కు చెందుతుంది. సుదీర్ఘ, బాధామయ పోరాటాలతో అతడికి వివేకం అలవడింది. అతడు ఆవేశరహితమైన కళ్లతో, తలతో మెల్లగా కదిలాడు, ప్రేక్షకులలో అధిక సంఖ్యాకులు కింగ్ అతనికి ఏమాత్రం దీటు కాదని భావించసాగారు. శాండల్ ఒకటికి మూడు పణం పెట్టి వాళ్లు తమ అభిప్రాయాన్ని తెల్పారు.

మూడో రౌండు కూడా అలాగే ఏకపక్షంగా సాగింది. శాండలే దారితీశాడు, ఇవ్వదల్చుకున్న దెబ్బలన్నీ విసిరాడు. ఒక అరక్షణం గడిచింది. అతి విశ్వాసంతో, శాండల్ ఓ అవకాశమిచ్చాడు. కింగ్ కళ్లు, కుడి చెయ్యి ఒకేక్షణంలో వెలుగును ప్రసరించాయి. తన నిజమైన మొదటి దెబ్బ అది. బెసగకుండా చెయ్యిని విల్లులా వంచి, తన శరీరపు సగం బరువు దాంట్లో నింపి విసరిన హుక్ అది. దవడ పార్శ్వానికి దెబ్బ తాకి, శాండల్ ఎద్దులా కుప్పకూలాడు. ప్రేక్షకులు ఊపిరి బిగబట్టి, భయంగా తమ ప్రశంసను అభివ్యక్తం చేశారు. అతడు కండర బంధితుడు కాదు, సుత్తిలా దెబ్బ వేయ గలడు.

శాండల్ కదలి పోయాడు. అతడు పక్కకు దొర్లాడు, లేచే ప్రయత్నం చేశాడు. లెక్కిస్తూ అరిచిన అతని సెకండ్స్ అరుపులు అతడిని ఆపాయి. అతని చెవిలో సెకండ్స్ పెద్దగా లెక్కించటం విన్పించిందతనికి; రిఫరీ అతనిపై వంగి నిలబడ్డాడు. తొమ్మిదో గణనానికి అతడు లేచి పోరాడ సిద్ధపడ్డాడు. అతణ్ణి ఎదుర్కుంటున్న టామ్‌కు తెల్సు, దెబ్బ దవడకు ఒక అంగుళం దగ్గరగా

## పుస్తకాల గురించి చెఖోవ్

పుస్తకాల ద్వారా నేను జీవితాన్ని అధ్యయనం చేశాను. పుస్తకాల్లోనే జీవితాన్ని చూశాను. పువ్వుల సుగంధాల్ని పీల్చుకున్నాను. పుస్తకాల్లోనే మధువు తాగి మత్తెక్కి పోయాను. సుందరాంగనల పరిష్వంగాల్ని పుస్తకాల్లో అనుభవించాను. ప్రకృతి అద్భుతాలను దర్శించాను.

---

తగలలేదని. అందుకు విచారించాడుకూడ అతను. తగిలినట్లయితే మళ్లీ అతడు లేచేవాడు కాదు, తను తన ముప్పయి క్విడ్‌లతో భార్యా పిల్లల దగ్గరకు వెళ్లిపోయేవాడు.

మూడు నిమిషాల చివరి వరకు రౌండు కొనసాగింది. మొదటిసారిగా శాండల్ తన ప్రత్యర్థి పట్ల గౌరవాన్ని చూపాడు. గంటమోగంగానే తనకోసం సిద్ధంగా ఉన్న స్టూల్‌మీద కూర్చున్నాడు టామ్. శాండల్‌కు నలుచదరానికి అయిమూలగా ఉన్న తన మూలకు వెళ్లటానికి నడచివెళ్లాల్సి వచ్చింది. అది అల్ప విషయమే కానీ, ఇలాంటి చిన్న విషయాల మొత్తమే పరిగణనలోకి వచ్చేది. శాండల్‌కు అలాంటి ఎన్నో అడుగులు నడిచి, ఆ మేరకు శక్తినీ, అమూల్యమైన ఆ నిమిషపు విశ్రాంతినీ పోగొట్టుకోక తప్పలేదు. ప్రతి రౌండు మొదట్లోనూ, కింగ్ బద్ధకంగా, నిదానంగా తన మూలనుండి వచ్చేవాడు. ఆ కారణంగా అతని ప్రత్యర్థి మరింత ముందుకు రావాల్సి వచ్చేది. తననుకున్న దిశగా పోరాటాన్ని నడిపించిన కింగ్, రౌండు పూర్తి కాగానే, తన మూల కూర్చో గలిగేవాడు.

మరి రెండు రౌండులు గడిచాయి. కింగ్ ఏ ప్రయత్నమూ చెయ్యని పొదుపరితనం, పీనాసితనం చూసాడు, శాండల్ దాన్ని విరళంగా ఖర్చు పెట్టాడు. ఆరో రౌండులో, శాండల్ జాగ్రత్తను గాలికొదిలేశాడు. మళ్లా టామ్ భయంకర దక్షిణహస్తం మెరుపులా శాండల్ దవడను తాకింది. సెకండ్స్ తొమ్మిది లెక్క పెట్టేదాకా లేవ లేక పోయాడు.

ఏడో రౌండుకల్లా శాండల్ స్వస్థ పరిస్థితి నశించింది. టామ్ కింగ్ ముసలాడే. కానీ, తానింతకుముందు ఎదుర్కొన్న ముసలాళ్లకంటే గట్టివాడు– తన బుర్రనెప్పుడూ కోల్పోని ముసలాడు. రక్షించుకోటంలో సమర్థుడు, ముదులున్న దుడ్డుకర్ర దెబ్బల్లాంటి ప్రభావం కల్గించే పంచ్‌లు ఇచ్చేవాడు, టామ్ కింగ్. పోరాటం సాగినంత వరకు వేలికణుపులు సుభద్రంగా ఉంటే ప్రతి దెబ్బ గణనలోకి వస్తుందని అతనికి తెల్సు. తన ప్రత్యర్థిని చూస్తూ తన మూల కూర్చున్న టామ్‌కు తన జ్ఞానం, శాండల్ యవ్వనం కలిస్తే, ప్రపంచ హెవీవైట్ ఛాంపియన్ తయారవుతాడని అన్పించింది. శాండల్ ప్రపంచ ఛాంపియన్ అవలేడన్నదే కష్టం కలిగించే విషయం. అతడికి వివేకం లేదు. దాన్ని యవ్వనంతో కొనుక్కోవటమే అతనికున్న ఒకే ఒక్క మార్గం. తనకు వివేకం ఉన్నది, దాన్ని కొనుక్కోటానికి యవ్వనాన్ని వ్యయం చెయ్యవల్సి వచ్చింది.

తనకు తెల్సిన అనుకూలతలను కింగ్ పాటించాడు. అతని భుజాలను పట్టుకునే ఏ అవకాశాన్నీ అతడు వదులుకోలేదు. అప్పుడు అతడి భుజం కరుకుగా ఎదుటివాడి పక్కటెముకలకు గుచ్చుకునేది. రింగు తాత్త్వికతలో, భుజం దెబ్బ పంచ్‌కు సమానం. ఇంక ప్రయత్నవ్యయానికి సంబంధించి పంచ్ కంటే కూడ మెరుగైనది. ఇలా భుజాలు పట్టుకోటంలో, టామ్ తన బరువునంతా ప్రత్యర్థిమీద వేసేవాడు, దాన్నుండి అతను విడివడాలనే ప్రయత్నాన్ని తేలిగ్గా అనుమతించే వాడు కాదు. అప్పుడు రిఫరీకి కల్పించుకోక తప్పేది కాదు. అతడు వారిని విడదీసేవాడు. ప్రత్యర్థి భుజాలు పట్టుకునేందుకు ముందుకు దూకి, తన పక్కటెముకలకు భుజాన్ని తాకించి, శాండల్ ఎడమచెయ్యికింద తలపెట్టినప్పుడు, తప్పక శాండల్ తన కుడిచెయ్యిని తన వీపు వైపుకు, ముందుకొచ్చిన ముఖం వైపుకు విసరేవాడు. అది తెలివైన దెబ్బ. ప్రేక్షకులు ప్రశంసించకుండా ఉండ లేదు. అయితే అది ప్రమాదకరమైంది కాదు, కనుక, ఆ మేరకు బలాన్ని వృథా చేసేదే. శాండల్‌కు అలుపులేదు, తన పరిమితుల జ్ఞానమూ లేదు. కింగ్ నవ్వుకున్నాడు,మొండిగా ఓర్పువహించాడు.

శాండల్ ఉగ్రుడై తన కుడి వైపు తిరిగాడు. కింగ్‌కు పెద్ద శిక్షే లభించ బోతున్నదనిపించింది. ఆ దెబ్బ తగలటానికి ముందే కింగ్ ఎడమ చేజోడు మహానైపుణ్యంతో శాండల్ ముంజేతిని తాకటం పాత బాక్సర్‌ల ప్రశంసను చూరగొనేటటువంటిది. నిజమే, ప్రతిసారి దెబ్బ తగలాల్సిన చోటే పడేది కానీ, ప్రతిసారీ ముంజేతి కండరాన్ని తాకటంతో దాని శక్తి నిర్వీర్యమైపోయేది. తొమ్మిదవ రౌండులో, ఒక నిమిషంలోపల మూడు సార్లు, కింగ్ కుడిచెయ్యి విలువంపుగా మారి శాండల్ దవడను బలంగా తాకింది. శాండల్ భారీ శరీరం మూడు సార్లూ నేలను తాకింది. ప్రతిసారీ తనకు అనుమతించిన తొమ్మిది సెకనులు తీసుకుని అతడు లేచాడు. కానీ, బాగా దెబ్బతిని పోయాడు, మనిషి కదలి పోయాడు. అయినా పట్టుదలగా పోరాడుతూనే ఉన్నాడు. తన ముఖ్య కోశం తన యవ్వనం; దాన్నుండి నిరంతరం అతడు శక్తిని తెచ్చుకోసాగాడు. కింగ్ ముఖ్య సంపద అనుభవం. అతడు ప్రయోజనరహితంగా కదలటమే కాక, తన ప్రత్యర్థి బలాన్ని వృథా చేసేట్టు ఆకర్షించటంకూడ నేర్చుకున్నాడు. మళ్లా మళ్లా, తన కాలినో, చేతినో, శరీరాన్నో కదిలించినట్లు ప్రదర్శించి, శాండల్ అనవసరంగా వెనక్కు తగ్గటమో, దూకటమో, లేక ఎదుర్కోటమో జరిగేది. కింగ్ విశ్రాంతి తీసుకునేవాడు కానీ, శాండల్‌కు ఆ అవకాశం లేకుండా చేశాడు. అది వయసు నేర్పిన ఎత్తుగడ.

పదో రౌండ్ మొదటినుండి, శాండల్ దెబ్బలను సీదా అతడి ముఖం ఎడంవైపు ఎదురు దెబ్బలతో కాచుకోటం మొదలెట్టాడు. శాండల్ జాగ్రత్త పడ్డాడు. ఎడమ చెయ్యితో తప్పించుకొంటూనూ, తలవైపు వంపుతో కుడి చెయ్యి విసుర్తూ శాండల్ ప్రతి స్పందించాడు.అది తనకు తగిలేటప్పటికి, తనకు బాగా పరిచయమయిన అచేతనపు నల్ల తెర తన మనో యవనికపై పడటం కింగ్‌కు

జీవితానుభవమంతా పుస్తకాలలో దొరికింది. పర్వత శిఖరాలెక్కాను.
సముద్రపు లోతుల్లో ఈదులాడాను. ఆకాశంలో విహరించాను.
తుఫానుల నధిగమించాను. పిడుగులనూ, మెరుపులనూ ఆహ్వానించాను.
అప్సరసల, బ్రహ్మరాక్షసుల సాంగత్యంలో జీవించాను.
ఆకాశపుటంచులూ, అధోలోకపు చీకటి గహ్వరాలూ నాకు పరిచితాలు.
విశ్వాంతరాళపు నాగరికుణ్ణి నేను.
మానవ మేధోపరిమితులు నాకు అవగతమయ్యాయి. ☀

జ్ఞాత మయింది. అల్పకాలం మాత్రం అతడు నిష్క్రియుడయ్యాడు. మరు క్షణంలో అతడికి మళ్లా తన ప్రత్యర్థీ, వీక్షిత ముఖాల శ్వేత నేపథ్యం కన్పించటం జరిగింది.

చాలసార్లు ఆ దెబ్బనే మళ్లా మళ్లా ప్రయోగించాడు శాండల్, కింగ్‌కు చుక్కలు చూపించాడు. ఇప్పుడు కింగ్ తన్ను ఎలా రక్షించుకోవాలో కూడ నేర్చుకున్నాడు. అది ఎదురు దెబ్బకూడ అయి ఉండాలి. ఎడం వైపునుండి దెబ్బతీస్తున్నట్టు, ఒక అడుగు వెనక్కు వేసి, బలమంతా కూడగట్టుకుని కుడిచేత్తో ఒక అప్పర్‌కట్ ఇచ్చాడు. ఆ దెబ్బ ఎంత నిర్దిష్టంగా తగిలిందంటే, శాండల్ ముఖానికి గట్టిగా తగలటంతో, తప్పించుకోబోయి కిందకు తల తిప్పుకున్న శాండల్ గాల్లోకి లేచి, వెనక్కి చుట్టలు చుట్టుకుపోయాడు, తనతో పాటు కింద చాపను తన తలమీద, భుజాలపై చుట్టుకున్నాడు. రెండుసార్లు అది సాధించగలిగిన కింగ్, ఇంక చెలరేగిపోయి, తన ప్రత్యర్థిని తాళ్లవైపు విసరేశాడు. శాండల్‌కు నిబ్బరించుకోటానికిగానీ, విశ్రాంతి తీసుకోటానికిగానీ సమయ మివ్వలేదు. ఎంతగా దెబ్బల మీద దెబ్బలు కురిపించసాగాడంటే, ప్రేక్షకులంతా లేచి నిలబడి క్షణం ఆపకుండా ప్రశంసలు కురిపించారు. అయితే, శాండల్ శక్తి, సహనం పేర్కొనవలిసినవి. యువకుడికి జరగబోయే భయంకర శిక్ష పట్ల భయకంపితుడయిన ఒక పోలీసు పెద్దాయన, రింగుకు పక్కన లేచి నిలబడ్డాడు, పోరాటాన్ని ఆపేందుకు. రౌండు అంతాన్ని సూచిస్తూ గంట మోగింది. శాండల్ తూలిపోతూ తన మూలకు చేరాడు. తను బాగానే ఉన్నాననీ, కలవరపడాల్సిందేం లేదని చెప్పటంతో పోలీసాయనకు ఒప్పుకోక తప్పలేదు.

తన మూల వెనక్కి వాలి, కష్టంమీద గాలి పీల్చుకుంటున్న టామ్ కింగ్ చాల నిరుత్సాహ పడ్డాడు. పోరాటం కనుక ఆపినట్లయితే, తప్పక రిఫరీ తన నిర్ణయాన్ని ఇవ్వవలసివచ్చేది. అప్పుడు తనకు పర్సు లభించేది. తను శాండల్ లాగా ఘనతకోసమో, లేక జీవనవృత్తిని ఏర్పరుచుకోటానికో కాదు, ముప్ఫయి క్విడ్‌లకోసం మాత్రమే పోరాడుతున్నాడు.

యువతకు విజయం లభిస్తుంది. ఈ మాట కింగ్ మనస్సులో ప్రతిధ్వనించింది. తను స్టొషేర్ బిల్‌ను పడగొట్టినప్పుడు, తను మొదటిసారిగా ఆ మాట విన్నాడు. పోరాటం తర్వాత ఓ షోకిల్లా పురుషుడు, తన భుజంమీద ప్రశంసాపూర్వకంగా తడ్తూ, ఆ మాటలన్నాడు. ఆ మాట నిజమే. ఇవ్వాళ ఆ యవ్వనం ఎదుటిమూల కూర్చుని ఉన్నది. తను ముసలివాడు. తనే కనుక శాండల్ లాగా పోరాడినట్లయితే, తను పదిహేను నిమిషాలుకూడ నిలబడి ఉండేవాడు కాదు. కానీ, తను బలాన్ని పుంజుకోలేక పోతున్నాడు. ఇక్కడికి వచ్చేందుకు తనా రెండు మైళ్లు నడచిరాకుండా ఉండాల్సింది. ఆ రోజు పొద్దుటినుండి తను ఆ మాంసంముక్కకోసం వెంపరలాడుతూనే ఉన్నాడు.

పదకొండో రౌండుకు గంట మోగుతూనే, తనకు నిజంగా లేని తాజాదనాన్ని ప్రదర్శిస్తూ ముందుకు దూకాడు. అది ప్రదర్శన అని కింగ్‌కు తెల్సు. క్రీడంత పాత ప్రదర్శన అది. ఎడమ చేతి నెత్తినట్టు నటిస్తూ, బదులుగా తప్పించుకునే ప్రయత్నాన్ని అనుమతిస్తూ, పై కొక్కెం వదుల్తూ, అరడుగు వెనక్కు వేసి, శాండల్ ముఖంమీద ఒక అప్పర్‌కట్‌ను గట్టిగా దించాడు. శాండల్ చాపమీద కూలిపోయాడు. ఆ తరువాత అతడిని విశ్రాంతి తీసుకోనివ్వలేదు కింగ్. తనకూ కొన్ని దెబ్బలు తగిలాయి, అయినా తనే అధికంగా దెబ్బతీయ గలిగాడు. అన్ని రకాలుగా దెబ్బతీస్తూ శాండల్‌ను తాడును ఆశ్రయింప చేశాడు. ఈ సమయానికల్లా, క్రీడాస్థలికి పిచ్చెక్కి నట్లయిపోయింది. "వెళ్లు, వాయించు, టామ్!" "కానీ, వాయించు, వాయించు, టామ్! అతడు పడిపోయినట్లే!" సుడిగాలిలా ఎగసి క్రీడ అంతమైపోవాలి ప్రేక్షకులకు. అందుకే వాళ్లు డబ్బు చెల్లించి వచ్చేది.

అరగంటసేపటినుండి తన బలాన్ని కాపాడుకుంటూ వస్తున్నాడు టామ్‌కింగ్. ఇప్పుడతను విచ్చలవిడిగా పెట్రేగిపోయాడు. తనకు తెల్సు– తనలా రేగిపోగలడని. తనకు దొరికే అవకాశం అదే; అప్పుడు లభిస్తే సరే, లేకపోతే మరెప్పటికీ దొరకదు. తన బలం వేగంగా క్షీణిస్తున్నది. అయితే, శాండల్‌ను పడగొట్టటం అంత తేలిగ్గాదని అతని కర్థమయింది. శాండల్ గిర్రున తిరిగిపోతున్నాడు, తూలి పోతున్నాడు. టామ్‌కింగ్ కాళ్లు విరిగిపోయేట్టున్నాయి. వేలి కణుపులు అతని మాట వినటం లేదు. కానీ, అతడు ఉక్కు దెబ్బలను తీయ కృతనిశ్చయుడయ్యాడు. తను తీసే ప్రతి దెబ్బా అతడి దెబ్బతిన్న చేతులకు నరకాన్ని చూపిస్తోంది. ఇప్పుడతనికి దెబ్బలు తగలకపోయి నప్పటికీ, తన ప్రత్యర్థిలాగే తనూ వేగంగా బలహీనపడసాగాడు. అతని దెబ్బలు సరిగానే పడుతున్నాయి, కానీ, వాటిల్లో బలం లేదు. అతడి కాళ్లు సీసంలా ఉన్నాయి, వాటిని ఈడుస్తున్నట్టు అందరికీ తెలుస్తూనే ఉంది. ఈ చిహ్నాలు చూసిన శాండల్ మద్దతుదారులు తమ వీరుడిని ప్రోత్సహించసాగారు.

కింగ్ మహా ప్రయత్నంతో విస్ఫోటించాడు. వరుసగా రెండు దెబ్బలు తీశాడు. కొద్దిగా ఎత్తున డొక్కలో ఓ ఎడమ దెబ్బ; దవడను వరుసుకుంటూ ఓ కుడి దెబ్బ. బలమైన దెబ్బలు కాకపోయినా, శాండల్ ఎంతగా బలహీన పడిపోయాడంటే, అతను కింద పడి గింగిర్లు తిరిగిపోయాడు. రిఫరీ అతనిమీదకు వంగి అతని చెవిలో లెక్క విన్పించసాగాడు. పదో క్షణం లెక్క పూర్తవకముందు అతను లేవక పోతే అతను ఓడిపోయినట్లే. క్రీడాస్థలి నిశ్శబ్దమైపోయింది. వణకిపోతున్న కాళ్లమీద కింగ్ నిలబడి ఉన్నాడు. అతడి కళ్లు తిరిగిపోతున్నాయి; రిఫరీ లెక్క ఎక్కడో దూరంనుండి విన్పించేట్టు అతని చెవిన బడుతున్నది. అంత

దెబ్బతిన్న మనిషి లేవటం అసాధ్యం. యువత మాత్రమే లేవ గలదు. శాండల్ లేచాడు. రిఫరీ "తొమ్మిది!" అని అరిచాక, అతడు లేచి, కాచుకునే భంగిమలో నిలబడ్డాడు; అతడి కుడి చెయ్యి ముఖాన్ని కప్పితే, ఎడంచెయ్యి పొట్టమీద ఉంది. అలా, శరీరంలోని ముఖ్య భాగాలను కాపాడుకుంటూ, శాండల్ ముందుకు దూకాడు, కింగ్ భుజాలు పట్టుకుని ఆపితే, తనకు కొద్ది సమయం లభిస్తుందని.

శాండల్ లేచిన క్షణంలోనే, కింగ్ అతడివైపు తిరిగి, రెండు దెబ్బలు తీశాడు కానీ, అవి అడ్డం పెట్టుకున్న చేతులకు తగిలి అసమర్థమయాయి. మరుక్షణంలో శాండల్ హతాశుడై కింగ్ భుజాలు పట్టుకుని ఉండిపోయాడు. ఇంక రిఫరీ ఇద్దరు బాక్సర్లను విడదీయటానికి తంటాలు పడ్డాడు. ఎంత వేగంగా యవ్వనం పుంజుకో గలదో కింగ్‌కు తెలుసు. తిరిగి అలా స్వాస్థ్యం పొందటాన్ని తను అరికట్టగలిగితే, అతడు తనవాడే నిస్సందేహంగా. అతడు శక్తికిమించి పోరాడాడు, ప్రత్యర్థిని మించి సమర్థత చూపాడు. శాండల్ అతని భుజాలను వదిలేసి నిలబడ్డాడు. పరాజయానికీ, బతికిబట్టకట్టటానికీ మధ్యవున్న వెంట్రుక వాసింత గీత మీద నిలబడి ఉన్నాడతను. ఒక్క గట్టి దెబ్బ చాలు అతణ్ణి లేవకుండా మట్టి కరిపించటానికి. టామ్ కింగ్‌కు చేదుగా తన మాంసం ముక్క కళ్ల ముందు కదలాడింది. తనివ్వాల్సిన ఆ పంచ్ తర్వాత అది తనదే! ఆ దెబ్బకు శక్తిని తెచ్చుకున్నాడు. తగిలింది కానీ, అందులో బలం లేదు, వేగం లేదు. తన శరీరం విదీర్ణమవుతున్న బాధతో మరో దెబ్బ తీశాడు. కానీ, అతడి శరీరం అతడికి విడాకులిచ్చింది. అతడిలో మిగిలి ఉన్నది పోరాడే తెలివి. అది కూడ అలసటతో మసకబారింది. దవడనుద్దేశించి ప్రయోగించిన దెబ్బ, భుజాన్ని దాటి పైకి లేవలేదు. అతని అలసిపోయిన కండరాలు అతని మాట వినలేదు. మళ్లా ఇంకోసారి ప్రయత్నించాడు టామ్. దెబ్బ అసలు లక్ష్యాన్ని చేరనేలేదు. తను నేలకు కూలకుండా ఉండేందుకు, శాండల్ భుజాలు పట్టుకున్నాడు.

> ప్రపంచ విజయాలు సాధించేది 'పుస్తకాల పురుగులే' అన్న సత్యాన్ని గుర్తించి విద్యార్థి సొంత గ్రంథాలయానికి శ్రీకారం చుట్టాలి.

అతడిని వదిలించుకునే ప్రయత్నం చెయ్యలేదు కింగ్. అతడు దెబ్బ తీశాడు. కింగ్ పని అయిపోయింది. యవ్వనం జయించింది. శాండల్ భుజాలు పట్టుకున్నప్పుడు కూడ అతడిలో పెంపొందుతున్న బలాన్ని కింగ్ అనుభూతి పొంద గలిగాడు. రిఫరీ ఇద్దరినీ విడదీసినప్పుడు, యువకుడు తిరిగి బలాన్ని పుంజుకోటం అతడు గమనించాడు. క్షణ క్షణానికీ శాండల్ బలం పెంచుకున్నాడు. మొదట్లో బలహీనంగా, అసమర్థమనిపించిన పంచ్‌లు నిర్దిష్టమయ్యాయి. చేజోడు ధరించిన పిడికిలి తన దవడకు రావటాన్ని మసకబారిన కింగ్ కళ్లు గమనించాయి; అతడు తన చేత్తో దాన్ని ఆపుదామనుకున్నాడు. ప్రమాదాన్ని చూశాడతను, మనస్సును కేంద్రీకరించి ప్రతిచర్య చేపట్టాడు. అయితే, ఆ చెయ్యి భారీగా ఉంది. దాంట్లో వెయ్యి బరువుల సీసం కరగబోసినట్లుంది. అది లేవ లేదు. తన ఆత్మతో అతడు దాన్ని ఎత్త ప్రయత్నించాడు. అప్పుడు చేజోడు ధరించిన పిడికిలి అతడిపై వాలింది. ఓ నిప్పుకణంలా, పుటుక్కున తెగిన అనుభూతి అతనికి కలిగింది; ఆ వెనువెంటనే, ఓ నల్లటి తెర అతడిని కప్పి వేసింది.

మళ్లా కళ్లు తెరిచే సమయానికల్లా, అతడు తన మూల కూర్చుని వున్నాడు. బోండీ బీచ్‌లో సముద్రం ఘోష పెట్టినట్టు, ప్రేక్షకుల అరుపులు అతని చెవిన పడ్డాయి. అతడి మెదడుపైన తడిపిన స్పాంజీని పెట్టారు. సిడ్ సల్లివాన్ అతని ముఖంమీద, గుండెలమీద చల్లటి నీటిని ధారగా పోస్తున్నాడు. అప్పటికే అతని చేజోళ్లను తీసేశారు. శాండల్ అతనిమీదకు వంగి అతడితో కరచాలనం చేస్తున్నాడు. తన్ను ఓడించిన ఆ మనిషి పట్ల తనకేం ద్వేషం లేదు. అతడు హృదయపూర్వకంగా దాన్ని స్వీకరించాడు. దెబ్బతిన్న అతని వేలి కణుపులు మాత్రం అతడిని బాధ పెట్టాయి. ఆ తర్వాత శాండల్ రింగ్ మధ్యనుండి యంగ్ ప్రోంటో సవాలును స్వీకరిస్తున్నట్టు, బెట్‌ను వంద పౌండ్లకు పెంచటాన్ని అంగీకరించు తున్నట్లు ప్రకటిస్తుంటే, జనం మౌనంగా ఉండిపోయారు. సెకండ్స్ తన శరీరాన్నీ, ముఖాన్నీ తడి గుడ్డతో తుడుస్తూ, తను రింగ్ విడచి వెళ్లేందుకు సిద్ధం చేస్తుంటే, కింగ్ ఉదాసీనంగా ఉండిపోయాడు. అతనికి ఆకలి వేసింది. మామూలుగా కరకర వేసే ఆకలి కాదు అది; ఓ మహా నిస్పృహ కలిగించే ఆకలి; పొట్ట అడుగున మొదలై, శరీరమంతా వ్యాపించిన ఆకలి. వెంట్రుక వాసి గీతమీద తూలిపడుతున్న శాండల్ అప్పుడతనికి గుర్తుకు వచ్చాడు. అవును. ఆ ఒక్క మాంసం ముక్క కాగల కార్యం నిర్వహించ గలిగి ఉండేది! ఆ నిర్ణయాత్మకమైన దెబ్బ తీయటానికి శక్తినిచ్చేందుకు అది అతనికి లేకపోయింది, తను ఓడిపోయాడు. ఒక్క మాంసం ముక్క అభావం అతన్ని నాశనం చేసింది.

అతడు తాళ్లను దాటి రావటానికి అతడి సహాయకులు సాయం చేశారు. వాళ్లను వదిలించుకుని, తాళ్లు దాటి బయట పడి, ఇతర్ల సాయం లేకుండానే బరువుగా నేల మీదకు గెంతాడు; జనం తప్పుకుని అతనికి తోవ నిచ్చారు. డ్రెస్సింగ్ రూంను వదలి, వీధిలోకి వెళ్లబోతూంటే, హాలు ద్వారం వద్ద ఒక యువకుడు, "అతను నీ చేతిలో వాడే! నువ్వెందుకు దూకి అతణ్ణి మట్టి కరిపించలేక పోయావ్?" అనడిగాడతను.

"ఫో, ఫో, పనేం లేదా, నీకు?" అని టామ్, వీధిలోకి అడుగు పెట్టాడు.

మూలమీద బారు తలుపులు ఊగుతున్నాయి. వెలుగుతున్న దీపాలు, చిరునవ్వులు చిందిస్తున్న బార్ మెయిడ్లూ అతనికి కన్పించారు. పోరాటం గురించి జనం మాట్లాడుకోవటం, సంపద ఖనేల్ మనటం అతనికి విన్పడింది. ఎవరో ఓ చుక్క పుచ్చుకోమని అతడిని ఆహ్వానించారు. అతడు సందేహించాడు, ఆ తరువాత తిరస్కరించి తన దోవన బయలు దేరాడు.

జేబులో రాగి పిక్క లేదు. ఇంటికి వెళ్లాల్సిన దూరం చాల సుదీర్ఘంగా కన్పించింది. తను నిశ్చయంగా వయసు మీద పడుతున్నవాడే. తన భార్య తనకోసం నిరీక్షిస్తుంటుంది; పోరాట ఫలితం తెలుసుకునే ఆత్రుతలో ఉంటుంది. ఆ ఆలోచన రాంగానే, డొమైన్ దాటి, బీచ్‌లో కూలబడిపోయాడతను. అన్ని పరాజయాలకంటే ఘోరమయింది ఇది; దీన్ని ఎదుర్కొనటం అసాధ్యం అన్పించింది అతనికి.

బలహీనంగా, బాధా తప్తుడై కుర్చుండిపోయాడతను. తను నౌకలో పని చేయ సిద్ధ పడినప్పటికీ, తనో పిడి పట్టుకోవాలన్నా, పలుగు లేక పార పట్టుకోవాలన్నా, కనీసం ఒక వారం రోజుల పాటయినా తను ఆగాల్సి వుంటుందని దెబ్బతిన్న తన వేలికణుపుల బాధ అతడిని హెచ్చరించింది. పొట్ట అడుగున మెలిపెడుతున్న ఆకలిబాధతో అతడి తల తిప్పినట్లయింది. తన దౌర్భాగ్య స్థితి అతడిని నలిపి వేసింది, అలవాటు లేని తడి అతడి కళ్లను తడిపేసింది. అతడు చేతుల్తో తన ముఖాన్ని కప్పుకుని ఏడ్చాడు. అప్పుడతనికి స్టోషేర్ బిల్ గుర్తుకు వచ్చాడు; యేండ్ల క్రితం ఆ రాత్రి తనతన్ని ఎలా మట్టి కరిపించాడో గుర్తుకు వచ్చింది. పాపం, స్టోషేర్ బిల్! డ్రెస్సింగ్ రూంలో బిల్ ఎందుకేడ్చాడో ఇప్పుడతనికి అవగతమయింది. ●

# క్యూ ఉద్యానవనం

## వర్జీనియా వుల్ఫ్ (1882-1941)

అనువాదం: కాకాని చక్రపాణి



రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో, లండనులోని సాహిత్యసమాజంలో ప్రముఖురాలై విరాజిల్లిన అడలైన్ వర్జీనియా వుల్ఫ్ లండను కెన్సింగ్‌టన్‌లో 1882 జనవరి 25న, సర్ లెస్లీస్టెఫెన్, జూలియా ప్రిన్‌సెప్ డక్‌వర్త్‌ల కుమార్తెగా జన్మించింది; తల్లిదండ్రులు ఇద్దరూ పేరున్న వారే; తండ్రి పిల్లలు, తల్లి పిల్లలు, తన తల్లీదండ్రుల సంతానంతోపాటు ఆమె పెరిగింది. ఆమె ఇంటికి ఎంతోమంది సాహిత్యవేత్తలు వచ్చేవారు. 1897-1901 మధ్యకాలంలో లండను కింగ్స్ కాలేజీ మహిళాశాఖలో, ఆమె గ్రీకు, లాటిన్, జర్మన్, చరిత్రల అధ్యయనం చేసింది. 1897లో తల్లి, 1904లో తండ్రి మరణించటం ఆమెను ఎంతో మానసిక క్లేశానికి గురిచేశాయి. వారి మరణం, లైంగిక వేధింపులు ఆమెను తరుచు నర్వస్ బ్రేక్‌డౌన్‌కు గురిచేయటంతో, ఆమె ఆసుపత్రిలో గడపాల్సి వచ్చేది. లండనులోని బ్లూమ్స్‌బరీ బృందంలో ఆమెకూడ ప్రముఖురాలైంది; అందులోని ఇతర ప్రముఖులు-లిటన్ స్ట్రాచీ, క్లయివ్ బెల్, రూపర్ట్ బ్రూక్, సెక్సాన్ సిడ్నీ-టర్నర్, డంకన్ గ్రాంట్, లియొనార్డ్ వుల్ఫ్, జాన్ మేనార్డ్ కేనీస్, డేవిడ్ గర్నెట్, రోజర్ ఫ్రైలు. వర్జీనియా 1912లో, లియొనార్డ్ వుల్ఫ్ ('పైసలేని యూదుడు')ను వివాహమాడింది. అది విజయవంతమైన వివాహంగానే పరిణమించింది. ఆమెకు 1922నుండి విటా శాక్‌విల్ వెస్ట్‌తోడి లెస్బియన్ సంబంధాలు కూడ తాను మరణించేవరకు కొనసాగాయి.

వర్జీనియా ఉల్ఫ్ వృత్తిపర పత్రికారచయితగా తన జీవితాన్ని 1900నుండే ప్రారంభించింది. ఆమె మొదటి నవల ది వాయేజ్ అవుట్ (1915); ఆమె చైతన్య స్రవంతి, పాత్రల అంతర్నిహిత ఉద్వేగ ప్రేరణలతో చేసిన ప్రయోగాలు పేర్కొనదగినవి. అలాంటి నవలే *Mrs. Dalloway* (1925); ఆమె తరువాతి రచనలు *To the Light House* (1927), *Orlando* (1928), *The Waves* (1931), *Flush A Biography* (1933); ఆమె చివరి రచన *Between Acts* (1941). డిప్రెషనుకు గురైన వుల్ఫ్ 1941 మార్చి 28న, ఓవర్‌కోటు ధరించి, జేబులనిండా రాళ్లు నింపుకుని, తన ఇంటికి సమీపంలో ఉన్న ఔస్ నదిలో మునిగి, తన జీవితానికి చరమాంకం పలికింది.

## ప్రపంచ రచయిత్రుల పరిచయాలు

# లెస్లీ మార్మన్ సిల్కో (1948 -)

జననం: న్యూమెక్సికోలోని అల్బుకర్క్‌లో. అమెరికన్ ఇండియన్, (పాబ్లో లాగూనా తెగ) తెల్లవాళ్ల మిశ్రమ సంతానం. తన పూర్వీకులు తరతరాలుగా నివసించిన లాగూనా పాబ్లో రిజర్వేషన్‌లో పెరిగింది. అక్కడే ఆమె తమ సాంప్రదాయాలనూ, జానపద కథలనూ అధ్యయనం చేసింది.

చదువు: "బోర్డ్ ఆఫ్ ఇండియన్ ఎఫేర్స్" నడిపే స్కూళ్లలో. యూనివర్సిటీ ఆఫ్ న్యూమెక్సికో నుండి 1969లో బి.ఎ. .1981లో యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనా (టూసన్)లో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా చేరింది. తొలి పుస్తకం ఒక కవితా సంకలనం. 1974లో వెలువడింది. ఇది అమెరికన్ ఇండియన్ గాథల ప్రేరణతో పొంగిన కవిత్వం. ఈమెకు విశేష ఖ్యాతి నార్జించిన నవల "సెరెమొనీ" (1977). అమెరికన్-ఇండియన్ సాహిత్యంలో ఒక మైలురాయి.

తెగవాళ్ల సమిష్టి జీవితానికీ, వ్యక్తి జీవితానికీ వున్న సంబంధాల్ని పరిశోధించిన నవల. ఇది రచయిత్రి ఆత్మకథాత్మకమని కూడా అంటారు. (కథలో సిల్కోలాంటి ఒక మిశ్రమజాతి యువకుడు రెండవ ప్రపంచ యుద్ధానంతరం తన లాగూనా రిజ్వరేషన్‌కు తిరిగి వస్తాడు). ఆమె ప్రచురించిన మరొక సంకలనం "స్టోరీటెల్లర్" - అనేక ప్రక్రియల సమ్మేళనం - ఆదివాసీ జానపద గాథలు, కవిత్వం, కుటుంబ చరిత్ర, కల్పన, చిత్రాలు. ఇందులో సిల్కో అనేక జానపద గాథల్ని ఆధునిక కథలుగా మలిచింది. ఈ పుస్తకం పాబ్లో సంస్కృతికి దర్పణం. ప్రముఖ కవి జాన్‌రైట్-సిల్కోల లేఖా సాహిత్యం "డెలికసీ అండ్ స్ట్రెంత్ ఆఫ్ లవ్" (1986) పేరుతో అచ్చయింది. ఆమె రాసిన మరో ముఖ్యమైన నవల 'అల్మనాక్ ఆఫ్ డెత్" (1991).

బహుమతులు, పురస్కారాలు: నేషనల్ ఎండోమెంట్ ఫర్ ది ఆర్ట్స్ ఫెల్లోషిప్ మాకార్థర్ ఫౌండేషన్ అవార్డ్స్ (1,75,600/-)

సంస్కృతీ, సాహిత్యాల గురించి సిల్కో

1. (మా) మౌఖిక సంప్రదాయంవల్ల చరిత్ర తెగకుండా రికార్డయ్యింది. ఇంగ్లీషు తెగవాళ్లు ఈ దేశానికి కొచ్చి అయిదు వందల సంవత్సరాలైంది. కాని మా జాతులు, తెగలు యిక్కడ కనీసం 18,000 సంవత్సరాలుగా వున్నాయి. (ఇందుకు నిర్దిష్టమైన సాక్ష్యాలున్నాయి). జానపద గాథలకు మరణం లేదు. ఎన్ని తరాలుగా వస్తున్నాయో అవి! (కాలచక్రం) అంటే సరళరేఖలా

---

అండాకారంలో ఉన్న పూలపొదునుండి హృదయాకారం, జిహ్వాకారంలో ఉన్న ఆకులను వ్యాపింప చేస్తూ వంద కాడలు పైకుబికి వచ్చాయి; సగం ఎత్తుకు ఎదిగాక, చివరలనవి ఎరుపు, నీలం, పసుపుపచ్చని ఆకర్షణ పత్రాలను వికసింప చేసుకున్నాయి; తాము ఉబికి వచ్చిన ఉపరితలపు రంగుల మచ్చలతో ఆ ఆకర్షణ పత్రాలు చిహ్నితమయ్యాయి. ఆ ఎరుపు, నీలం, పసుపుపచ్చని విషాదపు గొంతుకల నుండి, చివర కొద్దిగా ఉబికిన, బంగారపు చూర్ణం అద్దిన ఒక పొడుగాటి దండం పైకి అవతరించింది. వేసవి పవనాలకు చేతన పొందేట్లుగా ఆకర్షణపత్రాలు ఆయతనం పొందివున్నాయి; అవి కదలినప్పుడు ఎరుపు, నీలం, పసుపుపచ్చని వెలుగులు ఒకదానిపై ఒకటి ప్రసరించాయి; క్రింది కపిలవర్ణపు నేలను చాల జటిలమైన బిందువుగా వర్ణాంకితం చేశాయి; బూడిదరంగు వీపున్న రాయిమీదా, నత్తగుల్లపైనా ఈ వెలుగు పడుతున్నది; వర్షపు చుక్కమీదా పడుతున్నది; అది ఎరుపు, నీలం, పసుపుపచ్చని గాఢతలో ఎంతగా పల్చని జలకుడ్యాలపై వ్యాపించిందంటే, అవి విస్ఫోటితమై, అంతర్హితమయ్యేట్టున్నాయి. అందుకు బదులుగా, మరుక్షణంలోనే నీటిచుక్క వెండి బూడిదవర్ణంలోనే ఉండిపోయింది; ఇప్పుడు ప్రకాశం ఆకుకండపై స్థిరపడి ఉపరితలం క్రిందవున్న నారపోగులు శాఖలుగా చీలి ఉండటాన్ని బాహిర పరుస్తోంది; మళ్లా అది కదలి హృదయాకారం లేక జిహ్వాకారంలో ఉన్న ఆకుల గుమ్మటం క్రింది విస్తారపు పచ్చని స్థలాలపై వెలుగులు చిమ్మింది. అప్పుడు పైన పవనం మరింత చురుగ్గా కదలి పైనుండే గాలిలోకీ, జులైలో క్యూ ఉద్యానవనంలో విహరించే స్త్రీ, పురుషుల కళ్లల్లోకీ ప్రసరించింది.

స్త్రీ, పురుషుల ఆకారాలు పూలపొదులను దాటి విచిత్రమన్పించే అక్రమ కదలికల్లో- పచ్చగడ్డిమైదానంలో, ఒకపొదు నుండి మరొకపొదుకు కుటిల విహరణ చేసే తెలుపు, నీలం సీతాకోకచిలుకల గతిని తలపించేట్టుగా- సాగాయి. పురుషుడు స్త్రీకి ఆరంగుళాల ముందు ఏం పట్టనట్టుగా నడుస్తున్నాడు; ఆమె కదలిక ప్రయోజన పూర్ణంగా ఉంది; పిల్లలు మరీ వెనకబడిలేరు కదా అని చూసేందుకు తల తిప్పి, వెనక్కి చూస్తూ, ముందుకు సాగింది. పురుషుడు స్త్రీకి ముందుండి, కావాలనే దూరాన్ని పాటిస్తున్నాడు; బహుశః, తనకు తెలియకుండానే, తన ఆలోచనలలో మునిగి ముందుకు సాగుతూ ఉండి వుండవచ్చు.

'పదిహేనేళ్లక్రితం నేనిక్కడికి లిలీతో వచ్చాను,' అనుకున్నాడతను. 'అక్కడెక్కడో సరస్సు పక్కన మేం కూర్చున్నాం; ఆ వెచ్చటి అపరాహ్ణమంతా నేను ఆమెను వివాహమాడమని అర్థిస్తూనే గడిపాను. తూనీగ మా ఇద్దరి చుట్టూ ఎలా తిరుగుతూ ఉండిందనీ: నేను తూనీగనూ, ఆమె చెప్పుకున్న కాలివేలి నలుచదరపు వెండికొక్కెం వైపూ ఎంత స్పష్టంగా చూశాననీ. నేను ఆమెతో మాట్లాడినంతసేపూ ఆమె వేలి పట్టీవంకే చూశాను; అది అసహనంగా కదలగానే, పైకి చూడకుండానే, ఆమె ఏం చెప్పబోతోందో నాకు తెల్సు; ఆమె మొత్తమంతా ఆ చెప్పులోనే ఉన్నట్లనిపించింది; నా ప్రేమ, వాంఛ తూనీగలో ఉన్నట్టుంది; ఏ కారణంవల్లో మరి, అదక్కడ, ఆ ఆకు మీద,అదే- విశాలంగా, మధ్యలో ఎర్రటిపువ్వున్న ఆకు మీద- స్థిరపడిపోయినట్లయితే, ఆమె వెంటనే 'సరే' అంటుందని అన్పించింది నాకు; అయితే తూనీగ వలయాలు చుట్టూనే ఉంది: అదెక్కడా స్థిరపడలేదు. నాకు సంతోషం కలిగించేటట్లు స్థిరపడలేదు; లేకపోతే, నేనిక్కడ ఎలీనార్‌తోను, పిల్లలతోనూ తిరుగుతూ ఉండేవాడిని కాదు-' 'ఎలీనార్, చెప్పు. నువ్వు గతం గురించెప్పుడైనా ఆలోచిస్తావా?"

"ఎందుకడుగుతావు, సైమన్?"

"ఎందుకంటే, నేను గతం గురించి ఆలోచిస్తున్నాను కనుక. నేను లిలీని గురించి ఆలోచిస్తున్నాను; నేను పెళ్లి చేసుకుని ఉండే స్త్రీ ఆమె... సరే, ఎందుకూ మౌనంగా ఉండిపోయావు? నేను గతం గురించి ఆలోచిస్తే నీకేమయినా అభ్యంతరమా?"

"నాకెందుకూ అభ్యంతరం, సైమన్? స్త్రీలూ, పురుషులూ చెట్లకింద ఉండే తోటలో, ఎవరూ గతం గురించి ఆలోచించరా? వాళ్లందరూ ఎవరి గతకాలంవారు వారు కాదా, ఆ స్త్రీలూ, పురుషులూ దాని శేషమంతా కాదా, ఆ చెట్లకింద దయ్యాలు... ఎవరో ఒకరి ఆనందం, వాస్తవం కాదా?"

"నాకు ఆ నలుచదరపు చెప్పు వెండికొక్కెం, ఒక తూనీగ-"

"నాకు ఒక ముద్దు. ఇరవయ్యేళ్ల క్రితం ఆరుగురు చిన్న అమ్మాయిలు తమ ఈజెల్ (చిత్రాలు వేసేందుకైన ఏటవాలు బల్ల) ముందు నిలబడి, కలువ (వాటర్ లిలీ) పూవులను, నేను మొదటిసారిగా చూసిన ఎరుపు కలువలను చిత్రిస్తున్నారని ఊహించుకో. అకస్మాత్తుగా, నా మెడ వెనుక ఒక ముద్దు! ఆ మధ్యాహ్నమంతా నా చెయ్యి వణకుతూనే ఉండిపోయింది, నేను చిత్రించలేక

నేరుగా వుండదు కాలరూపం. ఈ విషయం ఒప్పుకుంటే పాతా కొత్తా పక్క పక్కనే వుంటాయని కూడా అంగీకరించక తప్పదు. ఐన్‌స్టీన్ సిద్ధాంతంలో నాకు నచ్చిన విషయం యిదే. కాలం సరళరేఖ కాదు. కాస్త వంగి వుంటుంది.... వేల సంవత్సరాల చరిత్రలో 500 ఏళ్లెంత!

2. కథ చెప్పమంటే విషయాల్ని, వస్తువుల్ని పునర్నిర్వచించటం కాదు. ఈ దేశానికి క్రిస్టియన్లు రాకముందు ప్రజలెలా వుండే వాళ్లో తెలుసుకోవాలని ప్రయత్నించాను. ఆ క్రమంలో బ్రిటన్, జర్మనీల చరిత్ర కూడా పరిశీలించాను. బహుశా ప్రపంచ వ్యాప్తంగా– కనీసం యూరోప్‌లో ఆది వాసులందరికీ ఒకే జీవిత విధానం వుండేదేమో! ప్రకృతి ఒడిలో బతికే మనుషులందరూ ఒకేలా జీవించటంలో ఆశ్చర్యం లేదు. బ్రిటన్‌లో ఒక జానపద కథ ప్రచారంలో వుంది. ఒక ఆవు ఎవరికి కావలసినన్ని పాలు వాళ్లకిస్తుంది. ఒకనాడు ఒక మంత్రగత్తె వచ్చి చిల్లుల బకెట్‌లోకి పాలు పితుకుతుంది. ఆవు అంతర్థానమవుతుంది. ఏమిటి దీని నీతి? దురాశ దుఃఖానికి చేటనేగా. ఆవు ఒక ప్రకృతి శక్తి. ఇలాంటి కథల్లో ఎంత జ్ఞానం నిక్షిప్తమయి వుంటుందో! కాని క్రిస్టియన్లు ప్రాచీన, ఆదిమ సంస్కృతులను చిన్నచూపు చూశారు.

3. ("నెరెమొనీ" కవర్‌పేజీ డ్రాయింగ్ ఓ కళాఖండం. దాన్ని మ్యూజియంలో భద్రపరిచారు.)

మేం (అమెరికన్ ఆదివాసులం) ఒక స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాం. కాని తెల్లవాళ్లు మిమ్మల్ని సెకండ్‌రేట్ పౌరులుగా చూశారు. మా సంస్కృతిని నాశనం చేయ ప్రయత్నించారు. మమ్మల్ని పుస్తకాలు ప్రచురించనీయలేదు. 1960లలో కొద్దిగా స్వేచ్ఛ వచ్చింది.

అయితే, మాది మౌలికంగా మౌఖిక సాంప్రదాయం. మా సంస్కృతి యింకా సజీవంగా వుండటానికి కారణం అదే.

4. వేల సంవత్సరాలుగా నేలతల్లిని నమ్ముకుని బతికిన వాళ్లను ఆదివాసులంటారు. అయితే తొలి దశలో మనుషులు నిత్య సంచారులు. అందువల్ల ఒక రకంగా అందరూ ఆదివాసులే.

5. మనిషి ప్రకృతిలో ఒక భాగం. అంటే ప్రకృతిశక్తి. కాని ఆధునిక సమాజంలో స్టాక్ మార్కెట్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ కంపెనీలు మన జీవితాల్ని శాసిస్తున్నాయి. మన కోరికలు, అవసరాలు శరీర సహజమైనవి కావు. డబ్బు ఒక డ్రగ్‌లాగ మారింది.

---

పోయాను. నేను నా వాచ్‌ని చూశాను, ఒక్క ఐదు నిమిషాలు మాత్రమే ఆ ముద్దును– అమూల్యమైన ముద్దును గురించి ఆలోచించటానికి కేటాయించుకున్నాను; అది ముక్కుమీద పులిపిరితో వుండే నెరసినజుట్టు ముసలావిడ పెట్టిన ముద్దు, నా జీవితంలోని అన్ని ముద్దులకు తల్లిలాంటిది. కరోలిన్, రా, హ్యూబర్ట్, రా."

వాళ్లు పూలపాదును దాటి నడిచారు; ఇప్పుడు నలుగురు కల్సి ఒకరిపక్కన ఒకరు నడిచారు; త్వరలోనే చెట్లమధ్య పరిమాణంతో కుదించుకుపోయారు; చంచలంగా, అస్తవ్యస్తంగా ఎండ, నీడల పెద్దతునకలు వారి వీపుల నడయాడుతుంటే, వాళ్లు సగం పారదర్శకంగా కన్పించారు.

అండాకారపు పూలపాదులో, రెండు నిమిషాల వ్యవధిలో తన గవ్వపై ఎరుపు, నీలం, పసుపుపచ్చని రంగులు వేసుకున్న నత్త తన గవ్వలో మెల్లగా కదులు తున్నట్లు ఇప్పుడు కన్పించింది; వదులుగా ఉన్న మట్టిముక్కలు అది వాటిపైనుండి కదలుతూంటే విరిగి, పక్కకు దొర్లాయి.దానికి ముందేదో నిశ్చితమైన లక్ష్యమున్నట్లు కన్పించింది; ఈ విషయంలో, దానిముందు దాటటానికి ప్రయత్నించిన కోణాలపెద్దకాళ్ల పచ్చ కీటకం వ్యవహారం భిన్నంగా ఉంది; దాని మీసాలు ఆలోచనలో ఉన్నట్లు కదులుతూంటే, ఒక క్షణం నిరీక్షించి, ఆ పిమ్మట వెనక్కి తిరిగి వేగంగా, విచిత్రంగా ఎదురుదిక్కులో వెళ్లింది. కపిలవర్ణపు శిఖరాలు, కింది లోతైనలోయల్లో పచ్చటి సరస్సులు, వేరునుండి పైదాకా చదునుగా, కత్తుల్లా ఉండే చెట్లు, బూడిదరాళ్ల గుండ్రటి బండలు. చిటపటమనే పల్చటి నేత ఉన్న విశాలపు కూలిన ఉపరితలాలు– ఇవన్నీ నత్త ఒక కాడ నుండి మరొక కాడకు తన లక్ష్యంగా సాగే ప్రస్థానంలోని అడ్డంకులు. మృతపత్రపు కమానుగుదారం పక్కకు తొలగి వెళ్లాలా! ఎక్కి వెళ్లాలా! అని అది నిశ్చయించుకోకముందే, ఇతర మానవుల కాళ్లు పాదును దాటాయి.

ఈ సారి ఆ ఇద్దరూ మగవాళ్లే. ఇద్దరిలోనూ యువకుడు బహుశః నిరంతరం ప్రశాంతస్వభావం కలిగిన వ్యక్తిగా కన్పించాడు; తన మిత్రుడు మాట్లాడుతుంటే, అతడు తన కళ్లు పైకెత్తి, స్థిరంగా ముందుకు చూశాడు; మిత్రుడు మాట్లాడటం ఆపేయటంతో అతడు మళ్లా కళ్లు కిందకు దించాడు; ఒక్కోసారి, చాలసేపు ఆగి పెదాలు తెరిచేవాడు, ఒకోసారి అసలు తెరిచేవాడు కాదు. ఇద్దరిలో పెద్దవాడు విచిత్రంగా సమతౌల్యంతో నడిచేవాడు కాదు, చలిస్తూ నడిచే పద్ధతి అతడిది; చేతిని ముందుకు దూసేవాడు, తలను అమాంతం ముందుకు తోసేవాడు; ఆ తీరు ఇంటిముందు ఎదురుచూసి విసిగిపోయిన బండి గుర్రం అసహనాన్ని వ్యక్తపరిచే టట్లుంటుంది; అయితే మనిషిలో ఈ హావభావాలు సంకల్ప, అర్థరాహిత్యాలను తెలిపెట్టున్నాయి.అతడు నిరంతరం మాట్లాడుతూనే ఉన్నాడు; అతడు మృతాత్మల గురించి మాట్లాడుతున్నాడు; అవి స్వర్గంలోని తమ విచిత్ర అనుభవాలగురించి ఇప్పుడతనికి చెప్తున్నాయి.

"ప్రాచీనులకు స్వర్గం థెసలీనే అన్పించేది, విలియమ్! ఇప్పుడు, ఈ యుద్ధంతో ఆత్మ పదార్థం పిడుగులా పర్వతాలమధ్యన దొర్లుతోంది." అతడు ఆగి, విన్నట్లు చిరునవ్వు చిందించాడు, తను ముందుకు సాగి కొనసాగించాడు–

"మా దగ్గరో చిన్న ఎలక్ట్రిక్ బాటరీ ఉంది, వైరును ఇన్సులేట్ చెయ్యటానికి– వేరుగా ఉంచటానికి– ఓ రబ్బరు ముక్కా ఉంది, సరే, మనం వివరణల జోలికి పోవద్దు. అర్థంకాని వివరణలకు పోయినందువల్ల ఒరిగే మంచేమీ లేదు– క్లుప్తంగా, ఆ చిన్న యంత్రం పడక తలపక్కన అనువైన స్థానంలోనిలబెట్టటం జరుగుతుంది, చక్కటి, శుభ్రంగా మెహగనీ టేబుల్ అనుకుందాం. విధవ తన చెవిని అనుసంధించి, నిర్ణీత చిహ్నం ద్వారా ఆత్మకు ఆవాహన పల్కుతుంది. స్త్రీలూ! విధవలూ! నలుపు ఉడుపులు ధరించిన స్త్రీలూ–"

ఇక్కడ ఒక స్త్రీ ధరించిన డ్రస్సు అతని దృష్టికి వచ్చినట్లుంది; అది ముదురు వంగపన్నెచాయలో ఉంది. అతడు తన హాటు తీసేశాడు, చెయ్యి గుండెమీద ఆనించుకున్నాడు, ఏదో పిచ్చిగా గొణుక్కుంటూ, హావభావాలు ప్రదర్శిస్తూ, ఆమెవైపుగా హడావుడిగా నడిచాడు. అయితే, విలియమ్ అతని చొక్కా చెయ్యి పట్టుకుని ఆపి, ముసలిమనిషి దృష్టి మరల్చేందుకు, తన వాకింగ్–స్టిక్ చివరతో ఒక పూవును స్పృశించాడు. ఒక క్షణం దానివంక అయోమయంగా చూశాక, ముసలి మనిషి దాని మాటలు వినటానికన్నట్లు దానికి చెవి ఒగ్గాడు, దాన్నుండి మాట్లాడుతున్న గొంతుకకు సమాధానమిస్తున్నట్లు కన్పించాడు; అతడు ఐరోపాలోకెల్లా మహా సౌందర్యవతి అయిన యువతి సాహచర్యంలో, వందలయేండ్ల క్రితం తాము కలసి తిరిగిన యురుగే అడవుల గురించి మాట్లాడటం ప్రారంభించాడతను. ఉష్ణమండలాల గులాబి మైనపు పూరేకుల దుప్పటికప్పుకున్న అడవుల గురించి, రజనీకోకిలలు, సముద్ర తీరాలు, సముద్ర కన్యకలు, సముద్రంలో మునిగిపోయిన యువతుల గురించిన దృశ్యాలతో

గుసగుసగా మాట్లాడుతున్నట్లు అతని మాటలు వినవచ్చాయి; విలియమ్ కదిపినప్పుడు, అతనికి బాధ అన్పించింది.

అతని హావభావాలపట్ల కొద్దిగా అయోమయంలో పడిన ఇద్దరు దిగువమధ్య తరగతి వయసుడిగిన స్త్రీలు, అతని అడుగులను సన్నిహితంగా అనుసరిస్తూ వచ్చారు; ఒకామె లావుగా, భారీగా ఉంటే, రెండవ ఆమె గులాబి బుగ్గలతో, చురుగ్గా ఉంది. గతి తప్పిన మతిని సూచించే ఉత్కేంద్రిత, వైపరీత్యాల చిహ్నాలపట్ల– ముఖ్యంగా కలిగిన వాళ్లలో అవి కన్పిస్తే– తమ జీవనస్థాయిలోని చాలామంది జనాల్లాగే, వారూ మొహమాటం లేకుండా మంత్రముగ్ధలై చూశారు. అయితే, ఆ హావభావాలు విపరీత మనస్కతకు సంబంధించినవేనా, లేక పిచ్చిచేష్టలా అని గట్టిగా నిర్ధారించుకోలేక పోయారు. ముసలాయన వీపును మౌనంగా ఒక క్షణం పరిశీలించాక, ఒకళ్ల నొకళ్లు విచిత్రపు ధూర్త దృష్టిని బరపుకుని, ఉత్సాహవంతంగా సంక్లిష్ట సంభాషణను జోడించుకుంటూ, ముందుకు కదిలారు:

"నెల్, బెర్ట్, లాట్, సెస్, నాన్న, అతడన్నాడు, నేనన్నాను, ఆమె అన్నది, నేనన్నాను, నేనన్నాను,నేనన్నాను–"

"నా బెర్ట్, సోదరీ, బిల్, తాత, ముసలాయన, పంచదార, పంచదార, పిండి, ఉప్పు చేపలు, ఆకు కూరలు, పంచదార, పంచదార, పంచదార."

భారీ ఆడమనిషి కదలక, స్థిరంగా, నిట్టనిలువుగా భూమిలో నిలబడి ఉన్న పూవులమీద పడుతున్న మాటల తీరు వంక చూస్తూ కుతూహలపూర్ణమైన అభివ్యక్తిని ప్రదర్శించింది. కనుక ఆ భారీ ఆడమనిషి అండాకారంలో ఉన్న ఆ పూలపాదు ఎదురుగా స్థాణువులా నిలబడి, తన పక్కామె ఏం చెబుతున్నదో వింటున్న అభినయం కూడ మానేసింది. ఆ తర్వాత, తామెక్కడైనా సీటు చూసుకుని టీ తాగుదామంది.

మృతపత్రం పక్కకు తొలగకుండానూ, ఎక్కకుండానూ తన లక్ష్యాన్ని చేరే ప్రతి సాధ్యపద్ధతి గురించీ ఇప్పుడు నత్త ఆలోచించింది. ఆకును అధిరోహించాల్సిన శ్రమనలా ఉంచి, తన శృంగాగ్రాలతో స్పృశించినా, ప్రమాదభరిత చిటపటలతో చంచలించే పల్చటి నేత, తన భారాన్ని భరించగలదా! అని అది సందేహంలో పడిపోయింది; ఫలితంగా, దాని కిందుగా పాకుదామన్న నిశ్చయానికి వచ్చింది అది; నేలనుండిఎత్తుగా వంకర తిరిగిన ఆకు ఒక కనుమకు ఆస్కారమిచ్చి, తను దూరటానికి వీలుగా ఉండటంతో అది ఆ నిశ్చయాని కొచ్చింది. అదలా లోపలకు తలదూర్చి, పైన ఎత్తుగా ఉన్న కపిలవర్ణపు కప్పు పరిస్థితిని పరికిస్తున్న సమయంలో, మరో ఇద్దరు మనుష్యులు పచ్చిక బయలులో నడవటం సంభవించింది. వీరిద్దరూ వయసులో ఉన్నవారే; తమ జిగట తిత్తినుండి పూవు మెత్తటి వంగవన్నెపు మడతలను విచ్చుకోకముందున్నట్లు, శీతాకోక చిలుక రెక్కలు పూర్తిగా ఎదిగినా చలన రహితంగా ఎండలో ఉన్నట్లు ఉన్న ఒక యువతి, యువకుడు వారిద్దరూ.

"ఇవాళ శుక్రవారం కాకపోవటం మన అదృష్టం," అన్నాడతడు.

"ఎందుకనీ? నువ్వు అదృష్టాన్ని నమ్ముతావా?"

"శుక్రవారమయితే, ఆరు పెన్నీలు చెల్లించాలి!"

"ఆరు పెన్నీలెంతేం? ఇది ఆరు పెన్నీల విలువ చెయ్యదా?"

"'ఇది' అంటే– 'ఇది' అనటంలో నీ ఉద్దేశమేమిటి?"

"ఏమో, ఏదయినా అవొచ్చు.నా ఉద్దేశం– నా ఉద్దేశమేమిటో నీకు తెల్సు."

ఈ ఉవాచల మధ్య సుదీర్ఘమైన వ్యవధానాలున్నాయి; ధ్వని రహిత ఏకస్వనంలో వాళ్లు మాట్లాడుకున్నారు. పూలపాదు అంచున ఆమె గొడుగును మెత్తటి మట్టిలోకి జొనిపి ఆ జంట నిలబడింది; ఆ పనీ, ఆమె చెయ్యిపైన అతని చెయ్యి ఉందన్న వాస్తవం వారి భావాలను చాల విలక్షణమైన రీతిలో వ్యక్తీకరించాయి; ఈ చిన్న ప్రాముఖ్యంలేని మాటలు ఏదో కొంత అభివ్యక్తం చేసినట్లే ఆ చర్యలూ ఉన్నాయి; పొట్టిరెక్కలున్న వాటి (మాటల) అర్థాల బరువు శరీరాలను మోసుకెళ్లేందుకు అవి పర్యాప్తం కాదు; కనుక, తమను చుట్టి ఉన్న మామూలు వస్తువులమీద అవి ఇబ్బందిగా వాలాయి; వాటి అనుభవరహిత

---

## ప్రపంచ రచయిత్రుల పరిచయాలు

### ఏంజిలా కార్టర్ (1940–1992)

ఇంగ్లండ్‌లోని ఈస్ట్‌బార్న్‌లో జననం. బాల్యం యార్క్‌షైర్‌లో గడిచింది. చదువు బ్రిస్టల్ యూనివర్సిటీలో. జర్నలిస్టుగా ప్రారంభించి, "ఈ మూణ్ణాళ్ల జీవితాన్ని యిలా తగలెయ్య కూడదనుకుని" సృజనాత్మకత సాహిత్యసృష్టికి జీవితం అంకితం చేసింది. మొదటి నవల 'షాడోడాన్స్' 1965లో రాసింది. మరో రెండేళ్ల తర్వాత "ది మ్యాజిక్ టాయ్‌షాప్" రాసి జాన్ లెవెలిన్ రైస్ బహుమానం గెల్చుకుంది.

1969లో 'హీరోస్ అండ్ విలన్స్', 1971లో వచ్చిన 'లవ్' ఆమె కీర్తిప్రతిష్ఠల్ని మరింత పెంచాయి. కొంతకాలం జపాను విశ్వవిద్యాలయాల్లో (1976–78), మరికొంత కాలం షెఫీల్డ్ యూనివర్శిటీలో, ఆస్ట్రేలియాలోని అడిలెయిడ్, బ్రౌన్ (అమెరికా) యూనివర్శిటీల్లో బోధన. అప్పటికే 'సెవరల్ పర్‌సెప్షన్'తో సామర్సెట్‌మాం అవార్డు గెల్చుకొని సాహిత్యంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఆమె యితర నవలలు:

ది పాషన్ ఆఫ్ నూఈవ్ (1977), 1984లో వెలువడిన నైట్స్ ఎట్‌ది సర్కస్, జాన్ టెయిట్ బ్లాక్ మెమోరియల్ ప్రైజ్ గెలుచుకుంది.

ప్రచురించిన కథాసంపుటాలు:

ఫైర్‌వర్క్స్ (1974), ది బ్లడీ ఛేంబర్ (1979) (కెల్టెన్‌హాం ఫెస్టివల్ ఆఫ్ లిటరేచర్ సన్మానం), బ్లాక్ వీనస్ (1985). "అమెరికన్ ఘోస్ట్స్ అండ్ ఓల్డ్ వరల్డ్ వండర్స్" ఆమెరికాలోని మరోకొత్త కోణాన్ని ఆవిష్కరించింది. కథల సమగ్ర సంకలనం పేరు "బర్నింగ్ యువర్ బోట్స్."

ఆమె పరిశోధన/సామాజిక పరిశీలన వ్యాసాలు: ది సాడేన్ వుమన్ – ఎన్ ఎక్సర్ సైజ్ యిన్ కల్చరల్ హిస్టరీ, ఎక్స్ప్లేటివ్స్ డిలీటెడ్, నథింగ్ సేక్రెడ్ (పత్రికా రచన).

బాలసాహిత్యంలో అధిక కృషి చేసింది కార్టర్. 1974లో ఫ్రెంచి రచయిత చార్ల్స్ పెరా రాసిన 'ఫెయిరీటేల్స్'ను అనువాదం చేసింది. ఓ కథల పుస్తకం 'ది ఇన్ ఫెర్నల్ డిజైర్ మెషిన్స్ ఆఫ్ డాక్టరు హోఫ్‌మాన్' కూడా వెలువడింది. వెరసి, ఇంగ్లండ్‌లోని అత్యంత సంచలన, వివాదాస్పద, ప్రతిభావంతురాలైన రచయిత్రిగా అవతరించింది.

కార్టర్, మార్కిస్ డిసేడ్ 'అశ్లీల' సాహిత్యం (పోర్నోగ్రఫీ) మీద ఒక స్త్రీవాద అధ్యయనం చేసింది.

ఈమెకు కవయిత్రిగా కూడా మంచి పేరుంది. సినిమా స్క్రిప్టులూ రాసింది. ఇవన్నీ గాక అనేక కథల సంపుటాలు సంకలనం చేసింది. అందులో కొన్ని "వేవర్డ్ గర్ల్స్ అండ్ వికెడ్ విమెన్", విరాగో 'బుక్ ఆఫ్ ఫెయిరీ టేల్స్' వగైరా.

ఆమె చివరి నవల వైజ్ చిల్డ్రన్ (1991). కార్టర్ తన 51వ ఏట 1992లో లండన్‌లో మరణించినప్పుడు, "ఇంగ్లీషు సాహిత్యానికి తీరని లోటు" అంటూ కీర్తించారు సాహితీప్రియులు.

స్పర్శకు భారీతనాన్ని అనుభూతం చేసుకుంటాయి; కానీ, ఎలాంటి నిటారు జాగాలు వాటిల్లో దాగి ఉన్నాయో, ఎలా మరోవైపు ఎండలో ఎలాంటి ఏటవాలులు వెలుగుతున్నాయో ఎవరికి తెల్సు? (గొడుగును నేలలోకి తోస్తూ వాళ్లలా అనుకున్నారు.) ఇంతకు ముందు దీన్నెవరు చూశారు? క్యూ (ఉద్యానవనం)లో ఎలాంటి టీ వాళ్లు ఇస్తారో? అని ఆమె అన్నా, ఆమె మాటల వెనుక అస్పష్టంగా ఏదో ఉందని అతననుకున్నాడు; ఆ మాటలవెనుక గొప్పదీ, ఘనమైనదీ ఏదో వున్నట్టు అతడు భావించాడు; పొగమంచు, మెల్లగా లేచి, అనాచ్ఛాదితం చేసింది– అయ్యో దేవుడా! వాటి రూపాలేమిటి?– చిన్న బల్లలు, మొదటామెనీ ఆ తరువాత అతడినీ చూసిన వెయిట్రెస్‌లు, వాస్తవమైన రెండు షిల్లింగుల నాణెంతో అతడు చెల్లించాల్సిన బిల్లు; అది వాస్తవం, మొత్తం వాస్తవమే– అని తన జేబులో ఆ నాణాన్ని స్పృశిస్తూ అతడు నిశ్చయం చేసుకున్నాడు; అతనికది వాస్తవంలాగానే కనపడసాగింది. అప్పుడు అలా నుంచుని, ఆలోచిస్తూ వుండటం ఉత్తేజకరంగా చాలసేపుండక పోవటంతో, ఒక్క ఊపుతో అతడు గొడుగు బయటకు లాగి, ఇతరజనాలలా, ఇతర జనాలతోపాటు టీ తాగే జాగాకోసం అసహనంగా చూశాడు.

"పద ట్రిస్సీ, మనం టీ తాగే సమయమయింది."

"ఏ మనిషయినా తన టీ తానెక్కడ తాగాలి?" తన గొంతుకలో ఉత్తేజపు విచిత్ర హృదయకంపావేశంతో అడిగిందామె. తన టీ సంగతి మర్చిపోయి ఇప్పుడు ఈ దిగువకూ, అప్పుడు ఆ దిగువకూ వెళ్లాలనుకుంటూ, ఒక చైనీయుల ఆలయాన్నీ, ఎరుపు కుచ్చులున్న పక్షినీ, లేత ఎరుపురంగు పూల ఆర్కిడ్ చెట్టునూ, కొంగలను గుర్తుకుతెచ్చుకుంది ఆమె; అయితే, అతడు ఆమెను ముందుకు లాక్కు వెళ్లాడు.

అలా జంటలు ఒకదాని తర్వాత మరొకటిగా అస్తవ్యస్తపు, లక్ష్యరహిత కదలికలతోనే పూలపాదును దాటి వెళ్లిపోయారు; పచ్చని, నీలపు ఆవిరి పొరలలో కలిసిపోయారు; మొదటగా వారి శరీర ద్రవ్యం, రంగుపూతలతో కలిసి, ఆ తర్వాత వారి ద్రవ్యం, రంగు పచ్చని నీలపు వాతావరణంతో మిళితమైపోయాయి. ఎంత వేడిగా ఉంది ఇది! ఒక మాంత్రిక పక్షిగా, పాటలపక్షి థ్రష్ కూడ దుముకేంతగా వేడిగా ఉంది; పూలనీడల్లో ఒక కదలికకు, తరువాతి కదలికకు దీర్ఘవిరామాలు తీసుకుంటూ దుముకిందది; అస్పష్టంగా, లక్ష్యరహితంగా ఎగరాల్సిన శీతాకోకచిలుకలు అందుకు బదులుగా ఒకదానిపై ఒకటిగా ఎగిరాయి; ఎత్తయిన పూలపై సాగే వాటి కదిలే వరుసలు విరిగిన పాలరాతి స్తంభాల ఆకార రేఖను తలపిస్తున్నాయి; మెరుగులీనుతున్న పచ్చటి గొడుగుల విపణి అంతా ఎండలో తెరుచుకున్నట్లుగా ఫామ్ హవుసుల గాజు కప్పులు వెలిగాయి; విమానపు రొదలో వేసవి నింగి గొంతు తన ప్రచండాత్మను విన్పించింది. పసుపుపచ్చదనం, నలుపు, ఊదారంగు, మంచు తెలుపు– ఈ రంగుల ఆకారాలు, స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరూ ఒక క్షణంపాటు క్షితిజంలో వ్యక్తమయ్యారు; ఆపైన గడ్డిపై పరుచుకున్న పసుపు పచ్చని విస్తారతను చూసి వారు సంకోచించారు, చెట్ల నీడలను ఆశ్రయించారు; పసుపుపచ్చని, పచ్చని వాతావరణంలో నీలి బిందువులుగా కరిగిపోయారు; వాతావరణాన్ని ఎరుపు, నీలం రంగులతో పేలవంగా రచిస్తూ వెళ్లారు. వేడిలో అన్ని స్థూల, భారీ శరీరాలన్నీ నేలమీద పడివున్నట్లనిపించింది; అయితే, సంకోచిస్తూ వెలువడిన వారి గొంతులు మైనపువత్తుల మందమైన శరీరాల్లోనుండి మంట నాలుక చాచినట్లుగా ఉన్నాయి. గొంతులు; అవును, గొంతులు, మాటల్లేని గొంతులు! పూర్తి సంతృప్తి లోతులనుండి, వాంఛల ఉద్వేగం నుండి, పిల్ల ఆశ్చర్యపు తాజాదనం నుండి అమాంతం ఆ గొంతులు నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్న ట్లున్నాయి; నిజంగా నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్నాయా? కానీ, అక్కడ నిశ్శబ్దమే లేదు; నిరంతరం బస్సులు తమ చక్రాలను నడుపుతూనే ఉన్నాయి, గేర్‌లను మారుస్తూనే ఉన్నాయి; విస్తారపు చైనీయ మందసపు గూడుల్లా, పోతపోసిన వుక్కంతా నిరంతరం ఒకదానిలో ఒకటి తిరుగుతున్నట్లు, నగరం గొణుగుతూనే ఉంది; దానిపైన గొంతులు పెద్దగా అరుస్తున్నాయి, అనేకానేకపూల రేకులు తమ రంగులను గాలిలోకి వెదజల్లాయి.

●

---

కార్టర్ కథల్లో సంభాషణలు తక్కువ. విలక్షణమైన వర్ణనలు, వ్యాఖ్యానాలతో ఒక మ్యాజిక్ వాతావరణం సృష్టిస్తుంది. "నగీషీ చెక్కినట్టుగా, జలతారు పోగులలో అల్లినట్లుగా వుంటాయి కథలు".

"1969లో తొలిసారిగా జోర్జ్‌లూయీ బోర్హెస్‌ని చదివినప్పుడు నా కళ్ల ముందర ఒక కొత్త లోకం ఆవిష్కరించింది. ఇలా కూడా కథలు రాయగలరని తెలిసింది" అంటుంది.

'మ్యాజిక్ రియలిజం'ను అధిగమించిన శైలి కార్టర్‌ది. కథల్లో ఎక్కువగా వుండేది అద్భుతరసమే గాని, దాని వెనుక గొప్ప పాండిత్యప్రకర్ష, అనితర సాధ్యమనిపించే వూహాశక్తి, ఒక అధివాస్తవిక వాతావరణం పాఠకులను దిగ్భ్రాంతుల్ని చేస్తాయి. అక్కడ ఏదైనా జరగొచ్చు. ఏదీ అసాధ్యం కాదు. ఏదీ నిషిద్ధం కాదు.

పాత జానపద/ఫెయిరీ టేల్స్‌ని కొత్తగా చెప్పటం యిష్టం. (బహుశా ఆమె కథలకు ప్రథమ ప్రేరణ యివేనేమో!) అత్యంత సులభమైన మౌఖిక ప్రక్రియ లాంటి 'అనగనగా కథలకు' మనల్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచే వైదుష్యం కూడా తోడయితే కార్టర్ కథ.

పురుషులతో పోల్చిస్తే స్త్రీలు చేసే నేరాలు చాలా తక్కువ. అవకాశాలే లేవు మరి. ఒక వేళ స్త్రీ ఎప్పుడైనా (అరుదుగా) నేరం చేయగలిగినా సామ్యూయెల్ బెకెట్ మాటల్లో "ఆమె నేరమే ఆమె శిక్ష"గా మారుతుంది. నేర పరిణామంగా ఆమె అనుభవించిన శిక్షను చూసినప్పుడు బాధేస్తుందే తప్ప కోపం రాదు...

ఏదేమైనా ఈ లోకంలో ఆదర్శ పురుషుడిగా బతకటం కన్నా ఆదర్శ స్త్రీగా బతకటం చాలా సులభం. ధైర్యం, సాహసం, దాతృత్వం, పాండిత్యం, జ్ఞానం లాంటి ఆదర్శ పురుష లక్షణాలేవీ స్త్రీకక్కర్లేదు. పతివ్రతా లక్షణ మొక్క టుంటే చాలు.

(పతివ్రతకు నిర్వచనం: వివాహేతర సంబంధాలు లేకపోవటమే). పురుషుడు 'అవినీతి పరుడు' అనటానికి చాలా కారణాలుండాలి. స్త్రీకి ఆ ముద్ర వెయ్యటం చాలా సులభం.

ఆమె లంచగొండీ, మోసగత్తే, దోపిడీదారూ, నయవంచకురాలూ కానక్కర్లేదు.

ఆమెకు వర్తించేది లైంగిక పరమైన నీతి ఒక్కటే. పర పురుషుడితో సంబంధముంటే చాలు ఆమె 'బజారు మనిషి' అయిపోతుంది. "స్త్రీని నీతివర్తకు రాలిగా చెయ్యాలనుకొంటున్న ఈ సమాజానికి ఆమె అంటే ఎంత దయో! సెక్సు కోరిక లేని స్త్రీ అదృష్టవంతురాలు.

సమాజంలో చలామణీ అవుతున్న హిపాక్రసీకి యిది పరాకాష్ట కాకపోతే మరేమిటో చెప్పండి" అంటుంది.

❊

# అరబీ

## జేమ్స్ జాయిస్ (1882- 1941)

అనువాదం: కాకాని చక్రపాణి



జేమ్స్ అగస్టిన్ అలోసియస్ జాయిస్ ఐర్లాండు ముఖ్యపట్టణం శివారు రాథ్‌గర్‌లో 1882 ఫిబ్రవరి 2న జన్మించాడు. డబ్లిన్ కార్పొరేషన్‌లో అతని తండ్రి రేట్ కలెక్టర్ (స్థానిక ఆస్తిపన్ను వసూలుదారు)గా పనిచేశాడు. అతడిని చిన్నతనంలోనే కుక్క కరవటం వల్ల అతనికి కుక్కలంటే విపరీత భయం ఉండేది; ఉరుములు, మెరుపులన్నాకూడ అతడికి భయమే. జాయిస్ ఛార్లెస్ స్టీవర్ట్ పార్నెల్ మరణానికి చింతిస్తూ కవిత రాస్తే, అతని తండ్రి జాన్ దాన్ని కాథలిక్ చర్చి పార్నెల్‌ను పరిగణించిన తీరుకు నిరసనగా వాటికన్ గ్రంథాలయానికి పంపాడు; ఫలితంగా అతడు ఉద్యోగం పోగొట్టుకున్నాడు, కుటుంబం ఆర్థిక బాధలకు లోనయింది. పదహారేళ్ల వయసులోనే అతడు కాథలిక్ చర్చితో బంధాలు తెంచుకున్నాడు, కానీ, థామస్ ఆక్వినాస్ తాత్త్వికత అతన్ని జీవితకాలమంతా ప్రభావితం చేసింది. 1898లో డబ్లిన్ యూనివర్సిటీ కాలేజీలో ఇంగ్లీషు, ఫ్రెంచి, ఇటాలియన్ సాహిత్యాలనధ్యయనం చేశాడు. ఆ కాలేజీలోని అతని సహాధ్యాయులు చాలమంది అతని రచనల్లో పాత్రలయ్యారు. ఛేంబర్‌మెయిడ్‌గా పనిచేసే నోరాతో లేచిపోయి జ్యూరిచ్ చేరాడు. ఇంగ్లీషు పాఠాలు చెప్పాడు, రోమ్‌లో బాంకు ఉద్యోగం చేశాడు; తిరిగి జ్యూరిచ్‌కు వచ్చాక ఎజ్రా పౌండుతోనూ, హారియట్ షా వీవర్‌తోనూ పరిచయమైంది; వీవర్ అతని రచనలను ప్రచురించింది. పారిస్‌లో ఇరవై ఏండ్లపాటున్నాడు. కంటివ్యాధితో చాల బాధపడ్డాడు. ప్రయోగాత్మక, ఆవిష్కరణాత్మక ఆధునిక రచయితగా ఎంతో పేరొందాడు. తిరిగి జ్యూరిచ్ చేరుకున్నాడు. 1941 జనవరిలో పగిలిన కడుపు పుండుకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు కానీ అతడికి స్వస్థత చేకూర లేదు, 1941 జనవరి13న మరణించాడు.

అతడి ప్రముఖ రచనలు:Dubliners (కథలసంకలనం, 1914), A Portrait of an Artist as a Young Man (నవల,1916), Exiles (నాటకం, 1918), Ulysses (నవల, 1922), Fennigan's Wake (నవల, 1939). చైతన్య స్రవంతి సాంకేతికత, అంతర్గత సంభాషణలు, బాహ్య పరిసరాల వాస్తవం కంటే, మానసిక వాస్తవికతకు ప్రాధాన్యమివ్వటం అనే లక్షణాలు *పోర్ట్రెయిట్* నవలలోనే వ్యక్తమయ్యాయి. వాటి పరాకాష్ఠ. Ulysses ఆ ఐదారొందలపేజీల నవల మొత్తం డబ్లిన్‌లో 1904 జూన్ 18న జరిగిన సంఘటనలు, మానసిక వాస్తవికతల చిత్రణ.

క్రిస్టియన్ బ్రదర్స్ స్కూలు వదలినప్పుడు తప్ప, అక్కడితో తోవలేక ఆగిపోయే నార్త్ రిచ్‌మండ్ స్ట్రీట్ సామాన్యంగా నిశ్శబ్దంగా వుంటుంది. జనాలుండని ఒక రెండస్తుల భవనం తోవలేని సందుచివర ఉంది; అది నలుచదరంగా ఉన్న భూమిలో మిగతావాటినుండి విడిపోయి ఉంటుంది. ఆ వీథిలోని, మిగిలిన ఇళ్లు తమ లోపలి జనాల నాగరికతా స్పృహకలిగి, తొణుకుబెణుకులేని, కపిలవర్ణపు ముఖాలతో ఒకదాన్నొకటి చూసుకుంటూ ఉంటాయి.

మా ఇంటి మాజీ కిరాయిదారుడు మతబోధకుడు; వెనక డ్రాయింగ్ రూమ్‌లో చనిపోయాడు. చాల కాలం తలుపులు మూసి ఉన్న కారణాన ఇంట్లోని అన్ని గదుల్లో గాలి మురిగిన కంపు కొట్టేది; ఆ పైన వంటగది పక్కనున్న వేస్ట్ రూమ్ చెత్తాచెదారం, పనికిరాని కాయితాలతో నిండిపోయివుంది. వాటి మధ్య కాయితపు అట్టవేసి ఉన్న కొన్ని పుస్తకాలుకూడ నాకు కన్పించాయి; వాటి పేజీలు మడతలు పడి, నెమ్ముపట్టికూడ ఉన్నాయి. అవి: వాల్టర్ స్కాట్ రాసిన ది ఎబ్బాట్, ది డివౌట్ కమ్యూనికెంట్, ది మెమొయిర్స్ ఆఫ్ విడాక్. ఈ చివరి దాని కాయితాలు పసుపుపచ్చగా ఉన్న కారణాన అది నాకు బాగా నచ్చింది. ఇంటివెనక పిచ్చిగా పెరిగినతోటమధ్య ఒక ఆపిల్ చెట్టు, పొదలు ఉన్నాయి; ఒక పొదకింద నాకు చనిపోయిన కిరాయిదారుడి తుప్పుపట్టిన సైకిలు పంపు కన్పించింది; అతడు దాతృత్వం కలిగిన మతబోధకుడు; తన వీలునామాలో తన డబ్బంతా సంస్థలకు, ఇంట్లోని ఫర్నిచరు చెల్లెలుకు చెందాలని రాశాడు.

> **అరువు తెచ్చుకున్న పుస్తకం వల్ల కలిగే ఆనందం బహు స్వల్పం - శ్టాన్లీ బాల్డ్విన్**

పగటిపొద్దు తక్కువవుండే శీతాకాలం రోజుల్లో, మేం భోజనాలు చెయ్యకముందే, చీకట్లు పడేవి. చల్లటిగాలి మాకు చురుకుగా తగిలి, మా శరీరం మెరిసేదాకా మేం ఆడేవాళ్లం. మా అరుపులు నిశ్శబ్దపు వీథుల్లో ప్రతిధ్వనించేవి. ఇళ్ల వెనుక ఉన్న మురికి, చీకటి వీథుల్లోకి ఆడుకోటానికి వెళ్లేవాళ్లం; ఆదిమజాతుల అనాగరికపు గుడిసెల్లోని అష్టకష్టాలు పడేవాళ్లం; గుర్రబ్బండ్లవాళ్లు తమ గుర్రాలకు మాలిష్‌చేసే, జీనులు విదిలించి సంగీతం పల్కించే కంపు గుర్రపుశాలలకు వెళ్లేవాళ్లం. మేం వీథిలోకి తిరిగొచ్చేసరికల్లా, వంటగది కిటికీలనుండి వచ్చే వెలుగు ఆ ప్రాంతాన్ని నింపేసేది. ఆ మూల తిరుగుతూ మా మామ కన్పిస్తే, అతడు భద్రంగా ఇంట్లోకి అడుగుపెట్టే దాకా మేం నీడలో దాక్కునేవాళ్లం. లేక మంగన్ అక్క తమ్ముడిని టీకోసం పిలవటానికి తలుపు దగ్గరకు వచ్చినప్పుడు మేం ఆమెని వీథి దిగువనుండి నీడలోనిలబడి చూసేవాళ్లం. ఆమె అక్కడే ఉండేటట్లయితే, నీడను వదలి రాజీపడిపోయినట్లు మంగన్ ఇంటిమెట్లదాకా నడచి వెళ్లేవాళ్లం. ఆమె మాకోసం ఎదురు చూసేది, సగం తెరచిన తలుపునుండి ఆమె ఆకారం నిర్వచితమయ్యేది. ఆమెను చూస్తూ, నేను కటకటాల పక్కన నిలబడేవాడిని. ఆమె తన శరీరాన్ని కదిలిస్తే ఆమె డ్రస్సు ఆమెతోపాటు నర్తించేది; ఆమె జుట్టును బంధించిన మెత్తటి తాడు ఆపక్కకూ, ఈపక్కకూ నడయాడేది.

నేను ప్రతి రోజూ పొద్దున ముంగటి పార్లర్ నేలమీద పడుకుని ఆమె తలుపువైపు చూసేవాడిని; నేను కనబడకుండా, తెరను కొద్దిగా కిందకు దించేవాడిని. ఆమె తలుపు మెట్టు దగ్గరకు వచ్చేసరికల్లా నా గుండె గంతేసేది. నేను హాల్లోకి పరుగెత్తి, నాపుస్తకాలు పట్టుకుని ఆమెను అనుసరించేవాడిని. ఆమె కపిలవర్ణపు ఆకారాన్ని ఎప్పుడూ నా కళ్లల్లో నిలుపుకునేవాడిని; మా మార్గాలు విడిపోయే సమయం రాగానే, నేను అడుగుల వేగం పెంచి, ఆమెను దాటి వెళ్లిపోయేవాడిని. ప్రతి ఉదయం ఇది జరుగుతూనే ఉండేది. ఏదో అవసరం మాటలు తప్ప, నేను ఆమెతో మాట్లాడింది లేదు; అయినా ఆమె పేరే నా మూర్ఖపు నెత్తుటికి ఆదేశంలా ఉండేది.

ప్రణయభావనకు ఏమాత్రం అనువుగాని ప్రదేశాలకు కూడ ఆమె మూర్తి నన్ను అనుసరించేది. శనివారం సాయంత్రాలు మా అత్త మార్కెట్టుకు వెళ్లి వస్తువులు కొన్నప్పుడు, కొన్ని మోసుకు రావటానికి నేను ఆమెతోపాటు వెళ్లాల్సి వచ్చేది. వెలుగునిండిన వీథుల్లో, బేరాలు చేసే ఆడవాళ్లు, తాగుబోతులు తోసుకుపోతూంటే, కూలివాళ్ల శాపనార్థాలమధ్య, పీపాలకు కాపలా కాస్తూ దుకాణాల పిల్లగాళ్ల పీల గొంతుల అరుపులు, వీథిపాటగాళ్లు ముక్కుతో పాడే 'ఓ 'డోనవాన్ రోసా' పాటలు, లేక మా మాతృభూమిలోని కష్టాలను గురించిన పాటలు వింటూ వెళ్లేవాళ్లం. ఆ శబ్దాలు నాలో ఒక ఏకైక జీవనసంవేదనలా మిళితమైపోయేవి: శత్రుమూకల మధ్యగూండా, నేను సుభద్రంగా నా పాత్రను మోసుకువచ్చానని నా గురించి ఊహించుకునేవాడిని. నాకే అర్థంకాని, విచిత్ర ప్రార్థనలు, ప్రశంసల మధ్య నా పెదవులపై ఆమె పేరు ఆడేది. నా కళ్లు నీళ్లతో నిండిపోయేవి (ఎందుకో నాకే తెలియదు); ఒకోసారి నా గుండెల్లోని వరద నా ఛాతీలోకి ప్రవహించి పోయినట్లనిపించేది. నేను భవిష్యత్తును గురించి ఏ మాత్రం ఆలోచించలేదు. నేను ఆమెతో అసలు మాట్లాడగలనో, లేదో నాకు తెలియదు; లేక ఆమెతో మాట్లాడటమే జరిగితే, నా అయోమయపు ఆరాధనను గురించి చెప్పగలనో, లేదో కూడ నాకు తెలియదు. కానీ, నా శరీరం వీణలా, ఆమె మాటలు, హావభావాలు తంత్రులపై నర్తించే వేళ్లలా ఉండేవి.

ఒకరోజు సాయంత్రం నేను, అంతకు ముందు మత బోధకుడు మరణించిన వెనకవైపు డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లాను. అది వానకురుస్తున్న చీకటి సాయంత్రం, ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పగిలిన కిటికీ అద్దంనుండి వర్షం భూమిని మోదే, నానిన పాదుల్లోకి నిరంతరం నీటిసూదులు గుచ్చుకునే సవ్వడులు నాకు విన్పించాయి. సుదూరపు దీపపు వెలుగో, కిటికీ వెలుగో నా కింద మెరిసింది. నేను ఆ కొద్దిమేరకు చూడ గలిగినందుకే ధన్యత చెందాను. నా ఇంద్రియాలన్నీ ముసుగు కప్పుకోవాలని వాంఛించినట్లు అన్పించింది; నేను వాటినుండి జారిపోతానేమోనన్న అనుభూతి నాకు కలిగింది. నా అరచేతులు రెండింటినీ జోడించి, అవి వణకి, "ఓ ప్రేమా, నా ప్రేమా!" అని ఎన్నోసార్లు జపించిందాకా వత్తిపెట్టాను.

చివరకామె నాతో మాట్లాడింది. ఆమె నాతో మాట్లాడటం మొదలెట్టినప్పుడు నేను ఎంతగా అయోమయంలో పడిపోయానంటే, ఏం జవాబివ్వాలోకూడ నాకు తెలియలేదు. నేను అరబీకి వెళ్తున్నానా? అని ఆమె అడిగింది. నేను అవునని చెప్పానో, కాదని చెప్పానో కూడ నాకు గుర్తులేదు. అది చక్కటి అద్భుతమైన బజారంటూ, తన కక్కడికి వెళ్లాలంటే ఎంతో ఇష్టమనీ ఆమె చెప్పింది.

"మరెందుకు వెళ్లకూడదూ నువ్వు?" అని నేనడిగాను.

ఆమె మాట్లాడేటప్పుడు తను ధరించిన ఒక రజతకంకణాన్ని తన మణికట్టు చుట్టూ తిప్పింది. తన కాన్వెంటులో సంప్రదాయ ఉత్సవమేదో ఆ వారం జరుగుతోంది కనుక తాను వెళ్లలేనని ఆమె చెప్పింది. ఆమె తమ్ముడూ, మరిద్దరు అబ్బాయిలూ తమ కాప్ (టోపీ)ల కోసం కొట్లాడుకుంటున్నారు. కనుక నేను ఒంటరిగా కటకటాల దగ్గర ఉన్నాను. నా వైపు తల వంచుతూ, ఆమె కడ్డీనొక దాన్ని పట్టుకున్నది. మా తలుపుకు ఎదురుగా ఉన్న దీపపు వెలుగు, ఆమె తెల్లటి మెడవంపును తాకింది, అక్కడ వాలి ఉన్న ఆమె జుట్టును, కటకటాలను పట్టుకున్న ఆమె చేతిని ప్రకాశంతో ముంచెత్తింది. అది ఆమె డ్రస్సుకు ఒకవైపున

నవలా పరిచయం

# ది వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్

## ఆలివర్ గోల్డ్‌స్మిత్ (1730 -1774)

ది వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ నవలలోని కథానాయకుడు డాక్టర్ ప్రిమ్‌రోజ్ (వికార్) తన గురించి ఇలా చెప్పుకుంటాడు:

"జనాభా పెంచటం ఎలాగ? అని శుష్క ప్రసంగాలు చేసే రాజకీయ నాయకుల కన్నా, పెళ్లిచేసుకుని, పిల్లల్ని కన్న నిజాయితీపరులే దేశానికెక్కువ మేలు చేస్తున్నారు. పారిస్‌లో అందరికీ ఆదర్శంగా ఉండాలని నేను కూడా వయసు మించకముందే పెళ్లి చేసుకుని ఆరుగురు పిల్లల్ని కన్నాను. మా పెద్దవాడి పేరు జార్జి. ఆ తర్వాత అలీవియా, సోఫియా, మోజెస్ పుట్టారు. పన్నెండేళ్ల విరామం తర్వాత మరో ఇద్దరు మగపిల్లలు కలిగారు. నా భార్య డెబోరా అంత అనుకూలవతి ఈ లోకంలోనే మరొకరుండరని నమ్ముతాను. మా సంసారం స్వర్గమే. వయసుతోపాటు మా మధ్య అనురాగం కూడా పెరిగింది, అలీవియాకిప్పుడు పద్దెనిమిదేళ్లు. ఈ చుట్టుపక్కల అంత అందగత్తె లేదంటారు. ఆక్స్‌ఫర్డ్‌లో జార్జి చదువుతున్నాడు. మోజెస్‌ను వ్యాపారంలో ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నాను.

కాలేజి చదువు ముగించిన మా పెద్దోడు నా మిత్రుని కూతురు అరాబెల్లా విల్మాట్‌ను పెళ్లిచేసుకోవాలనుకున్నాడు. ఆమె తండ్రి విల్మాట్‌కు కూడా నాలాగే చర్చితో సంబంధాలున్నాయి. అంతో ఇంతో రాసే అలవాటున్న నేను విల్మాట్‌కు ఏకపత్నీ వ్యవస్థ అత్యుత్తమమైనదని ఒక వ్యాసం రాసి చూపించాను. ఇంకేముంది? మిన్ను విరిగి మీద పడినంత ఘోరం సంభవించింది. వివాహాన్ని గురించి ఆయన అభిప్రాయాలు భిన్నం. ముఖ్యంగా నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే ప్రీస్టులైనా ఒకే వివాహానికి పరిమితం కావాలని నా అభిప్రాయం. కాని ఆయనకిప్పుడు నాలుగో భార్య. అప్పటిదాకా ఎంతో ఆత్మీయంగా ఉన్న వ్యక్తి ఆ క్షణంనుండీ నన్ను పరమ శత్రువుగా భావించాడు. నా జీవితంలోంచి ఏటా ముప్పైనాలుగు పౌన్లు అనాథల కోసం ఖర్చు చేస్తాను. మిగిలిందేమన్నా ఉంటే ఓ షావుకారు వద్ద దాచుకుంటాను. గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు ఇప్పుడా పెద్దమనిషి ఊరు విడిచి పారిపోయాడు. చేతిలో చిల్లిగవ్వలేదు. సంసారం గడిచేదెట్లా?

అదే సమయంలో తన కూతుర్ని మా అబ్బాయికిచ్చేది లేదని తేల్చేశాడు విల్మాట్. ఆదాయం లేకుండా ఇక్కడ ఉండటం వీలుపడదు. డెబ్బైమైళ్ళ దూరంలో ఇరవై ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాను. నా వెంటుంటే మనోవ్యథతో మరింత కుంగిపోతాడని, మా పెద్దవాడిని లండన్ పంపించాను. అక్కడేదో ఒక పని దొరక్కపోదు.

మా భూస్వామి స్క్వైర్ థార్న్‌హిల్ ఒకనాడు మా ఇంటికి వస్తానని కబురంపించాడు. అంతటి సంపన్నుడు మా అతిథ్యం స్వీకరిస్తానన్నందుకు మా ఆవిడ ఆనందానికి అవధుల్లేవు. స్క్వైర్ యువకుడూ, అందగాడూ. అతడి అంకుల్ సర్ విలియం థార్న్‌హిల్ దివాళా తీసి ఎక్కడికో వెళ్ళిపోయాడు. అతని ఆస్తి కూడా ప్రస్తుతం స్క్వైర్ ఆధీనంలోనే వుంది.

"ఎలా ఉన్నాడే అబ్బాయి?" అంటూ ఆరా తీసింది మా ఆవిడ.

"సంస్కారవంతుడిలాగే కనిపించాడు. అతడికి తెలియని విషయం లేదు. దేని గురించయినా అనర్గళంగా ఉపన్యసిస్తాడు" అంది సోఫియా.

"నాకు నచ్చలేదు" అంటూ మూతి విరిచింది అలీవియా.

తమకు నచ్చిన వ్యక్తుల గురించి ఆడపిల్లలు ఇష్టం లేనట్టుగానే నటిస్తారని సరిపెట్టుకున్నాను.

ఆ తర్వాత ఒకసారి థార్న్‌హిల్ సేవకుడు, 'ఇది మా అయ్యగారి బహుమానం' అంటూ జింక మాంసం తెచ్చాడు.

ఏదో సాకుతో భూస్వామి తరచూ ఇంటికి వస్తూనే ఉన్నాడు.

అలీవియాకు మంచి వరుడు దొరికితే నాకూ సంతోషమే. ఈలోగా ఒకసారి ప్రమాదవశాత్తు నీళ్లలో పడివున్నప్పుడు, మిస్టర్ బర్కెల్ దాన్ని రక్షించాడు. ఈ బర్కెల్ గురించి నాకెక్కువగా తెలియదు. మనిషి మంచివాడే కాని, 'పూర్ జెంటిల్మన్' అంటారతణ్ణి. కృతజ్ఞతగా మేమతణ్ణి తరచూ భోజనానికి ఆహ్వానిస్తుంటాం.

బర్కెల్ ఎప్పుడు ఇంటికి వచ్చినా వ్యవసాయ పనుల్లో సాయం చేస్తాడు. అయితేనేం? పేద ఆడపిల్లలకు పేదకుర్రాళ్లు నచ్చరు.

ఓనాడు థార్న్‌హిల్ గౌరవార్థం మా ఇంట్లో విందు ఏర్పాటు చేశాం. వెంట మరో ఇద్దరు మిత్రుల్ని కూడా తీసుకొచ్చాడతడు. భోజనాలు చేసినంతసేపూ వాళ్ల చూపులు మా అమ్మాయిల మీదే ఉన్నాయి. ఆ ఆకతాయితనం నాకు నచ్చలేదు. భూస్వాములకు కౌలుదార్లంటే అంత లోకువా?

ఇక బర్కెల్ మా ఇంటికి వచ్చినప్పుడల్లా ఒక్కడే నలుగురి పనిచేస్తాడు. కాని ఇంత కాయకష్టం చేసేవాడు తన పిల్లలకు తగిన వరుడు కాలేడనుకుంటుంది మా ఆవిడ.

థార్న్‌హిల్ ఒక సాయంత్రం పార్టీ ఇచ్చాడు. మరికొందరు యువతీయువకులు కూడా వచ్చారు. పాటలు పాడారు. "అలీవియాను సంతోషపెట్టడానికి సగం ఆస్తి ఇస్తాను" అంటూ నావైపు చూశాడు భూస్వామి. ధన మదంతో అతడెంత దిగజారాడో అప్పుడర్థమైంది నాకు.

మా అమ్మాయిల్దిరూ అందగత్తెలు, విద్యావంతులు కూడా. వాళ్లను లండన్ పంపాలన్న మా ఆవిడ సలహా నాకూ నచ్చింది. అక్కడ తగిన వరులు దొరికే అవకాశముంటుంది.

మేం పిల్లల ప్రయాణాలకు సన్నాహాలు చేస్తున్నప్పుడే థార్న్‌హిల్ మాకో సందేశం పంపించాడు. నన్ను ఆకాశానికెత్తేసి నా పరిచయంతో తన జన్మ ధన్యమైందని దాని సారాంశం. అయితే ఆ మధ్యాహ్నమే మా ఇంటికి వచ్చిన బర్కెల్, 'పొగడ్తలను నమ్మవద్దంటూ' హెచ్చరించాడు.

---

పడి, ఆమె సుఖదంగా నిలబడి ఉన్నప్పుడు, కొద్ది మాత్రంగా కనిపిస్తున్న పెట్టీకోట్ తెల్లఅంచును పట్టుకుంది. "నీకూ బావుంటుందది," అందామె.

"నేను వెళ్లేట్టయితే, నీకోసమేదయినా పట్టుకు వస్తాను" అన్నాను నేను.

ఆ సాయంత్రం తర్వాత ఎన్ని అసంఖ్యాకమైన విమూఢతలు, బుద్ధిహీనతలు నా జాగ్రత్, సుషుప్తావస్థల ఆలోచనలను వ్యర్థం చేశాయి! విసుగుగొల్పే అంతరాయపు రోజులను మట్టుపెట్టాలని నా కన్పించింది. స్కూలు పనిపట్ల నాకు విసుగుదల కలిగేది. రాత్రిపూట నా పడకగదిలో, పగటిపూట నా తరగతిగదిలో ఆమె మూర్తి, నేను కష్టపడి చదివే పుటకూ, నాకూ మధ్య వచ్చి

"థార్న్‌హిల్‌ను చూసి కుళ్లి చస్తున్నాడు" అంటూ విసుక్కుంది మా ఆవిడ. ఇలాంటి 'అసూయాపరుడు'. ఇంటికి రావటం ఆవిడ కిష్టం లేదు.

భూస్వామి తరచుగా రావటం చూసి ఇరుగుపొరుగు చెవులు కొరుకున్నారు. "అలీవియాను పెళ్లి చేసుకుంటానని అతడు బహిరంగంగా చెప్పేస్తే మనకు కూడా గౌరవంగా ఉంటుంది" అంది మా ఆవిడ.

"కాస్త ఓపిక పట్టు" అన్నాన్నేను.

ఆ తర్వాత రెండు రోజులకు, మా అబ్బాయి డిక్ పరిగెత్తుకుంటూ వచ్చి శరాఘాతంలాంటి వార్త చేరవేశాడు.

"అక్కను ఇద్దరు వ్యక్తులు గుర్రబ్బండీలో తీసికెళ్లారు. ఒకడు దాన్ని ముద్దు పెట్టుకున్నాడు"

ఈ నీచానికొడిగొట్టింది థార్న్‌హిల్ అనటంలో సందేహంలేదు. వాడి అంతు చూడాల్సిందేనని కోపంతో రగిలిపోతూ పిస్టల్స్ తీసుకుని బయల్దేరాను. తొందర పడవద్దంటూ వారించింది మా ఆవిడ.

"దీనికి కారణం థార్న్‌హిల్ అనే ఎందుకనుకుంటున్నారు? బర్కెల్ కూడా కావచ్చుగా" అన్నాడొక మిత్రుడు. ఎవరైనా సరే పరిస్థితి చేజారకముందే నా కూతుర్ని కాపాడాలి.

ఆ గుర్రబ్బండి వెళ్లిన దారిలో రెండు గంటలు నడిచి విశ్రాంతి కోసం ఆగినప్పుడు నాటక కంపెనీ వాహనమొకటి కనిపించింది. ఆ రంగంలో నేను కూడా కొంత కృషిచేశాను. నటీనటులతో ముచ్చటిస్తూ రాత్రికి ఒక సత్రంలో బస చేశాను. మాకు ఆతిథ్యం ఇచ్చిన వాళ్ళే చక్కటి విందు ఏర్పాటు చేశారు.

ఆ తర్వాత మేమంతా సరదాగా రాజకీయాల గురించి చర్చించుకుంటున్నప్పుడు ఓ యువతి వచ్చి నన్ను పలకరించింది. నా ఆశ్చర్యానికి అంతులేదు. ఆ పిల్ల మరెవరో కాదు, మా జార్జి పెళ్లి చేసుకోవాలనుకున్న అరాబెల్లా విల్మాట్. అక్కడే మరికొన్నాళ్లుండమని బలవంతపెట్టాడు కంపెనీ యజమాని. మరునాడు నేను నాటక ప్రదర్శనకు వెళ్లినప్పుడు అక్కడ 'హొరేషియో' వేషం వేసిన నటుడు మా అబ్బాయి జార్జి అని గుర్తు పట్టాను. కాని వాడు నన్ను గుర్తించనట్టే నటించాడు.

రెండు రోజుల తర్వాత థార్న్‌హిల్ కూడా వచ్చి చేరాడు. అలీవియా కోసం నేను వెదుకుతున్నానని తెలిసి ఆశ్చర్యపడ్డాడు. అది ఎవరి వెంట వెళ్లిందో తెలియదట. అబ్బాయి జార్జి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడని తెలిసి సహాయం చేస్తానన్నాడు.

ఆ తర్వాత అలీవియా అన్వేషణలో నేను మరో ఇరవై అయిదు మైళ్లు ప్రయాణం చేసి రాత్రికి ఒకరింట్లో తల దాచుకున్నాను. అక్కడ ఇంటి యజమానురాలు ఒక యువతిని నిర్దాక్షిణ్యంగా తూలనాడడం విని, గది వెలుపలికి వచ్చి చూద్దును గదా, ఆ పిల్ల మరెవరో కాదు.. నా కూతురు అలీవియా! 'నేను నీతిమాలిన దాన్ని కాను. నాకు పెళ్లయింది. నా భర్త స్క్వైర్ థార్న్‌హిల్' అంటూ రోదిస్తున్నది. దాన్ని అక్కున చేర్చుకుని జరిగిన కథంతా సవివరంగా తెలుసుకున్నాను. ఒక ప్రీస్టు, ఇద్దరికీ వివాహం జరిపించాడు. కాని చట్టప్రకారం అది చెల్లదు. థార్న్‌హిల్ ఇప్పటికే ఏడెనిమిదిసార్లు ఇలాంటి పెళ్లిళ్లు చేసుకున్నాడట! అమాయకులైన ఎంతమంది ఆడపిల్లల్ని ఇలా దగా చేస్తాడు ఆ దుర్మార్గుడు! వీడి నయవంచనకు బుట్టలో పడిన యువతులందరూ తర్వాత తిరస్కృతులై వేశ్యా గృహాలకు చేరుకున్నారు. నా కూతురు తనను బందీ చేసిన ముష్కరుల్ని ఎదిరించి పారిపోయి ఇక్కడికి వచ్చింది.

అలీవియాను తీసుకుని సంతోషంగా ఇల్లు చేరాను. కాని దురదృష్టం నన్ను వెంటాడుతున్నది. అగ్ని ప్రమాదంలో ఇల్లంతా కాలిపోయింది. నేను దాచుకున్న కొద్ది డబ్బూ, వస్తువులూ బూడిదైనా, భార్యాపిల్లలు మాత్రం క్షేమంగా ఉన్నారు. ఈ ఆనందమైనా నాకు మిగిల్చినందుకు భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాను. తిరిగి వచ్చిన అలీవియాను చూసి నా భార్య సంతోషించలేదు. స్త్రీల తప్పులను, పురుషులు క్షమించినంత సులభంగా సాటి స్త్రీలు క్షమించరు.

అలీవియా తనని ధిక్కరించినందుకు, మేకవన్నెపులిలాంటి తన నైజాన్ని బహిర్గతం చేసినందుకు థార్న్‌హిల్ నా మీద పగబట్టాడు. కౌలు చెల్లించటం లేదని, తన వద్ద కొన్న పశువులకు డబ్బు బాకీ పడ్డాననీ నా మీద ఫిర్యాదు చేశాడు. కోర్టు అమీన్ వచ్చి, నన్ను అరెస్టు చేసి జైలుకు తరలించాడు. అలీవియా తనకు తలవంపులు తెచ్చింది గనక పరిహారంగా, అరాబెల్లా విల్మాట్‌తో పెళ్లి జరిపిస్తే, నన్ను విడుదల చేయిస్తానని చెప్పాడు. నా భార్య కూడా ఒత్తిడి చేసింది. కాని నా స్వార్థం కోసం ఆడపిల్లల జీవితాలు నాశనం చెయ్యనా? ససేమిరా కాదన్నాను.

జైల్లో ఉన్నప్పుడే పిడుగులాంటి మరో వార్త విన్నాను. అలీవియా మరణించిందట!

నా కష్టాలకు అంతులేదు. నా అంతటి దురదృష్టవంతుడైన తండ్రి మరొకడుండడు. జైలు నిర్బంధం సరిపోదన్నట్టుగా మా రెండో అమ్మాయి ఒకనాడు గుర్రంపై నుండి పడిపోతున్నపుడు టామ్ సోఫియాను రక్షించాడు. ఆ క్షణంలోనే ఆమె అతడి మనసు దోచింది.

సోఫియానెవరో అపహరించారని తెలిసింది. ఏం చెయ్యగలను? ఒంటరిగా కుమిలిపోవటం తప్ప. ఒకనాడు నా జైలు గదిలోకి మరో యువకుడు ప్రవేశించాడు. వాడెవరనుకున్నారు? మా అబ్బాయి జార్జి! మాకు చేసిన అన్యాయాలకు థార్న్‌హిల్‌ను ద్వంద్వయుద్ధానికి ఛాలెంజి చేశాడట. ధనబలంతో వాడు, మావాణ్ణి అరెస్టు చేయించాడు.

మరికొన్నాళ్లకు మోజెస్ తీపి కబురందించాడు. సోఫియాను మార్చెల్ రక్షించాడట. జైలు నుండి విడుదలై వచ్చాక విచారణలో మాకు అనేక కొత్త విషయాలు తెలిశాయి.

బర్కెల్ మరెవరో కాదు. థార్న్‌హిల్ వంచనకు గురైన అతని అంకుల్ సర్ విలియం థార్న్‌హిల్. స్క్వైర్ మోసాలు ఎండగట్టే ఉద్దేశంతో ఇన్నాళ్లూ అజ్ఞాతంగా ఉన్నాడు. జార్జి సహాయంతో తిరిగి తన ఆస్తి చేజిక్కించుకున్నాడు. అలీవియా నిజానికి మరణించలేదు. పాపానికి నిష్కృతిగా స్క్వైర్ దాన్ని వివాహం చేసుకున్నాడు. నా డబ్బులతో పలాయనం చిత్తగించిన షావుకారు తిరిగి వచ్చి, వడ్డీతో సహా వాపసు చేశాడు. జార్జికి అరాబెల్లాతో వివాహం జరిగింది. సోఫియా, సర్ విలియంను పెళ్లాడి లేడీ థార్న్‌హిల్‌గా మాకు కనువిందు చేసింది.

*

నిలచేది. నా ఆత్మ విలాసంలో ఓలలాడుతున్నప్పటి నిశ్శబ్దంలోనుండి అరబీ అన్న మాటలోని అక్షరాలు నన్ను తట్టి లేపేవి; నన్ను ఓ ప్రాచ్యదిశా ముగ్ధతకు లోను చేసేవి. శనివారం రాత్రి బజారుకు వెళ్లటానికి అనుమతి నడిగాను. మా అత్త ఆశ్చర్యపోయింది; ఇదేం ఫ్రీమాసన్ల (పవిత్ర కర్మకాండలను నిర్వహించే రహస్య సంఘసభ్యులు) వ్యవహారం కాదు కదా అని అంది. నేను క్లాసులో ఏ ప్రశ్నలకూ జవాబివ్వలేదు. మా మాస్టరుగారి ముఖం వాత్సల్యంనుండి కాఠిన్యాన్ని సంతరించుకోటం నేను గమనించాను; నేనేం చదువులో అశ్రద్ధచూపటం లేదు కదా అనుకున్నాడాయన. నా చంచలమైన ఆలోచనలను సమీకరించు

# జీవితానందం

–చెహోవ్

జీవితంలో సుఖాలకన్నా కష్టాలే ఎక్కువ.

అట్లాగని ఆనందంగా జీవించడం అంత కష్టమేమీ కాదు.

ఆనందమంటే కోటి రూపాయల లాటరీ గెలవటమో, ప్రభుత్వం నుండి బిరు దులూ, అవార్డులూ తీసుకోవడమో, మిస్ యూనివర్సును పెళ్లి చేసుకోవడమో కాదు.

క్రమేణా డబ్బూ, కీర్తీ, సుఖాలూ అన్నీ అలవాటుగా మారతాయి. అందువల్ల కష్టాలలో కూడా సుఖాన్ని అనుభవించాలంటే... ఉన్నదాంతో తృప్తిపడాలి, పరిస్థితులు ఇప్పుడున్న దానికన్నా ఛండాలంగా ఉండగలవనుకోవాలి.

జేబులో అగ్గిపుల్లలు భగ్గుమన్నాయనుకో, జేబులో గంధకం లేనందుకు ఆనందించు.

బంధువులు ఇంటి మీదకి దండెత్తి వస్తే, వచ్చింది బంధువులే, పోలీసులు కాదుగా అనుకో.

వేలు తెగితే – కంట్లో గాయం కానందుకు భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకో.

మీ ఆవిడ గాన సాధన యింట్లో నీ వునికిని నరకం చేస్తే – ఎంత చెడ్డా అది గానమే!

కుక్కలు మొరిగితేనే బాధ పడుతున్నావే, గాడిద నీ చెవిలో ఓండ్రిస్తే ఏం చేస్తావు?

బరువులు మోసే పశువ్వీ, గాడిదవీ కాదు. ఊరపందివీ, కుక్కవీ కాదు. ఈగవీ, దోమవీ, నల్లివీ కాదు. నువ్వో మనిషివైనందుకు సంతోషించు.

ఇవన్నీ సంతోషించవలసిన విషయాలు కావూ!

ఇంట్లో వున్నావు. జైల్లో లేవే!

అప్పుల వాళ్లు నీ కాళ్లూ చేతులూ విరిచెయ్యలేదు.

పత్రికల వాళ్లు నీ రచనలు వేసుకొని డబ్బులు ఇస్తామనీ ఇవ్వలేదు. నీ రచనలైతే పది మంది కంట్లో పడ్డాయి గదా!

ఫరవా లేదు, ఊళ్లోనే వున్నావు. సైబీరియా ఎడారిలో లేవు కదా!

ఒక్క పన్నే నొప్పెడుతున్నది. నోరంతా పుచ్చిపోలేదు.

మునిసిపాలిటీ చెత్తబండిని లాగే గుర్రానివి కావు.

నీకిష్టం లేని పేపరు చదవక్కర్లేదు.

ఒక్క భార్యే వున్నది. ముగ్గురు లేరు.

జైల్లో వేశారా, ఇంకా నయం ఖైదీల మధ్యే వున్నావు. తోడేళ్ల గుంపు మీదపడి పీక్కుని తినలేదు గదా!

బెత్తంతో బాదారా. ఫరవాలేదులే, ఇనప కడ్డీతో కాదుగా!

పెళ్లాం చని పోయిందా, నీకే ద్రోహం చేసింది. దేశానిక్కాదుగా!

---

కోలేకపోయాను. జీవితంలోని ఏ గంభీరమైన పనిపట్లా సహనం లేకపోయింది నాకు; అదిప్పుడు నాకూ, నా వాంఛకూ మధ్య అడ్డుగా నిలచి, పిల్లవాడి ఆటలా, విసుగుగొల్పే, వికారమైన బాల్య క్రీడలా అన్పించింది.

ఆదివారం ఉదయం మా మామకు గుర్తుచేశాను, నేను సాయంత్రం బజారుకు వెళ్లాలని అనుకుంటున్నానని. ఆయన హాలుస్టాండు దగ్గర నిలబడి హాట్ బ్రష్‌కోసం వెతుకుతూ, తుంచేసినట్లు జవాబిచ్చాడు.

"అవును రా, నాకు తెల్సు."

ఆయన హాల్లో ఉన్నాడు కనుక, నేను ముందు పార్లర్‌లోకి వెళ్లి, కిటికీలో కూర్చోలేకపోయాను. వికలమైన మనస్సుతో నేను ఇల్లు వదలి, మెల్లగా స్కూలువైపుగా నడిచాను. గాలి దయావిరహితంగా కటువుగా ఉంది, నా గుండె అప్పటికే అపనమ్మకంతో నిండి ఉంది.

నేను భోజనానికి ఇంటికి వచ్చేటప్పటికి, మా మామ ఇంకా ఇంటికి రాలేదు. ఇంకా సమయం కాలేదు. కాస్తంతసేపు నేను గడియారం వంక చూస్తూ కూర్చున్నాను, అది టిక్‌టిక్‌మనటం నా చిరాకు కలిగించటంతో, నేనా గదిని

వదిలాను. మెట్లెక్కి ఇంటి పై భాగానికి వెళ్లాను. ఎత్తుగా, చల్లగా, ఖాళీగా ఉన్న గదులు నాకు విడుదల కల్పించాయి; ముందువైపు కిటికీలోనుండి నా స్నేహితులు వీధిలో ఆడుకోవటం నాకు కన్పించింది. వాళ్ల అరుపులు నన్ను బలహీనపర్చాయి; చల్లటి గ్లాసుమీద నా తలవాల్చి, ఆమె నివసించే ఇంటివైపు చూశాను. అక్కడో గంటసేపు నిలబడి ఉంటాను; నా ఊహ కల్పించిన ఆమె కపిలవర్ణపు మూర్తి తప్ప నాకేం కన్పించలేదు; దీపపు వెలుగుపడుతున్న ఆమె వంపుతిరిగిన మెడను, కటకటాలమీద ఆమె చేతులని, డ్రస్సుకింది అంచును నేను జాగ్రత్తగా స్పృశించాను.

నేను మళ్లా మెట్లు దిగి కిందకు వచ్చేసరికల్లా, మెర్సర్ సతీమణి కుంపటిపక్కన కూర్చుని కన్పించింది. ఆమె పిచ్చివాగుడు వాగే, ముసలావిడ; ఆమె భర్త తాకట్టుమీద ఋణమిచ్చే వ్యాపారస్థుడు; అతడెప్పుడో పోయాడు. ఆమె మరే ధర్మకార్యానికో మరి, వాడిన స్టాంపులను సేకరిస్తూ ఉంటుంది. టీ టేబుల్ దగ్గరి ముచ్చట్లను భరించక తప్ప లేదు నాకు. భోజన సమయానికి గంటదాటి పోయింది, అయినా, మా మామ జాడ లేదు. మెర్సర్ సతీమణి వెళ్లటానికి లేచి నిలబడింది: తానింక నిరీక్షించలేనందుకు విచారాన్ని వ్యక్తం చేసింది; అయితే, అప్పటికే ఎనిమిది దాటింది; రాత్రి వాతావరణం ఆమె ఒంటికి మంచిది కాదు కనుక వెళ్లిపోయింది. ఆమె వెళ్లాక, గదిలో అటూఇటూ పచార్లు చేయసాగాను. మా అత్త అంది: "ఈ మన ప్రభువు రాత్రిపూట బజారుకు వెళ్లేపని వాయిదా వెయ్యటం మంచిదేమో!"

తొమ్మిది గంటలకు, మా మామ హాలు తలుపులో తాళంచెవిపెట్టి తిప్పటం నాకు విన్పించింది. ఆయన తనలో తానే ఏదో మాట్లాడుకోవటం, ఆయన ఓవర్‌కోటు బరువుకు హాలుస్టాండు ఊగటం విన్పించాయి. ఈ చిహ్నాలను నేను వ్యాఖ్యానించు కున్నాను. ఆయన భోజనం మధ్యలో ఉండగా, బజారుకెళ్లటానికి డబ్బివ్వమని నేను ఆయన్ని అడిగాను. ఆయన మర్చిపోయాడు.

"జనం ఒక నిద్రపోయి లేచి మళ్లీ పడుకుని ఉంటారు ఇప్పటికల్లా," అన్నాడాయన.

నేనేం నవ్వలేదు. మా అత్త గట్టిగా చెప్పింది, "ఆ పిల్లాడికి డబ్బిచ్చి పంపించెయ్యొచ్చుగా? ఇప్పటికే, అనవసరంగా మేల్కొనివుంచావతన్ని!"

> అమెరికాలో బానిస వ్యవస్థ రూపుమాపడానికి అబ్రహాం లింకన్ 'హకల్. బెరిఫిన్' పుస్తకాన్ని ఒక ఆయుధంగా వాడుకున్నాడు.

తాను మర్చిపోయినందుకు మా మామ విచారం వ్యక్తపరిచాడు. "ఆటాపాటా లేని పని జాక్‌ను మొద్దువెధవను చేస్తుంది" అన్న పాత సామెతలో తనకు నమ్మక ముందన్నాడు. నేను ఎక్కడికి వెళ్తున్నానో అడిగాడు. నేను రెండుసార్లు చెప్పాక, తన గుర్రానికి అరబ్ మనిషి వీడ్కోలు పల్కే పద్యం తెల్సునా? అని నన్నడిగాడు. నేను వంటగది వదిలేటప్పటి కల్లా, ఆ కవితలోని ప్రారంభపంక్తులను ఆయన మా అత్తకు విన్పించటం నాకు వినపడింది.

ఇచ్చిన ఫ్లోరిన్ (రెండు షిల్లింగుల విలువవుండే బ్రిటీషువారి పాతకాలపు వెండి నాణెం) గట్టిగా చేతిలో పట్టుకుని బకింగ్‌హామ్ స్ట్రీట్ గుండా స్టేషనుకు వెళ్లాను. గ్యాసులైటు వెలుగులో కొనుగోలుదారుల గుంపులు రోడ్డుమీద ఉండటం చూసి నేను బయటకు వచ్చిన పని గుర్తుకు వచ్చింది. నిర్జనమైన బండిలో ఒక మూడో తరగతి పెట్టెలో నేను కూర్చున్నాను. బండి భరించలేనంత ఆలస్యంగా స్టేషను వదలి, మెల్లగా కదిలింది. శిథిలమయిన ఇళ్ల మధ్యగుండా, మెరుస్తున్న నది మీదుగా అది పాకి వెళ్లింది. వెస్ట్‌లాండ్ రో స్టేషనులో జనాల గుంపు పెట్టెల తలుపుల వద్దకు వస్తుంటే, అది బజారుకు వెళ్లే ప్రత్యేకబండని చెప్పి, పోర్టర్లు వాళ్లని నిలిపేశారు. ఆ నగ్నంగా వున్న పెట్టెలో నేను ఒంటరిగా కూర్చుండిపోయాను. కొద్ది నిమిషాలలో బండి ప్రత్యామ్నాయంగా కట్టిన చెక్క ప్లాట్‌ఫాం మీద ఆగింది. నేను రోడ్డుమీదకు వచ్చాను; ఆ పక్కన వెలుగుపడ్తున్న గడియారపు ముఖసూచిలో పది నిమిషాలు తక్కువగా పదయినట్లు చూశాను. నాకు ఎదురుగా పెద్ద భవనం కన్పించింది; దానిముందు ఆ అద్భుతనామం ప్రదర్శితమై ఉంది.

ఆరు పెన్నీల ప్రవేశద్వారం నాకు కన్పించలేదు; బజారు మూత పడిందేమో నన్న భయంతో, అలసిపోయి ఉన్నట్టు కన్పించే ఆ మనిషికి షిల్లింగు చెల్లించి, తిరుగుడు పలకదాటి వెళ్లాను; పెద్ద హాల్లోకి అడుగుపెట్టాను; దాని సగం ఎత్తుకు అంతా గాలరీ (ప్రదర్శనశాల) ఉంది. సుమారుగా స్టాల్‌లు అన్నీ మూసివేశారు. హాలులో అధిక భాగంలో చీకటి రాజ్యమేలుతోంది. ప్రార్థనలయి జనం వెళ్లిపోయాక, చర్చిలో వ్యాపించి ఉండే నిశ్శబ్దం ఎలా ఉంటుందో నాకు తెల్సు. నేను భయపడుతూ, బజారు మధ్యకు నడిచాను. ఇంకా తెరిచివున్న కొన్ని స్టాల్‌ల వద్ద కొంతమంది జనం ఉండటం నాకు కన్పించింది. కఫే షాంతా అన్న పేరు రంగుదీపాలలో ఉన్న స్టాల్ తెర ముందు ఇద్దరు మనుషులు ఒక పళ్లెంలో డబ్బులు లెక్క పెడుతున్నారు. నాణాల పడే శబ్దం నాకు విన్పించింది.

కష్టంమీద నేనక్కడికి ఎందుకు వచ్చానో గుర్తుకు తెచ్చుకుని, ఒక స్టాల్ దగ్గరకు వెళ్లాను, పింగాణీ పూలకుండీలు, పూల టీ–సెట్లు చూశాను. స్టాల్ తలుపు దగ్గర నిలబడి ఒక యువతి, ఇద్దరు యువకులతో మాట్లాడుతూ, చిరునవ్వులు ఒలకబోస్తోంది. వాళ్ల ఇంగ్లీషు యాసను నేను గుర్తుపట్టాను, వారి సంభాషణను లీలగా విన్నాను.

"ఆహా, నేనలాంటి మాట అనలేదు!"

"కానీ, నువ్వన్నావు!"

"లేదు, నేననందే!"

"ఆమె ఆ మాటన్లా?"

"అవును. ఆమె అలా అనటం నేను విన్నాను."

"అహా, అదొట్టి... బొంకు!"

నన్ను చూసి ఆ యువతి నా దగ్గరకు వచ్చింది, 'ఏమయినా కొనాలా' అని అడిగింది. ఆమె గొంతు ప్రోత్సహించేదిగా లేదు; తన విధిగా ఆమె నాతో మాట్లాడినట్లుంది. స్టాలు చీకటి ప్రవేశద్వారం వద్ద ఇరువైపులా ప్రాచ్యదేశాల కాపలాదారుల్లా నిలబడ్డ పెద్ద జాడీలవంక కుంగిపోయి చూస్తూ, గొణిగాను:

"ఏం వద్దు, థాంక్స్!"

ఆ యువతి ఒక పూల కుండీ స్థానం మార్చి, మళ్లా ఆ యువకుల దగ్గరకు వెళ్లింది. మళ్లీ వాళ్లు ఆ విషయంపైనే మాట్లాడసాగారు. ఒకటి, రెండు సార్లు ఆ యువతి భుజంమీదనుండి నా వైపు చూసింది.

నేనక్కడ ఉండటం దండగ అని తెల్సినా, ఆమె స్టాల్‌లోని వస్తువులపట్ల నా ఆసక్తి నిజమని ఆమె కన్పించేటట్లు, ఆ స్టాల్‌ముందు కాస్తసేపు నిలబడ్డాను. మెల్లగా అక్కడనుండి కదిలి, బజారు మధ్యకు నడచి వెళ్లాను. లైటు ఆర్పేసినట్లు, ఒకవైపు ప్రదర్శన శాలనుండి ఎవరో అరిచారు. హాలు పైభాగమంతా పూర్తిగా చీకటయి పోయింది.

చీకటిలోకి చూస్తూ, దురభిమానం పరిహసించి, బయటకు తోలిన ప్రాణిగా నాలో నా కనుభూతమయింది.; నా కళ్లు క్షోభతో, కోపంతో మండాయి. ●

వదిలాను. మెట్లెక్కి ఇంటి పై భాగానికి వెళ్లాను. ఎత్తుగా, చల్లగా, ఖాళీగా ఉన్న గదులు నాకు విడుదల కల్పించాయి; ముందువైపు కిటికీలోనుండి నా స్నేహితులు వీథిలో ఆడుకోవటం నాకు కన్పించింది. వాళ్ల అరుపులు నన్ను బలహీనపర్చాయి; చల్లటి గ్లాసుమీద నా తలవాల్చి, ఆమె నివసించే ఇంటివైపు చూశాను. అక్కడో గంటసేపు నిలబడి ఉంటాను; నా ఊహ కల్పించిన ఆమె కపిలవర్ణపు మూర్తి తప్ప నాకేం కన్పించలేదు; దీపపు వెలుగుపడుతున్న ఆమె వంపుతిరిగిన మెడను, కటకటాలమీద ఆమె చేతులని, డ్రస్సుకింది అంచును నేను జాగ్రత్తగా స్పృశించాను.

నేను మళ్లా మెట్లు దిగి కిందకు వచ్చేసరికల్లా, మెర్సర్ సతీమణి కుంపటిపక్కన కూర్చుని కన్పించింది. ఆమె పిచ్చివాగుడు వాగే, ముసలావిడ; ఆమె భర్త తాకట్టుమీద ఋణమిచ్చే వ్యాపారస్థుడు; అతడెప్పుడో పోయాడు. ఆమె మరే ధర్మకార్యానికో మరి, వాడిన స్టాంపులను సేకరిస్తూ ఉంటుంది. టీ టేబుల్ దగ్గరి ముచ్చట్లను భరించక తప్ప లేదు నాకు. భోజన సమయానికి గంటదాటి పోయింది, అయినా, మా మామ జాడ లేదు. మెర్సర్ సతీమణి వెళ్లటానికి లేచి నిలబడింది: తానింక నిరీక్షించలేనందుకు విచారాన్ని వ్యక్తం చేసింది; అయితే, అప్పటికే ఎనిమిది దాటింది; రాత్రి వాతావరణం ఆమె ఒంటికి మంచిది కాదు కనుక వెళ్లిపోయింది. ఆమె వెళ్లాక, గదిలో అటూఇటూ పచార్లు చేయసాగాను. మా అత్త అంది: "ఈ మన ప్రభువు రాత్రిపూట బజారుకు వెళ్లేపని వాయిదా వెయ్యటం మంచిదేమో!"

తొమ్మిది గంటలకు, మా మామ హాలు తలుపులో తాళంచెవిపెట్టి తిప్పటం నాకు విన్పించింది. ఆయన తనలో తానే ఏదో మాట్లాడుకోవటం, ఆయన ఓవర్‌కోటు బరువుకు హాలుస్టాండు ఊగటం విన్పించాయి. ఈ చిహ్నాలను నేను వ్యాఖ్యానించు కున్నాను. ఆయన భోజనం మధ్యలో ఉండగా, బజారుకెళ్లటానికి డబ్బివ్వమని నేను ఆయన్ని అడిగాను. ఆయన మర్చిపోయాడు.

"జనం ఒక నిద్రపోయి లేచి మళ్లీ పడుకుని ఉంటారు ఇప్పటికల్లా," అన్నాడాయన.

నేనేం నవ్వలేదు. మా అత్త గట్టిగా చెప్పింది, "ఆ పిల్లాడికి డబ్బిచ్చి పంపించెయ్యొచ్చుగా? ఇప్పటికే, అనవసరంగా మేల్కొనివుంచావతన్ని!"

తాను మర్చిపోయినందుకు మా మామ విచారం వ్యక్తపరిచాడు. "ఆటాపాటా లేని పని జాక్‌ను మొద్దువెధవను చేస్తుంది" అన్న పాత సామెతలో తనకు నమ్మక ముందన్నాడు. నేను ఎక్కడికి వెళ్తున్నానో అడిగాడు. నేను రెండుసార్లు చెప్పాక, తన గుర్రానికి అరబ్ మనిషి వీడ్కోలు పల్కే పద్యం తెల్సునా? అని నన్నడిగాడు. నేను వంటగది వదిలేటప్పటి కల్లా, ఆ కవితలోని ప్రారంభపంక్తులను ఆయన మా అత్తకు విన్పించటం నాకు వినపడింది.

ఇచ్చిన ఫ్లోరిన్ (రెండు షిల్లింగుల విలువవుండే బ్రిటీషువారి పాతకాలపు వెండి నాణెం) గట్టిగా చేతిలో పట్టుకుని బకింగ్‌హామ్ స్ట్రీట్ గుండా స్టేషనుకు వెళ్లాను. గ్యాసులైటు వెలుగులో కొనుగోలుదారుల గుంపులు రోడ్డుమీద ఉండటం చూసి నేను బయటకు వచ్చిన పని గుర్తుకు వచ్చింది. నిర్జనమైన బండిలో ఒక మూడో తరగతి పెట్టెలో నేను కూర్చున్నాను. బండి భరించలేనంత ఆలస్యంగా స్టేషను వదలి, మెల్లగా కదిలింది. శిథిలమయిన ఇళ్ల మధ్యగుండా, మెరుస్తున్న నది మీదుగా అది పాకి వెళ్లింది. వెస్ట్‌లాండ్ రో స్టేషనులో జనాల గుంపు పెట్టెల తలుపుల వద్దకు వస్తుంటే, అది బజారుకు వెళ్లే ప్రత్యేకబండని చెప్పి, పోర్టర్లు వాళ్లని నిలిపేశారు. ఆ నగ్నంగా వున్న పెట్టెలో నేను ఒంటరిగా కూర్చుండిపోయాను. కొద్ది నిమిషాలలో బండి ప్రత్యామ్నాయంగా కట్టిన చెక్క ప్లాట్‌ఫాం మీద ఆగింది. నేను రోడ్డుమీదకు వచ్చాను; ఆ పక్కన వెలుగుపడ్తున్న గడియారపు ముఖసూచిలో పది నిమిషాలు తక్కువగా పదయినట్లు చూశాను. నాకు ఎదురుగా పెద్ద భవనం కన్పించింది; దానిముందు ఆ అద్భుతనామం ప్రదర్శితమై ఉంది.

**అమెరికాలో బానిస వ్యవస్థ రూపుమాపడానికి అబ్రహాం లింకన్ 'హకల్ బెరిఫిన్' పుస్తకాన్ని ఒక ఆయుధంగా వాడుకున్నాడు.**

ఆరు పెన్నీల ప్రవేశద్వారం నాకు కన్పించలేదు; బజారు మూత పడిందేమో నన్న భయంతో, అలసిపోయి ఉన్నట్టు కన్పించే ఆ మనిషికి షిల్లింగు చెల్లించి, తిరుగుడు పలకదాటి వెళ్లాను; పెద్ద హాల్లోకి అడుగుపెట్టాను; దాని సగం ఎత్తుకు అంతా గాలరీ (ప్రదర్శనశాల) ఉంది. సుమారుగా స్టాల్‌లు అన్నీ మూసివేశారు. హాలులో అధిక భాగంలో చీకటి రాజ్యమేలుతోంది. ప్రార్థనలయి జనం వెళ్లిపోయాక, చర్చిలో వ్యాపించి ఉండే నిశ్శబ్దం ఎలా ఉంటుందో నాకు తెల్సు. నేను భయపడుతూ, బజారు మధ్యకు నడిచాను. ఇంకా తెరిచివున్న కొన్ని స్టాల్‌ల వద్ద కొంతమంది జనం ఉండటం నాకు కన్పించింది. కఫే షాంతా అన్న పేరు రంగుదీపాలలో ఉన్న స్టాల్ తెర ముందు ఇద్దరు మనుషులు ఒక పళ్లెంలో డబ్బులు లెక్క పెడుతున్నారు. నాణాల పడే శబ్దం నాకు విన్పించింది.

కష్టంమీద నేనక్కడికి ఎందుకు వచ్చానో గుర్తుకు తెచ్చుకుని, ఒక స్టాల్ దగ్గరకు వెళ్లాను, పింగాణీ పూలకుండీలు, పూల టీ–సెట్లు చూశాను. స్టాల్ తలుపు దగ్గర నిలబడి ఒక యువతి, ఇద్దరు యువకులతో మాట్లాడుతూ, చిరునవ్వులు ఒలకబోస్తోంది. వాళ్ల ఇంగ్లీషు యాసను నేను గుర్తుపట్టాను, వారి సంభాషణను లీలగా విన్నాను.

"ఆహఁ, నేనలాంటి మాట అనలేదు!"

"కానీ, నువ్వన్నావు!"

"లేదు, నేననందే!"

"ఆమె ఆ మాటన్లా?"

"అవును. ఆమె అలా అనటం నేను విన్నాను."

"అహఁ, అదొట్టి... బొంకు!"

నన్ను చూసి ఆ యువతి నా దగ్గరకు వచ్చింది, 'ఏమయినా కొనాలా' అని అడిగింది. ఆమె గొంతు ప్రోత్సహించేదిగా లేదు; తన విధిగా ఆమె నాతో మాట్లాడి నట్లుంది. స్టాలు చీకటి ప్రవేశద్వారం వద్ద ఇరువైపులా ప్రాచ్యదేశాల కాపలాదారుల్లా నిలబడ్డ పెద్ద జాడీలవంక కుంగిపోయి చూస్తూ, గొణిగాను:

"ఏం వద్దు, థాంక్స్!"

ఆ యువతి ఒక పూల కుండీ స్థానం మార్చి, మళ్లా ఆ యువకుల దగ్గరకు వెళ్లింది. మళ్లీ వాళ్లు ఆ విషయంపైనే మాట్లాడసాగారు. ఒకటి, రెండు సార్లు ఆ యువతి భుజంమీదనుండి నా వైపు చూసింది.

నేనక్కడ ఉండటం దండగ అని తెల్సినా, ఆమె స్టాల్‌లోని వస్తువులపట్ల నా ఆసక్తి నిజమని ఆమె కన్పించేటట్లు, ఆ స్టాల్‌ముందు కాస్తసేపు నిలబడ్డాను. మెల్లగా అక్కడనుండి కదిలి, బజారు మధ్యకు నడచి వెళ్లాను. లైటు ఆర్పేసినట్లు, ఒకవైపు ప్రదర్శన శాలనుండి ఎవరో అరిచారు. హాలు పైభాగమంతా పూర్తిగా చీకటయి పోయింది.

చీకటిలోకి చూస్తూ, దురభిమానం పరిహసించి, బయటకు తోలిన ప్రాణిగా నాలో నా కనుభూతమయింది.; నా కళ్లు క్షోభతో, కోపంతో మండాయి. ●

# ది జడ్జిమెంట్

## కాఫ్కా (1883-1924)

అనువాదం: జి.లక్ష్మి



ఇరవయ్యో శతాబ్దపు డాంటేగా డబ్ల్యు.హెచ్. ఆడెన్ అభివర్ణించిన ఫ్రాంజ్ కాఫ్కా 1883 జులై 3న చెక్ రిపబ్లిక్‌లోని ప్రేగ్‌లో ఒక మధ్యతరగతి యూదు కుటుంబంలో జన్మించాడు. కాఫ్కా తండ్రి హెర్మన్ కాఫ్కా సేల్స్ రిప్రజెంటేటివ్‌గా, రిటెయిల్ వ్యాపారిగా పనిచేసేవాడు. ఆరుగురు పిల్లల్లో కాఫ్కా పెద్దవాడు.

నియంత లాంటి తండ్రి కారణంగా ఇంట్లో తలెత్తే సంఘర్షణలు కాఫ్కాపై ప్రభావం చూపించాయి. తల్లి అతి సున్నితత్వం, తండ్రిక్రూరత్వం, అల్పజ్ఞానం కారణంగా తలెత్తే మానసిక సంఘర్షణల్లో కాఫ్కా నలిగిపోయేవాడు. కాఫ్కా తండ్రి కొడుకు రచనలను ఏ మాత్రం పట్టించుకోకుండా కంటగింపుగా చూసేవాడు. ప్రేమపూరితమైన ఇంటి వాతావరణం లోపించడం, తల్లిదండ్రుల మధ్య అవగాహనా రాహిత్యం, ఆయాల చేతుల్లో పెరగడం. ఇవన్నీ బాల్యంలోనే కాఫ్కాలో ఒకలాంటి అలజడికి, అశాంతికి కారణమయ్యాయి. నలభై ఒక్క ఏళ్ళకు క్షయమూలంగా చనిపోకుండా ఉండి ఉంటే కాఫ్కా కూడా తన ముగ్గురు చెల్లెళ్ళు, ఆత్మీయురాలు మిలెనా జెసెంస్కాల్లాగా జర్మన్ కాన్సన్ ట్రేషన్ క్యాంపులో మరణించి ఉండేవాడని అంటారు. కాఫ్కా కథా కథన రీతిని సాహిత్యకారులు "కాఫ్కెస్క్యూ" అని వ్యవహరిస్తుంటారు. కాఫ్కెస్క్యూ అనే పదం అమెరికన్ హెరిటేజ్ కాలేజ్ డిక్షనరీలో చోటు చేసుకుంది. ఈ అరుదైన ఘనతను దక్కించుకున్న అతికొద్దిమంది రచయితల్లో కాఫ్కా ఒకడు. కాఫ్కా రచనలు చేసేటపుడు ఒంటరిగా ఉండడానికి ఇష్టపడేవాడు. సన్యాసులకు అవసరమయేంత ఒంటరితనం కన్నా చనిపోయిన వారి దగ్గర ఉండే ఏకాకి తనం ఉంటేనే తన కలం సాగుతుందని కాఫ్కా ఒక సందర్భంలో అన్నాడు. మిగిలిన సమయాల్లో కూడా కాఫ్కా చాలా వరకూ ఒంటరిగా ఉండడాన్ని ఇష్టపడేవాడు. రచయితల సమూహంలో కూడా అంతగా చేరేవాడు కాదు. రచయితలు మాట్లాడేది దుర్గంధభూయిష్టంగా ఉంటుందని ఒక చోట అంటాడు కూడా. పసిపిల్లాడి లాంటి అతని నైర్మల్యం, నిరాడంబరత, నెమ్మదిగా ప్రశాంతంగా ఉండే నడవడి, అతని తెలివితేటలు, హాస్య ప్రవృత్తి అందరినీ ఆకట్టుకునేవి.

"పుస్తకం మన లోపల గడ్డకట్టిన సముద్రాలను ఛేదించే గొడ్డలి" అనే కాఫ్కామాట అతని రచనల విషయంలో కూడా అక్షర సత్యం.

వసంత కాలం లోని ఓ ఆదివారం ఉదయం జార్జి బెండిమన్ మొదటి అంతస్థులో ఉన్న తన గదిలో కూర్చుని ఉన్నాడు. బెండిమన్ యువకుడు. వ్యాపారం చేస్తుంటాడు. నదీతీరం పొడవునా తక్కువ ఎత్తులో నిర్మించిన ఇళ్ళలో ఆ ఇల్లు కూడా ఒకటి. రంగు, ఎత్తుల్లోని తేడాలు తప్ప ఆ ఇళ్ళన్నీ దాదాపు చూడడానికి ఒకేలా ఉంటాయి. విదేశాల్లో ఉన్న స్నేహితుడికి రాసిన ఉత్తరాన్ని అప్పుడే ముగించి కవరు అతికించాడు బెండిమన్. కిటికీలోంచి కనపడుతున్న నదిని, బ్రిడ్జినీ, నదికి ఆవల ఒడ్డున చిక్కగా పరుచుకొన్న పచ్చదనాన్ని చూస్తూ కాసేపు అలాగే కూర్చుండి పోయాడు.

తనున్న ప్రాంతంలో భావి జీవితం అంత ఆశాజనకంగా ఉండకపోవచ్చన్న అభిప్రాయంతో ఎన్నో ఏళ్ళ కిందటే అకస్మాత్తుగా రష్యా బయలుదేరి వెళ్ళిన ఆ స్నేహితుడి గురించి కాసేపు ఆలోచించాడు. పీటర్స్ బర్గ్‌లోని స్వంత వ్యాపార సంస్థకి అతనిప్పుడు మేనేజరుగా ఉన్నాడు. అక్కడ అతని వ్యాపారం మొదట మొదట చాలా బాగుంది. అయితే గత కొంతకాలంగా అతను కష్టాల్లో చిక్కుకున్నాడు. దానితో స్వదేశానికి అతని రాకపోకలు కూడా బాగా తగ్గిపోయినయి. ఫలితంగా అతను అక్కడే చిక్కుకు పోయాడు. చిన్నతనం నుంచీ బెండిమన్‌కు ఎంతో చిరపరిచితమైన ఆమొహం గడ్డం మాటున కప్పబడి పోయింది.

పాతాళంలోకి కుంగిపోయినట్టున్న అతని మొహం ఏదో వ్యాధి సూచనగా పసుపు వర్ణంలోకి తిరిగింది. అక్కడ ఉన్న విదేశీయుల కాలనీలో అతనికి తెలిసినవాళ్ళు లేరు. స్థానికంగా ఉండే కుటుంబాలతో అతనికి ఉన్న సంబంధాలు కూడా అంతంత మాత్రమే. అతనికి ఇంక వేరే ప్రత్యామ్నాయం కూడా లేకపోవడంతో బ్రహ్మచారిగా జీవితం కొనసాగించడానికి సిద్ధపడి పోయాడు.

> '80 రోజుల్లో భూప్రదక్షిణం' పుస్తకం ఒకసారి చదివితే వందేళ్ళు గుర్తుండిపోతాడు ఆ కథా నాయకుడు ఫిలియాస్ ఫాగ్.

అట్లా అదృష్టమార్గం లోంచి దారి తప్పిపోయిన వాడికి ఏదైనా ఏం చెప్పగలం? అతనంటే ఎంత సానుభూతి ఉన్నా ఏ రకంగానూ సహాయం చేయలేనప్పుడు ఎవరైనా చేయగలిగింది ఏముంది? అతన్ని తిరిగి వెనక్కి స్వదేశానికి వచ్చేయమని ఇక్కడి పాత జీవితాన్ని కొనసాగించమని, పాత స్నేహాల్ని, పరిచయాల్ని పునరిద్ధరించుకోమని అతనికి చెప్పవచ్చు. అతను అలా చేయకపోవడానికి పెద్ద కారణాలు కూడా ఏం లేవు. అయితే అన్ని విషయాల్లో అతను మిత్రుల సహాయం కోసం ఎదురుచూడాలి. అంటే అతను విదేశానికి వెళ్ళి అక్కడ విఫలమై వెనక్కు తిరిగి వచ్చిన విషయాల్ని ఒప్పుకున్నట్టు అవుతుంది. ఆ విషయాన్ని ఎంత జాగ్రత్తగా దాచిపెడదామన్నా అది మరింత గాయపెడుతుంది. ఓడిపోయి వెనక్కు తిరిగి వచ్చిన వాడిగా అందరూ అతన్ని చూడడం బాధ పెడుతుంది.

ఉన్న ఊళ్ళోనే ఉండిపోయిన అతని స్నేహితులందరూ దాదాపు మంచిగానే స్థిరపడిపోయారు. అతను వెనక్కి తిరిగివస్తే ఇక్కడ ఎలా ఉంటుందనే విషయాన్ని బెండిమన్ కూడా గట్టిగా చెప్పలేకపోయాడు. తిరిగి వచ్చిన తర్వాత ఇక్కడ ఏం చేయాలనే సమస్య కూడా వస్తుంది. దానితో అతను విదేశంలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఒకవేళ స్వదేశానికి తిరిగివచ్చి పరిస్థితుల ప్రభావం వల్ల ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే అప్పుడు కూడా మిత్రులు దూరమైపోతారు. స్వదేశానికి తిరిగి రమ్మనే మిత్రుల సలహాను పెడచెవిన పెట్టి విదేశంలోనే ఉండిపోయినా మిత్రులకు కోపం తెప్పించి అట్లాగూ వారికి దూరమైపోతాడు. స్వదేశంలో వ్యాపారానికి అనువైన పరిస్థితులు ఉన్నదీ లేనిదీ తెలియకుండా తిరిగివచ్చి ఇబ్బంది పడేదానికన్నా విదేశంలోనే ఉండిపోవడం నయమని చివరికి అతను ఒక నిర్ణయానికి వచ్చాడు. ఈ పరిస్థితులన్నిటినీ దృష్టిలో పెట్టుకుని అతను స్వదేశానికి తిరిగి వస్తే ఇక్కడ బాగుంటుందని, ఇక్కడికి తిరిగి రమ్మని ఎవరైనా ఎలా అనగలరు?

ఈ కారణం వల్ల బెండిమాన్ మిత్రుడికి ఉత్తరం రాయడానికి తటపటాయించాడు. అంతగా పరిచయం లేనివారికి ఉత్తరం రాయడానికి ఏం రాయాలో తెలీక ఇబ్బంది పడినట్టు బెండిమాన్ కూడా ఇబ్బంది పడ్డాడు. అతని స్నేహితుడు ఇంటికి వచ్చి ఇప్పటికి మూడేళ్ళయింది. రష్యాలో రాజకీయంగా తలెత్తిన అనిశ్చిత పరిస్థితులు కూడా దానికి కొంత కారణం అని, చిన్న చిన్న వ్యాపారస్థులు రెండు మూడు రోజులపాటు కూడా దేశాన్ని విడిచిపెట్టి పోలేని పరిస్థితి అని అతని స్నేహితుడు చెబుతూ వచ్చాడు. అయితే అదే సమయంలో వందలాది వేలాది మంది రష్యన్లు మాత్రం ప్రపంచం అంతటా తిరుగుతూనే ఉన్నారు.

అయితే ఈ మూడేళ్ళ కాలంలో బెండిమన్ పరిస్థితులు చాలా మారిపోయినై. అతని జీవితంలో అనేక మార్పులు వచ్చినయి. రెండేళ్ళ కిందట అతని తల్లి చనిపోయిన దగ్గర్నుంచీ బెండిమన్, అతని తండ్రి కలిసి జీవించాల్సి వచ్చింది. ఆ విషయం అతని మిత్రుడికి తెలుసు. బెండిమన్ తల్లి చనిపోయినందుకు అతను సంతాపం తెలియజేశాడు కూడా. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు విదేశాల్లో ఉన్న వారి పరిస్థితి మరింత దుర్భరంగా ఉంటుందని అతను ఉత్తరంలో రాశాడు.

అయితే అప్పటినుంచీ బెండిమన్ వ్యాపార వ్యవహారాలు స్వయంగా చూసుకోసాగాడు. వ్యాపారంతో పాటు అన్ని విషయాల్లో చురుకుగా ఉత్సాహంగా ఉండడం మొదలు పెట్టాడు. అతని తల్లి బతికి ఉన్నప్పుడు బెండిమన్ తండ్రి అన్ని విషయాలు తనే స్వయంగా చూసుకునేవాడు. దానితో బెండిమన్ స్వతంత్రంగా ఏ పనీ చేయలేకపోయే వాడు. భార్య చనిపోయిన తర్వాత అతని తండ్రి వ్యాపారం పనులు చేస్తూనే వచ్చినప్పటికీ క్రమక్రమంగా అన్నిటికీ దూర మవుతూ వచ్చాడు. అయితే అదృష్టవశాత్తూ పరిస్థితులు అనుకూలించి రెండేళ్ళ నుంచీ వ్యాపారం బాగా పుంజు కొంది. గతంలో కన్నా అతని సంస్థలోని ఉద్యోగులు రెట్టింపయ్యారు. అమ్మకాలు ఐదురెట్లు పెరిగాయి. వ్యాపారం ఇంకా పుంజుకునే సూచనలు కూడా కనిపిస్తున్నాయి.

అయితే ఈ పరిణామాలన్నీ బెండిమన్ స్నేహితుడికి ఏ మాత్రం తెలీదు. అతని తల్లి చనిపోయినప్పుడు రాసిన ఉత్తరంలో బెండిమన్ స్నేహితుడు అతడ్ని కూడా రష్యాకు వచ్చేయమని కోరాడు. బెండిమన్ చేసే వ్యాపారానికి పీటర్స్ బర్గ్‌లో ఎలాంటి అవకాశాలు ఉన్నాయో కూడా వివరంగా రాశాడు. నిజానికి అతను చెప్పిన వివరాలు అంత సంతృప్తి కరంగా ఏం లేవు. బెండిమన్ ఇప్పటి వ్యాపారంతో పోల్చి చూస్తే అవి ఏ మాత్రం సరిపోలవు. అయితే తను వ్యాపార పరంగా సాధించిన విజయాన్ని మిత్రుడికి చెప్పడానికి బెండిమన్ ఇష్టపడలేదు. ఆ విషయాన్ని ఇప్పుడు అతనికి చెప్పడం మరింత పిచ్చిపని అవుతుంది.

అందుకే బెండిమన్ ఆ విషయం చెప్పకుండా ఉత్తరమంతా ఏదో చిల్లర మల్లర విషయాలతో నింపివేశాడు. ఆ ఆదివారం ఉదయం తన మనసులోకి వచ్చిన ఆలోచనలన్నిటినీ అందులో కుమ్మరించాడు. అతనికి ఇప్పుడింక కావలసింది ఏదీ లేదు. ఇప్పుడున్న జీవితం చెల్లాచెదురు కాకుండా ఉంటేచాలు. అందుకే తమ ఊరి గురించి స్నేహితుడి అభిప్రాయాలు చెక్కు చెదరకుండా ఉండేలా అతను జాగ్రత్తపడ్డాడు. తన నిశ్చితార్థం గురించి రాస్తూ వివాహం గురించి అంత ఆసక్తి చూపించనట్టు ఏదో ఒక సాదాసీదా అబ్బాయికి ఒక సాదాసీదా అమ్మాయితో జరుగుతున్న పెళ్ళిగా వర్ణించాడు. అంతకు ముందు

రాసిన మూడు ఉత్తరాల్లో అతను అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. దానితో అతని స్నేహితుడు ఈ జంటపై ఆసక్తి కనబరచడం ప్రారంభించాడు.

సంపన్న కుటుంబం నుంచీ వచ్చిన ఫ్రిదా బ్రాండెన్ ఫెల్ట్ అనే అమ్మాయితో తనకు పోయిన నెల నిశ్చితార్థం జరిగినట్టు బెండిమన్ ఉత్తరంలో తెలియజేశాడు. తన స్నేహితుడి గురించీ, అతనితో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాల గురించీ అతను ఎప్పటికప్పుడు తన కాబోయే భార్యతో చెబుతూ వచ్చాడు. "అయితే అతను మన వివాహానికి రావడం లేదా?" అని ఫ్రిదా అతన్ని అడిగింది కూడా.

"నీ స్నేహితులందరి గురించీ నేను తెలుసుకోవాలి కదా" అని కూడా ఆమె అంది.

"నేను అతన్ని ఇబ్బంది పెట్టదలచుకోలేదు" అని బెండిమన్ ఆమెతో అన్నాడు.

"దయచేసి అర్థం చేసుకో. అతను వచ్చినా రావచ్చు. అయితే వస్తే కనుక అతను బాధపడతాడు. అతని మనసు గాయపడవచ్చు. బహుశా నన్ను చూసి అసూయ పడవచ్చు. ఇదంతా అతనికి అంత సంతోషం కలిగించకపోవచ్చు. దానికి తోడు అతను ఒంటరిగా వెనక్కు తిరిగి వెళ్ళాలి. ఒంటరిగా... నీకు అర్థమవుతోంది కదా" అని అతడు అన్నాడు.

"అవుననుకో. అయితే మన వివాహం గురించి వేరే వాళ్ళ ద్వారా అతను వినడం బాగుండదు కదా" అని ఆమె అంది.

"దానికి మనమేం చేయలేం. అది మన చేతుల్లో లేదు. అయితే అతను తన పరిస్థితులకు అనుగుణంగా నడుచుకునేలా వదిలి వేయడం మంచిది" అని అతనన్నాడు.

"అయితే నీకిలాంటి స్నేహితులు ఉన్నప్పుడు అసలు నువ్వు నిశ్చితార్థం కూడా చేసుకోకుండా ఉండాల్సింది." అని ఫ్రిదా అంది.

"సరే. దానికి తప్పు మనిద్దరిదీ అనుకుందాం. అయితే నా విషయానికి వస్తే నాకు ఇంక వేరే దారిలేదు" అని బెండిమన్ అన్నాడు. తర్వాత ఆమెను అతను ముద్దులతో ముంచెత్తాడు.

> పుస్తకం
> కన్నతల్లి పాత్రను
> పోషిస్తుంది
> - మాగ్జింగోర్కీ

అతని ముద్దులలో కరిగిపోతూనే "అయినా నాకు ఇంకా బాధగానే ఉంది" అని ఫ్రిదా అంది.

అతను ఈ విషయాలన్నిటినీ తన స్నేహితుడికి తెలియజేశాడు.

"నేను నాలాగే ఉంటాను. ఇంక అంతకన్నా చేసేది ఏం లేదు" అని అతను తనలోతను అనుకున్నాడు.

"నేను ఇప్పుడు కత్తెరను నా చేతుల్లోకి తీసుకుని నాలో నుంచి అతనికి నచ్చే మంచి స్నేహితుడ్ని విడదీసి కత్తిరించలేను" అని అతను అనుకొన్నాడు.

అందుకే అతను ఆ ఆదివారం ఉదయం కూర్చుని తన స్నేహితుడికి సుదీర్ఘమైన ఉత్తరాన్ని రాశాడు. తన నిశ్చితార్థం గురించి రాస్తూ "నా గురించి ఒక శుభవార్త చివరి వరకూ దాచి ఉంచాను. సంపన్న కుటుంబానికి చెందిన ఫ్రిదా అనే అమ్మాయితో నాకు నిశ్చితార్థం జరిగింది. నువ్వు ఇక్కడి నుంచీ రష్యాకు వెళ్ళిపోయిన తర్వాత వాళ్ళు ఈ ప్రాంతానికి వచ్చారు. అందుకే ఆమె గురించి నీకు అంత తెలిసివుండకపోవచ్చు. తర్వాత తర్వాత నీకు ఆమె గురించి మరిన్ని వివరాలు చెబుతాను. ఇవాళ నా విషయానికి వస్తే నేను చాలా సంతోషంగా ఉన్నాను. నా జీవితంలో వచ్చిన ఏకైక మార్పు అదే. నీకు తెలిసిన నీ ఒకప్పటి సాధారణ స్నేహితుడు ఇప్పుడు సంతోషంగా ఉన్న స్నేహితుడయ్యాడు. అంతే కాకుండా నా కాబోయే భార్య నీకు తన నమస్కారాలు తెలియజేయాలని కోరింది. నీలాంటి బ్రహ్మచారికి ఆమె మంచి స్నేహితురాలు కాగలదు. నువ్వు ఇక్కడికి రావడానికి అనేక అవరోధాలు ఎదురవుతాయని నాకు తెలుసు. అయితే ఆ అవాంతరాలన్నిటినీ వదిలించుకుని ఇక్కడికి రావడానికి నా వివాహాన్ని ఒక అవకాశంగా నువ్వు ఎందుకు తీసుకోకూడదు? అయితే అట్లా అన్నానని నువ్వు కష్టపడుతూ రావద్దు. నీ పరిస్థితుల ప్రకారం నిర్ణయం తీసుకో"

తన చేతిలో వున్న ఈ ఉత్తరం పట్టుకుని బెండిమన్ చాలాసేపు కుర్చీలో కూర్చుండిపోయాడు. బైట నుంచీ పరిచయస్థుడొకరు అతన్ని కిటికీ నుంచి చూసి చెయ్యూపాడు. ఆలోచనల్లో మునిగిపోయి ఉన్న బెండిమన్ యాంత్రికంగా తనూ చెయ్యూపి నవ్వి ఊరుకున్నాడు.

చివరికి అతను ఉత్తరాన్ని జేబులో పెట్టుకుని గది నుంచీ బైటకు వచ్చి తండ్రి గదికి దారితీసే సన్నటి వరండాలో అడుగుపెట్టాడు. అతను తండ్రి గదికి వచ్చి అప్పటికి కొన్ని నెలలయింది. అలా చేయడానికి అతనికి ప్రత్యేకమైన సందర్భం, అవసరం రెండూ కలగలేదు. పనిచేసేచోట అతను ఎలాగూ రోజూ తండ్రిని కలుస్తూనే ఉంటాడు. మధ్యాహ్న భోజనం రెస్టారెంట్‌లో ఇద్దరూ కలిసేచేస్తారు. రాత్రి భోజనానికి మాత్రం ఇద్దరూ వేర్వేరుగా తెప్పించుకుంటారు. అయితే సాయంత్రం వాళ్ళిద్దరూ కలిసి కాసేపు ముందున్న హాలులో కూర్చుంటారు. సాధారణంగా ఇద్దరూ వార్తాపత్రికలు చదువుతూ గడిపేస్తారు. లేని పక్షంలో బెండిమన్ స్నేహితుల్ని కలవడానికి బైటకువెళ్ళిపోతాడు. ఇప్పుడైతే కాబోయే భార్యను కలవడానికి వెళుతున్నాడు.

వెలుతురు బాగా ఉన్న ఉదయం సమయంలో కూడా తండ్రి గది బాగాచీకటిగా ఉందని బెండిమన్ అనుకున్నాడు. గోడ కారణంగా పరుచుకొన్న నీడలు చాలా ఎత్తులో ఉన్నాయి. బెండిమన్ తండ్రి తన గదిలో ఒక మూలగా కిటికీ దగ్గర కూర్చుని ఉన్నాడు. గదంతా ఇటీవల మరణించిన ఆయన భార్య స్మృతి చిహ్నాలతో నిండి ఉంది. ఆయన చూపు కూడా ఈ మధ్య బాగా మందగించింది. దానితో వార్తా పత్రికను కళ్ళ ఎదురుగా పెట్టుకుని చదువుతూ కనిపించాడు. ఉదయం అల్పాహారం తీసుకోగా మిగిలిన పదార్థాలన్నీ బల్లమీద చెల్లా చెదురుగా ఉన్నాయి. వాటిని చూస్తే ఆయన ఎక్కువగా ఏం తినలేదని తెలుస్తోంది.

"ఓ. జార్జి" అంటూ ఆయన కుర్చీలో నుంచి బెండిమన్‌ను పలకరించేందుకు లేచాడు. అలా లేవడంతో ఆయన వేసుకున్న డ్రెస్సింగ్ గౌను కొంచెం తెరుచుకుంది.

"మా నాన్న ఇప్పుడు కూడా ఎంత ఎత్తుగా దృఢంగా వున్నాడు" అని బెండిమన్ తనలోతను అనుకున్నాడు.

"ఇక్కడ చాలా చీకటిగా ఉంది" అని బెండిమన్ ప్రారంభించాడు.

"అవును. చీకటిగానే ఉంది" అతని తండ్రి సమాధానమిచ్చాడు.

"నువ్వు కిటికీ కూడా మూసి ఉంచావు."

"నాకు అలానే ఇష్టం."

"బైట చాలా వేడిగా ఉంది" అంటూ బెండిమన్ తను ఇంతకు ముందు అన్నదాన్ని నొక్కి చెప్పేందుకు అన్నాడు. తర్వాత అక్కడే కూర్చున్నాడు.

అతని తండ్రి అల్పాహారం చేసిన గిన్నెలన్నిటినీ పోగుచేసి పక్కనే ఉన్న బల్లమీద పెట్టాడు. తండ్రి కదలికలన్నీ శ్రద్ధగా గమనిస్తూనే "నిజానికి నిశ్చితార్థం గురించి పీటర్స్‌బర్గ్‌కి ఉత్తరం రాస్తున్నానని చెప్పడానికి ఇక్కడకు వచ్చాను" అని బెండిమన్ అన్నాడు. తన జేబులోంచి కవరుని కొంచెం బైటకు లాగాడు.

"పీటర్స్ బర్గ్‌కా" అతని తండ్రి అడిగాడు.

"అక్కడ నా స్నేహితుడు ఉన్నాడు" బెండిమన్ తండ్రి కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు. "పనివేళల్లో ఇలాంటి పనులు ఆయనకు నచ్చవు. చేతులు మడిచి గుండెమీద పెట్టుకుని ఎంత దృఢంగా ఎలా కూర్చుని ఉన్నాడో చూడు" అని

తనలో తాను అనుకున్నాడు.

"అవును. నీ స్నేహితుడు ఉన్నట్టున్నాడు" ఆయన అన్నాడు.

"నీకు గుర్తు వచ్చిందా నాన్నా? నా నిశ్చితార్థం గురించి మొదట అతనికి చెప్పవద్దను కున్నాను. అతనికి చెప్పడం ఎందుకులే వదిలేద్దాం అనుకున్నాను. అంతే. అంతకు మించి కారణం ఏమీ లేదు. అతను కొంచెం అదో రకంగా ఉంటాడు. నా నిశ్చితార్థం గురించి వేరేవాళ్ళ ద్వారా వింటే అతను ఏమన్నా అనుకుంటాడేమో అనిపించింది. అతనికి తెలియకుండా ఆపలేం కదా"

"అందుకని నీ ఉద్దేశాన్ని మార్చుకున్నావా?" అంటూ అతని తండ్రి చేతిలో ఉన్న వార్తా పత్రికను కిటికీలో పెట్టి దానిపై కళ్ళజోడు ఉంచాడు.

"అవును. నా ఉద్దేశాన్ని మార్చుకున్నాను. అతను నిజంగా నాకు మంచి స్నేహితుడు  అయిన పక్షంలో నా సంతోషం అతనికీ సంతోషం కలిగిస్తుంది కదా అనుకున్నాను. అందుకే నేను ఇంక వెనుకాడలేదు. నా నిశ్చితార్థం గురించి అతనికి రాశాను. ఉత్తరాన్ని పోస్టుచేసే ముందు నీకు చెబుదామని వచ్చాను."

"జార్జి" అంటూ అతని తండ్రి పళ్ళులేని తన నోటిని వెడల్పుగా తెరిచాడు. "ఇప్పుడు నేను చెప్పేది విను. ఈ విషయం గురించి నాకు చెప్పడానికి నా సలహా తీసుకోవడానికి వచ్చావు. అది బాగానే ఉంది. అయితే దానికి అర్థం లేదు. నువ్వు పూర్తి నిజం చెప్పనప్పుడు ఉపయోగం ఏముంది? నాకు సంబంధించని విషయాల్లో జోక్యం చేసుకోవాలని నేను అంతగా అనుకోవడం లేదు. మీఅమ్మ చనిపోయిన తర్వాత కొన్ని చెడు పరిణామాలు జరిగాయి. వాటి గురించి మాట్లాడడానికి కూడా ఇప్పుడు సమయం వచ్చిందనుకుంటున్నాను. అయితే అది నేను అనుకున్నదానికన్నా కొంచెం ముందుకు జరిగింది. అంతే. ఆఫీసులో కొన్ని కొన్ని వ్యవహారాలు నాకు తెలియకుండా జరిగిపోతున్నాయి. అవి నాకు తెలియకుండా రహస్యంగా జరుగుతున్నాయని అయితే నేను అనుకోవడం లేదు. అలా అనుకోవడం కూడా నాకు ఇష్టం లేదు. అయితే నేను ఇదివరకటి సామర్థ్యంతో లేను. నా జ్ఞాపకశక్తి కూడా ఇదివరకటి కన్నా బాగా తగ్గిపోయింది. రకరకాల పనుల్ని గతంలోలా ఒకేసారి చేయలేక పోతున్నాను. బహుశా దానికి వయసు పైబడడం ఒక కారణం కావచ్చు. మీ అమ్మ చనిపోవడం నీకన్నా నన్ను బాగా కుంగదీసింది. అది రెండో కారణం అనుకుంటున్నాను. ఇక ఈ ఉత్తరం విషయానికి వస్తే జార్జ్ నేను నిన్ను ప్రాధేయపడుతున్నాను. దయచేసి నాకు నిజం చెప్పు. నన్ను మోసగించకు. నీకు పీటర్స్ బర్గ్‌లో నిజంగా స్నేహితుడున్నాడా?"

బెండిమన్ ఒకలాంటి అయోమయంలో లేచి నిలబడిపోయాడు. "నా స్నేహితుల గురించి మనం మాట్లాడనవసరం లేదు. వెయ్యిమంది స్నేహితులు కూడా ఒక తండ్రికి ప్రత్యామ్నాయం అవలేరు. నేను ఏం ఆలోచిస్తున్నానో నీకు తెలుసా? నువ్వు నీ గురించి శ్రద్ధ తీసుకోవడం లేదు. వృద్ధాప్యంలో కొన్ని కొన్ని జాగ్రత్తలు తీసుకుని తీరాలి. పని విషయం లోనూ అంతే. విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నావు. పని మూలంగా నీ ఆరోగ్యం దెబ్బతినే పక్షంలో వ్యాపారాన్ని రాత్రికి రాత్రే మూసేయడానికి కూడా నేను సిద్ధమే. అది అంత ముఖ్యం కాదు. మనం ఇకనన్నా కొన్ని మార్పులు చేర్పులు చేసుకోవాలి. అన్నిటికన్నా ముందు నువ్వు ఇక్కడ ఈ చీకటిలో కూర్చుంటున్నావు. దాని బదులు హాలులో కూర్చోవచ్చు కదా. అక్కడయితే చక్కటి గాలీ వెలుతురూ వుంటుంది. సరైన పోషకాహారం తీసుకోకుండా ఫలహారాల్ని అలా కెలికి వదిలి పెట్టావు. కిటికీ మూసేసి ఇక్కడ ఈ చీకటిలో ఉంటున్నావు. తాజాగాలి ఆరోగ్యానికి కూడా మంచిది కదా. లేదు నాన్నా. నేను డాక్టరు కోసం కబురు పెడదామనుకుంటున్నాను. మనం ఆయన చెప్పినవన్నీ పాటిద్దాం. మనం గదులు కూడా మార్చుకుందాం. నువ్వు ముందున్న గదిలోకి వచ్చేయి. నేను ఇక్కడకు వస్తాను. దాని మూలంగా నీకుఅంత మార్పు ఏమీ రాదు. నీ వస్తువులన్నీ నీ చుట్టూరానే ఉంటాయి. అవన్నీ మనం తర్వాత చూసుకుందాం. ముందు నువ్వు కొంచెం సేపు పడుకొని విశ్రాంతి తీసుకో. నీకు విశ్రాంతి కావాలి. ఇటురా. బట్టలు మార్చుకోవడానికి నేను సహాయం చేస్తాను. నేను ఆ పని చేయగలను. నీకు ఇష్టమైతే నువ్వు ఇప్పుడే ముందు గదిలోకి వెళ్ళి అక్కడ నా మంచం మీద పడుకోవచ్చు. అది నిజంగా చాలా మంచి పనని నేను అనుకుంటున్నాను."

బెండిమన్ తండ్రి పక్కన నిలబడ్డాడు. సంరక్షణకు నోచుకోని ఆయన జుట్టు తెల్లబడిపోయి గరుగ్గా భుజాలను తాకుతున్నట్టు ఉంది. "జార్జి" అని ఆయన పిలిచాడు. ఆయన గొంతు స్థిరంగా ఉంది. జార్జి బెండిమన్ తండ్రి ముందు మోకాళ్ల పై వంగి కూర్చున్నాడు. అలసిన తండ్రి మొహంలో నల్లటి పెద్ద కనుపాపలు తననే పట్టిపట్టి చూస్తున్నట్టు గమనించాడు.

"నీకు పీటర్స్ బర్గ్‌లో స్నేహితుడు ఎవరూ లేరు. నువ్వు ఎప్పుడూ తమాషాలు చేస్తూ వుంటావు. అబద్దాలు చెబుతూ వుంటావు. నీ తమాషాలకి నన్ను కూడా సాధనంగా వాడుకుంటున్నావన్నమాట. అక్కడ నీకు స్నేహితుడు ఎందు కుంటాడు? అన్ని చోట్లా ఉంటారా? దాన్ని  నేను నమ్మను."

"అది కాదు నాన్నా. కొంచెం గుర్తుకు తెచ్చుకోండి" అంటూ బెండిమన్ తండ్రిని కుర్చీ నుంచి లేవదీసి డ్రెస్సింగ్ గౌను విప్ప దీశాడు. "నా స్నేహితుడు ఇక్కడికి వచ్చి అప్పుడే మూడేళ్ళు దాటిపోతోంది. నువ్వు మొదట అతన్ని అంత పట్టించుకునేవాడివి కాదు. నువ్వు వచ్చినపుడు అతను రెండుసార్లు నా గదిలో వున్నాడు. అయినా నేను పరిచయం చేయలేదు. అతనంటే మీకు అంత ఇష్టం లేదని నాకు తెలుసు. అతనిలో కొన్ని లోపాలు ఉన్నమాట నిజమే. అయితే కొన్ని సందర్భాల్లో అతనితో నువ్వు ఎక్కువ సేపే మాట్లాడావు. ఒకసారి నువ్వు అతను చెప్పేది ఎంతో శ్రద్ధగా వింటూ తలూపుతూ ప్రశ్నలు అడిగావు కూడా. నువ్వు కొంచెం ఆలోచిస్తే నీకు అవన్నీ గుర్తుకువస్తాయి. రష్యా విప్లవం గురించి అతను ఎన్నో ఆశ్చర్యకరమైన కథలు చెప్పాడు. వ్యాపార పనులపై ఒకసారి కీవ్ వెళ్ళినపుడుఅక్కడ ప్రజలు చేసిన ఆందోళన గురించి చెప్పాడు గుర్తుందా? ఒక మతాధికారి జనాన్ని చల్లబరిచేందుకు తన అరచేతిలో కత్తితో శిలువగుర్తు వేసుకుని రక్తం కారుతున్న ఆ చేతిని ఎత్తిపట్టుకుని బాల్కనీలో నిలబడ్డాడని చెప్పాడు గుర్తుందా? తర్వాత తర్వాత ఆ విషయాన్ని నువ్వు చాలా మందికి చెప్పావు కూడా."

జోనాథన్ స్విఫ్ట్ రాసిన
గలివర్
సాహసయాత్రలు పిల్లల
పుస్తకం అనేది భ్రమ.
మానవ జాతి
దురహంకారాన్ని
ఎండగట్టిన పుస్తకమిది.

మాట్లాడుతూనే బెండిమన్ తండ్రిని మళ్ళీ కుర్చీలో కూర్చోబెట్టి జాగ్రత్తగా మేజోళ్ళు తీసేశాడు. ఆయన లోదుస్తులు మురికిగా ఉండడం చూసి ఇన్నాళ్ళూ తండ్రిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసినందుకు తనను తాను తిట్టుకున్నాడు. తండ్రి లో దుస్తులు ఎలా ఉన్నాయనేది శ్రద్ధ తీసుకోవడంలో తన బాధ్యత కూడా ఉందని అతను గుర్తించాడు. పెళ్ళయిన తర్వాత తన తండ్రి ఎక్కడ ఉంటాడనే విషయంపై అతడు ఇంకా తన కాబోయే భార్యతో మాట్లాడలేదు. ఆయన పాత ఇంటిలోనే ఒంటరిగా ఉండిపోతాడని ఇన్నాళ్ళూ వాళ్ళు అను కుంటూ వచ్చారు. అయితే తండ్రిని తమతో పాటు కొత్త ఇంటికి తీసుకు వెళ్ళా లని అతను ఆకస్మికంగా తిరుగులేని నిశ్చయం చేసేసుకున్నాడు. అయితే అతని తండ్రి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల్లో ఇప్పటికే చాలా సమయం మించి పోయినట్టు ఆయన్ని నిశితంగా గమనించిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది.

అతను తండ్రిని చేతులతో ఎత్తి పట్టుకుని మంచం వరకూ తీసుకెళ్ళాడు. మంచం దగ్గరకు వెళ్ళే ఆ కొన్ని అడుగుల పాటు అతని తండ్రి బెండిమన్ వాచీ గొలుసును గట్టిగా పట్టుకుని ఉండిపోయాడు. దాని మూలంగా అతను తండ్రిని మంచం మీద నిలువుగా కూర్చోబెట్టలేకపోయాడు.

అయితే మంచం మీదకు చేర్చగానే అంతా సరైనట్టు కనిపించింది. ఆయన తనంతట తానే దుప్పటి కప్పుకున్నాడు. అంతే కాకుండా దుప్పటిని పైకిలాగి భుజం వరకూ తెచ్చుకున్నాడు. ఆయన బెండిమన్ వంక కొంత ఆదర పూర్వకంగా చూస్తున్నాడు.

“నీకు అతను గుర్తుకు వచ్చాడా? రాలేదా?” అని బెండిమన్ తండ్రిని రెట్టించి అడిగాడు.

“నేను దుప్పటి సరిగ్గా కప్పుకున్నానా?” అని ఆయన బెండిమన్‌ను అడిగాడు. కాళ్లపై దుప్పటి ఉందో లేదో ఆయనకి కనిపించడం లేదు.

“ఇప్పుడు నీకు కొంచెం తేలిగ్గా సుఖంగా ఉంది కదూ” అని బెండిమన్ అడిగాడు. అడుగుతూ దుప్పటి అంచులు సరిచేశాడు.

> లైబ్రరీ బీరువాలో చేయిపెట్టి పుస్తకం బైటకు లాగితే మోలియర్ వచ్చేవాడు. కింద వరుసలోంచి మార్సెల్ ప్రూస్ట్ దిగేవాడు. ఆ పక్కనుంచి గస్తోవ్ ఫ్లాబేర్ నాటకాలూ, ఆ పక్క స్టెండాలూ, ఆ బీరువాలోంచి బెర్‌టోల్డ్ బ్రెహ్ట్, ఈ బీరువాలోంచి చెహోవ్ కథలూ, ఆ పై వరుసలో దాస్తోయ్‌వస్కీ నవల ముసాయిదా ప్రతులూ, అక్కడ చెహోవ్ లేఖలూ, ఇక్కడ నికోలాయ్ గొగోల్ కథలూ, అలా చేయి చాపితే చాలు ఒక్కో మహారచయిత దొరికేవాడు. ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీలో చదువుతూ, చదువుతూ పుస్తకం గుండెలకు హత్తుకునే వాడ్ని, రచయిత బొమ్మకు దండం పెట్టేవాడ్ని, తండ్రీ ఎంతబాగా రాశావయ్యా అని కళ్ళనీళ్ళు తిరుగుతుండగా ఆయా రచయితల ఫోటోలకు చెప్పేవాడ్ని.
>
> -కె.ఎన్.వై. పతంజలి

“నేను దుప్పటి సరిగ్గా కప్పుకున్నానా?” అతని తండ్రి మళ్ళీ రెట్టించాడు. ఆయన సమాధానం కోసం చూస్తున్నాడు.

“అంతా సరిగానే ఉంది. దుప్పటి సరిగానే కప్పుకున్నావు.”

“లేదు” అంటూ అతని తండ్రి అరిచాడు. ఆ మాట అంటూ ఆయన ఎంత విసురుగా దుప్పటి గిరవాటేశాడంటే అది పైకి వెళ్ళి గాలిలో కొంతసేపుండి పోయింది. ఆయన మంచంలో లేచి నిలబడ్డాడు. ఒకచేత్తో పైన ఉన్న సీలింగును ఆసరా కోసం పట్టుకున్నాడు. ఒక పక్క సూర్యుడి వెలుతురు ఉండగా నువ్వు నాకు దుప్పటి కప్పడానికి చూస్తావా? నేను ఇంకా సమాధి అయిపోలేదు. నా శరీరంలో మిగిలిన చివరి బలంతో కూడా నేను నీకు సమానం అవగలను. నీకన్నా ఎక్కువ కూడా అవగలను. నీ స్నేహితుడి గురించి నాకు బాగా తెలుసు. అతను నా హృదయానికి చాలా దగ్గరగా వచ్చిన కొడుకులాంటి వాడు. అందుకే అతడ్ని నువ్వు అన్ని సంవత్సరాల నుంచీ దూరంగా వుంచేశావు? ఎందుకు అలా చేశావు? అతని కోసం నేను ఏడ్చానని నీకు తెలుసా? అందుకోసమేనా నువ్వు ఆఫీసులో తలుపులు మూసుకుని ఎవరినీ అంతరాయం కలిగించొద్దని ఒక్కడివే ఉండి పోయావ్? డైరెక్టరు పని వత్తిడిలో ఉన్నాడని చెప్పించావు. రష్యాకు అబద్ధాల మీద అబద్ధాలు చెబుతూ మోసపు ఉత్తరాలు రాశావు. తండ్రి తన కొడుకు నుంచీ పాఠాలు నేర్చుకోనక్కర లేదు. అతన్ని ఓడించానని అణగదొక్కానని అనుకుంటున్నావు. అతను దాని గురించి ఏమీ చేయలేక పోవచ్చు. అతన్ని అలా చేసి ఇప్పుడు నా కొడుకు పెళ్లాడాలని అనుకుంటున్నాడు.”

జార్జి బెండిమన్ తండ్రికళ్ళు భయంకరంగా తననే చూస్తుండడం గమనించాడు. పీటర్స్ బర్గ్‌లోని తన స్నేహితుడు, తన తండ్రికి బాగా తెలిసిన తన స్నేహితుడు ఇప్పుడు అతన్ని ఎంతో కదిలించాడు. రష్యాలోని విస్తారమైన మైదానాల్లో అతను దారి తప్పి దిగులుగా ఉండడం బెండిమన్ కళ్ళముందు కదలాడింది. దివాళాతీసి బోసిపోయిన తన కార్యాలయంముందు తలుపు పక్కన నుంచుని అతను కనిపించాడు. ఖాళీ అయిన అలమరాల గుట్టల పక్కన, పాడైపోయిన సరుకుల మధ్య దీనంగా నిలబడి కనిపించాడు. అతను అంతదూరం ఎందుకు వెళ్లినట్టు?

“ఇప్పుడు నా వంక చూడు” అని అతని తండ్రి అరిచాడు. చెదిరిన మనసుతో బెండిమన్ మంచం దగ్గరికి పరిగెత్తుకుని వాచ్చుడు. తండ్రిని చేతులతో పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు.

“ఆమె తన గౌనుని పట్టుకుని వయ్యారంగా అటూ ఇటూ అలా ఇలా ఊపుతూ ఉంటుంది కనుక నువ్వు ఆమె వెంటబడిపోతున్నావు” అంటూ తన నైట్ గౌనుని ఎత్తి పట్టుకుని అటూ ఇటూ ఊగుతూ అభినయించి చూపించాడు. “నిన్ను శిక్షించే వాళ్ళు లేక సంతోషంతో విర్రవీగుతున్నావు. మీ అమ్మ జ్ఞాపకాలకు దూరమయ్యావు. నీ స్నేహితుడిని మోసం చేశావు. నీ తండ్రిని మంచంపై పడుకోబెట్టి అతడ్ని కదలకుండా చేయాలని చూశావు. ఇప్పుడు చెప్పు? అతను కదలగలడా? కదల్లేడా?” అంటూ అతను మంచంమీద నిలబడి దేన్నీ పట్టుకోకుండా గాల్లోకి కాళ్లను ఆడించాడు. ఆయన తేజస్సుతో వెలిగి పోతూ కనిపించాడు.

బెండిమన్ తండ్రి నుంచీ దూరంగా వెళ్ళి ఒక మూల నిలబడ్డాడు. కొంతకాలం కిందట అతను ఒక నిర్ణయం తీసుకున్నాడు. దేనికీ చలించకుండా అన్నిటికీ సిద్ధంగా ఉండాలనేదే ఆ నిర్ణయం. ఆకస్మికంగా ఏది సంభవించినా దానిని ఎదుర్కోవాలని అనుకునే వాడు. అయితే దానిని తర్వాత అతను మర్చిపోయాడు. ఇప్పుడు అతనికి మళ్ళీ ఆ నిర్ణయం గుర్తుకువచ్చింది. అయితే అతను దానిని తిరిగి వెంటనే మర్చిపోయాడు.

“నీ స్నేహితుడు ఏమీ మోసగించబడలేదు” అని బెండిమన్ తండ్రి అరిచాడు. “నేను ఇక్కడ అతని ప్రతినిధిగా ఉన్నాను” అని ఆయన అన్నాడు.

“ఏంటి నాటకాలు ఆడుతున్నావా” అంటూ బెండిమన్ గట్టిగా అరిచాడు. తర్వాత కానీ అతనికి తను చేసిన తప్పు అర్థం కాలేదు. ఇంక ఏం చేయలేక అతను నాలుక కొరుక్కుంటూ నిలబడి పోయాడు.

“అవును. నాటకాలు వేస్తున్నాను. నాటకాలు. చాలా మంచిమాట. భార్య చనిపోయిన ముసలి తండ్రికి కొడుకు ఇంతకన్నా ఇంకేం బహుమతి ఇవ్వగలడు? నువ్వు ఇంక నాకేం మిగిల్చావు? వెనుక ఓ మూలన ఉన్న గదిలో ఉంటూ విశ్వాసం లోపించిన సిబ్బందితో నేనేం చేయగలను? నా కొడుకు ప్రపంచాన్ని జయించిన సంతోషంతో దూసుకు వెళ్ళిపోతూ నేను తయారు చేసిన ఒప్పందాలను తనవిగా చేసేసుకుంటున్నాడు. ఆనందంతో పిల్లి మొగ్గలు వేస్తున్నాడు. తండ్రి నుంచి మొహం చాటేస్తున్నాడు. నేను నిన్ను ప్రేమించడం

లేదని అనుకుంటున్నావా? నేను నీ తండ్రిని."

"ఇప్పుడు ఆయన ముందుకు వంగుతాడు" అని బెండిమన్ అనుకున్నాడు.

"ఆయన కిందపడి వెయ్యి ముక్కలైపోవాలని కోరుకుంటున్నాను" అని తనలో తాను అనుకున్నాడు.

అతని తండ్రి నిజంగానే ముందుకు వంగాడు. అయితే ఆయన పడిపోలేదు. బెండిమన్ దగ్గరికి రాకపోయేసరికి ఆయన తనంతట తానే నిటారుగా కూర్చుండిపోయాడు.

"నువ్వు ఎక్కడ వున్నావో అక్కడే ఉండు. నాకు నీ సహాయం అవసరం లేదు. నీకు ఇక్కడికి రావడానికి తగినబలం ఉందని నువ్వు అనుకుంటున్నావు. అయిన ప్పటికీ కావాలనే నువ్వు ఇక్కడికి రావడం లేదు. నువ్వు తప్పుగా ఆలోచిస్తున్నావు. మనిద్దరిలోనూ ఇప్పటికీ నేనే బలంగా ఉన్నాను. నా అంతట నేను ఒక్కడినే చాలు నీకు తగిన పాఠం నేర్పడానికి. అయితే మీ అమ్మ నా శక్తి అంతా తీసుకుని వెళ్ళిపోయింది. నేను నీ స్నేహితుడితో అద్భుతమైన ఒక ఒప్పందం కుదుర్చు కున్నాను. అంతే కాదు నీ ఖాతాదారులందరూ ఇప్పుడు నా జేబుల్లో ఉన్నారు."

"అయితే ఆయన చొక్కాకు జేబులు కూడా ఉన్నాయన్నమాట" అని బెండిమన్ తనలోతను అనుకున్నాడు. తను ఈమాట కనుక అంటే తండ్రి ఇంక జన్మలో తన మొహం కూడా చూడదని అతను అనుకున్నాడు. అతని మనసు అస్థిమితంగా ఉంది. మనసులోకి రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. ఒక ఆలోచన వస్తోంది. వెళుతోంది. అతను అవేమీ పట్టని స్థితిలో ఉన్నాడు.

"నువ్వు నీ కాబోయే భార్య భుజాల చుట్టూ చేతులు వేసి నా ఎదుటికి రా. నేను ఆమెను నీ నుంచి తరిమి కొడతాను ఏమనుకుంటున్నావో"

బెండిమన్ తెల్ల మొహం వేసుకుని నిలబడ్డాడు. అక్కడ జరుగుతున్నది నమ్మలేనట్టు చూస్తున్నాడు. అతని తండ్రి బెండిమన్ కేసి తలూపుతూ కోపంగా రెచ్చిపోయి మాట్లాడుతున్నాడు.

"నిశ్చితార్థం గురించి స్నేహితుడికి చెప్పనా అంటూ ఎంత అమాయకంగా వచ్చి అడిగావు? అతనికి అంతా తెలుసు. ఓరి మూర్ఖుడా. అంతా తెలుసు. నేను అతనికి ఉత్తరం రాశాను. నా రాత పరికరాలను దాచడాన్ని నువ్వు మర్చిపోయావు. అందుకే అతనికి ఉత్తరం రాయగలిగాను. అందుకే అతను ఇన్నాళ్ళ నుంచీ ఇక్కడికి రాలేదు. అతనికి అన్నీ నీకన్నా వందరెట్లు ఎక్కువగా తెలుసు. అతను ఎడమచేతితో నీ ఉత్తరాన్ని తెరవకుండానే నలిపివేస్తూ కుడిచేతితో నా ఉత్తరాలను పట్టుకుని చదువుతున్నాడు. అతనికి అన్నీ వెయ్యిరెట్లు ఎక్కువగా తెలుసు" అని ఆయన ఉద్వేగంగా అన్నాడు.

"పదివేల రెట్లు" బెండిమన్ తండ్రిని అనుకరిస్తూ వెక్కిరించాడు.

"ఎన్నో సంవత్సరాలుగా నువ్వు ఈ ప్రశ్న ఎప్పుడు వేస్తావో అనే నేను ఎదురుచూస్తున్నాను. నాకు దేనిమీదన్నా ఆసక్తి ఉందని నువ్వు అనుకుంటున్నావా? నేను వార్తా పత్రికలు చదవగలుగుతున్నానని అనుకుంటున్నావా? అదీ ఇక్కడ" అంటూ ఆయన ఓ పాత పత్రికను బెండిమన్ మీదకు గిరవాటేశాడు. బెండిమన్ కనీసం ఆ పత్రిక పేరుకూడా చదవలేదు.

"ఇంక నువ్వు ఎప్పటికీ మారవా? మానసిక పరిణతి అంటూ లేకుండా ఇలా ఎంతకాలం గాలికి కొట్టుకుపోతుంటూ తిరుగుతావు? నీ తల్లి ఉన్నప్పుడు ఒక్క రోజన్నా సంతోషంగా గడిపిందా? ఆమె ముందుగానే దాటిపోయింది. నీ స్నేహితుడు రష్యా వెళ్ళిపోయాడు. మూడేళ్ళ కిందట అతను పసుపు రంగులోకి మారిపోయాడు. అతను ఇప్పటికి బతికి ఉండాల్సినవాడు కాదు. ఇక నా సంగతికి వస్తే నేను ఏ పరిస్థితుల్లో ఉన్నానో చూస్తున్నావు కదా. నీకు కళ్ళు సరిగా కనబడుతున్నాయనే అనుకుంటున్నాను."

"అయితే నువ్వు అన్నీ తెలిసే దాచిపెట్టి ఎదురు దాడికి దిగావా?" అని బెండిమన్ అరిచాడు.

"ఆ మాట నువ్వు ముందే అంటావని అనుకున్నాను. అది ఈ సందర్భంలో సరిపోదు" ఆయన జాలిపడుతున్నట్టు అన్నాడు. తర్వాత ఆయన ఇంకా గట్టిగా "కేవలం నువ్వూ, నీ స్వార్థమే కాకుండా ఇంకా ప్రపంచంలో ఏం ఉందో నీకు ఇప్పటికన్నా అర్థం అయిందనుకుంటాను. ఇప్పటివరకూ నీకు తెలిసిందంతా ఒక్క నువ్వే. నువ్వు ఒకప్పుడు అమాయకమైన బాలుడివి. అయితే నువ్వు ఇప్పుడు నిజంగా దయ్యానివి. పిశాచానివి. శ్రద్ధగా విను. నేను నీకు నీళ్ళలో మునిగి చనిపోయే శిక్ష విధిస్తున్నాను."

బెండిమన్ ఒక్కసారిగా గదినుంచీ బైటకు పరిగెత్తాడు. గదినుంచి బైటకువెళ్ళిపోతూ అతను తండ్రి మంచం కిందకు దిగిన శబ్దాన్ని విన్నాడు. మెట్లు దిగుతూ అతను ఇల్లు ఊడవడానికి వస్తున్న పని మనిషిని ఢీకొట్టబోయినంత పనిచేశాడు. "ఓరి దేవుడా" అని ఆమె అరుస్తూ తన మొహాన్ని ఏప్రాన్‌లో దాచుకుంది. అయితే అప్పటికే అతను వెళ్ళిపోయాడు. అతను గేటు నుంచీ దూసుకువెళ్ళి రోడ్డుదాటి నదివైపు పరిగెత్తాడు. ఆకలిగా ఉన్నవాడు ఆహారాన్ని పట్టుకున్నట్టుగా అతను నది ఒడ్డున ఇనుపకడ్డీలను పట్టుకుని నిలబడ్డాడు. తర్వాత వాటిమీద నుంచి చిన్నప్పుడు తల్లిదండ్రులను మెప్పించిన మంచి క్రీడాకారుడిలా నదిలోకి దూకేశాడు. ఇనుప కడ్డీలను పట్టుకున్న అతని చేయి బలహీనమై కడ్డీలను వదిలిపెట్టే సమయానికి అటుగా ఒక బస్సు వచ్చింది. అతను నీళ్ళలోకి పడిపోతున్నప్పుడు వచ్చిన శబ్దం బస్సు శబ్దంలో కలిసి పోయింది. అతని పెదాలు "నాన్నా, నేను ఎప్పుడూ మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉన్నాను" అని మృదువుగా అంటుండగానే అతను మునిగిపోయాడు. అదే సమయంలో బ్రిడ్జి ఒక్కసారిగా కిక్కిరిసిన వాహనాలతో నిండిపోయింది. ●

**వంద సంవత్సరాలకు ముందు అమెరికాలో ఆండ్రూ కార్నెజీ అని ఒకాయన ఉండేవాడు. ఆయన కోటీశ్వరుడు. చనిపోయేటప్పుడు ఆస్తి పిల్లలకు చెందాలని రాయలేదు. ఆ డబ్బుతో వీలైనన్ని గ్రామాల్లో గ్రంథాలయాలు కట్టించాలని రాశాడు. అమెరికా వెళ్ళి వచ్చిన వాళ్ళను అడిగి చూడండి. అక్కడి గ్రామాల్లో కనిపించే ప్రతీ గ్రంథాలయం ఆయన డబ్బుతో కట్టిందేనంటారు.**



# పుస్తకాల గురించి చెహోవ్

పుస్తకాల ద్వారా నేను జీవితాన్ని అధ్యయనం చేశాను
పుస్తకాల్లోనే జీవితాన్ని చూశాను
పువ్వుల సుగంధాల్ని పీల్చుకున్నాను
పుస్తకాల్లోనే మధువు తాగి మత్తెక్కి పోయాను
సుందరాంగనల పరిష్వంగాల్ని పుస్తకాల్లో అనుభవించాను
ప్రకృతి అద్భుతాలను దర్శించాను
జీవితానుభవమంతా పుస్తకాలలో దొరికింది
పర్వత శిఖరాలెక్కాను
సముద్రపు లోతుల్లో ఈదులాడాను
ఆకాశంలో విహరించాను
తుఫానుల నధిగమించాను
పిడుగులనూ, మెరుపులనూ ఆహ్వానించాను
అప్సరసల, బ్రహ్మరాక్షసుల సాంగత్యంలో జీవించాను
ఆకాశపుటంచులూ, అధోలోకపు చీకటి గహ్వరాలూ నాకు పరిచితాలు
విశ్వాంతరాళపు నాగరికుణ్ణి నేను
మానవ మేధోపరిమితులు నాకు అవగతమయ్యాయి
ఈ చిన్న కంకాళంలో ఎన్ని అనూహ్యమైన రహస్యాలు!
స్వేచ్ఛగా బయట తిరుగుతున్న మీ అందరికన్నా
ఎక్కువ జీవితం పుస్తకాల ద్వారా తెలుసు నాకు